# శ్రమ దోపిడీ ప్రపంచాన్ని మార్చాలి!

**[** ‘కాపిటల్’ రాసి మార్క్స్ బోధించిన జ్ఞానం! **]**

ప్రశ్నలూ - జవాబులూ
సంభాషణలూ

## రంగనాయకమ్మ

**స్వీట్ హోమ్ పబ్లికేషన్స్**
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
**హైదరాబాదు - 500 033.**

శ్రమ దోపిడీ ప్రపంచాన్ని
మార్చాలి!

**పేజీలు** : 224
**ధర** : 50 రూ.లు

రచనా కాలం :
2012, ఆగస్టు నించీ
3 నెలలు

**1వ** ముద్రణ : 2012 నవంబరు

**2వ** ముద్రణ : 2017 నవంబరు

**కంపోజింగ్ & పేజ్ మేకప్:**
ఎన్.రఘురామయ్య
ఎం. శారద

ముద్రణ:
**చరితా ఇంప్రెషన్స్**
1-19-1126/బి
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా
హైదరాబాదు - 500 020.

బైండింగ్:
**వై.వి.రెడ్డి బైండింగ్ వర్క్స్**
మూసారాంబాగ్
హైదరాబాదు - 36

ప్రతులకు:
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002
( ఫోన్: 0866 - 2431181)

రంగనాయకమ్మ అడ్రసు:
76, లేక్-సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీహిల్స్ పోస్ట్
హైదరాబాదు - 500 033

# శ్రమ దోపిడీ ప్రపంచాన్ని మార్చాలి!

## విషయ సూచిక

ముందు మాట

**1.** 'మానవ సంబంధాలు' అంటే, శ్రమ సంబంధాలే......... 12
**2.** 'మారకం విలువ' అంటే, శ్రమే! ........................ 15
**3.** చొక్కా విలువ, ఎక్కడి నించి ప్రారంభమవుతుంది? ...... 18
**4.** 'మారకం విలువ' అసహజమైనది! .................... 22
**5.** డబ్బు మంచిదీ, చెడ్డదీ - రెండూనూ!................. 23
**6.** డబ్బు, ఉపయోగపు విలువ లేని వస్తువు!.......... 27
**7.** డబ్బు, రూపం లేని శ్రమ!................................ 30
**8.** శ్రమల విలువలు, తేడాగా ఉంటాయి!............. 32
**9.** ప్రకృతికి సైన్సు ఉన్నట్టే, సమాజానికీ సైన్సు ఉంది! ...... 34
**10.** బానిసల పోరాట శక్తి, వేతన బానిసలకు లేదా? ..... 37
**11.** యజమానీ శ్రామిక సంబంధాల్లో, ఎవ్వరూ స్వతంత్రులు కారు!.... 42
**12.** యజమానుల్లో తేడాలు! .................................. 44
**13.** పెట్టుబడిదారుడికి ఆ పేరు ఎందుకు? ............. 47
→

**14.** పెట్టుబడిదారుడి అబద్ధపు ఖర్చులు!................. 50
**15.** అమ్మో! ఎంత దుర్మార్గం!................................ 54
**16.** కౌళ్ళూ - వడ్డీ లాభాల అబద్దాల్ని
నూటికి నూరు మందీ నమ్ముతారు! .... 59
**17.** స్వతంత్ర ఉత్పత్తిదారుల 'ధర' పద్ధతి,
వర్తకుల పద్ధతే!.... 62
**18.** స్వతంత్ర ఉత్పత్తిదారుల పని కాలం,
2 భాగాలుగా ఉంటుందా? .... 65
**19.** లాభానికి న్యాయమైన మార్గం ఉందా? ............ 68
**20.** సూది ఖర్చవుతుంది, భూమి ఖర్చవుతుందా? ..... 72
**21.** వైకుంఠపాళీ ఆటా మన తెలివి? ....................... 74
**22.** సూది పని చేస్తుందా?
కంప్యూటరైనా, సూది లాంటి పనిముట్టే! ...... 75
**23.** ఇంతింత తుక్కు వాదాలు ఉన్నాయా? ............. 77
**24.** ఎంత శ్రామిక చైతన్యం! .................................. 80
**25.** పెట్టుబడి, పెట్టుబడిదారుడు పెట్టేది కాదు!
జీతాల పెట్టుబడి, మొదటి అబద్ధం! ... 82
**26.** 'జీతాల పెట్టుబడి' మొదటి అబద్ధం అయితే,
'ఉత్పత్తి సాధనాల పెట్టుబడి', రెండో అబద్ధం! ... 84
**27.** 'శ్రమ శక్తి' కీ, 'శ్రమ' కీ, సంబంధం!................. 86
**28.** యజమానీ శ్రామిక సంబంధం,
అమ్మే - కొనే సంబంధం కాదు! 88
**29.** ఇదన్నమాట జరుగుతున్నదంతా! ...................... 91
→

**30.** భూస్వాములు, కౌళ్ళు తింటూ,
పెట్టుబడిదారులు, వడ్డీలూ - లాభాలూ తింటూ! 92
**31.** అమ్మకం ఖర్చులు, సరుకుకి చేరవు! ................ 95
**32.** ఉత్పాదక శ్రమలు డబ్బుని పెంచితే,
అనుత్పాదక శ్రమలు డబ్బు ఖర్చుని తగ్గిస్తాయి! ... 98
**33.** వర్తక శ్రామికుల శ్రమ, డబ్బుగా మారదు! ......... 103
**34.** స్వతంత్ర వర్తకులు, శ్రమ జీవులే! ...................... 106
**35.** ఇంటి పని పేరు, ఇంటి పనే! ........................... 109
**36.** వడ్డీలన్నీ, అదనపు విలువలో భాగమే! .............. 112
**37.** పోలీసులూ, సైనికులూ, ఏ రకం శ్రామికులు? .. 114
**38.** ప్రభుత్వ ధర్మాసుపత్రులూ, ధర్మ పాఠశాలలూ ... 117
**39.** యజమానీ శ్రామిక వర్గాలు, శత్రు వర్గాలు!......... 120
**40.** ఎంత నింద వేశారు నా మీద!........................... 122
**41.** పెట్టుబడి ఒకరు పెట్టాలా! ............................... 124
**42.** 'కార్మిక వర్గం' అంటే, ఏ యే బృందాలు? ......... 128
**43.** ప్రపంచంలో వున్న డబ్బు రాసి ఎవరెవరిది? ....... 130
**44.** పెట్టుబడిదారుల 'శ్రమ శక్తులకు' జీతాలు
చూస్తారా? ....... 132
**45.** కులాల్నీ, వర్గాల్నీ, సమానం చెయ్యకండి!........... 135
**46.** మంచి పనిముట్లు వస్తే,
శ్రామికుల కొంపలు మునగాలా!......... 140
**47.** ఏ సందేహం వచ్చినా,
'కాపిటల్' ని అడగాలి! ........ 144

→

**48.** మేధా శ్రమల వారు కట్టే పన్నులు,
ఎందులో భాగం?.......... 146

**49.** దేశంలో, 'అదనపు శ్రమ రాసి' ఏది? ................ 150

**50.** సైకిల్‌ని వదిలేసే కార్మిక నాయకులు! .............. 153

**51.** శ్రామికులకు సంస్కరణల దృష్టి,
శ్రామిక వర్గ స్పృహతో కలిసి వుండాలి ........ 158

**52.** ప్రపంచీకరణ భాగోతం! .................................... 163

**53.** షేర్ల భాగోతం తెలుసా? .................................... 169

**54.** శ్రామిక వర్గానికి, దోపిడీ వర్గంతో,
పోరాటమా, సామరస్యమా? ......... 177

**55.** సమాజం ఇచ్చే ఉచితాలన్నీ,
జనాభా శ్రమలే ............. 181

**56.** మనుషులు, స్పందన శక్తులన్నీ
సర్వ నాశనమై ఉన్నారు! ...... 184

**57.** మార్క్స్‌ని చదవడానికి
శ్రద్ధ పట్టని కమ్యూనిస్టులు!......... 191

**58.** దోపిడీ వ్యతిరేక సమాజం తయారై సిద్ధంగా లేదు,
శ్రామిక వర్గమే దాన్ని నిర్మించాలి! ........ 195

**59.** కలలు కనకండి! నిజాలు చూడండి!................. 202

**60.** మళ్ళీ ఒకసారి
ప్రశ్నలూ -జవాబులూ ................................. 206

★

# శ్రమ దోపిడీ ప్రపంచాన్ని మార్చాలి!

## ముందు మాట

**నేను,** మొట్ట మొదట, ఇంకా 'కాపిటల్' చదవక ముందు, ఆ పేరుని ఇతర పుస్తకాల్లో చదివినప్పుడు, వెంటనే ఆ పుస్తకాన్ని కళ్ళతో చూడాలనీ, వెంటనే ఆ పేజీలు తిరగేస్తూ అక్కడక్కడా చదవాలనీ, అదే తక్షణ కర్తవ్యం అనీ, అనుకున్నాను. 'శ్రమ దోపిడీ' ఎలా జరుగుతోందో వివరించే పాఠాలన్నీ అందులో వున్నప్పుడు, అది చదవకుండా నేర్చుకోగలిగేదేమీ వుండదని మొదట్లోనే అనుకున్నాను.

వెంటనే మొదటి భాగం తెచ్చుకోవడమూ, చదవడమూ, ఆ మర్నాడే ప్రారంభించాం. కానీ, మొదటి చాప్టర్‌ని మార్క్సు తేలిగ్గా చెప్పలేదు. అక్కడ విషయాల్లో కష్టం ఏమీ వుండదు. కానీ చెప్పడం తేలిగ్గా లేదు. పైగా, ఆ పదజాలం అంతా కొత్త. వాక్యాలు చాలా పెద్దవి. ఎవరినైనా సహాయం అడుగుదామంటే, మాకు తెలిసిన వాళ్ళల్లో, ఆ పుస్తకం చదివిన వాళ్ళెవరూ లేరు. ఒకాయన కొంచెం చెప్పడానికి ప్రయత్నించాడు గానీ, దాని వల్ల ప్రయోజనం లేక పోయింది. ఇక, సహాయాల కోసం ఎదురుచూడ్డం ఆపేసి, ఇంగ్లీషు డిక్షనరీలు పెట్టుకుని, మా కృషి మేం మొదలుపెట్టాం. కొంత దూరం పోయేటప్పటికి, అర్థమవడం మొదలైంది. భయం తగ్గింది.

కొన్ని చాప్టర్లు పూర్తి చేసేటప్పటికి, "ఇది తెలుగు పాఠకుల కోసం చెప్పాలి" అని గట్టిగా అనిపించింది నాకు. ఆ రకంగా నేను, **"కాపిటల్ పరిచయం"** రాసే పని ప్రారంభించి క్రమంగా పూర్తి చెయ్యగలిగాను.

ఆ తర్వాత విశాలాంధ్ర వారు, 'కాపిటల్' కి తెలుగులో పూర్తిగా **అనువాదం** చేయించారు. అది, 3 సంపుటాలుగా వుంది.

తర్వాత, ఒక పిల్లల పత్రిక వారు, ఏవైనా వ్యాసాలు రాసి ఇవ్వమని నన్ను అడిగితే, "డబ్బు అంటే ఏమిటో తెలుసా?" అనే పేరుతో, నాలుగైదు వ్యాసాలు రాసి ఇద్దామని మొదలుపెట్టి, 95 పాఠాలు

రాస్తే, అది, **"పిల్లల కోసం ఆర్థిక శాస్త్రం"** పేరుతో వేరే పుస్తకం అయింది.

అవన్నీ వుండగా, ఇప్పుడు మళ్ళీ ఈ కొత్త పుస్తకం ఎందుకు? కొందరు పాఠకులతో మాట్లాడితే, 'కాపిటల్'లో విషయాలనే క్లుప్తంగా చదవడానికి వీలయ్యే చిన్న పుస్తకం ఒకటి ఉండాలి - అనిపించింది.

మార్క్సు రాసిన అసలు పుస్తకం తెలుగులో వున్నప్పుడు, దాన్ని చదవడం కష్టమేమీ కాదు. ప్రతీ పేజీ, ప్రతీ లైనూ, చదువుతూ వెళ్ళలేకపోయినా, మొదట ప్రతీ చాప్టర్నీ చూడాలి. మార్క్సు, దాన్ని ఏ మాటలతో ప్రారంభించాడో, ఎలా ముగించాడో, ఫుట్ నోట్లు ఎలా వున్నాయో, ఒక సారి చూడాలి. ప్రతీ చాప్టర్‌నీ అలా చూసుకుంటూ వెళ్తూ, అక్కడక్కడా కొన్ని పేరాలు చదవవచ్చు కూడా. 'కాపిటల్' అంటే భయపడే వాళ్ళ కోసమే ఈ తేలిక దారి. దాని వల్ల తెలిసేది ఎక్కువగా లేకపోయినా, అసలు పుస్తకం ఎలా వుందో, మార్క్సు ఎలా చెప్పాడో, ఆ వరస తెలుస్తుంది.

ఆ తర్వాత, 'కాపిటల్ పరిచయం' చూడవచ్చు. దీని సంగతి తెలిసిందే.

ఇప్పుడీ కొత్త పుస్తకం ఎందుకంటే, బద్ధకస్తులు, పోనీ ఇది చదివినా, 'కాపిటల్' విషయాలు కొన్నయినా తెలుసుకోగలుగుతారు - అని. "కాపిటల్ చదివేశాం" అని చెప్పిన పాఠకులతో మాట్లాడి నప్పుడు, "ఉత్పాదక శ్రమకీ, అనుత్పాదక శ్రమకీ తేడా ఏమిటి?" అని అడిగితే, చెపుతారు గానీ, జంకుతూనో, సంకోచిస్తూనో మాత్రమే.

"సమాజంలో వున్న డబ్బు ఎలా వస్తోంది?" అని అడిగితే, "శ్రామికుల నించి" అంటారు గానీ, "ఏ శ్రామికుల నించి? శ్రామికుల్లో తేడా ఏమిటి?" అంటే, దానికీ చెప్పినా, అదీ సంకోచిస్తూనే. అలా మాట్లాడే పాఠకులు, ఆ పుస్తకాలు నిజంగా చదివిన వాళ్ళే. చదవకపోతే, ఆ మాత్రం అయినా చెప్పలేరు. చాలా విషయాల మీద

చెప్పగలరు గానీ, జంకుతూనే. అలా కాకుండా, ఏ విషయం మీదైనా సరిగా చెప్పుకోవాలంటే, తెలిసినదాన్ని అయినా మళ్ళీ మళ్ళీ చదువుకోవాలి.

ముఖ్యంగా అందుకే ఈ పుస్తకం రాయాలనే అభిప్రాయం కొంత కాలం నించీ వుంది నాకు. ఈ పుస్తకంలో చాప్టర్లన్నీ, 'కాపిటల్' ని ఆధారం చేసుకుని రాసినవే. ఇందులో, **'ప్రశ్నలూ - జవాబులూ - సంభాషణలూ'** వుంటాయి. మొదట, ఒక ప్రశ్న వుంటుంది. దానికి మొదటా చివరా కొటేషన్ మార్కులు వుండవు. ఆ ప్రశ్నకి జవాబు ప్రారంభమైనప్పుడు, దానికి కూడా కొటేషన్ మార్కులు వుండవు. ఆ జవాబు సాగుతూ వుండగా, మొదటి ప్రశ్న అడిగిన వ్యక్తి నించి గానీ, ఇంకో వ్యక్తి నించి గానీ, ఇంకో ప్రశ్న వస్తుంది. అక్కడి నించీ అది 'సంభాషణ' గా సాగుతుంది. ఆ సంభాషణలో, ప్రతి చోటా కొటేషన్ మార్కులు వుంటాయి. మళ్ళీ కొత్త ప్రశ్న ప్రారంభమైతే, దానికీ, దాని జవాబుకీ కూడా కొటేషన్ మార్కులు వుండవు. ఈ పద్ధతి అంతా నేను, నా అభిప్రాయం ప్రకారం పెట్టుకున్నదే. ఇది నా అభిప్రాయమే గానీ, ఇంకేమీ కాదు.

ఒక ప్రశ్నని చదివిన తర్వాత, వెంటనే దాని జవాబుని చదవకండి! ఆ జవాబు చెప్పుకోడానికి మొదట మీరే ప్రయత్నించండి! కాపిటల్ చదివి వున్న వాళ్ళకి అది కష్టం కాదు. ఇప్పటి దాకా కాపిటల్ చదవని వాళ్ళ కోసమే ఈ పుస్తకం ప్రత్యేకంగా అవసరం. అలాంటి కొత్త పాఠకులు కూడా ప్రశ్న కింద జవాబుని వెంటనే చదవకుండా, స్వయంగా చెప్పుకోడానికి కొంత ప్రయత్నించవచ్చు.

మొదట ఈ పుస్తకం చదివి, జంకు తగ్గించుకుని, ఈ విషయాలతో కొంత పరిచయం కలిగిన తర్వాత 'కాపిటల్' ని మొదలుపెట్టాలి. అలా మొదలు పెడతారా లేదా అనేది, ఇక వాళ్ళ ఇష్టం!

**రంగనాయకమ్మ** 30-10-2012

10

# శ్రమ దోపిడీ ప్రపంచాన్ని మార్చాలి!

'**కా**పిటల్' (పెట్టుబడి) పుస్తకం, పెట్టుబడిదారీ విధానాన్ని పరిశీలించడాన్ని ప్రధాన విషయంగా చేసుకుని, ఆ క్రమంలో, వెనకటి బానిస - భూస్వామ్య కాలాల్నీ, భవిష్యత్ సోషలిస్టు - కమ్యూనిస్టు కాలాల్నీ కూడా పరిశీలిస్తుంది. ఈ పరిశీలన, మానవ సంబంధాల్లో మార్పుల క్రమాన్ని శాస్త్రీయంగా వివరిస్తుంది. 'కాపిటల్ (పెట్టుబడి)' పుస్తకంలో ఎలాంటి విషయాలు ఉన్నాయో, చాలా క్లుప్తంగా చెప్పే ప్రయత్నం ఇది. కానీ, ఈ పుస్తకం, 'కాపిటల్'కి బదులు కాదు. 'కాపిటల్' ద్వారా ఎలాంటి సైన్సు నేర్చుకోవాలో చెప్పే అతి చిన్న ప్రయత్నం మాత్రమే ఇది. మొదట 'చిన్న వివరణ' చూసి, దాని తర్వాత చివరి వరకూ, 'ప్రశ్నలూ - జవాబులూ, సంభాషణలూ' పద్ధతిలో చూస్తాం.

## చిన్న వివరణ

**మ**నం మనుషులం. జంతువులం కాము. మనుషులకు, మనుషుల సమాజం గురించి తెలుసుకోవడమే అసలు బాధ్యత.

జంతువులు, ప్రకృతిలో ఏవి దొరికితే అవి తిని బతుకుతాయి. మనుషులు కూడా ప్రారంభ దశలో జంతువుల లాగే నగ్నంగా తిరుగుతూ, జంతువుల లాగే బతికే వారు. అడవుల్లో జంతువులు వేటల మీద బతికేటట్టే, ఆ కాలంలో మనుషులు కూడా జంతువుల్ని చంపి తినే వేట మీదే బతికేవారు. ఆ రకంగా, ఆ దశలో మనుషులు కూడా 'జంతు దశ'లో ఉన్న వాళ్ళే.

కానీ, మనుషులు క్రమంగా పనులు చెయ్యడం నేర్చుకున్నారు. అవసరమైన వస్తువుల్ని తయారు చేసుకోవాలంటే, రక రకాల పనులు చెయ్యాలి. 'పని'కి మరో పేరు - శ్రమ.

ఎండకీ - వానకీ తల దాచుకోవడానికి అవసరమయ్యే పందిరీ - పాకా - గుడిసే వంటివి, శ్రమలతో చేసుకునే వస్తువులే. కడుపులోకి తిండీ, ఒంటి మీదకి బట్టలూ కూడా, శ్రమలతో చేసుకోవలసిన వస్తువులే. వస్తువులకు మరో పేరు - ఉత్పత్తులు. ఉత్పత్తి చేసుకునేవి (తయారు చేసుకునేవి), ఉత్పత్తులు.

ఒక వస్తువుని (ఒక ఉత్పత్తిని) తయారు చేసుకోవాలంటే, దాని కన్నా ముందు, దాని కోసం కావలసిన ముడి పదార్థాల్నీ - పని ముట్లనీ తయారు చేసుకోవాలి. వాటిని తయారు చేసుకోవడానికి, ప్రకృతిలో సహజంగా దొరికే వనరులనే (పదార్థా

లనే) ఉపయోగించుకోవాలి. సహజ వనరుల మీద, రక రకాల పనులు (శ్రమలు) చేస్తేనే కొత్త వస్తువులు తయారవుతాయి.

ఏ కొత్త వస్తువుని తయారు చేసుకోవాలన్నా, దానికి అవసరమయ్యే పాత వస్తువులన్నీ, కొత్త వస్తువుకి, 'ఉత్పత్తి సాధనాలు.' మొదట అవి తయారై ఉంటేనే, వాటి మీద, 'కొత్త శ్రమ' జరుగుతుంది. (1) ఉత్పత్తి సాధనాలూ, (2) కొత్త శ్రమా - ఈ రెంటివల్లా, 'కొత్త వస్తువు (కొత్త ఉత్పత్తి)' తయారవుతుంది. ఈ రెంటిలో ఏది లేకపోయినా, కొత్త వస్తువు రాదు. ఏ వస్తువు తయారవడానికైనా ఈ రెండూ అవసరం. ఈ రెండే అవసరం.

ఒక సారి తయారైన ఉత్పత్తుల్ని మనుషులు వాడేస్తూ ఉంటారు. తయారైన ఉత్పత్తులు వాడకం అయిపోతూ ఉంటాయి. ఉత్పత్తుల్ని రోజూ వాడుకుంటూ ఉంటేనే మనుషులు బతుకుతూ ఉంటారు. మళ్ళీ మళ్ళీ నిత్యం కొత్త ఉత్పత్తుల్ని చేసుకుంటూనే ఉండాలి, వాడుకుంటూనే ఉండాలి. అవి రోజూ ఖర్చయి పోతూనే ఉంటాయి. శ్రమలు ఆగిపోతే, మనుషులు అంతరించిపోతారు. లేదా, మళ్ళీ జంతు దశలోకి వెళ్ళిపోతారు; ఏ శ్రమలూ ఎరగని జంతు దశలోకి!

జంతువులైతే, ఏ శ్రమలూ చెయ్యవు. మనుషులకు, శ్రమలు చెయ్యడం ప్రారంభమైనప్పటి నించే జంతు దశ పోయి, మానవ దశ ప్రారంభమవుతుంది. ఆ ప్రారంభ దశలో మనుషులు గుంపులు గుంపులుగా ఉంటూ, వేటాడడం, చెట్ల నించి పళ్ళు ఏరుకోవడం, భూమిలో నించి దుంపలు తవ్వుకోవడం, వంటి పనులు కలిసి చేసుకునే వారు. వాటిని కలిసి వాడుకునే వారు. ఆ రకంగా, మనుషుల శ్రమలూ, శ్రమ సంబంధాలూ, ప్రారంభమయ్యాయి.

జంతువులకూ పిల్లలు పుడతాయి; మనుషులకూ పిల్లలు పుడతారు. 'రక్త సంబంధాలు' అనేవి, మనుషులకూ - జంతువులకూ కూడా ఉంటాయి. కానీ, 'శ్రమ సంబంధాలు' అనేవి, జంతువుల మధ్య కాదు, మనుషుల మధ్యే ఉంటాయి.

మనుషుల్ని, జంతు దశ నించి మానవ దశకు మార్చినవీ; మనుషుల్ని, మనుషులుగా బతికిస్తున్నవీ; శ్రమ సంబంధాలే. మానవుల గురించి నేర్చుకోవలిసినదంతా, 'శ్రమ సంబంధాల' గురించే ఉంటుంది. అందుకే మనం, శ్రమ సంబంధాల తోనే మొదలు పెట్టాలి. ఈ చిన్న ప్రారంభం తర్వాత, ప్రశ్నలు వేసుకుంటూ, జవాబులు తెలుసుకుంటూ వెళ్తాం. జవాబుల్లో, అవసరమైన చోట్ల సంభాషణలు కూడా ఉంటాయి.

ప్రశ్నలు వేసేది ఎవరు? - మనుషుల సంబంధాల గురించి తెలుసుకోవడానికి ఆసక్తీ - బాధ్యతా ఉన్న శ్రామికులు.

జవాబులు చెప్పేది ఎవరు? - మార్క్సు రాసిన 'కాపిటల్' నించి ఎంతో కొంత తెలుసుకుని, దాన్ని ఇతరులకు చెప్పాలనే ఆసక్తీ, బాధ్యతా ఉన్నవారే.

చెప్పే వాళ్ళకీ, వినే వాళ్ళకీ కూడా ఆసక్తి ఉంటే, వాళ్ళ బాధ్యతలు వాళ్ళకి అర్థమైతే, ఈ సంభాషణ మార్క్సు చెప్పిన దాన్ని నేర్చుకునే విధంగా సాగుతుంది.

# 1. మానవ సంబంధాలు అంటే, శ్రమ సంబంధాలే!

**ప్రశ్న 1. మనుషులు శ్రమలు చేస్తే, వాటి వల్ల 'సంబంధాలు' ఎలా ఏర్పడతాయి? అవి, 'సంబంధాలు' ఎలా అవుతాయి?**

**జవాబు:** ఈ సందేహం ఎందుకు వచ్చిందో తెలుసా? మనుషుల మధ్య ఉండేవి, శ్రమ సంబంధాలే- అని ఈ నాటికీ మనుషులకు తెలీదన్న మాట! అందుకే ఇలాంటి ప్రశ్న. ప్రతి మనిషికీ బతకడానికి రోజూ కొన్ని వేరు వేరు రకాల వస్తువులు కావాలి కదా? కానీ అన్ని రకాల్నీ, ఆ మనిషే తయారు చేసుకోలేడు. కొన్ని రకాలే చేసుకుంటాడు. తను చేసిన రకాల్ని ఇతరులకు ఇచ్చి, ఇతరులు చేసిన రకాల్ని తను తీసుకుంటాడు. కుండని ఇచ్చి, చెప్పుల జతని తీసుకుంటే, అది వస్తువుల్ని మార్చుకోవడంగా పైకి కనపడినా, అసలు విషయం అది ఒకరి శ్రమని ఒకరు మార్చుకోవడమే. అలా జరిగేది, ఇద్దరి మధ్యే కాదు; ఒక మనిషికి, అనేక మందితో, వస్తువుల్ని మార్చుకునే (శ్రమల్ని మార్చుకునే) సంబంధాలు సాగుతూ ఉంటాయి.

ఒక మనిషి, ఏ రెండో మనిషి తయారు చేసే వస్తువునీ వాడకుండా ఉంటే, ఆ మనిషికి రెండో మనిషి శ్రమతో సంబంధం ఉండదు. కానీ ఏ మనిషీ అలా బతకలేడు. బతకడానికి, కొన్ని వేరు వేరు రకాల వస్తువులు కావలసిందే. అది తప్పనిసరి అవసరం. వస్తువుల్ని మార్చుకోవడం ద్వారానే, 'శ్రమ సంబంధాలు' ఏర్పడతాయి; ఆ సంబంధాలు సాగుతూ ఉంటాయి. ఈ సంగతి, మనుషులకు ఈ నాటికీ స్పష్టమైన గ్రహింపుతో తెలీదు.

**2. శ్రమలు చేసేది మనుషులే కదా? ఆ సంగతి వాళ్ళకి ఎందుకు తెలియడం లేదు?**

**జ:** శ్రమల వల్ల, 'వస్తువులు' తయారవుతాయి. ఆ వస్తువులే అసలు విషయంగా వారికి కనపడతాయి గానీ, శ్రమలు కనపడవు. కుండకీ, చెప్పులకీ మారకం జరిగితే, ఆ ఇద్దరు మనుషులకీ, అది 'వస్తువుల సంబంధం'గా కనపడుతుంది గానీ, శ్రమల సంబంధంగా అర్థం కాదు. "కుండ నాదీ, చెప్పుల జత నీదీ." లేదా, "చెప్పుల జత నాదీ, కుండ నీదీ." పైకి కనపడేది అదే. "వస్తువులు, మన శ్రమలతో తయారవుతున్నాయి. మన శ్రమలే మారుతున్నాయి" అని అర్థం కాదు. ఈ మారకాల్లోకి 'డబ్బు' ప్రవేశించిందంటే, అప్పుడు 'వస్తువుల స్పృహ' కూడా పోతుంది. ఈ సంగతి, ఇంకా కొంత దూరంపోతే గానీ చూడలేం.

**3. ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకోవాలంటే, ఆ 'మారకం', దేని ఆధారంగా, దేని లెక్కలతో, జరుగుతుంది? వస్తువుల బరువుల్ని బట్టా?**

**జ:** బరువులూ, రంగులూ, ఎత్తులూ - వంటివి అయితే, అవి అన్నీ వస్తువుల శరీర లక్షణాలు. మారకాలు జరిగేది, ఆ లక్షణాల వల్ల కాదు. వస్తువుల శరీరాల్లో లేని, వస్తువుల్ని చూస్తే కనపడని లక్షణంతో మారకాలు జరుగుతాయి. ఆ లక్షణం, 'మారకం విలువ' అనేది. మారకం జరగడానికి ఏ విలువ అవసరమో, అదే మారకం విలువ. అది, వస్తువు శరీరంలో ఉండదు. వస్తువుని చూస్తే అది కనపడదు. మారకం జరగడానికి, వస్తువుల్లో కనపడని ఆ విలువ లెక్కలే ఉండాలి. కానీ, మారకాల

పద్ధతి ప్రారంభమైన వెనకటి కాలంలో, ఆ 'విలువ' గురించి ఎవరికీ తెలీదు. ఆ లెక్కలు కూడా ఉండవు. ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకోవడం జరుగు తాయి. అంతే. కానీ క్రమంగా, మారకాలు జరగడానికి "విలువలు సరి పోవాలి" అనే ఆలోచనలు బైల్దేరాయి. క్రమంగా, ఆ విషయం స్థిరపడింది. మారకం జరగడానికి అవసరమయ్యే విలువే, మారకం విలువ. దాని ఆధారం తోనే, దాని కొలతల తోనే, మారకాలు జరుగుతాయి. కుండకీ, చెప్పుల జతకీ మారకం జర గాలంటే, కుండకి కొంతమారకం విలువ ఉంటుంది; చెప్పుల జతకీ కొంత మారకం విలువ ఉంటుంది. దాని విలువా, దీని విలువా, సమానంగా ఉంటేనే ఆ మారకం జరుగుతుంది.

**4. ప్రతి వస్తువుకీ మారకం విలువ ఉంటుందా? వస్తువుల్ని చూస్తే, అందులో మారకం విలువ కనపడదే! కుండని చూస్తే, అందులో మారకం విలువ ఎక్కడ కనపడు తుంది? చెప్పుల జతని చూస్తే అందులో ఆ విలువ కనపడుతుందా?**

**జ:** అవును, ఏ వస్తువులోనూ మారకం విలువ కనపడదు. అసలు ప్రతి వస్తువూ మారకంలోకి వెళ్ళదు. వస్తువుని మారకానికి పెట్టినప్పుడే, దానికి ఎంత మారకం విలువ ఉందో లెక్క చూసే ప్రసక్తి వస్తుంది. అసలు, ప్రతి వస్తువూ ఎందుకో అందుకు ఉపయోగపడుతుంది కదా? ఒక వస్తువు ఎందుకు ఉపయోగపడుతుందో, అది దాని 'ఉపయోగపు విలువ.' కుండ ఉపయోగం ఏమిటి? నీళ్ళు పోసి ఉంచ డానికి. చెప్పుల ఉపయోగం? కాళ్ళకి తొడుక్కుని నడవడానికి. అలా, ప్రతీ వస్తువు వల్లా, ఏదో ఒక ఉపయోగం ఉంటుంది. అది సహజంగా ఉండే విలువ. కానీ, అదే వస్తువుని మారకానికి పెడితే, అప్పుడు దాని మారకం విలువ లెక్కలు కావాలి. ఇచ్చే వస్తువుకీ, తీసుకునే వస్తువుకీ, మారకం విలువల కొలతలు సరిపోవాలి. ఒక వస్తువుకి ఎక్కువ విలువా, ఇంకో వస్తువుకి తక్కువ విలువా ఉంటే, ఆ మారకం జరగదు. విలువల పరిమాణాలు సరిపోతేనే మారకం జరుగుతుంది.

**5. అసలు, 'మారకం విలువ' అంటే ఏమిటి? అది వస్తువుకి ఎలా ఏర్పడుతుంది? దాన్ని కొలవడం ఎలాగ? ఆ విలువలు సమానంగా ఉన్నాయో లేదో తెలియడం ఎలాగ?**

**జ:** వస్తువుని తయారు చెయ్యడానికి 'కొంత పని' చెయ్యాలి కదా? అంటే, 'కొంత శ్రమ' జరగాలి. వస్తువు తయారీకి అవసరమయ్యే 'మొత్తం శ్రమ కాలమే' ఆ వస్తువుకి మారకం విలువగా లెక్కకు వస్తుంది. 'మొత్తం శ్రమ కాలం' అంటే, ఆ మొత్తంలో ఏయే భాగాలు ఉంటాయో తర్వాత చూస్తాం. ఇక్కడ అర్థం చేసుకోవలి సింది, వస్తువుని తయారు చేసే మొత్తం శ్రమే, దాని మారకం విలువ - అని. శ్రమని కొలిచే సాధనం, టైము. ఆ శ్రమ, ఎన్ని గంటలు జరిగింది? ఎన్ని రోజులు జరిగింది? - అలా.

" 'ఉపయోగపు విలువ' సహజమైన విలువ అయితే, మారకం విలువ 'అస హజమైనదని' అర్థమా?"

"అవును, మారకం విలువ నిజానికి అసహజమైనదే. కానీ, మారకాలతో అవసరం ఉన్నంత కాలమూ, మారకం విలువ లెక్కలతో కూడా అవసరం ఉండి, అది సహజమైనదిగానే కనపడుతుంది."

"మారకాలతో అవసరం ఎప్పటికీ ఉండదా? ఎప్పటికైనా ఆ అవసరం పోతుందా? అంటే, ప్రతీ మనిషీ తనకు కావలసిన వస్తువులన్నీ అప్పుడు తనే చేసుకోగలుగుతాడా? మారకాలతో అవసరం తప్పనిసరి అయితే, మారకం విలువ అసహజమైనది ఎలా అవుతుంది?"

"మారకాలతో అవసరం, ఇప్పుడు తప్పనిసరే గానీ, ఎప్పటికీ తప్పనిసరి కాదు. ప్రతీ మనిషికీ వేరు వేరు వస్తువులు కావాలనేది తప్పనిసరే. ఆ అవసరం ఎప్పటికీ తప్పదు. అయినా, మారకాల పద్ధతీ, మారకం విలువ లెక్కలూ, లేకుండానే, కావలసిన వస్తువులన్నీ వాడుకునే విధానం ఏర్పర్చుకోవచ్చు. అందరూ సమాన బాధ్యతలతో శ్రమలు చేస్తూ, అవసరాల్ని బట్టి వస్తువుల్ని వాడుకుంటే, మారకాల ప్రసక్తి ఉండదు. ప్రస్తుతం మన కళ్ళ ముందు, అమలులో ఉన్న ప్రతి విషయమూ, ప్రతీ వస్తువూ, సహజమైన అవసరాలనీ, శాశ్వితంగా ఉండవలసిన విషయాలనీ, భావించకూడదు. వదిలెయ్యడం ఎప్పటికీ సాధ్యం కాని విషయం అయితే, అలాంటి విషయం, శాశ్వితంగా సహజమైనదే. కానీ మనుషుల సంబంధాలు ఇప్పుడు ఉన్నట్టు గాక, ఇంకో రకంగా మారినప్పుడు, ఏదైనా ఒక విషయాన్ని వదిలెయ్యడం సాధ్యమైతే, అలాంటి విషయం శాశ్వితంగా సహజమైంది కాదని అర్థం. మారకాలు అలాంటివే. మానవ సంబంధాలు ఇంకో రకంగా మారితే, మారకాలు అక్కర లేదు."

"ఏ రకంగా మారితే?"

"అదంతా ఇక్కడేనా? ఇక్కడే కాదు. చాలా దూరం వెళ్ళాలి. ఇక్కడ చెప్పుకోవలిసింది ఏమిటంటే, "ఏ వస్తువుకైనా, ఉపయోగపు విలువ సహజమైనదీ; మారకం విలువ అసహజమైనదీ" అని చెప్పుకుంటే ఇక్కడ చాలు. ఒక చిన్న మాట. 'మారకం విలువ'ని పొట్టిగా, 'విలువ' అనవచ్చు. 'ఉపయోగపు విలువ'ని పొట్టిగా 'విలువ' అనం. 'విలువ' అన్నప్పుడు, అది మారకం విలువే అనుకోవాలి. వస్తువుని ఇచ్చి వస్తువుని తీసుకునే మారకాల పద్ధతికి 'బార్టరు పద్ధతి' అనే పేరు ఉంటుంది. ఈ బార్టరు పద్ధతి సాగినప్పుడు, 'విలువ' అనే మాటే గానీ, 'ధర' అనే మాట ఉండదు."

"అయితే, బార్టరు తర్వాత ఇంకో పద్ధతి ఉందా?"

"ఇప్పుడు డబ్బు పద్ధతి లేదూ? మనం ఇప్పుడు ఒక వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తీసుకునే విధంగా మారకాలు చేసుకుంటున్నామా? డబ్బు ఇచ్చి వస్తువుల్ని తీసుకోవడం లేదూ? ఇప్పుడు బార్టరు పద్ధతే ఉందా?"

"అదా? తెలిసింది. డబ్బు సంగతి ఎప్పుడు వస్తుంది?"

"అప్పుడే కాదు. చెప్పుకోవడం ఇప్పుడే ప్రారంభించాం కదా? వరసగా చెప్పుకుంటూ వెళ్తాం."

"తొందరగా వినాలని ఉంది. తొందరగా చెప్పండి!"

"అది మంచి లక్షణం. విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి అలా ఉండాలి." ★

## 2. మారకం విలువ అంటే, శ్రమే!

**6. మారకం విలువ అంటే, వస్తువుని తయారు చేసే శ్రమే - అన్నారు. వస్తువు తయారవ్వాలంటే, కొన్ని ఉత్పత్తి సాధనాలు కూడా కావాలి కదా? వాటి విలువ కూడా, శ్రమకి కలవదా? వస్తువుని చేసే శ్రమ ఒక్కటే వస్తువు విలువ ఎలా అవుతుంది?**

**జ:** మారకం విలువ అనేది, వస్తువుని తయారు చేసే 'మొత్తం శ్రమ' అని మొదటే చెప్పుకున్నాం. అది గుర్తు లేదా? 'మొత్తం శ్రమ'లో, ఉత్పత్తి సాధనాల విలువ కూడా చేరి ఉంటుంది. అది చేరకుండా వస్తువు తయారవదు. అయితే, ఉత్పత్తి సాధనాల్లో ఏ వస్తువుని తీసుకున్నా, ఆ వస్తువుకి విలువ ఎలా వచ్చిందో చూసుకుంటూ వెళ్తే, ఆ వస్తువుకి కూడా, మొత్తం శ్రమే దాని విలువ అయిందని తెలుతుంది. ఈ విషయం సరిగా అర్ధమయ్యే లోపల, "విలువ అనేది, శ్రమ వల్లనే" అనే విషయం నమ్మలేనిదిగా అనిపిస్తుంది. అందుకే మొదట ఈ విషయం పూర్తిగా అర్ధం చేసుకుని, ఆ తర్వాత కూడా సందేహాలు ఉంటే, అప్పుడు మళ్ళీ సందేహాలు చూడాలి. దారి పొడుగునా ఎప్పటి సందేహాల్ని అప్పుడు చూసుకుంటూనే వెళ్తాం. సందేహాలు తీరకపోతే ముందుకు వెళ్ళలేం. "విలువ అంటే, శ్రమ. మొత్తం శ్రమ" అనే విషయాలు చూడడానికి, ఒక మట్టి మూకుడు ఉదాహరణ తీసుకుందాం. అది ఒక వస్తువు. అది తయారవడానికి కొన్ని శ్రమలు జరగాలి. శ్రమలు జరగకపోతే, 'వస్తువు' తయారవదు. ఆ మూకుడుకి, ముడి పదార్ధం - మట్టి. మట్టి కోసం మొదట భూమి దగ్గిరికి వెళ్ళాలి.

భూమిని, ఒక వ్యక్తి ఆస్తిగా చూడకూడదు. అది, భూస్వామి ఆస్తిగానో, రైతు ఆస్తిగానో, సమాజంలో కనపడుతూ ఉన్నా, సమాజంలో అలా ఎందుకు ఉందో తర్వాత చూడాలి గానీ, ఇక్కడ అలా చూడకూడదు. ఎందుకంటే, భూమి, ప్రకృతి సహజ పదార్ధం. అది, శ్రమల ద్వారా తయారైన పదార్ధం కాదు. ఒక వస్తువు, ఎవరి శ్రమతో తయారైతే వాళ్ళ ఆస్తి అవుతుంది. ఎవరి శ్రమా లేకుండా, అసలు మనుషులే లేని కాలంలో తయారై ఉన్న భూగోళం, ఎవరి ఆస్తీ అవదు. ఒక వస్తువు, శ్రమతో తయారైతే, ఆ శ్రమే, 'విలువ' కదా? శ్రమే జరగనప్పుడు, భూమికి విలువ ఎలా ఉంటుంది? సహజ పదార్ధాలకు విలువ ఉండదు. గాలి, సహజ పదార్ధం. దాన్ని ఉచితం గానే వాడుకుంటున్నాం. దాన్ని పీలుస్తున్నందుకు దానికి బదులుగా ఎవరికీ ఏమీ చెల్లించడం లేదు. నదిలో నీరు, సహజ పదార్ధం. అక్కడే నిలబడి ఆ నీళ్ళని తాగితే, నదికి ఏమీ చెల్లించ నక్కరలేదు. అలాగే భూమి, సహజ పదార్ధం. అది విలువ లేనిది. భూమి నించి మట్టిని ఉచితం గానే తీసుకోవచ్చు. కానీ, మట్టిని తియ్యాలంటే, కొంత 'తవ్వకం పని' జరగాలి. ఆ పని కోసం ఏదైనా 'పని ముట్టు' కావాలి. ఆ పక్కనే ఒక గట్టి చెట్టు కొమ్మ ముక్క ఒకటి పడి ఉందనుకుందాం. అది కూడా సహజ పదార్ధమే. దానికీ విలువ ఉండదు. ఒక మనిషి, ఆ చెట్టు కొమ్మని, పని ముట్టుగా ఉపయోగిస్తూ, భూమిని అర గంట సేపు తవ్వి, కొంత మట్టి కుప్ప

తయారు చేశాడనుకుందాం. ఆ కుప్ప ఎలా తయారైంది? కొంతసేపు జరిగిన శ్రమ వల్ల. భూమి అయితే, శ్రమ లేకుండా ఏర్పడిన సహజ పదార్థమే గానీ, ఆ మట్టి కుప్ప సహజ పదార్థం కాదు. అది కొంత శ్రమ వల్లనే ఏర్పడింది. దాన్ని ఏ మనిషి తయారు చేశాడో అది అతని ఆస్తి. ఆ మట్టి కుప్పని ఇంకో మనిషి తీసుకోవాలంటే, దాన్ని ఉచితంగా తీసుకోలేడు. దాన్ని తయారు చేసిన మనిషికి, తను తయారు చేసిన వస్తువు ఏదైనా ఇవ్వాలి. అంటే ఆ మట్టి కుప్పకి, 'విలువ' చెల్లించాలి.

ఆ మట్టికి, ఆ విలువ, దేని వల్ల ఏర్పడింది? - భూమి వల్లనా? కాదు. మట్టికి ఆధారం అయిన భూమి, సహజ పదార్థం. అక్కడ ఉపయోగపడిన పని ముట్టు కూడా సహజ పదార్థమే. ఆ రెంటివల్లా చేరే విలువ ఏమీ ఉండదు. మరి, ఆ మట్టికి విలువ దేనివల్ల ఏర్పడింది? ఆ విలువ ఎంత? ఆ మట్టి, తవ్వకం పని వల్లే ఏర్పడింది కాబట్టి, ఆ శ్రమే ఆ మట్టికి విలువ అవుతుంది.

**మట్టి కుప్ప విలువకి కారణం:**

| భూమి | పనిముట్టు | తవ్వకం శ్రమ |
|---|---|---|
| సహజ పదార్థం | సహజ పదార్థం | ఇది అర గంట కాలం |
| విలువ లేదు | విలువ లేదు | విలువ ఇదే! |

ఈ మట్టిని ఎవరైనా తీసుకోవాలంటే, అరగంట శ్రమతో తయారైన ఏదైనా ఇంకో రకం వస్తువుని ఇచ్చి తీసుకోవాలి. ఆ విలువని, 'తవ్వకం శ్రమ కోసం' చెల్లించినట్టే. మారకం విలువ అనేది, శ్రమే - అని గ్రహించడానికి, ఇంతకన్నా తేలికైన మార్గం ఉండదు. ఒక వ్యక్తి చేసిన వస్తువుని, ఇంకో వ్యక్తి ఉచితంగా ఎందుకు తీసుకోలేడో గ్రహిస్తే, 'విలువ' అంటే ఏమిటో తెలిసిపోతుంది. ఈ నాడు ఇంత తేలికగా అర్థం చేసుకోగలిగే ఈ 'విలువ కారణాన్ని' గ్రహించడానికి, గతంలో వందల వేల సంవత్స రాలు పట్టింది.

"అంత కాలమా? ఎందుకు పట్టింది?"

"పట్టింది అలా."

"మరి, ఎప్పటికి అర్థమైంది?"

"అర్థమైంది ఎప్పటికో."

"మట్టి కుప్ప కోసం అరగంట శ్రమ జరిగింది కదా?
మట్టి విలువని, 'అరగంట శ్రమ' అనాలా?"

"అలాగే అనాలి. ఆ మట్టి మీద వేరే శ్రమలు జరిగితే, ఆ విలువ ఇంకా పెరుగు తుంది. తర్వాత, ఆ తవ్విన మట్టితో, ఒక చిన్న మూకుడు వంటి పాత్రని తయారు చెయ్యాలంటే, మొదట నీళ్ళు కావాలి. ఆ నీళ్ళు, ఆ పక్కనే, ఒక గుంటలో వాన వల్ల చేరి ఉన్నాయనుకుందాం. అవి సహజ పదార్థం. వాటికి విలువ ఉండదు. ఆ వాన నీళ్ళని చేతులతోనే ఆ మట్టిలో పోసి, మట్టిని పిసికి, చేతులతోనే చిన్న మూకుడు

తయారు చెయ్యడానికి, 2 గంటలు పట్టిందనుకుందాం. ఆ మూకుడు తయారవ డానికి, ముడి పదార్థం - మట్టి. సహజ పదార్థం - నీళ్ళు. (శ్రమతో తయారవని పదా ర్థాన్ని 'ముడి పదార్థం' అనకూడదు. నూతి నించి తీసుకున్న నీళ్ళు అయితే, ముడి పదార్థం అవుతుంది. వాన నీరు, ముడి పదార్థం కాదు.) మట్టిని, మూకుడుగా చేసే పనిలో, పనిముట్లు లేవు. మూకుడు కోసం మొత్తం ఎంత శ్రమ జరిగింది? మూకుడు 'విలువ' ఎంత కావచ్చు?''

మట్టి మూకుడు విలువ:

| | |
|---|---|
| (1) ముడి పదార్థం, మట్టి.<br>ఇది, శ్రమతో తయారైనదే.<br>ఇది, పాత శ్రమ. | ఈ విలువ,<br>అరగంట శ్రమ |
| (2) ఇంకో పదార్థం, నీళ్ళు.<br>ఇది సహజంగా<br>దొరికిన పదార్థం. | దీని నించి చేరే<br>శ్రమ లేదు.<br>విలువ లేదు. |
| (3) ఈ ఉదాహరణలో,<br>పనిముట్లు లేవు. | చేరే శ్రమ లేదు.<br>విలువ లేదు. |
| (4) మట్టిని మూకుడుగా<br>తయారు చేసిన శ్రమ.<br>ఇది, కొత్త శ్రమ. | ఇది, 2 గంటల శ్రమ<br>ఇది విలువ. |

మొత్తం శ్రమ, రెండున్నర గంటలు. మూకుడు విలువ రెండున్నర గంటల శ్రమ. ఈ ఉదాహరణ వల్ల ఏం తెలుస్తోంది? విలువగా లెక్కకు వచ్చేది శ్రమే - అని తెలుస్తోంది. తవ్వకం పని వరకే చూస్తే, మట్టి కుప్ప విలువ, అర గంట శ్రమ మాత్రమే. మూకుడు తయారైన తర్వాత చూస్తే, పాత శ్రమకి, కొత్త శ్రమ కూడా కలిసి, మొత్తం విలువ రెండున్నర గంటలు అయింది. ఈ 'మొత్తం శ్రమ'లో, కొత్త శ్రమా, పాత శ్రమా, రెండూ కలిశాయి. కొత్త శ్రమకి, గతంలో ఉత్పత్తి సాధనాల్ని తయారు చేసిన పాత శ్రమలు కూడా కలిస్తే 'మొత్తం శ్రమ' అవుతుంది. ఇలా, రెండున్నర గంటల శ్రమతో తయారైన ఈ వస్తువుని ఎవరైనా తీసుకోవాలంటే, దాని విలువని చెల్లించి తీసుకోవాలి. అంటే, రెండున్నర గంటల శ్రమతో తయారైన ఇంకో రకం వస్తువుని ఇచ్చి!

భూమి అనే సహజ పదార్థం మీద కొంత తవ్వకం శ్రమ జరిగినప్పుడే, ఆ మట్టికి విలువ ఏర్పడింది. అదే మట్టి మీద, పాత్రగా చేసే కొత్త శ్రమ జరిగినప్పుడు, ఆ విలువ పెరిగింది. అంటే, 'విలువ'గా అవుతున్నది ఏమిటి? - శ్రమే. ఆ శ్రమ, తక్కువగా జరిగినప్పుడు తక్కువ విలువా, ఎక్కువగా జరిగినప్పుడు ఎక్కువ విలువా, అవుతాయి. 'విలువ' అనేది, 'మారకం విలువకి పొట్టి పేరు' అని మర్చిపోవద్దు.

**7. మూకుడు ఉదాహరణలో, భూమిని తవ్వడానికి ఉపయోగించిన కర్ర ముక్క, శ్రమతో తయారైనది కాదు. కానీ, కర్ర ముక్క ఎప్పుడైనా శ్రమతో తయారవుతుందా?**

**జ:** ఎందుకు కాదు? ఒక మనిషి, ఒక అడవి చెట్టు కొమ్మని తన చేతులతో విరగ దీస్తే, అక్కడ కొంత శ్రమ జరిగినట్టే. ఆ చెట్టు తోటలో చెట్టు అయితే, దాన్ని ఎన్నో శ్రమలతో పెంచినట్టే.

**8. "మట్టి కుప్పని, మూకుడుగా చెయ్యడానికి, ఏ పని ముట్లూ లేవు. ఒక వేళ, అక్కడ శ్రమలతో తయారైన పని ముట్లు ఉంటే, కొత్తగా తయారయ్యే వస్తువు విలువ ఎలా ఉంటుంది?"**

**జ:** ఇంకెలా ఉంటుంది? ఆ పని ముట్ల విలువలు కూడా కొత్త వస్తువు విలువలోకి చేరతాయి. ఆ వస్తువు విలువ పెరుగుతుంది. ఆ పనిముట్లు, పూర్తిగా గానీ, వాటిలో కొన్ని భాగాలే గానీ, కొత్త వస్తువు కోసం ఎంత ఖర్చయితే అంతవరకూ, వాటి విలువలు (వాటిని తయారు చేసిన శ్రమలు), కొత్త వస్తువుకి విలువ ఏర్పడ డంలో భాగం అవుతాయి. ★

# 3. చొక్కా విలువ, ఎక్కడి నించి ప్రారంభమవుతుంది?

**9. చొక్కా ఉదాహరణ ఎలా ఉంటుంది?**

**జ:** ఏ వస్తువు ఉదాహరణ అయినా ఒకటే. తేడా ఏమీ ఉండదు. మట్టి మూకుడులో ఏం చూశామో, చొక్కాలో కూడా అదే చూస్తాం. ఉత్పత్తి సాధనాల్ని చేసిన పాత శ్రమలతో, కొత్త శ్రమ కలిస్తే, కొత్త వస్తువు తయారవుతుంది. దేనికైనా ఇదే సూత్రం ఉంటుంది. 'బట్ట' అనే ముడి పదార్థం మీద, కొన్ని పని ముట్ల వాడకంతో, 'కుట్టు శ్రమ' జరిగితే, చొక్కా తయారవుతుంది.

**10. చొక్కాకి విలువ, దాని ముడి పదార్థాల నించీ, పనిముట్ల నించీ, ప్రారంభమవు తుంది కదా? 'విలువ'కి ప్రారంభం అలాగేనా?**

**జ:** అవును, అలాగే చూస్తాం. కానీ, ఆ ముడి పదార్థాల్నీ, ఆ పనిముట్లనీ కూడా చూసుకుంటూ ఎంత వెనక్కి వెళ్ళగలమో, అది కూడా అర్థం చేసుకోవాలి. చొక్కా కన్నా ముందు, 'బట్ట' ఉండాలి. బట్ట కన్నా ముందు, 'దారం' ఉండాలి. దారం కన్నా ముందు, 'పత్తి' (దూది) ఉండాలి. పత్తి కన్నా ముందు పత్తి మొక్కలు పెరిగే 'భూమి' ఉండాలి. అంటే, చొక్కా విలువని తెలుసుకోవాలంటే, చొక్కా నించి వెనక్కి చూసుకుంటూ 'భూమి' దగ్గిరికి వెళ్ళాలి. అక్కడి నించీ చూద్దాం. భూమిలో మొట్ట మొదట పత్తి (దూది) పండాలి. 'పత్తి'కి, ముడి పదార్థం ఉండదు. అది, చెట్లకు పండాలి. ఆ చెట్లు, భూమిలో పెరగాలి.

**'పత్తి' తయారవ్వాలంటే:**

(1) భూమి, (2) కొన్ని పనిముట్లు, (3) వ్యవసాయ శ్రమలు. - ఈ 3 అంశాలతో పత్తి, తయారవుతుంది. - ఈ 3 అంశాల్నీ ఇక్కడ వివరంగా చూస్తే, తర్వాత ఇక ఇటువంటి వివరాలు చూడక్కరలేదు. ప్రతి చోటా ఇలాంటివే ఉంటాయి.

**(1) భూమి:** ఇది, ఉత్పత్తి సాధనంగా, మొక్కలు పెరగడానికి ఉపయోగపడు తుంది. కానీ, ఇది ఉచితం. ఇది, సహజ ఉత్పత్తి సాధనం. దీని నించి పత్తికి చేరే విలువ ఏమీ ఉండదు. భూమిని ఉపయోగించుకున్నందుకు దానికి తిరిగి చెల్లించ వలసింది ఏమీ ఉండదు. ఆ భూమిలో, పంట కోసం అవసరమయ్యే సారం సహజం గానే ఉంటే, అది కూడా భూమితో పాటు ఉచితమే. ఒక వేళ, ఆ సారం లేక, ఆ పంట పండించే వాళ్ళే భూమి మీద కొన్ని ఎరువులు వేస్తే, ఆ ఎరువుల విలువలు పంటకి కలుస్తాయి. కానీ అది, భూమి ఇచ్చే విలువ అవదు. ఏ పంటకైనా, ఏ కట్ట డానికైనా, భూమి వల్ల చేరే విలువ ఏమీ ఉండదు. భూమి సంగతి ఎప్పుడూ ఇంతే.

**(2) పనిముట్లు:** పత్తి పంట కోసం, వ్యవసాయ శ్రమలు జరగడానికి కొన్ని పని ముట్లు కావాలి కదా? ఆ పనిముట్లన్నీ అప్పటికే కొన్ని శ్రమల వల్ల తయారై ఉన్నవే. ఏ పనిముట్టు అయినా, తయారైన తర్వాతే పనిముట్టు అవుతుంది గానీ, తయా రయ్యేటప్పుడు అదీ ఒక వస్తువే. ఇతర వస్తువులు తయారయ్యే సూత్రాలే దానికీ ఉంటాయి. ఏ పనిముట్టు అయినా సహజ పదార్థాలతో గానీ, ముడి పదార్థాలతో గానీ, మొదలవుతుంది. పనిముట్లని చెయ్యడానికి కూడా పనిముట్లు కావాలి. అవన్నీ దానికి, ఉత్పత్తి సాధనాలు అవుతాయి. పాత, కొత్త శ్రమల మొత్తమే, ఆ పనిముట్టు విలువ. అలా, కొంత విలువతో తయారై ఉన్న పనిముట్టు, ఒక కొత్త వస్తువు కోసం పూర్తిగా వాడకం అయిపోతే, పనిముట్టు విలువ అంతా, కొత్త వస్తువు విలువలో భాగం అవుతుంది. పత్తి పంటకి, పనిముట్ల ద్వారా చేరే విలువ సంగతి కూడా అంతే.

**(3) పత్తి పంట కోసం జరిగే వ్యవసాయ శ్రమలు:** భూమిని దున్నడం దగ్గిర్నించీ, పంటని కొయ్యడం వరకూ జరిగే శ్రమలన్నీ, మనుషులు ఆ భూమి మీద చేసే కొత్త శ్రమలే. ఇక్కడ, ఉత్పత్తి సాధనాల సంగతి చూస్తే, భూమి నించి చేరే శ్రమ ఉండదు, అది ఉచితం. ముడి పదార్థాలు ఉండవు. పనిముట్లూ, సహాయక పదార్థాలూ మాత్రమే ఉత్పత్తి సాధనాలు అవుతాయి. వాటిని తయారు చేసిన శ్రమలన్నీ, పాత శ్రమలు. ఈ పాతా - కొత్తా శ్రమలన్నీ కలిసి, పత్తి పంటకి విలువ. ఒక ఎకరం భూమిలో పండిన పత్తి అంతా, ఒక చొక్కా కోసం అక్కర లేదు. ఒక్క చొక్కా కోసం ఎంత పత్తి కావాలో దాన్నే ఇక్కడ లెక్కలోకి తీసుకుంటాం. కానీ ఆ తక్కువ పత్తి విలువని చూసినా, మొత్తం పత్తి పంట విలువనంతా చూసినా, ఆ విలువకి కారణం ఒకటే. అది శ్రమే. విలువ, భూమి వల్ల గానీ, శ్రమ కాని మరో అంశం వల్ల గానీ, ఏర్పడేది అవదు.

పత్తి (లేదా, ఇంకో వస్తువు) తయారై పోయాక చూస్తే, దాని కోసం ఖర్చయిన మొత్తం శ్రమ అంతా, 'పాత శ్రమ' అయిపోయినట్టే. ఆ పత్తి మీద మళ్ళీ ఏదైనా ఇంకో పని జరిగితేనే, అది కొత్త శ్రమ.

పత్తి తయారైంది. పత్తి, 'దారం'గా మారాలి.
దారానికి, పత్తే ముడి పదార్థం.

| | | |
|---|---|---|
| ముడి పదార్థం + | పనిముట్లూ + | దారాన్ని వడికే శ్రమా. |
| పాత శ్రమ | పాత శ్రమ | కొత్త శ్రమ |

పాత, కొత్త శ్రమల మొత్తం = దారం విలువ.

పత్తి మీద కొత్త శ్రమ జరిగింది గనక దారం తయారైంది. పత్తి విలువ కన్నా, దారం విలువ, ఎక్కువగా ఉంటుంది.

ఇప్పుడు, ఆ దారం, 'బట్ట'గా మారాలి. బట్టకి, దారం, ముడి పదార్థం.

| | | |
|---|---|---|
| ముడి పదార్థం + | పనిముట్లూ + | నేత శ్రమా |
| పాత శ్రమ | పాత శ్రమ | కొత్త శ్రమ |

ఈ పాత, కొత్త శ్రమల మొత్తం = బట్ట విలువ.

దారం మీద కొత్త శ్రమ జరిగింది గనక. బట్ట తయారైంది. దారం విలువ కన్నా, బట్ట విలువ ఎక్కువగా ఉంటుంది.

ఇప్పుడు, బట్ట, చొక్కాగా మారాలి. చొక్కాకి, బట్ట, ముడి పదార్థం.

| | | |
|---|---|---|
| ముడి పదార్థం + | పని ముట్లూ + | కుట్టు శ్రమా |
| పాత శ్రమ | పాత శ్రమ | కొత్త శ్రమ |

పాత, కొత్త శ్రమల మొత్తం = చొక్కా విలువ.

బట్ట మీద, కొత్త శ్రమ జరిగింది గనక, బట్ట విలువ కన్నా, చొక్కా విలువ ఎక్కువగా ఉంటుంది. చొక్కా తయారైంది. దానిలో ఉన్న పదార్థం, ఎక్కడి నించి బయల్దేరింది? - భూమి మీద పండిన పత్తి పంట నించి. ఆ పత్తి కన్నా పాత పదార్థం, చొక్కాలో లేదు.

కానీ, చొక్కా విలువ, ఎక్కడి నించి? భూమి మీద జరిగిన వ్యవసాయ శ్రమల నించేనా? - కాదు. వ్యవసాయ శ్రమలు జరిగిన ప్రతీ దశలోనూ పనిముట్లు వాడకం అవుతాయి. అవి అన్నీ, ఆ దశల కన్నా ముందు తయారై ఉన్నవే. ఆ వెనకటి పనిముట్లు తయారవడానికి కూడా ఇంకా వెనకటి పనిముట్లు కావాలి. ఆ రకంగా చూసుకుంటూ వెళ్తే, ఒక పత్తి పంటకు చేరిన పనిముట్ల విలువ (శ్రమ), గతంలో ఆదిమ సమాజంలో తయారైన పనిముట్ల నించి బదిలీ అవుతూ వస్తున్నట్టు తెలుస్తుంది.

పనిముట్లలో కొన్నిటి విలువలు, ఎక్కువ దూరం దాకా చేరవు. ఉదాహరణకి, మగ్గం, నేత పనిముట్టు. ఒక మగ్గం మీద, వెయ్యి గజాల బట్ట తయారయ్యేటప్పటికి మగ్గం పూర్తిగా పాడై పోయింది - అనుకుందాం. ఆ మగ్గం విలువ, ఆ వెయ్యి గజాల బట్టకి చేరి, ఆ బట్ట ద్వారా కొంత కాలం వరకూ నిలిచి ఉంటుంది. కానీ, ఆ బట్ట, పాతబడిపోయి పూర్తిగా పాడైపోయినప్పుడు, దాని మొత్తం విలువ అంతా (దాని పాత,

కొత్త శ్రమలన్నీ) వాడకం అయిపోయినట్టు అర్థం. అంటే, మగ్గం విలువ, కొంత బట్ట వరకే అంది, ఆ బట్టతో పాటే ఖర్చయిపోతుంది. కొన్ని పనిముట్ల విలువలు అలా తొందరగా ఖర్చయిపోతే, కొన్నిటి విలువలు చాలా కాలం వరకూ బదిలీ అవుతూ అందుతూ ఉంటాయి.

ఇంత వరకూ, చొక్కా విలువ, వ్యవసాయ పనిముట్ల కన్నా వెనక దశల నించీ అందుతూ వచ్చేదేనని చూశాం. విలువ అనేది, శ్రమ వల్లనే - అని గ్రహించడానికే ఇంత వివరంగా చూడవలసి వచ్చింది. ఒక చిన్న నల్లపూసైనా, బ్రహ్మాండమైన భవనమో, విమానమో అయినా, వాటి విలువ, ఏవేవో సహజ పదార్థాల మీద అనేక దశల్లో జరిగే వందల, వేల, లక్షల గంటల శ్రమల వల్ల ఏర్పడేదే.

ఏ వస్తువుని చూసినా, ఏ పదార్థాన్ని చూసినా, దాని విలువ, దాని శరీరానిది కాదు! ఆ శరీరంలో ఎక్కడా ఉండని, ఎక్కడా కనపడని, ఆ శరీరాన్ని తయారు చేసిన శ్రమలది మాత్రమే అది. మనం కూర్చున్న కుర్చీ విలువ, ఆ కుర్చీలో ఉండదు. మనం చదువుకునే పుస్తకం విలువ, ఆ పుస్తకంలో ఉండదు. ఎప్పుడో జరిగిపోయిన శ్రమలది ఆ విలువ!

'కాపిటల్' పుస్తకంలో ఈ 'విలువ' విషయం చదివినప్పుడు, విభ్రాంతి నించి ఎంతో కాలం తేరుకోలేక పోయాను నేను. ఇప్పటికీ అది విచిత్ర సత్యం గానే ఉంటుంది. ఆ పుస్తకంలో చూసే ప్రతి విషయమూ, తేరుకోలేనంత విభ్రాంతి కలిగిస్తూ ఉంటుంది. ఆ జ్ఞానం, గతంలో ఏ నాడూ తెలియనిది!

విషయాలు నేర్చుకోవడానికి ఒక క్రమం ఉంటుంది.

సహజ పదార్థమూ + శ్రమల మొత్తం = వస్తువు
విలువ లేదు          విలువ ఇదే

విలువ అనేది శ్రమే - అనే విషయం మొదట నేర్చుకుంటేనే, తర్వాత చూసే విషయాలు తేలిగ్గా అర్థమవుతాయి. విలువ ఎక్కడి నించి ప్రారంభమవుతుందో తెలుసుకోవడానికి భూమి దాకా వెళ్ళవలసి వచ్చింది గానీ, ప్రతీ సారీ భూమి దగ్గిరికి వెళ్ళనక్కరలేదు. చొక్కా విలువని చూడాలంటే, ముడి పదార్థం అయిన బట్ట దగ్గిర్నించి చూస్తే చాలు. (1) ఉత్పత్తి సాధనాలూ, (2) కొత్త శ్రమా. ఈ 2 అంశాల్నీ చూస్తే చాలు. ఈ 2 విలువల్నీ కలిపితే, అదే చొక్కా విలువ. ఏ వస్తువు సంగతైనా ఇంతే.

**11. చొక్కా పాతబడిపోయి పూర్తిగా పనికి రాకుండా పోతే, దాని విలువ ఏమైనట్టు?**

**జ:** చొక్కా అనేది, పనిముట్టు కాదు. అది పాతబడిపోయిందంటే, దాని విలువ అంతా ఖర్చయిపోయినట్టే. ఆ శ్రమ ఎప్పుడో జరిగిపోయింది. చొక్కాలో ఉన్న దూది అణువులన్నీ క్రమంగా మట్టిలో (ప్రకృతిలో) కలిసిపోతాయి. వస్తువు తయారవడానికి ఏ 2 అంశాలైతే ఖర్చవుతాయో (సహజ పదార్థాలూ, శ్రమలూ), ఆ వస్తువు పాతబడిపోతే, ఆ 2 అంశాలూ ఖర్చయిపోయినట్టే. శ్రమలు ఎప్పుడో ఖర్చయిపోయాయి. ఇక చొక్కా పదార్థం, ఇప్పుడు పాతబడి పోయింది.

**12. కొత్త వస్తువుకి, పనిముట్ల నించి చేరే విలువని 'పాత శ్రమ' అంటున్నారు. అది, ఆ పనిముట్టుని చెయ్యడానికి ఖర్చయిన శ్రమ - అన్నారు. అది సరే. మరి, పని స్థలంలో, పనిముట్లు కూడా పని చేస్తాయి కదా? పనిముట్టు, పని స్థలంలో చేసే శ్రమ, 'కొత్త శ్రమ' ఎందుకు అవదు?**

**జ:** పని స్థలంలో పనిముట్లు కూడా పని చేస్తాయా? అంటే, పనిముట్లు పాతశ్రమనీ, కొత్త శ్రమనీ కూడా ఇస్తాయా? పనిముట్లు పని చేస్తాయి అనేది, తప్పుడు అర్థిక శాస్త్రంలో ఉండే బ్రహ్మాండమైన అజ్ఞానం. ఒక మనిషి సూదితో బట్టలు కుడుతూ ఉంటే, పని చేస్తున్నది మనిషా, సూదా? బట్టని కత్తిరించేది మనిషా, కత్తెరా? మనిషి, పని మానేస్తే, సూది పని చేస్తూనే ఉంటుందా? పనులు చేసేది, పనిముట్లు కాదు, మనుషులే. మనుషులు పనిముట్లని ఉపయోగిస్తూ, పనులు చేస్తారు. పనులు మానేసినప్పుడు, పనిముట్లని కింద పడేస్తారు. పనిని మనిషీ, పనిముట్టూ, కలిసి చేస్తున్నట్టు కూడా కాదు. పని చేసేది మనుషులే గానీ, పనిముట్లు కాదు. వాటి నించి కొత్త వస్తువుకి, పాత శ్రమే చేరుతుంది గానీ, కొత్త శ్రమ చేరదు. ఆ పాత శ్రమ కూడా మనుషులు చేసిందే. అది, జరిగిపోయింది కాబట్టి, దాన్ని పాత శ్రమ అంటాం. మనుషులు పనులు చేస్తూ ఉన్నప్పుడు, అది కొత్త శ్రమే. పని పూర్తయిపోతే, అది పాత శ్రమ. పనిముట్లు కూడా పనులు చేస్తాయి అనేది, చాలా అజ్ఞానం. దీన్ని తర్వాత కూడా చూద్దాం. ★

# 4. 'మారకం విలువ' అసహజమైనది!

**13. 'మారకం విలువ' అంటే, శ్రమ. ఏ శ్రమ అయినా, జరుగుతూ ఉన్నప్పుడే కనపడు తుంది గానీ, జరిగిపోయి, వస్తువు తయారైపోయాక, శ్రమ కనపడదు కదా? అంటే, వస్తువుని చూస్తే, దాని విలువ కనపడదు. మరి ఆ విలువని ఎప్పుడు చూస్తాం? ఎలా కనపడుతుంది?**

**జ:** వస్తువుకి ఉన్న విలువని చూడాలంటే, ఆ వస్తువుని మారకంలో పెట్టినప్పుడు చూడాల్సిందే. వస్తువుని మారకానికి పెట్టినప్పుడు, దానితో మారడానికి ఇంకో వస్తువు వస్తుంది కదా? 2 వస్తువులూ, ఒక దాని ఎదురుగా ఒకటి ఉంటే, ఆ 2 వస్తువుల విలువలూ కనపడతాయి. కుండకీ, చెప్పుల జతకీ మారకం జరిగితే, కుండకి బదులుగా వచ్చేది, కుండ విలువ. చెప్పులకు బదులుగా వచ్చేది, చెప్పుల విలువ.

కుండ విలువ = చెప్పుల జత

చెప్పుల జత విలువ = కుండ

ఒక మారకంలో, 2 వస్తువుల విలువలూ కనపడతాయి. ఒక వస్తువుకి ఉండే 'ఉపయోగపు విలువ'ని చూడాలంటే, ఆ వస్తువుని చూస్తే చాలు; దాని ఎదురుగా ఇంకో వస్తువు ఉండనక్కరలేదు. కుండ ఉపయోగం, కుండ శరీరంలోనే కనపడు తుంది. కానీ, కుండకి ఉండే మారకం విలువని చూడాలంటే, దాన్ని కుండ శరీరంలో

చూడలేం. ఆ విలువని, కుండకి దూరంగా, ఆ శరీరానికి బైట, ఇంకో వస్తువు ద్వారా చూడాలి. ఏ వస్తువు మారకం విలువని చూడాలన్నా, దానికి బైట చూడాల్సిందే. దీన్ని బట్టి ఏం తెలుస్తోంది? వస్తువుకి, మారకం విలువ అనేది, సహజ లక్షణం కాదన్న మాట! ఉపయోగపు విలువ అయితే, వస్తువు శరీరంలోనే ఉండే సహజ లక్షణం. "మారకం విలువ అసహజమైనది" అనడానికి కారణం, అది వస్తువు శరీరంలో లేకపోవడమే. సహజ లక్షణం అయితే, శరీరంలోనే ఉంటుంది.

**14. మారకాలు, వస్తువుల మధ్యే జరుగుతాయా? ఇంకెక్కడైనా కూడా జరుగుతాయా?**

**జ:** వస్తువుల మధ్యే కాదు, వేరు వేరు శ్రమల మధ్య కూడా జరుగుతాయి. ఒక వైద్యుడు, ఒక క్షవరాల మనిషితో క్షవరం చేయించుకుని, ఆ మనిషికి అవసరమైనప్పుడు తను వైద్యం చెయ్యవచ్చు. అది వస్తువుల మారకం కాదు, వేరు వేరు శ్రమల మారకం. మారకాలు, 2 వస్తువుల మధ్యా జరుగుతాయి; 2 శ్రమల మధ్యా జరుగుతాయి; 1 వస్తువుకీ, 1 శ్రమకీ మధ్యా, జరుగుతాయి. మారకాలు వేటి మధ్య జరిగినా, సారాంశంలో అవి, శ్రమల మారకాలే. అలా, శ్రమల మారకాల ద్వారా జీవిస్తూ ఉండే మనుషుల బృందమే, మనుషుల సమాజం.

**15. 'సమాజం' అంటాం, 'సంఘం' అంటాం. అది, ఈ మారకాలు చేసుకోవడం అనే దేనా? ఈ సంబంధాల గురించి, మనుషులకు తేలీదా?**

**జ:** వస్తువుల్ని మార్చుకునే బార్టరు విధానంలోకి 'డబ్బు' ప్రవేశించిందంటే, వస్తువుల స్పృహ కూడా పోతుందని చెప్పుకున్నాం. డబ్బు, ఒక మారకాన్ని, 2 మారకాలుగా విడదీసేస్తుంది. డబ్బు వల్ల, శ్రమ సంబంధాల సంగతి, పూర్తిగా మరుగునపడి పోతుంది. ఇప్పుడు బార్టరు మారకాలు లేవు. డబ్బు సంగతే చూడాలి. 'డబ్బు,' చెడ్డ విషయం కాదు. మారకాలు తేలిగ్గా జరగడానికి అది చాలా అవసరం. కానీ, డబ్బు పాత్ర గురించి ఎన్ని విషయాలు తెలియాలో అన్నీ తెలియకపోతే, డబ్బు తెచ్చిపెట్టే సమస్యలు అర్థం కావు. అసలు మార్క్సు కన్నా ముందు, మారకం విలువనీ, డబ్బునీ, సరిగా అర్థం చేసుకున్న ఆర్థికవేత్త లెవరూ లేరు. ★

# 5. డబ్బు, మంచిదీ - చెడ్డదీ రెండూనూ!

**16. 'డబ్బు' గురించి తెలుసుకోవలిసిందే. అసలు, 'డబ్బు' అంటే ఏమిటి? మనుషుల సంబంధాలేమిటో మనుషులకు తెలీకుండా అది ఎలా అడ్డం పడుతుంది?**

**జ:** 'కాపిటల్' చదివితే డబ్బు సంగతి ఎంతో వివరంగా తెలుస్తుంది. ఇక్కడ చూసేది, డబ్బు గురించి ఏం సరిపోతుంది? 'డబ్బు' కూడా ఒక వస్తువే. అది కూడా ఇతర వస్తువుల్లాగే ఒక సహజ పదార్థం మీద శ్రమలు జరగడం ద్వారానే తయారవుతుంది. అయితే, డబ్బు అనేది, ఇతర వస్తువుల్లాంటిది కాదు. డబ్బుగా ఉండే వస్తువు నిర్వహించే పాత్ర వేరు. అది, మారకాలకు ఏకైక సాధనం. అంటే, ప్రపంచంలో ఉన్న సమస్త వస్తువుల తోటీ మారే హక్కు దానికి మాత్రమే ఉంటుంది.

అలాంటి హక్కున్న వస్తువు అది. సమాజంలో అనేక రకాల వస్తువులు ఉంటాయి. వాటిని 100 రకాలు అనుకుంటే, వాటిల్లో ఏదో ఒక్క వస్తువునే, అందరూ 'డబ్బు వస్తువు'గా పెట్టుకుంటారు. మిగతా 99 రకాల వస్తువులూ, మామూలు వస్తువులే. అవి, డబ్బు కాని వస్తువులు. డబ్బు వస్తువు వల్ల, మారకాలు తేలిగ్గా జరుగుతాయి.

"ఏ విధంగా?"

"కుండలు చేసే మనిషికి, ఇంట్లో బియ్యం అయిపోయి, వెంటనే కొన్ని బియ్యం కావాలనుకుందాం. వెంటనే ఒక కొత్త కుండ పట్టుకుని బియ్యం మనిషి దగ్గిరికి వెళ్తాడు. కానీ, ఆ బియ్యం మనిషికి, ఆ సమయంలో కొత్త కుండ అక్కరలేకపోతే? బియ్యం మనిషికి కొంచెం బెల్లం కావాలనుకుందాం. కుండ మనిషి ఏం చెయ్యాలి? బెల్లం మనిషి దగ్గిరికి వెళ్ళి, కుండ ఇచ్చి బెల్లం తీసుకుని, ఆ బెల్లం తెచ్చి బియ్యం మనిషికి ఇచ్చి బియ్యం తీసుకోవాలి. అయితే, బెల్లం మనిషికి కూడా కుండ అక్కర లేకపోతే? ఆ రకంగా, ఇంకా కొందరికి కూడా ఆ రోజు గానీ, ఇంకా కొన్ని రోజుల దాకా గానీ, కొత్త కుండ అక్కరలేకపోతే, కుండ మనిషికి బియ్యం ఎలా దొరకాలి? బియ్యాన్ని అప్పు తీసుకోవచ్చు గానీ, మారకం తేలిగ్గా జరగడం అంటే, అప్పుల పద్ధతి కాదు గదా? అదే డబ్బు విధానం ఉన్నట్టయితే, సమస్య క్షణాల్లో తీరిపోతుంది."

### 17. అసలు 'డబ్బు'గా ఉండే వస్తువు ఏది?

**జ:** 'డబ్బు'గా, పూర్వం అనేక రకాల వస్తువులు ఉండేవి. అదంతా ఇక్కడ అనవసరం. ఇప్పుడు డబ్బుగా ఉన్నది మాత్రం బంగారం. బంగారం కూడా ఒక వస్తువే కదా? గనుల్లో దొరికే సహజ పదార్థాన్ని తవ్వి తియ్యడం దగ్గిర్నించీ, చిన్న చిన్న బంగారం బిళ్ళలు తయారు చెయ్యడం వరకూ జరిగేవన్నీ శ్రమలే. బంగారానికి కూడా ఆ శ్రమల వల్లే విలువ ఏర్పడుతుంది. అంటే, డబ్బుకి కూడా విలువుంటుంది. మట్టి కుండని ఇచ్చి బంగారం తీసుకోవాలంటే, కుండ విలువ ఎంత ఉందో ఆ విలువకి తగినంత బంగారం మాత్రమే వస్తుంది. ఇసక రేణువంతకావచ్చు.

### 18. డబ్బుతో మారకాలు తేలిక ఎలా అవుతాయి?

**జ:** డబ్బు విధానం ఉన్నప్పుడు, కుండ మనిషికి బియ్యం కావాలంటే, మొదటే బియ్యం దగ్గిరికి వెళ్ళడు. మొదట, డబ్బు దగ్గిరికి వెళ్తాడు. అంటే, బంగారం దగ్గిరికి. కుండని ఇచ్చి, డబ్బుని తీసుకుంటాడు. వస్తువుని ఇచ్చి డబ్బుని తీసుకుంటే, అది వస్తువుని 'అమ్మడం.' డబ్బు ఇచ్చి, వస్తువుని తీసుకుంటే, అది వస్తువుని 'కొనడం.' కుండ మనిషి, కుండని అమ్మడానికి వెళ్ళినప్పుడు, కుండ కావలసిన వాళ్ళెవరో, చేతిలో డబ్బు ఉంటే, డబ్బు ఇచ్చి కుండని తీసుకుంటారు. అది, కుండకీ - డబ్బుకీ మారకం. కుండని అమ్మిన మనిషి, ఆ డబ్బుని పట్టుకుని, అప్పుడు బియ్యం దగ్గిరికి దర్జాగా వెళ్తాడు. డబ్బు ఇచ్చి బియ్యం కొంటాడు. అది, డబ్బుకీ - బియ్యానికీ మారకం. బియ్యం మనిషి, ఆ బియ్యాన్ని అమ్మడం కోసమే పెట్టుకుని ఉంటాడు కాబట్టి, డబ్బుని సంతోషంగా తీసుకుని బియ్యం ఇచ్చేస్తాడు.

కుండ మనిషికి బియ్యం దొరకడం, ఎన్ని మారకాలతో జరిగింది?

1) కుండని ఇచ్చి, డబ్బు తీసుకున్నాడు. కుండని అమ్మాడు.

2) డబ్బు ఇచ్చి, బియ్యం తీసుకున్నాడు. బియ్యం కొన్నాడు.

రెండే రెండు మారకాలతో, కావలసిన ఉత్పత్తి దొరికింది.

రెండూ, డబ్బుతో జరిగిన మారకాలే.

ఇదే, బార్టరు పద్ధతిలో అయితే, కుండని ఇచ్చి బియ్యం తీసుకుంటే, అది ఒక్క మారకమే. డబ్బు వల్ల, ఆ ఒక్క మారకం, 2 మారకాలుగా విడిపోయింది. డబ్బు విధానం లేకపోతే, కుండ మనిషి, బియ్యం కోసం, ఆ కుండని పట్టుకుని ఇంకా తిరగవలసిందే కదా? అలాంటి సమస్య లేకుండా, డబ్బు వల్ల, కావలసిన వస్తువు, తేలిగ్గా దొరికింది కదా? డబ్బు, బియ్యాన్ని అమ్మిన మనిషి చేతిలోకి వెళ్ళింది. అతను కూడా, ఆ డబ్బుతో తనకు కావలసిన వస్తువునో, శ్రమనో, కొనుక్కుంటే, డబ్బు, అక్కడి నించి కూడా ఇంకో మనిషి చేతిలోకి వెళ్ళిపోతుంది. అది అలా వస్తువుల్ని కొనడాలు చేస్తూ, మారకాల్ని తేలిక చేస్తూ, తిరుగుతూ ఉంటుంది.

**19. వస్తువుని అమ్మి, డబ్బు తీసుకుంటే, ఆ డబ్బు, వస్తువు విలువ అవుతుందా?**

**జ:** అంతే కదా? కుండని ఇచ్చి, చెప్పుల జతని తీసుకుంటే, ఆ చెప్పుల జతే, కుండ విలువ అవుతుంది కదా? ఒక వస్తువుకి బదులు ఏ వస్తువు వస్తుందో, అదే, ఇచ్చిన వస్తువుకి విలువ కదా? అలాగే, కుండకి బదులు డబ్బు వస్తే, ఆ డబ్బు, కుండ విలువే. కుండకి బదులు ఇంకో వస్తువు వచ్చినా, లేదా కొంత డబ్బు వచ్చినా, రెండూ ఒకటే. ఏది వస్తే అదే కుండ విలువ. కుండ, మొత్తం 10 గంటల శ్రమతో తయారైందని అనుకుంటే, దానికి బదులుగా వచ్చిన డబ్బు కూడా (ఆ బంగారం బిళ్ళ కూడా) 10 గంటల శ్రమతో తయారైనదై ఉంటుంది. రెండు వేపులా విలువలు సమానం అవడం వల్లే, ఆ మారకం జరిగిందని అర్థం. ఈ విషయాలు ఇంత వివ రంగా ఎందుకు చూస్తున్నామో తెలుసా? ఇవి తెలిసుంటేనే, సరైన ఆర్థిక విషయాలు తెలుస్తాయి. మనం ఇప్పుడు, సరైన ఆర్థిక శాస్త్రం నేర్చుకుంటున్నాము, తెలుసా? ''అవును, ఇవన్నీ చాలా కొత్తగా ఉన్నాయి మాకు. అన్నీ, తర్కానికి సరిపోతు న్నట్టుగా ఉన్నాయి.''

**20. 'వస్తువు' అంటే తెలిసింది. 'డబ్బు' అంటే తెలిసింది. మరి 'సరుకు' అంటే?**

**జ:** 'సరుకు' అంటే, వస్తువే. వస్తువుని అమ్మకానికి పెడితే, ఆ అమ్మకం పూర్తి అయ్యేదాకా, ఆ అమ్మకం దశలో ఉన్నంతసేపూ, ఆ వస్తువు పేరు - సరుకు. మనం ఏదైనా ప్రయాణం చేసేటప్పుడు, 'ప్రయాణీకులం' అవుతాం. ఒక్కోసారి 'శ్రోతలం', ఒక్కోసారి 'ప్రేక్షకులం', అలా ఆ దశని బట్టి ఆ పేరు. అలాగే, అమ్మకం దశలో ఉన్న వస్తువే, సరుకు. అమ్మకం అయిపోయాక అది మళ్ళీ వస్తువే. మనం, మన ఇంట్లో అన్నం వండుకుంటే, అది అమ్మకం కోసం కాదు కదా? కాబట్టి, అది

సరుకు కాదు. కానీ ఎవరైనా, అమ్మకం కోసమే భోజన పదార్థాలు తయారు చేస్తే, అవి సరుకులే. అది, సరుకుల ఉత్పత్తి. అది, సరుకుల్ని తయారు చేసే, అమ్మే వ్యాపారం. అలాగే ఇతర సరుకుల వ్యాపారాలు కూడా. బార్టరు మారకాల్లో, ఈ 'సరుకు' అనే మాట ఉండదు. ఎందుకంటే, బార్టరు మారకాలన్నీ ఉపయోగపు విలువ దృష్టితోనే జరుగుతాయి. ఒక మారకంలో, 2 వేపుల వాళ్ళకీ, ఆ వస్తువులతో అవసరం ఉంటుంది. ఇంటికి తీసుకుపోయి ఆ వస్తువుల్ని వాడేసుకుంటారు. ఆ మారకాల్లో, 'వస్తువు' అనే మాటే గానీ, 'సరుకు' అనే మాట ఉండదు. డబ్బు మారకాల్లోనే సరుకులు అనే మాట బైల్దేరుతుంది.

**21. కుండ, ఇంకో వస్తువుతో మారినా, డబ్బుతో మారినా, ఒకటే కదా? డబ్బు, శ్రమ సంబంధాల్ని మరుగుపర్చడం ఎలా చేస్తుంది?**

**జ:** అవును, అది తెలుసుకోవాలి. కుండకీ బియ్యానికీ మధ్య డబ్బు లేకుండా, ఆ వస్తువులకే సూటిగా బార్టరు మారకం జరిగితే, ఒక వస్తువుని ఇవ్వడమూ - ఇంకో వస్తువుని తీసుకోవడమూ, ఒకే చోట జరుగుతాయి కదా? ఒకరి వస్తువుని ఒకరు తీసుకున్నట్టు ఆ ఇద్దరికీ తెలుస్తుంది. ఆ మనుషులు ఆ వస్తువుల గురించి, "నీ వస్తువు బాగుంది" అనో, "బాగా లేదు" అనో, మాట్లాడుకుంటారు. "నీ కుండ బాగుంది, నీళ్ళు చక్కగా చల్లబడుతున్నాయి" అని ఒకరు అంటే, "నీ బియ్యం మాత్రం? సన్నగా ఉండి, చక్కగా ఉడుకుతున్నాయి" అని ఇంకొకరు అంటారు. ఆ మనుషులు, ఆ వస్తువుల గురించి తర్వాత అయినా మాట్లాడుకుంటారు. కానీ అప్పుడు కూడా వాళ్ళు, ఒకరి శ్రమని ఒకరు వాడుతున్నట్టు ఊహించలేరు. శ్రమ సంబంధాల విషయం గ్రహించకపోయినా, అది 'వస్తువుల సంబంధం' అని అయినా అర్థం చేసుకుంటారు. కానీ, ఆ వస్తువుల మధ్యకి డబ్బు వచ్చిందంటే, ఆ మారకం, 2 దశలుగా విడిపోతుంది కదా? కుండ అమ్మకం ఒక చోట జరిగి, బియ్యాన్ని కొనడం ఇంకో చోట జరుగుతుంది. కుండ మనిషి, కుండని ఇచ్చి డబ్బు తీసుకున్నప్పుడు, డబ్బుని కూడా ఒక వస్తువుగా అనుకోడు. డబ్బుతో జరిగింది కూడా 2 వస్తువుల మారకమే. కానీ అది అలా కనపడదు. కుండని ఇచ్చి చెప్పులు తీసుకోవడం ఎలాంటిదో, కుండని ఇచ్చి డబ్బు తీసుకోవడం కూడా అలాంటిదే - అని గ్రహించడం సాధ్యం కాదు. డబ్బు అంటే ఏదో 'మహత్యం'. దాన్ని గురించి అంత కన్నా వేరే అభిప్రాయం ఉండదు. అది ఏమిటో తెలీదు. కుండ మనిషి, కుండని అమ్మిన డబ్బుతోనే బియ్యాన్ని కొన్నా, దాన్ని, కుండకీ బియ్యానికీ జరిగిన మారకంగా గ్రహించడు. కుండని అమ్మి డబ్బుని తీసుకున్నప్పుడు, "నా వస్తువుని అమ్ముకున్నాను. డబ్బు వచ్చింది" అనుకుంటాడు. అప్పుడు అంత వరకే. ఆ డబ్బుతో బియ్యాన్ని కొన్నప్పుడు, "నా డబ్బుతో కొనుక్కున్నాను. బియ్యం వచ్చాయి" అనుకుంటాడు. ఇప్పుడు ఇంత వరకే. "నా వస్తువుని అమ్మాను; నా డబ్బుతో కొన్నాను" - అంతే. అసలు మారకం, కుండకీ బియ్యానికీ జరిగిందని అర్థం కాదు. మారకం, వస్తువుల మధ్యే జరిగిందన్న సంగతే అర్థం కానప్పుడు, శ్రమల మధ్య జరిగిందనే గ్రహింపుకి

అవకాశమే ఉండదు. "అమ్ముతాం, కొంటాం" అనే చర్యలు తప్ప, అక్కడ మారకాల సంగతి కూడా గుర్తురాదు. "ఇది వస్తువుల సంబంధం" అనేది కూడా మరుగున పడిపోతుంది. అయినప్పటికీ, మారకాలు తేలిగ్గా జరగడానికి డబ్బు విధానం చాలా అవసరం. దాని వల్ల ఆ సదుపాయం ఉంది. ★

## 6. డబ్బు, ఉపయోగపు విలువ లేని వస్తువు!

**22. ఇప్పుడు, 'డబ్బు'గా మన చేతుల్లో తిరుగుతున్నవి కాయితం నోట్లే గానీ, బంగారం బిళ్ళలు కావు గదా? కాయితం ముక్కలే, డబ్బు ఎలా?**

**జ:** ఈ కాయితం నోట్ల పద్ధతి వచ్చాక, డబ్బు విషయం మరీ అర్థం కాని విషయం అయిపోయింది. కాయితం నోట్లు, 'అసలు డబ్బు' కాదు; 'నిజం డబ్బు' కాదు. అసలు డబ్బు, ఇప్పుడు కూడా బంగారమే. బంగారం డబ్బు పుట్టిన ప్రారంభంలో, బంగారం బిళ్ళలే జనాల చేతుల్లో (చలామణీలో) తిరిగేవి. అవి, రోజూ జనాల చేతుల్లో పడుతూ లేస్తూ ఉంటే అరిగిపోతూ ఉండేవి. ఏటా కొంత బంగారం వృధా అయిపోతూ ఉండేది. ఆ సమస్యని చూసి, ప్రభుత్వం ఏం చేసిందంటే, అందరి బంగారం బిళ్ళల్నీ తీసుకుని బ్యాంకులో దాచి, అందరికీ కాయితం నోట్లు ఇచ్చింది. బంగారం బిళ్ళల్ని డబ్బుగా చూసినట్టే, కాయితం నోట్లనీ డబ్బుగా చూడాలని నేర్పింది. భారత దేశంలో డబ్బు పేరు- రూపాయి. ప్రతీ దేశంలోనూ ఏదో ఒక పేరు, వాళ్ళ భాషని బట్టి వాళ్ళ డబ్బుకి ఉంటుంది. కాయితం డబ్బు ఎందుకంటే, బంగారం బిళ్ళలు అరిగిపోకుండా ఉండడానికే ప్రారంభమైంది.

1 బంగారం రూపాయి బిళ్ళకి ఎంత విలువ ఉంటుందో, 1 కాయితం రూపాయి నోటుకి కూడా అంత విలువ ఉన్నట్టు అర్థం. అంటే, కాయితం నోటు అనేది, బంగారం రూపాయికి బదులుగా చలామణీలో 'తిరిగే పని' చేసి పెట్టే ప్రతినిధి అన్నమాట! బంగారం తయారీలో, శ్రమ కాలంలో మార్పులు జరిగి, బంగారం బిళ్ళకి విలువ తగ్గినా, పెరిగినా, ఆ మార్పులు, కాయితం నోటు విలువలో కూడా జరుగుతాయి. బంగారం రూపాయికి ఉండే విలువే, కాయితం రూపాయి విలువ. కాయితం రూపాయి వెనకాల, బంగారం రూపాయే లేకపోతే, కేవలం కాయితం డబ్బుని చూసి, డబ్బు విలువనీ, ఆ విలువలో భాగాల్నీ, లెక్క పెట్టడానికి అవకాశం ఉండదు. అంటే, కాయితం ముక్కల వెనకాల బంగారం దన్ను లేకపోతే, కాయితం ముక్కలు డబ్బుగా లెక్కకు రావు. బంగారం అరిగిపోకుండా ఉండడానికి, కాయితం డబ్బు పద్ధతి మంచి పద్ధతే. కానీ, కాయితం డబ్బు, డబ్బు సంగతుల్ని మరీ అర్థం కాకుండా చేసేస్తుంది.

ఒక వస్తువుకీ, చిన్న బంగారం బిళ్ళకీ, మారకం జరిగితే, అది "వస్తువుల మారకం" లాగ కొంచెమైనా అర్థమయ్యే అవకాశం ఉంటుంది. కానీ, ఆ వస్తువుకీ, కాయితం నోటుకీ మారకం జరిగితే, అది వస్తువుల సంబంధం లాగ బొత్తిగా అర్థం

కాదు. అంతే కాదు. బంగారం డబ్బుతో అయితే రాని సమస్యలెన్నో కాయితం డబ్బుతో వచ్చే అవకాశాలున్నాయి. వీటిని 'కాపిటల్' లోనే చూడాలి.

**23. 'విలువ' అంటే, 'మొత్తం శ్రమ కాలం' అని తెలుసు. మరి, 'ధర' అంటే? వెల, మూల్యం - ఇలాంటి పేర్లు కూడా ఉన్నాయి. వాటికి తేడాలు ఉన్నాయా?**

**జ:** అర్థంలో అన్నీ ఒకటే. కానీ, బార్టరు మారకాల్లో, 'విలువ' అనే మాటే గానీ, 'ధర' అనే మాట ఉండదు. కుండ, చెప్పులతో మారితే, ఆ చెప్పులు, కుండకి విలువే గానీ, 'ధర' కాదు. కుండ మారకం, డబ్బుతో జరిగి, దానికి బదులుగా 1 రూపాయి వస్తే, అది కుండ ధర. అంటే, విలువని, డబ్బు లెక్కతో చూసినప్పుడే అది 'ధర'. వెలా, మూల్యం - ఇవి, ధరకి మారు పేర్లు. లేదా, విలువకి మారు పేర్లు.

**24. డబ్బు అంటే, మారకాల్ని తేలిగ్గా జరిపే సాధనం. అంతే కదా?**

**జ:** అంతే కాదు. డబ్బు గురించి, ఇంకో ముఖ్య విషయం ఉంది. డబ్బు, ఒక వస్తువుతో మారినప్పుడు, ఆ వస్తువు విలువని చూపించడమే కాదు; ఆ విలువ, ఎన్ని కొలతలుగా (ఎన్ని రూపాయలుగా) ఉందో, ఆ విలువని కొలిచి కూడా చూపిస్తుంది. కుండ, చెప్పులతో మారినప్పుడు, ఆ చెప్పుల జత, "కుండ విలువని నేనే" అని, ఆ విలువని తన ద్వారా చూపిస్తుంది గానీ, ఆ విలువ ఎన్ని కొలతలుగా ఉందో చెప్పదు. అదే, డబ్బు అయితే, వస్తువు విలువని తన ద్వారా చూపించడమే గాక, దాన్ని కొలిచి కూడా చెపుతుంది. చిన్న విలువల్నీ, పెద్ద విలువల్నీ, అన్నిటినీ కొలుస్తుంది.

3 వస్తువులు డబ్బుతో మారినప్పుడు,
ఆ డబ్బు, ఈ కొలతలతో ఉందనుకుందాం:

ఒక కుండ = 4 రూపాయలు
ఒక చొక్కా = 10 రూపాయలు
ఒక ఇల్లు = 5,100 రూపాయలు

ఈ రకంగా డబ్బు, వస్తువుల విలువల్ని తన ద్వారా చూపిస్తూ, వాటిని ఖచ్చితమైన కొలతలతో కూడా చెప్పగలుగుతుంది. ఒక చొక్కాకి బదులుగా 10 రూపాయలు వచ్చాయంటే, ఆ 10 విలువలోకి, చొక్కాని తయారు చేసిన ఉత్పత్తి సాధనాల్లో ఏ అంశం నించి ఎంత విలువ చేరిందో, పాత శ్రమ విలువ ఎంతో, కొత్త శ్రమ విలువ ఎంతో, ఆ వివరాలన్నీ కూడా డబ్బు చెప్పగలుగుతుంది.

**25. డబ్బు కూడా ఒక వస్తువే కదా? ఇతర వస్తువులకీ, డబ్బు వస్తువుకీ, ఏమిటి తేడా?**

**జ:** అదే తెలుసుకోవాలి. డబ్బు కూడా ఒక వస్తువే గానీ, అది ఏ ఉపయోగపు విలువా లేని వస్తువు. కుండని మారకంలో పెడితే దానికి ఒక ఉపయోగపు విలువా, కొంత మారకం విలువా, రెండూ ఉంటాయి. అలాగే, డబ్బు కాని, మామూలు వస్తువుల్లో దేన్ని తీసుకున్నా, దాని ఉపయోగపు విలువ దాన్నించి

వదలదు. కుండ ఉపయోగం కుండలోనే, చెప్పుల ఉపయోగం చెప్పుల లోనే, అలా, ఏ వస్తువూ ఉపయోగపు విలువ లేకుండా ఉండదు. కానీ, డబ్బు సంగతి అలా కాదు. డబ్బు, బంగారం బిళ్ళ రూపంతోనో, లేదా కాయితం నోటు రూపంతోనో, ఉంటుంది. ఆ ఆకారం వల్ల, ఏ అవసరమూ తీరదు. అది మారకాల కోసం ఉప యోగపడుతుందే గానీ, ఆ ఆకారం, ఏ సహజమైన అవసరానికీ ఉపయోగపడదు. అంటే, డబ్బు అనేది, సహజమైన ఉపయోగపు విలువల్ని వదిలేసిన వస్తువు. అది, కుండ లాగానో, చెప్పులు లాగానో, చొక్కా లాగానో, పెన్ను లాగానో, ఏ ఉపయోగపు విలువ తోటీ కలిసి ఉండదు. కుండకీ, చెప్పులకీ మారకం జరగాలంటే, అక్కడ విలువలు సమానమే అయితే, ఆ విలువల వల్ల ఇబ్బంది ఉండదు. ఇబ్బంది వస్తే, వాటి ఉపయోగపు విలువల వల్లే వస్తుంది. కుండ మనిషికి, చెప్పుల ఉపయోగపు విలువ అక్కర లేకపోవచ్చు. లేదా, చెప్పుల మనిషికి, కుండ ఉపయోగపు విలువ అక్కర లేకపోవచ్చు. అందుకే, 2 ఉపయోగపు విలువల మధ్య మారకాలు తేలిగ్గా జరగడానికి వీలు ఉండదు. కానీ, డబ్బుతో అయితే, దానికి ఏ ఉపయోగపు విలువా ఉండదు కాబట్టి, అది మారకాలకు అడ్డం పడే పరిస్థితి ఉండదు. వస్తువుని ఇచ్చి డబ్బుని తీసుకోవడం అంటే, వస్తువు విలువని తీసుకోవడం మాత్రమే. ఆ విలువతో, తర్వాత ఏ ఉపయోగపు విలువని అయినా (ఏ వస్తువుని అయినా), తక్షణం కొన వచ్చు. అంటే, డబ్బు, ఏ వస్తువుతో అయినా మారగలుగుతుంది. డబ్బు కూడా ఒక వస్తువే అయినా, అది ఇతర వస్తువుల్లాగ ఏదో ఒక ఉపయోగపు విలువతో లంకెపడి ఉండే వస్తువు కాదనీ, అది విలువతో మాత్రమే ఉండే వస్తువు అనీ, అర్థం చేసుకోవాలి. - ఇది డబ్బు గురించి ఒక ముఖ్య విషయం.

**26.** **'డబ్బు' అంటే బంగారమే కదా? బంగారానికి ఉపయోగపు విలువ ఉండదా?**

**జ:** బంగారం, 'నగ' గానో, ఒక 'పాత్ర' గానో ఉంటే, అది ఉపయోగపు విలువతో కలిసి ఉన్న మామూలు వస్తువే. అప్పుడు అది డబ్బు కాదు. నాణెం రూపంగా ఉంటేనే అది 'డబ్బు'. ఆ డబ్బు 'రూపం' గురించే చూస్తున్నాం. ఆ రూపానికి ఉప యోగపు విలువ లేదు కదా? ఆ రూపం ఏ సహజ అవసరానికీ పనికి రాదు. బంగారం బిళ్ళని తినలేము, తాగలేము, బట్ట లాగా కట్టుకోలేము, చెప్పుల్లాగా కాళ్ళకి తొడుక్కో లేము, ఏ సహజమైన అవసరానికీ అది పనికి రాదు.

డబ్బు గురించి క్లుప్తంగా చెప్పుకోవాలంటే, డబ్బు అంటే, మారకం విలువ. 'విలువ' అనే ఒకే లక్షణంతో ఉండే వస్తువు డబ్బు. అందుకే అది, ఏ వస్తువు విలువని అయినా తన ద్వారా కొలవగలుగుతుంది - పొడుగు మాత్రమే గల వస్తువు, తన ద్వారా పొడుగుల్ని కొలవగలిగినట్టు. బరువు మాత్రమే గల వస్తువు, తన ద్వారా బరువుల్ని కొలవగలిగినట్టు.

డబ్బుగురించి, ఈ సందర్భంలో తెలుసుకోవలసిన ప్రధానమైన విషయాలు 2.

(1) డబ్బు, 'ఉపయోగపు విలువ' లేని, కేవలం విలువ మాత్రమే గల వస్తువు.

(2) డబ్బు, డబ్బు కాని వస్తువుల విలువల్ని తన ద్వారా కొలుస్తుంది.

ఒక వస్తువుకి బదులుగా, 2 రూపాయల డబ్బు వచ్చిందంటే, ఆ 2 డబ్బుతో సమానమైన విలువ, ఆ వస్తువుకి ఉందని, ఆ డబ్బు రుజువు చేస్తోంది. సమాన విలువలే మారతాయి - అనేది, విలువ సూత్రం. ఆ వస్తువుకి, 2 రూపాయల విలువ లేకపోతే, ఆ వస్తువుకి బదులుగా ఆ 2 డబ్బు రాదు. ఈ విషయాలు ఇంత వివరంగా అర్థమైతే, 'శ్రమ దోపిడీ' రహస్యాన్ని పట్టుకోవడం చాలా తేలిక! డబ్బుని ఇలా అర్థం చేసుకోవడం వల్లనే మార్క్సు ఆ పని చేయగలిగాడు. ★

# 7. డబ్బు, రూపం లేని శ్రమ!

**27.** **డబ్బు గురించి తెలుసుకోవలసినదంతా అయిపోయినట్టేనా?**

**జ:** అప్పుడేనా? 'కాపిటల్'లో అయితే, డబ్బు విషయాలు, అనేక చాప్టర్లలో చూస్తాం. ఇక్కడ అవన్నీ చూడలేం కాబట్టి, ఇంకొక్క సంగతి చూసి దీన్ని సరి పెట్టెయ్యాలి. డబ్బు అంటే, 'విలువ' కదా? విలువ అంటే, శ్రమే కదా? అయితే అది, ఏ శ్రమ? ఆ శ్రమ పేరు ఏమిటి? దాని రూపం ఏది? 'విలువ' అంటే, ఉత్పత్తి సాధనాల్ని చేసిన పాత శ్రమలూ, కొత్త శ్రమలూ, అన్నీ కలిసిపోయిన మొత్తం కదా? వ్యవసాయం, నేతా, కుట్టూ, వడ్రంగం - అలా అనేక శ్రమల విలువలు కలిసిపోతే, ఆ మొత్తం విలువకి రూపం ఏమిటి? విలువగా మారే శ్రమ ఎలాంటిదో గ్రహించ డానికి, చిన్న ఉదాహరణ చూడాలి. 1 గ్లాసు నీళ్ళనీ, 2 గ్లాసుల పాలనీ, కొంత తేనెనీ, కొంత నిమ్మరసాన్నీ, కొంత మజ్జిగనీ - అలా కొన్ని ద్రవ పదార్థాల్ని కలిపితే, ఆ ద్రవం పేరేమిటి? - అది నీళ్ళు కాదు, పాలు కాదు, నిమ్మరసం కాదు, తేనె కాదు, మజ్జిగ కాదు - ఏ పేరూ దానికి మిగలదు. అన్ని పేర్లూ పోయి, అన్ని రూపాలూ కలిసి పోయిన ద్రవ పదార్థం అది. ఇంకా అది, ఒక 'పదార్థం' కాబట్టి, దానికి ఇంకో కొత్త రూపం అయినా ఉంటుంది. కానీ, అన్ని శ్రమలూ కలిసి ఏర్పడే విలువకి అయితే, ఏ ప్రత్యేకతా ఉండదు. దాన్ని ఏ పేరుతో చెప్పడానికీ వీలు ఉండదు.

అసలు ఏ శ్రమ అయినా, ఒక ప్రత్యేకమైన పేరుతో, ప్రత్యేకమైన రూపంతో, ఉంటుంది. 'కుట్టు శ్రమ' అంటే, అది ఒక ప్రత్యేక రూపం. 'నేత శ్రమ' అంటే, ఒక ప్రత్యేక రూపం. కానీ, 'కొంత విలువ' అంటే, అది, అసహజ విషయం. రూపం లేని విషయం. అది శ్రమే గానీ, రూపం లేని శ్రమ. మానవ సమాజానికి, రూపం ఉన్న శ్రమలన్నీ తప్పనిసరి అవసరాలు. కుట్టుని వదిలెయ్యడం గానీ, నేతని వదిలెయ్యడం గానీ, వడ్రంగాన్ని వదిలెయ్యడం గానీ, అలా ప్రత్యేక శ్రమల్ని వదిలివేసి బతకడం ఎప్పటికీ సాధ్యం కాదు. కానీ, రూపం లేని శ్రమ (విలువ), తప్పనిసరి అవసరం కాదు. అది అసహజ విషయం కాబట్టి, దాన్ని వదిలి వెయ్యడం అసాధ్యం కాదు. సమాజంలో తగిన పరిస్థితులు ఏర్పడినప్పుడు, 'విలువ'ని వదిలెయ్యడం సాధ్యమే.

"అంటే, మారకాలు లేకుండా, డబ్బు లెక్కలు లేకుండా బతకడం అనా? అది సాధ్యమా!"

"సాధ్యమే. అది ఎలా చెప్పగలమంటే, సహజమైన విషయాల్ని అయితే, వదిలి వెయ్యడం సాధ్యం కాదు. అసహజమైన వాటిని వదిలెయ్యడం సాధ్యమే, దానికి తగిన పరిస్థితులు ఏర్పర్చుకుంటే."

**28.** **మార్క్సు అలా చెప్పాడా?**

**జ:** అవును, చెప్పాడు. 'సమాజంలో మంచి సంబంధాలు' అంటే, ప్రతి మనిషీ, శక్తిని బట్టి పని చెయ్యడమూ, అవసరాల్ని బట్టి ఉత్పత్తుల్ని వాడుకోవడమూ - అని చెప్పాడు. అంటే, సరుకుల పద్ధతీ, అమ్మకాలూ, అక్కర లేదని.

"అది ఎలా చెయ్యాలని చెప్పాడు?"

"అదంతా ఇక్కడే చూడగలమా? మార్క్సు కన్నా పూర్వపు ఆర్థిక వేత్తలు, విలువని సహజ అవసరంగా భావించారు. అలా భావించే వాళ్ళ వాదన ఎలా ఉంటుందంటే: 'విలువ అంటే శ్రమే. శ్రమ లేకుండా ఏ వస్తువూ తయారవదు. అంటే, విలువ లేకుండా ఏ వస్తువూ ఉండదు' అని!"

"అవును, వాళ్ళెవరో గానీ, సరిగానే చెప్పారే. శ్రమ లేకుండా వస్తువు తయారవుతుందా? ఆ శ్రమే విలువ అయితే, వస్తువుకి తప్పకుండా విలువ ఉంటుందని అర్థమే కదా?"

"వస్తువు తయారవడానికి శ్రమ అవసరమే. శ్రమ లేకపోతే వస్తువు తయారవదు. అంత వరకూ ఎవరూ కాదనరు. కానీ, ఆ శ్రమని విలువగా లెక్క కట్టకపోతే, అంటే, ఆ వస్తువుని మారకంలో పెట్టకపోతే, దాన్ని వాడలేమా?"

"ఎందుకు వాడలేం? ఇంట్లో వంటలు చేసుకుని, వాటిని మారకాలు లేకుండానే తింటున్నాం కదా?"

"మరి, ఆ పదార్థాల్ని, మారకాల్లో పెట్టకుండానే, వాడుతున్నాం కదా? 'విలువ' అనేది, తప్పనిసరిగా ఉండే విషయం అయితే, మన వంటల్ని మారకాల్లో పెట్టి, ఆ డబ్బుతో వేరే వంటల్ని తెచ్చుకుని వాడాలి. అలాగే చేస్తున్నామా?"

"అదా? ఇప్పుడు తెలిసింది. వస్తువులు శ్రమలతో తయారవక తప్పదు. అయితే, ఏ వస్తువుకైనా విలువ లెక్కలు కావాలంటేనే, ఆ శ్రమని కొలవాలి గానీ, శ్రమ జరిగింది కాబట్టి, అది విలువ అయి తీరుతుందంటే, అది తప్పే."

"ఇప్పుడు బాగా అర్థం చేసుకున్నారు. విలువని శాశ్విత సత్యంగా భావించే వాళ్ళ తప్పు ఏమిటంటే, సహజత్వాల్నీ, అసహజత్వాల్నీ, ఒకే రకంగా చూసే తప్పు అది. వస్తువుల్ని తయారుచేసుకోవడం ఎలాంటి అవసరమో, ఆ వస్తువుల అమ్మకాలూ - కొనుగోళ్ళూ కూడా అలాంటి అవసరాలే అని భావించే తప్పు అది. ఉపయోగపు విలువ సహజత్వానికీ, మారకం విలువ అసహజత్వానికీ తేడాని గ్రహించలేని తప్పు అది. ఆ తేడాని గ్రహించకలేకపోతే, అసహజత్వాలు కూడా సహజమైన అవసరాలు గానే, అంటే వదలడానికి సాధ్యం కాని అవసరాలు గానే, కనపడతాయి. ఈ తప్పుల దృష్టితో ఉన్న వాళ్ళకి, ఒక ప్రశ్న రావొద్దూ? ఎలాంటి ప్రశ్నంటే, 'విలువ, సహజ లక్షణం అయితే, అది, అమ్మకాలకు వెళ్ళని వస్తువులకు ఎందుకు ఉండడం

లేదు?' అనే ప్రశ్న రావద్దూ? ఆ ప్రశ్న వస్తే, 'అవును, విలువ తప్పనిసరి విషయం కాదన్నమాట' అని తెలిసిపోతుంది. మార్క్సు కన్నా వెనకటి ఆర్థిక వేత్తలే కాదు, మార్క్సు తర్వాత ఆర్థిక వేత్తలు కూడా విలువ అసహజత్వాన్ని గ్రహించరు. సరుకుల తయారీనీ, అమ్మకాల్నీ, ఎప్పుడూ ఉండవలసిన, ఉండక తప్పని విషయాలు గానే భావిస్తారు."

**29. విలువా, డబ్బూ, సహజ విషయాలు కావు- అని తెలుస్తున్నాయి. అయితే, అలాంటి వాటితో అవసరం, సమాజానికి ఎందుకు ఏర్పడింది? అది ఎందుకు నిలబడి ఉంది?**

**జ:** 'మారకాల' వల్లే. మారకాలు ప్రారంభంలో సమాజానికి అవసరమే. కానీ, అది శాశ్వితమైన అవసరం కాదు. మారకాలు లేకుండానే మానవ సంబంధాలు సాగే విధానం భవిష్యత్తులో ఏర్పర్చుకోవచ్చు. కుట్టు శ్రమని తీసెయ్యలేం గానీ, దాన్ని విలువగా లెక్క కట్టడాన్ని తీసెయ్యగలం. అది ఎలా జరగాలో ఇక్కడే చెప్పుకోలేము. ఇంత వరకూ, వస్తువూ, సరుకూ, శ్రమా, విలువా, డబ్బూ, వంటి ప్రారంభ విషయాలే చూశాం. ఇవన్నీ మొదట తెలిసి ఉండాలి. ఇక తర్వాత, 'శ్రమ సంబంధాల' విషయాలు చూసుకుంటూ వెళ్ళాలి. ★

# 8. శ్రమల విలువలు, తేడాగా ఉంటాయి!

**30. శ్రమల గురించి అనేక సందేహాలు కలుగుతున్నాయి. శ్రమలు, ఎన్ని రకాల తేడాలతో ఉంటాయి?**

**జ:** తేడాలు, ప్రధానంగా 3 రకాలు.

(1) ఉత్పత్తుల్ని తయారుచేసేవీ, ఉత్పత్తుల్ని తయారు చెయ్యనివీ. - ఇది, శ్రమల్లో ఒక రకం తేడా. నేతా, కుట్టూ లాంటి శ్రమల వల్ల వస్తువులు తయారైతే, ఆ శ్రమలు ఆగిపోయాకే ఆ వస్తువుల్ని వాడతాం. బండి తోలడం, వైద్యం చెయ్యడం, క్షవరం చెయ్యడం- లాంటి శ్రమలు వస్తువుల్ని తయారు చెయ్యవు. ఈ రకం శ్రమల్ని, ఆ శ్రమలు జరుగుతూ ఉండగానే వాడతాం.

(2) శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ - ఇది ఇంకో రకం తేడా.

(3) ఉత్పాదక శ్రమలూ. - అనుత్పాదక శ్రమలూ. ఇది, ప్రధానంగా, పెట్టుబడిదారీ సమాజానికే వర్తిస్తుంది. ఈ మూడో విషయాన్ని ఇంకో చోట కొంచెం చూస్తాం.

**31. ఏ శ్రమకైనా విలువ ఒకే రకంగా ఉంటుందా? ఏమైనా తేడాలుంటాయా?**

**జ:** ఇది మంచి ప్రశ్న. శ్రమల విలువలు ఒకే రకంగా ఉండవు, తేడాగానే ఉంటాయి. ఆ తేడా, వస్తువుల్ని చేసే శ్రమలా, చెయ్యని శ్రమలా - అనే దాన్ని బట్టి కాదు. ఉత్పాదక - అనుత్పాదక తేడాల్ని బట్టి కూడా కాదు. శారీరక శ్రమలా,

మేధా శ్రమలా - అనే దాన్ని బట్టే, విలువల్లో తేడా ఉంటుంది. శారీరక శ్రమల విలువల కన్నా, మేధాశ్రమల విలువలు ఎక్కువగా ఉంటాయి. 1 గంట సేపు గడ్డి కోసే శ్రమ విలువ కన్నా, 1 గంట సేపు చదువు చెప్పే శ్రమ విలువ కొంత ఎక్కువగా ఉంటుంది. వైద్యం శ్రమ విలువ, ఇంకా కొంత ఎక్కువగా ఉంటుంది.

**32.** **శ్రమల విలువల్లో ఎక్కువ తక్కువలు అన్యాయం కాదా? ఆ 3 రకాలూ ఒక్కొక్క గంట శ్రమలే కదా?**

**జ:** అన్యాయం కాదు. 'విలువ సూత్రం' ప్రకారం, ఆ తేడాలకు సరైన కారణం ఉంది. ఒక శ్రమ చెయ్యాలంటే, అది చేతనవడానికి అవసరమయ్యే ఖర్చుల్ని బట్టీ, కాలాన్ని బట్టీ, ఆ మనిషి చెయ్యవలసిన కృషిని బట్టీ, ఆ శ్రమ విలువ ఉంటుంది. గడ్డి కోసే శ్రమ చేతనవ్వాలంటే, 2, 3 పనిముట్లని వాడుతూ (ఒక కొడవలీ, ఒక గంపా చాలు). 1, 2 రోజుల్లో ఆ పని నేర్చుకోవచ్చు. అదే, చదువు చెప్పే శ్రమ చేతనవ్వాలంటే, 1, 2 సంవత్సరాలైనా చాలవు. వైద్యం శ్రమ కోసం అయితే, ఇంకా ఎక్కువ కాలం పడుతుంది. ఒక పని చేతనవడానికి పట్టే ఖర్చుల్ని బట్టీ, కాలాన్ని బట్టే కదా, దానికి విలువ ఏర్పడేది? అన్ని శ్రమలకూ ఒకే విలువ ఉంటే, ఎక్కువ కాలాన్ని ఖర్చు పెట్టవలసిన శ్రమలు ఎలా తయారవుతాయి? ఈ శ్రమలన్నిటిలోనూ, కింది స్థాయీ, మధ్య స్థాయీ, పైస్థాయీ, ఉంటాయి. కొన్ని శ్రమల్ని నేర్చుకోవడానికి అయ్యే ఖర్చులూ, కాలాలూ, చాలా తక్కువ అయితే, అది కింది స్థాయి. బాగా ఎక్కువ అయితే పైస్థాయీ, మధ్య రకం అయితే మధ్య స్థాయీ. ఆ స్థాయిల్ని బట్టి, శ్రమలకు ఉండే విలువలు ఎక్కువ తక్కువలుగా ఉంటాయి.

**33.** **శ్రమల విలువలు తేడాగా ఉండేటట్టయితే, ఒక శారీరక శ్రమ మనిషినీ, ఒక మేధాశ్రమ మనిషినీ తీసుకుంటే, ఇద్దరూ రోజుకి ఒకే కాలం ప్రకారం పని చేసినా, ఒకరి ఆదాయం తక్కువ గానూ, ఇంకొకరి ఆదాయం ఎక్కువ గానూ, ఉండవూ? అయితే వాళ్ళు సమానం అయ్యేది ఎప్పటికీ సాధ్యం కాదు కదా?**

**జ:** ఎంత సరిగా అర్థం చేసుకున్నారు! ఒక మనిషి ఎప్పుడూ ఒక శారీరక శ్రమే చెయ్యడం, ఇంకో మనిషి ఎప్పుడూ ఒక మేధాశ్రమే చెయ్యడం - ఈ పద్ధతిని 'శ్రమ విభజన' అందాం. ఇలా ఉన్న శ్రమ విభజన, ఇలాగే ఉండిపోతే, దాని వల్ల సమానత్వం ఎప్పటికీ రాదు. కానీ, ఈ శ్రమ విభజనని ఇంకో రకంగా మారిస్తే, సమానత్వం వీలవుతుంది.

"ఏ రకంగా మారిస్తే?"

"ఇక్కడ చిన్న ఉదాహరణతోనే చూద్దాం. ఒక మనిషి, ఒక శారీరక శ్రమా, ఒక మేధాశ్రమా కూడా చేస్తాడు. ఇంకో మనిషి కూడా అలాగే చేస్తాడు. అప్పుడేమవుతుంది? ఇద్దరి శ్రమల విలువలూ ఒకేరకంగా ఉంటాయి. సమాజానికి అవసరమైన 2 రకాల శ్రమలూ జరుగుతాయి. అప్పుడు ఇద్దరి పరిస్థితులూ సమానంగా మారవా? ఇద్దరి వల్లా రెండు రకాల శ్రమలూ జరుగుతాయి. దీన్ని గురించి 'కాపిటల్'లో చాలా చూస్తాం."

"చెప్పుకోడానికి బాగానే ఉంది గానీ, అలా మార్చడం సాధ్యం అవుతుందా అసలు? అందరూ శారీరక శ్రమలు చెయ్యాలంటే చెయ్యగలరు గానీ, అందరూ మేధాశ్రమలు చెయ్యగలరా?"

"చిన్నతనం నించీ నేర్పితే ఎందుకు చెయ్యలేరు? ఇప్పుడు ఒక డాక్టరుగా ఉన్న మనిషిని, చిన్నతనం నించీ గడ్డికోసే పనిలో పడేస్తే, చదువే లేకపోతే, అతను డాక్టరు అవుతాడా? ఇప్పుడు గడ్డి కోసే మనిషికి, చిన్నతనం నించీ చదువూ సంధ్యా ఉంటే, డాక్టరు అవలేడా? అసలు ఈ విషయాలన్నీ ఇప్పుడు వద్దు. వీటిని తర్వాత ఎలాగూ చూస్తాం. ఇక్కడ చెప్పుకోవలిసింది ఏమిటంటే, 'అన్ని శ్రమల విలువలూ ఒకే రకంగా ఉండవు; ఎక్కువ తక్కువలుగా ఉంటాయి. అది సరైనదే' అనే సంగతి చెప్పుకుంటే ఇక్కడ చాలు. ఇక్కడి నించీ మనం 'శ్రమ సంబంధాల్ని' చూసుకుంటూ వెళ్ళాలి."★

# 9. ప్రకృతికి సైన్సు ఉన్నట్టే, సమాజానికీ సైన్సు ఉంది!

**34. 'శ్రమ సంబంధాల్ని' చూశాం కదా? మారకాల వల్ల శ్రమ సంబంధాలు ఏర్పడతాయి. అది చూశాంగా? ఇంకా ఏమిటి?**

**జ:** అయ్యో, ఇప్పటికి మనం, 'అ ఆ'లు దాటాం, అంతే. అసలు, ప్రారంభం ఇప్పుడే. మనుషులు శ్రమలు చెయ్యడం ప్రారంభించిన ఆదిమ కాలంలో, వాళ్ళ సంబంధాలు, సమానం గానే, న్యాయంగానే, ఉండేవి అనుకోవాలి. కానీ, క్రమంగా అవి అసమానంగా, అన్యాయంగా తయారయ్యాయి. ఇక్కడి నించీ ఆ విషయాలే చూడాలి.

"అసమానంగా, అన్యాయంగా, అంటే?"

"సమాజంలో ఉన్న మొత్తం జనంలో, చాలా మంది జనం, శ్రమలు చేస్తూనే ఉన్నారనీ; కానీ కొందరు మాత్రం శ్రమలు చెయ్యడం మానేశారనీ, అనుకుందాం. అప్పుడు, అన్యాయం ప్రారంభమవుతుందా, అవదా? అది, అసమానత్వం అవుతుందా, అవదా?"

"శ్రమలు మానేసిన వాళ్ళకి కూడా ఉత్పత్తులు కావాలి కదా? శ్రమలు చేసుకోకపోతే, వాళ్ళకి అవి ఎలా వస్తాయి? ఉత్పత్తులు లేకపోతే, ఎలా బతుకుతారు?"

"శ్రమలు చేసే వాళ్ళ దగ్గిర ఉత్పత్తులు ఉండవా? వాటిల్లో నించే తీసుకుంటారు."

"వాటికి బదులుగా ఏం ఇస్తారు?"

"తిరిగి ఏదైనా ఇస్తే, అందులో 'అన్యాయం' ఏముంటుంది? అసలు, తిరిగి ఇవ్వాలంటే, శ్రమలు మానేసిన వాళ్ళ దగ్గిర ఏం ఉత్పత్తులు ఉంటాయి? ఏమీ

ఇవ్వకుండానే, ఆ శ్రమలు మానేసిన వాళ్ళు, శ్రమలు చేసే వాళ్ళ ఉత్పత్తులనే తీసి వాడేస్తూ ఉంటారు. సుఖంగా బతుకుతారు.''

''అదేవిటి? దానికి, ఉత్పత్తులు చేసే వాళ్ళు ఎందుకు ఒప్పుకుంటారు?''

''అలా తీసుకోవడానికి తమకి హక్కులు ఉన్నాయని, తీసుకునే వాళ్ళు చెపుతారు; చేసే వాళ్ళు నమ్ముతారు. అసలు జరుగుతోందేమిటో శ్రమలు చేసే వాళ్ళకి అర్థం కాదు.''

''శ్రమలు మానేసిన వాళ్ళకైనా అర్థమవుతుందా అది?''

''ప్రారంభంలో వాళ్ళకీ అర్థం కాలేదు. ఎవరికి అర్థమయ్యిందైనా, అసలు జరుగుతున్న దేమిటో మార్క్సు రాసిన తర్వాతే!''

''మార్క్సు కెలా అర్థమైంది? ఆయనెలా రాయగలిగాడు?''

''అది తర్వాత చెప్పుకుందాం. ఒక సంగతి జరుగుతూ ఉంటే, దాన్ని ఎవరో ఒకరు, ఎప్పుడో అప్పుడు, కనిపెడతారు కదా? దీన్ని మార్క్సు కనిపెట్టాడు. శ్రమలు మానేసిన వాళ్ళు, శ్రమలు చేసే వాళ్ళు తయారు చేసే ఉత్పత్తుల్నే వాడుతున్నారని మార్క్సు 'కాపిటల్' రాస్తేనే తెలిసింది ప్రపంచానికి.''

''ఇదసలు నమ్మదగ్గదిగా ఉందా?''

''లేదు కదా? అందుకే మరి, ఇది కొత్త జ్ఞానం! కొత్త సైన్సు! దీన్ని కొత్తగా నేర్చుకోవాలి. 'అర్థిక శాస్త్రం' అంటే, అసలు తెలుసుకోవలిసింది ఇదే. ఇది తెలుసుకుంటేనే మనుషుల మధ్య శ్రమ సంబంధాలు ఎలా ఉంటున్నాయో, మానవ సమాజం ఎలా మారుతూ వస్తోందో, తెలుస్తుంది.''

''మార్క్సు రాయక ముందు, మానవ సమాజం ఎలా ఉందని అందరూ అనుకుంటున్నారు?''

''అద్భుతంగా ఉందని అనుకుంటున్నారు. మనుషుల్లో యజమానులూ - శ్రామికులూ ఉండవలసిందే అనుకుంటున్నారు. కలిమీ - లేమీ సహజ విషయాలే అనుకుంటున్నారు. అలాంటి సమాజం మీదకి పిడుగులా వచ్చిపడింది, 'కాపిటల్' పుస్తకం. 'కాపిటల్' అంటే, 'పెట్టుబడి'. పెట్టుబడిని సమర్థించే పుస్తకం కాదు అది. 'పెట్టుబడి' అనేది ఎంత చెత్త విషయమో చెప్పే పుస్తకం అది. 'పెట్టుబడి' లక్ష్యం ఏమిటో, అది క్రమంగా ఎలాంటి దశల్లోకి మారుతుందో చెప్పే పుస్తకం అది. పెట్టుబడిదారీ విధానంతో మొదలుపెట్టి, దానికి వెనకా, తర్వాతా సాగే శ్రమ సంబంధాల రకాల్నీ, స్వభావాల్నీ, చెపుతుంది ఆ పుస్తకం. అది వచ్చిన కొత్తలో దాన్ని అర్థం చేసుకున్న వాళ్ళు, నూటికి ఒక్కరు కాదు, కోటికి ఒక్కరేమో!''

''ఎందుకూ? అలా రాశాడా? తేలిగ్గా రాయలేదా?''

''రాయడం చక్కగానే రాశాడు. చెప్పవలసినవన్నీ చెప్పాడు. చెప్పకుండా వదిలిపెట్టిందేదీ లేదు. కానీ, ఆ పుస్తకంలో ఉన్నదంతా, సమాజం గురించి చెప్పిన సైన్సు. దాన్ని ఇంకా తేలిగ్గా కూడా రాయవచ్చు. మళ్ళీ మళ్ళీ రాస్తే తేలిక అయ్యేదే. కానీ

దాన్ని తేలిక చెయ్యడానికి మార్క్సుకి టైమే లేదు. ఆర్థిక విషయాలకూ, తత్వ సిద్ధాంతాలకూ సంబంధించి, తన కన్నా పూర్వం వచ్చిన కొన్ని వందల రచనలు చదివి, వాటి గురించి, విమర్శనాత్మక వ్యాఖ్యలు రాసుకోవడానికే దాదాపు పాతికేళ్ళు పట్టింది. తను గ్రహించిన అవగాహనతో, 'కాపిటల్' పుస్తకం రాయడం మొదలు పెట్టాడు. అప్పటికి ఆయన అనేక సమస్యల్లో, అనారోగ్యాల్లో ఉన్నాడు. ఆ పుస్తకం భాగాలన్నిటినీ రాసేశాడు గానీ, వాటిని అచ్చుకి పంపేటంతగా సిద్ధం చెయ్యకుండానే మరణించాడు 64 ఏళ్ళకే. ఆ భాగాలన్నిటినీ ఎంగెల్సే అచ్చులోకి తీసుకు వచ్చాడు. మార్క్సు రాసి సిద్ధంగా ఉంచిన దాన్నంతా, జాగ్రత్తగా చదివి దాన్ని నేర్చుకునే పని మనం చేసుకోవాలి. ఈ సైన్సు నేర్చుకోవడం ఇప్పుడు చాలా తేలికే. ఏమీ కష్టం కాదు. అయినా, 'సైన్సు' అనేదాన్ని, ఒక వరసలో, ఒక తర్కంతో నేర్చుకోవాలి. అదే కష్టం కొందరికి."

"మార్క్సు -సైన్సు, ప్రకృతి గురించి ఏం చెపుతుంది? దేవుడు ఉన్నాడని చెపుతుందా, లేడని చెపుతుందా?"

"ప్రకృతి గురించి చెప్పడానికి, మార్క్సు చెప్పింది, ప్రకృతి సైన్సు కాదు; ఇది సమాజం గురించి చెప్పే సైన్సు. అయినా ప్రకృతి గురించి కూడా దీనికి ఒక అభిప్రాయం ఉంది. ప్రకృతి సైన్సులన్నీ హేతువాదంతోనే, తర్కం తోనే, ఉంటాయి. ఆ సైన్సుల్లో దేవుడి పాత్ర ఎక్కడా కనపడదు. ప్రకృతి గురించి, 'కాపిటల్' పుస్తకంలో సైన్సు కూడా, ప్రకృతి శాస్త్రాలతోనే ఏకీభవిస్తుంది. ప్రకృతి అనేది, దేవుడి సృష్టి కాదని చెప్పే భౌతిక వాదాన్నే అది అంగీకరిస్తుంది. ప్రకృతికి సైన్సు ఉన్నట్టే, సమాజానికి కూడా సైన్సు ఉంది. ప్రకృతిని సైన్సు దృష్టితో చూడాలన్నట్టే సమాజాన్ని కూడా సైన్సు దృష్టితోనే చూడాలి. సమాజంలో ఏం కనపడుతోందో, అదే సరైందని నమ్మక్కర్లేదు. అందులో సరైనవీ ఉండొచ్చు, సరికానివీ ఉండొచ్చు. ప్రతీ దాన్నీ పరిశీలించి చూడాలి."

**35.** **శ్రమల విలువల్లో తేడాలుండడం సరైనదే - అనిపిస్తోంది గానీ, 'అలా ఉంటే ఎలాగ?' అని మళ్ళీ అనిపిస్తోంది.**

**జ:** అది, మంచి స్పందన. శ్రమల విలువల్లో తేడాలు ఉండడం, హేతుబద్ధమైనదే అయినా, ఆ తేడాల్ని కొంత వరకూ సరిచేసుకోవచ్చు. ఇప్పుడు అమలులో ఉన్న సమాజంలో అయితే, అది జరగదు. శ్రమల విలువల్లో ఇప్పుడు ఉన్న తేడాలు, న్యాయంగానే ఉన్నాయా, అన్యాయంగా ఉన్నాయా అనేది, సమాజంలో ఉన్న శ్రమ సంబంధాల స్వభావాన్ని బట్టి ఉంటుంది.

"శ్రమ సంబంధాల స్వభావం - అంటే?"

"ఆ సంబంధాల్లో శ్రమ దోపిడీ ఉందా, లేదా - అనే దాన్ని బట్టి అది ఉంటుంది. అసలు మనం ఇప్పటి దాకా శ్రమ దోపిడీ సంగతి మొదలే పెట్టలేదు. శ్రమ దోపిడీ ఉంటే, అది ఒక రకం స్వభావం. శ్రమ దోపిడీ లేకపోతే, అది ఇంకో రకం స్వభావం. ఈ విషయాలన్నీ ఈ జవాబులోనే చూడలేము." ★

# 10. బానిసల పోరాట శక్తి, వేతన బానిసలకు లేదా?

**36. 'శ్రమ దోపిడీ' గురించే అన్నిటి కన్నా ముందు చూడాలా? అయితే దాన్ని చూడా లంటే, ఎక్కడ ప్రారంభించాలి?**

**జ:** మనుషులు జీవించాలంటే, ఉత్పత్తులు కావాలి కదా? ఉత్పత్తులు కావాలంటే, శ్రమలు చెయ్యాలి కదా? కాబట్టి, ఉత్పత్తులు చెయ్యడం దగ్గిర్నించీ ప్రారంభిం చాలి. ఏ ఉత్పత్తి అయినా, ఏ యే అంశాలతో తయారవుతుంది? దాన్ని మారకం చెయ్యాలంటే (అమ్మాలంటే), దానికి విలువ, ఏ యే అంశాల నించి చేరుతుంది? - ఇలాంటి విషయాల్ని తర్కిస్తూ ప్రారంభిస్తూ వెళ్ళాలి. కొంత దూరం వెళ్తే, 'శ్రమ దోపిడీ' కనపడుతుంది. ఆ తర్వాత ఇంకా ఏం చూడాలో అది ఆ తర్వాత.

**37. ఒక ఉత్పత్తి, తయారవ్వాలంటే, ఏ యే అంశాలు కావాలో తెలుసు గానీ, అయినా ఇప్పుడు మళ్ళీ ఒక సారి గుర్తు చేసుకోవాలి. ఏం కావాలి?**

**జ:** (1) ఉత్పత్తి సాధనాలూ, (2) కొత్త శ్రమా. ఈ రెండూ ఉంటే చాలు, ఇంకేమీ అక్కర లేదు. వాటితో కొత్త ఉత్పత్తి తయారవుతుంది. ఆ 2 అంశాల్లో ఏది లేక పోయినా ఉత్పత్తి ఉండదు. పని చేసే మనుషులు ఉండి, ఉత్పత్తి సాధనాలు లేక పోతే? చొక్కాని తయారు చెయ్యాలంటే, బట్ట లేకపోతే? బట్ట ఉన్నా, సూది లేకపోతే? సూది ఉన్నా దారం లేకపోతే? కత్తెర లేకపోతే? సరే, ఉత్పత్తి సాధనాలన్నీ ఉన్నాయి. కానీ, అక్కడ పని చేసే మనిషి లేకపోతే? - ఉత్పత్తి కావాలంటే, సాధనాలూ, శ్రమా, ఈ 2 అంశాలూ అత్యవసరం. ఆ రెండే అవసరం. అవి తప్ప, ఇంకేదీ అవసరంలేదు.

**38. 'ఉత్పత్తి సాధనాల్లో' ఏ యే రకాలు ఉంటాయి?**

**జ:** (1) ముడి పదార్థాలూ, (2) పనిముట్లూ, (3) ఆ 2 రకాలూ కాని సహాయక పదార్థాలూ. - ఈ 3 రకాలూ కలిసే ఉత్పత్తి సాధనాలు.

**39. వ్యవసాయం పనులు జరగాలంటే, 'భూమి' కావాలి కదా? అది, 'ఉత్పత్తి సాధనం' అవుతుందా? ఉత్పత్తి సాధనాల్లో అది ఏ అంశం కిందకి వస్తుంది?**

**జ:** భూమి, వ్యవసాయం పనుల్లోనే కాదు, ఏ పని జరగడానికైనా, అది ఒక సాధ నమే. 'ఇల్లు' కట్టాలంటే, దానికి కావలసిన సాధనాల్లో, భూమి కూడా ఒకటి. అది, 'ముడి పదార్థం' అవదు; 'సహాయక పదార్థం' అవదు; 'పని ముట్టే' అవుతుంది. అయితే, నాగలీ, కత్తెరా, మగ్గం - వంటి శ్రమలతో తయారైన పనిముట్లయితే, కొంత కాలానికి పాతబడి పనికి రాకుండా పోతాయి. కానీ భూమి అలా కాదు. అది, శ్రమతో తయారైంది కాదు కాబట్టి, అది పనికి రాకుండా పోవడం జరగదు. అది, ఉచితంగా దొరికే పనిముట్టు. లేదా, సాధనం. కొన్ని పనులు జరగడానికి (ఉదా: వ్యవసాయం, గనుల తవ్వకం, చేపలు పట్టడం, వేటా - వంటి పనుల్లో), ముడి పదార్థాలు అక్కర

లేదు. అలాగే, కొన్ని పనుల్లో సహాయక పదార్థాలు అక్కరలేదు. కానీ ప్రతీ పనిలోనూ పనిముట్లు మాత్రం ఉండి తీరాలి - కొత్త వస్తువు తయారయ్యేటప్పటికి ఉత్పత్తి సాధనాలు పూర్తిగా గానీ, వాటిలో కొంత భాగాలు గానీ, ఖర్చయి పోతాయి. మళ్ళీ కొత్త వస్తువు తయారవ్వాలంటే, మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలూ, కొత్త శ్రమలూ, కావాలి. ప్రతీ రోజూ జరిగేది అదే.

"ఈ విషయాలన్నీ మనకు నిత్యజీవితంలో తెలిసేవే కదా? వీటి గురించి ఇంత చెప్పుకోవాలా?"

"ఇవన్నీ మనకి తెలిసేవేనా? ఇందులో ఒక్క సంగతి కూడా మనకి తెలిసింది కాదు. ఆకాశాన్ని రోజూ చూస్తాం. సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ చూస్తూనే ఉంటాం. కానీ, వాటి గురించి నిజాలేం తెలుసు? ఒక్క నిజం కూడా రోజూ చూసినా తెలీదు. అలాగే ఇవి కూడా. వస్తువులు తయారవడం రోజూ చూస్తున్నాం. రక రకాల పనులు చేస్తున్నాం, చూస్తున్నాం. కానీ, వీటిలో ఎన్ని రహస్యాలు ఉన్నాయో, కేవలం రోజూ చూడడం వల్లే మనకేం తెలుస్తుంది?"

"అవును, నిజమే. అందుకే బోలెడు సందేహాలు వస్తున్నట్టున్నాయి."

**40.** శ్రమలు చెయ్యని మనుషులు, శ్రమలు చేసే మనుషులు తయారు చేసే ఉత్పత్తుల **తోనే బతుకుతారు - అన్నారు. నిజంగా అలా జరిగితే, అది 'దొంగతనం' అవదూ?**

**జ:** "అవదూ?" అని, అంత నాజూకు సందేహం ఏమిటి? అది ఖచ్చితంగా దొంగ తనమే. అయితే ఇది, ఇతరుల దగ్గిర సిద్ధంగా ఉన్న డబ్బుని రహస్యంగా దొంగిలించడం లాగ జరగదు. ఇది, ఇతరుల 'శ్రమ'ని దొంగిలించడం. ఇది, బహి రంగం గానే జరుగుతుంది. ఒక హక్కు లాగ జరుగుతుంది. అయినా ఇది, దొంగతనం లాగ కనపడదు. ఈ దొంగతనం పేరు, 'శ్రమ దోపిడీ.'

**41. ఈ శ్రమ దోపిడీ, మానవుల మధ్య ఎప్పుడు ప్రారంభమైంది? ఎలా ప్రారంభమైంది?**

**జ:** వేల సంవత్సరాల కిందటే, మానవులనే వాళ్ళు ఎక్కడ ఉంటే అక్కడ ప్రారంభ మైంది. ఎక్కువ తక్కువ స్థాయిల్లో. ఎలా ప్రారంభమైందంటే, దీనికి చరిత్రకారు లందరూ చెప్పిన జవాబు ఒక్క రకం గానే ఉంటుంది. మానవులు, శ్రమలు నేర్చు కుంటూ ఉన్న ప్రారంభ దశల్లో, వేరు వేరు తెగలుగా, దూర దూరాల్లో నివసిస్తూ ఉండేవారు. పళ్ళ చెట్లూ, నీళ్ళ మడుగులూ, వేట కోసం జంతువులూ ఉన్న ప్రాంతాల కోసం, తెగల మధ్య పోట్లాటలు జరుగుతూ ఉండేవి. అప్పుడు ఇంకా శ్రమ దోపిడీ లేదు. ఆ తెగల మానవులు, జంతువుల్లాగే ప్రకృతి వనరుల కోసం పోట్లాడుకునే వారు. గెలిచిన తెగ వాళ్ళు, ఓడిన తెగ వాళ్ళని చంపెయ్యడం గానీ, లేదా, పనులు చెయ్యడానికి తమ దగ్గిర బంధించి పెట్టుకోవడం గానీ, ప్రారంభ మైంది. మొట్ట మొదట బానిసత్వం ఆ రకం గానే ప్రారంభమైనట్టు చరిత్ర కారులు చెపుతున్నారు. తెగల శతృత్వాల వల్ల, కొందరు మనుషులు 'బానిసలు'గా అయ్యా

రంటే, వారికి 'యజమానులు' ఉన్నారని అర్థమే కదా? ఆ చరిత్ర వివరాలు మనకు ఇంత కన్నా తెలియకపోయినా, బానిసత్వం ప్రారంభమైందంటే, బానిసలు ఉన్నా రంటే, బానిసలు శ్రమలు చేస్తూ ఉంటే యజమానులు శ్రమలు తగ్గించేస్తారనీ, క్రమంగా మానేస్తారనీ, ఊహించవచ్చు. శ్రమలు మానేసిన యజమానులు, ఎలా బతుకుతారు? బానిసల శ్రమలతో తయారైన ఉత్పత్తుల్ని వాడుతూ బతకవలిసిందే. పైగా, బానిసలకు అతి తక్కువగా వదిలి, అతి ఎక్కువ ఉత్పత్తుల్ని యజమానులే సౌఖ్యంగా వాడుతారు. ఆ రకంగా, శ్రమ దోపిడీ, వేల సంవత్సరాల నాడే బానిసత్వం ద్వారా ప్రారంభమైంది.

"అది ఎప్పుడు పోయింది?"

"అయ్యో, ఎక్కడ పోయింది? ప్రారంభమైన నాటి నించీ, ఇంకా ఈ నాటికీ, భూమి మీద అన్ని దేశాల్లోనూ, శ్రమలు చేసే వాళ్ళ శ్రమల తోనే, శ్రమలు చెయ్యని వాళ్ళు బతుకుతున్నారు! శ్రమ దోపిడీ ఇంకా సాగుతూనే ఉంది. శ్రమ దోపిడీ వల్లనే, యజమానులు ధనికులై, శ్రమలు పోగొట్టుకునే వాళ్ళు పేదలయ్యారు. కలిమీ - లేమీ, శ్రమ దోపిడీ ఫలితాలే. అసలు మానవ సంబంధాల్లో శ్రమ దోపిడీ, బానిసత్వంతో ప్రారంభమై ఈ నాటికీ ఇంకా సాగుతోనే ఉందని మార్క్సు గ్రహించి చెప్పే దాకా, ఆ సంగతి ప్రపంచానికి తెలీనే తెలీదు."

"మార్క్సుకి మాత్రం ఎలా తెలిసింది?"

"మార్క్సు కన్నా ముందే అనేక మంది మేధావులు, సమాజంలో కనపడే సమస్యల గురించి ఆలోచించి రాసిన వాళ్ళు ఉన్నారు. ముఖ్యంగా, సమాజంలో ధనికులూ - పేదలూ ఉండడం వాళ్ళు చూశారు. పేదలు అనేక బాధల్లో ఉండడం చూశారు. అందుకే, 'కలిమి లేములు అంటే ఏమిటి? ధనం అంటే ఏమిటి? విలువ అంటే ఏమిటి? వస్తువుకి విలువ దేని ద్వారా ఏర్పడుతుంది? మనుషులందరూ సుఖంగా బతకడం ఎలాగ?' అని ఇలాంటి విషయాల మీద, అరిస్టాటిల్ దగ్గిర్నించీ, రికార్డో వరకూ, 2 వేల సంవత్సరాల పాటు, ఎవరికి తోచింది వాళ్ళు చెప్పారు. రికార్డో మాత్రమే 'వస్తువుకి విలువ ఏర్పడేది, శ్రమ వల్లనే' అని చెప్పగలిగాడు. కానీ, అతని గ్రహింపు కూడా అక్కడే ఆగిపోయింది. 'వస్తువుకి విలువ ఏర్పడేది శ్రమ వల్లనే' అని గ్రహించిన తర్వాత, శ్రమ దోపిడీని కూడా గ్రహించవచ్చు. కానీ అతని తర్కం, అలా సాగలేదు. ఎందుకంటే, అతను పెట్టుబడిదారీ దృష్టి నించి బైటపడలేదు. అంటే, 'పెట్టుబడికి లాభం రావద్దా?' అని, 'లాభాన్ని' న్యాయమైన విషయంలాగ భావించాడు. అందుకే శ్రమ దోపిడీని గ్రహించలేకపోయాడు.

రికార్డో తర్వాత మార్క్సు, పాత ఆర్థిక వేత్తల వాదాలన్నిటినీ చదువుతూ రికార్డో దాకా చేరి, 'శ్రమ'కీ; ఆ శ్రమ, విలువగా మారడానికీ సంబంధించిన తర్కం అంతా అర్థం చేసుకుని, 'శ్రమ దోపిడీ'ని కూడా గ్రహించగలిగాడు. ఆ గ్రహింపు, మానవ సంబంధాల్లో అప్పటి వరకూ ఉన్న నమ్మకాలన్నిటినీ తారుమారు చేసింది. తల్ల

కిందులు చేసింది. యజమానీ శ్రామిక సంబంధాల్ని, యజమానుల దోపిడీ కోసం ఏర్పడ్డ సంబంధాలుగా విలువ లెక్కల ద్వారా రుజువు చేసింది. వేల సంవత్సరాల నించీ జరుగుతోన్న అన్యాయం బట్టబయలైంది.''

''భలే చెప్పాడు! మార్క్సు అలా రాశాక అందరూ ఒప్పేసుకున్నారు కదూ? యజమానులందరూ ఒప్పేసుకున్నారా?''

''యజమానులందరూ ఒప్పేసుకుంటే, మీ కందరికీ ఇంకా యజమాని ఎలా ఉన్నాడు?''

''దోపిడీ మీద బతికే వాళ్ళు, 'మీది దోపిడీ' అంటే ఒప్పుకుంటారా? 'అదంతా తప్పు' అంటారు. యజమానుల్ని వదిలేద్దాం. మనం శ్రామికులం కదా? మార్క్సు చెప్పింది మనం ఒప్పుకుంటే చాలు. మీరు ఒప్పుకున్నట్టేనా?''

''ఇక్కడ శ్రామికులం నలుగురం ఉన్నాం. మార్క్సు చెప్పింది ఏమిటో మాకు ఇంకా సరిగా తెలీదు గానీ, మార్క్సుని ఒప్పుకోడానికి ఇప్పటికి తెలిసింది చాలు! శ్రమ దోపిడీ గురించి ఎన్ని విషయాలు తెలుసుకోవాలో అన్నీ చెప్పండి తొందరగా మాకు.''

''చక్కగా మాట్లాడారు. 'కాపిటల్' పుస్తకంలో, మార్క్సు వివరించిన ఆర్థిక శాస్త్రాన్నీ, తత్వశాస్త్రాన్నీ - పరిశీలిస్తే, ఇంత కాలం దాకా నమ్ముతూ వచ్చిన తప్పులన్నీ అర్థమవుతాయి.''

## 42. 'తత్వశాస్త్రం' అంటే?

**జ:** 'తత్వం' అంటే, ఒక స్వభావం. ఒక వాదం, ఒక తర్కం, ఒక సిద్ధాంతం. 'ప్రకృతి' గురించి మనం ఏ అవగాహనతో ఉంటామో, అది మన తత్వం. 'ప్రకృతిని దేవుడే సృష్టించాడు' అంటే, అది ఒక తత్వశాస్త్రం. 'కాదు, ప్రకృతిని ఎవరూ సృష్టించ లేదు. అది భౌతిక పదార్థం' అంటే, అది ఇంకో తత్వశాస్త్రం. అలాగే, సమాజాన్ని అర్థం చేసుకోవడంలో కూడా తేడాలు ఉంటాయి. 'విలువ అసహజమైనది' అని మార్క్సు అంటాడు కదా? 'కాదు, విలువ సహజ లక్షణం' అని ఇతర ఆర్థిక వేత్తలు అంటారు. ఇలాంటి తేడాలతో, ప్రకృతి గురించి గానీ, సమాజం గురించి గానీ, ఎవరి తత్వశాస్త్రం వాళ్ళది. ఒకే విషయం మీద, వేరు వేరుగా 2 తత్వశాస్త్రాలు ఉంటే, రెండూ సరైనవి అవవు. రెండూ తప్పు కావచ్చు. లేదా, ఒకటి రైటూ, ఒకటి తప్పూ, కావచ్చు; రెండూ రైట్లు మాత్రం అవవు. రెండూ రైట్లే అయితే, రెండూ కలిసి ఒకటే అయిపోతాయి. రైట్లు విడి విడిగా ఉండవు. కలిసి పోతాయి.''

''ఒక విషయం గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటూ ఉన్నప్పుడు, ఎవరైనా ఇంకో మేధావి ఆ విషయాన్ని సరిగా పరిశీలించి, అప్పటి దాకా జరుగుతూ ఉన్న తప్పేమిటో చెపుతాడనుకుందాం. అది నిజంగా బాగుంటే, అందరూ దాన్ని ఎందుకు ఒప్పేసుకోరు?''

"అదే మరి, సమాజంలో పెద్ద వింత! ఒకప్పుడు, భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని నమ్ముతూ ఉండేవారు కదా? తర్వాత కాలంలో, జరుగుతున్నది అలా కాదనీ, భూమే సూర్యుడి చుట్టూ తిరుగుతోందనీ, కోపర్నికస్ వంటి ఖగోళ శాస్త్రవేత్తలు చెప్పారు కదా? వాళ్ళు చెప్పిందాంట్లో ఎంత నిజం ఉందో పరిశీలించ లేదు మతం వాళ్ళు. అలా చెప్పిన వాళ్ళకి మరణ శిక్షలు వేసేశారు కూడా! ఎందుకు? - ఎందుకంటే, ప్రకృతి గురించి ఒక్కొక్క నిజాన్నీ బైటపెడితే, క్రమంగా దేవుడి మీద నమ్మకాలు పోతాయి. అప్పుడు ప్రజలకి దేవుడి గుళ్ళతోటే అవసరం పోతుంది. ఆ గుళ్ళ మీద పెత్తందారులుగా ఏ పనులూ చెయ్యకుండా, ఆ గుళ్ళకి వచ్చే ఆదాయా లతో బతుకుతోన్న మతాల పెద్దలకు సుఖాలన్నీ పోతాయి కదా? అందుకే, వాళ్ళు బోధిస్తూ వస్తోన్న నమ్మకాలకు ఎవరూ ఎదురు చెప్పకూడదు. చెప్తే మరణ శిక్షలే! ఇదంతా, పని చెయ్యకుండా బతకాలనే శ్రమ దోపిడీ వల్ల పుట్టుకొచ్చిన తతంగమే. అబద్ధాల మీద బతుకుతూ ఉన్న వాళ్ళకి, ప్రతి నిజమూ, వ్యతిరేకం అయిపోతూ ఉంటుంది. అబద్ధానికి, నిజం, శతృవు అయిపోతూ ఉంటుంది."

"అయితే, నిజాలు ఎలా బైట పడతాయి?"

"మరణ శిక్షలకైనా జంకని వీరుల వల్ల బైట పడుతూనే ఉన్నాయి. 'ఆర్థిక శాస్త్రం'లో, అతి ప్రధాన విషయాలన్నిటిలోనూ పరస్పర వ్యతిరేక వాదాలు ఉన్నాయి. అందుకే ఈ విషయాల్ని వివరంగా చూడాలంటే, 'కాపిటల్' చదవడమే ఏకైక మంచి మార్గం. మార్క్సు తత్వశాస్త్రం, ప్రకృతి విషయంలో గానీ, సమాజం విషయంలో గానీ, హేతువాదం ప్రకారమే ఉంటుంది."

**43.** **మార్క్సు సిద్ధాంతం, సమాజం గురించి ప్రధానంగా చెప్పేది ఏమిటి?**

**జ:** మనుషుల సంబంధాలు, శ్రమల ద్వారా ఏర్పడే సంబంధాలనీ; ఆ సంబంధాలు, యజమానీ శ్రామిక సంబంధాలుగా ఏర్పడి, అన్యాయంగా, అసహజంగా, ఉన్నాయనీ; యజమానుల ద్వారా శ్రమ దోపిడీ జరుగుతోందనీ; ఆ దోపిడీకి గురవుతోన్న వాళ్ళందరూ యజమానులకు ఎదురు తిరిగి దోపిడీ నించి బైట పడాలనీ; ఆ పోరాటం, మానవ సంబంధాల్లో సమానత్వాన్ని కూడా ఏర్పరుస్తుందనీ - ఇదీ మార్క్సు గ్రహించి చెప్పింది.

"యజమానులతో పోరాడడం ఎలాగ?"

"ఏం, బానిసలు, యజమానులతో పోరాడి బానిసత్వం నించి బైట పడలేదూ? ఆ బానిసలే వేతన బానిసలుగా మారినప్పుడు పోరాడలేరూ? అన్యాయం మీద పోరాటం లేకపోతే, అన్యాయం ఆగుతుందా?"

"మా తలకాయలన్నీ మట్టి ముద్దల్లా ఉన్నాయి ఇప్పుడు. మేం బానిసలుగా ఉన్నప్పుడు ఆ పోరాటాలన్నీ ఎలా చేశామో, ఆ శక్తి ఏమైందో ఇప్పుడు!"

"మేధస్సుల్ని ఉత్సాహంగా తెరవాలి! పాత భావాలన్నిటినీ బైటికి తరమాలి! విప్లవ భావాల్ని వాటిలో నింపాలి!" ★

# 11. యజమానీ శ్రామిక సంబంధాల్లో, ఎవ్వరూ స్వతంత్రులు కారు!

**44.** **వెనకటి నించీ చూస్తే, శ్రమలు చేసే మనుషులు, ఎన్ని రకాల సంబంధాల్లో ఉన్నట్టు?**

**జ:** వెనకటి నించీ ఈ నాటి వరకూ చూస్తే, శ్రమలు చేసే వాళ్ళు, 5 రకాలుగా తేలుతారు.

**(1) శ్రామికులు:** వీళ్ళకి యజమానులు ఉంటారు. అంటే, వీళ్ళు యజమానీ శ్రామిక సంబంధాల్లో ఉంటారు. వీళ్ళు, బానిసలైనా కావచ్చు, జీతాల మీద పని చేసే వేతన శ్రామికులైనా కావచ్చు. వీళ్ళ శ్రమలు, ఉత్పత్తుల్ని చేసేవి అయినా, చెయ్యనివి అయినా; వాటిలో మళ్ళీ శారీరక శ్రమలైనా, మేధాశ్రమలైనా; యజమాని చెప్పే బైటి పనులైనా, యజమాని ఇంటి పనులైనా; అలా ఏ శ్రమలైనా కావచ్చు. వీళ్ళల్లో, టీచర్లూ, డాక్టర్లూ, సైంటిస్టులూ, వంటి వారందరూ కూడా ఉంటారు. అంటే, మేధా శ్రామికుల్లో కూడా అనేక మంది, యజమానీ శ్రామిక సంబంధాల్లోనే ఉంటారు. పురుషుల్లోనే కాదు, స్త్రీలలో కూడా కొంత భాగం, ఈ సంబంధాల్లో ఉంటారు.

**(2) స్వతంత్ర ఉత్పత్తిదారులు:** తమకు యజమానులు లేకుండా, తాము ఎవరి మీదా యజమానులు కాకుండా, ఉత్పత్తులు తయారు చేసి అమ్ముకునే వారిగా, లేదా శ్రమల్ని అమ్ముకునే వారిగా, ఉంటారు వీరు. ఒక కుట్టు మనిషి, ఇతరులకు బట్టలు కట్టిపెడతాడు. క్షవరాల మనిషి, ఇతరులకు క్షవరాలు చేస్తాడు. చేతివృత్తుల వారందరూ ఈ కోవలోకి వస్తారు. ఈ కోవలో స్త్రీలు కూడా ఉంటారు.

**(3) శ్రామికులు గానూ, స్వతంత్ర ఉత్పత్తిదారులు గానూ కూడా ఉండేవారు:** ఒక కుట్టు మనిషి, ఒక యజమాని దగ్గిర పని చేస్తూనే, తన ఇంట్లోనూ ఆ వృత్తి చేసుకోవచ్చు. యజమాని దగ్గిరైతే శ్రామికుడిగా ఉంటాడు. తన ఇంట్లో ఆ పని చేస్తూ స్వతంత్రుడిగా ఉంటాడు. ఈ కోవలో, స్త్రీలు కూడా ఉంటారు.

**(4) రైతులు:** కొంత స్వంత భూమి ఉండి, దాని మీద స్వయంగా శ్రమలు చేసుకునే వారు స్వతంత్ర రైతులు. భూమి లేక, ఇతరుల భూమిని కౌలుకి (అద్దెకు) తీసుకునేవారు, కౌలు రైతులు. ఈ కౌలు రైతులకు, పని స్థలంలో యజమానులు లేకపోయినా, ఇది, యజమానికి కౌలు చెల్లించే సంబంధం. ఇది, యజమానీ శ్రామిక సంబంధమే. రైతు కుటుంబాల్లో స్త్రీలు కూడా వ్యవసాయం పనులు చేసినా, ఆ స్త్రీలు కౌలు రైతులు అవరు. స్వంత భూమిని సాగుచేసుకునే స్త్రీలు, స్వతంత్ర రైతులు అవుతారు.

**(5) స్వంత ఇంటి పనులు చేసుకునే బాధ్యత గల వారు:** ఈ కోవలో స్త్రీలు మాత్రమే ఉంటారు. పురుషులు ఉండే సందర్భాలు అతి తక్కువ.

ప్రభుత్వాఫీసుల్లోనూ, ప్రభుత్వానికే సంబంధించిన కోర్టులూ, జైళ్ళూ, పోలీ

సులూ, సైన్యమూ - ఈ రకపు విభాగాలలోనూ కూడా యజమానీ శ్రామిక సంబంధాలు ఉంటాయి. ఈ సంబంధాల్లో, యజమానుల్ని గాక, శ్రామికుల్ని తీసుకుంటే, వీరిని ఒక ప్రత్యేక రకంగా (6వ రకంగా) చెప్పనక్కరలేదు. "శ్రామికులు" అనే పేరుతో చూసిన 1వ రకంలోకే వీరు కూడా వస్తారు.

అయితే, శ్రమలలో ఉండే 'ఉత్పాదక - అనుత్పాదక' తేడాల్ని మనం ఇంకా వివరంగా చూడలేదు. పోలీసులూ, సైనికులూ, అనుత్పాదక శ్రామికులు అవుతారు. వాళ్ళే కాదు, టీచర్లూ, డాక్టర్లూ వంటి వాళ్ళు కూడా అనుత్పాదక శ్రామికులయ్యే సందర్భాలు ఉన్నాయి. ఈ తేడాల్ని వేరే చోట చూస్తాం. తేడాలు ఎలా ఉన్నా, అన్నీ శ్రమలే. కాబట్టి, మొత్తం సమాజంలో జరిగే శ్రమలన్నీ, 5 రకాల కిందకి వస్తాయి. శ్రమ దోపిడీ అర్థమైతే, ఈ రకాలన్నీ అర్థమవుతాయి.

**45.** **శ్రమలు చెయ్యని మనుషులు ఎన్ని రకాలుగా ఉంటారు?**

**జ:** రెండే రెండు రకాలు! (1) శ్రమలు అసలే చెయ్యని వాళ్ళు.

(2) శ్రమలు కొంచెంగా మాత్రమే చేసే వాళ్ళు.

ఈ 2 రకాల వాళ్ళూ యజమానులే. శ్రమలు అసలే చెయ్యక పోయినా ఎవరికి జరుగుతుంది? - యజమానులకే. శ్రమలు కొంచెంగా మాత్రమే చేసినా, ఎవరికి జరుగుతుంది? - అదీ యజమానులకే. ఈ 2 రకాల యజమానుల దగ్గిరా శ్రామికులు ఉండడం వల్లే వీళ్ళు యజమానులు అవుతారు. వీళ్ళ దగ్గిర, ఉత్పత్తుల్ని తయారుచేసే శ్రమలు గానీ, ఉత్పత్తుల్ని చెయ్యని శ్రమలు గానీ, ఉత్పత్తుల్ని అమ్మే శ్రమలు గానీ, ఇతర రకాలు గానీ, ఆ శ్రమలన్నీ చేసేది వేతన శ్రామికులే.

**46.** **మనుషులు, యజమానులు గానూ - శ్రామికులు గానూ, ఆ తేడాలతో ఎందుకు అయ్యారు? ఎందుకు అవుతారు?**

**జ:** కారణం,'ఉత్పత్తి సాధనాలు' ఉండడం గానీ, లేకపోవడం గానీ. ఉత్పత్తి సాధనాల్లో ప్రధానమైన సాధనం, భూమి. భూమి గానీ, ఇతర సాధనాలు గానీ, అమితంగా ఉన్న వాళ్ళు - యజమానులు. అవి అతి తక్కువే ఉన్న వాళ్ళూ, లేదా అవి ఏ మాత్రమూ లేని వాళ్ళూ - శ్రామికులు. ఉత్పత్తి సాధనాలు లేని వాళ్ళు, ఏ ఉత్పత్తి తయారు చేసుకోవాలన్నా ఎలా చేసుకుంటారు? ఉత్పత్తులు లేకుండా ఎలా బతుకుతారు? వాళ్ళు బతకడానికి మార్గం, ఉత్పత్తి సాధనాలు ఉన్న వాళ్ళ దగ్గిరికి చేరడమే. అందుకే, ఆ సాధనాలు ఉన్న వాళ్ళ దగ్గిరికి వెళ్ళి, 'పని ఇమ్మని' అడుగుతారు. ఆ సాధనాలు ఉన్న వాళ్ళకి కూడా, వాళ్ళు ఏ పనీ చెయ్యకుండా బతకాలంటే, పని వాళ్ళు కావాలి. మనుషులు, యజమానులుగా - బానిసలుగా విడిపోవడం, తెగల కాలంలోనే ప్రారంభమైందని చూశాం. ఆ నాటి నించీ అది అలాగే కొనసాగింది. బానిసల పోరాటాల వల్ల బానిసత్వం పోయినా, ఆ తర్వాత కూడా యజమానీ శ్రామిక సంబంధాలు పోలేదు. మనుషులు, యజమానులూ - శ్రామికులూ అని 2 రకాలుగా ఉన్నారంటే, అందులో ఎవ్వరూ స్వతంత్రులు కారు. పని చేసేవాళ్ళు లేకపోతే, యజమానులు బతకలేరు. ఉత్పత్తి సాధనాలన్నీ యజమానుల ఆధీనంలో ఉంటే,

ఆ యజమానులు లేకుండా శ్రామికులూ బతకలేరు. అంటే యజమానీ శ్రామిక సంబంధాల్లో ఎవ్వరికీ స్వతంత్రంగా జీవించే పరిస్తితి లేదన్న మాట! ఎవ్వరూ స్వతంత్రులు కారన్నమాట! ★

## 12. యజమానుల్లో తేడాలు!

**47. శ్రమలు చేసే వారికి, 'బానిసలు' అనీ, 'కౌలు రైతులు' అనీ, 'స్వతంత్ర రైతులు' అనీ, 'వేతన శ్రామికులు' అనీ, 'స్వతంత్ర ఉత్పత్తిదారులు' అనీ, 'చేతి వృత్తులవారు' అనీ, ఇన్ని రకాల పేర్లూ, తేడాలూ, ఉన్నాయి. యజమానుల్లో కూడా ఈ పేర్లూ, తేడాలూ, ఉన్నాయా?**

**జ:** 'యజమానులు'గా చూస్తే, అందరూ ఒకటే. అందరూ చేసేది, 'శ్రమదోపిడీ'యే. ఆ సంబంధాల్లోనే కొన్ని తేడాలు ఉన్నాయి.

**1. బానిసల యజమానులు:** వీళ్ళ ఆస్తులు 2 రకాలు. (1) ఉత్పత్తి సాధనాలూ, (2) ఉత్పత్తిదారులూ కూడా. భూమి అంతా వీళ్ళదే. బానిసలంతా వీళ్ళ స్వంత ఆస్తే. ఆవులూ గేదెలూ, మనుషుల ఆస్తి అయినట్టు బానిస మనుషులు, యజమాని మనుషుల స్వంత ఆస్తి! ఒక మనిషి, ఇంకో మనిషి ఆస్తి! ఈ యజమానులు, తమ స్వంత శ్రమలు లేకుండా, బానిసల శ్రమల మీదే, సౌఖ్యాలతో, విశ్రాంతులతో, విలాసాలతో, వ్యసనాలతో, బతుకుతారు. బానిసల ద్వారా తయారయ్యే ఉత్పత్తుల్లో ఎక్కువ భాగం, యజమానుల వాడకానికే. ఇక్కడ ఇంకా 'జీతం పద్ధతి' ప్రారంభం కాలేదు. బానిసల కనీస పోషణకి, వాళ్ళ శ్రమలో నించే వాళ్ళకి ఎంత తక్కువ అందుతుందో అదే వాళ్ళకి, 'జీతం లాంటిది.' ఇక్కడ యజమానుల మధ్య, కొన్ని బార్టరు మారకాలూ, డబ్బు పద్ధతి అమ్మకాలూ కూడా ఉంటాయి. ఆ అమ్మకాల పనులు చేసి పెట్టడానికి 'వర్తకులు' అనే వాళ్ళు ఇక్కడ ప్రారంభమవుతారు. వాళ్ళకి 'వర్తక కమిషన్'గా యజమానుల నించి కొన్ని ఉత్పత్తులు వెళ్తూ ఉంటాయి. ఆ 'కమిషన్ల'లో నించి కొంత భాగం, 'వర్తక లాభం'గా, వర్తకులకు ఆదాయంగా అందుతుంది. ఈ వర్తకులు, బానిస యజమానులు ఇచ్చే ఉత్పత్తుల్ని మారకాలు చేసి పెట్టడమో, అమ్మి పెట్టడమో చేస్తారే గానీ, వాళ్ళే పెట్టుబడులు పెట్టి, సరుకుల రాసుల్ని ఉత్పత్తి చేయించే విధానం ఇక్కడ ప్రారంభం కాదు.

బానిస యజమానుల మధ్య అప్పుల పద్ధతీ, అప్పుల మీద వడ్డీలు చెల్లించే పద్ధతీ, ఇక్కడే ప్రారంభం. ఈ మారకాలూ, వర్తకాలూ, అప్పులూ, వడ్డీలూ అన్నీ, బానిస యజమానుల మధ్య జరిగే వ్యవహారాలే. వాటిలో బానిసల పాత్ర ఏమీ ఉండదు. రాత్రింబవళ్ళూ శ్రమలూ, ఆకలీ, రోగాలూ, త్వర త్వరగా మరణాలూ, ఇవే వాళ్ళ వంతు. ఈ సమాజంలో, ఇంకా 'కౌలు' అనేది ప్రారంభం కాలేదు.

'రాజ్యాంగ యంత్రం' అనేది, ఇక్కడే ప్రారంభం! రక్షక భటులూ, కొరడాలూ, కత్తులూ, కఠార్లూ, చెరసాలలూ, ఉరికొయ్యలూ - అన్ని మారణాయుధాలూ ఇక్కడే ప్రారంభం! బానిసలు, అడవుల్లోకి పారిపోకుండా, కుక్కలు పీకినా నోరెత్తకుండా,

వెనక్కి తిరిగి వచ్చి రాత్రింబవళ్ళూ శ్రమలు చేసే లాగ, బానిసల్ని అణిచి ఉంచడానికే యజమానులకు, రాజ్యాంగ యంత్రం తోటీ, పోలీసుల తోటీ, అవసరం! ఆ యంత్రాంగం నడవడానికి అవసరమయ్యే ఖర్చుల్ని, యజమానులు అప్ప గించాలి. ఆ ఉత్పత్తులన్నీ బానిసల శ్రమల వల్ల వచ్చేవే. అంటే, బానిసల్ని అణిచి ఉంచే రాజ్యాంగం, బానిసల శ్రమల తోనే సాగుతుందన్నమాట!

రాజ్యాంగానికి అధిపతి, ఒక 'రాజు!' బానిస యజమానుల్లో నించే ఎవడో ఒకడు, ఎక్కువ భూమీ - ఎక్కువ బానిసలూ కల ఆస్తిపరుడే ఆ రాజు! శ్రమ దోపిడీ సంబంధాలూ, ఆ సమాజపు లక్షణాలూ, అన్నీ, మొదట ఈ బానిస యజమానుల సమాజంలో ప్రారంభమైనవే.

**ఈ సమాజంలో కొత్తగా ప్రారంభమైనవి:** వర్తక కమిషనూ, వర్తక లాభమూ, వడ్డీ, రాజ్యాంగ యంత్రమూ, దేవుడి నమ్మకాలతో మతమూ - అనేవి.

**ఇక్కడ ఇంకా లేనివి:** 'జీతం' లేదు. 'కౌలు' లేదు. 'సరుకు ఉత్పత్తి' లేదు. 'ఉత్పాదక లాభం' లేదు. ఇక్కడ లేనివి, ఎక్కడ ఏర్పడ్డాయో చూసుకుంటూ వెళ్తాం గానీ, యజమానుల్లో తర్వాత రకాన్ని ఇప్పుడు చూస్తాం.

**(2) భూస్వాములు:** బానిస యజమానులకు, బానిసలపై యజమానితనం పోయి (బానిసల పోరాటాల వల్ల), ఆ యజమానులు భూస్వాములుగా మిగిలారు. ఉత్పత్తిదారులపై (బానిసలపై) ఆస్తి హక్కు పోయి, ఉత్పత్తి సాధనంపై (భూమిపై) ఆస్తి హక్కు మిగిలింది. అంటే, బానిస యజమానులే భూస్వాములుగా మారతారు. బానిసలకు బానిసత్వం పోయినా, వాళ్ళకి భూమి ఉండదు కాబట్టి, వాళ్ళు, భూస్వా ముల దగ్గిరే కౌలు రైతులుగా మారి, పూర్వం లాగ ఆ భూముల మీదే పంటలు పండిస్తారు. ఇక మిగిలిన దోపిడీ లక్షణాలన్నీ, బానిస యజమానుల సమాజం నించి దాని పక్కకి పరిగెత్తుకుంటూ వచ్చినవే.

కౌలు రైతులు పండించే పంటల్లో నించి అధిక భాగం, 'కౌలు' పేరుతో, యజ మానులకే (భూస్వాములకే) పోతూ ఉంటుంది. అంటే, 'భూమి కౌలు' అనేది, ఈ సమాజం లోనే ప్రారంభం. రైతులు కనీసంగా తినడానికి ఎంత తక్కువగా అవసరమో అది మాత్రమే వాళ్ళకు మిగిలి, మిగిలేదంతా కౌలుగా పోతుంది. ఏ శ్రమా చెయ్యని యజమానులు, సౌఖ్యాలతో, విలాసాలతో, శ్రామికులు మోసే పల్లకీలలో తిరుగుతూ బతుకుతూ ఉంటే, రాత్రింబవళ్ళూ శ్రమలు చేసే కౌలు రైతులూ, ఇతర చాకిరీల వాళ్ళూ, కడుపులు నిండని బికారి స్థితినే ఈడుస్తూ ఉంటారు.'జీతం' పద్ధతి, ఈ భూస్వాముల సమాజంలో కూడా ఇంకా రాలేదు. కౌలు రైతులు, తమ శ్రమలో నించి కౌళ్ళని చెల్లించగా, వారి కనీస పోషణ కోసం ఎంత మిగులుతుందో అదే వాళ్ళకి 'జీతం' లాంటిది. ఇక్కడ ఉత్పత్తుల మారకాలూ, డబ్బుతో అమ్మకాలూ, ఉంటాయి. భూస్వాములు, తమ అవసరాల కోసం, వర్తకుల ద్వారా మారకాలు చేయించుకున్నట్టే, రైతులు కూడా తమ అవసరాల్ని బట్టి మారకాలు చేయించు కుంటారు. వర్తకులకు కమిషన్లు వదిలి పెట్టడం గానీ, అప్పులు తీసుకుంటే వడ్డీలు చెల్లించడం గానీ, రైతులు, తమ పోషణ ఉత్పత్తులలో నించే చేసుకోవాలి. రాజ్యాంగ

యంత్రమూ, రాజులూ, అన్నీ ఇక్కడ కూడా వెనకటి లాగానే. 'కౌళ్ళు' వసూళ్ళు అయ్యే విధంగా చూడడమే, ఇక్కడ రాజ్యాంగ యంత్రం విధి. బానిస సమాజంలో ఉన్న లక్షణాలన్నీ ఇక్కడా ఉన్నాయి. అక్కడ లేని 'భూమి కౌలు' ఒక్కటే ఇక్కడ ప్రారంభమైంది. **ఇక్కడ కూడా ఇంకా లేనివి:** 'జీతం' లేదు. 'సరుకు ఉత్పత్తి' లేదు. 'ఉత్పాదక లాభం' లేదు.

**(3) పెట్టుబడిదారులు:** భూస్వాములే పెట్టుబడిదారులుగా మారడం కాదు ఇది. భూస్వాములు, భూములన్నీ ఆక్రమించి అలా ఉంటూ ఉండగానే, పాత కాలపు వ్యాపారులే, పెట్టుబడిదారులుగా ఎదిగారు. పాత కాలపు వ్యాపారులు, వెనకటి కాలాల్లో, భూస్వాములూ కౌలు రైతులూ ఇచ్చే ఉత్పత్తుల్ని అమ్మి పెట్టడమే చేసేవారు గానీ, వారే సరుకుల్ని తయారు చేయించే వ్యాపారం ఉండేది కాదు. కానీ వాళ్ళు, పెట్టుబడిదారులుగా ప్రారంభమవడం అంటే, వాళ్ళు సరుకుల్ని తయారు చేయించే పరిశ్రమలు కూడా ప్రారంభించడం. ఆ సరుకులన్నీ అమ్మకాల కోసమే. ఈ దశలోనే శ్రామికులకు 'జీతాల పద్ధతి' ఏర్పడింది. ఈ జీతాల శ్రామికులు ఎలా పోగయ్యారంటే, కౌలు రైతులందరూ జీతాల శ్రామికులుగా మారారని కాదు. ఆ రైతుల కుటుంబాల నించీ, చేతి వృత్తుల వారి కుటుంబాల నించీ, చిన్న స్థాయి వర్తకుల కుటుంబాల నించీ, ఆ రకంగా జీతాల శ్రామికులు పోగుపడి ఉండవచ్చు. జీతాల శ్రామికులకు, 'కార్మికులు' అని, వేరే పేరు మొదలైంది.

ఉత్పత్తుల మధ్య బార్టరు మారకాలూ, డబ్బు అమ్మకాలూ, వెనకటి కాలాల్లో కూడా ఉన్నప్పటికీ, పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తిని వెనకటి కాలాలతో పోల్చ డానికి లేదు. ఇది, వాడుకోగా మిగిలే ఉత్పత్తిని అమ్మడమో, అవసరాల కోసం మార కాలు చేసుకోవడమో, కాదు. పెట్టుబడిదారీ సరుకు అంతా పూర్తిగా అమ్మకాల కోసమే. ఈ విధానం, గత సమాజాలలో లేని అనేక మంచీ - చెడ్డా లక్షణాల్ని తెచ్చి పెడుతుంది. జీతం విధానం ప్రారంభమూ, పని గంటల పరిమితీ, శ్రామిక సంఘాల హక్కూ - వంటివి మంచి లక్షణాలు. రాత్రులు కూడా పనులు చెయ్యవలసిన పద్ధతీ, నిరుద్యోగాలూ, సంక్షోభాలూ - వంటివి చెడ్డ లక్షణాలు. ప్రతీ పెట్టుబడిదారుడూ, తన సరుకునంతా అమ్ముకోవాలి. తన పని స్తలంలోకి కావలసిన కొత్త ఉత్పత్తి సాధనాల్నీ, కుటుంబానికి కావలసిన పోషణ - విలాస ఉత్పత్తుల్నీ, ఇతర పెట్టుబడి దారుల నించీ, భూస్వాముల నించీ, కొనుక్కోవాలి. శ్రామికులు కూడా తమ జీతా లతో, తమ పోషణ ఉత్పత్తులు కొనుక్కోవాలి. పెట్టుబడిదారులు భూస్వాముల్ని మించి పోయిన సౌఖ్యాలతో, విలాసాలతో, బతుకుతూ ఉంటారు.

ఈ పెట్టుబడిదారులు ప్రారంభమైన కాలంలో, అప్పటికి సమాజంలో ఉన్న ప్రధానమైన బృందాలు - భూస్వాములూ, కౌలూ రైతులూ, కదా? కౌలు రైతులు కూడా బీదలే. పెట్టుబడిదారుల దగ్గిర ప్రారంభమైన వేతన శ్రామికులు కూడా, సమా జంలో అడుగు బృందమే. కొత్తగా ప్రారంభమైన పెట్టుబడిదారుల్ని, ఆ కాలంలో, ''మధ్య తరగతి'' అనే వారు. భూస్వాములకూ, నిరుపేదలకూ మధ్యలో ఉన్న తరగతి - అని! అప్పట్లో పెట్టుబడిదారుల బృందం అలాగే ఉండేది.

**(4) పెట్టుబడిదారీ కౌలు రైతులు:** వీళ్ళకి, స్వంత భూములు ఎక్కువగా ఉండ వచ్చు. లేదా, భూస్వాముల నించి భూముల్ని కౌలుకి తీసుకోవచ్చు. కానీ వీళ్ళు శ్రమలు చెయ్యరు. చేసేది, వ్యవసాయ శ్రామికులే. శ్రమలు చెయ్యక పోయినా వీళ్ళకి 'రైతులు' అనే పేరు ఉంటుంది. వీళ్ళు, పెట్టుబడిదారీ రైతులు. అంటే, పెట్టుబడిదారులే. వీళ్ళ వ్యాపారం కూడా వ్యవసాయ సరుకుల అమ్మకాలే. ఈ పెట్టు బడిదారీ కౌలు రైతులు కూడా శ్రామికుల మీద యజమానులే.

ఈ రకంగా, శ్రమలు చెయ్యని యజమానులు, ఇన్ని రకాలుగా ఉంటారు. ప్రతీ రకంలోనూ, చిన్న స్థాయి వాళ్ళూ, పెద్ద స్థాయి వాళ్ళూ, ఉంటారు. ★

## 13. పెట్టుబడిదారుడికి ఆ పేరు ఎందుకు?

**48. పెట్టుబడిదారుడు తయారు చేయించే ఉత్పత్తుల్లో నించి, తన కుటుంబం కోసం కూడా కొంత భాగాన్ని వాడతాడు కదా? అయినా, ఆ ఉత్పత్తి అంతా అమ్మకం కోసమే - అనడం ఏమిటి?**

**జ:** పెట్టుబడిదారుడి కుటుంబం, స్వంతానికి వాడేది అతి స్వల్పం. కొన్ని చోట్ల అదీ ఉండదు. సబ్బుల పెట్టుబడిదారుడు, నెలకి 5 వేల సబ్బులు తయారు చేయిస్తాడనుకుందాం. వాటిలో నించి, తన ఇంటి కోసం నెలకి ఎన్ని సబ్బులు వాడ తాడు? 10 వాడతాడనుకుందాం. 10 తప్ప, 5 వేలనీ అమ్మాల్సిందే కదా? 4,990 సబ్బుల్ని అమ్మెయ్యాలి. ప్రతీ నెలా అలాగే చెయ్యాలి. సిమ్మెంటు పెట్టుబడిదారుడు, నెలకి, 100 టన్నులు తయారు చేయిస్తాడనుకుందాం. ఆ సిమ్మెంటులో నించి తన కుటుంబం కోసం నెలకి ఎంత సిమ్మెంటు వాడతాడు? ఏమీ వాడడు కదా? పోనీ ఎప్పుడైనా ఒక భవనం కట్టించుకుంటే, కొన్ని టన్నులు వాడవచ్చు. కానీ, నెలకో భవనం కట్టిస్తాడా? ప్రతీ నెలా తయారయ్యే టన్నుల టన్నుల సిమ్మెంటుని ఏం చేస్తాడు అమ్మక? కోడిగుడ్ల పరిశ్రమవాడూ, పెట్రోలు పరిశ్రమవాడూ, బట్టల పరి శ్రమవాడూ, ఇంకా ఏ పెట్టుబడిదారుడైనా నెలకి ఎంతెంత ఉత్పత్తిని స్వంతానికి వాడతాడు? రోజూ లక్ష దిన పత్రికలు తయారు చేయించేవాడు, తన స్వంతానికి రోజూ ఎన్ని పత్రికలు వాడతాడు? కాబట్టి, పెట్టుబడిదారుడు తయారు చేయించే సరుకులో నించి స్వంతానికి వాడేదాన్ని లెక్కలోకి తీసుకోకూడదు. అంతా అమ్మకానికే - అని అర్థం చేసుకోవాలి. అంతా అమ్మెయ్యాలి; తనకి కావలసినవన్నీ కొనుక్కోవాలి. సరుకు అంతా అమ్మెయ్యాలంటే, అదే ఇక్కడ కొత్తగా పుట్టుకొచ్చే సమస్య. వెనకటి కాలాల్లో అయితే, కేవలం అమ్మకం కోసమే సరుకుల రాసుల్ని తయారు చేయించే పద్ధతి ఎక్కడా లేదు. స్వంత అవసరాల కోసమే మారకాలు జరిగేవి, అంతే. కానీ అమ్మకాల కోసమే తయారు చేయించి, సరుకుని అమ్మాలంటే, అసలు ఎంత సరుకుతో అవసరం ఉంటుందో ఆ లెక్క ప్రకారం సరుకు తయారవ్వాలి. కానీ, పెట్టుబడిదారుడి ఆలోచన అలా ఉండదు. ఎక్కువ సరుకుని తయారు చేయించేసి,

దాన్ని తన దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో కూడా అమ్మెయ్యాలి. అది సబ్బుల పరిశ్రమ అయితే, అవి తయారయ్యే దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ కూడా ఆ సబ్బుల పెట్టుబడిదారులు ఇంకా ఉంటారు. వాళ్ళూ సబ్బులు తయారు చేయిస్తారు. వాళ్ళ సబ్బులు కాకుండా, తన సబ్బులే అమ్ముడు పోవాలంటే, ఇక ఆ సబ్బుల వాళ్ళ మధ్య పోటీ! చివరికి ఆ పోటీ, యుద్ధాల దాకా పోతుంది. ఎదటి వాడి సబ్బుల కంపెనీల్ని ధ్వంసం చేసేసి, తన కంపెనీయే నిలబడే లాగ చేసుకోవడానికే యుద్ధం!

యుద్ధాలు, వెనకటి కాలాల్లో లేవని కాదు; ఇతర దేశాల్లో భూముల్ని ఆక్రమించడం కోసం యుద్ధాలు అక్కడా ఉన్నాయి. అన్ని సమాజాలూ దోపిడీ సమాజాలే కాబట్టి, అన్ని చోట్లా యుద్ధాలు ఉన్నాయి. కాకపోతే, వెనకటి కాలాల్లో యుద్ధాలన్నీ కత్రలతో, బాణాలతో అయితే, తర్వాత కాలాల్లో తుపాకుల తోటీ, బాంబుల తోటీ! ఇదంతా పెద్ద గాథ. ఇక్కడ చెప్పుకోలేము.★ ఇక్కడ అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, "పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అంటే, అమ్మకాల కోసమే సరుకుల్ని తయారు చేయించే విధానం" అని అర్థం చేసుకోవాలి. అలా తయారు చేయించిన సరుకునంతా అమ్మాలి. అదే ఇక్కడ అసలు సమస్య.

**49. అసలు పెట్టుబడిదారుడికి, ఆ పేరు ఎందుకు వస్తుంది? అతను కూడా ఒక 'యజమాని.' అంతే కదా?**

**జ:** అంతే అయినా, యజమానుల పేర్లలోనే తేడాలు ఉన్నాయి కదా? 'బానిస యజమాని'కి ఆ పేరు ఎందుకు వచ్చింది? - బానిసలు కూడా అతని ఆస్తిగా ఉండబట్టి. భూస్వామికి ఆ పేరు ఎందుకు వచ్చింది? - భూమి, అతని ఆస్తిగా ఉంది కాబట్టి. అలాగే, పెట్టుబడిదారుడికి కూడా ఆ పేరు, 'పెట్టుబడి' అనే ఆస్తిని బట్టే వచ్చింది. అసలు నిజం ఏమిటంటే, 'ఆస్తి' అనేది, ఏ యజమానిదీ కాదు. బానిస మనుషులు, యజమాని ఆస్తా? భూమి, భూస్వామి ఆస్తా? ఈ సంగతి తర్వాత చూద్దాం.

" 'పెట్టుబడి' అంటే?"

"ఉత్పత్తి సాధనాలే. మొదట అవి ఉండాలి. అంతే కాదు, 'జీతాల్ని' కూడా వాటితో కలుపుతారు. ఆ రెంటినీ కలిపి 'పెట్టుబడి' అంటారు. ఆ పెట్టుబడికి 'లాభం' రావాలంటారు. 'లాభం' రావడానికి మొదట దేన్ని పెడతారో దాన్ని 'పెట్టుబడి' అంటారు."

"ఉత్పత్తి సాధనాలే పెట్టుబడి అయితే, బానిస యజమాని దగ్గిరా, భూస్వామి దగ్గిరా కూడా, పనులు జరగాలంటే, ఉత్పత్తి సాధనాల్ని పెట్టడం ఉండదా? అక్కడ ఉత్పత్తి సాధనాలు లేకుండా పని జరుగుతుందా? అక్కడ శ్రమలు చేసే వాళ్ళకి

★ ఇప్పటికి, 2 ప్రపంచ యుద్ధాలు జరిగాయి. అవి పెట్టుబడిదారీ యుద్ధాలు! ఈ యుద్ధాలు ముగిసిన తర్వాత ఏం జరిగిందో చూస్తే, పెట్టుబడిదారుల మధ్య యుద్ధాలెందుకు జరుగుతాయో తెలుస్తుంది. ఈ 2 ప్రపంచ యుద్ధాల గురించీ తెలుసుకోవాలంటే, "కాపిటల్ పరిచయం"లో, 2 వ సంపుటంలో చూడండి!★

'జీతాల' పేర్లతో ఇవ్వకపోయినా, వాళ్ళ పోషణకి అందే భాగం ఏదో అక్కడా ఉంటుంది కదా? ఆ 2 విషయాలూ వెనకటి కాలంలోనూ ఉంటాయి. ఒక చిన్న రైతు, పొలం పని చేసుకోవాలంటే, పారలూ, గునపాలూ, నాగళ్ళూ, ఎరువులూ, అన్నీ ఏర్పాటు చేసుకుంటాడు. అవన్నీ ఉత్పత్తి సాధనాలే. వాటిని 'పెట్టుబడి' అంటారా? పెట్టుబడిదారుడు పెట్టే ఉత్పత్తి సాధనాలనే 'పెట్టుబడి' అని ఎందుకు అనాలి?''

''అనకూడదు. ఒక బానిస యజమాని దగ్గిర జరిగే విషయాలే పెట్టుబడిదారుడి దగ్గిర కూడా జరుగుతాయి. అయినా, వెనకటి కాలంలో స్పష్టంగా కనపడని విషయాలు, పెట్టుబడిదారీ విధానంలో బట్టబయలుగా కనపడతాయి. శ్రామికుల శ్రమలో నించి చాలా భాగాన్ని యజమానులు లాగడం అనేది, అక్కడా జరుగుతుంది, ఇక్కడా జరుగుతుంది. కానీ, అసలు విషయం అంతా పెట్టుబడిదారీ విధానంలోనే బైటపడుతుంది కాబట్టి, ఇక్కడ ప్రతీ అంశానికీ వేరు వేరు పేర్లు ఏర్పడ్డాయి. పెట్టుబడీ, జీతం, ఉత్పత్తి సాధనాలూ, లాభం - ఇలా, ఈ పేర్ల వల్లే మనకి విషయాలు తేలిగ్గా, ఒక క్రమంలో అర్థం అవుతాయి.''

**50.** **బానిస యజమానుల కాలం నించీ శ్రమ దోపిడీ ప్రారంభమైంది కదా? అది ఎలా జరుగుతుందో ఇప్పటి వరకూ తెలియనే లేదు. దాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవడం ఎలాగ?**

**జ:** ఇప్పుడు అది చాలా తేలికే. ఏమీ కష్టం కాదు. ''ఉత్పత్తికి విలువ, శ్రమ వల్లనే ఏర్పడుతుంది'' అనే విషయం మొదట బాగా అర్థం కావాలి. అది అర్థమైతే, మిగిలినదంతా తేలికే. 'కాపిటల్'లో ఉన్నదంతా ఇదే. అయితే, 'జీతం పద్ధతి' ఇంకా ఏర్పడని సమాజాల్ని చూస్తే, అక్కడా శ్రమ దోపిడీ ఉందిగానీ, దాన్ని అక్కడ లెక్కలతో చూడలేము. మొదట జీతాల పద్ధతి ఉండాలి. అంతే కాదు; ప్రతీ సరుకుకీ 'ధర' ఏర్పడి ఉండాలి. అన్నీ డబ్బు లెక్కలతో ఉండాలి. అలా ఉంటే, మొదట 'ఉత్పత్తి సాధనాల' కోసం ఖర్చు ఎంత; జీతాల కోసం ఎంత; తయారైన సరుకుల రాసి ధర ఎంత; - ఇలా లెక్కలు చూడడానికి వీలవుతుంది. అసలు జీతాల లెక్కలే లేని కాలంలో శ్రామికులు చేసిన శ్రమలో నించి వాళ్ళకి ఎంత భాగం అందిందో, ఎంత భాగం అందలేదో, అర్థం చేసుకోవడం ఎలాగ? అందుకే, పెట్టుబడిదారీ విధానంలో, జీతాలూ, ధరలూ, అన్నీ ఉంటాయి కాబట్టి, శ్రమ దోపిడీ సంగతి ఇక్కడే బైటపడింది.

''జీతాలూ, ధరలూ అన్నీ ఉన్నా, శ్రమ దోపిడీ సంగతి ఎలా తెలుస్తుంది? మార్క్సు కన్నా ముందు జీతాల పద్ధతీ, ధరల పద్ధతీ, లేవా? అవన్నీ ఏ నాడో ఏర్పడి ఉన్నాయి కదా? రికార్డో దగ్గిరే శ్రమ దోపిడీ ఎందుకు బైట పడలేదు?''

''అయితే మనం ఇక్కడ వ్యక్తుల ప్రత్యేకతల్ని ఒప్పుకోవాలి. ప్రకృతిలో సంగతి చూస్తే, సూర్యుడి చుట్టూ భూమి తిరగడం, కోట్ల సంవత్సరాల నించీ జరుగుతూనే ఉంది. మనుషులు కూడా వేల సంవత్సరాల నించీ ఉంటూనే ఉన్నారు. ఆకాశాన్ని చూస్తూనే ఉన్నారు. అయినా, కోపర్నికస్ వంటి ఖగోళ శాస్త్రజ్ఞులు వచ్చే దాకా ఆ ఆలోచనలు ఎవరూ చెయ్యలేకపోయారు. అలాగే, డార్విన్ కృషి చేసే దాకా పరిణామ

క్రమం సంగతి అర్థం కాలేదు. అలాగే, మార్క్సు కృషి జరిగే దాకా, శ్రమ దోపిడీ సంగతి బైటపడలేదు. ఏ సైన్సు విషయం అయినా, నిత్యం సాగిపోతూనే ఉంటుంది. దాన్ని అర్థం చేసుకోవడమే మనుషులు చేసుకోవాలి. మార్క్సు చేసిన కృషి ఏమిటో చూస్తే, అంత కృషి చెయ్యని వాళ్ళు మార్క్సు గ్రహించిన సంగతి ఎలా గ్రహించ గలరు? ఆ కృషి వల్లే అది సాధ్యమైంది - అని చెప్పుకోవాలి. తర్వాత అంతా వివరంగా చూద్దాం గానీ, మొదట ఒక విషయం చెప్పేసుకోవాలి. 'పెట్టుబడిదారుడు, పెట్టుబడి పెడతాడు' అంటారు కదా? అదంతా పచ్చి అబద్ధం. పెట్టుబడీ వాడిది కాదు; జీతాలూ వాడివి కాదు. అవి రెండూ శ్రామికులవే. పెట్టుబడిదారుడు చేసేదంతా, లాభాన్ని లాగడమే. ఇదంతా ఇంకా చూడాలి."

"ఏది విన్నా, నమ్మశక్యం కానంత వింతగా ఉందే."

"కాపిటల్ పుస్తకం నిండా ఉన్నవి ఇలాంటి వింతలే. ఎన్నడూ వినని, తెలియని వింతలే. ఇన్నాళ్ళూ మనం అబద్ధాలనే గొప్ప నిజాలని నమ్ముతూ బతికేస్తున్నాం. మనం నమ్ముతోన్న నిజాలన్నీ అబద్ధాలని తేలిపోతే, అది పెద్ద వింతగా గాక ఇంకే మవుతుంది? పెట్టుబడిదారీ విధానంలో, "ఉత్పాదక లాభం" అనే కొత్త విషయం ఒకటి ప్రారంభమవుతుంది. రాజుల పరిపాలనతో పాటే, 'ప్రజాస్వామ్యం' అనే ఒక కొత్త మాటా, కాసిన్ని చట్టాలూ, బైల్దేరతాయి. ఇక మిగతావన్నీ వెనకటి బానిస యజమానుల నించీ, భూస్వాముల నించీ వచ్చినవే." ★

## 14. పెట్టుబడిదారుడి అబద్ధపు ఖర్చులు!

**51.** **ఏదైనా ఒక సరుకు ఉదాహరణ తీసుకుని చెపితేనే, శ్రమ దోపిడీని అర్థం చేసుకో గలం.**

**జ:** చొక్కాల ఉదాహరణతోనే చెప్పుకుందాం. ఒక పెట్టుబడిదారుడు, బట్టతో

చొక్కాల్ని తయారు చేయించే పరిశ్రమ పెట్టాడు. అది వ్యవసాయం కాక పోయినా, ఈ పరిశ్రమకి కూడా పని స్థలంగా కొంత భూమి కావాలి. దాని మీద ఒక షెడ్డు లాంటి కట్టడం కూడా ఏదైనా ఉండాలి. భూమి ఉచిత ఉత్పత్తి సాధనమే. దానికి చెల్లించవలసింది ఏమీ ఉండదు. కట్టడం అయితే శ్రమలతో తయారైందే. అది కొంత కాలంలో పాతబడి నాశనం అయిపోతుంది. కాబట్టి, దాని విలువలో నించి కొంత కొంత భాగం, అక్కడ తయారయ్యే ప్రతీ సరుకులోకీ లెక్కకు వస్తూ ఉండాలి. ఆ కట్టడం విలువ అంతా అలా తిరిగి వస్తే, ఆ విలువ తోనే కొత్త కట్టడం తయా రవడం సాధ్యం. కాబట్టి, కట్టడం విలువ, వెనక్కి రావాలి. పని జరిగే పని స్థలమూ, దాని మీద కట్టడమూ కూడా 'ఉత్పత్తి సాధనాల' జాబితాలోకి వస్తాయి. ఇక తర్వాత, చొక్కాల్ని తయారు చేసే శ్రమలు జరగడానికి అవసరమైన ముడి పదార్థాలూ, పని ముట్లూ వంటివన్నీ కూడా కావాలి. ఒక పని దినాన్ని 10 గంటలు అనుకుందాం. చొక్కాల్ని తయారు చేసే శ్రామికులు నలుగురు అనుకుందాం.

1 పని దినంలో వాళ్ళు తయారు చేసిన చొక్కాలు 8. అంటే, ఒక్కొక్కరూ కుట్టినవి 2 చొక్కాలు. ఆ 8 చొక్కాల కోసం ఖర్చయిన మొత్తం ఉత్పత్తి సాధనాల విలువని 80 అనుకుందాం. అంటే 1 చొక్కాకోసం ఉత్పత్తి సాధనాల ఖర్చు 10. (డబ్బు లెక్కల్ని, ఎప్పుడూ చాలా చిన్న ఉదాహరణలతో తీసుకుంటే, తేలిగ్గా అర్థమవుతుంది.)

పని దినంలో ప్రతి శ్రామికుడికీ జీతం 5 అనుకుందాం. నలుగురికీ కలిసి జీతాల ఖర్చు 20. పెట్టుబడిదారుడు పెట్టిన పెట్టుబడి ఎంత? ఉత్పత్తి సాధనాల కోసం 80 + జీతాల కోసం 20 = 100. ('ఉత్పత్తి సాధనాల' కోసం గానీ, 'జీతాల' కోసం గానీ, పెట్టుబడిదారుడు పెట్టేది నిజానికి ఏమీ ఉండదని తర్వాత చూస్తాం. కానీ, ప్రస్తుతం ఇక్కడ పెట్టుబడిదారుడు పెట్టుబడి పెడతాడు అనే అనుకోవాలి.)

పెట్టుబడిదారుడు, 100 పెట్టుబడి పెడితే, 8 చొక్కాలు తయారయ్యాయి. ఒక్కొక్క చొక్కా కోసం ఎంత ఖర్చు అయిందో లెక్క చూస్తే, 100 ÷ 8 = 12½ అయిందని తెలుస్తుంది. ఖర్చు అదే అయితే, దాన్ని అమ్మాలంటే, 1 చొక్కా ధర ఎలా ఉండాలి? - ఖర్చు ఎంత అయిందో, ధర కూడా అంతే ఉండాలి కదా?

1 చొక్కాకి 12½ ధరతో, 8 చొక్కాల్నీ అమ్మితే, వాటి కోసం ఖర్చు పెట్టిన 100 డబ్బు వెనక్కి వచ్చేస్తుంది. మర్నాడు మళ్ళీ కొత్త చొక్కాలు తయారు చేయించడానికి, వెనక్కి వచ్చిన 100 లో నించే కొత్త ఉత్పత్తి సాధనాల కోసం 80 పెట్టవచ్చు; కొత్త జీతాల కోసం 20 పెట్టవచ్చు. మొదట ఖర్చయినది వెనక్కి వచ్చి, కొత్త ఉత్పత్తి తయారవడానికి (పునరుత్పత్తి జరగడానికి) ఇబ్బందేమీ ఉండదు. ఒక సారి ఖర్చయిన 100 పెట్టుబడి, ప్రతీ సారీ వెనక్కి వచ్చేస్తూ ఉంటుంది. కొత్త ఉత్పత్తి సాధనాలు ప్రతీ సారీ అందుతూ ఉంటాయి. కొత్త జీతాలు కూడా ప్రతి సారీ అందుతూ శ్రామికులు బతకడానికి సమస్యేమీ ఉండదు. పునరుత్పత్తి జరుగుతూనే ఉంటుంది.

కానీ, పెట్టుబడిదారుడు సరుకు ధరని నిర్ణయించే పద్ధతి అలా ఉండదు. సరుకు తయారీ కోసం అయ్యే ఖర్చులు, పెట్టుబడిదారుడి ప్రకారం, 'ఉత్పత్తి సాధనాలూ - జీతాలే' కావు; ఇంకా చాలా ఖర్చులు ఉంటాయి. ఆ ఖర్చులన్నిటినీ కూడా పెట్టుబడిదారుడు, మొదటి 2 ఖర్చుల జాబితాలోకి కలిపి, ఆ మొత్తాన్ని సరుకు ధరగా నిర్ణయిస్తాడు. పెట్టుబడిదారుడు చెప్పే ఇతర ఖర్చులు చాలా ఉన్నా, వాటిలో నించి 3 ఖర్చుల్ని మాత్రమే మొదట చూద్దాం. (ఇంకా కొన్ని ఖర్చుల్ని తర్వాత చూడవచ్చు.)

**పెట్టుబడిదారుడు కలిపే 3 ఖర్చులు:**

(1) పెట్టుబడికి రావలసిన 'వడ్డీ' ఖర్చు.

(2) 'పని స్థలం' అయిన భూమికి 'కౌలు' ఖర్చు.

(3) పెట్టుబడికి రావలసిన 'లాభం' ఖర్చు.

"ఈ ఖర్చులన్నీ సరుకు కోసమే జరిగాయి" అంటాడు పెట్టుబడిదారుడు. ఈ కౌలూ - వడ్డీ - లాభాలు, సరుకు తయారీ కోసం జరిగాయా? ఇంతకు ముందు చెప్పుకున్న విషయాలు మనకు చక్కగా అర్థమై ఉంటే, ఉత్పత్తి తయారీలో

ఈ 3 ఖర్చులూ ఎంత అబద్ధపు ఖర్చులో తెలిసి పోతుంది. పెట్టుబడిదారుడు ఇంకా తర్వాత చూపించే ఇతర ఖర్చులు కూడా అబద్ధాలే అయి ఉంటాయిలే - అని వాటిని చూడకుండానే తేలిగ్గా గ్రహించవచ్చు.

ఆ 3 ఖర్చుల గురించి పెట్టుబడిదారుడు చెప్పేది ఇలా ఉంటుంది:

"సరుకు కోసం నేను 100 పెట్టుబడి పెట్టాను కదా? దాన్ని 'అప్పు' తెచ్చాను. దానికి వడ్డీ చెల్లించాలి. ఒక వేళ ఆ పెట్టుబడి డబ్బు, నా స్వంతమే అయినా, దాని మీద నాకైనా వడ్డీ రావాలి. ఎందుకంటే, నా డబ్బుని నేను ఎవరికైనా అప్పు ఇస్తే, ఆ డబ్బు మీద నాకు వడ్డీ వస్తుందా లేదా? అలాంటప్పుడు, నా డబ్బుని, నా పరిశ్రమ లోనే వాడుకున్నా, దాని వడ్డీ దానికి రావలిసిందే."

"వడ్డీ రావలసింది అప్పు ఇస్తేనే కదా? నీ డబ్బుని, నీ పరిశ్రమలోనే వాడుకుంటే, అది అప్పు అవుతుందా? నీ డబ్బుని నీకే అప్పు ఇచ్చుకుంటావా?"

"డబ్బు అనేది, నాదా, బైటిదా అనేది, అనవసరం. అసలు డబ్బుని ఎక్కడైనా వాడితే, దానికి వడ్డీ వచ్చి తీరాలి, అంతే. ఆ డబ్బు నాదే అయితే, ఆ వడ్డీ నాదే, దాన్ని నేనే ఉంచుకుంటాను; లేదా, అది అప్పు తెచ్చింది అయితే, వడ్డీని బైటికి చెల్లిం చేస్తాను."

"డబ్బు నీదే అయితే, అప్పుడు నువ్వు డబ్బుకి యజమానివి. నీ డబ్బునే నీకు అప్పు ఇచ్చుకుంటే, అప్పుడు నువ్వు అప్పుదారుడివి. అంటే, నువ్వు 2 రకాల మనిషిగా ఉంటావా?"

"అదంతా అనవసరం. డబ్బుకి వడ్డీ రావాలి, అంతే. అది, వడ్డీ సూత్రం. ఏనాటి నించో ఇది ఇలాగే జరుగుతోంది."

"సరే, మిగతా సూత్రాలు చెప్పు!"

"భూమి, పని స్తలంగా అవసరం కదా? దాన్ని ఒక భూస్వామి నించి తీసు కున్నాను. దానికి కౌలు చెల్లించాలి. ఆ భూమి, నాదే అయినా, దానికి కౌలు రావలి సిందే. దాన్ని బైటికి చెల్లిస్తానా, నేనే ఉంచుకుంటానా అనేది, అనవసరం."

"భూమి నీదే అయితే, నీ భూమిని నీకే కౌలుకి ఇచ్చుకుంటావా? నువ్వు భూమికి యజమాని అయిన భూస్వామి గానూ, భూమిని కౌలుకి తీసుకున్న కౌలు దారుడి గానూ కూడా ఉంటావా?"

"ఆ మాటలన్నీ అనవసరం. ఒక పని కోసం భూమిని వాడామూ అంటే, దానికి కౌలు రావలసిందే. అది ఏ నాటి నించో జరుగుతోంది. ఇది, కౌలు సూత్రం!"

"ఇంకా సూత్రాలు ఉన్నాయా?"

"ఆఁ, ఉన్నాయి. పెట్టుబడి పెట్టి, ఆ సరుకుని ఉత్పత్తి చేయించినందుకు నాకు 'లాభం' రావాలి. అది 'ఉత్పాదక లాభం.'"

"నువ్వు ఏదైనా పని చేస్తే, దానికి జీతం తీసుకోవా? తీసుకుంటావుగా?"

"నా పనికి జీతం ఎలాగా తీసుకుంటాను. మరి పెట్టుబడి పెట్టడం ఎందుకు?"

" 'పెట్టుబడి'కి వడ్డీ వెళ్తుందిగా?"

"మరి, ఈ పనివాళ్ళని పెట్టి, ఈ గొడవ అంతా పడడం ఎందుకు?"

"అదే కదా నువ్వు చెయ్యాల్సిన పని? అందుకే కదా జీతం తీసుకుంటున్నావు? అందు కోసం కాకపోతే, జీతం ఎందుకు తీసుకుంటున్నావు?"

"జీతమేనా? ఈ సరుకు పరిశ్రమ పెట్టినందుకు జీతం ఒక్కటేనా? 'లాభం' రావొద్దా? లాభం రాకపోతే, ఈ పరిశ్రమ ఎందుకు పెడతాను? - ఇది, లాభం సూత్రం."

"సరే, నీ సూత్రాలు చాలా బాగున్నాయి. అయితే, ఈ కౌలూ - వడ్డీ - లాభాలు, నీకు ఎక్కణ్ణించి రావాలి?"

"ఇంకెక్కణ్ణించి? ఈ ఖర్చులన్నీ సరుకు కోసమే అయ్యాయి కాబట్టి, సరుకులో నించే రావాలి?"

"నువ్వు చెప్పే ఖర్చులు చొక్కాల కోసం అయ్యాయా? చొక్కాల ఉత్పత్తి తయారవడానికి, ఉత్పత్తి సాధనాలూ, నలుగురు శ్రామికులం చేసిన పనీ - అవే కదా ఖర్చయ్యాయి? నువ్వు చెప్పే ఖర్చులు పని స్థలంలో ఎక్కడ జరిగాయి?"

"అవి జరిగినట్టే లెక్క! అవే కాదు, ఇంకా ఉన్నాయి. అవన్నీ కలిస్తేనే సరుకు ధర అవుతుంది. సరుకుని ఆ ధరలో అమ్మితే, ఆ ఖర్చులన్నీ బైటికి వస్తాయి. సరుకు ధరని అలాగే నిర్ణయిస్తాను." - ఇదే, పెట్టుబడిదారుడి వాదం! అతను, తన సరుకు ధరని అలాగే నిర్ణయిస్తాడు. ఈ చొక్కాల ఉదాహరణలో, పెట్టుబడిదారుడు, ఇంతకు ముందు చేరిన 100 ధరలోకి, ఇంకో 20 ని కూడా చేర్చి, మొత్తం 8 చొక్కాల ధరని, 100 + 20 = 120 గా నిర్ణయించాడనుకుందాం. (20 ని చేర్చాడు - అనేది, ఒక ఉదాహరణగా తీసుకున్న సంఖ్య. చేర్చింది 30 అయితే, సరుకు ధర 130. చేర్చింది 40 అయితే, సరుకు ధర 140. ఇక్కడ 20నే ఉదాహరణగా పెట్టుకున్నాం.)

పెట్టుబడిదారుడు, కౌలునీ, వడ్డీనీ - ఈ రెంటినీ, 'పెట్టుబడి'లో భాగాలు గానే చూస్తాడు. 'ఉత్పత్తి సాధనాల' కోసం ఖర్చు అయినట్టే, ఆ 2 అంశాల కోసం కూడా ఖర్చయినట్టు, వాటిని కూడా కలిపి, 'పెట్టుబడి' అంటాడు. ఆ పెట్టుబడి మీద తన 'లాభం' వేసుకుంటాడు. అది కూడా సరుకులో నించి రావలసిన విషయం లాగే!

ఈ చొక్కాల ఉదాహరణలో,
పెట్టుబడిదారుడు చెప్పే పెట్టుబడి లెక్కలు ఇలా ఉంటాయి:

| | | |
|---|---|---|
| ఉత్పత్తి సాధనాల ఖర్చు | - | 80 |
| జీతాల ఖర్చు | - | 20 |
| కౌలూ, వడ్డీల ఖర్చు | - | 8 |
| పెట్టుబడి | - | 108 |
| పెట్టుబడి మీద ఉత్పాదక లాభం | - | 12 |
| 8 చొక్కాల ధర | - | 120 |
| 1 చొక్కా ధర | - | 15 |

ఈ రకంగా, 8 చొక్కాల్నీ అమ్మేస్తే, పెట్టుబడిదారుడి చేతికి 120 డబ్బు వస్తుంది. అందులో నించి ఉత్పత్తి సాధనాల 80 నీ, జీతాల 20 నీ, వెనక్కి తీసుకుంటాడు. దానితో, ఆ 2 ఖర్చులూ వచ్చేసినట్టే. ఇంకా ఆ పైన ఇంకో 20 డబ్బు కూడా వస్తుంది. దాన్ని పెట్టుబడిదారుడు - ఏం చేస్తాడు? ఆ 20 లో నించే మొదట కొంత డబ్బుని 'కౌలు' పేరుతో, కొంత డబ్బుని 'వడ్డీ' పేరుతో, విడదీస్తాడు. మిగతాది 'లాభం' పేరుతో! ఆ 20 డబ్బు అంతా పెట్టుబడిదారుడికే అందవచ్చు. లేదా, కౌలూ వడ్డీలు, బైటికి పోవచ్చు. ఉత్పాదక లాభం మాత్రం తప్పకుండా పెట్టుబడిదారుడికే. (ఈ ఉదాహరణలో, పెట్టుబడిదారుడి జీతాన్ని చూపించడం లేదు. దాన్ని కూడా చూపిస్తే, అది కూడా సరుకు ధరలోకి కలుస్తుంది. ఆ జీతం, శ్రామికుల జీతం లాగే ఉండదు. దానికి వంద రెట్లు ఎక్కువగా ఉంటుంది.)

సరుకు కోసం అయ్యే ఖర్చుల్ని చూపించడంలో పెట్టుబడిదారుడి లెక్కలు ఎలా ఉన్నాయి? అలా ఎందుకు ఉన్నాయి?

భూమికి, కౌలు వెళ్ళాలి! అప్పుకి, వడ్డీ వెళ్ళాలి! పెట్టుబడికి, లాభం వెళ్ళాలి!

ఇదంతా ఎంతో సవ్యంగా ఉందని, పెట్టుబడిదారుడి లాగే, ఆ పద్ధతినే చూస్తూ అలాగే ఆలోచించే మేధావులూ, ఆర్థిక వేత్తలూ, పెట్టుబడిదారుడి వాదంతోనే ఏకీభవిస్తారు. ఆ లెక్కలన్నీ సరైనవే అంటారు. ★

# 15. అమ్మో, ఎంత దుర్మార్గం!

**52. 'విలువ' అన్నా, 'ధర' అన్నా, ఒకటేనా? ఏమైనా తేడా ఉంటుందా?**

**జ:** పెట్టుబడిదారీ విధానంలో, 'జనరల్ లాభం రేటు' సూత్రం ఒకటి కొత్తగా బైల్దేరుతుంది. దాని వల్ల, 'విలువ'కీ, 'ధర'కీ, కొంత తేడా ఏర్పడుతూ ఉంటుంది. కానీ, ఆ విషయాలు ఇక్కడ పూర్తిగా అనవసరం. దీన్ని కాపిటల్ లోనే చూడగలం. ఏ విషయం గురించి చూసేటప్పుడైనా, మొదట సాధారణంగా జరిగే విషయమే చూడాలి. మొదట అది అర్థం అయ్యాకే దాని తర్వాత, 'ప్రత్యేక పరిస్థితుల' గురించి చూడాలి. సాధారణ విషయాలు చూస్తే, విలువా, ధరా, ఒకటే. అవి, ఒక దానికి ఒకటి మారుపేర్లు మాత్రమే. ఎప్పుడు ఏ పేరుతో అన్నా ఫర్వాలేదు.

**53. చొక్కాల తయారీ కోసం, ఉత్పత్తి సాధనాల 80, జీతాల 20 - ఈ రెండే ఖర్చవడం చూశాం. అక్కడ వడ్డీలూ, లాభాలూ లాంటివి ఖర్చవడం నిజంగా జరగలేదు. అంటే, చొక్కాల ఖర్చు 100 మాత్రమే కదా? అయితే దాన్ని, పెట్టుబడిదారుడు 120 గా ఎలా పెంచగలిగాడు? జరగని ఖర్చుల్ని కలిపితే మాత్రం అవన్నీ విలువగా అయిపోతాయా? అలాగైతే చొక్కాని 15 కే అమ్మడం ఎందుకు? 'ఒక లక్ష'కి అమ్మ వచ్చు కదా? పెట్టుబడిదారుడు, జరగని ఖర్చులన్నిటినీ చేర్చేసి విలువని పెంచేస్తే కొనే వాళ్ళు అలాగే కొనేస్తారా? కానీ మన కళ్ళ ముందు, పెట్టుబడిదారులు లాభాలు వేసుకుని నిర్ణయించే ధరలతోనే సరుకులు అమ్ముడు పోతున్నాయి. అలా జరగ**

**డమే కళ్ళారా చూస్తున్నాం. సరుకుని అమ్మాక, ఆ ధరలో నించే వడ్డీనీ లాభాన్నీ తీసుకోవడం కూడా చూస్తున్నాం. అది సాధ్యమౌతోంది! అబద్ధపు ఖర్చులు కూడా సరుకు ధరలోకి చేరిపోతున్నాయి అంటే, వాటిని ఆ ధరలో నించే తీసుకోగలుగు తున్నారు అంటే, అవి సరుకుకోసం నిజంగా జరిగినవే అని అర్థం రావడం లేదూ? లేకపోతే, అవి సరుకు ధరలోకి ఎందుకు చేరతాయి? ఇదంతా గందరగోళంగా లేదూ?**

**జ:** ఒక విషయం గురించి నిజం తెలియనప్పుడు, ఆ నిజానికే ఎన్నో తప్పు అర్థాలు వస్తాయి. ఇక్కడ మనం వెంటనే గ్రహించవలసింది ఏమిటంటే, పెట్టుబడి దారుడు చెప్పే ఆ అబద్ధపు ఖర్చులేవీ సరుకు విలువలోకి చేరడం లేదు! అలా చేరవు! కానీ, వాటిని, ఆ సరుకు విలువలో నించే తీసుకోగలుగుతున్నారంటే, దానికి ఇంకో కారణం ఉంది. ఆ కారణం ఏమిటో తెలుసుకుంటే, 'శ్రమ దోపిడీ' రహస్యం అర్థమై పోతుంది. దోపిడీ జరగడానికి వీలునిచ్చే మార్గం అదే. ఆ సరుకు కోసం మనకు తెలిసిన ఖర్చులు, ఉత్పత్తి సాధనాల 80, జీతాల 20. ఈ 2 ఖర్చులూ పైకి కనపడు తున్నాయి. కానీ, ఈ రెండే కాదు. మనకు తెలియని ఖర్చు ఇంకా ఏదో జరి గిందన్న మాట! దాని విలువ కూడా సరుకులో ఉందన్నమాట! ఆ విలువనే, అబద్ధపు పేర్ల తీసుకోగలుగుతున్నాయన్నమాట! అదీ అసలు కారణం. అంతేగానీ, నిజంగా జరగని అబద్ధపు ఖర్చులే సరుకు విలువలోకి చేరుతున్నాయని కాదు. మనకు పైకి కనపడని ఆ ఖర్చు ఏమిటో దాన్ని పట్టుకోవాలి. మార్క్సు చేసిన పని అదే!

"చాలా ఆశ్చర్యంగా ఉంది! అయితే, ఆ అసలు కారణం ఏమిటి?"

"పెట్టుబడిదారుడు 8 చొక్కాల విలువలోకి ఇంకో 20ని, అబద్ధంగా చేర్చి, ఆ విలువని 120గా నిర్ణయించాడు కదా? ఆ సరుకు, ఆ విలువతోనే అమ్ముడు పోయింది కూడా కదా? అలా 120 ధరతో సరుకు అమ్ముడు పోయిందంటే, దానికి నిజంగానే ఆ విలువ ఉందన్నమాట! అంటే, ఆ సరుకు కోసం నిజంగా జరిగిన ఖర్చు 100 మాత్రమే కాదనీ, దాని కోసం నిజం గానే 120 ఖర్చు జరిగిందనీ, అందుకే ఆ సరుకు నిజం విలువ 120 అనీ, అర్థం. ఆ సరుకుకి 120 విలువ ఎలా చేరిందో ఎవరికీ తెలియకపోయినా, దానికి ఆ విలువ నిజంగానే ఉందని అర్థం. ఆ సంగతి ఎలా చెప్పగలమంటే, ఒక వస్తువుని మారకంలో పెట్టినప్పుడు, దానికి బదులుగా ఏది వస్తుందో అదే దాని విలువ అని మొదటే చూశాం. కుండకి బదులుగా చెప్పుల జత వస్తే, అదే కుండ విలువ కదా? అలాగే, కుండకి బదులుగా 4 రూపాయలు వస్తే, ఆ డబ్బే, కుండ విలువ. డబ్బు, వస్తువు విలువని, కొలతలతో సహా చెపుతుంది. కుండ విలువ, 2 కాదు, 3 కాదు, 4 రూపాయలు. అలాగే చొక్కాల ఉదాహరణని కూడా అర్థం చేసుకోవాలి. 8 చొక్కాల్ని కలిపి, 1 సరుకు అందాం. ఈ సరుకుకి బదులుగా, 120 డబ్బు వచ్చింది. అంటే, ఆ సరుకుకి అంత విలువ ఉందని అర్థం. 120 విలువ ఉంది కాబట్టే, 120 డబ్బు వచ్చింది. ఇక్కడ కొన్ని విషయాల్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

(1) మారకం, సమాన విలువల మధ్యనే జరుగుతుంది.

(2) సరుకుకి బదులుగా వచ్చిన డబ్బుని బట్టి, సరుకు విలువ తెలుస్తుంది. 8 చొక్కాలకి, 120 డబ్బు వచ్చిందంటే, వాటికి అంత విలువుందని అర్థం.

(3) ఆ సరుకుకి 120 విలువ ఉందంటే, ఆ విలువ దేని వల్ల ఏర్పడి ఉంది? - విలువ ఏర్పడేది, 'మొత్తం శ్రమ' వల్లనే.

(4) 'మొత్తం శ్రమ' అంటే? - పాత శ్రమా, కొత్త శ్రమా కలిసినదే మొత్తం శ్రమ.

ఈ 4 అంశాల్ని బట్టి, చొక్కాలకు 120 విలువ ఎలా ఏర్పడిందో తెలుసుకోవచ్చు. సరుకు విలువలో నించి పాత శ్రమని తీసివేస్తే, మిగిలేది కొత్త శ్రమ విలువే.

8 చొక్కాల కోసం, ఉత్పత్తి సాధనాల ఖర్చు 80 అని పెట్టుబడిదారుడు చూపించిన లెక్కల్లో తెలుస్తూనే ఉంది. ఇది పాత శ్రమ విలువ.

అయితే, కొత్త శ్రమ విలువ ఎంత కావచ్చు? మొత్తం విలువలో నించి, పాత శ్రమ విలువని తీసేస్తే, మిగిలేది కొత్త శ్రమ విలువే అవుతుంది కదా?

| | |
|---|---|
| సరుకు విలువ | - 120 |
| పాత శ్రమ | - 80 |
| కొత్త శ్రమ | - 40 |

8 చొక్కాలు తయారైన పని దినంలో, నలుగురు శ్రామికులు చేసిన కొత్త శ్రమ విలువే, ఆ 40 అన్నమాట! కొత్త శ్రమకి 40 విలువ ఉండడం వల్లే, దానికి పాత శ్రమ విలువ 80 కూడా కలిసి, ఆ సరుకు విలువ 120 అయింది. అంత విలువ ఆ సరుకుకి నిజంగా ఉందన్నమాట! ఆ సరుకుకి, డబ్బుతో మారకం జరగకపోతే, ఆ సంగతి బైటపడదు. - ఇంత వరకూ చూసిన దాన్నిబట్టి తెలుస్తున్నది ఏమిటి? ఒక పని దినంలో, నలుగురు శ్రామికులు చేసిన శ్రమ విలువ 40. అంటే, శ్రామికులు చేసిన కొత్త శ్రమ 20 కాదు, 40. సరుకు కోసం నిజంగా అయిన శ్రమ ఖర్చు 100 కాదు, 120. కానీ, పైకి కనపడుతున్నది ఉత్పత్తి సాధనాల 80, జీతాల 20, ఈ 100 ఖర్చు మాత్రమే. కనపడని శ్రమ ఖర్చు ఇంకో 20. అయితే, శ్రామికులు 40 శ్రమ చేస్తే, వారికి జీతాలుగా అందింది ఎంత? - అందింది 20. ఒక్కొక్కరికీ 5 చొప్పున. వారికి అందకుండా ఉన్నది ఎంత? - ఇంకో 20. అది కూడా వాళ్ళకు అందితే వారి 'శ్రమ విలువ' అంతా వారికి అందినట్టే అవుతుంది. కానీ, అలా అందదు. అందే దాని పేరు 'జీతం.' దీనికి మార్క్సు పెట్టిన ఇంకో పేరు, 'శ్రమ శక్తి విలువ.' 'శ్రమ చేసే శక్తి' నిలబడుతూ ఉండాలంటే, శ్రామికుల శ్రమ విలువలో నించి కొంత అయినా వారికి అందుతూ ఉండాలి. ఆ 'శ్రమ విలువ'లో నించి అందకుండా ఉన్న దాని పేరు, 'అదనపు విలువ.' అది, జీతం కన్నా అదనంగా ఉన్నది. అది, శ్రామికుల శ్రమే. కానీ అది వారికి అందకుండా యజమాని చేతికి పోతుంది. సరుకులో ఆ విలువ ఉంది కాబట్టే, దాన్ని యజమాని, అబద్ధపు పేర్లతో తీసుకుంటాడు!"

**54.** **ఇప్పుడు తెలిసింది. శ్రామికులు సరుకుని తయారుచేసి అక్కడ పెట్టేటప్పటికే దాని విలువ 120గా ఉందన్నమాట! అంతే గానీ, ఆ విలువ, 120గా అవడం, పెట్టుబడిదారుడు కౌలూ వడ్డీ లాభాల పేర్లతో ఇంకో 20ని చేర్చడం వల్ల కాదు. శ్రామికులకు, వాళ్ళ శ్రమ విలువని పూర్తిగా ఇవ్వలేదు కాబట్టి, వాళ్ళకి అందని 20నే, ఆ అబద్ధపు పేర్లు పంచుకోవడం సాధ్యమైంది. అమ్మో, ఎంత దుర్మార్గం! ఇలా జరుగుతూ ఉందా?**

**జ:** అద్భుతంగా అర్థమైంది మీకు. శ్రామికులకు అందనిదే బైటికి పోయింది.

కౌలూ, వడ్డీ లాభాలు అనేవి, ఉత్పత్తి సాధనాలూ కావు. శ్రమ చేసే మనుషులూ కావు. వాటివల్ల సరుకు తయారీకి, పాత శ్రమా అందదు, కొత్త శ్రమా అందదు. అవి సరుకు కోసం అయిన ఖర్చులు కావు. అందుకే అవి సరుకు విలువలోకి చేరవు.

"అవును, బాగా అర్థమైంది. కానీ...."

" 'కానీ' అంటే, ఆలోచన జరుగుతున్నట్టే. బాగా అర్థమైతే 'కానీ' ఏమిటి?"

"శ్రామికుల శ్రమ విలువ 40. జీతాలు 20. వాళ్ళకి అందనిది 20. అయితే, ఆ అందని 20 సంగతి పెట్టుబడిదారుడికి ఎలా తెలుస్తుంది? అతను, అబద్ధాల పేర్లతో సరిగ్గా 20నే ఎలా చేర్చగలిగాడు?"

"మంచి ప్రశ్న. మొదట క్లుప్తంగా చెప్పుకోవాలంటే, సరుకులో ఎంత అదనపు విలువ ఉందో తెలిశాకే, ఆ లెక్కతోనే పెట్టుబడిదారుడు అదనాన్ని కలిపాడని కాదు. అసలు, పెట్టుబడిదారుడు, అబద్ధపు పేర్లతో ఎంత కలిపాడో అదే అదనపు విలువ అవుతుంది. ఆ అదనాన్ని తెలిసి కలిపాడా, తెలియక కలిపాడా అనే దాని కోసం మనం ఇంకా కొన్ని వివరాలు చూడాలి. ఉత్పత్తి సాధనాల ఖర్చూ, జీతాల ఖర్చూ, మనకు స్పష్టంగా తెలుస్తూ ఉంటాయి. ఇక తెలియనిది, 'అదనంగా' ఉన్న విలువే. పెట్టుబడిదారుడు, అబద్ధపు ఖర్చుల పేరుతో ఎంత కలుపుతాడో ఆ కలిపే దానితోనే సరుకు విలువ ఏర్పడుతుంది. ఆ విలువలో నించి, తెలిసి ఉన్న 2 ఖర్చుల్ని తీసేస్తే, పెట్టుబడిదారుడు దేన్ని కలిపాడో అదే 'అదనపు విలువ' అవుతుంది."

"పెట్టుబడిదారుడు 20ని గాక, 30ని కలిపితే? 50ని కలిపితే?"

"ఎంత కలిపినా, ఆ కలిపిన దానితో కూడా ఆ సరుకు అమ్ముడుపోతే, సరుకుకి బదులుగా అంత డబ్బూ వస్తే, ఆ సరుకుకి అంత అదనపు విలువ ఉన్నట్టే అర్థం. ఇక్కడ గ్రహించవలసిన విషయం, ఒక్క పెట్టుబడిదారుడే, తన కిష్టమైనట్టు చేసేస్తాడని కాదు. ఒక పెట్టుబడిదారుడి గురించి చూస్తున్నామంటే, మొత్తం పెట్టుబడిదారులందరూ అలాగే చేస్తారని అర్థం. అందరూ తమ అసలు ఖర్చుల మీద, 10% అదనాన్ని కలపడం ఎలాంటిదో, 50%ని కలపడం కూడా అలాంటిదే. బంగారాన్ని (డబ్బుని) తయారుచేయించే పెట్టుబడిదారుడికి కూడా అది వర్తిస్తుంది. ఇతర సరుకుల విలువలు 10% పెరిగినప్పుడు, డబ్బు విలువ కూడా 10% పెరిగితే, ఆ డబ్బు, ఏ సరుకుతో మారేటప్పుడైనా, సరుకు విలువకీ, డబ్బు విలువకీ, సమస్యేమీ రాదు. సరుకుల విలువలు 10% పెరిగి, డబ్బు విలువ ఏమీ పెరగకపోతే,

సరుకు లకు బదులు, ఎక్కువ డబ్బు రావలసివస్తుంది. అది ఒక సమస్య అవుతుంది. అన్నిటిలోనూ మార్పులు ఒకే రకంగా ఉంటే, విలువలు అన్నిటికీ ఎప్పటిలాగే ఉన్నాయని అర్థం.

పెట్టుబడిదారులు, ఒకళ్ళ సరుకుల్ని ఒకళ్ళు కొనుక్కోవాలి; ఒకళ్ళ సరుకుల్ని ఒకళ్ళకి అమ్ముకోవాలి. కాబట్టి, ఒకడు 10% లాభం వేసుకుంటే, ఇంకొకడు 50% వేసుకోవడం సాధ్యం కాదు. అలా వేసుకుంటే, ఆ సరుకు, పెట్టుబడిదారుల మధ్య అమ్ముడుపోదు. కాబట్టి, ఎవడికి ఇష్టమైనట్టు వాడు చేసెయ్యలేడు.

ఇంకో సంగతి కూడా దృష్టిలో పెట్టుకోవాలి. మనం ఒక సరుకుని గురించి చూసినా, అది పెట్టుబడిదారులందరికీ వర్తించేదే. మనం, 'చొక్కాలు' అనే సరుకుని చూస్తున్నాం. అసలు, మొత్తంసమాజంలో పెట్టుబడిదారులందరూ ఉత్పత్తి చేయించే వేరు వేరు సరుకుల రాసులన్నిటినీ కలిపి, ఒకే సరుకుగా అనుకుందాం. వేరు వేరు పెట్టుబడిదారులందర్నీ కలిపి ఒకే పెట్టుబడిదారుడిగా అనుకుందాం. ఆ పెట్టుబడిదారుడికీ, అక్కడ పని చేసే శ్రామికులకీ మధ్య జరిగే విషయాలే ఎలా ఉంటాయో చూడాలి. పెట్టుబడిదారులందరి దగ్గిరా జరిగేది ఒకటే. ఎవడికి ఇష్టమైనట్టు వాడు, తన సరుకు విలువని విపరీతంగా నిర్ణయించలేడు.

ప్రతీ పెట్టుబడిదారుడికీ, తన సరుకుకి సంబంధించీ, ఇతర శాఖల్లో సరుకులకు సంబంధించీ, పాత అనుభవాలు ఉంటాయి. ఒక రకం సరుకు తయారవడానికి, ఎన్ని పని దినాలు ఖర్చవుతాయో, కౌలు రేటూ, వడ్డీ రేటూ, లాభం రేటూ, ఎలా నడుస్తున్నాయో, ఆ లెక్కలన్నీ ఉంటాయి. మన చొక్కాల పెట్టుబడిదారుడికి పోటీగా అదే రకం చొక్కాల్ని తయారు చేయించే ఇంకో పెట్టుబడిదారుడు ఉంటాడు కదా? నిజం ఖర్చులైతే దాదాపు అందరికీ ఒక్కలాగే జరుగుతాయి. ఆ ఖర్చుల మీద కలిపే అదనాన్ని ఒకడు 20% కలిపితే, ఇంకొకడు 50%ని కలిపి, తన సరుకుని ఎలా అమ్మగలడు? అంతే కాదు, ప్రతీ వాడూ, ఇతరుల నించి ఉత్పత్తి సాధనాలూ, పోషణ వస్తువులూ, అన్నీ కొనాలి. తన సరుకు విలువని తెగ పెంచి అమ్మితే, ఇతరుల సరుకుల్ని కూడా తెగ పెంచిన విలువలతోనే కొనాలి. అప్పుడేమవుతుంది? అందరి ధరలూ దాదాపు ఒకే రకంగా ఉండడం అవుతుంది.

పెట్టుబడిదారుల మధ్య పోటీ, ఒకే రకం సరుకుల వాళ్ళ మధ్యే కాదు; అనేక రకాల సరుకుల వాళ్ళ మధ్య కూడా ఉంటుంది. చొక్కాల పరిశ్రమలో ఎక్కువ లాభాలు వస్తూ ఉంటే, ఇతర శాఖల వాళ్ళందరూ ఇటు పరిగెత్తుకొస్తారు. ఆ రకంగా, లాభాల కోసం కాచుకుని కూర్చున్న వాళ్ళ మధ్య పోటీలు, ఎవణ్ణీ ఇష్టానుసారంగా ఉండనివ్వవు. చొక్కాల ఉదాహరణలో, 20% అదనాన్ని చూపిస్తున్నామంటే, పెట్టుబడిదారులందరినీ కలిపి, ఒకే పెట్టుబడిదారుడిగా చెపుతున్నట్టు అర్థం. పెట్టుబడిదారుడు, ఆ అదనాన్ని ఏం చేస్తాడో, దాన్ని ఏ యే పేర్లతో తీసుకుంటారో, అది చూడాలి."

"అది, కౌలూ- వడ్డీ- లాభాలుగా పంపకాలవుతుందని చెప్పుకున్నాం కదా?" ★

# 16. కౌళ్ళూ, వడ్డీ లాభాల అబద్ధాల్ని నూటికి నూరు మందీ నమ్ముతారు!

**55. కౌలూ - వడ్డీ - లాభాల్ని తీసుకున్న వాళ్ళు, వాటితో ఏం చేస్తారు?**

**జ:** ఇదేం ప్రశ్న? డబ్బుని లాక్కున్న వాళ్ళు దానితో ఏం చేస్తారని సందేహమా?

దానితో వాళ్ళు, తమ పోషణకి కావలసిన వస్తువులన్నీ కొనుక్కుని, స్వంత శ్రమ లేకుండా హాయిగా బతుకుతారని గ్రహించలేమూ? శ్రమ చెయ్యకుండా బతకడానికే కదా, ఎదటి వాళ్ళ శ్రమని లాక్కునేది? సరుకుని అమ్మితే వచ్చిన 120 డబ్బుని, 3 భాగాలుగా చూస్తే, ఉత్పత్తి సాధనాల భాగం 80 డబ్బు, జీతాల భాగం 20 డబ్బు, అదనపు విలువ భాగం 20 డబ్బు. లేదా, ఆ ఉత్పత్తినే 3 భాగాలుగా చూడవచ్చు. ఆ ఉత్పత్తిని 8 చొక్కాలుగా గాక (8 చొక్కాల్ని 3 భాగాలు చెయ్యడం కుదరదు కాబట్టి), 24 కిలోల ధాన్యంగా చూద్దాం. కిలో ధాన్యం విలువ 5. 24 కిలోల ధాన్యం విలువ 120. ఈ లెక్కన ఆ ధాన్యాన్నే 3 భాగాలు చేస్తే, ఉత్పత్తి సాధనాల భాగం 16 కిలోలు. జీతాల భాగం 4 కిలోలు. అదనపు ఉత్పత్తి భాగం 4 కిలోలు. డబ్బుగా చూస్తే, అది 20 అదనపు డబ్బు. ఉత్పత్తిగా చూస్తే, అది 4 కిలోల అదనపు ఉత్పత్తి.

కౌలూ - వడ్డీ - లాభాల వాళ్ళు, అదనపు విలువలో నించి కొంత కొంత భాగాన్ని తీసుకుంటారు. ఆ డబ్బుతో, తమకు కావలసిన ఉత్పత్తులు కొంటారు. అదనపు విలువ, ప్రతీ సరుకులోనూ ఉంటుంది. ఒక నెల రోజుల్లో వచ్చే అదనపు విలువని చూస్తే, కౌలూ - వడ్డీ - లాభాల వాళ్ళు, ఆ నెల అంతా, ఆ అదనపు విలువతోనే బతుకుతూ ఉంటారు. ప్రతీ నెలా, ప్రతీ సంవత్సరం, జరిగేది ఇదే. 'అదనపు విలువ'ని డబ్బుగా చూస్తే, అది 20 డబ్బు కదా? ఆ 20 డబ్బుని, డబ్బుగా గాక, ఉత్పత్తులుగా చూస్తే, అవి కొన్ని ఉత్పత్తులు. కొన్ని వస్తువులు. ఆ అదనపు డబ్బు, లేదా ఆ అదనపు ఉత్పత్తి, శ్రామికులకు అందకుండా పోతుంది కాబట్టి, వాళ్ళ అవసరాలు తీరక, పేదతనంలోనే బతుకుతూ ఉంటారు.

"ఇంత ఘోరం జరుగుతోందా! పేద బతుకులకు కారణం ఇదే అన్నమాట! అసలు ఇదంతా ఎంతో కాలం నించీ ఎలా సాగుతోంది? ఏ వస్తువు తయారవడానికైనా, ఉత్పత్తి సాధనాలూ, కొత్త శ్రమా - చాలు. ఇంకేమీ అక్కరలేదు. ఆ 2 అంశాలతోటే చొక్కాలు తయారవడం చూశాం. అంతా ఇంత స్పష్టంగా ఉంటే, కౌళ్ళూ - వడ్డీ లాభాలూ కూడా సరుకుల కోసమే ఖర్చవుతాయని పెట్టుబడిదారులు ఎలా చెప్ప గలుగుతారు? చెప్తే మాత్రం, నమ్మేవాళ్ళు, ఎలా నమ్ముతున్నారు?"

"ఈ ప్రశ్న, ఎంత తెలివైన ప్రశ్న అంటే, ఈ ప్రశ్న మార్క్సుకి తప్ప ఏ ఆర్థిక వేత్తకీ, ఏ మేధావికీ, రాని ప్రశ్న! పెట్టుబడిదారులు చెప్పే అబద్ధాల్ని నమ్మే వాళ్ళు ఎలా నమ్ముతున్నారా? నిన్న మొన్నటి దాకా మనం అందరం దాన్ని నమ్ముతూ ఉన్న వాళ్ళమే. మార్క్సు 'కాపిటల్' రాసి చెప్పే దాకా, నూటికి నూరు మందీ అదంతా నమ్ముతూనే ఉన్నారు. ఈ అబద్ధాలనేవి, మొదలైంది, పెట్టుబడిదారుడి నించే కాదు.

ఏ నాడో బానిసల యజమాని దగ్గిరే మొదలయ్యాయి. బానిసల కాలంలో, ఒక మనిషి, ఇంకో మనిషి ఆస్తి - అని, ఆ నాటి ప్రపంచం అంతా నమ్మలేదా? అలాగే ప్రతీ అబద్ధాన్నీ, ఆ నాటి నించీ నూటికి నూరు మందీ నమ్ముతూనే ఉన్నారు. ఆ నమ్మే వాళ్ళల్లో, యజమానులు ఉంటే, ఆశ్చర్యం లేదు; శ్రామికులందరూ కూడా ఉంటారు. సరుకుల రాసుల్ని తయారుచేసే శ్రామికుల నమ్మకాలు ఎలాఉంటాయో తెలీదా? మన నమ్మకాలు ఎలా ఉండేవో మనకి తెలీదా? 'కౌలు ఇవ్వకపోతే, భూమి యజమాని భూమిని ఎందుకు ఇస్తాడు? వడ్డీ ఇవ్వకపోతే, ఎవరైనా అప్పు ఇస్తారా? లాభం రాకపోతే, ఎవరైనా పెట్టుబడి పెడతారా? అవన్నీ రావాలంటే, సరుకు వల్ల 'కాకపోతే, ఇంకెక్కడి నించి వస్తాయి?' అంటారు కదా? 'కాపిటల్' పుస్తకం చదవక ముందు, నా అభిప్రాయాలన్నీ అలాగే ఉండేవి."

"అవునండీ, మేమూ అంతే. ఇప్పుడు ఇదంతా వింటూ ఉంటే ఇప్పటికీ నమ్మకం కలగడం లేదు. ఇంకా ఎన్నెన్నో సందేహాలు వస్తూనే ఉన్నాయి. పాత నమ్మకాలు వదలడం లేదు."

"ఎందుకలా ఉందంటే, మనం పుట్టినప్పట్నించీ, భూమికి కౌలూ, పెట్టుబడికి వడ్డీ లాభాలూ - అనే మాటలు వింటూ పెరిగాం. అలా జరుగుతూ ఉండడం చూస్తున్నాం కూడా! భూస్వాములకు కౌళ్ళు అందడాలూ, అప్పులు ఇస్తే వడ్డీలు రావడాలూ, పెట్టుబడిపెడితే లాభాలు రావడాలూ, అన్నీ కళ్ళారా చూస్తున్నాం. అవి నిజాలు కావని ఎలా అనుకుంటాం? సూర్యుడు, ఆకాశంలో ఒక వేపు నించి బైల్దేరి, ఇంకోవేపు వెళ్ళిపోతూ ఉంటే, సూర్యుడే తిరుగుతున్నాడు అనుకుంటాం గానీ, భూమే తిరుగుతోంది అనుకుంటామా? అంత తెలివి ఏడిసిందా మనకి? ఎవరో గొప్ప తెలివిపరుడు బైల్దేరి చెప్తేనే కదా, అసలు నిజం తెలుస్తుంది? కౌళ్ళూ, వడ్డీ లాభాలూ - ఉత్త మోసపు ఆదాయాలని, స్వంత శ్రమ లేకుండా లాగే ఆదాయాలని, చిన్నతనంలో విన్నామా? మన పెద్ద వాళ్ళు చెప్పారా? ఆ సంగతి వాళ్ళకి మాత్రం తెలుసా? వాళ్ళకీ ఎవరూ చెప్పలేదు. వాళ్ళు మనకెలా చెపుతారు? అందరూ నమ్మే విషయాల మీద ఎవరికీ సందేహాలు రావు. అలా సాగి, సాగి, ఎప్పుడో ఎవరికో బైల్దేరు తుంది కొంచెం కొత్త ఆలోచన. అది మార్క్సు దాకా చేరి, అక్కడ ఆయన తెలివి పని చేసింది. మార్క్సు కాపిటల్ రాశాకే, దాన్ని నేర్చుకున్న వాళ్ళు పెట్టుబడిదారుడు చెప్పే అబద్ధాలన్నిటి నించీ బైటపడ్డారు."

"ఎక్కడ బైటపడ్డారు? నా సందేహాలింకా నన్ను వదలడం లేదు. పెట్టుబడిదార్లు చెప్పేవి అబద్ధాలని ఒక పక్క తెలుస్తూనే ఉన్నా, ఇంకో పక్క సందేహాలు, ఉన్నవి ఉన్నట్టే ఉన్నాయి!"

"అంటే, అంతగా ఆలోచిస్తున్నారని అర్థం. సందేహం ఎలా వచ్చినా అడుగుతూ ఉండండి. నేను కూడా చెప్పగలనో లేదో చూస్తాను. నేనూ నేర్చుకుంటాను. ఇప్పుడు ఏమిటి మీ సందేహం?"

"మళ్ళీ వెనక్కి వెళ్తున్నాను. చొక్కాల ఉదాహరణలో, ఉత్పత్తి సాధనాల ఖర్చు 80. జీతాల ఖర్చు 20. ఈ రెండూ కలిసి 100. ఆ సరుకుకి 100 ధరే ఎందుకు పెట్టకూడదు?"

"ఇదా సందేహం! రామాయణం అంతా విని, రాముడికి సీత ఏమవుతుం దన్నట్టు! సందేహాలు రావడం మంచిదే అన్నానని, తల ఉపయోగించకుండా సందే హాలు తెచ్చుకుంటారా? ఏ సరుకుకైనా, ఉత్పత్తి సాధనాల్నీ, జీతాల్నీ మాత్రమే కలిసిన ధరని మాత్రమే యజమాని నిర్ణయిస్తే, ఆ సరుకుని అమ్మినప్పుడు, ఆ 2 అంశాల డబ్బే వస్తుంది. యజమానీ శ్రామిక సంబంధంలో, 2 ఖర్చులు మాత్రమే వెనక్కి వస్తే, స్వంత శ్రమ లేకుండా బతికే యజమాని, ఆ సరుకులో నించి ఏ భాగాన్ని తీసుకోగలుగుతాడు? సరుకులో నించే లాభాన్ని (అదనపు విలువని) లాగాలంటే, దాన్ని కలపకపోతే అది ఎలా సాధ్యం?"

"అవును, తెలుస్తోంది గానీ ... చాలా ఘోరంగా ఉంది! ఒక వేళ, ఆ సరుకు ధరని మనం నిర్ణయిస్తే? మనం కూడా, ఆ 2 ఖర్చుల మీద 'అదనాన్ని' కలుపు తామా? ఎందుకు కలుపుతాం?"

"చాలా మంచి ప్రశ్న! తెలివి బాగా ఉపయోగించారు. ఇంకా సరిగా చెప్పాలంటే, ఇది తెలివి తక్కువ ప్రశ్న కూడా. ఎందుకంటే: చొక్కాల ఉదాహరణలో, అసలు శ్రామికులు చేసిన శ్రమ ఎంత? విలువగా చూస్తే ఆ శ్రమ విలువ ఎంత? 40 కదా? వాళ్ళు నిజంగా 40 శ్రమ చేశారు. అంత శ్రమ జరిగింది కాబట్టే, అంత సరుకు తయారైంది. శ్రమలో సగం జరగకపోయి ఉంటే, సగం సరుకు తయారవదు. ఉత్పత్తి సాధనాల్లో కూడా సగం భాగం ఖర్చవదు. శ్రామికులు నిజంగా 20 శ్రమే చేసి ఉంటే, ఉత్పత్తి సాధనాల ఖర్చు సగమే కాబట్టి, అది 80 కాదు, 40 అయ్యేది. చొక్కాలు 8 కాదు, 4 మాత్రమే అయ్యేవి. కానీ, ఇప్పుడు శ్రామికులు చేసిన శ్రమ 20 కాదు, 40. వాళ్ళకి యజమాని 20 మాత్రమే ఇచ్చాడు కాబట్టి, శ్రామికులు 20 శ్రమే చేసి నట్టు అర్థమా? యజమాని, పని చేయించేసుకుని, 20 అయినా ఇవ్వకుండా ఎగ్గొడితే, శ్రామికుల శ్రమే లేకుండా 8 చొక్కాలు తయారయ్యాయని అర్థమా? కాబట్టి, యజమాని ఇచ్చే జీతమే అసలు జరిగిన శ్రమ అనుకోకూడదు. వాడు చెల్లించని భాగం 20 ఉంది కాబట్టే, వాడు అదనంగా ఆ భాగాన్ని కలపగలిగాడు. మనం అయితే ఏం చేస్తాం - అని కదా మీ ప్రశ్న? ఇదే చొక్కాల ఉదాహరణలో, శ్రామికుల 40 శ్రమ, శ్రామికులకు వెళ్ళి పోవాలి. అప్పుడు, ఉత్పత్తి సాధనాల 80నీ, జీతాల 40నీ, ఈ 2 అంశాలనీ కలిపితే చాలు. సరుకు విలువ 120 అవుతుంది. అదనాన్ని కలపనక్కరలేదు. కానీ, పెట్టుబడిదారుడు అలా చెయ్యడు. అతను ఇచ్చే జీతమే నిజంగా జరిగిన కొత్త శ్రమ కాదు. అందుకే యజమానీ శ్రామిక సంబంధంలో అదనం భాగం ఉండి తీరుతుంది. అది లేకపోతే వాడికి వడ్డీ లాభాలు ఎలా రావాలి?"

"ఇప్పుడు బాగా తెలిసింది. అవును, యజమానులు చాలా సార్లు జీతాలు ఎగ్గొడతారు. వాళ్ళు ఎంత ఇస్తే అదే శ్రామికులు చేసిన నిజం శ్రమ అనుకుంటే - అది తప్పే. కొంత ఇవ్వకుండా ఎగ్గొడతారు కాబట్టి, చెల్లించకుండా ఉన్న భాగాన్ని అబద్ధాల పేర్లతో తీసుకుంటారన్నమాట! అయితే, మా జీతాలన్నీ ఇలాంటివేగా? ఎంత ఘోరం! ఇదా జరిగేది! మరి, అయితే మనం, దోపిడీ లేని మంచి పద్ధతిని ఊహిస్తే, ఈ ఉదాహరణ లోనే ధరని నిర్ణయించాలంటే, పాత శ్రమ 80నీ, కొత్త శ్రమ 40నీ, కలపవసలిందే. అయితే, ఉత్పత్తి సాధనాన్ని మొదట కొంటాం కాబట్టి వాటి విలువ 80గా తెలుస్తుంది. మనుషుల కొత్త శ్రమ విలువ 40 అని ఎలా తెలుస్తుంది?"

"ఉత్పత్తి సాధనాల ఖర్చు తెలిసినట్టే, మనుషులకు ఇంటా బైటా ఏ యే ఖర్చులు అవుతాయో, వాళ్ళు సుఖంగా బతకడానికి ఎన్ని అవసరాలు ఉంటాయో, వాటి పని కాలాలూ, ఖర్చులూ, తెలియవా? తెలుస్తాయి. వాళ్ళ శ్రమలతోనే ఆ ఉత్పత్తులు తయారై, వాటిని వాడుకోగలుగుతారు కదా? ఎన్ని ఉత్పత్తులు వాడుతున్నారో, రవాణా వంటి ఎన్ని శ్రమలు వాడుతున్నారో, అన్నిటినీ లెక్క కడితే, ఆ విలువే 40 అనుకుందాం. దాన్ని ఉత్పత్తి సాధనాల 80కి కలిపితే, అదే కొత్త ఉత్పత్తి విలువ అవుతుంది. ఒక జాగ్రత్త! ఇక్కడ 10 గంటల పని దినం ఉన్నట్టే అక్కడా ఉంటుందని కాదు. అక్కడ అవసరమయ్యే పని దినాన్ని బట్టి, ఆ లెక్కలు ఉంటాయి. యజమానికి పోయేది లేకపోతే, ఆ లెక్కలు కష్టం కాదు. అక్కడ ఏ మనిషికైనా, ఇంటా బైటా అవసరమయ్యే ఉత్పత్తుల ఖర్చులే, ఆ మనిషి చేసే శ్రమ విలువగా ఉంటాయనీ, అది ఆ మనిషి వాడకానికే ఖర్చవుతుందనీ, అనుకోవాలి. ఇక్కడ అంత కన్నా వివరాలు ఎందుకు?" ★

# 17. స్వతంత్ర ఉత్పత్తిదారుల ధర పద్ధతి, వర్తకుల పద్ధతే!

**56.** **8 చొక్కాల సరుకుని, నలుగురు స్వతంత్ర ఉత్పత్తిదారులు కలిసి ఒక చోట చేసుకుంటే? వాళ్ళ శ్రమ విలువ, 20గా ఉంటుందా, 40గా ఉంటుందా? వాళ్ళు ఆ సరుకు విలువని, 100గా నిర్ణయిస్తారా, 120గా నిర్ణయిస్తారా? యజమానికి పోయే భాగం ఉండదు కాబట్టి, 100 గానే నిర్ణయిస్తారు అనుకుంటే, అది తప్పా?**

**జ:** ఖచ్చితంగా తప్పే. కాకపోతే, ఇది కొత్త విషయాల్ని అర్థం చేసుకునే క్రమం కాబట్టి, ఇలాంటి తప్పులు తప్పవు. ఒక వస్తువు తయారవ్వాలంటే, దానికి ఎన్ని ఉత్పత్తి సాధనాలు కావాలో, మనుషులు చేసే కొత్త పని ఎంత సేపు జరగాలో, ఆ సాధనాల అవసరాలూ, ఆ పనీ, యజమాని దగ్గిర జరిగినా, యజమాని లేకుండా జరిగినా, ఒక్కలాగే ఉంటాయి. ఫలానా సైజుతో ఒక చొక్కా తయారవడానికి ఒక మీటరు బట్ట కావాలంటే, యజమానితో సంబంధం లేకుండా అయితే, అర మీటరు బట్టతోనే ఆ చొక్కా తయారవుతుందా? పని ఎక్కడ జరిగినా, బట్టతో అవసరం

ఒకటే. అలాగే, ఇతర అవసరాల సంగతి కూడా. ఈ ఉదాహరణలో ఉన్న ఉత్పత్తులు (8 చొక్కాలు) ఉత్పత్తి సాధనాల 80 మీద, కొత్త శ్రమ 20 తోనే తయారవవని చూశాం కదా? కొత్త శ్రమ 20 వరకే జరిగి ఆగిపోతే, ఉత్పత్తి సాధనాల ఖర్చు 80 వరకూ జరగదు; 40 వరకే జరుగుతుంది. అంటే, ఉత్పత్తి సాధనాల వాడకం 80 వరకూ జరగాలంటే, కొత్త శ్రమ 40 వరకూ జరగవలిసిందే. ఉత్పత్తి, ఏ సంబంధంలో తయారైనా, దానికి అవసరమయ్యే ఉత్పత్తి సాధనాలూ, కొత్త శ్రమా, ఒక్కలాగే ఉంటాయి కాబట్టి, దాని విలువ కూడా ఒక్కలాగే ఉంటుంది. స్వతంత్ర ఉత్పత్తిదారులు, తమ సరుకుల విలువల్ని నిర్ణయించే పద్ధతి కూడా, వర్తకులు, వాళ్ళ సరుకుల విలువల్ని నిర్ణయించే పద్ధతి గానే ఉంటుంది. అంటే, ఖర్చుల మీద కొంత లాభాన్ని వేసుకునే పద్ధతిగానే. ఖర్చులూ + లాభమూ - ఇదే వర్తకుల ధర పద్ధతి.

"స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా ఉత్పత్తి సాధనాల్ని బజార్లో కొంటారు కాబట్టి, వాటి కోసం 80 ఖర్చు అవడం వారికి కూడా తెలుస్తుంది. ఆ సంగతి తెలుస్తుంది గానీ, తమ కొత్త శ్రమ విలువ ఎంత ఉంటుందో ఎలా తెలుస్తుంది? పెట్టుబడిదారుడు అయితే, జీతాల కోసం 20 ఇస్తాడు కాబట్టి, దాని మీద అదనం కోసం, ఇంకో 20ని వేసుకున్నాడని చెప్పుకున్నాం. స్వతంత్ర ఉత్పత్తిదారుడు, అదే పద్ధతిలో అదనాన్ని చేర్చుకుంటాడా? ఈ చొక్కాల ఉదాహరణలో, వాళ్ళు కూడా 120 విలువ గానే ఎలా నిర్ణయించగలుగుతారు?"

"ఈ ప్రశ్న బాగుంది. బాగా ఆలోచిస్తున్నారు. అసలు స్వతంత్ర ఉత్పత్తిదారుల సమాజం అనేది ప్రత్యేకంగా ఏ కాలంలోనూ లేదు. ఆదిమ కాలంలో డబ్బుతో అమ్మకాలే ఉండవు. అవి, కొంతైనా ప్రారంభమయ్యేది, బానిస యజమానుల కాలంలోనే. ఆ సమాజంలో ఉండేది బానిసలూ, యజమానులూ మాత్రమే కాదు; స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా (ఉదా: చేతి వృత్తుల వారు) ఆ సమాజంలోనే ఒక భాగంగా ఉంటారు. ఆ ఉత్పత్తిదారులు, తమ ఉత్పత్తులేవైనా అమ్మాలంటే, అవతల బానిస యజమానులు ఏ విలువలతో అమ్ముతున్నారో, వాటిని ఎలా నిర్ణయిస్తున్నారో, అలాగే వీళ్ళూ చేస్తారు. బానిస యజమానుల సరుకుల్ని వర్తకులే అమ్మిపెడతారు. అలా అమ్మేటప్పుడు, ఆ వర్తకులు, తమకు రావలసిన వర్తక కమిషన్ కోసమూ, యజమానికి మిగలవలసిన అదనం కోసమూ, ఎంతో కొంత అదనాన్ని అసలు ఖర్చుల మీద కలుపుతారు. 'లాభాన్ని వేసుకోవడం' అనేది, ఆ నాటి నించీ ఉంది. అంటే, బానిస యజమాని అమ్మే సరుకులు ఎంత తక్కువ సంఖ్య అయినా, ఆ లెక్కలు ఎంత అస్తవ్యస్తపు లెక్కలు అయినా, ఆ నాటి ధరల్లో కూడా 'అదనం' అనేది ఉంటుంది.

ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుడు కూడా అదే రకం సరుకుని అమ్మితే, అవతలి వాళ్ళు పెట్టే ధరనే తనూ పెడతాడు. ఆ సరుకు అలాగే అమ్మకం అయితే, ఆ ధర వల్ల, స్వతంత్ర ఉత్పత్తిదారుడికి కూడా ఖర్చుల్ని మించిన అదనం వస్తుంది. ఉత్పత్తి సాధనాల ఖర్చునీ, తిండి ఖర్చునీ మించిన అదనం వస్తే, అది ఇతరుల శ్రమ నించి

వచ్చే అదనం కాదు. ఆ అదనం కూడా అతని శ్రమ విలువే. అంటే అతని శ్రమ విలువ అంతా అతనికే అందుతుంది. అతనికి యజమాని ఉండడు కాబట్టి, సరుకు విలువలో నించి బైటికి పోయే భాగం ఏమీ ఉండదు. కానీ, ఈ ఉత్పత్తిదారుడు కూడా పని స్థలం కోసం చిన్న భూమిని కౌలుకి తీసుకుంటే, అదనంలో నించి ఆ కౌలుని చెల్లించాలి. డబ్బుని అప్పు తెచ్చుకుంటే, దానికి కూడా అదనంలో నించే వడ్డీని చెల్లించాలి. ఆ రకంగా వీళ్ళకి కూడా కొంత శ్రమ విలువ బైటికి పోవచ్చు. సరుకు సరిగా అమ్మకం అయితే, 'ఉత్పాదక లాభం' అనేది అయినా మిగులుతుంది. అంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకుల విలువలు కూడా, ఖర్చుల మీద అదనం కలిసి ఏర్పడేవి గానే ఉంటాయి. కానీ ఈ విషయాలేవీ ఆ ఉత్పత్తిదారుడికి తెలియవు. తన సరుకుని అమ్ముకుంటే, ఖర్చులు తిరిగి వచ్చి, ఆ పైన అదనంగా ఉన్నదాన్ని చూసి, "లాభం వచ్చింది" అనుకుంటాడు. "నా అదనపు శ్రమే ఇది" అనుకోడు. "వర్తకులు అమ్మే సరుకుల వల్ల లాభాలు వస్తూ ఉన్నట్టే, సరుకుల్ని ఎవరు అమ్మినా లాభాలు వస్తాయి" అనుకుంటాడు. లాభం రాకపోతే, అది విడ్డూరంగా కనపడుతుంది.

భూస్వాముల సమాజంలో జరిగేది కూడా అదే. అక్కడ, భూస్వాములూ, కౌలు రైతులూ ఉండగా కూడా, స్వతంత్ర ఉత్పత్తిదారులు ఉంటారు. వాళ్ళ సరుకుల ధరలు, బైట బజార్లో ఉన్న వర్తకుల ధరల లాగే ఉంటాయి. వర్తకులు అమ్మే సరుకులన్నీ భూస్వాముల కోసమూ, కౌలు రైతుల కోసమూ, అమ్మిపెట్టే సరుకులే. వాటి ధరలు, అసలు ఖర్చుల మీద లాభాలు (అదనాలు) వేసి ఏర్పర్చినవి గానే ఉంటాయి. స్వతంత్ర ఉత్పత్తిదారుల ధరల పద్ధతీ అలాగే ఉంటుంది. వాటి వల్ల, వాళ్ళకు కూడా అదనాలు వస్తాయి.

అయితే, పెట్టుబడిదారీ సమాజంలో కూడా అదే పరిస్థితి ఉంటుంది గానీ, ఇక్కడ ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుడి సరుకు, ఒక పెట్టుబడిదారుడి సరుకుతో పోటీ పడలేని పరిస్థితి బైల్దేరుతుంది. పెట్టుబడిదారీ విధానం అనగానే, అక్కడ 'పోటీలు' ప్రధాన లక్షణాలు. సరుకుని తయారు చెయ్యడానికి అవసరమయ్యే శ్రమ మొత్తాన్ని తగ్గించడానికి పనిముట్లని మెరుగుపరచి, ఉత్పత్తి శక్తుల్ని పెంచుతారు. అదే కాలంలో ఆ పని ఇతర పెట్టుబడిదారులందరూ చెయ్యలేరు. అలా చెయ్యగలిగిన వాడు, తన దగ్గిర శ్రమ కాలం తగ్గిన సరుకుకి కూడా విలువని తగ్గించకుండా, ఎప్పటి విలువలతోనే అమ్మి, ఇతర పెట్టుబడిదారుల కన్నా ఎక్కువ లాభాన్ని సంపాదించే ప్రయత్నాలు చేస్తాడు. ఆ ప్రయత్నాలు ప్రారంభంలో, కొందరే చెయ్యగలుగుతారు. కానీ క్రమంగా ఆ ప్రయత్నాలు పెట్టుబడిదారులు అందరూ చెయ్యగలిగితే, అందరి లాభాలూ సమానం అవుతూ ఉంటాయి. మొదటి వాడు మళ్ళీ కొత్త ప్రయత్నాలు మొదలు పెడతాడు. పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తిలో, ఈ పోటీలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఒక పెట్టుబడిదారుడితో, ఇంకో పెట్టుబడిదారుడే

పోటీతో నలిగిపోయే పరిస్థితుల్లో, స్వతంత్ర ఉత్పత్తిదారులు అసలు పోటీ పడలేరు. తమ సరుకుల్ని తక్కువ శ్రమ కాలంతో తయారు చెయ్యగలిగే విధంగా, తమ ఉత్పత్తి శక్తుల్ని పెంచే మెరుగైన పనిముట్లని సాధించలేరు. వారి సరుకులు పాత రకంగానే ఎక్కువ శ్రమలతోనే తయారవుతూ ఉన్నా, వాటిని తక్కువ ధరలతోనే అమ్ముకోవలసి వస్తుంది. ఆ రకంగా, ఎంత ఎక్కువ కాలం శ్రమ చేసినా, దానికి తక్కువ విలువే వస్తుంది. అదనం రాకపోవడమే కాదు, పోషణ జరగడమే అసాధ్యం. ఈ విషయాలన్నీ 'కాపిటల్'లో చాలా వివరంగా తెలుస్తాయి. అదంతా ఇక్కడ చూడడం సాధ్యం కాదు.''

''అయితే, పెట్టుబడిదారీ సమాజంలో, స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా పేద తనంలోకి పోతూ ఉంటారని అనుకోవాలా?''

''అద్భుతంగా గ్రహిస్తున్నారు మీరు. అసలు పెట్టుబడిదారీ సమాజంలో, స్వతంత్ర ఉత్పత్తిదారులు ఎంతో కాలం స్వతంత్రంగా బతకలేరు. క్రమంగా ఆ సంఖ్య వేతన శ్రామికులుగా మారిపోతూ ఉంటారు.'' ★

# 18. స్వతంత్ర ఉత్పత్తిదారుల పని కాలం 2 భాగాలుగా ఉంటుందా?

**57. యజమాని దగ్గిర పని చేసే శ్రామికులైతే, జీతాన్ని మించి అదనం కోసం ఎక్కువ గంటలు పనిచెయ్యాలి. స్వతంత్ర ఉత్పత్తిదారులు, ఎక్కువ పని ఎందుకు చేస్తారు?**

**జ:** మంచి సందేహాలు వస్తున్నాయి మీకు. 'జీతం' అనేది, బతకడానికి చాలీ చాలని కనీస పోషణ. వేతన శ్రామికులు దానితోనే బతకాలి. స్వతంత్ర ఉత్పత్తిదారులైతే, అంత తక్కువ పోషణతో ఎందుకు బతకాలి? సుఖంగా తినడానికి కావలసినంత పని చేసుకోవచ్చు కదా? ఇక్కడ మనం 'పని దినం' అనే దాన్ని తీసుకుని చూస్తే, ఈ విషయాలు సరిగా అర్థం చేసుకోగలం. 2 భాగాలుగా ఉండేది, శ్రామికుల పని కాలమే కాదు, స్వతంత్ర ఉత్పత్తిదారుల పని కాలం కూడా 2 భాగాలుగా ఉంటుంది. మొదట శ్రామికుల పని కాలాన్ని చూద్దాం. చొక్కాల ఉదాహరణలో, పని దినాన్ని 10 గంటలు అనుకున్నాం. ఆ 10 గంటల శ్రమ విలువ 40. శ్రామికులకు జీతాలుగా అందింది 20. అంటే, మొదటి 5 గంటల వరకూ చేసిన విలువే శ్రామికులకు అందింది. అక్కడి తోటే వాళ్ళు పని ఆపేసి వెళ్ళిపోవచ్చు. కానీ, యజమానీ శ్రామిక సంబంధంలో అలా కుదరదు. పెట్టుబడిదారుడికి ''అదనపు విలువ'' కూడా తయా రవ్వాలంటే, శ్రామికులు ఇంకా కొన్ని గంటలు పని చెయ్యాలి. అంటే, బానిసలు గానీ, కౌలు రైతులు గానీ, జీతాల శ్రామికులు గానీ, ప్రతీ రోజూ పనిలోకి దిగాక, మొదట కొన్ని గంటల వరకూ తమ కోసమూ, తర్వాత కాలం అంతా యజమాని కోసమూ, చేస్తారన్నమాట! శ్రామికుల శ్రమ, 2 భాగాలుగా విడిపోతుంది. శ్రమగా చూసినా, ఉత్పత్తిగా చూసినా, విలువగా (డబ్బుగా) చూసినా, పనికాలం, 2 భాగాలు!

శ్రామికుల పని దినం 2 భాగాలు:

| మొదటి భాగం | రెండో భాగం | మొత్తం పని దినం |
|---|---|---|
| 1. అవసర శ్రమా | 1. అదనపు శ్రమా | మొత్తం శ్రమ కాలం |
| 2. అవసర ఉత్పత్తీ | 2. అదనపు ఉత్పత్తీ | మొత్తం ఉత్పత్తి |
| 3. అవసర విలువా | 3. అదనపు విలువా | మొత్తం విలువ |
| ఈ భాగం, శ్రామికుల కనీస పోషణ కోసం. ఈ శ్రమని శ్రామికులు తమ కోసం చేసుకోవాల్సిందే. | ఈ భాగం, శ్రామికులకు అందకుండా యజమానికి పోతుంది. ఈ శ్రమని శ్రామికులు చెయ్యనక్కర లేదు. కానీ చెయ్యక తప్పదు. | ఈ మొత్తం శ్రమ, శ్రమచేసే మనుషులకే అందితే? |

'బానిసల' విషయంలోనూ, 'కౌలు రైతుల' విషయంలోనూ అయితే, వాళ్ళ నించి యజమానికి, అదనపు శ్రమ గానీ, అదనపు ఉత్పత్తి గానీ, వెళ్తాయి. ఆ సమాజాల్లో సరుకుల అమ్మకాలు ఎక్కువగా ఉండవు కాబట్టి, యజమానికి అందేది, డబ్బుగా గాక, ఉత్పత్తిగానే ఉంటుంది. జీతాల శ్రామికుల విషయంలో అయితే, వాళ్ళు తయారుచేసే సరుకు రాసి అంతా అమ్మకాల్లోకి వెళ్తుంది కాబట్టి, వాళ్ళ శ్రమ, డబ్బుగా మారుతుంది. అందులో ఉన్న అదనపు శ్రమ, యజమానికి డబ్బుగానే అందుతుంది.

"స్వతంత్ర ఉత్పత్తిదారుల పని కాలం కూడా అలాగే, సగం సగం భాగాలుగా ఉండాలా?"

"ఉండొచ్చు, ఉండకపోవచ్చు. అది అతని ఇష్టం. యజమానికి పోయే భాగం లేనప్పుడు, ఆ ఉత్పత్తిదారుడు తన పోషణ కోసం చేసుకుంటే చాలు. అయితే, ఆ పోషణ, కనీస పోషణగా గాక, కడుపు నిండా తిని, కంటి నిండా నిద్రపోయే పోషణగా ఉండాలంటే, అతని శ్రమ, కనీస పోషణని ఇచ్చేదాని కన్నా కొంత ఎక్కువ గానే ఉండాలి. స్వతంత్ర ఉత్పత్తిదారుడి పని కాలం కూడా 10 గంటలు - అనుకుందాం. అయితే, ఆ సరుకుని అమ్మగా వచ్చిన డబ్బులో నించి, 8 గంటల విలువని, తన పోషణ కోసం వాడేసుకుంటే, 2 గంటల విలువే అదనంగా మిగులుతుంది. దాన్ని పొదుపు చేస్తాడు. లేదా, పీనాసితనంగా, 4 గంటల విలువని మాత్రమే పోషణకి వాడుకుంటే, 6 గంటల డబ్బు పొదుపు అవుతుంది. లేదా ఆ ఉత్పత్తిదారుడు, రోజుకి 5 గంటలు మాత్రమే పని చేస్తే, తక్కువ ఉత్పత్తే తయారై, తక్కువ డబ్బే వచ్చి, వేతన శ్రామికుల స్థాయిలోనే బతుకుతాడు. అది, కనీస పోషణగా మాత్రమే ఉంటుంది. దానికి అతను, తనని తనే నిందించుకోవాలి గానీ, యజమానిని నిందించడానికి, యజమాని ఉండడు. ఈ ఉత్పత్తిదారుడు, ఎక్కువ పని చెయ్యకుండా తప్పించుకోగలడు గానీ, కనీస పోషణ కోసం కావలసిన పని కూడా చెయ్యకుండా

తప్పించుకోలేడు. లేదా, రోజుకి 12 గంటలు పని చేస్తే, ఎక్కువ డబ్బు సంపాదించ గలడు. కానీ కొన్నాళ్ళకి, ఆ డబ్బు అంతా వైద్యానికి పెట్టవలసి వస్తుంది. ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా కొంత ఎక్కువ పని చేసుకుంటే, క్రమంగా పొదుపు భాగం ఎక్కువై, కొంత ఆస్తిని కూడా కూడబెట్టగలుగుతాడు."

"బద్ధకంగా పని చేసే ఉత్పత్తిదారుడు, తన సరుకు ధరని, వేతన శ్రామికుడు చేసిన సరుకు ధరతో సమానంగా ఎలా నిర్ణయించగలుగుతాడు?"

"ఇంత తెలివి తక్కువ ప్రశ్నా! ఒక్కోసారి సరిగా ఆలోచిస్తూ, అప్పుడప్పుడూ ఇలా అవుతున్నారెందుకూ? పెట్టుబడిదారుడు అమ్మే సరుకులో మొత్తం పని కాలం 10 గంటలు అనుకుంటే, ఒక బద్ధకాల ఉత్పత్తిదారుడు రోజుకి 5 గంటలే పని చేస్తే, 2 రోజుల పనితో, ఆ 10 గంటల సరుకుని తయారు చెయ్యలేడా?"

"అవునవును, ఇప్పుడు తెలిసింది. దాన్ని ఎన్ని రోజుల్లో చేశాడనేది కాదు. అతని సరుకు కూడా 10 గంటల శ్రమతో తయారైనదై ఉంటే, పెట్టుబడిదారుడి సరుకు ధరతోనే ఇతనూ అమ్మగలడు. తెలిసింది."

"ఒక సందేహం వచ్చినప్పుడు, కొంచెం ఆలోచిస్తే జవాబు దొరక్కుండా ఉండదు. దొరికి పోతుంది."

"ఒక్కళ్ళే ఆలోచిస్తే కాదు, నలుగురు కూర్చుని ఆలోచిస్తేనే, ఆ వాదాల మధ్య ఏదో రకంగా జవాబు దొరకవచ్చు. ఎవళ్ళకి వాళ్ళకి జవాబు దొరకదు."

"మీరు కాపిటల్ చదవలేదు కాబట్టే, సందేహాలు పుట్టుకొస్తున్నాయి."

"చదువుతాం, తప్పకుండా చదువుతాం. కానీ ముందు ఇవన్నీ వినాలి. ఒక సందేహం తీరితే ఇంకో సందేహం పుట్టుకొస్తోంది."

"ఫర్వాలేదు. అడుగుతూ ఉండండి. చెప్పగలనో లేదో చూస్తాను. లేకపోతే నేనూ నేర్చుకుంటాను. స్వతంత్ర ఉత్పత్తిదారుడి పని కాలం కూడా 2 భాగాలుగా ఉంటుందా అని అడిగారు కదా? అది తెలిసినట్టేనా?"

"పూర్తిగా తెలిసింది. కనీసంగా పని చేసుకోకపోతే అతను కూడా బతకలేడు. కొంత ఎక్కువ పని చేసుకుంటే, సుఖంగా బతుకుతాడు. కానీ, వేతన శ్రామికులైతే, ఎంత చేసినా అదనం అంతా యజమానికే పోతుంది గానీ, వాళ్ళకి మిగిలేది ఆ కనీసం తప్ప ఏమీ ఉండదు. అంటే, మా పరిస్థితి ఇదే అన్నమాట! మా బతుకులు ఇంత ఘోరంగా ఉంటున్నది ఇందుకేనని ఇన్నాళ్ళూ నిజంగా మాకు తెలీదు."

"అందుకే కదా, శ్రామికులందర్నీ తెలుసుకోమని మార్క్సు రాసింది?"

"మీరు కూడా మా లాగే వేతన శ్రామికులేనా?"

"నేను పుస్తకాలు రాసే పని చేస్తాను. అవి అమ్మకానికి వెళ్తాయి. కానీ, నా పని యజమాని దగ్గిర కాదు. ఏదైనా రాసి పత్రికలకు ఇచ్చినా, అది కూడా యజమాని దగ్గిర చేసే పని కాదు."

"అంటే, మీరు స్వతంత్ర ఉత్పత్తిదారుల్లాగా అవుతారు. అంటే, మీ అదనం మీకే అందుతుంది."

"అలాగే జరగాలి గానీ, అదంతా జరగదు. నా పుస్తకాల ధరల్ని లాభాల్ని తెచ్చే విగా పెట్టం. జరిగిన ఖర్చులు కూడా పూర్తిగా వెనక్కి రావు. ఈ విషయాలు ఇంకో చోట చెపుతాను. మనం ఇంకా చాలా విషయాలు చూడాలి. 'విలువ' ఎలా ఏర్పడు తుందో మీకు బాగా అర్థమైనట్టేనా?"

"అర్థమైంది గానీ...."

"అంటే సందేహం అన్నమాట! ఏమిటా 'కానీ'?" ★

## 19. లాభానికి న్యాయమైన మార్గం ఉందా?

**58.**'ధర' గురించే మళ్ళీ సందేహం! **చొక్కాల ధర సంగతే. శ్రామికులు చేసిన పని విలువ 40 కదా? దాని వల్లే, ఆ సరుకు విలువ 120 అవుతుంది కదా? అప్పుడు పెట్టుబడిదారుడు ఒకలా చేస్తే? పని వాళ్ళ 40ని, వాళ్ళకి ఇచ్చేసి, ఆ పైన తను ఇంకో 20ని వేసుకుంటే? ధరని 140 చేస్తే? అప్పుడు, పని వాళ్ళ శ్రమని తీసు కున్నట్టు అవదు కదా? వాళ్ళది వాళ్ళకే వెళ్తుంది. పెట్టుబడిదారుడికి కూడా కావల సింది వస్తుంది. ఇలా చేస్తే ఇందులో తప్పేమన్నా ఉంటుందా?**

**జ:** తప్పు ఉందో లేదో తెలీలేదంటే, విషయం మీకు సరిగా అర్థం కాలేదన్నమాటే!

మీ సందేహం ఒక రకంగా తెలివైందీ, ఇంకో రకంగా తెలివి తక్కువదీ కూడా! ఏ వస్తువుకైనా 'విలువ' ఎలా ఏర్పడుతుందని చూశాం? రెండే రెండు అంశాల వల్లే కదా? ఉత్పత్తి సాధనాల పాత శ్రమ వల్లా, శ్రామికులు చేసే కొత్త శ్రమ వల్లా, అంతే. సరుకుకి ఉండే విలువ న్యాయంగా పెరగాలంటే, ఆ సరుకు తయారీకి పట్టే శ్రమకాలం నిజంగానే పెరిగితే, విలువ పెరగవలిసిందే. శ్రమ కాలం పెరగకుండా, సరుకు ధరని, మోసంగా పెంచే పద్ధతి కూడా ఉంటుంది. విలువ, నిజంగా పెరిగినా, మోసంగా పెంచినా, ఆ పెరిగిన విలువ ఆ సరుకులో ఉన్న ఏ అంశాలకు మాత్రమే చెందాలో, ఆ సూత్రం మారదు. ఉత్పత్తికి విలువ, ఏ అంశాల వల్ల తయారైందో, ఆ విలువ ఆ అంశాలకే అందాలి. ఉత్పత్తికి, నిజంగా గానీ, మోసంగా గానీ, ఎంత విలువ అయినా ఉండనియ్యి! ఆ డబ్బునే పంచాలన్నా, ఆ ఉత్పత్తినే భాగాలు చేసి పంచాలన్నా, అది ఏ 2 అంశాల వల్ల తయారైందో, ఆ 2 అంశాలకే అందాలి గానీ, ఏ మూడో అంశానికైనా ఆ పంపకాల్లో చోటు ఉంటుందా? చొక్కాల సరుకు విలువ 120 కదా? దాన్ని 2 అంశాలకే పంచితే, పాత శ్రమకి 80 పోగా, మిగిలిన 40, కొత్త శ్రమదే అవుతుంది. అంటే, ఆ 120 విలువ, 2 అంశాలదే కాబట్టి, అది ఆ 2 అంశాలకే అందాలి.

లేదా, ఆ సరుకు విలువని మోసంగా 140గా చేసినా, అప్పుడు కూడా అది 2 అంశాలదే. ఉత్పత్తి సాధనాలకి 80 పోతే, మిగిలిన 60, కొత్త శ్రమదే అవుతుంది.

లేదా, ఆ సరుకుకి నిజంగా ఉన్న 120 విలువని మోసంగా 240గా చేస్తే, అప్పుడు కూడా అది 2 అంశాలదే.

**సరుకు విలువ న్యాయంగా 120 అయినప్పుడు:**

పాతశ్రమా + కొత్త శ్రమా

80 + 40 = 120

సరుకులో, పాత శ్రమ విలువా, కొత్త శ్రమ విలువా, ఏవో న్యాయమైన కారణాల వల్ల, రెట్టింపులుగా అయ్యాయి అనుకుందాం.

న్యాయంగానే సరుకు విలువ 240 అయినప్పుడు:

పాత శ్రమా + కొత్త శ్రమా

160 + 80 = 240

**సరుకు విలువని అన్యాయంగా పెంచితే ఏం జరుగుతుంది?** 8 చొక్కాల విలువ 120 కదా? ఆ సరుకు లోకి కొత్త శ్రమ ఏదీ చేరకుండా, ఆ 120 ని, 140 గా చేస్తే ఏ భాగంలో మార్పు జరుగుతుంది? - ఉత్పత్తి సాధనాల భాగం మారదు. అది పెరగదూ, తరగదూ. దాని 80, దానికి రాకపోతే, చొక్కాల పునరుత్పత్తికి కొత్త ఉత్పత్తి సాధనాలు ఉండవు. దానికి 80 కన్నా ఎక్కువ అందవలసిన అవసరం లేదు. దాని 80 విలువ దానికి అందితే చాలు. 140 లో నించి 80 పోతే, ఇంకా మిగిలే 60 ఏమిటి? అది ఏ భాగానిది? అది కొత్త శ్రమ భాగానిది. కానీ, ఆ 60లో నించి, శ్రామికులకు జీతంగా 40 అందినా, అందకుండా పోయేది 20. సరుకు విలువని పంచుకోవడానికి కౌళ్ళూ - వడ్డీ లాభాలూ ప్రవేశించడం వల్ల, ఉత్పత్తి సాధనాల భాగానికేమీ నష్టం జరగదు గానీ (ఆ విలువ తప్పకుండా వెనక్కి వచ్చి తీరుతుంది కాబట్టి), కొత్త శ్రమ భాగానికి నష్టం జరుగుతుంది. 'అదనపు విలువ' భాగాన్ని అంతా, కొత్త శ్రమలో నించే తియ్యడం సాధ్యమవుతుంది.

సరుకు విలువని అన్యాయంగా పెంచితే, ఆ విలువ లెక్క పెరుగుతుందే గానీ, ఆ సరుకు శరీరం పెరగదు. 8 చొక్కాల విలువని ఎంత పెంచినా, అవి 8 చొక్కాలే. ఆ ఉత్పత్తిని పంచుకోవలిసింది, 2 అంశాలే. ఆ ఉత్పత్తి 2 అంశాల ద్వారా తయారైందా, 2 కన్నా ఎక్కువ అంశాల ద్వారా తయారైందా? ఆ ఉత్పత్తిలో కొంత భాగం మూడో అంశానికి పోతే, దాని వల్ల జీతాల భాగానికే అన్యాయం జరుగుతుంది.

సరుకు విలువ 120 అయినప్పుడు, అందులో శ్రామికుల భాగం 40 అయితే, దాన్ని శాతంగా చూస్తే, 120లో 40, ఎంత శాతం? - 33%. ఆ 120ని, 140గా మార్చి, అందులో నించి శ్రామికుల భాగాన్ని 40గా పెంచినా, అది ఎంత శాతం? - 29%. అంటే, శ్రామికుల భాగం తగ్గింది. తగ్గుతుంది.

సరుకు విలువని ఎన్ని అబద్ధపు అంశాలు పంచుకున్నా, 'ఉత్పత్తి సాధనాల'కు తిరిగి అందవలసింది అందకుండా పోదు. అది, ఎలా అందాలో అలా అందకపోతే, కొత్త ఉత్పత్తి క్రమమే జరగదు. కాబట్టి, సరుకు విలువని పెట్టుబడిదారుడు ఎలా

పెంచినా, దాని వల్ల ఉత్పత్తి సాధనాల విలువ తిరిగి వచ్చే విషయంలో మోసం జరగదు. శ్రామికుల శ్రమ విలువని లెక్క కట్టడంలోనే మోసం జరుగుతుంది.

ఈ ఉదాహరణలో ఉన్న సరుకు (దాని విలువ గానీ, దాని ఉత్పత్తి గానీ), ఉత్పత్తి సాధనాలకూ, శ్రామికులకూ మధ్య (పాత శ్రమకూ, కొత్త శ్రమకూ మధ్య) మాత్రమే అందితే, శ్రామికులకు అందే భాగం 33%. అదే సరుకుని, దానితో సంబంధం లేని మూడో భాగం వచ్చి పంచుకుంటే, శ్రామికులకు అందే భాగం 29% అయింది. సరుకు విలువలో నించి 20ని, పెట్టుబడిదారుడు అదనపు విలువగా లాక్కుంటే, అది శ్రామికుల శ్రమలో నించి లాక్కున్నట్టే. శ్రామికులకు అందవలసిన ఉత్పత్తి తగ్గి పోయినట్టే."

"అర్థమైంది. ఇప్పుడు బాగా అర్థమైంది. ఉత్పత్తి సాధనాల విలువలో నించి కొంత భాగాన్ని లాక్కుని తినడం సాధ్యం కాదు. తింటే, శ్రామికుల భాగంలో నించే తినాలి. సరుకు విలువని ఎలా పెంచినా, అందులో మూడో అంశం ఎక్కడ ఉంది? ఈ సంగతి ఇప్పుడు అర్థమైనట్టు ఇందాక అర్థం కాలేదు."

"ఎందుకు అర్థం కాలేదంటే, 'పెట్టుబడిదారుడికి లాభం రావాలి కదా?' అనే దృష్టి అప్పటికి బాగా వదల్లేదు. 'పోనీ, సరుకు విలువని కొంచెం పెంచి, అందులో నించి పెట్టుబడిదారుడు కూడా కొంచెం తీసుకుంటేనో!' అనిపించింది మీకు అప్పుడు."

"అవును, ధరని కొంచెం పెంచి పెట్టుబడిదారుడు అదే తీసుకుంటే శ్రామికులకు అన్యాయం జరగదు కదా అనిపించింది నిజంగానే."

"అసలు, ఒక విషయం చెప్పుకోలేదు ఇంకా. చొక్కాల ఉదాహరణలో, శ్రామికుల శ్రమ విలువ 40 - అని ఎప్పుడు తేలింది? సరుకు ధర 120 గానూ, పాత శ్రమ విలువ 80 గానూ, ఉన్నప్పుడు! ఆ 2 అంశాలూ అలా ఉండడం వల్ల, శ్రామికుల భాగం 40గా తేలింది. కానీ, అసలు సరుకు ధర 140 అయితే, అప్పుడు ఆ ధర ప్రకారమే చూడాలి కదా? ఆ 140 నే లెక్కలోకి తీసుకుని, దాని ప్రకారం శ్రామికుల శ్రమని లెక్క కట్టాలి గానీ, అప్పుడు సరుకు విలువ 120 అనీ, కొత్త శ్రమ 40 అనీ, ఆ పాత లెక్కలు ఎందుకు? సరుకు విలువని 140 గా, పాత శ్రమని 80 గా, అనుకుంటే, ఆ ప్రకారమే చూడాలి. అలా చూస్తే, శ్రామికుల శ్రమ విలువ 60 అవుతుంది గానీ, 40 అవదు కదా?"

"అవును, ఇది మరీ బాగుంది. నా పాత అనుమానం అంతా తప్పు. 'శ్రామికుల శ్రమ 40 కదా? దాని మీద ఇంకో 20 వేసుకుంటే?' అన్నాను కదా? అసలు శ్రామికుల శ్రమ విలువని 40 అని నిర్ణయించాలంటే, సరుకు ధరని 120 గానే ఉంచాలి. దాన్ని మార్చకూడదు. దాన్ని 140 చేస్తే, కొత్త శ్రమ విలువ 40 గా ఎందుకు ఉంటుంది? అది 60 అవుతుంది. పెట్టుబడిదారుడు, కొత్త శ్రమ విలువలో కొంత భాగాన్ని తీసు

కోవడం అంటే, ఉత్పత్తిలో నించి కొంత భాగాన్ని తీసుకోవడమే కదా? అప్పుడు శ్రామికుల భాగం తగ్గిపోతుంది కదా? ఇప్పుడు చక్కగా అర్థమైంది."

"కాదు, అలా అనుకుంటున్నారు గానీ, ఇంకా అర్థమై ఉండదు. కాపిటల్ చదివితే గానీ అర్థం కాని విషయమే ఇది. ఇలాంటి విషయాలు అనేకం ఉన్నాయి ఇంకా."

"ఆ 'అనేకం' తెలీవుగానీ, ఇది మాత్రం అర్థమైంది. సరుకు ధరని ఎంత పెంచినా, అది పాత శ్రమకీ, కొత్త శ్రమకీ సంబంధించిందే అవుతుంది కదా? ఆ ధరలో నించి పాత శ్రమ భాగాన్ని తీసేస్తే, మిగతా భాగం, అది ఎంత ఉన్నా, అది కొత్త శ్రమదే. అందులో నించి పెట్టుబడిదారుడు ఎంత చిన్న ముక్క తీసుకున్నా, అది శ్రామికుల అదనపు విలువే! అమ్మో, అయితే మా హోటల్ వాడు ఎప్పుడూ ధరలు పెంచుతూ ఉంటాడు. మా అదనపు విలువని ఇంకా ఇంకా దోస్తున్నాడన్నమాట!"

"ధరలు పెంచినప్పుడల్లా మీ జీతాలు పెంచుతాడా?"

"పెంచడు. పెంచినా, అది లెక్కలోది కాదు. పెంచినా, అందులో నించి కూడా అదనపు విలువ పోతూనే ఉంటుంది కదా?"

"ధరలు పెంచడం మీ వాడొక్కడే చెయ్యలేడు. వీడికి ఉత్పత్తి సాధనాలు అమ్మే పెట్టుబడిదారులు ఉంటారు. వీడు, 10 శాతం ధర పెంచితే, వాళ్ళూ అలాగే పెంచుతారు. అదనపు విలువని మరింత దోచెయ్యడం జరగాలంటే, పాత ధరల్ని పెంచేస్తే సరిపోదు. ఆ పని అందరూ చేస్తారు కాబట్టి అది మళ్ళీ మామూలే. కాబట్టి అలా కాదు. అదనపు విలువని ఎక్కువగా లాగడం ఎలా సాధ్యమవుతుందంటే, ఉత్పత్తి శక్తుల్ని గతం కన్నా పెంచేసినప్పుడు! అప్పుడు, 'పని దినం'లో, శ్రామికుల అవసర కాలం తగ్గి, అదనపు కాలం పెరుగుతుంది. పని దినంలో మొదటి భాగం తగ్గినా, శ్రామికుల పోషణకు అందే ఉత్పత్తులు గతం లాగే ఉంటాయి. లేదా, ఒకటి రెండు పెరుగుతాయి కూడా. పని దినంలో రెండో భాగం పెరగడం అంటే, శ్రామికుల శ్రమ నించి లాగే భాగం పెరగడమే. ఇదంతా ఎన్నో రకాల లెక్కలు చూస్తే తప్ప తెలీదు. డబ్బు జీతాలు గతం కన్నా పెరిగినట్టు కనపడతాయి. అంతేగానీ, పని దినంలో మొదటి భాగం గతం కన్నా తగ్గి, రెండో భాగం గతం కన్నా పెరిగి, దోపిడీ గతం కన్నా పెరిగిందని, మేధాశ్రమల వాళ్ళకి కూడా తెలీదు. డబ్బు జీతాలు పెరగడం చూసి వాళ్ళు సంతోషపడుతూ ఉంటారు. ఇదంతా 'కాపిటల్'లో చదువుకోవాలి గానీ, ఇక్కడ ఎలా సాధ్యం? మార్క్సు ఇన్ని వాదాలతో చర్చించాడు!"

"అ లెక్కలన్నీ ఇప్పుడు మాకు అక్కరలేదు. బాగా తెలిసింది. లెక్కలు లేకుండానే తెలుస్తోంది. కాపిటల్ చదువుతాం. ఎలాగైనా తంటాలు పడి చదువుతాం. కానీ, ఇంకొక్క సందేహం చంపుతోంది."

"సరే, సందేహాలు చాలా మంచివే. చంపనివ్వండి! చివరికి సందేహాలే పోతాయి గానీ మనం పోయేదేమీ ఉండదు." ★

# 20. సూది ఖర్చవుతుంది, భూమి ఖర్చవుతుందా?

**59.** **పెట్టుబడిదారుడు తన భూమి మీదే పరిశ్రమని పెట్టుకుంటే, భూమికి 'కౌలు' తీసుకోకూడదు. తన డబ్బునే పెట్టుబడిగా పెట్టుకుంటే, దానికి 'వడ్డీ' తీసుకో కూడదు. అంత వరకూ నిజమే. అలా తీసుకుంటే తప్పే. కానీ, ఆ భూమీ, ఆ డబ్బూ, ఇతరుల నించి తెచ్చినవి అయితే, వాళ్ళకి కౌలూ, వడ్డీ, చెల్లించక తప్పదు కదా? ఆ డబ్బుని తన సరుకు ద్వారా తియ్యకపోతే, ఎక్కణ్ణించి తెచ్చి చెల్లిస్తాడు? అది తప్పు అవదేమో అనిపిస్తోంది. తప్పనీ, తప్పు కాదనీ, రెండు రకాలు గానూ అనిపిస్తోందే!**

**జ:** చాలా చోట్ల సరిగానే ఆలోచిస్తున్నారు. అయినా సందేహాలే! తెలుసుకోవల సిందంతా ఇంకా పూర్తి కాలేదు కదా? అదే కారణం. భూమికి కౌలు చెల్లించ వలసిన అవసరం ఉండదని మొదట స్పష్టంగా తెలిస్తే, ఏ సందర్భంలో అయినా అది తప్పే అని తెలియాలి. మనుషుల శ్రమలతో తయారయ్యే కత్తెరా, మగ్గం వంటి పనిముట్లు అయితే, వాడకం వల్ల పాతబడిపోతాయి కాబట్టి, పాత కత్తెరకు బదులు కొత్త కత్తెర రావాలి; పాత మగ్గానికి బదులు కొత్త మగ్గం రావాలి. ఆ సాధనాలు కొత్తగా తయారవ్వాలంటే, పాత దాని విలువ వెనక్కి వచ్చి తీరాలి. ఆ విలువ, వెనక్కి రావలసింది, ఆ సాధనం మళ్ళీ తయారవడానికే గానీ, ఆ విలువని ఒక మనిషి తిన డానికి కాదు. వెనక్కి వచ్చిన కత్తెర విలువని, ఒక మనిషి తినేస్తే, కొత్త కత్తెర రాదు. శ్రమతో తయారయ్యే వస్తువులకు వర్తించే విషయం, సహజ పదార్థం అయిన భూమికి వర్తిస్తుందా? వర్తించదు కదా? కొంత భూమిని పని స్థలంగా వాడినా, అది ఖర్చయిపోదు. కౌలు చెల్లించినా, ఆ డబ్బుతో కొత్త భూమి తయారవదు. మరి, కౌలుతో అవసరం దేనికి? ఆ అవసరం భూమికి కాదు, భూస్వామికి! అంటే, భూమిని తన ఆస్తిగా, తన ఆధీనంలో పెట్టుకున్న మనిషికి. ఆ మనిషి, స్వంత శ్రమ చెయ్య కుండా బతకడానికి కౌలు పేరుతో, కొంత డబ్బుని, లేదా కొంత ఉత్పత్తిని, సంపా దించడం ఒక దోపిడీ మార్గం. వడ్డీ సంగతీ అలాగే. మానవ సంబంధాల్లో 'అప్పు' సహజమే. బదుళ్ళూ, అప్పులూ, ఎరువులూ, ఒకళ్ళకి ఒకళ్ళు ఇచ్చుకోవలసిన అవస రాలే. కానీ, 'వడ్డీ' సహజ అవసరం కాదు. దానికి న్యాయమైన అర్థం లేదు. వడ్డీ కూడా, శ్రమ చెయ్యకుండా బతకడం కోసం కనిపెట్టిన దోపిడీ మార్గం. 'లాభం' కూడా ఇంకో మార్గం. ఇదంతా ఇంతకు ముందే చెప్పుకున్నాం.

భూమీ, డబ్బూ, పెట్టుబడిదారుడివే అయితే, వాటి కోసం కౌలూ, వడ్డీ తీసు కోవడం తప్పే అంటున్నారు మీరు. 'తప్పు' ఎందుకు? అవి, పెట్టుబడిదారుడి శ్రమ కాదు కాబట్టి. మరి, ఆ కౌలూ వడ్డీల్ని, బైటి వాళ్ళు తింటే, అది వాళ్ళ శ్రమ మాత్రం అవుతుందా? అది, వాళ్ళ శ్రమ కూడా కాదు గదా? దాన్ని ఎవరు తిన్నా తప్పే కదా? 'తప్పే' అని మీకూ తెలుస్తోంది గానీ, 'మరి పెట్టుబడిదారుడు వాటిని చెల్లించవలసి వస్తే, సరుకులోంచి కాకపోతే, ఇంకెలా తెస్తాడు?' అంటున్నారు."

"అదే, అదే మా సందేహం."

"మీ సందేహాలన్నీ, శ్రమ దోపిడీకి అనుకూలంగా వస్తున్నాయి. పెట్టుబడిదారీ దృష్టి వదలడం లేదు. 'కౌలూ - వడ్డీ - లాభాలు, స్వంత శ్రమ లేకుండా బతికే మార్గాలు' అని మొదట అర్థమైపోతే, ఆ వెంటనే, 'ఈ తప్పుడు విధానాలు ఇక ఉండకూడదు; ఈ దోపిడీని సాగనివ్వకూడదు; ఈ పూటే దీన్ని మార్చెయ్యాలి' అనే ఆవేశం కలగాలి గానీ, 'పెట్టుబడిదారుడు కౌలునీ వడ్డీనీ బైటికి చెల్లించాల్సి వస్తే పాపం వాటిని సరుకులో నించి గాక ఇంకెలా చెల్లిస్తాడు?' అని దోపిడీకే అనుకూలంగా ఆలోచిస్తామా? దానితో రాజీగా ఆలోచిస్తామా? పెట్టుబడిదారుడు, కౌళ్ళనీ, వడ్డీల్నీ, లాభాల్నీ ఎక్కడి నించి తీస్తాడో మనం అర్థం చేసుకోవాలి, అంతే. 'అలా తియ్యక పాపం వాడింకేం చెయ్యగలడులే' అని, ఆ తప్పునే తప్పనిసరి విషయం లాగ అర్థం చేసుకోవడం కాదు. 'జరుగుతున్నది పెద్ద తప్పు. దాన్ని ఎంత తొందరగా మార్చగలం?' అనేదే మన సమస్య. 'ఈ దోపిడీని ఇవ్వాళే తీసెయ్యగలమా? రేపు తీసెయ్యగలమా?' అని ఆతృత పడాలి గానీ, పెట్టుబడిదారుడి మీద జాలి పడడం కాదు మనం చెయ్యవలసింది. కౌళ్ళూ, వడ్డీ లాభాలూ తీసుకునే 'న్యాయమైన హక్కులు' పెట్టుబడిదారుడికే కాదు, ఎవ్వడికీ ఉండవు. వాటిని వాడు తీసుకున్నా తప్పే, బైటికి ఇచ్చినా తప్పే. మొత్తంగా ఆ విధానాన్నే కూలగొట్టాలి. మన కళ్ళ ముందు కనపడుతున్నవన్నీ, జరుగుతున్నవన్నీ, సరైనవే అనీ; సరైనవి కాబట్టే జరుగుతున్నాయనీ; నమ్మేస్తూ ఉంటాం. ఆ సూత్రం, ప్రకృతి విషయాలకే వర్తిస్తుంది. సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతోందంటే, అది అలా జరగాలి కాబట్టే జరుగుతోంది. అది సరైంది కాబట్టే జరుగుతోంది. ప్రకృతి విషయాల్లో అన్యాయమో అసహజత్వమో ఉన్నాయనీ, వాటిని మార్చాలనీ, మనం అనుకోనక్కరలేదు. కానీ, సమాజం సంగతి అలా కాదు. ఇక్కడ సాగుతున్నవన్నీ శ్రమ దోపిడీ సంబంధాలే. యజమానీ శ్రామిక సంబంధాలే. ఇక్కడ అనేక రకాల సమస్యలు ఉన్నాయి. ఇతర సమస్యల్ని పరిశీలించే ముందు మొదట ఈ శ్రమ దోపిడీ సమస్యని సరిగా అర్థం చేసుకోవాలి. కౌలూ - వడ్డీ - లాభాలు, ఏ ఉత్పత్తి తయారీకీ, ఏ శ్రమ తయారీకీ, సంబంధం లేని, అవసరం లేని విషయాలు. వాటిని, ఉత్పత్తి కోసం జరిగే ఖర్చులుగా అర్థం చేసుకోకూడదు. వాటిని ఖర్చుల జాబితాలోకి చేర్చకూడదు. వాటిని దోపిడీ మార్గాలుగా ప్రతీ క్షణం గుర్తు పెట్టుకోవాలి. ఇప్పుడు దోపిడీ చేసే యజమానుల అధికారమే ఉంది కాబట్టి, దోపిడీలే నిర్విఘ్నంగా సాగుతున్నాయి."

"దోపిడీలే కాదు, మా సందేహాలు కూడా నిర్విఘ్నంగా సాగుతున్నాయి."

"అంటే, ఇంకా అర్థం కావలసిన విషయాలు ఉన్నాయన్నమాట! సరిగా అర్థమైతే సందేహాలు ఎందుకు ఉంటాయి? సందేహం కలిగిందంటే, అది తీరకపోతే నిద్ర పట్టదు కదా?"

"అదే మా బాధ! మమ్మల్నేమీ అనకండి! వెనక్కీ ముందుకీ తిరుగుతూనే ఉంటాం. మాకు ఎలా అనిపిస్తే అలా అడుగుతాం."

"అడగండి గానీ, 'లాభమే ముద్దు' అని మాత్రం అనకండి! అది గుర్తుపెట్టు కుంటే చాలు!"

"అయ్యో, అలా అనొద్దు! లాభాన్ని ముద్దు పెట్టుకుంటామా? మీరు చెప్పే దంతా చక్కగా అర్థమౌతోందిగానీ, ఏవైనా సందేహం వస్తే, జవాబు సరిగా చెప్పుకో లేకపోతున్నాం. ఎందుకో మరి!"

"ఇంకా కొన్నాళ్ళుపోతే మీరే ఇతరులకు నేర్పుతారు."

"నిజంగా అలా చెయ్యాలని ఉంది మాకు. కానీ ఏదీ చేతకావడం లేదు."

"కాదు, 'కాపిటల్' మొదలు పెట్టండి! మొదలు పెడితే, చివరి దాకా నిద్ర పోలేరు. ఎవరు చదవాలని రాశాడు మార్క్సు అంత కష్టపడి?" ★

## 21. వైకుంఠపాళీ ఆటా మన తెలివి?

**60. ఒక్క మాట! సరుకు ధరని పెట్టుబడిదారుడు ఎలా నిర్ణయిస్తాడో చూశాం. ఖర్చులూ, దాని మీద లాభమూ. వాడైతే అదనపు విలువని కలుపుతాడు. అది సరే. అదనపు విలువని కలపక ముందే, సరుకు తయారైనప్పుడే, దానికి కొంత విలువ ఏర్పడిపోయి ఉంటుంది కదా? దాన్ని పట్టుకోవాలి. అది ఎలా చెయ్యాలి?**

**జ:** మీ అసక్తి చూస్తే నిజంగా సంతోషంగా ఉంది నాకు. ఈ ధర విషయాలు చదివే టప్పుడు నాకూ ఇలాగే గందరగోళంగా ఉండేది. క్రమంగా అర్థం చేసు కుంటే అన్నీ సర్దుకున్నాయి. అసలు, సరుకుకి 'విలువ' వేటి వల్ల ఏర్పడుతుంది? దాని కోసం జరిగిన శ్రమల ఖర్చుల వల్లే కదా? ఉత్పత్తి సాధనాల్ని తయారు చేసిన ఖర్చూ, శ్రామికులు కొత్తగా చేసిన శ్రమ ఖర్చూ. ఈ రెంటినీ కలిపితే అదే సరుకు విలువ. ఒక కొత్త కుండని చూసి, దాని విలువని చెప్పెయ్యగలమా? దాన్ని చూడగానే, దాని కోసం పాత శ్రమ ఎంత ఖర్చయిందో, కొత్త శ్రమ ఎంత ఖర్చయిందో, తెలిసిపో తుందా? - అలా తెలీదు. అసలు, ఈ 'విలువ' అనే ఆలోచన, బార్టరు మారకాలు ప్రారంభం కాకముందు మొత్తం సమాజంలో ఎవరికీ లేదు. ఈ మారకాలూ, డబ్బు పద్ధతి అమ్మకాలూ జరగడం వల్లే, విలువా, ధరా - అనే మాటలు పుట్టుకొచ్చాయి. మొదటి నించీ వర్తకులు, 'లాభం వేసుకోవడం' అనే పద్ధతి తోనే ధరలు నిర్ణయిం చడం ప్రారంభించారు. వాళ్ళ పద్ధతితో కాకుండా మనం సరుకు విలువని నిర్ణయిం చాలంటే, లాభం వేసుకోవడాన్ని తీసెయ్యాలి. కౌళ్ళనీ, వడ్డీల్నీ, చేర్చకూడదు. అసలు ఖర్చుల్ని మాత్రమే కలిపి, అంటే పాత శ్రమనీ - కొత్త శ్రమనీ కలిపితే, అదే కదా సరుకు విలువ? అలా, ఆ 2 ఖర్చుల్నీ కలపడం చెయ్యగలమా? అలా చేస్తే, దోపిడీ దార్ల పద్ధతిలో కాకుండా, దోపిడీ లేని పద్ధతిలో, 'లాభం వేసుకోవడం' లేకుండా, సరుకు విలువని నిర్ణయించవచ్చు. అయితే, పాత శ్రమ సంగతీ, కొత్త శ్రమ సంగతీ, సరిగా తెలియాలి.

"ఉత్పత్తి సాధనాల ఖర్చు అయితే, వాటిని బజార్లో కొంటాం కాబట్టి, ఆ ఖర్చు తేలిగ్గానే తెలుస్తుంది. మనుషులు చేసే కొత్త శ్రమ విలువ ఎలా తెలుస్తుంది?"

"కొత్త శ్రమ ఎన్ని గంటలు జరిగిందో, ఎన్ని రోజులు జరిగిందో, తెలుస్తుంది కదా? వాటికి ఏదో ఒక విలువ ఉంటుంది. ఉత్పత్తి సాధనాల ఖర్చునీ, కొత్త శ్రమ విలువనీ, ఈ రెంటినీ కలిపితే, సరిపోదా?"

"అవును, ఇదే మంచి పద్ధతి. ఆ రెండూ కలిస్తే చాలు. కొళ్ళనీ వాటినీ కలపడం ఎందుకు? ఇదంతా సరే, బాగుంది. కానీ, అసలు కొత్త కుండని చూడగానే దాని విలువ ఎందుకు తెలీదు?"

" 'వైకుంఠ పాళీ' ఆట ఒకటి ఉంటుంది, తెలుసా? ఆ కాయితం మీద బొమ్మల్లో, నిచ్చెనలూ, పాములూ ఉంటాయి. మన నిచ్చెన గడిలో పడితే హఠాత్తుగా పైకి పోతాం. ఆ తర్వాత, మన గవ్వ పాము గడిలో పడ్డదంటే, జర్రున జారి వంద గళ్ళు కిందకి దిగిపోతాం...."

"అలా ఉందన్న మాట మా తెలివి! ఆ ఆట తెలుసు లెండి. మా ఆవిడ ఆడుతూ ఉంటుంది. గమ్మత్తు ఆటే అది. నిజమే గానీ, మరి మా అనుమానాలు అలా ఉంటున్నాయి."

"ఏం ఫర్వాలేదు. అనుమానాలు వస్తేనే మంచిది. అన్ని కోణాల్లోనూ స్పష్టం అయిపోతుంది. కుండని చూడగానే దాని విలువ ఎందుకు తెలీదు - అంటున్నారు. కుండని చూడగానే దాని బరువు మాత్రం తెలుస్తుందా? దాన్ని చేత్తో ఎత్తి పట్టుకోవాలి. ఆ బరువుని ఖచ్చితంగా కొలవాలంటే, అక్కడ తరాజూ, బరువు రాయీ, అన్నీ ఉండాలి. అలాగే విలువ సంగతిని కూడా అనుకుందాం. కుండ ఎదురుగా డబ్బు ఉంటేనే కుండ విలువ తెలుస్తుంది. కుండకి ధరని నిర్ణయించేటప్పుడు, లాభాలూ అవీ చేర్చకుండా, కొత్త శ్రమ విలువనే ఎక్కువగా చేరిస్తే సరిపోతుంది కదా? అయినా, మనం ఇంకా తెలుసుకోవలిసింది బోలెడు ఉంది. ఈ ధర సంగతి ఇక్కడితో ఆపుదాం. దోపిడీదారులు పూర్వం నించీ సరుకుల ధరల్ని ఏ పద్ధతిలో నిర్ణయిస్తు న్నారో అది తెలుసుకుంటే ఇప్పుడు చాలు. మనం ఎలా నిర్ణయిస్తామో, అదంతా తర్వాత."

"అవును, సరే. మనం నిర్ణయించాలన్నా, ఖర్చుల్ని కలపడం గాక ఇంకేం చేస్తాం? అయినా, వైకుంఠపాళీ ఆట అన్నారుగా? ఎలాగూ మీరు ఆ మాట అన్నారు కాబట్టి, ఇక మాకు ఎలాంటి అనుమానాలు వచ్చినా అడిగేస్తాం. 'పనిముట్లు' గురించి ఒక అనుమానం ఎప్పటి నించో పట్టుకుంది. ఇప్పటి దాకా దాన్ని అడగలేదు." ★

## 22. సూది పని చేస్తుందా? కంప్యూటరైనా, సూదిలాంటి పనిముట్టే!

**61.** **'శ్రమ' గురించి ఎన్నెన్ని సందేహాలో చుట్టుకుంటున్నాయి. పెట్టుబడిదారుల దగ్గిర చిన్నవో పెద్దవో రక రకాల యంత్రాలు ఉంటాయి. కరెంటు స్విచ్చి వేస్తే అవే తిరుగుతాయి. మా హోటల్లో, వంటల గదుల్లో చూడండి! పప్పు రుబ్బే గ్రైండర్‌కి**

**స్విచ్చివేస్తే, అదే రుబ్బేస్తుంది పప్పు. యంత్రాలు పని చేస్తే, శ్రామికుల శ్రమ కాలం తగ్గిపోదా? శ్రామికులకు జీతాలు పెంచాలా, అక్కర్లేదా?**

**జ:** మెరుగైన పనిముట్టు వస్తే, మనుషుల శ్రమ కాలం తగ్గే మాట నిజమే. కానీ, పనిముట్లు కూడా పని చేస్తాయి - అనేది తప్పు. ఒక చొక్కా తయారవ్వాలంటే, బట్ట ఏదైనా పని చేస్తుందా? దారం ఏదైనా పని చేస్తుందా? అంటే, ముడి పదార్థాలు ఏ పనీ చెయ్యవు కదా? పనిముట్లకు కూడా అదే వర్తిస్తుంది. కుట్టు పని జరుగుతోం దంటే, ఆ పనిని సూది చేస్తుందా, మనిషి చేస్తాడా? రవాణా పనిని బస్సు చేస్తుందా? డ్రైవరు చేస్తాడా? కత్తిరించే పనిని కత్తెర చేస్తుందా, మనిషి చేస్తాడా? అసలు 'పని' అంటే, మనుషులు చేసే దానికే పని అని అర్థం. కుట్టుపనిలో, సూదీ కత్తెరా, పని ముట్లు మాత్రమే. ఆ పనిముట్లని ఇంకా ఇంకా మెరుగుపర్చుకుంటే, వాటి నిర్మా ణంలో తేడాలు వస్తాయి. వాటి కదలికలు తేడాగా అవుతాయి. యంత్రం అయినా, ఎంత కంప్యూటరైనా, సూది లాంటి పనిముట్టే. దాని ముందు మనిషి లేకుండా అది ఎంతసేపు తిరిగినా, అది శ్రమ చేస్తోందని అర్థం కాదు. దాని కదలికలు, అవతల నించి కరెంటు అందుతూ ఉండడం వల్లా, దాన్ని ఆ రకపు సాంకేతికతతో తయారు చేసి పెట్టడం వల్లా, అలా ఉంటాయి.

జంతువుల కదలికలూ, యంత్రాల కదలికలూ, మనుషుల వల్ల జరిగేవే. మనుషుల పాత్ర లేకుండా యంత్రాలు స్వతంత్రంగా ప్రవర్తించవు. చేతి పనిముట్ల కాలంలో అయితే, ఒక వస్తువు (ఒక చొక్కా) తయారవడానికి, పనిముట్ల నించి చేరే పాత శ్రమ తక్కువగానూ, మనిషి చేసే కొత్త శ్రమ ఎక్కువగానూ ఉంటాయి. ఆ చేతి పనిముట్టే, చిన్న యంత్రంగా మారితే, అదే వస్తువు తయారవ్వాలంటే, పనిముట్టు వల్ల చేరే పాత శ్రమ గతం కన్నా కొంత ఎక్కువ గానూ, మనిషి చేసే కొత్త శ్రమ గతం కన్నా తక్కువగానూ, ఉంటాయి. మొత్తం మీద, వస్తువు తయారీకి పట్టే మొత్తం శ్రమ కాలం, గతం కన్నా తగ్గుతుంది. అంటే మనుషులు, తమ పని అనుభవాలతో పనిముట్లని మెరుగుపరచుకోవడం వల్ల, వాళ్ళు చెయ్యవలసిన శ్రమ కాలాలు తగ్గి, శ్రమలు తేలిక అయ్యాయని అర్థం. ఒక చొక్కాని చేతి కుట్టుతో కుడితే, సూదీ కత్తెరా తప్ప అక్కడ పనిముట్లేవీ ఉండవు. వాటి నించి చేరే పాత శ్రమ అతి స్వల్పం. ఆ చొక్కాని చేతితో కుట్టడానికి 4 గంటల కొత్త శ్రమ పడుతుంది. అదే చొక్కాని మిషను మీద కుడితే, మిషను నించి చేరే పాత శ్రమ పెరిగి, మనిషి చేసే కొత్త శ్రమ కాలం తగ్గుతుంది. ఆ వస్తువుకి, మొత్తం శ్రమ కాలం, 2 గంటల కన్నా దాటక పోవచ్చు.

ఎంత కొత్త పనిముట్టు తయారైనా, పని చేసేది అది కాదు. పెట్టుబడిదారులకు ఉండే భ్రమ అంతా, పని అంతా యంత్రాలే చేస్తాయి - అని! యంత్రం వల్ల జరిగేది, మనుషుల పని తేలికై, మనుషుల పని కాలం తగ్గడమే. పెట్టుబడిదారులు చెప్పేదాన్నే శ్రామికులు నమ్ముతూ కూర్చోకూడదు. 'శ్రమ' అనేది, పనిముట్లని ఉపయోగిస్తూ మనుషులు చేసేదే. పనిముట్లు, కొత్త వస్తువు కోసం ఉపయోగపడతాయి కాబట్టే, వాటిని తయారు చేసిన పాత శ్రమ కూడా, కొత్త వస్తువు కోసం ఖర్చవుతుంది. ఎంత

పెద్ద విమానం అయినా, రైలు అయినా, ఓడ అయినా, విలువని ఇవ్వడంలో, సూదికీ వాటికీ తేడా ఉండదు. 'పనిముట్లు పని చెయ్యవు' - అనే విషయంలో, సూదికీ కంప్యూటర్‌కీ తేడా లేదు. ★

# 23. ఇంతింత తుక్కు వాదాలు ఉన్నాయా!

**62.** **సప్లయ్ - డిమాండ్లు అంటారు. అవి ఏమిటి? మా వాడు రోజుకి వంద సార్లు ఆ మాటలే అంటాడు. తినే వాళ్ళు ఎక్కువగా రాకపోతే, 'డిమాండ్ తగ్గినట్టుంది' అంటాడు. అప్పుడు మా మీద ఎగిరి, 'సప్లయ్ అంత చేశారేం?' అంటాడు. 'హెడ్డు చెప్పినట్టు చేశాం' అంటే, వాడి మీద పడతాడు. పండగల రోజుల్లో జనం తెగ వస్తారు. 'సప్లయ్ పెంచండి, పెంచండి' అంటాడు. చేస్తూనే ఉంటాం. అసలు, పండగలప్పుడు హాయిగా ఇళ్ళల్లో ఉండి గారెలో బూరెలో వండుకుని తినక, హోటళ్ళ వెంట పడతారెందుకో! సప్లయ్ డిమాండ్లేవిటో అర్థం కాదు నా కసలు.**

**జ:** తినే వాళ్ళు ఎక్కువగా వచ్చినప్పుడు ధరలు పెంచుతాడా? జనం రాకపోతే ధరలు తగ్గిస్తాడా?

"అబ్బే, అలాంటప్పుడు చెయ్యడు గానీ, వాడు కొనాల్సిన పప్పులూ ఉప్పులూ బస్తాల కొద్దీ ఉంటాయిగా? వాటి ధరలు పెరిగితే, మా వాడు, తను అమ్మే వాటి ధరలు పెంచుతాడనుకుంటా. ఆ ధరల గోల మాకు బాగా తెలీదు. ఎప్పుడూ వంటల దగ్గిర తచ్చాడడమే మా పని. పనిలోకి దిగామంటే అక్కడికే. పని అయిందంటే, అక్కణ్ణించి పారిపోయినట్టు బైటపడతాం. ధరలు పెంచుతాడో, తగ్గిస్తాడో, అదంతా మాకు పట్టదు. తగ్గించడం ఉంటుందా, పెంచడమే ఉంటుంది బహుశా."

"సప్లయ్ - డిమాండ్లు' అనే మాటలు ప్రతి పూటా వాగుతూనే ఉంటారు సరుకుల్ని అమ్మేవాళ్ళు. అసలు సరుకుకి 'విలువ' ఎలా ఏర్పడుతుంది? దానికి పట్టే 'శ్రమ'ని బట్టి కదా? కానీ, పెట్టుబడిదార్ల లెక్క ఎలా ఉంటుందో చూశాం. ఖర్చులూ, దాని మీద లాభమూ కలిస్తే విలువ అవుతుందంటారు. 'ఖర్చులు' అనే దాంట్లో కూడా, అసలు జరగని వాటిని తెచ్చి కలుపుతారు. అలా వాళ్ళు నిర్ణయించిన ధరతో ఆ సరుకుని అమ్మకం కోసం సిద్ధం చేస్తారు. అయితే, అదే రకం సరుకులు, ఇతర పెట్టుబడిదారులు కూడా తయారు చేయించినవి ఉంటాయి కదా? సరుకుల గుట్ట ఎక్కువగా ఉండి, వాటిని కొనే వాళ్ళు తక్కువగా ఉంటే, సరుకుల సప్లయ్ ఎక్కువగా ఉందనీ, దాన్ని కొనే వాళ్ళ నించీ డిమాండ్ తక్కువగా ఉందనీ, అర్థం. అప్పుడు, ఆ సరుకుల్ని అమ్మే వాళ్ళందరూ దాని ధరని తగ్గిస్తారు. ఆ పూటే తగ్గిస్తారని కాదు. సరుకు బొత్తిగా కదలకుండా ఉంటే అప్పుడు తగ్గిస్తారు. ధర తగ్గిస్తే, కాస్త ఎక్కువ మంది కొంటారు. ఒక వేళ, సరుకు సప్లయ్యే తక్కువగా ఉండి, దాని కోసం కొనే వాళ్ళ డిమాండే ఎక్కువగా ఉంటే, ఆ సరుకు ధరని పెంచి అమ్ముతారు. కొనే వాళ్ళు అలాగే కొంటారు. అసలు, ఒక రకం సరుకులతో సమాజానికి ఎంత అవసరం

ఉంటుందో ఆ అనుభవాల్ని బట్టి, సరుకుల సప్లయ్‌లు, డిమాండ్‌తో సరిపడే విధంగా ఉండాలి. ఒక వేళ తేడాలు వచ్చినా, ధరలో తేడా రాకూడదు. అది తగ్గడమో, పెరగ డమో, జరగకూడదు. ధర తగ్గినా, పెరిగినా, ఉన్న సరుకు రాసి తగ్గడమో, పెరగడమో జరగదు. సరుకు తగినంతగా లేనప్పుడు, ధరని పెంచితే, అది పరిష్కారమా? ఆ ఎక్కువ ధరతో కొనగలిగిన వాళ్ళే కొంటారు. సరుకు వాళ్ళకే దొరుకుతుంది. అంత ధర పెట్టలేని వాళ్ళకి ఆ సరుకు దొరకదు. అది 'పాలు' లాంటి సరుకు అను కుందాం. అది కొందరికి దొరకకపోతే ఎలాగ? ఇళ్ళల్లో చిన్న పిల్లలు ఉంటారు. జబ్బు మనుషులు ఉంటారు. అలాంటి వాళ్ళకి పాలు తప్పకుండా దొరకాలి కదా? అప్పుడు ఎలా జరగాలో మీ ఆలోచన చెప్పండి!"

"అలాంటప్పుడు అసలు ఏం జరగాలంటే, పాలతో అంత అవసరం లేని వాళ్ళు వాటిని కొనకూడదు; ఊరుకోవాలి. లేకపోతే, ప్రతి వాళ్ళకీ, వాళ్ళు అడిగినంత ఇవ్వకుండా, సగమో, పావో మాత్రమే ఇవ్వాలి. ఆ రకంగా అయితే, సరుకు తక్కు వగా ఉన్నా, అది అందరికీ అందుతుంది."

"చక్కగా ఆలోచించారు మీరు. ఎందుకో తెలుసా? ఇది శ్రామిక దృష్టి. మీరే పాల సరుకు పెట్టుబడిదారుడు అయితే, ఇలా మాట్లాడరు. 'కొనగలిగే వాళ్ళే కొంటారు; మా అమ్మకాలెందుకు తగ్గించుకోవాలి? లీటరు పాలు అడిగిన వాళ్ళకి అర లీటలే ఇవ్వాలా? మా సరుకుని ఎంత త్వరగా అమ్ముకుంటే అంత మంచిది మాకు' అంటారు. లాభాల కోసమే వ్యాపారాలు చేసే వాళ్ళు, తమ సమస్యల్ని ఎలా పరిష్కరించుకోవాలో అలా ఆలోచిస్తారు గానీ, సమస్యని న్యాయమైన దృష్టితో ఆలోచించరు కదా? మీరైతే చాలా తెలివిగా, న్యాయంగా ఆలోచించారు."

"నాకేం తెలివి లేదు గానీ, అలాంటి ఇబ్బందిలో అలాగే చేసుకోవాలని నాకు అనిపించి అలా చెప్పాను."

"అలా అనిపించడమే తెలివి. అసలు, సప్లయ్ - డిమాండ్ల గురించి తెలుసుకో వలిసిన విషయం ఇది కాదు, వేరే ఉంది. చొక్కాల ఉదాహరణతో చూద్దాం. ఆ సరుకు విలువని 120 అనుకున్నాం కదా? ఆ సరుకు అలాగే అమ్మకం అవుతూ ఉంటే, దాని వల్ల వచ్చే అదనపు విలువ 20 అని చూశాం. కొన్నాళ్ళకి, ఆ సరుకు సప్లయ్ పెరిగిగానీ, దాని కోసం డిమాండ్ తగ్గిగానీ, కొనే వాళ్ళు తగ్గి, ఆ సరుకు ధర 118 కావచ్చు, లేదా 115 కావచ్చు. ధర అలా తగ్గితే, అదనపు విలువ తగ్గినట్టు. ఉత్పత్తి సాధనాల భాగం తగ్గదు, జీతాల భాగం తగ్గదు. అవి తగ్గితే, పునరుత్పత్తి జరగదు. కాబట్టి, సరుకు సప్లయ్ ఎక్కువై, ధర తగ్గితే, అదనపు విలువే తగ్గుతుంది. లేదా, సరుకు కోసం డిమాండ్ పెరిగి ధర పెరిగి, పెట్టుబడిదారుడికి 120 కన్నా ఎక్కువ డబ్బు వస్తే, అదనపు విలువ పెరుగుతుంది. ఏ సరుకు అయినా మార్కెట్లో, అంటే బజార్లో, ఏ ధరకి అమ్ముడు పోతుందో దాన్ని 'మార్కెట్ ధర' అందాం. 'అదనపు విలువ' అనేది, ఆ మార్కెట్ ధర లోనించి వచ్చేదే. మొత్తం సమాజంలో ఉన్న సరుకుల రాసుల మార్కెట్ ధరలన్నిటినీ కలిపి 100 అందాం. అందులో నించే అదనపు విలువ దొరుకుతుంది."

"అయ్యో, మొదట నిర్ణయించిన 'విలువ' తగ్గితే, ఆ తగ్గింది ఏమవుతుంది?"

"ఒక సరుకులో విలువ, మార్కెట్లో తగ్గవచ్చు; ఇంకో సరుకులో విలువ మార్కెట్లో పెరగవచ్చు. అసలు, 'కాపిటల్'లో అయితే, ధర సంగతి చాలా వివరంగా చూస్తాం. మొదట ఏర్పడిన విలువ, పెట్టుబడిదారీ పోటీల్లో, 'ఉత్పత్తి ధర'గా మారి, అది మళ్ళీ 'మార్కెట్ ధర'గా మారి, అన్ని దశలు ఉంటాయి. ఇదంతా తెలీకుండా పెట్టుబడిదారులు, 'సప్లై డిమాండ్లే ధరని నిర్ణయిస్తాయి' అంటారు. ఈ సప్లయ్ డిమాండ్ల విషయాల గురించి పెట్టుబడిదారులు ఎలా వాదిస్తారంటే, అసలు సరుకుకి ధర, సప్లయ్ - డిమాండ్ల వల్లే ఏర్పడుతుంది - అంటారు. 'సరుకు సప్లయ్ పెరిగితే ధర తగ్గుతుంది కదా? లేదా, డిమాండ్ పెరిగితే ధర పెరుగుతుంది కదా? అంటే, ధరని నిర్ణయించేవి సప్లయ్ డిమాండ్లే' అంటారు."

"అరె, అలా అంటారా? అసలు సరుకు తయారైనప్పుడే దాని ఖర్చుల్ని బట్టి ధర ఏర్పడుతుంది కదా? సప్లయ్ ఎక్కువుందా, తక్కువుందా అనేది తర్వాత సంగతి. ధర మారడం అంటే, అసలు మొదట ఉన్న ధరే కాస్త ఇటో అటో మారాలి. అంతేగానీ, ధర అనేది, బజార్లో ఏర్పడ్డం ఏమిటీ?"

"అబ్బ! ఎంత గొప్పగా అర్థం చేసుకున్నారు! మార్క్సు లాగ అర్థం చేసుకున్నారు. పెట్టుబడిదారుల వాదాలన్నీ పిచ్చి పిచ్చి వాదాలే. వాళ్ళ ఆర్థిక వేత్తలవి కూడా పిచ్చి వాదాలే. సరుకుకి మొదట ఏదో ఒక విలువ (ధర) ఏర్పడి ఉండాలి. అది తయారయ్యే పరిస్థితుల వల్లనే, దాని కోసం ఖర్చయ్యే అంశాల్ని బట్టే, ఆ విలువ ఏర్పడడం జరగాలి. అలా ఒక విలువతో తయారైన తర్వాతే, సప్లయ్ - డిమాండ్ల ప్రభావాలు పని చేస్తాయి. మన చొక్కాల ఉదాహరణలో, ఈ సరుకుకి మొదట 120 విలువ ఏర్పడి ఉంటుంది. దాని మీదే సప్లయ్ - డిమాండ్ల పరిస్థితులు కలుస్తాయి. ఆ ధర తగ్గడం అంటే, 120 కన్నా తగ్గాలి. పెరగాలంటే, 120 కన్నా పెరగాలి. మొదట 120 అనేది లేకపోతే, తగ్గుదలా, పెరుగుదలా, దేని మీద జరుగుతాయి? అసలు విషయం ఒకటి ఉంటేనే, అది తగ్గడమో, అదే పెరగడమో, జరుగుతాయి. 'అసలు విలువ' అనే దాన్ని పెట్టుబడిదారులు ఒప్పుకోరు. ఖర్చుల మీద లాభాన్ని వేసుకుని నిర్ణయించే ధరని కూడా అసలు ధరగా వాళ్ళు ఒప్పుకోరు. అలా నిర్ణయమైన ధరని కూడా సప్లయ్ డిమాండ్లు మారుస్తాయి కాబట్టి, "అసలు ధరని నిర్ణయించేవి, సప్లయ్ డిమాండ్లే" అంటారు. ఒక వేళ, సప్లయ్ డిమాండ్లు సమానంగా ఉంటే, అప్పుడు ఉండే ధర, దేని వల్ల ఏర్పడినట్టు? మొదట, ఖర్చుల వల్లా, లాభం వల్లా ఏర్పడినా, ఆ ధర కదలకుండా ఉన్నదంటే, ఆ ధర అలా మారకుండా ఉండడానికి కారణం, సప్లయ్ డిమాండ్లు సమానంగా ఉండడమే కాబట్టి, అసలు ధర నిర్ణయానికి కారణం ఎప్పుడైనా సప్లయ్ డిమాండ్లే - అంటారు. ఇదీ పెట్టుబడిదారుల వంకర టింకర వాదం. వాళ్ళ దృష్టి, ధరకి అసలు కారణం అయిన 'శ్రమ' మీదకి, ఎప్పుడూ పోదు."

"ఇంతింత తుక్కు వాదాలు, గందరగోళాలు, ఉన్నాయా? ఇవన్నీ మాకు తెలియవు సుమా!"

★

# 24. ఎంత శ్రామిక చైతన్యం!

**63.** **భూమి, యజమానుల శ్రమలతో తయారైనది కాదు గదా? అది ప్రకృతిలోది. అది ఎప్పుడో ఎలాగో కొందరి ఆధీనంలోకి పోయి ఉంటుంది. అది ఎప్పుడూ అలాగే ఉండిపోవాలా? ఆ భూమిని, యజమానుల నించి శ్రామికులు ఎందుకు స్వాధీనం చేసుకోకూడదు?**

**జ:** ఎంత శ్రామిక చైతన్యంతో మాట్లాడారు! మీకు ఈ విషయం బాగా అర్థమైనట్టు ఉంది. మొదట జరగవలసింది అదే. భూస్వామి కుటుంబానికి కూడా, వాళ్ళ శ్రమతో వాళ్ళు చేసుకోగలిగినంత భూమిని వదిలి, మిగతా భూమిని, భూమి లేని ప్రజలు ఆక్రమించాలి. ఎవరి భూమి మీద వాళ్ళు స్వంత శ్రమతో చేసుకోవాలి. పని ఒత్తిడి కాలాల్లో ఒకరికి ఒకరు సహకరించుకోవాలి. పని మనుషుల్ని పెట్టుకునే పద్ధతిలో కాదు. ఈ మార్పు భూమి విషయంలోనే కాదు; ఇతర ఉత్పత్తి సాధనాలన్నీ లేవూ? అవి పెట్టుబడిదారుల స్వంత శ్రమతో ఏర్పడిన ఆస్తి కాదు. ఆ సంగతి మనం ఇంకా చూడలేదు. సమాజంలో ఉన్న ఉత్పత్తి సాధనాలన్నీ తర తరాల శ్రామిక ప్రజలవే. ఈ సంగతి తర్వాత చూస్తాం. శ్రమ దోపిడీ గురించి మార్క్సు రాసి నూట యాభయ్యేళ్ళు దాటినా, ఈ నాటికీ శ్రామిక ప్రజలకు దాన్ని గ్రహించే తెలివి రాలేదు. తెలివి వస్తే ఎంతసేపు? ఆర్నెల్ల కాలంలో దోపిడీ సమాజాన్ని తల్లకిందులుగా మార్చెయ్యవచ్చు. కానీ, యజమానుల లాగే, శ్రామికులు కూడా తప్పుడు భావాలలోనే ఉండిపోతున్నారు. "భూమి మా ఆస్తే" అని యజమానులు అనుకుంటున్నట్టే శ్రామికులు కూడా "అవును, భూమి యజమానుల ఆస్తే కదా?" అనుకుంటారు. "పెట్టుబడులన్నీ పెట్టుబడిదారులవే కదా?" అనుకుంటారు. "పెట్టుబడులకు లాభాలు రావాలి కదా?" అనుకుంటారు. శ్రామికుల భావాలన్నీ పెట్టుబడిదారీ భావాలే. "పాలించే వర్గ భావాలే, ప్రజల భావాలు" అన్నాడు మార్క్సు. మనం పుట్టినప్పటినించీ దేన్ని చూస్తూ పెరుగుతామో, అదే సహజ విషయంగా కనపడుతుంది. యజమానీ శ్రామిక సంబంధాలనే చూస్తూ, యజమానుల దగ్గిర పనులు చేసుకుంటూ బతుకుతోన్న తల్లిదండ్రుల్ని చూస్తూ పెరుగుతోంటే, ఆస్తి రహస్యాలు ఎలా అర్థమవుతాయి? యజమానుల దగ్గిర పనులు దొరికి, జీతాలు కాస్త సవ్యంగా వస్తూ ఉంటే, అలా బతకడమే సరిపోతుందన్నట్టూ, జరగాల్సిందేదో జరుగుతోంది అన్నట్టూ, అనుకుంటాం. శ్రమ దోపిడీ రహస్యాన్ని మార్క్సు బైటపెట్టే దాకా, ఈ ఆస్తి విషయాలు అసలు ఎవరికి తెలుసు?

**64.** **"అవును, అది నిజంగా నిజం. మేం రోజూ ఏ మనుకుంటున్నాం? మా పనులు పోకుండా ఉంటే చాలనుకుంటాం. జీతాలు కాస్త పెరిగితే చాలనుకుంటాం. రోజూ ఎంతో మంది మా యజమాని దగ్గిరికి పనుల కోసం వచ్చి పోతూ ఉంటారు. వాళ్ళని చూడగానే మా గుండెల్లో దడ, మా పనులు పోతాయని. 'మా పనులు మాకు నిలబడితే చాలు, జీతాలు కొంచెం పెరిగితే చాలు' అనుకుంటున్న వాళ్ళం**

**వందల మంది ఉన్నాం. మమ్మల్ని ఇలాగే ఉండనిస్తేయేం? ఇవన్నీ మాకు బోధించడం ఎందుకు? మేము నమ్మే వాటితో మేము సంతోషంగా ఉండలేమా?**

**జ:** ఇదేవిటి? మళ్ళీ వైకుంఠపాళీ ఆటా? అది ఆట! ఇది జీవితం! జీతాలతో సంతోషంగా ఉండిపోగలమా? మరి, ఉద్యోగాలే పోతే? ఆ భయం ఉన్నా సంతోషంగా ఉండగలిగితే అలాగే ఉండొచ్చు. కానీ ఎవరూ ఉండలేరు. ఉండలేరని మీకూ తెలుసు. మనం నమ్మేది నిజం కానిదైతే, అజ్ఞానం అయితే, అది అజ్ఞానం అని మనకి తెలియకపోయినా, అజ్ఞానం సుఖాన్ని ఇవ్వదు; పైగా, సమస్యలు తెచ్చి పెడుతూ ఉంటుంది. సమస్యల్లో తప్పు దారులు చూపిస్తూ ఉంటుంది. 'ఉద్యోగం నిలబడితే చాలు, జీతం పెరిగితే చాలు' అనేది, అలాంటి తప్పు దారే. పెట్టుబడిదారీ విధానంలో అందరికీ ఉద్యోగాలు నిలబడడం కల్ల! జీతాలు పెరగడం, దాన్ని మించిన కల్ల! బానిసల కాలం నించీ శ్రమ చేసే వాళ్ళు బికారితనంలోనే ఉంటున్నారు. ఆ పేదతనాలు ఈ నాటికీ మారలేదు. 'బానిస' అనే వాడికి నిరుద్యోగం ఉండదు. కౌలు రైతుకీ నిరుద్యోగం ఉండదు. పెట్టుబడిదారీ విధానంలో, ఈ కొత్త సమస్య ప్రవేశిస్తుంది. శ్రామిక జనాభాలో అధిక సంఖ్య, పనులు పోయి, పోషణ పోయి, బతకలేని వాళ్ళయి పోతారు. ఇప్పుడు సమాజంలో సమస్యలే లేకపోతే బిచ్చ మెత్తడాలూ, దొంగతనాలూ, వ్యభిచారాలూ, హత్యలూ - ఆత్మహత్యలూ, ఇవన్నీ ఎందుకు ఉంటున్నాయి? యుద్ధాలు ఎందుకు జరుగుతున్నాయి? యజమానుల కోసం జరిగే యుద్ధాల్లో సైనికులు ఎందుకు చచ్చిపోవాలి? సమస్య అంతా పేదతనం ఒక్కటే కాదు. అసలు యజమానీ శ్రామిక సంబంధాలు ఏమిటి? ఒక మనిషి యజమానీ, ఇంకో మనిషి శ్రామికుడూ! మనుషుల సంబంధాలు అలా ఎందుకు ఉండాలి? అది ప్రకృతి సత్యమా? అది ప్రకృతి సత్యం అయితే, అలా ఉండడం ఎవరికీ అవమానం అవదు. స్త్రీలూ - పురుషులూ అనే తేడాలు ప్రకృతి సత్యాలే. అది ఎవరికీ అవమానం కాదు. దాన్ని మార్చనక్కర లేదు. కానీ, యజమానీ శ్రామికులు ఏమిటి? శ్రామిక వర్గానికి ఇది, పేదతనాన్ని అనుభవించడం కన్నా ఎక్కువ అవమానం. ఈ అవమానం పోవాలంటే, యజమానీ శ్రామికులు సమానులుగా అయ్యే సంబంధాలు ఏర్పడాలి. సమాజంలో ఉన్న సమస్యల గురించి నిజం తెలిసిన వాళ్ళు, అది తెలియని వాళ్ళకి చెప్పాలి. అది, వినే వాళ్ళ కోసమే కాదు, చెప్పే వాళ్ళ కోసం కూడా. వినే వాళ్ళూ, చెప్పే వాళ్ళూ, ఒకే పక్షం వాళ్ళే. అందరికీ ఒకే రకం బాధలూ, ఒకే రకం సమస్యలూ, ఉంటాయి. చెప్పే వాళ్ళు, వినే వాళ్ళతో, "మన సమస్యలు ఇలా ఉన్నాయి. వీటిని తీసివేసుకోగలిగితేనే మనకు విముక్తి" అని చెపుతున్నారన్నమాట! అంతే గానీ, చెప్పే వాళ్ళు, సమస్యలతో సంబంధం లేకుండా, వాటికి అతీతంగా ఉన్న వాళ్ళు కారు. చెప్పే వాళ్ళూ, వినే వాళ్ళూ కలిస్తేనే, అందరికీ విముక్తి. మన విముక్తి కోసమే మనం ప్రయత్నిస్తున్నాం. జీతాలతోనే సంతృప్తి పడి బతికెయ్యాలని పిస్తోందా?"

"ఇంత తెలుస్తోంటే, జీతాలతో ఏం సంతోషిస్తాం? మనకు తెలిసిన జ్ఞానం వల్ల ప్రయోజనం ఏముంటుంది? సుఖంగా ఉన్నాం అనుకోవడమే గానీ ఎక్కడ సుఖంగా ఉన్నాం?"

"కొందరు మనుషులు, ధర్మం కోసం, న్యాయం కోసం, ఎన్నెన్నో త్యాగాలు చేస్తారు. ఎందుకు చేస్తారు? 'మన సుఖం మనకి చాలు' అని ఎందుకు అనుకోరు? వాళ్ళ జ్ఞానం వాళ్ళని అలా ఉండనివ్వదు. జ్ఞానం అనేది కలిగితే, అది నిశ్శబ్దంగా ఉండనివ్వదు."

"అవును, ముందు మనం నేర్చుకోవాలి. మనకి తెలిసిందితరులకు చెప్పాలి."★

# 25. పెట్టుబడి, పెట్టుబడిదారుడు పెట్టేది కాదు! 'జీతాల' పెట్టుబడి, మొదటి అబద్ధం!

**65.** **భూస్వాములూ, పెట్టుబడిదారులూ చేసే దుర్మార్గాలేమిటో తెలుస్తున్నాయి గానీ, ఎవళ్ళతో ఎలా అనాలో సరిగ్గా, టక్కున ఆలోచనలు రావడం లేదు. భూస్వామితో అయితే, "భూమి నీ బాబు సొత్తా? నీ తాత చేశాడా?" అనొచ్చు. అది తేలిగ్గానే ఉంది. పెట్టుబడిదారుడి సంగతే గోల. వాడు తన పరిశ్రమలో ఏదైనా పని చేస్తే, దానికి తగిన జీతం తీసుకోవచ్చని మనమూ అంటున్నాం. కానీ, లాభం తీసుకో కూడదంటాం. మరి పెట్టుబడి పెట్టిన దానికి ఫలితం ఏమిటని వాడు అడిగితే? గమ్మున ఏం చెప్పాలి? పెట్టుబడిదారుడు మనల్ని అడుగుతాడని కాదు. తోటి పని వాళ్ళకి చెప్పాలంటే, 'పెట్టుబడిదారుడు పెట్టుబడి పెట్టకపోవడం ఏంటి?' అనరూ? వాళ్ళకేం చెప్పాలి? అదీ జంకు!**

**జ:** ఇదేమిటి! మనం ఇప్పటి దాకా ఆ సంగతే మాట్లాడుకోలేదా! ఇదీ తేలికే.

భూస్వామితో అయితే, "భూమి నీ సొత్తా?" అనగలమన్నారే, పెట్టుబడిదారుడితో కూడా అలాగే అనొచ్చు. "పెట్టుబడి నీ సొత్తా? నీ బాబు సొత్తా? అందులో ఏదీ నీది కాదు, నీ బాబుది కాదు, నువ్వు పెట్టిందేమీ లేదు" అనడమే.

"కానీ, పెట్టుబడిదారుడు పెట్టుబడి పెడుతూనే ఉన్నాడు కదా? ఉత్పత్తి సాధనాలు కొంటాడు. మాకు జీతాలు ఇస్తున్నాడు కదా? 'పెట్టుబడి నీది కాదు' అని ఎలా అంటాం? అనాలని ఉన్నా అనడం మంచిదా?"

"మంచిది కాకపోతే, అనాలని ఎందుకు ఉండాలి? ఈ విషయాలు మనం ఇంకా స్పష్టంగా చెప్పుకోలేదన్నమాట! ఉత్పత్తి సాధనాల్నీ, జీతాల్నీ కలిపి, 'పెట్టుబడి' అంటున్నారు కదా? కానీ, ఆ రెండూ పెట్టుబడిదారుడు పెట్టేవి కావు. 'జీతం' అనేది, శ్రామికుల శ్రమలో భాగమే. శ్రామికులు, 40 శ్రమ చేస్తే, అందులో నించే 20ని తీసి శ్రామికులకు జీతంగా ఇస్తే, అది శ్రామికుల శ్రమలో భాగాన్నే శ్రామికులకు ఇచ్చినట్టు. ఆ 20 కోసం పెట్టుబడిదారుడు పెట్టడం ఏముంటుంది?"

"పెట్టుబడిదారుడు, తన జేబులో నించే 20 డబ్బు తీసి శ్రామికులకు జీతాలుగా ఇస్తాడు కదా?"

"ఇస్తాడు. ఆ ఒక్క దృశ్యాన్నే చూస్తే చాలదు. ఆ 20 డబ్బు, ఆ జేబులోకి మొదట ఎలా వచ్చిందో అది ముందు చూడాలి. శ్రామికులు పని స్థలంలోకి రాగానే, పని జరగక ముందే, పెట్టుబడిదారుడు జీతాలు ఇవ్వడు. అలా ఇచ్చినా, అసలు జరిగే విషయంలో తేడా రాదు. కానీ అలా ఇవ్వడు. శ్రామికుల శ్రమ విలువని 40 అనీ, జీతాల్ని 20 అనీ, అనుకున్నాం. జీతాలుగా ఇచ్చే డబ్బు సంగతిని 2 రకాలుగా చూద్దాం.

(1) పెట్టుబడిదారుడి జేబు ఖాళీగా ఉంది. అందులో స్వంత డబ్బు లేదు.

ఒక రోజు శ్రామికులు చేసిన సరుకుని అమ్మగా వచ్చిన 40ని జేబులో పెట్టుకుని, అందులో నించి 20ని తీసి జీతాలుగా ఇచ్చి, మిగతా 20ని తన భాగంగా తీసుకుంటాడు. రోజూ జరిగేది ఇదే. పెట్టుబడిదారుడు జేబులో నించి డబ్బుని తీశాడు కాబట్టి, అతని డబ్బే జీతాలుగా ఇస్తున్నట్టు కనపడుతుంది.

(2) పెట్టుబడిదారుడి సొంత 20 డబ్బే మొదట అతని జేబులో ఉంది. శ్రామికులు వచ్చి పని చేస్తారు. సరుకుని ఇంకా అమ్మలేదు. వాళ్ళకి పెట్టుబడిదారుడు, తన డబ్బే 20 తీసి జీతాలుగా ఇస్తాడు. తర్వాత, సరుకుని అమ్మితే, శ్రామికుల శ్రమ విలువగా 40 వస్తుంది. జీతాల 20ని ఇచ్చేశాడు కాబట్టి, ఆ 20ని వెనక్కి తీసుకుంటాడు. అతని డబ్బు వెనక్కి వచ్చేస్తుంది. ఆ 20ని అలా వెనక్కి తీసుకుని, దానిపైన ఇంకో 20ని కూడా తీసుకుంటాడు. జీతాల్ని ఇవ్వడం, ఆ 2 పద్ధతుల్లో ఏ పద్ధతిలో జరిగినా, జీతాల కోసం పెట్టుబడిదారుడు ఖర్చుపెట్టేదేమీ ఉండదు. మొదటి పద్ధతిలో అయితే, పెట్టుబడిదారుడి దగ్గిర అసలు డబ్బే అక్కర లేదు. రెండో పద్ధతిలో అయితే, పెట్టుబడిదారుడి దగ్గిర మొదట కొంత డబ్బు ('పెట్టుబడి' అనేది) ఉన్నా, అది ప్రతిసారీ వెనక్కి వచ్చేస్తూ ఉంటుంది. ఆ వ్యాపారం వెయ్యి సంవత్సరాలు జరిగినా, చివరి రోజు కూడా అది వెనక్కి వచ్చేసి పెట్టుబడిదారుడి జేబులోనే పడి ఉంటుంది. అది ఖర్చయి పోవడం ఎప్పటికీ జరగదు."

"ఎంత ఆశ్చర్యం! అసలు రెండో పద్ధతి కాదు. ఎప్పుడూ మొదటి పద్ధతే ఉంటుంది మా వాడి దగ్గిర. మేం తయారు చేసే వంటలు, ఎప్పటికప్పుడు వేడి వేడిగా అమ్మకాలైపోతూ ఉంటాయి. డబ్బులు గల గల్లాడుతూ మా కాషియర్ బల్ల మీద పడిపోతూ ఉంటాయి. అంటే, మా పని వల్ల వచ్చే డబ్బుల్లో నించే కొంచెం తీసి మా జీతాలు ఇస్తాడా! అంతేగా మరీ! ఏడిసినట్టే ఉంది జీతాల మీద పెట్టుబడి పెట్టడం! సరుకుల్ని అమ్మేశాక, ఆ డబ్బులో నించి తీసి జీతాలు ఇస్తే సరిపోతుంది. చేతిలో ఒక్క పైసా లేకుండా వ్యాపారం చెయ్యొచ్చు! ఒక్కోసారి మాకు రెండేసి నెల్లకి గానీ జీతాలు ఇవ్వడు!"

"అదే మరి! యజమానులందరూ చేసేది అదే! యజమానులేం చేస్తారో శ్రామికులకు తెలియాలనే కదా మార్క్సు రాశాడు?"

"డబ్బున్న వాళ్ళు చేసే దుర్మార్గాలు చూస్తే ఆయన కడుపు ఎంత మండిందో! జీతాల సంగతి తెలిసింది గానీ, వాటి మీద యజమాని పెట్టేదేమీ లేదు గానీ, మరి ఉత్పత్తి సాధనాల మాట? ఏది అడగాలన్నా భయంగా ఉంది. ఏం వినాలో అని! మరి, ఉత్పత్తి సాధనాల మీద యజమానే పెడతాడు కదా? అది తప్పదుగా వాడికి?"

"ఆ బండారం కూడా చూస్తాంగా?"

"అమ్మో! తొందరగా చెప్పండి! అది కూడా బండారమేనా?" ★

# 26. 'జీతాల' పెట్టుబడి, మొదటి అబద్ధం అయితే, 'ఉత్పత్తి సాధనాల' పెట్టుబడి, రెండో అబద్ధం!

**66.** **ఏది వినాలన్నా భయంగా ఉంది. ఉత్పత్తి సాధనాలకైతే పెట్టుబడిదారుడు నిజంగానే పెడతాడుకదా? మా వాడు, హోటల్ నడవడానికి అన్నీ వాడేకొంటాడు. రోజూ సరుకు తెప్పిస్తూనే ఉంటాడే, అవి కూడా వాడు పెట్టేవి కాదంటే బాగుంటుందా?"**

**జ:** తెప్పిస్తాడు సరే, ఎవరి డబ్బు అది? అది చూడాలి. వాడి డబ్బు పైసా కూడా ఉండదు.

"అమ్మో! ఇక్కడ కూడా అదేనా?"

"పెట్టుబడిదారుడు మొదట 80 విలువ గల ఉత్పత్తి సాధనాల్ని పని స్థలంలో పెట్టాడని చెప్పుకున్నాం. ఆ 80 విలువ, పెట్టుబడిదారుడి స్వంత శ్రమేనా? అవి, పెట్టుబడిదారుడి స్వంత శ్రమతో వచ్చిన ఉత్పత్తి సాధనాలేనా? - కావు. ఈ సంగతి ఎలా చెప్పగలమంటే, పెట్టుబడిదారుడు, ఆ 80 ఉత్పత్తి సాధనాలకు, ఇంకా తర్వాత కొత్త ఉత్పత్తి సాధనాల్ని కూడా ఎలా చేరుస్తాడో చూస్తే, పాత 80 ఉత్పత్తి సాధనాలు ఎలా వచ్చాయో తెలుస్తుంది. మనం చొక్కాల పెట్టుబడిదారుడి ఉదాహరణలో, ఇంత వరకూ నలుగురు శ్రామికులతో జరిగిన ఒక్క పని దినం లెక్కలే చూశాం. కానీ, కాస్త పెద్ద పెట్టుబడిదారుల దగ్గిర, డజన్ల కొద్దీ, వందల కొద్దీ, శ్రామికులు ఉంటారు. రోజూ కొత్త సరుకు రాసి తయారవుతూనే, అమ్మకం అయిపోతూనే, రోజూ అదనపు విలువ బైటపడుతూనే ఉంటుంది. ఆ రకంగా, నెలల తరబడీ, సంవత్సరాల తరబడీ జరుగుతూ, అదనపు విలువ రాసి గుట్టలుగా పెరిగిపోతూ ఉంటుంది. అది, కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూగా చీలిపోతూ, ప్రతీ రాసీ (కౌళ్ళ రాసీ, వడ్డీల రాసీ, లాభాల రాసీ) గతం కన్నా పెరిగిపోతూ ఉంటుంది. పెట్టుబడిదారుడికి వచ్చే 'లాభం భాగాన్నే' చూద్దాం. దాంట్లో నించే పెట్టుబడిదారుడి కుటుంబానికి పోషణా, విలాసాలూ, వ్యసనాలూ, అన్నీ జరుగుతాయి. పెట్టుబడిదారుడు, పెళ్ళానికి రవ్వల వడ్డాణం చేయించినా, ప్రియురాళ్ళకి డైమండ్ నెక్లెస్‌లు పడేసినా, కూతురికి హెలికాప్టర్ కొనిపెట్టినా, అన్నీ ఆ 'లాభం'లో నించే. అలాంటివన్నీ పోగా, మిగిలిన రాసితో, పాత 80 ఉత్పత్తి సాధనాలకు మరిన్ని కొత్త ఉత్పత్తి సాధనాలు చేర్చితే, వాటి సంఖ్య పెరుగుతుంది. పరిశ్రమ పెరుగుతుంది. శ్రామికుల సంఖ్య

కొంత పెరుగుతుంది. ఆ సంఖ్య పెరిగితే, వారి నించి వచ్చే అదనపు విలువ రాసి కూడా గతం కన్నా పెరుగుతుంది. అప్పుడు పెట్టుబడిదారుడు కొత్త అదనపు విలువతో మళ్ళీ కొన్ని కొత్త ఉత్పత్తి సాధనాల్ని పాత వాటికి కలిపి, ఆ రాసిని మళ్ళీ పెంచుతాడు. ప్రారంభంలో, 80 విలువ గల ఉత్పత్తి సాధనాలతో పరిశ్రమని ప్రారంభించిన వాడు, కొన్ని సంవత్సరాల్లో దాన్ని 800 విలువ గల ఉత్పత్తి సాధనాలుగా చేర్చాడంటే, ఆ కొత్త ఉత్పత్తి సాధనాలు ఎక్కణ్ణించి వచ్చాయి? పెట్టుబడి ఎలా పెరిగింది? - 'అదనపు విలువ' వల్లే.

రోజూ వచ్చే 'అదనపు విలువ'లో నించే క్రమ క్రమంగా కొత్త ఉత్పత్తి సాధనాలు పెరుగుతూ ఉంటాయి. దీన్ని బట్టి, తెలిసేది ఏమిటి? మొట్ట మొదటి 80 ఉత్పత్తి సాధనాలు ఎలా వచ్చాయో అర్థం చేసుకోవచ్చు. పెట్టుబడిదారుడి దగ్గిర ప్రారంభంలో ఉన్న 80 ఉత్పత్తి సాధనాలు కూడా, వెనకటి శ్రామికుల అదనపు విలువ ద్వారా ఏర్పడినవే. అంతే గానీ, ఆ మొదటి 80 ఉత్పత్తి సాధనాలు అయినా పెట్టుబడి దారుడి స్వంత శ్రమతో వచ్చినవి అని అర్థం కాదు. అంటే, 'పెట్టుబడి' అనేది, పెట్టుబడిదారుడి శ్రమ కాదు. అందులో, జీతాల భాగమూ అతని శ్రమ కాదు. ఉత్పత్తి సాధనాల భాగమూ అతని శ్రమ కాదు. అంటే, పెట్టుబడిదారుడు పెట్టుబడి పెడుతున్నట్టుగా పైకి కనపడుతుంది గానీ, వాడు పెట్టేది ఏమీ ఉండదు. మొదట అప్పులు తెచ్చి పెట్టినా, ఆ అప్పుల్ని ఏ డబ్బుతో తీరుస్తాడు? శ్రామికుల వల్ల వచ్చే అదనపు విలువలో నించే తీరుస్తాడు. అప్పు తీరిపోతే, 'పెట్టుబడి నాదే' అంటాడు. అసలు పెట్టుబడిదారుడు పెట్టేది ఏమిటి?

"కానీ, భూస్వాముల భూములు గానీ, పెట్టుబడిదారుల ఆస్తులు గానీ, వాళ్ళ తండ్రుల నించీ అందినట్టే కనపడుతుంది కదా?"

"కనపడడానికేం? లక్ష కనపడతాయి. ఏది కనపడితే అదే నిజం కావచ్చు, కాకపోవచ్చు. అందులో నిజం ఉందో, అబద్ధం ఉందో, అది గ్రహించాలి. పుత్రులకు ఆస్తులు ఇచ్చే తండ్రులూ, తాతలూ, ముత్తాతలూ, ఆ ఆస్తుల్ని వాళ్ళ స్వంత శ్రమలతో సంపాదించారా? నిజంగా శ్రమ చేసే వాడి సంపాదన, స్వంత పోషణకే ఖర్చయిపోతూ ఉంటుంది. ఏ రోజు శ్రమ ఫలితం, ఆ రోజుకే అయిపోతుంది. అంత కన్నా పెద్ద ఎత్తున మిగిలి, దానితో ఆస్తులు కూడడం సాధ్యం కాదు. కాస్త ఒళ్ళు వంచి పనులు చేసుకునే ఏ స్వతంత్ర ఉత్పత్తిదారుల కుటుంబానికైనా కొంత ఆస్తి కూడితే, అది చిట్టి పొట్టి ఆస్తిగా ఉంటుంది గానీ, పర్వతం అంత ఆస్తిగా ఉండదు. వందల కొద్దీ శ్రామికుల శ్రమని దోచుకున్న వాళ్ళకైతేనే అందులోంచి ఎంత తిన్నా, ఆస్తి ఇంకా కుప్పతెప్పలుగా ఏర్పడుతూ ఉంటుంది. ఎవరికైనా పెద్ద ఆస్తులు కూడాయి అంటే, అది శ్రమ దోపిడీ వల్లే సాధ్యం. ఆస్తి అంటే చౌర్యం. దొంగతనం. ధనవంతులందరూ, ఆస్తిపరులందరూ, ఆస్తుల్ని దోపిడీల ద్వారా సంపాదించిన వాళ్ళే. స్వంత శ్రమతో ఆస్తులు ఏర్పడవు. కొడుకులకు భూములూ ఆస్తులూ బంగా రాలూ అందించే తండ్రులూ తాతలూ ముత్తాతలూ పూర్వం నించీ దోపిడీదారులు

కాబట్టే, ఆ ఆస్తుల్ని పుత్రులకు అందించగలుగుతారు. ఆస్తుల్ని తండ్రులు ఇచ్చారంటే, వాటిని ఆ తండ్రులు స్వంత శ్రమలతో సంపాదించారని అర్థమా? - కాదు. దోపిడీలతో సంపాదించారని అర్థం.

నిజానికి, వెనకటి నించీ ఏర్పడిన ఆస్తులన్నీ, సాగు భూములన్నీ, వెండి బంగారాలన్నీ, తర తరాల శ్రామికుల తల్లిదండ్రులవీ, తాతలవీ, ముత్తాతలవీ. పాత ఉత్పత్తి సాధనాలన్నీ వెనకటి తరాల శ్రామికులవే. కొత్త ఉత్పత్తి సాధనాలైతే, కొత్త తరాల శ్రామికులవి. బానిసల కాలంలోనే శ్రమలు వదిలేసిన యజమానుల తరాల వల్ల, ఆస్తులు ఎలా కూడతాయి? సమాజంలో ఉన్న ఆస్తులన్నీ శ్రామిక వర్గానివే. ఇప్పుడు ఉన్న సాగుభూములు, బానిసల కాలం నించీ అనేక తరాల పాటు జరిగిన శ్రమలతో సాగవుతూ వస్తున్నాయి. ఇప్పుడున్న కట్టడాలన్నీ భవనాలన్నీ, శ్రామిక తరాల వల్ల తయారైనవే. ఈ నాటి పెద్ద పెద్ద యంత్రాలన్నీ, మేధాశ్రమలు చేసే ఇంజనీర్ల వల్లా, శారీరక శ్రమల శ్రామికుల వల్లా తయారైనవే. ఈ బళ్ళూ, బస్సులూ, రైళ్ళూ, రహదారులూ, కాలవలూ, ప్రాజెక్టులూ, వెండి బంగారాలూ, రత్నాలూ వజ్రాలూ, అన్నీ, ఇదీ అదీ అని కాదు, 'ఆస్తి' అని దేన్ని అంటామో అది - శ్రమలు చేసిన మనుషుల వల్ల తయారైనది అవుతుందా, శ్రమలు మానేసిన యజమానుల వల్ల తయారైనది అవుతుందా? పాత కాలం నించీ కూడా, ఉత్పత్తి సాధనాలన్నీ 'అదనపు శ్రమ'లో భాగాలే. అవి, శ్రామికుల ఆస్తులే! ★

## 27. 'శ్రమ శక్తి'కీ, 'శ్రమ'కీ, సంబంధం!

**67.** **మొన్న మీరిచ్చిన పుస్తకం చదివితే, 'శ్రమ' అంటే మనం చేసే పనే కదా - అని అర్థమైంది గానీ, 'శ్రమ శక్తి' అంటే సరిగా అర్థం కాలేదు. అయినా ఇంకో సారి చదవాలి. పుస్తకం దాచాను. చదువుతా.**

**జ:** చదవండి, ఎందుకు అర్థం కాదూ? ఇంకో సారి చదివితే, దాటి పోయిన విషయాలన్నీ దొరుకుతాయి. అయినా, శ్రమ శక్తి అంటే కొంచెం చూద్దాం. శ్రమ అంటే తెలిసింది కదా? శ్రమ శక్తి అంటే, ఆ శ్రమ చేసే శక్తి. ఆ శక్తి నిలబడుతూ ఉండాలంటే, రోజూ కొన్ని పోషణ వస్తువులు వాడకం అవుతూ ఉండాలి. 'పోషణ' అంటే తిండి ఒక్కటే కాదు, నివాసమూ, బట్టలూ, మందులూ, పిల్లల్ని పోషించుకోవడం - అలాంటివన్నీ కలిస్తేనే పోషణ. ఆ పోషణ, చాలా సౌఖ్యంగానూ జరగవచ్చు, లేదా బికారి తనం గానూ జరగవచ్చు. అట్టడుగు శారీరక శ్రమల వాళ్ళ పోషణకీ, ఉన్నత మేధా శ్రమల వాళ్ళ పోషణకీ, సమాజంలో మొదటి నించీ తేడా ఉంటుంది. సరే, ఆ తేడా సంగతి వదిలేద్దాం. శ్రమ చేసే శక్తి రోజూ నిలబడాలంటే, రోజూ 5 గంటల శ్రమతో తయారయ్యే ఉత్పత్తులు కావాలనుకుందాం. అంటే, శ్రమ శక్తి విలువ, 5 గంటల శ్రమ. అయితే, ఆ శ్రమ శక్తితో ఒక మనిషి 5 గంటల కన్నా ఎక్కువ గంటలు పని చెయ్యగలడు. ఇష్టంగానో, బలవంతంగానో, ఎలాగైతేనేం, శ్రమ శక్తి విలువ కన్నా

ఎక్కువ కాలం, 10 గంటలైనా, 14 గంటలైనా, ఆఖరికి 20 గంటలైనా, చేస్తాడు. బానిసలందరూ అలా చేసిన వాళ్ళే. ఇప్పుడైతే, శ్రామికులు పనులు చెయ్యవలసిన కాలం 10 గంటలకు దిగింది గానీ, వెనకటి కాలంలో, 18 గంటల దాకా కూడా ఉండేది. వాళ్ళు అంత కాలం పని చేసినా, వాళ్ళ పోషణకి, యజమాని నించి అందే విలువ మాత్రం, 2, 3 గంటల శ్రమదే!

"అంటే, 'శ్రమ విలువ' కన్నా 'శ్రమ శక్తి విలువ' చాలా తక్కువగా ఉంటుం దన్నమాట! ఇదే చదివాను ఆ పుస్తకంలో. ఇప్పుడు బాగా తెలుస్తోంది."

"ఎంత బాగా అర్థం చేసుకున్నారో! 'విలువ' అనే మాటల ద్వారానే కాదు. శ్రమ శక్తి నిలబడడానికి, 2 గంటల శ్రమ వల్ల తయారైన ఉత్పత్తులు అవసరమైతే, ఆ మనిషి, ఆ శక్తితో 10 గంటల పైన పని చెయ్యగలడు. ఇది శ్రామికుల సంగతి. ఒక 'రాజు' సంగతి తీసుకుంటే, ఆ మనిషి రోజూ వాడే ఉత్పత్తులు, 100 గంటల శ్రమల వల్ల తయారైనవై ఉంటే, ఆ మనిషి, రోజుకి ఒక్క నిముషం పని కూడా చెయ్యడు. పని చెయ్యకుండానే ఎన్నెన్నో ఉత్పత్తులు వాడేస్తాడు. కొందరైతే, ఎక్కువ ఉత్పత్తులు వాడేస్తూ, ఆ కాలం కన్నా తక్కువ కాలమే పని చేస్తారు.

'శ్రమ శక్తి'కీ, 'శ్రమ'కీ ఉండే సంబంధాలు రక రకాలుగా ఉంటాయి.

(1) శ్రమ శక్తి పోషణకు అవసరమైన కాలమూ, ఆ శక్తితో శ్రమ చేసే కాలమూ, సమానంగా ఉండవచ్చు. ఇలా ఉంటే, రోజూ ఉత్పత్తి అయ్యే వస్తువులు, రోజూ ఖర్చయి పోతాయి. దీని అర్థం, శ్రమ శక్తి విలువా, శ్రమ విలువా, సమానంగా ఉన్నాయి - అని.

(2) శ్రమ శక్తి, తన కోసం అవసరమైన కాలం కన్నా ఎక్కువ కాలం పని చెయ్యగలదు. లేదా, తక్కువ కాలమే పని చేస్తుంది. ఇలా జరిగితే, శ్రమ శక్తి, తన విలువ కన్నా ఎక్కువ విలువనైనా ఉత్పత్తి చెయ్యగలదు; లేదా తక్కువ విలువనైనా.

(3) పోషణ కోసం అత్యధిక ఉత్పత్తులు వాడే మనిషి, అణువంత శ్రమ కూడా చెయ్యక పోవచ్చు. ఇలా జరిగితే, ఉపయోగించే విలువ అత్యధికం! చేసే శ్రమ పూర్తిగా శూన్యం!

తక్కువ విలువ గల శ్రమ శక్తి, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యగలదు కాబట్టే, శ్రమ దోపిడీ సాధ్యమవుతుంది. ఒక శ్రామికుడు, తన శ్రమ విలువ భాగంగా, 10 వస్తువుల్ని ఉత్పత్తి చేసినప్పుడు, శ్రమ శక్తి విలువ (జీతం) 2 వస్తువులు మాత్రమే అయితే, 8 వస్తువులు అందకుండా పోయినట్టే. లేదా జీతంగా 9 వస్తువులు అందినా, 1 వస్తువు అతనికి అందకుండా పోయినట్టే. శ్రమ విలువలో నించి ఏ మాత్రం అందకపోయినా అది ఎక్కడికో పోయినట్టే. ఒక మనిషి, గంజితో బతుకుతూ, పగలంతా పొలం దున్నడం సాధ్యమే. అందుకే శ్రమ దోపిడీ సాధ్యం."

"ఇప్పుడు ఇంకా బాగా అర్థమైంది! పోనీ ఏదో ఒక చిన్న పెట్టుబడిదారుడు, నల్లపూసంత పని చేసి, పర్వతం అంత విలువని వాడుతున్నాడంటే, తన పని కన్నా మిగతాదంతా దోచుకు తింటున్నాడని అర్థం. లేకపోతే, ఎక్కువని ఎలా వాడగలడు?

మేం చేసే పని, తక్కువ విలువని వాడుకుంటూ, ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యడం! ఇదన్నమాట మా పని! బాగుంది, చాలా బాగుంది!" ★

# 28. యజమానీ శ్రామిక సంబంధం, అమ్మే - కొనే సంబంధం కాదు!

**68. పెట్టుబడిదారుడితో జరిగే వ్యవహారం చూస్తోంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల సంగతే బాగున్నట్టుంది. వాళ్ళు తక్కువ పని చేస్తే తక్కువొస్తుంది, ఎక్కువ పని చేస్తే ఎక్కువొస్తుంది. యజమానుల పెత్తనాలు లేకుండా వాళ్ళమట్టుకు వాళ్ళు సుఖంగా బతుకుతారు.**

**జ:** మార్క్సు ఒక చోట మాట వరసకి ఆ మాటే అన్నాడు. "ఉంటే స్వతంత్ర ఉత్పత్తి దారుల విధానం అయినా ఉండాలి; లేకపోతే, సోషలిస్టు విధానం అయినా ఉండాలి" అన్నాడు. ఆ రెండు విధానాల్లోనూ దోపిడీ లేకుండా ఉంటుందని చెప్పిన మాట అది. కానీ అందరూ స్వతంత్ర ఉత్పత్తిదారులే అయినా, వాళ్ళూ సరుకుల్ని తయారు చెయ్యాలి, అమ్ముకోవాలి. వాళ్ళ మధ్యా పోటీలు ఉంటాయి. విడి విడిగా బతికే వాళ్ళు సుఖంగా ఉండడం చాలా అరుదు. వాళ్ళ మధ్య, ఒకళ్ళని ఒకళ్ళు పట్టించుకునే సంబంధాలు ఉండవు. మార్క్సు తర్కం, సమిష్టి సంబంధాలతో ఉండే సోషలిజమే మంచిది అని. స్వతంత్ర ఉత్పత్తిదారుల విధానమే ఉండాలన్నాడని కాదు.

"సోషలిజం అంటే?"

"తర్వాత చెప్పుకుందాం. వరసగా చెప్పుకుంటున్నాం కదా? అందాకా మొదట రెండు మాటలు చెప్పుకుందాం. స్వంత ఆస్తులు ఉండకూడదు. అందరికీ చదువులూ పనులూ ఉండాలి. యజమాని తనాలు ఉండకూడదు. అందరూ సమానులుగా బతికే పరిస్తితులు ఏర్పర్చుకోవాలి."

"ఎలాగ అవన్నీ?"

"ఏముంది? దోపిడీ ఆస్తులే లేకపోతే అదో సమస్యా? పెట్టుబడిదారుడికీ, శ్రామికులకూ ఉండే సంబంధం, దోపిడీ సంబంధం అని తెలియకపోతే, అది అమ్మే - కొనే సంబంధం లాగే కనపడుతుంది. కానీ, అది కాదు. ఇద్దరు స్వతంత్ర ఉత్పత్తి దారుల మధ్య ఒక మారకం (కుండకీ, చెప్పుల జతకీ) జరిగిందంటే, సమాన విలువల మధ్య మారకం జరుగుతుంది. ఆ ఇద్దరిలో ఎవరికీ, లాభమూ రాదు, నష్టమూ రాదు. ఇచ్చినంత విలువనే తిరిగి తీసుకుంటారు. కానీ, పెట్టుబడిదారుడికీ శ్రామికులకూ మధ్య జరిగేది అలాంటిది కాదు. అసలు ఇది మారకం కాదు. ఒక వేళ దాన్ని మారకంగా చూస్తే, పెట్టుబడిదారుడు 20 ఇచ్చి, 40 తీసుకుంటాడు. వాడికి లాభం 20. దీన్ని శ్రామికుల వేపు నించి చూస్తే, 40 ఇచ్చి, 20 తీసుకుంటారు. వాళ్ళకు నష్టం 20. శ్రామికుల నష్టమే పెట్టుబడిదారుడి లాభం! రోజూ జరిగేది ఇదే. ఒక రోజు పెట్టుబడిదారుడికి లాభం అయితే, ఇంకో రోజు శ్రామికులకు లాభం -

అని కాదు. ఎప్పుడూ జరిగేది, శ్రామికుల శ్రమ పెట్టుబడిదారుడికి పోవడమే. పెట్టుబడిదారుడికీ, శ్రామికులకూ మధ్య జరిగే విషయాన్ని అమ్మే - కొనే విషయాలుగా చూస్తే, దోపిడీ సంగతి బైటపడక, అది సమానుల సంబంధం లాగే కనపడి, శ్రామికులకు చాలా హాని జరుగుతుంది.

మార్క్సు, ఈ యజమానీ శ్రామిక సంబంధాన్ని దోపిడీ సంబంధంగా చెపుతూనే, ఒక రకమైన అమ్మే - కొనే సంబంధంగా కూడా చెప్పాడు. **ఆయన చెప్పింది ఏమిటంటే:** పెట్టుబడిదారుడు, శ్రామికుల నించి వారి 'శ్రమ శక్తి'ని కొంటాడు. ఆ శ్రమ శక్తి నిలబడి ఉండాలంటే, వారికి కనీసంగా పోషణ వస్తువులు అందాలి. 'శ్రమ శక్తి విలువ'నే వారికి జీతాలుగా ఇస్తాడు. శ్రామికులు, పెట్టుబడిదారుడి పని స్థలంలోకి వచ్చి పెట్టుబడిదారుడు చెయ్యమన్నంత కాలం పని చేస్తారు. ఆ పనే వారి శ్రమ. పెట్టుబడిదారుడు కొనేది, ఆ 'శ్రమ'నంతా కాదు. 'శ్రమ శక్తి'నే. ఆ 'శ్రమ శక్తి' విలువని మాత్రమే చెల్లించి, 'శ్రమ విలువ'ని తీసుకుంటాడు. ఆ రకంగా, అదనపు విలువని సంపాదిస్తాడు. - ఇదంతా శ్రమ దోపిడీ సంబంధం. దీన్ని 'అమ్మే - కొనే సంబంధం'గా, మాట వరసగానో, తేలిగ్గా అర్థమయ్యే ఉదాహరణగానో చెప్తే, దోపిడీదారుడి వాదం పెరుగుతుంది.

ఎవరైనా ఒక సరుకుని కొన్నారంటే, దాని ఉపయోగపు విలువ, ఆ వ్యక్తికే అందుతుంది. శ్రామికుల 'శ్రమ శక్తి'ని ఒక సరుకు అందాం. దాని ఉపయోగపు విలువ ఏమిటి? - శ్రమ చెయ్యడం. ఆ శ్రమ, శ్రమ శక్తి విలువ కన్నా కొంత ఎక్కువగా ఉండొచ్చు, చాలా ఎక్కువగా ఉండొచ్చు, ఎలాగైనా ఉండొచ్చు. పెట్టుబడిదారుడు, శ్రమ శక్తిని కొంటున్నాడంటే, దాని ఉపయోగపు విలువ అతనిదే కదా? అందుకే, **పెట్టుబడిదారుడు ఎలా వాదిస్తాడంటే:** "నేను, 'శ్రమ శక్తి'ని కొంటున్నాను. దాని విలువని చెల్లిస్తున్నాను. దాని ఉపయోగపు విలువ నాదే. శ్రమ శక్తి ఉపయోగపు విలువ, శ్రమ చెయ్యడమే. ఆ ఉపయోగపు విలువని ఎలాగైనా నేను ఉపయోగించుకోవచ్చు. శ్రమ శక్తి ద్వారా ఎక్కువ పని చేయిస్తానా, తక్కువ పని చేయిస్తానా - అది నా ఇష్టం! కుండని కొన్న వాళ్ళు, దాన్ని వాడుకుంటారా లేదా? అలాగే, నేను కొన్న సరుకు వల్ల ఎలాంటి ఉపయోగపు విలువ దొరుకుతుందో దాన్ని నేను తీసుకుంటానా లేదా? ఏమిటి నేను చేసే తప్పు?" అని ఇలా వాదిస్తాడు.

ఈ వాదనకి మన దగ్గిర జవాబు ఉండదని కాదు. "శ్రమ శక్తికి నువ్వు ఇచ్చే విలువేనా అసలు విలువ? 'శ్రమ శక్తికి ఇంత విలువ ఉండాలి, ఇంత జీతం ఇవ్వాలి' అని నువ్వు నిర్ణయిస్తున్నావు గానీ, మేం నిర్ణయిస్తున్నామా?' అని ఇలా మనం వాదిస్తాం గానీ, అసలు 'పెట్టుబడిదారుడు శ్రమ శక్తి అనే సరుకుని కొంటున్నాడు' అనడం వల్ల కదా, ఈ ఇబ్బంది? అసలు, యజమాని, శ్రామికుల్ని శ్రమ దోపిడీ చేస్తాడు. అది దోపిడీ సంబంధం. శ్రామికులకు ఉత్పత్తి సాధనాలు లేవు కాబట్టి, అవి ఉన్న వాళ్ళ దగ్గిరికి పోయి, పని అడుగుతారు. వాడికి పని చేసే వాళ్ళు కావాలి కాబట్టి పని ఇస్తాడు. ఎక్కువ పని చేయించుకుని, అందులో నించే ఒక ముక్క తీసి,

దాన్ని జీతంగా ఇస్తాడు. ఈ సంబంధాన్ని, యజమానీ శ్రామిక సంబంధం గానే ప్రతీ చోటా చెప్పుకోవాలి గానీ, శ్రమ శక్తి విషయంలో కూడా అమ్మే - కొనే సంబంధంగా చెప్పుకోకూడదు. అలా చెప్తే, 'నేను ఏ సరుకుని కొంటానో, ఆ సరుకు ఇచ్చే ఉప యోగపు విలువ నాదే' అంటాడు పెట్టుబడిదారుడు. అందుకే, ఈ సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో చాలా జాగ్రత్తగా ఉండాలి."

"మరి, పెట్టుబడిదారుడు, శ్రమ శక్తిని సరుకుగా కొంటాడు - అని మార్క్సు ఎందుకు చెప్పాడు? ఆ సంబంధాన్ని అమ్మే - కొనే సంబంధంగా చెప్పినట్టు అయి పోలేదూ?"

" 'శ్రమ శక్తిని సరుకుగా కొనడం' అనకుండా ఉండవలసింది గానీ, ఒక్కోసారి ఏం జరుగుతుందంటే, చదివే వాళ్ళకి తేలిగ్గా అర్థమవ్వాలని, మొదట క్లుప్తంగా చెప్పి, తర్వాత దాన్ని బాగా వివరిస్తూ ఉంటాం. అసలు 'అదనపు విలువ'నీ, 'శ్రమ దోపిడీ'నీ చెప్పిందే మార్క్సు. ఆయన అసలైన రహస్యాలన్నీ కనిపెట్టాడు కాబట్టే, మనం ఈ విషయాలు ఇంత తేలిగ్గా అర్థం చేసుకోగలుగుతున్నాం. యజమానీ శ్రామిక సంబంధంలో, 'అమ్మడం- కొనడం' అనే మాటలు రాకూడదనే నేనంటాను."

"మొత్తానికి, యజమానీ శ్రామికుల మధ్య ఉన్నది, యజమాని వల్ల ఏర్పడే దోపిడీ సంబంధమే గానీ, అమ్మే - కొనే సమానుల సంబంధం ఎక్కడ ఉంది? జీతం తీసుకునే వాడు, జీతం కాలం వరకే పని చేసి వెళ్ళిపోతే అది అమ్మే - కొనే సంబం ధమే. అదనపు శ్రమ కూడా చేస్తూ ఉంటే, అది సమానుల సంబంధం ఎలా అవు తుంది?"

"ఎప్పుడన్నా వాదం వస్తే, అలాగే మాట్లాడతారా మీ యజమానితో?"

"ఇంత వివరంగా వింటూ ఉంటే గుండెలు బద్దలవుతున్నాయి. నేను ఈ హోటల్లో ఏడేళ్ళ నించీ పని చేస్తున్నాను. మిగతా ముగ్గురూ కూడా రెండు మూడేళ్ళ నించీ చేస్తున్నారు. అంటే, మా నించి మా యజమాని ఎంత లాగేసి ఉంటాడో కదా అనిపిస్తోంది ఇప్పుడు."

"ఉదాహరణలు తేలిగ్గా ఉండాలని, జీతం 20 అయితే, అదనపు విలువ 20 అని చూస్తున్నాం. కానీ ఒక దేశంలో, శ్రామికుల నించి నిజంగా పోతూ ఉన్న అదనపు విలువ అయితే....."

"అమ్మో! ఎంత శాతం ఉంటుంది?"

"శాతమా? శాతం అంటే, 'నూటికి ఇంత' అని. 20 జీతానికి, 20 అదనపు విలువ అయితే, అది, 'నూటికి నూరు' అవుతుంది. అది నూరు శాతం. 100%. కానీ, వెనకటి కాలంలో అయినా, ఇప్పుడైనా, అదనపు విలువ, వేల శాతాన్ని దాటిపోయి ఉంటుంది. ప్రభుత్వానికి, పెట్టుబడిదారుల ద్వారా వెళ్ళే పన్నులన్నీ అదనపు విలు వలో భాగమే. పోలీసులూ, సైన్యాలూ, జైళ్ళూ, పరిపాలన ఖర్చులూ, ఆయుధాలూ, ఇవన్నీ అదనపు విలువతో నడవవలసినవే. అదనపు విలువ వేల శాతంగా లేకపోతే, ఆ విషయాలన్నీ జరగడం అసాధ్యం." ★

# 29. ఇదన్నమాట జరుగుతున్నదంతా!

**69. ఇప్పటి దాకా మీరు నన్ను చాలా ప్రశ్నలు అడిగారు. ఇప్పుడు, నేనే మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతున్నాను. కలిమి లేములూ, సిరి సంపదలూ అంటే ఏమిటో తెలిశాయా?**

**జ:** 'శ్రమ దోపిడీ' అని మీరు ఎప్పుడు అన్నారో అప్పటి నించీ తెలుస్తూనే ఉంది. మా యజమాని ధనవంతుడవుతాడు గానీ, మేం ధనవంతులం అవుతామా?

"యజమానినీ - శ్రామికుల్నీ పోల్చి అర్థం చేసుకోవడం చేశారు; అలాగే చెయ్యాలి. శ్రమ చేసే మనిషి యజమాని లేని వాడైతే, అతని శ్రమ విలువ అంతా అతనికే అందుతుంది కాబట్టి, ఆ తర్కంతో చూస్తే, అతనికి పేదతనం ఉండదు. పేదతనం ఉండదంటే ధనవంతుడవుతాడని కాదు. అతను ఎంత బాధ్యతగా, ఎంత చురుకుగా పని చేసుకునే వాడైనా, అతని శ్రమ, అతను సదుపాయంగా బతకడానికే సరిపోతుంది గానీ, అక్కడ పెద్ద ఆస్తి కూడదు. కానీ, దోపిడీదారుడి సంగతి చూస్తే, వాడు, ఒకే ఒక్క శ్రామికుడి నించే కాదు దోపిడీ చేసేది; డజన్ల, వందల శ్రామికుల అదనపు విలువల్ని దోపిడీ చేస్తాడు. అవన్నీ కలిసిన మొత్తమే వాడి ఆస్తి! అంటే, దీన్ని క్లుప్తంగా చెప్పుకుంటే, ఒక వ్యక్తి నించీ అదనపు శ్రమ బైటికి పోకపోతే, అక్కడ పేదతనమూ ఉండదు; అస్తీ ఉండదు. లేమీ ఉండదు, కలిమీ ఉండదు. బైటి వాళ్ళ నించీ అదనపు విలువలు ఎక్కడ అందితే, అక్కడే సిరి సంపదలు పోగవు తాయి. స్వంత శరీరంతో చేసుకునే స్వంత శ్రమ, సుఖ సంతోషాల్నీ, ఆరోగ్యాల్నీ ఇస్తుంది గానీ, సంపదల్ని పోగుచెయ్యదు. వందల మంది నించి దోచిన శ్రమే, సంప దల్ని కూడబెడుతుంది. ధనవంతుల్ని చూస్తే, యజమానుల్ని చూస్తే, శ్రామికులకు అసహ్యం కలగాలి."

"అసహ్యం మాకు మా యజమాని మీద ఎప్పుడూ ఉంది. ఇన్నాళ్ళూ అతని పెత్తనాల మీదే. ఆ మధ్య ఒక సారి అకస్మాత్తుగా ఏం జరిగిందంటే, మా వాడు, పక్కన ఎవణ్ణో పెట్టుకుని వాగుతున్నాడు వాడితో. చాయ్‌లు తెమ్మన్నాడు. ఓ కుర్రాడు, పధ్నాలుగేళ్ళవాడు, ట్రేలో తీసుకెళ్తూ, వాళ్ళ కాళ్ళ కింద మెత్తలకి వీడి కాలు తగిలి కొంచెం తూలాడు. ఒక కప్పులో చాయి, అక్కడ ఒక పేపరు మీద పడింది, అంతే. వెంటనే మా వాడు రయ్యిన లేచి, ఆ ట్రేని కూడా కింద పెట్టక ముందే, ఆ కుర్రాడి మొహం మీద ఫెళ్ళు ఫెళ్ళుమని దెబ్బలేసేశాడు, బూతులు తిట్టాడు. ఆ కుర్రాడు అప్పుడే ఆ ట్రేని కింద పెట్టి వంట గదుల వేపు ఏడుస్తూ పరిగెత్తుకొచ్చాడు. అక్కడ మేమందరం కంగారుపడిపోయాం. మా యజమాని మీద చచ్చే కోపాలు వచ్చాయి గానీ, ఆ కుర్రాణ్ణే మందలించాం, కాస్త నెమ్మదిగా నడవొద్దా అని. అలాగే కాస్సేపు మొత్తుకుని ఎవరి పనుల్లో వాళ్ళం పడ్డాం."

"అప్పుడు మీరేం చెయ్యాల్సిందంటే, వెంటనే అందరూ పనులు ఆపేసి, బైట కాంపౌండ్‌లోకి వెళ్ళి పోవాలి. యజమాని బైటికి వచ్చి, ఆ కుర్రాడి చేతులు పట్టుకుని,

'తప్పయి పోయిందమ్మా, తొందర పడ్డాను' అని పదే పదే చెప్పుకుంటే తప్ప లోపలికి అడుగు పెట్టకూడదు. అప్పటి దాకా, హోటల్లో తినడానికి వచ్చే వాళ్ళందరూ నిలబడి పోయి చోద్యం చూసే వాళ్ళు. వాళ్ళు కాస్త బుద్ధి ఉన్న వాళ్ళయితే, యజమానినే మందలించే వారు."

"మా వాడు క్షమాపణ చెప్పుకుంటాడా! వాడి తిట్లూ ఎగురుళ్ళూ రోజూ జరుగుతూనే ఉంటాయి."

"మీరు రోజూ భరిస్తున్నారు కాబట్టి రోజూ జరుగుతున్నాయి. ఒక్క సారి ఎదురు తిరగండి! ఆగ్రహం చంపుకోకుండా ఒక్క సారి ప్రవర్తించండి! తప్పకుండా యజమాని ఒళ్ళు దగ్గిర పెట్టుకుంటాడు."

"ఈ మాటలన్నీ ఇప్పుడు తెలుస్తున్నాయి గానీ, అప్పుడేం తెలుసు? తెలియక కూడా కాదు లెండి, అందరికీ పిరికితనమే. ఉద్యోగాలు పోతాయని భయం!"

"మీరు ఐకమత్యంగా, ఆత్మగౌరవంగా ఉంటే, ఏ ఉద్యోగాలూ పోవు."

"అవును, మీరన్నది నిజమే. ఏమో, అలాగే సరిపెట్టేసుకుంటూ ఉంటాం. కానీ ఇప్పుడు నాకు ఒక్కో సారి ఎలా అనిపిస్తోందంటే, కొన్ని మాటలు ఒక అట్ట నిండా రాసేసి హోటల్లో అంటిద్దామా అనిపిస్తోంది. 'మన శ్రమ, మనకే దక్కితే అది మన సౌఖ్యం! మన శ్రమ, యజమానికి పోతే, అది యజమాని సౌఖ్యం! ఇదన్న మాట జరుగుతున్నదంతా' అని రాసేసి, పది చోట్ల గోడలకి అంటించేస్తే, ఎవర్రాశారని అందర్నీ అడుగుతాడు. 'ఏమో, మాకేం తెలుసు?' అంటాం. అలా ఉంది నా కిప్పుడు. కలిమి లేముల రహస్యం ఇంకా తెలియకపోవడం ఏవిటి?" ★

## 30. భూస్వాములు, కౌళ్ళు తింటూ, పెట్టుబడిదారులు, వడ్డీలూ - లాభాలూ తింటూ!

**70. బానిస యజమానులే భూస్వాములుగా మారినట్టు, మళ్ళీ ఆ భూస్వాములే పెట్టుబడిదారులుగా మారారేమో అనుకున్నాను మొదట. కానీ, భూస్వాములూ, పెట్టుబడిదారులూ కలిసే ఉన్నారు, ఒకళ్ళ సరసన ఒకళ్ళు. భూస్వాములు కౌళ్ళు తింటూ, పెట్టుబడిదారులు వడ్డీలూ లాభాలూ తింటూ, ఎంతో ఐకమత్యంగా ఉన్నారు, అంతే కదా?**

**జ:** వాళ్ళ ఐకమత్యం, శ్రామికులతో పోట్లాటలు వచ్చినప్పుడే! అటువంటి సందర్భాల్లో, అయితే దోపిడీదారులందరూ 'గోడల్లో ఇటుకలున్నంత' అంటుకునే ఉంటారు. (ఈ వర్ణన మార్క్సుదే.) కానీ, చరిత్ర నిండా వాళ్ళ పోట్లాటలే కనపడతాయి. రాజుల మధ్య ఎన్నెన్ని యుద్ధాలు! ఒకళ్ళ రాజ్యం కోసం ఒకళ్ళు! భూస్వాముల మధ్య ఎన్ని సరిహద్దుల యుద్ధాలు! ఒకళ్ళ భూమి కోసం ఒకళ్ళు! ఇక పెట్టుబడిదారుల మధ్యా? శ్రామికుల నించి లాగే దాంట్లోంచి ఎవరికి వాళ్ళే పెద్ద వాటా లాగాలనుకుంటారు. కౌలు వాటాయే పెద్దగా ఉండాలని భూస్వాములు అను

కుంటే, వడ్డీ వాటాయే పెద్దగా ఉండాలని వడ్డీల వాడూ, లాభం వాటా పెద్దగా ఉండాలని లాభాల వాడూ! దోపిడీ చేసి తెచ్చుకున్న ఒక 100 సొమ్ముని, ముగ్గురు పంచుకోవాలంటే, ఎవడి ఆశ వాడిది, తనే ఎక్కువ వాటా లాగాలని. దోపిడీగాళ్ళకి ఐకమత్యం పట్టదు. భూస్వాములు ఎప్పుడూ భూస్వాములు గానే ఉండరు. వాళ్ళూ పరిశ్రమలు పెట్టి, పెట్టుబడిదారులవుతారు. అలాగే, పెట్టుబడిదారులు కూడా భూములు సంపాదించి భూస్వాములు అవుతారు. అదనపు విలువలు పెరిగిపోతూ ఉంటే, వాటి వాటాలన్నీ పెరిగిపోతూ, ప్రతీ దోపిడీ ఆస్తీ పెరిగిపోతూ ఉంటాయి. వడ్డీల రాసీ, కౌళ్ళ రాసీ, లాభాల రాసీ, అన్నీ పెరుగుతూ ఉంటాయి. ఆ వాటాల్ని పంచుకునే వాళ్ళ మధ్య ఎప్పుడూ కొట్లాటలే. దోపిడీదారుల్ని మార్క్సు, "శత్రు సోద రులు" అంటాడు. వాళ్ళు సోదరులే గానీ, శత్రువుల్లాంటి సోదరులు. ఒకడి పీక ఒకడు కోసెయ్యడానికి చూస్తారు, కోసేసుకుంటారు. ఇప్పటికి ప్రపంచ యుద్ధాలు రెండు జరిగి ఉన్నాయి. ఆ యుద్ధాల తర్వాత పెట్టుబడిదారుల మధ్య ఏం జరిగిందో చూస్తే, వాళ్ళు ఎంత ఐకమత్యంగా ఉన్నారో చూడొచ్చు.

**71. భూస్వాముల్లో రకాలు ఉండవేమో గానీ, పెట్టుబడిదారుల్లో రకాలు ఉంటాయా?**

**జ:** భూస్వాముల్లో మాత్రం రకాలు ఎందుకు ఉండవు? మరీ పెద్ద భూముల వాళ్ళూ, కొంచెం చిన్న భూముల వాళ్ళూ, ఆ తేడాలు ఉంటాయి. 'జమీందారు' అంటే ఏమిటి? 'జమీన్' అంటే భూమి కదా? వేల ఎకరాల్ని ఆక్రమించి ఉన్నవాడు జమీన్‌దారు. వాడి ప్రదేశం అంతా వాడి రాజ్యంగా ఉంటుంది. వేలు గాక, వందల ఎకరాలు ఉన్నవాడు పాపం చిన్న భూస్వామి. సరే, వాళ్ళని వదిలేసి పెట్టుబడిదారుల్ని చూద్దాం. పెట్టుబడిదారుల్లో, ప్రధానంగా 3 రకాలు. ఉత్పాదక పెట్టుబడిదారులూ, వర్తక పెట్టుబడిదారులూ, వడ్డీ పెట్టుబడిదారులూ. ఈ 3 రకాల్లోనే చిన్నా పెద్దా ఉంటారు. ఈ రకాలన్నీ క్లుప్తంగా చూద్దాం. అసలు ప్రపంచంలో ఉన్న డబ్బు ఎవ రిదో చూడాలంటే, ఈ రకాలన్నీ చూడాలి.

**ఉద్పాదక పెట్టుబడిదారులు:** అమ్మకం కోసం సరుకుల్నీ, శ్రమల్నీ, ఉత్పత్తి చేయించే వాళ్ళ పేరు ఇది. వీళ్ళకి, 'బూర్జువాలు' అని ఇంకో పేరు కూడా ఉంది. వీళ్ళు, భూస్వాముల నించి భూముల్ని కూడా పెద్ద ఎత్తున కౌళ్ళకి తీసుకుని, వ్యవ సాయాలన్నిటినీ కూడా సరుకుల పరిశ్రమలుగా మార్చేస్తారు. వీళ్ళు ప్రారంభమైన దగ్గిర్నించీ అది, 'పెట్టుబడిదారీ సమాజం.' అదే, 'బూర్జువా సమాజం.' ఇప్పుడు మనం బానిస సమాజంలో ఉన్నట్టో, భూస్వాముల సమాజంలో ఉన్నట్టో, కాదు. బూర్జువా సమాజంలో ఉన్నాం. ఈ సమాజంలో, కౌలు రైతులూ, స్వతంత్ర ఉత్పత్తి దారులూ కూడా ఉన్నప్పటికీ, వేతన శ్రామికులుగా శ్రమలు చేస్తోన్న జనం, కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఏ విభాగంలో ఎక్కువ జనం ఉన్నారనేది, వేరే సంగతి. సరుకుల్ని తయారుచేయించే ఉత్పాదక పెట్టుబడిదారులకు వచ్చే లాభం పేరు 'ఉత్పాదక లాభం' కదా? ఈ మాట ఇంతకు ముందే చూశాం. ఉత్పత్తి చేసే శ్రమలు చేసినందుకు వచ్చే జీతం కాదు అది; చేయించే కష్టాలు పడ్డందుకు వచ్చే లాభం

అది! ఆ 'చేయించడానికి' కూడా, ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా, మేనేజర్లూ, సూపర్ వైజర్లూ - ఆ రకం ఉద్యోగులు ఉంటారు. ఆ కష్టం ఏదైనా ఉంటే వాళ్ళే పడతారు. పెట్టుబడిదారుడు పడే కష్టం ఏదీ ఉండదు, లాభం ఇంకా పెరగలేదే, పెట్టుబడి ఇంకా పెరగలేదే - అని ఏడ్చే కష్టం తప్ప! సరుకుల్ని ఉత్పత్తి చేసే పెట్టుబడి పేరు, 'ఉత్పాదక పెట్టుబడి.' సరుకుల్ని తయారు చేసే శ్రామికుల పేరు, 'ఉత్పాదక శ్రామికులు.' వీళ్ళ శ్రమలన్నీ, 'ఉత్పాదక శ్రమలు.' ఈ పెట్టుబడిదారుడికి అందే లాభం, 'ఉత్పాదక లాభం' అని తెలుసు కదా?

అయితే, ఒక పని స్థలంలో సరుకు తయారై పోగానే అది అక్కడే వాడకందారులకు అందదు. వాడకందారులు అంటే, ఉత్పత్తుల్ని వాడే వాళ్ళు. పెట్టుబడిదారులు, వేరే వాళ్ళ దగ్గిర నించీ ఉత్పత్తి సాధనాల్ని కొని తమ పని స్థలంలోకి తెచ్చి వాడతారు. శ్రామికులందరూ పోషణ వస్తువుల్ని ఇళ్ళ దగ్గిర వాడతారు. వాడకాల కోసం ఉత్పత్తుల్ని కొనేవాళ్ళే, వాడకందారులు. ఒక పని స్థలంలో తయారై ఉన్న సరుకుల్ని ఆ పని స్థలంలో నించి తీసి ఒక స్టోరులో పెట్టాలి. ఆ స్టోరునీ, ఆ సరుకుల్నీ, కొన్నాళ్ళ దాకా పరిశుభ్రంగా ఉంచాలి. ధాన్యం లాంటి సరుకుని అయితే, మళ్ళీ కొత్త పంట వచ్చే దాకా సురక్షితంగా ఉంచాలి. పరిశుభ్రంగా ఉంచకపోతే, సరుకులన్నీ పనికి రాకుండా పోతాయి. దేన్ని ఎన్నాళ్ళు స్టోరులో జాగ్రత్తగా ఉంచాలో, అది ఆ సరుకు లక్షణాల్ని బట్టి ఉంటుంది. ఆ సరుకుని అమ్మకాలకు పంపాలంటే, తర్వాత, అట్ట పెట్టెల్లోనో, గోనె సంచుల్లోనో, రక రకాల పద్ధతుల్లో పెట్టి కట్టలు తయారు చెయ్యాలి. తర్వాత, వాటిని ఆ స్టోరు నించి బైటికి తియ్యాలన్నా, బజారుకి పంపాలన్నా, రవాణా పనులు జరగాలి. రవాణా పనులు లేకపోతే, ఒక పని స్థలంలో తయారై ఉన్న సరుకు బజారుకి చేరదు. ఒక ఊరు సరుకు, ఇంకో ఊరుకి చేరదు. అంటే, ఒక పని స్థలంలో సరుకు తయారైన తర్వాత, దాని పని అక్కడి తోటే అయిపోయినట్టు కాదు. దాని మీద స్టోరు పనులూ, ప్యాకింగ్ పనులూ, రవాణా పనులూ, అవన్నీ కూడా తప్పనిసరిగా జరుగుతాయి. ఆ పనులన్నీ అవసరమైన పనులే కాబట్టి, వాటి విలువలన్నీ సరుకుకి చేరతాయి. కానీ, ఆ పనుల వల్ల కొత్త సరుకు తయారయ్యేదేమీ ఉండదు. తయారై ఉన్న సరుకు మీదే, స్టోరు వల్ల కొంత విలువా, ప్యాకింగ్ వల్ల కొంత విలువా, రవాణా వల్ల కొంత విలువా, చేరుతూ ఉంటాయి. ఈ పనుల్లో ప్రతీ దానికీ వేరే పెట్టుబడిదారులూ, ఆ పనులు చేసే వేరే శ్రామికులూ, ఉంటారు. ఆ పనుల విలువలన్నీ కలిసినదే, చివరికి ఆ సరుకు విలువ అవుతుంది. ఒక వేళ, ఒక సరుకు మీద స్టోరు పని జరగకపోతే, రవాణా పని జరగకపోతే, ఆ విలువలు చేరవు. కానీ, సరుకు తయారైన పని స్థలంలో నించి అది బజారుకి చేరే రవాణా పని అయినా జరుగుతూ ఉండాలి. మొదట తయారైన సరుకుకి రూపం మారకుండానే, దాని మీద వేరే శ్రమలు జరగడం వల్ల, దాని విలువ పెరుగుతూ ఉంటుంది. పని స్థలంలో తయారైన 8 చొక్కాలకి, స్టోరు పనుల వల్ల రూపం మారదు, కానీ విలువ

పెరుగుతుంది. ప్యాకింగ్ పనుల వల్ల రూపం మారదు, విలువ పెరుగుతుంది. రవాణా వల్ల రూపం మారదు, విలువ పెరుగుతుంది.

మనం బజారులో ఒక సరుకుని కొంటున్నామంటే, దాని తయారీకీ, స్టోరూ - ప్యాకింగూ - రవాణా - అన్నింటికీ చెల్లిస్తున్నామని అర్థం. ఏ దశలో జరిగే పనిలో నించైనా 'అదనపు విలువ,' ఆ పనులు చేయించే పెట్టుబడిదారుడికి అందుతుంది. సరుకుకి విలువని చేర్చే శ్రమలన్నీ, ఉత్పాదక శ్రమలే. స్టోరూ, ప్యాకింగూ, రవాణా శ్రామికులందరూ, ఉత్పాదక శ్రామికులే. వారు ప్రతి రోజూ అదనపు విలువని పోగొట్టుకుంటూ ఉంటారు. సరుకుల్ని తయారు చేయించే పెట్టుబడిదారుల్ని చూసిన తర్వాత, ఇప్పుడు సరుకుల్ని అమ్మించే పెట్టుబడిదారుల్ని చూడాలి. ★

# 31. అమ్మకం ఖర్చులు, సరుకుకి చేరవు!

**72. మా హోటల్లో, సరుకులన్నీ అక్కడే తయారవుతాయి, అక్కడే అమ్ముతారే! అమ్మడం పనులు వేరే వాడు చేయిస్తాడా?**

**జ:** మీ సరుకులు ఇడ్లీలూ ఉప్మాలూ వంటి తిండి సరుకులు కాబట్టి, తయారైన చోటే అమ్ముతారు. బిస్కట్లూ, బ్రెడ్డూ వంటి సరుకుల్ని అయితే తయారైన చోటే అమ్ముతారా? చొక్కాలన్నిటినీ తయారైన చోటే అమ్మరు కదా? సరుకుల్ని తయారు చేయించే వాడు ఉత్పాదక పెట్టుబడిదారుడు కదా? సరుకుల్ని అమ్మించే వాడు అనుత్పాదక పెట్టుబడిదారుడు అవుతాడు. వాణ్ణి చూడాలి ఇప్పుడు.

**వర్తక పెట్టుబడిదారులు:**

ఉత్పాదక పెట్టుబడిదారుల ద్వారా తయారై ఉన్న సరుకుల్ని అమ్మించే పెట్టుబడిదారులు వీళ్ళు. అమ్మకం పనుల కోసం కూడా ఆ పనులు జరిగే స్థలాలూ (భూమి), దాని మీద కట్టడాలూ (షాపులు), అక్కడ అలమార్లూ, టేబుళ్ళూ, కుర్చీలూ వంటి సామగ్రీ, ఆ పనులు చేసే శ్రామికులూ, అన్నీ కావాలి. ప్రతీ ఊళ్ళోనూ, రోడ్లకి రెండు పక్కలా కనపడే దుకాణాలన్నీ సరుకుల్ని అమ్మే స్థలాలే కదా? ఈ అమ్మకం పనులు జరగడానికి కూడా కొన్ని ఖర్చులు అవుతాయి. ఆ ఖర్చుల్లో, పాత శ్రమలూ - కొత్త శ్రమలూ, ఉంటాయి. ఆ పనుల కోసం అవసరమయ్యే బిల్డింగులూ, ఇంకా ఇతర సాధనాల ఖర్చులన్నీ పాత శ్రమలు. అక్కడ శ్రామికులు చేసే పనులన్నీ కొత్త శ్రమలు. ఆ 2 రకాల శ్రమలూ కలిసి, ఆ పనికి సంబంధించిన మొత్తం ఖర్చు. కానీ, ఆ ఖర్చు, ఆ సరుకు విలువలోకి చేరదు. మార్క్సు సిద్ధాంతం ప్రకారం, ఆ అమ్మకం ఖర్చులన్నీ, అసహజపు, అనవసరపు ఖర్చుల కిందకే వస్తాయి.

సరుకుకి విలువగా చేరని ఏ పని అయినా, అనుత్పాదక శ్రమే. వర్తక శ్రామికులు, అనుత్పాదక శ్రామికులు. అమ్మకం పనులన్నీ అనుత్పాదక శ్రమలు. ఈ సంగతి మొదటే చెప్పేసుకుంటే, విషయం తేలిగ్గా ఉంటుంది.

అమ్మకాల పనులు సమాజంలో ఏ నాటి నించో జరుగుతూనే ఉన్నాయి. వాటితో అవసరాలు ఈ నాటికీ కూడా ఉన్నాయి. కానీ, జరుగుతూ ఉన్నవన్నీ, జరుగుతూ ఉండవలసిన సహజ అవసరాలే కాకపోవచ్చు. మనుషులు బతకడానికి ఉత్పత్తులు కావాలి కాబట్టి, వాటిని తయారు చేసుకోవడాలూ, వాటిని వాడుకోవ డాలూ, ఎప్పటికీ అవసరాలే. ఆ 2 విషయాల్నీ మానివెయ్యడానికి ఏ నాటికీ సాధ్యం కాదు. ఆ 2 పనుల మధ్యలో సాగే (వస్తువు తయారీకీ, దాని వాడకానికీ మధ్యలో సాగే) అమ్మకాల వ్యవహారం తప్పనిసరి అవసరం కాదు. 'మారకం విలువ అసహజ మైనది' అని వెనక భాగాల్లో చూశాం. అంటే, 'అమ్మకం' అసహజమైనది - అని అర్థం. అమ్మకం జరిగిన వస్తువు ఎలా ఉపయోగపడుతుందో, అమ్మకం జరగని వస్తువు కూడా అలాగే ఉపయోగ పడుతుంది. అమ్మకం జరగకపోతే ఆ వస్తువు ఉపయోగపడదు - అనేదేమీ లేదు. అంటే, అమ్మకం అనేది, జరిగి తీరవలసిన పని కాదని అర్థం. కానీ, మానవ సంబంధాల్లో ఏ నాటి నించో ఉన్న అజ్ఞానం వల్లా, తప్పుల వల్లా, 'అమ్మకం' అనేది పుట్టుకొచ్చి, ఇంకా నిలబడి సాగుతోంది. శ్రమ సంబంధాల్లో లోపాలు ఇప్పుడు ఉన్నట్టే ఉంటే, అమ్మకం ఎప్పటికీ ఇలాగే ఉంటుంది.

అమ్మకం పనుల కోసం చాలా ఖర్చులు, అంటే చాలా శ్రమలు, వృధాగా జరు గుతూ ఉంటాయి. అమ్మకాలు లేకుండా వస్తువుల్ని వాడుకోగలిగే కొత్త సంబంధాల సమాజం ఏదైనా ఏర్పడితే, అక్కడ ఈ అమ్మకాల ఖర్చులు ఉండవు. భూమినంతా బజార్ల కోసం, దుకాణాల కోసం, వాడుకోవలసిన అవసరం ఉండదు.

సరుకుకి ఏర్పడే విలువ సంగతి చూస్తే, అమ్మకం ఖర్చులు సరుకుకి విలువగా చేరవు. ఆ ఖర్చుల వల్ల సరుకు విలువ పెరగదు. సరుకుని అమ్మితే వచ్చే విలువ, అది తయారై, బజారుకి చేరే వరకూ జరిగే శ్రమల వల్ల చేరినదే గానీ, అమ్మకం ఖర్చులు కూడా కలిసినది కాదు. మనం బజారులో కొనే ఏ సరుకు ధర అయినా, దాని తయారీ ఖర్చేగానీ (స్టోరూ, రవాణా వంటి ఖర్చులు కూడా చేరినదే), అమ్మకం ఖర్చు కూడా చేరినది కాదు.

అయితే, సరుకుల్ని తన శ్రామికులతో అమ్మించే వర్తక పెట్టుబడిదారుడు, ఆ అమ్మకం ఖర్చుల్ని ఆ సరుకు ద్వారా తీసుకోకపోతే, ఆ ఖర్చుల్ని ఎక్కడి నించి తెచ్చి పెడతాడు? అంతే కాదు, చివరికి ఆ సరుకు ద్వారా తన లాభాన్ని ఎలా తీసు కుంటాడు? (ఈ విషయాలన్నీ 'కాపిటల్'లో అయితే, చాలా వివరంగా తెలుసు కోవచ్చు. ఇక్కడ అన్ని వివరాల కోసం చూడకండి!) సరుకుని తయారు చేయించే ఉత్పాదక పెట్టుబడిదారుడు, తను తీసుకునే లాభాన్ని సరుకులో నించే తీసుకుంటు న్నాడంటే, ఆ లాభం సరుకు విలువలోకి చేరి ఉండడం వల్లే దాన్ని తీసుకోగలుగు తున్నాడా? కౌళ్ళనీ, వడ్డీల్నీ, సరుకు విలువలో నించే తీస్తున్నాడంటే, అవి అన్నీ సరుకు విలువలోకి చేరడం వల్లే అవి బైటికి వస్తున్నాయని అర్థమా? అలా కాదని చూశాం. అవి, సరుకు విలువలోకి చేరక పోయినా, వాటిని సరుకు విలువలో నించే పంచు

కుంటారు. ఈ అమ్మకం ఖర్చుల సంగతీ అంతే. ఇవి సరుకులోకి చేరకపోయినా, వీటిని కూడా సరుకు విలువలో నించే తియ్యాలి. భూమి కౌలూ, వడ్డీ, ఉత్పాదక లాభమూ, సరుకు విలువలో ఉన్న ఏ భాగంలో నించి బైట పడుతున్నాయో, ఈ అమ్మకం ఖర్చులు కూడా ఆ భాగంలో నించి బైటికి రావలసిందే. అంటే, సరుకులో ఉన్న 'అదనపు విలువ' భాగంలో నించే. అంటే, అమ్మకం ఖర్చులన్నీ కూడా ఉత్పాదక శ్రామికుల అదనపు విలువలో భాగమే అన్నమాట! (అప్పుడే, ఆశ్చర్య పోకండి! 'అదనపు విలువ'లో నించి బైటపడవలసిన ఖర్చులు ఇంకా ఉన్నాయి! ఇప్పుడు 'అమ్మకం ఖర్చుల' వరకూ మాత్రమే వచ్చాం.) సరుకుని తయారు చేయించే పెట్టుబడిదారుడు, సరుకు ఖర్చుల జాబితాని రాసేటప్పుడు, భూమి కౌలునీ, వడ్డీనీ, కూడా ఖర్చులు గానే రాస్తాడు కదా? అలాగే అమ్మకం ఖర్చుల్ని కూడా ఆ జాబితాలోకే చేర్చి రాస్తాడు. దానికి "వర్తక కమిషన్" అనే పేరు ఉంటుంది. 'వడ్డీ' అనీ, 'కౌలు' అనీ, 'లాభం' అనీ, పేర్లు ఉన్నట్టే, దీనికి 'వర్తక కమిషన్' అనే పేరు! ఆ పేర్లు చేరినట్టే, ఈ పేరు కూడా ఆ జాబితాలోకి చేరుతుంది.

ఒక ఉదాహరణని చూసేటప్పుడు మొదట తక్కువ వివరాలతో చూస్తాం. తర్వాత, ఆ వివరాలు పెరుగుతూ ఉంటే, ఆ ఉదాహరణలోకి కొత్త విషయాలు చేరుతూ ఉంటాయి. మొదట, కౌలూ - వడ్డీ - ఉత్పాదక లాభం - ఈ 3 అంశాలే చూశాం. అప్పుడు వర్తక కమిషన్ ఇంకా లేదు. ఇప్పుడు, ఆ కమిషన్, కొత్తగా వచ్చింది. దాన్ని కూడా అదనపు విలువలోనే భాగంగా పెట్టుకోవాలి. తర్వాత, ఇంకా కూడా కొన్నిటిని పెట్టుకుంటాం.

సరుకు ధరని మొదటగా చూసినప్పుడు, అదనపు విలువని 20 గానూ, సరుకు ధరని 120 గానూ, పెట్టుకున్నాం. ఇప్పుడు కూడా అదనపు విలువని 20 గానే ఉంచి, వర్తక కమిషన్‌ని కూడా అందులోనే చూపించవచ్చు. గతంలో చూపించిన కౌలూ - వడ్డీ - ఉత్పాదక లాభాల సైజుల్ని తగ్గించవచ్చు. లేదా, ఇప్పుడు అదనపు విలువని కొంచెం పెద్దదిగా పెట్టుకుని, వెనకటి వాటి సైజుల్ని అలాగే ఉంచవచ్చు. ఎలా చేసినా, విషయం ఒకటే. ఇప్పుడు రెండో పద్ధతిలో చూపిస్తాను. అదనపు విలువని 30 గానూ (20 కాదు), సరుకు ధరని 130 గానూ (120 కాదు), ఇప్పుడు పెట్టుకుందాం. ఇప్పుడు అదనపు విలువలో వర్తక కమిషన్ కూడా కనపడుతుంది.

ఒక వర్తక పెట్టుబడిదారుడికి, 8 చొక్కాల సరుకు అమ్మకం కోసం, వర్తక కమిషన్‌గా 10 అందిందనుకుందాం. ఆ 10 అంతా, అతనికి. 'లాభం' అయిపోదు. మొదట, అమ్మకం పనుల కోసం, ఆ 10లో నించి కొంత ఖర్చు పెట్టాలి. ఆ అమ్మకం పనులు చేసే శ్రామికుల జీతాలు కూడా ఆ 10లో నించే వెళ్తాయి. ఆ రకంగా, అమ్మకం ఖర్చుల కోసం, ఆ 10లో నించి 5 అయిందనుకుందాం. మిగిలిన 5, వర్తక పెట్టుబడిదారుడికి లాభం. దానికి, 'వర్తక లాభం' అని పేరు. వర్తక పెట్టుబడిదారుడు, అమ్మకం పనులు తన శ్రమతో చెయ్యడు. శ్రామికులతో చేయిస్తాడు. అతనికి వచ్చే లాభం, శ్రమ చెయ్యడం వల్ల వచ్చేది కాదు. సరుకుని తయారు చేయించే వాడి

లాభం, 'ఉత్పాదక లాభం' అయితే, సరుకుని అమ్మించే వాడి లాభం, వర్తక లాభం. ఎవరి లాభం, వాళ్ళకి దోపిడీ ఆదాయం.

**'వర్తక కమిషన్' అనేది, 2 భాగాలు అవుతుంది.**

(1) అమ్మకం ఖర్చులు. శ్రామికుల జీతాలతో సహా. ఇదే, 'వర్తక పెట్టుబడి.'

(2) వర్తక పెట్టుబడిదారుడికి లాభం.

వర్తక పెట్టుబడిదారుడు, వర్తకం పనుల కోసం మొదట కొంత పెట్టుబడి పెడతాడు. సరుకు ద్వారా వచ్చే 'కమిషన్'లో నించి, ఆ పెట్టుబడిని వెనక్కి తీసుకుంటాడు. కమిషన్‌ని 10 అనీ, అమ్మకం ఖర్చుల్ని 5 అనీ, అనుకుంటే, కమిషన్‌లో నించి ఖర్చులు పోతే, వర్తక లాభంగా 5 మిగులుతుంది. వర్తకం ఖర్చులు - అనే దాంట్లో, వర్తక శ్రామికుల జీతాల భాగం కూడా ఉంటుందని మరిచిపోవద్దు.

ఈ అమ్మకం ఖర్చులు, 'సరుకు విలువ' లోకి చేరవు కాబట్టి, ఇవి 'అనుత్పాదక ఖర్చులు.' వర్తక పెట్టుబడిదారుడు, 'అనుత్పాదక పెట్టుబడిదారుడు.' వర్తక శ్రామికులు, 'అనుత్పాదక శ్రామికులు.' ఈ శ్రామికులు కూడా అదనపు శ్రమని పోగొట్టుకుంటారు. మనం ఇంకా ఈ 'ఉత్పాదక - అనుత్పాదక' శ్రమల విషయాలు సరిగా చూడలేదు. ఆ విషయాలు ఇప్పుడే చెప్పుకుందాం. ★

# 32. ఉత్పాదక శ్రమలు డబ్బుని పెంచితే, అనుత్పాదక శ్రమలు డబ్బు ఖర్చుని తగ్గిస్తాయి!

**73. ఈ మాటలు వినడానికి ఆశ్చర్యంగా ఉంది. మేం నలుగురం శ్రామికులమే. కానీ, ఉత్పాదకం వాళ్ళమా, అనుత్పాదకం వాళ్ళమా? ఏ రకం అయితే యేం లెండి. జీతాలు వస్తాయి కదా?**

**జ:** అలా అనుకోవద్దు. ఉత్పాదకం వాళ్ళకీ, అనుత్పాదకం వాళ్ళకీ తేడాలు తెలియక పోతే, అసలు పెట్టుబడిదారీ విధానమే అర్థం కాదు. శ్రమ సంబంధాలే అర్థం కావు. ప్రపంచంలో ఉన్న డబ్బు ఎవరిదో అర్థం కాదు. ఆ తేడాలు తెలిస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి. మీ పనులు ఒక సారి చెప్పారు గానీ మళ్ళీ చెప్పండి!

"అందరం వంటల పనులే. ఇడ్లీలూ, ఉప్మాలూ చేసే పని నాది. వీళ్ళూ అలాగే కొన్ని రకాలు చేస్తారు."

"మీ వంటలు అమ్మకాల కోసమేనా? లేకపోతే, అన్నిటినీ మీ యజమాని తినేస్తాడా?"

"అన్నీ తిన్నాడంటే టప్పున ఆ పూటే చస్తాడు. అమ్మకానికి కాకపోతే ఇంకెందుకు? ఇడ్లీల వాయి దిగీ దిగగానే తినేసే వాళ్ళు తినేసి పోతూ ఉంటారు. అన్ని రకాలూ చెల్లిపోతూనే ఉంటాయి."

"అంటే, మీ శ్రమలన్నీ సరుకుల్ని తయారు చేసే శ్రమలే. ఆ వంటల్ని అమ్మితే, మీ శ్రమల్ని కూడా అమ్మినట్టే. సరుకు వెళ్ళిపోయి డబ్బు వస్తుంది. అది సరుకు విలువ కదా? అందులో నించి ఉత్పత్తి సాధనాల భాగాన్నీ, జీతాల భాగాన్నీ తీసేస్తే, 'అదనపు డబ్బు' యజమానికి మిగులుతుంది. (ఆ అదనం డబ్బుని పంచుకునే వాళ్ళందర్నీ కలిపి 'యజమాని' అంటున్నాం - అనుకోవాలి.) యజమాని, మొదట పెట్టిన డబ్బు అంతా వెనక్కి వచ్చి, దానికి ఈ 'అదనం డబ్బు' కూడా కలిసి, యజమాని డబ్బు పెరుగుతుంది. అలా యజమానికి, డబ్బుని పెంచగలిగేది, 'ఉత్పాదక శ్రమ.' సరుకుల్ని అమ్మితేనే అది జరుగుతుంది. 'అనుత్పాదక శ్రమ'తో అలా జరగదు. ఈ శ్రమని చూడాలంటే, మీ యజమాని ఇంట్లోనే పని చేసే వాళ్ళెవరైనా తెలుసా మీకు?"

"భలేగా ఉంది. మా ఆవిడే అక్కడ పని చేస్తుంది. వాళ్ళు హోటల్లో వంటలు ఎప్పుడన్నా తింటారు గానీ రోజూ తినరు. ఇంట్లోనే నువ్వుల నూనెలూ అవీ పెట్టి వండించుకుంటారు. అంత మంచి నూనెలు హోటల్లో వాడం కదా? మా ఆవిడ రాత్రి దాకా అక్కడే ఉంటుంది. పగలు అక్కడే తింటుంది. రాత్రి ఇంటికి వచ్చేటప్పుడు అక్కడ మిగిలిందేదో కాస్త తీసుకొస్తుంది. రాత్రి పూటే ఇంటి దగ్గిర కాస్త వంట చేస్తుంది. నేను హోటల్లోనే తింటాను చాలా సార్లు. అర్ధ రాత్రికి కొంపకి చేరతాను."

"సరే, మీ ఆవిడ, యజమాని ఇంట్లో వంటలు చేస్తుంది కదా? ఆ వంటల్ని అమ్మేస్తారా?"

"అయ్యో, ఎందుకు అమ్మతారు? అమ్మితే వాళ్ళేం తింటారు? వాళ్ళ కోసమే కదా అవి?"

"అంటే, మీ ఆవిడ చేసే వంటలు 'సరుకులు' కావు. అవి అమ్మకానికి వెళ్ళవు కాబట్టి, మీ ఆవిడ శ్రమ అమ్మకానికి వెళ్ళదు. ఆ వంటలన్నీ ఆ యజమాని కుటుంబానికే 'ఉపయోగపు విలువలు'గా వాడకం అయిపోతాయి. కాబట్టి, వాటి కోసం పెట్టిన ఏ ఖర్చూ వెనక్కి రాదు. ఆ డబ్బు ఖర్చయిపోతుంది గానీ మళ్ళీ రాదు. ఆవిడ చేసే శ్రమకి కొంత విలువ ఉంటుంది కదా? ఆ విలువలో నించి జీతం భాగాన్ని తీసేస్తే, అదనపు శ్రమ భాగం ఉంటుంది. కానీ, ఆ వంటల్లో, పాత శ్రమ గానీ, కొత్త శ్రమ గానీ, ఏదీ డబ్బుగా మారదు కాబట్టి, అవన్నీ ఇంట్లోనే ఖర్చయిపోతాయి కాబట్టి, ఆవిడ చేసిన అదనపు శ్రమ కూడా డబ్బుగా మారదు. అది కూడా ఉపయోగపు విలువ గానే, వాళ్ళ వాడకానికే, ఖర్చయిపోతుంది. మీకూ, మీ ఆవిడకీ, ఇద్దరికీ యజమానులు ఉన్నారు. ఇద్దరూ అదనపు శ్రమ విలువలు పోగొట్టుకుంటారు. కానీ, మీరు ఉత్పాదక శ్రామికుడైతే, ఆమె అనుత్పాదక శ్రామికురాలు అవుతుంది. మీ శ్రమ, డబ్బుగా మారుతుంది; గానీ, ఆమె శ్రమ, డబ్బుగా మారదు."

"కానీ, మా ఆవిడికి కూడా ప్రతి నెలా, నాకు లాగే, జీతం వస్తూనే ఉంటుందే! ఆమె శ్రమ కూడా డబ్బుగా మారినట్టు కాదూ?"

"కాదు, ఆమెకి జీతం ఎలా వస్తుందంటే, ఆమె శ్రమ డబ్బుగా మారడం వల్ల కాదు. ఆ శ్రమే అమ్మకానికి వెళ్ళి, డబ్బు వచ్చి, ఆ డబ్బులో నించే జీతాన్ని ఇవ్వడం కాదు అది. ఆ జీతాన్ని యజమాని ఏ డబ్బులో నించి ఇస్తాడంటే, ఉత్పాదక శ్రామికుల అదనపు విలువలో నించి సంపాదించే 'ఉత్పాదక లాభం' ఉంటుంది కదా? ఆ లాభంలో నించే ఇంటి పోషణ ఖర్చులన్నీ పెడతారు కదా? ఇంటి పని మనుషుల జీతాలన్నీ, ఆ లాభం లోనించే తీసి ఇవ్వాలి. వంట మనిషే కాదు, అంట్ల మనిషీ, తోట మనిషీ, కారు డ్రైవరూ, కాపలా మనిషీ, కుక్కల్ని తిప్పే మనిషీ, అలా చాలా మంది ఇంటి శ్రామికులు ఉంటారు. వాళ్ళందరి జీతాలూ ఉత్పాదక లాభం లోనించి ఇవ్వవలిసిందే. మార్క్సు ఏ మన్నాడో తెలుసా? ఆ పద్ధతిలో చెప్పాలంటే, 'మీ యజమాని మిమ్మల్ని దోపిడీ చేసి సంపాదించిన అదనపు విలువ లోనించి మీ ఆవిడికి జీతం ఇచ్చి, ఆమె అదనపు శ్రమని కూడా లాగి ఆమెని కూడా దోపిడీ చేస్తాడు."

"అలా అన్నాడా మార్క్సు?"

"అవును, అలాగే అన్నాడు. ఉత్పాదక శ్రామికుల్ని దోపిడీ చేసిన దానితోనే అనుత్పాదక శ్రామికులకు జీతాలు ఇస్తాడు గానీ, అనుత్పాదకం వాళ్ళ శ్రమలే డబ్బుగా మారతాయని కాదు. 'ఉత్పాదక' అంటే, ఉత్పత్తి చేసేది. 'అనుత్పాదక' అంటే, ఉత్పత్తి చెయ్యనిది. ఈ ఉత్పత్తి చెయ్యడం, చెయ్యకపోవడం, దేనిని? - డబ్బుని. ఏ శ్రమ అయినా అమ్మకానికి వెళ్తేనే, అది వెళ్ళిపోయి డబ్బు వస్తుంది. మొదటి డబ్బు పెరుగుతుంది. అమ్మకానికి వెళ్ళకపోతే, మొదటి డబ్బూ వెనక్కి రాదు, కొత్త డబ్బూ రాదు. ఈ తేడాని బాగా అర్థం చేసుకోవాలి."

"అయితే, ఈ అనుత్పాదక పని వాళ్ళ వల్ల, యజమానికి ఏమిటి లాభం?"

"మీ దగ్గిర ఏం లాభమో, ఆమె దగ్గిరా అదే లాభం. తక్కువ ఖర్చుతో, ఎక్కువ పని దొరకడం."

"రెండూ ఒక లాంటి లాభమే అయితే, ఆ పనికీ, ఈ పనికీ తేడా ఏమిటి?"

"మళ్ళీ మొదటికొచ్చారా? ఉత్పాదక శ్రమ, మొదట ఖర్చయిన డబ్బుని వెనక్కి తెస్తూ, దానితో పాటు అదనపు డబ్బుని కూడా తెస్తూ, యజమాని డబ్బుని పెంచు తుంది కదా? అనుత్పాదక శ్రమ వల్ల అలా జరుగుతుందా? అనుత్పాదక శ్రమ అయితే, యజమాని పెట్టే డబ్బుని ఖర్చు చేస్తూ, కొన్ని పనులతో యజమాని అవస రాలు తీరుస్తూ, 'అదనపు శ్రమ' చేసినా దాన్ని కూడా డబ్బుగా ఇవ్వకుండా యజమాని డబ్బు ఖర్చుని తగ్గించడం మాత్రమే చేస్తుంది."

"డబ్బు పెరగడం అంటే తెలుస్తోంది గానీ, ఖర్చు తగ్గడం అంటే?"

"మొదట యజమాని జేబులో 20 డబ్బు ఉందనుకుందాం. అది, ఉత్పాదక లాభం వల్ల వచ్చిన డబ్బు. లేదా అది వడ్డీల వల్లో, కౌళ్ళ వల్లో, ఏ దోపిడీ వల్లో వచ్చిన డబ్బు అని అయినా అనుకోవచ్చు. కానీ ఇక్కడ దాన్ని ఉత్పాదక లాభమే అనుకుందాం. వంట మనిషి శ్రమ విలువని 5 అనుకుందాం. ఆ శ్రమ అంతా యజ

మాని ఇంటి అవసరాలకే వాడకం అయిపోతుంది. అది, డబ్బుగా మారదు. ఆమె శ్రమ విలువనంతా ఆమెకి ఇవ్వాలంటే, 5 ఇవ్వాలి. అలా ఇస్తే, యజమాని జేబులో నించి 5 ఖర్చయి పోతుంది. కానీ ఆమెకి యజమాని 2 మాత్రమే ఇచ్చాడనుకుందాం. మిగతా 3 ఇవ్వలేదు. అప్పుడు యజమాని దగ్గిర ఉన్న 20 డబ్బులో నించి ఎంత ఖర్చవుతుంది? 2 మాత్రమే ఖర్చవుతుంది. 3 కూడా ఖర్చవకుండా అది మిగిలి ఉంటుంది. ఇంటి వంట మనిషికి, అదనపు శ్రమకి ఇవ్వకపోవడం వల్ల, దాని కోసం జరగవలసిన ఖర్చు తగ్గుతుందా లేదా? కానీ, ఆమె నించి 2 డబ్బుకే, 5 విలువ గల పని దొరికింది కదా? 5ని ఖర్చు పెట్టవలసిన చోట 2ని మాత్రమే ఖర్చు పెట్టడం వల్ల, 3 ఖర్చు తగ్గింది. అదీ ఖర్చు తగ్గడం!''

''ఉత్పాదక శ్రామికుల వల్ల జరిగేది కూడా అదే కదా? తక్కువ డబ్బుతో, ఎక్కువ శ్రమ వస్తుంది కదా? చొక్కాల ఉదాహరణలో, 20 జీతంతో, 40 శ్రమ దొరకలేదూ?''

''20 జీతాన్ని పెట్టుబడిదారుడు ఇచ్చాడా? ఆ డబ్బు, పెట్టుబడిదారుడి ఆదాయం కాదు. తన ఆదాయంలో నించి జీతాల్ని ఇవ్వడం కాదు. ఇంటి వంట మనిషి విషయంలో అయితే, యజమాని, తన ఆదాయంలో నించి తీసి ఇస్తాడు. వంట మనిషి శ్రమ చేసినందుకే ఇస్తాడు, ఊరికే ఇస్తాడని కాదు. అయినా, దాని వల్ల యజమానికి ఆదాయం ఖర్చవుతుంది. 5 ఖర్చవవలసిన చోట, 2 ఖర్చవడం అంటే, 3 ఖర్చు తగ్గినట్టు. ఉత్పాదక శ్రామికుల విషయంలో అయితే, ఆదాయాలు ఖర్చవడం కాదు గదా? మొదటి డబ్బు కూడా వెనక్కి వచ్చి, ఆ పైన ఎక్కువ డబ్బురాదూ? అయినా, రెండు రకాల సందర్భాల్లోనూ, యజమానికి అదనపు శ్రమ అందినట్టే.''

''అయితే, వంట మనిషి చేసిన అదనపు శ్రమకి వెళ్ళవలసిన 3 డబ్బు, యజమాని జేబులో ఉండిపోయింది కదా? అది, ఆమెకి వెళ్ళవలసిందే కదా? అది ఆమె అదనపు శ్రమ వల్ల వచ్చిందే అవదూ? ఆమె అదనపు శ్రమ డబ్బుగా మారినట్టు అవదూ?''

''అలా అవదు. మీరు ప్రశ్నించడం నాకు బాగుంటుంది. ఆలోచించడమే అది. కానీ మీరు తొందర మనిషి. ఆలోచించే ముందు నిదానం ఉండదు. కొంచెం నిదానం ఉంటే, సరైన జవాబులు మీకే తెలుస్తాయి. వంటల కోసం జరిగిన ఏ ఖర్చో అమ్మకానికి వెళ్ళినప్పుడు, వంట మనిషి శ్రమలో నించి అదనపు శ్రమ ముక్క ఒక్కటే అమ్మకానికి వెళ్ళిందా? వంట మనిషికి చెల్లించకపోవడం వల్ల యజమాని జేబులో ఉండిపోయిన ఆ 3ని, వంట మనిషి వల్ల వచ్చిన డబ్బుగా చూస్తే, 'ఉత్పాదక లాభం' వల్ల వచ్చిన డబ్బు తగ్గిపోయి కనపడుతుంది. **ఎలాగంటే:** అసలు జేబులో ఉన్న ఉత్పాదక లాభం ఎంత? 20. అందులో నించి వంట మనిషికి జీతంగా 2 వెళ్ళిన తర్వాత, జేబులో 18 ఉంది. అంత వరకూ ఉత్పాదక లాభానికి లెక్క సరిపోతుంది. అయితే, ఆ 18లో 3ని, వంట మనిషి వల్ల వచ్చిన డబ్బుగా చూస్తే, అప్పుడు ఉత్పాదక లాభం, 15 అయిపోదూ? అసలు, ఉత్పాదక లాభం 20. వంట మనిషి వల్ల వచ్చింది 3 అయితే, ఆ రెండూ కలిసి 23 డబ్బుకి లెక్క కనపడాలి. కానీ

జేబులో ఉన్నది 18. వంట మనిషికి జీతంగా ఇచ్చింది 2. ఆ రెండూ కలిసి, 20కే లెక్క కనపడుతోంది గానీ, 23 కనపడడం లేదు. 20నే తీసుకుని, వంట మనిషి వల్ల వచ్చిన డబ్బు 3 అనీ, ఉత్పాదక లాభం 17 అనీ, అలా అనుకోవాలా? అది తప్పు. అలా అనుకుంటే ఉత్పాదక లాభాన్ని తగ్గించి చూడడం అవుతుంది. కాబట్టి, వంట మనిషికి ఇవ్వకుండా ఉంచిన 3, వంట మనిషి వల్ల వచ్చిన డబ్బు కాదు. ఆమె అదనపు శ్రమ కూడా యజమాని ఇంటి పని కోసమే అయిపోయింది. అది డబ్బుగా మారలేదు. అది, యజమాని డబ్బు ఖర్చుని తగ్గించడానికే ఉపయోగపడింది. యజమానికి 5 డబ్బుని ఖర్చు పెట్టకుండా, 2 ఖర్చుతో 5 శ్రమ దొరికింది కదా?"

"అవును, తెలిసింది. తెలిసినట్టే ఉంది. కాస్సేపటికి మళ్ళీ మర్చిపోతానేమో గానీ, ఇప్పుడైతే తెలిసింది. వంట మనిషి శ్రమ అసలు అమ్మకంలోకే వెళ్ళనప్పుడు, అందులో అదనపు శ్రమ మాత్రం డబ్బుగా ఎలా మారుతుంది? దాన్ని ఒప్పుకోవలి సిందే. అయితే, అనుత్పాదక శ్రామికుల జీతాలు, ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ లోనించే వస్తాయి కాబట్టి, అనుత్పాదక శ్రామికులు కూడా ఉత్పాదక శ్రామికుల అదనపు విలువని తింటారని అర్థం రాదూ?"

"ఇదేం సందేహం? తమాషాకి అడుగుతారే, కొంచెం కూడా ఆలోచించకుండా! ఏ పని వాళ్ళయినా, పనులు చేసినందుకు జీతాలు తీసుకుంటారు. ఆ జీతాల్ని యజమాని, ఎలా తెచ్చి ఇస్తున్నాడో వాళ్ళకి అనవసరం. దొంగతనాలు చేసి తెస్తు న్నాడో, దోపిడీలు చేసి తెస్తున్నాడో, ఎలా తెచ్చి ఇచ్చినా, వాళ్ళ శ్రమల కోసం వాళ్ళు తీసుకుంటారు. అది, వాళ్ళ శ్రమతో వాళ్ళు బతకడమే గానీ, ఇతరుల అదనపు విలువని తినడం కాదు."

"అయినా, తమ జీతాల్ని యజమాని, ఎలా ఇస్తున్నాడో ఇంటి పని వాళ్ళు కొంచెం తెలుసుకోవద్దా?"

"ఇంటి పని వాళ్ళే కాదు, అన్ని రకాల పని వాళ్ళూ, తమకి జీతాలు ఎలా వస్తున్నాయో తెలుసుకోవాలి. అందుకే కదా మనం ఇంత చెప్పుకుంటున్నాం?"

"అయితే, అనుత్పాదక శ్రామికులు కూడా శ్రమ దోపిడీకి గురవుతున్నట్టేగా?"

"అది మళ్ళీ చెప్పుకోవాలా? అదనపు శ్రమని పోగొట్టుకోవడం అంటే ఏమిటి మరి?"

"అయితే, ఒక యజమాని దగ్గిర పని చేసే ఒక గుమాస్తా ఉంటాడు. అతనూ పని వాడే. అతను తన ఇంట్లో, గిన్నెలు తోమే పని మనిషిని పెట్టుకుంటాడు. అప్పుడూ? అతను తన జీతం లోనించి తీసి, పని మనిషికి జీతం ఇస్తాడు. అక్కడ కూడా అదనపు శ్రమ ఉంటుందిగా? ఒక శ్రామికుడు, ఇంకో శ్రామికుణ్ణి దోచు కుంటున్నట్టేనా?"

"యజమానీ శ్రామిక సంబంధం ఉందంటే, జీతాల పద్ధతి ఉందంటే, ఆ అర్థమే రావాలి, వస్తుంది. ఆ గుమాస్తా అయిన శ్రామికుడికి, తన ఇంటికి వచ్చి పని చేసే మనిషి కూడా తన లాగే శ్రామికుడేనని తెలియాలి. ఆ శ్రామికుడి మీద యజమాని

తనం చెయ్యకుండా, తనకు సాధ్యమైనంత ఎక్కువ జీతం ఇచ్చి, ఎక్కువ శలవలు ఇచ్చి, ఆ శ్రామికుడితో సహకారంగా ఉండాలి. ఒక శ్రామికుడు, ఇంకో శ్రామికుడితో ఉండవలసిన తీరులో ఉండాలి. ప్రస్తుతానికి అంతే. శ్రమ దోపిడీ సంబంధాలు లేని మంచి సమాజం అయితే, ఇంటి పనుల్లో పని మనుషులు వచ్చి పని చెయ్యడం ఉండకూడదు. యజమానీ శ్రామిక సంబంధాలు ఎక్కడా ఉండకూడదు కదా?''

''అయితే, ఎవరి ఇంటి పనులు వాళ్ళే చేసుకోవాలా? చేసుకోగలరా?''

''ఎందుకు చేసుకోలేరు? పని మనుషులందరూ బైటి పనులు చేస్తూనే వాళ్ళ ఇంటి పనులన్నీ వాళ్ళే చేసుకోవడం లేదా? ఇంట్లో ఆడా మగా అందరూ తలో పనీ చేసుకుంటే, పని మనుషులు లేకుండానే చేసుకోవచ్చు. చేసుకోవాలి. యజమానీ శ్రామిక సంబంధాలూ లేకుండా ఉండాలంటే, ఇది ఎలా మారాలో మీరు ఆలోచించండి!''

''అమ్మో! ఏది విన్నా తమాషాగా ఉంది!'' ★

## 33. వర్తక శ్రామికుల శ్రమ, డబ్బుగా మారదు!

**74. 'వర్తక కమిషన్' అంటే, అది ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ లోనించి వస్తుందన్నారు. ఇప్పుడు ఇంకో సందేహం పుట్టింది. అమ్మకం పనులు చేసే వర్తక శ్రామికులు ఉంటారుగా? వాళ్ళ పనుల్లో వాళ్ళ అదనపు విలువ ఉండదూ? వర్తక పెట్టుబడిదారుడు, ఉత్పాదకం వాళ్ళ అదనపు విలువని ఎందుకు తీసుకుంటాడు? తన పని వాళ్ళ అదనపు విలువనే తీసుకుంటాడు. అంతే కదా?**

**జ:** చక్కగానే ఆలోచిస్తున్నారు గానీ, మధ్యలో ఏదో అవుతూ ఉంటుంది మీకు.

అప్పుడే ఒక సంగతి మరిచిపోయారు. అమ్మకం అనేది, సహజ అవసరం కాదనీ, ఆ విలువ సరుకుకి చేరదనీ, చెప్పుకున్నామా లేదా?

''అది సహజ అవసరం అయినా, కాకపోయినా, అమ్మకానికి ఖర్చు జరుగుతుందా, లేదా?''

''ఎందుకు జరగదు? బోలెడు ఖర్చు జరుగుతుంది. భూమి అంతా దుకాణాల కోసమే ఖర్చవడం లేదూ? అందుకే కదా దాన్ని దండగ ఖర్చని చెప్పుకుంటున్నాం. ఆ ఖర్చు ఎంత జరిగినా, అది విలువగా సరుకుకి చేరదు. వడ్డీ, సరుకు విలువ అవుతుందా? కౌలు, అవుతుందా? లాభం, అవుతుందా? అలాగే, అమ్మకం ఖర్చు కూడా సరుకుకి విలువ అవదు. అయినా ఆ ఖర్చుని పెట్టాలంటే, డబ్బు కావాలి. దాన్ని సరుకు ద్వారా గాక, అంటే ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ లోనించి గాక, ఇంకెక్కడి నించి తీసిపెట్టగలరు?''

''ఏమో! చాలా గాభరాగా ఉంది.''

''సమాజమే గాభరాగా లేదూ? సరుకుని తయారు చేయించే పెట్టుబడిదారుడికి ఒక సంగతి తెలుసు, ఆ సరుకుని అమ్మించిపెట్టే వర్తక పెట్టుబడిదారుడికి 'వర్తక

కమిషన్' ఇవ్వాలని. అందుకే దాన్ని కూడా సరుకు వాడు ఒక ఖర్చుగానే లెక్క కడతాడు. ఉత్పాదక పెట్టుబడిదారుడు చూపించే ఖర్చుల జాబితాలోకి, ఇప్పుడు 'వర్తక కమిషన్'ని కూడా చేర్చి, ఆ జాబితాలని ఇప్పుడు మళ్ళీ చూస్తాం.

**8 చొక్కాల ధర:**

| | | |
|---|---|---|
| ఉత్పత్తి సాధనాలు | - | 80 |
| శ్రామికుల జీతాలు | - | 20 |
| పని స్థలానికి కౌలు | - | 5 |
| పెట్టుబడికి వడ్డీ | - | 3 |
| వర్తక కమిషన్ | - | 10 |
| పెట్టుబడి | - | 118 |
| ఉత్పాదక లాభంగా వేసుకున్నది | - | 12 |
| సరుకు ధర | - | 130 |

ఈ జాబితా మన ముందు ఉన్నప్పుడు, ఇందులో నించి 'అదనపు విలువ'ని అర్థం చేసుకోవాలంటే, కౌలునీ, వడ్డీనీ, వర్తక కమిషన్‌నీ, ఉత్పాదక లాభాన్నీ - ఈ 4 అంశాల్నీ కలపాలి. మొదటి 2 అంశాల్నీ వదిలేసి, మిగతా వాటిని కలిపితే, అదనపు విలువ 30 అవుతుంది. సరుకు ధర 130 అవుతుంది. తర్వాత చూసే వివరాలు కూడా ఉంటే అదనపు విలువ ఇంకా పెరిగి, సరుకు ధర ఇంకా పెరుగుతుంది. ఇప్పుడు, ఈ జాబితా వరకే చూస్తే, సరుకు పెట్టుబడిదారుడు ఆ సరుకుని వర్తక పెట్టుబడిదారుడికి ఇచ్చేటప్పుడు, 130ని తీసుకోడు. వర్తక కమిషన్‌గా 10ని తగ్గించి, 120కే ఇస్తాడు. కానీ, వర్తక పెట్టుబడిదారుడు ఆ సరుకుని అమ్మించేటప్పుడు, ఆ 120కి, తన 10 కమిషన్‌ని కూడా కలిపి, 130కి అమ్ముతాడు. (అది, సరుకుకి నిజంగా ఉన్న ధరే అవుతుంది. అది, 30 అదనపు విలువతో కలిసి ఉన్న ధర.) అలా వచ్చిన 130లో నించి వర్తకుడు, సరుకు వాడికి 120ని ఇచ్చేసి, ఒక 10ని తన కమిషన్‌గా తీసుకుని, వర్తకం పనులు చేయించి, చివరికి తన 'వర్తక లాభం' తీసుకుంటాడు.

వర్తక కమిషన్‌ని 10 అనుకుంటే, ఆ పనులు, సరుకు తయారీ సమయంలో జరగవు. ఆ సరుకు పెట్టుబడిదారుడు, ఆ అమ్మకం పనులు తన దగ్గిర జరగక పోయినా, ఆ కమిషన్ 10ని కూడా సరుకు ధరలోకి చేర్చి, సరుకు ధరని నిర్ణయిస్తాడు. తన దగ్గిర జరగని పనుల ఖర్చుని తనే ధరలోకి చేర్చడం ఎందుకు? కానీ అలా చేరుస్తాడు. చేర్చినా, ఆ సరుకుని వర్తకుడికి ఇచ్చేటప్పుడు, అమ్మకం పనులు తన దగ్గిర జరగలేదు కాబట్టి, ఆ 10 భాగాన్ని తను తీసుకోడు. ఆ పనులు వర్తకుడి దగ్గిర జరగాలి కాబట్టి, సరుకు ధర లోనించి ఆ 10ని తగ్గించి, దాన్ని వర్తకుడికి 120కే ఇస్తాడు. వర్తకుడు, దాన్ని కమిషన్‌తో కలిసిన ధరకే అమ్ముతాడు. ఇది, పూర్వం నించీ ధరల్ని నిర్ణయించే పద్ధతి. ఈ కమిషన్ వ్యవహారం పూర్వం నించీ ఉంది. అప్పుడు దానికి ఏం పేరు ఉందో గానీ, అమ్మకం పని కోసం సరుకుని కమిషన్‌తో

ఇచ్చే ఈ వ్యవహారం, బానిస యజమానుల కాలం నించీ కూడా ఉంది. అది, ఈ నాటికీ ఉంది. ప్రతీ ఉత్పాదక పెట్టుబడిదారుడూ, ఆఖరికి స్వతంత్ర ఉత్పత్తి దారులు కూడా, రైతులు కూడా, సరుకుని అమ్మిపెట్టే వర్తకులకు, కమిషన్ ఇవ్వ వలసిందే. అంటే, సరుకు ధర లోనించి కొంత భాగాన్ని తగ్గించుకుని ఇవ్వాలి. ఈ కమిషన్ వ్యవహారం ఎందుకంటే, అమ్మకం విలువ, సరుకు ధరలోకి చేరదు కాబట్టి. అదే స్టోరూ, రవాణా వంటి పనులు అయితే, వాటికి ఏ కమిషన్లూ ఇవ్వనక్కర లేదు. వాటి విలువలే సరుకుకి చేరతాయి కాబట్టి, ఆ పనులు జరిగినప్పుడు, సరుకు ధర పెరుగుతుంది. ఒక సరుకు మీద రవాణా పని జరిగితే, ఆ సరుకు ధర పెరగాలి, పెరుగుతుంది. కానీ, అమ్మకం పని కోసం, మొదట నిర్ణయించిన సరుకు ధరలో కొంత భాగాన్ని తగ్గించి, తక్కువ ధరతో దాన్ని వర్తకుడికి ఇవ్వాలి. వర్తకుడు, ఆ తగ్గించిన భాగాన్ని కూడా కలిపే సరుకుని అమ్ముతాడు."

"వర్తక పెట్టుబడిదారుడి దగ్గిర వర్తక కార్మికులు ఉంటారు. వాళ్ళు అమ్మకం పనులు చేస్తారు. వాళ్ళూ అదనపు శ్రమని ఇస్తారు కదా? అది ఏమవుతుంది? అది ఎవరికి వెళ్తుంది?"

"శ్రామికులు చేసే అదనపు శ్రమ, యజమానికి గాక ఇంకెవరికి వెళ్తుంది? అనుత్పాదక శ్రామికుల అదనపు శ్రమ ఏమవుతుందో, ఆ సంగతి ఇంతకు ముందే చెప్పుకున్నాం కదా? ఇంటి వంట మనిషి అదనపు శ్రమ ఎవరికి వెళ్ళింది? యజ మానికే కదా? అలాగే ఇక్కడ కూడా, వర్తక శ్రామికుల అదనపు శ్రమ వర్తక పెట్టుబడి దారుడికే అందుతుంది. కానీ, డబ్బుగా మారి కాదు. ఖర్చుని తగ్గించేదిగా. అంటే, తక్కువ జీతంతో, ఎక్కువ వర్తకం పనులు చేసి అందుతాయి."

"అంటే, ఇంటి వంట మనిషి విషయంలో జరిగినట్టే!"

"అంతే, అనుత్పాదక శ్రమ ఉన్న ప్రతీ చోటా అదే జరుగుతుంది."

"అనుత్పాదక శ్రమ డబ్బుగా మారకపోయినా, అదనపు శ్రమని అయితే ఇస్తుంది. అంటే, వర్తక పెట్టుబడిదారుడు, ఉత్పాదక శ్రామికుల అదనపు శ్రమనీ, అనుత్పాదక శ్రామికుల అదనపు శ్రమనీ, రెండూ తీసుకుంటాడు! అంతేనా?"

"అంతే. బాగా అర్థమైంది మీకు. కానీ అది వర్తక పెట్టుబడిదారుడు చేసేదే కాదు. ఉత్పాదక పెట్టుబడిదారుల దగ్గిర కూడా అనుత్పాదక శ్రామికులు ఉంటారు. పెట్టుబడిదారులందరూ చేసేది ఇదే. ఈ కమిషన్ వ్యవహారం మార్క్సు కనిపెట్టింది కాదు, చెప్పింది కాదు. ఇదంతా పూర్వం నించీ సాగుతున్నదే. ఈ విషయంలో మార్క్సు చెప్పింది ఏమిటంటే, ఈ అమ్మకం వ్యవహారం, దండగ ఖర్చు - అని! అమ్మకం పనుల్ని వదిలెయ్యడం సాధ్యమే - అని! ఈ అమ్మకం పనులే లేకపోతే, 'వర్తక కమిషన్' ఖర్చే లేకుండా ఉత్పత్తిని వాడుకోవచ్చు - అని! ఇప్పుడు వర్తక శ్రామి కులుగా ఉన్న వాళ్ళందరూ అప్పుడు వేరే రకం పనుల్లోకి మారతారు. వ్యవసాయమో, బట్టలో, చెప్పులో, మందులో, వాటి తయారీ పనుల్లోకి."

"అవే అవసరం పనులు. నిజంగా. అమ్మకాల్ని వదిలేస్తేనే మంచిది?" ★

# 34. స్వతంత్ర వర్తకులు, శ్రమ జీవులే!

**75.** **'వర్తక కమిషన్'ని, సరుకుని తయారు చేసిన ఉత్పాదక శ్రామికుల అదనపు విలువలో భాగం అనుకున్నాం కదా? సరుకు తయారైన తర్వాత, దాని మీద, స్టోరూ - ప్యాకింగ్ - రవాణా - పనులన్నీ కూడా జరుగుతాయి. ఆ శ్రమలు కూడా ఉత్పాదక శ్రమలే. ఆ శ్రామికుల అదనపు విలువలు కూడా, ఆ సరుకు విలువలో ఉంటాయి. వర్తక కమిషన్‌గా వెళ్ళేది, ఆ విలువలో నించే కదా? అయితే, ఆ కమిషను, ఏ ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ అవుతుంది? సరుకుని తయారు చేసిన వాళ్ళదేనా; లేకపోతే, స్టోరూ, రవాణా వాళ్ళది కూడానా?**

**జ:** ఒక్కో సారి ఎంత బాగా ఆలోచిస్తారు మీరు! ఆశ్చర్యంగా ఉంటుంది. బాగా అర్థం చేసుకుంటున్నారు! సరుకు తయారైందంటే, దాని మీద స్టోరు పనులు వెంటనే అక్కడే మొదలవుతాయి. తర్వాత, ప్యాకింగ్ పనులు అక్కడే జరుగుతాయి. వర్తకుడు దాన్ని అక్కణ్ణించి రవాణాలో తీసుకు వెళ్తే, ఆ పని కూడా అమ్మకానికి ముందే జరుగుతుంది. ఏ ఉత్పాదక శ్రమ ఎక్కడ జరిగినా, అన్నీ అమ్మకానికి ముందే. ఒక సరుకు అమ్మకానికి వెళ్ళేటప్పటికి దాని మీద ఉత్పాదక శ్రమలన్నీ జరిగిపోయే ఉంటాయి. ఆ సరుకు విలువ, ఆ ఉద్పాదక శ్రమలన్నిటికీ కలిసినదే. ఆ ధర లోనించే కొంత శాతం వర్తక కమిషన్‌గా ఉండడం అంటే, ఆ శ్రమలన్నిటికీ సంబంధించిన అదనపు విలువల్లో భాగమే అవుతుంది అది. సరుకుని తయారు చేసిన వాళ్ళది మాత్రమే అవదు. లేదా, సరుకు మీద ఇంకా స్టోరూ, రవాణా పనులేవీ జరగక ముందే, దాన్ని వర్తక పెట్టుబడిదారుడు తీసుకున్నాడా? రవాణా శ్రమ, ఆ తర్వాతే జరిగినా, అది కూడా అమ్మకానికి ముందే. మొత్తానికి అర్థం చేసుకోవలిసింది ఏమిటంటే, 'వర్తక కమిషన్' అనేది, ఉత్పాదక శ్రామికుల అదనపు విలువలో భాగమే - అని! సాధారణంగా జరిగేది, సరుకుని తయారు చేయించిన వాడే, స్టోరూ రవాణా ఖర్చులన్నీ పెట్టుకుంటాడు. ఆ అదనపు విలువలన్నీ కూడా వాడే సంపాదిస్తాడు. అన్ని అదనపు విలువలూ కలిసిన మొత్తం లోనించే వర్తక కమిషన్ వెళ్తుంది. సరుకు అమ్మకం ఏ దశలో జరిగిందో దాన్ని బట్టే, దాని ధరా, దాని కమిషనూ, అన్నీ ఉంటాయి. సరుకు, వాడకందారుకి అందినప్పుడు ఉండే ధరే, దాని అసలు ధర.

**76.** **మా హోటల్లో అయితే, సరుకు తయారీలూ, అమ్మకాలూ, కలిసిపోయే జరుగుతాయి. అంటే, అక్కడ ఉత్పాదక శ్రమలూ - అనుత్పాదక శ్రమలూ కలిసి జరుగుతున్నట్టే కదా? చొక్కాల ఉదాహరణ అయితే, తయారీ ఒక చోటా, అమ్మకం ఇంకో చోటా ఉంటాయి. రవాణా అయితే, మా పద్ధతి లాగే ఉంది. బండిని నడిపే డ్రైవరు పని, ఉత్పాదక శ్రమా; టిక్కెట్లు అమ్మే క్లర్కు పని అనుత్పాదక శ్రమా - అవుతాయనుకుంటా. ప్రయాణీకులు ఇచ్చే ఛార్జీల్లో ఉత్పాదక - అనుత్పాదక భాగాలు కలిసిపోయి ఉంటాయి కదా?**

**జ:** అయ్యో, కొంచెం దారి తప్పారే! ప్రయాణీకులు ఇచ్చే ఛార్జీలు, 'ప్రయాణ సదుపాయం' విలువకే. ఆ విలువ, ఉత్పాదక శ్రమల ద్వారా చేరేది మాత్రమే. అనుత్పాదక శ్రమల విలువ, సరుకుకి చేరదు కదా? ప్రయాణీకులు చెల్లించే చార్జీల్లో, అనుత్పాదక విలువ భాగం ఎందుకు ఉంటుంది?

"అవును, నిజమే. ఇన్ని విషయాల్లో ఒకటి గుర్తుంటే, ఒకటి పోతోంది."

"ఇన్ని విషయాలేం ఉన్నాయి ఇక్కడ? అంతా 'విలువ' సంగతే. సరుకు విలువ, ఉత్పాదక శ్రమల వల్లే చేరుతుంది. అందులో, చాలా భాగం, అదనపు విలువ అవుతుంది. అంతే మొత్తం అంతా."

"నిజమే గానీ, ఒక అనుమానం తీరితే, ఇంకోటి పట్టుకుంటుంది. సరుకు తయారీలూ అమ్మకాలూ, ఒకే చోట జరిగిపోయే దగ్గిర, మా హోటల్లాంటి చోట్ల, వర్తక కమిషన్‌ని ఎవరికి ఇస్తారు? అసలు ఆ కమిషన్‌గా పోయేది ఏమంటుంది?"

"బాగా నేర్చుకోవాలని ఆసక్తిగా ఉంది మీకు. మీరు మీ హోటల్లో యజమాని మీద తిరుగుబాటు తెచ్చేసేలా ఉన్నారు! అది సరేగానీ, సరుకు తయారీ దగ్గిరే అమ్మకం కూడా జరిగిపోతే, ఆ 2 రకాల ఖర్చులూ ఆ పెట్టుబడిదారుడే పెడతాడు. అమ్మకం ఖర్చులు అక్కడే జరుగుతాయి. ఉత్పాదక లాభంతో పాటు, వర్తక లాభం కూడా ఆ పెట్టుబడిదారుడికే అందుతుంది. అక్కడి అనుత్పాదక ఖర్చులూ, వర్తక లాభమూ - ఆ రెండూ, అక్కడి ఉత్పాదక శ్రామికుల అదనపు విలువలోదే అవుతుంది కదా? అన్ని లాభాలూ, ఒక్కడికే, మీ యజమానికే, అందుతాయి."

"బాగుంది, నిజమే. అలా గాకపోతే ఇంకెక్కడికి వెళ్తాయి ఆ లాభాలు? బాగుంది గానీ, మా హోటల్లో, సరుకు తయారీ సెక్షన్ వాళ్ళు వేరూ, అమ్మకం వాళ్ళు వేరూ. అమ్మకం వాళ్ళు, తినే పదార్థాల్ని వడ్డనలు చేస్తారే! వడ్డనలు చెయ్యడం అవసరమైన శ్రమేగా? అది అనుత్పాదక శ్రమ ఎలా అవుతుంది?"

"అయితే, అక్కడ ఏది అనుత్పాదకం అవుతుందో దాన్ని కనిపెట్టాలి. మీ మీద పెత్తనాలు చేసే హెడ్డులు ఉండరూ? అమ్మకం బిల్లులు రాసే క్లర్కులు ఉండరూ? వాచ్‌మేన్లు ఉండరూ? అవన్నీ అనుత్పాదక శ్రమలే కదా? బిల్లులు రాయడంలో, ఉత్పాదక విషయాల బిల్లులూ ఉంటాయి, అనుత్పాదక విషయాల బిల్లులూ ఉంటాయి."

"అయితే, మా దగ్గిర ఉన్న ఉత్పాదకం వాళ్ళ అదనపు విలువలే, మా దగ్గిరే ఉన్న అనుత్పాదకం పనుల ఖర్చులుగా పోతాయా?"

"అవును, అంతే. మీ యజమాని ఏ ఖర్చునీ, తన జేబు లోనించి పెట్టడు. ఉత్పాదక శ్రామికుల నించి లాగిన అదనపు విలువల రాసిలో నించే, ఏ తప్పుడు ఖర్చులైనా పెట్టుకోవాలి. అనుత్పాదక శ్రమల కోసం కొంత ఖర్చు పెట్టడం అంటే, నిజానికి అక్కడ కొన్ని అమ్మకం శ్రమలైనా జరుగుతాయి. కానీ, కౌలూ - వడ్డీ - లాభాల కోసం లాగడం అయితే, అక్కడ ఏం పనులు ఉంటాయి? కొంత డబ్బుని వాటికి ఎందుకు ఇవ్వాలి?"

"అవును, వాచ్‌మేన్లని అనుత్పాదకం వాళ్ళు అన్నారు. అది నిజమే గానీ, వాళ్ళు చాలా కాపలా పనులు చేస్తారు. ఆ పనులు సరుకు తయారీ కోసం కాదు లెండి. ఒక వాచ్‌మేన్ అయితే, రాత్రిళ్ళు నిద్రేపోడు. నాకు చాలా జాలేస్తుంది. ఇంకోడైతే యజమాని కుక్కల్ని కూడా కడుగుతాడు. కుక్కల్ని కడగడం సరుకు తయారీకి కాదులెండి."

"మీకు చాలా బాగా అర్థమై పోతోంది! ఆశ్చర్యంగా ఉంది! శ్రామికులకు అన్యాయాలు జరుగుతున్నాయంటే, జాలి కలగడం కాదు. యజమానుల అధికారాల మీద ఆగ్రహం కలగాలి. శ్రామికులు రాత్రులు నిద్రలు పోకుండా కాపలాలు కాయడం అంటే, యజమానుల ఆస్తుల రక్షణకేగా? ఇప్పుడైతే, శ్రామికులు, విదేశాల పెట్టుబడిదారుల కోసం, రాత్రుళ్ళే పని చేస్తున్నారు. మనకి రాత్రి అయితే, వాళ్ళకి పగలు కాబట్టి, మన పెట్టుబడిదార్లకి విదేశాల వాళ్ళే బేరాలు ఇచ్చారు కాబట్టి, మన శ్రామికులు రాత్రుళ్ళంతా పనులు చెయ్యాలి! ఇందులో నేరం ఏమిటో పెట్టుబడిదారులకు కనపడడం లేదు. వాళ్ళ లాభం, వాళ్ళకి ముఖ్యం."

"అవును, అలాంటివీ చూస్తున్నాము. మాకు తెలిసిన వాళ్ళ కుర్రాడు రాత్రుళ్ళే చేస్తాడు. ఆ షిఫ్టులైనా మారవు."

"అసలు రాత్రి షిఫ్టులు చాలా తప్పు, తెలుసా? 'కాపిటల్'లో నైట్ షిఫ్టుల్ని మార్క్సు బాగా వ్యతిరేకిస్తాడు. దానికి కారణాలన్నీ చెపుతాడు."

"అవును. ఆయన చెప్పకపోయినా మనకి అది తెలియాలి. ఆ పనులన్నీ పగలే చేసుకోవచ్చు కదా? మనుషులు రాత్రులు సుఖంగా నిద్రపోవద్దా? .. ఆఁ, ఏదో అడగాలనుకున్నాను..... మరి, సరుకుల్ని వీధుల్లో కావిళ్ళేసుకునీ, బళ్ళు తోలుకునీ, అమ్ముతారే! వాళ్ళూ అనుత్పాదకు లేనా? అదీ, గుర్తొచ్చింది."

"తప్పకుండా. వాళ్ళు, ఒక పెద్ద వర్తకుడి నించి కొంత సరుకుని ఏదో చిన్న కమిషన్‌తో తీసుకుంటారు. అమ్మకం పని అంతా వీధుల్లో సరుకుల్ని మోసుకుంటూ, అరుచుకుంటూ, చేస్తారు. వాళ్ళకి దొరికిన కమిషన్ లోనించి అమ్మకం ఖర్చులు పోగా, చివరికి చిన్న వర్తక లాభం మిగులుతుంది. అయితే, వర్తక పెట్టుబడిదారుడికి వచ్చే లాభం అయితే, అతను స్వయంగా అమ్మకం పనీ చెయ్యకుండానే వస్తుంది. అది చాలా పెద్ద లాభంగా ఉంటుంది. కానీ వీధుల్లో తిరిగీ, చిన్న దుకాణాలు పెట్టుకునీ, స్వయంగా అమ్మకం పనులు చేసుకునే వాళ్ళకి వచ్చే లాభం, శ్రమ చేసి తెచ్చుకున్నదే అవుతుంది. అంటే, వాళ్ళ శ్రమే డబ్బుగా మారిందని కాదు. ఆ లాభం, వాళ్ళ కష్టంతో సంపాదించేదే అవుతుంది గానీ, దోపిడీ ద్వారా సంపాదించింది అవదు."

"అవును, నిజమే. ఎలాగంటే, గుర్తొచ్చింది. ఇంటి వంట మనిషి జీతం కూడా, ఆమె శ్రమే డబ్బుగా మారడం వల్ల వచ్చేది కాకపోయినా అది, ఆమె శ్రమ చేసి తీసుకునేది. అది దోపిడీ అవదు. అలాగే, అమ్మకం పనులు స్వయంగా చేసే వాళ్ళకి వచ్చే చిన్న ఆదాయం, వాళ్ళ శ్రమకి బదులుగా వచ్చేదే. ఇప్పుడు బాగా తెలిసింది.

అయితే, వీధుల్లో అమ్ముకునే వాళ్ళు వర్తక శ్రామికులు అవరు కదా, మరి ఏం అవుతారు?"

"యజమానులు లేని వర్తకులు అవుతారు. అంటే, స్వతంత్ర వర్తకులు. పెట్టుబడిదారులు కాని, యజమానులు కాని వర్తకులు."

"చాలా బాగుంది, అవును స్వతంత్ర ఉత్పత్తిదారుల్లాగ, వీళ్ళు స్వతంత్ర వర్తకులు. ఇప్పుడే ఇన్ని తెలిసిపోతున్నాయి. ఇంకా కాపిటల్ చదవమంటారెందుకు?"

"చదివి చూడండి, ఇంకా ఎన్ని తెలుస్తాయో గుర్తొచ్చింది.పార్ట్ టైమ్ ఉద్యోగాల తప్పు ఏమిటో చాలా తార్కికంగా చెపుతాడు. ఇంకా ఎన్నో తెలుస్తాయి."

"తప్పకుండా, తప్పకుండా." ★

# 35. ఇంటి పని పేరు, ఇంటి పనే!

**77. అమ్మకంలోకి వెళ్ళే శ్రమ ఉత్పాదక శ్రమ. అమ్మకంలోకి వెళ్ళకపోతే అనుత్పాదక శ్రమ. తెలిసిపోయింది. చాలా మంది ఆడవాళ్ళు ఇళ్ళల్లో పనులే చేసుకుంటారు. అవన్నీ అనుత్పాదక శ్రమలే కదా?**

**జ:** 'తెలిసిపోయింది' అన్నారు. ఏం తెలిసిపోయింది? మీ కన్నా చిన్న పిల్లలే నయమనిపిస్తారు ఒక్కోసారి. ఉత్పాదక శ్రమో, అనుత్పాదక శ్రమో అవ్వాలంటే, యజమానితో సంబంధం ఉండాలని చెప్పుకున్నామా, లేదా? 'కాపిటల్'లో అయితే, ఎన్నో వివరాలతో తెలుస్తాయి. అవన్నీ ఇక్కడ మళ్ళీ చెప్పుకోవడం ఎందుకు? ఆ పుస్తకమే ఎందుకు చదవరు మీరు?

"చదువుతాం గానీ, ముందు ఇలా చెపితేనే బాగుంది మాకు."

"ఇంత కన్నా బాగుంటుంది అది ఒక వరసలో. ఇంటి పనులన్నీ కూడా 'పనులే' గానీ, వాటిని 'శ్రమలు' అనక్కరలేదు. యజమానులతో సంబంధంలో అయితే తప్పకుండా ప్రతి పనినీ 'శ్రమ' అనాలి. అలాంటి సంబంధం లేనప్పుడు, అర్థాలు మారతాయి. కొన్ని చోట్ల పాత పేర్లు కూడా మారతాయి. ఆడవాళ్ళయినా, మగవాళ్ళయినా, యజమానులతో సంబంధాల్లో ఉంటేనే, శ్రామికులు. అందులోనే ఉత్పాదకులో, అనుత్పాదకులో, ఏదో ఒక రకం అవుతారు. స్వంత మనుషులే ఇంటి పనులు చేసుకుంటే, అవి ఇంటి పనులే. వాళ్ళు ఇంటి మనుషులే."

"ఇంటి పని మనుషులా?"

"కాదు. వాళ్ళ పనులు వాళ్ళ కోసమే. ఇంటి పని మనుషులైతే, బైటి నించి వచ్చి పని చేసి జీతాలు తీసుకుని వెళ్తారు."

"అయితే, ఇంటి వాళ్ళు స్వతంత్ర ఉత్పత్తిదారులు అవరూ?"

"ఏమిటి, ఇంత వెనక్కి పోతున్నారు! ఇప్పటి దాకా విన్నదంతా పోయినట్టేనా? స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా సరుకుల్ని ఉత్పత్తి చేసి అమ్ముకుంటారు కదా? ఆ సరుకులు, డబ్బుగా మారతాయి. ఇంటి మనుషులు, ఇంటి కోసం చేసుకున్న పనుల్ని అమ్ముకుంటారా? వాళ్ళు స్వతంత్ర ఉత్పత్తిదారులు ఎలా అవుతారు?"

“అవునవును, గుర్తొచ్చింది. మరి ఇంటి మనుషులు ఏ కోవలోకి వస్తారు?”

“ఇంటి మనుషుల కోవలోకే.”

“మరి వాళ్ళకి డబ్బెలా వస్తుంది?”

“డబ్బు మీకు ఎలా వస్తోంది? మీ ఆవిడికి ఎలా వస్తోంది? బైటి పని చేస్తేనే కదా వస్తోంది? ఎవరికైనా అలాగే వస్తుంది. లేదా, అమ్మకానికి సరుకుల్ని తయారు చేసి అమ్ముకుంటే వస్తుంది.”

“మా ఆవిడ ఇంటా బైటా చేస్తోంది, నిజమే గానీ, అది వాళ్ళకి చాలా శ్రమ అవుతుంది.”

“అందుకే, మగవాళ్ళు కూడా ఇంటి పనులు చేస్తే, ఆడవాళ్ళు బైటి పనులు చెయ్యడానికి వీలవుతుంది.”

“అమ్మో! మా ప్రాణాల మీదకి తెచ్చారా?”

“ఇంటి పని కొంత చేస్తే ప్రాణాల మీదకి వస్తుందా మీకు? అలాగైతే, మీ యజమానిని మీతో పాటు వంట పని చెయ్యమంటే ఎందుకు చేస్తాడు?”

“మా వాడికీ, మాకూ లింకు పెడుతున్నారా? మేము ఎక్కడో అక్కడ రోజంతా పనులు చేస్తున్నాం. మా వాడు, చీమ తలకాయంత పని చెయ్యడు.”

“అందుకే, మీ యజమానీ మారాలి, మీరూ మారాలి. అతనే మారాలి గానీ, మీరు మారక్కర లేదా?”

“ఏం మారమంటారు మమ్మల్ని? ఓహో, అదా? ఇంటి పని చెయ్యాలా? మా యజమాని మారితే మేమూ మారతాం. మీ యజమాని ఏదైనా పని చేస్తాడా?”

“ఒక మాట అననా? మీరు అన్నది బుద్ధిలేని మాట! యజమానిని అనుసరిస్తారా మీరు? దోపిడీని మరిగి బతికేవాడి దగ్గిర ఇష్టంతో మారే బుద్ధి ఉంటుందా? అలాంటి వాడు భూమిని వదిలెయ్యమంటే వదిలేస్తాడా? పెట్టుబడిని వదిలెయ్యమంటే వదిలేస్తాడా? అవన్నీ వాళ్ళ నించీ లాగెయ్యాలి. అలాంటి బలవంతమే మీ మీద కూడా జరగాలా? నిజానికి ఇప్పటి వరకూ సాగుతోన్న సంసారాల్లో, ‘భర్త’ అనేవాడు యజమాని లాంటి వాడే, సందేహం లేదు. కానీ, భార్యకి భర్తతో సంబంధం, జీతం తీసుకుని, అదనపు శ్రమని పోగొట్టుకోవడం లాంటిది కాదు. సమాజంలో దోపిడీ సంబంధాలూ, ఆస్తులూ, ఆస్తుల మీద వారసత్వాలూ, అవన్నీ ప్రారంభం అవడం వల్లే, ఆడవాళ్ళ మీద మగ వాళ్ళ పెత్తనం పుట్టుకొచ్చింది. యజమానుల కుటుంబాల్లో భార్యాభర్తల మధ్య ఎలాంటి సంబంధాలు నడిచాయో, శ్రామిక కుటుంబాల్లోనూ అవే నడిచాయి, నడుస్తున్నాయి. ఆ సంబంధంలో కావలసినన్ని విరోధాలున్నాయి. అయినా అది, శ్రమ దోపిడీ జరిగేలాంటి సంబంధం కాదు. కాబట్టి, ఇళ్ళల్లో పని చేసుకునే ఆడవాళ్ళు, అనుత్పాదక శ్రామికులు అవరు. వాళ్ళు ఏ సరుకులూ అమ్మరు కాబట్టి, స్వతంత్ర ఉత్పత్తిదారులూ అవరు.”

“మరి ఎలా అవుతారు? ఆ పనులికి ఏదన్నా పేరు ఉండొద్దూ?”

“ఇంటి పనుల పేరు, ఇంటి పనులే. కుటుంబంలో పనులే.”

“అందరికీ డబ్బు వచ్చే దారి ఉంటే బాగుంటుంది. మా ఆవిడ ప్రతి నెలా జీతం

తెచ్చుకుంటుంది. మాకు కొంత నయంగా ఉంటుంది."

"మీ ఇద్దరి జీతాలూ ఎలా వాడుకుంటారు? ఎవరిది వాళ్ళు దాచుకుంటారా?"

"అయ్యో, దాచుకుంటే కొంప ఎలా నడుస్తుంది? ఒక పూట తిళ్ళు అయితే బైట జరిగిపోతాయి గానీ, ఇంకా బోలెడు ఖర్చులు లేవూ? మా పిల్లాడి చదువులేదూ? ఆమె డబ్బూ, నా డబ్బూ, ఒక చెక్క పెట్లో పడేస్తాం. అందులో నించే తీసి వాడతాం. నెల నెలా కొంత తీసి పోస్టాఫీసులో పెడుతుంది ఆవిడ. అదంతా నేను పట్టించుకోను. జీతం తీసుకెళ్ళి ఆ పెట్లో పడేస్తాను, అంతే. కావాలంటే తీసుకుంటాను."

"మీ పద్ధతి చాలా బాగుంది. ఒకళ్ళ మీద ఒకళ్ళకి అంత నమ్మకం ఉండాలి. ముఖ్యంగా డబ్బు దగ్గిర నమ్మకం ఉండాలి. అంతా బాగుంది గానీ, మీ ఆవిడ, మీ ఇంటి పనీ, బైటి పనీ కూడా చేస్తోంది. మీరైతే బైటి పనే చేస్తున్నారు. ఆ తేడా గ్రహించారా మీరు?"

"ఆఁ తెలుసు. ఆవిడ అంటూనే ఉంటుంది. ఆవిడ పని కన్నా, నా పని చాలా ఎక్కువండీ. ఇంటికి రాగానే మంచం మీద పడిపోతాను."

"శలవు రోజుల్లో ఇంట్లో ఉంటారు కదా? అలాంటప్పుడైనా, ఇల్లు శుభ్రం చేసుకునే పనులవీ చూసుకోవాలి. అసలు, మీ యజమానిని పనిలోకి దింపితే అక్కడ మీ పని తగ్గుతుంది."

"అమ్మో, అది మా వల్ల అవుతుందా? మమ్మల్ని జైల్లోకి తోయిస్తాడు."

"చూశారా, జైళ్ళూ, పోలీసులూ ఎందుకు ఉన్నాయో! నిత్యం మన చుట్టూ ఉన్నది యజమానులు చేసే పరిపాలనే."

"మన పరిపాలన మనం చేసుకోగలమా?"

"ఎంత బాగా అడిగారు! ఎందుకు చేసుకోలేం? చక్కగా చేసుకోగలం. కానీ, మొదట ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. సూది అంటే ఏమిటో, దారం అంటే ఏమిటో తెలీకుండా, కుట్టు పని చెయ్యగలమా? ఈ సమాజం ఎందుకు బాగా లేదో, ఇందులో తప్పులేమిటో ముందు తెలిస్తేనే కదా ఆ తప్పులు లేకుండా చేసుకో గలిగేది?"

"అది ఎంతసేపు లెండి. మా వాణ్ణీ, మా హెడ్‌నీ, వంటింట్లోకి తీసుకు రావాలి, అంతే కదా?"

"అంతే కాదు, మీరు కూడా మీ ఇంటికి వెళ్ళినప్పుడు వంటింట్లోకి వెళ్ళాలి. లేదా, గిన్నెలు తోముకోవాలి."

"మళ్ళీ మా మీదకే తెచ్చారా?"

"ఏం, మీరు కూడా ఎలా మారాలో మీరు గ్రహించుకోలేరా? ఏదో ఒక శ్రమ చేస్తూ జీతం తెచ్చుకుంటూ ఉంటే, ఉత్తములు అయిపోయినట్టే అనుకుంటున్నారా? మనుషులుగా నేర్చుకోవలిసిన విషయాలు బోలెడు ఉన్నాయి. కార్మిక వర్గాన్ని మార్క్సు ఏమన్నాడో తెలుసా? **'యుగ యుగాల మకిలితో ఉన్న కార్మికవర్గం'** అన్నాడు. అంటే, కార్మికుల భావాల్లో కూడా యుగ యుగాల నించీ పేరుకుంటూ ఉన్న తప్పులెన్నో ఉన్నాయి. అసలు 'మంచి' అనే దాన్ని, ఏ దోపిడీ సమాజంలో అయినా

ఎవరు నేర్పారు? అవన్నీ ఇప్పటి నించే నేర్చుకోవాలి. శ్రమలు చెయ్యడం ఒక్కటే కాదు, శ్రామిక ప్రజల భావాలన్నీ సమానత్వం వేపు మారాలి. స్త్రీ పురుషుల పరిస్తితులు సమానంగా ఉండాలా లేదా? అది జరగాలంటే, ఆడవాళ్ళు ఆత్మగౌరవం నేర్చుకోవాలి. మగవాళ్ళు అహంకారం వదులుకోవాలి. ఈ మార్పులు అయిష్టంగా కాదు, బలవంతంగా కాదు. ఆడవాళ్ళూ, మగవాళ్ళూ అందరూ, తమలో తప్పు భావాల్ని వదిలించుకోవాలి. మీరు ఎలా మారాలో మీరు గ్రహించుకోలేరా? ఆడ వాళ్ళంటే ఎవరు? మీ తల్లి! మీ తోబుట్టువులు! మీ భార్య! మీ కూతురు! వాళ్ళ మీదా మీ ఆధిపత్యం? వాళ్ళు సంతోషంగా బతకడానికి మీరు ఎలా మారాలో అలా మారలేరా? మీ మీద యజమాని పెత్తనం చేస్తే, మీరెంత బాధపడతారు! మీరు పెత్తనం చేస్తే, మీ ఆడవాళ్ళు బాధపడరా? వాళ్ళ నవ్వులు కావాలా, వాళ్ళ దుఃఖం కావాలా మీకు?"

"వొద్దు, వొద్దు, చెప్పకండి! నేను మారిపోయాను. తెలిసీ, తెలీకా ఇంత కాలం ఎలా ఉన్నానో! ఇక అలా ఉండను. ఆమె కష్టం ఏమిటో, సుఖం ఏమిటో పట్టించుకుంటాను. ఆమె సమస్యల్ని పంచుకుంటాను."

"తొందరపడి వాగ్దానాలు చెయ్యకండి! వివేకంగా ఆలోచించండి! మీరందరూ మళ్ళీ మళ్ళీ మాట్లాడుకోండి! చర్చించుకోండి!"

"తప్పకుండా! రోజూ మేం చేస్తున్నదంతా అదే!"

"మనం, పెట్టుబడిదారుల్లో రకాల్ని చూస్తూ, ఇప్పటికి ఉత్పాదక పెట్టుబడి దారుల్నీ, వర్తక పెట్టుబడిదారుల్నీ, చూశాం. ఇప్పుడు ఇంకో రకం వాళ్ళని చూడాలి."

"ఇంకా ఉన్నారా!"

"లేరూ మరి? వడ్డీలు లాగే వాళ్ళు లేరూ? ఉత్పాదకం - అనుత్పాదకం పెట్టు బడిదారులైతే, లాభాల పేర్లతో అదనపు విలువని లాగుతారు. వీళ్ళు, వడ్డీల పేర్లతో లాగుతారు."

"వాళ్ళని చూడ్డానికేముంటుంది? వాళ్ళకి, పని వాళ్ళతో చేయించే పని కూడా ఉండదు కదా?"

"అయ్యో, ఎందుకుండదు? వడ్డీల వాళ్ళ దగ్గిరా శ్రామికులు ఉంటారు." ★

## 36. వడ్డీలన్నీ అదనపు విలువలో భాగమే!

**78.** **మాకు ఇప్పుడు 4 వేల అప్పు ఉంది. వడ్డీలు కడుతూనే ఉన్నాం. వడ్డీ కట్టకపోతే అప్పు ఎందుకు ఇస్తాడు గానీ, వడ్డీని తగ్గించమన్నా తగ్గించడే! ఒక్క నెల వడ్డీ కట్టకపోతే, చక్రవడ్డీ అని వడ్డీ మీద కూడా వడ్డీ ఇమ్మంటాడు.**

**జ:** మీరు ఇచ్చే వడ్డీలు, మీ జీతాల్లో నించి ఇస్తారు. దాని వల్ల మీ పోషణ పదార్థాలు తగ్గిపోతాయి. ఇప్పుడు మనం చూడవలసింది, శ్రామికుల అప్పుల సంగతి కాదు; 'అదనపు విలువ'లో నించి పోయే వడ్డీల వాటాల గురించి.

**వడ్డీ పెట్టుబడిదారులు:**

డబ్బు అప్పులు ఇచ్చే వాళ్ళు వీళ్ళు. ఉత్పాదక పెట్టుబడిదారులకూ, వర్తక పెట్టుబడిదారులకూ కూడా డబ్బు అప్పులతో అవసరాలు ఉంటాయి. అందరికీ కాదు, కొందరికి. కావలసిన వాళ్ళకి అప్పులు ఇవ్వడం, తిరిగి వాటిని వసూలు చెయ్యడం, అదంతా వడ్డీల వ్యాపారం. ఈ పనులన్నీ చేసేది మేధాశ్రమల్లో మధ్యస్థాయి శ్రామికులు. అప్పుల మీద వడ్డీలు వస్తాయి కదా? అదంతా వడ్డీల పెట్టుబడిదారుడికి ఆదాయం అయిపోదు. మొదట వ్యాపారం ఖర్చులు పోగా మిగిలేదే వాడి ఆదాయం అవుతుంది. ఖర్చులు అంటే, ఆ వ్యాపారం జరగడానికి ఒక ఆఫీసు లాంటిది ఉండాలి. అక్కడ బెంచీలూ కుర్చీలూ రాతలూ కోతలూ చాలా ఉంటాయి. ఆ పనులన్నీ చేసే శ్రామికులకు జీతాలు వెళ్ళాలి కదా? వీళ్ళు అనుత్పాదక శ్రామికులే. వీళ్ళ శ్రమలు డబ్బుగా మారవు. వీళ్ళ అదనపు శ్రమ, యజమానికి ఖర్చు తగ్గిస్తుంది. ఈ ఖర్చులన్నీ, ఎక్కడి నించి జరుగుతాయి? అప్పులు తీసుకున్న వాళ్ళు ఇచ్చే వడ్డీల లోనించి. ఆ వడ్డీలు, ఎక్కడి నించి వస్తాయి? అప్పులు తీసుకున్న పెట్టుబడిదారులు వాటిని ఎక్కణ్ణించి ఇస్తారు? ఆ అప్పు తీసుకున్న వాడు, ఉత్పాదక పెట్టుబడిదారుడు అయితే, తన సరుకు వల్ల వచ్చే అదనపు విలువ లోనించి వడ్డీలు చెల్లిస్తాడు. లేదా, ఆ అప్పు తీసుకున్నవాడు, వర్తక పెట్టుబడిదారుడు అయితే, వాడు తనకు వచ్చే 'వర్తక కమిషన్' లోనించి వడ్డీలు చెల్లిస్తాడు. అంటే, ఏ పెట్టుబడిదారుడు చెల్లించే వడ్డీ అయినా, ఉత్పాదక శ్రామికుల అదనపు విలువల్లో నించే!

వడ్డీల వ్యాపారంలో పనులు చేసే శ్రామికుల శ్రమల విలువలు, ఏ సరుకుకీ చేరవు. 'సరుకు'కి అంటే, ఏ సరుకుకి? అప్పుగా వెళ్ళే డబ్బు, ఏ సరుకు కోసం, లేదా ఏ పని కోసం ఖర్చవుతుందో, వాటికి, ఈ వడ్డీ వ్యాపారం శ్రమలు, చేరవు. ఈ శ్రామికులు అనుత్పాదక శ్రామికులు.

ఏ పెట్టుబడిదారుడికైనా అప్పులు తీసుకోవలిసిన అవసరం లేకపోతే, అదనపు విలువ లోనించి గానీ, వర్తక కమిషన్ లోనించి గానీ, వడ్డీలుగా బైటికి పోయే భాగం ఏదీ ఉండదు కాబట్టి, అది వాళ్ళకే మిగులుతుంది. అది బైటికి పోతే, దాన్ని వడ్డీ పెట్టుబడిదారుడు తింటాడు; బైటికి పోకపోతే ఈ పెట్టుబడిదారుడు తింటాడు. ఆ విలువ, నిజానికి ఏ శ్రామికులదో వాళ్ళకి మాత్రం అందదు.

వడ్డీల సంగతి చూసేటప్పుడు, బ్యాంకుల్ని గుర్తు చేసుకోవాలి. డబ్బు అప్పులు ఇచ్చే వ్యాపారాలు ఇంకా అనేకం ఉన్నాయి. అన్నీ చేసే పని ఒకటే. వాటిల్లో బ్యాంకులు ముఖ్యం. బ్యాంకు అనేది, రక రకాల పనులు చేస్తుంది. డబ్బుని ఒకరి నించి ఒకరికి పంపే పనులెన్నో చేయిస్తుంది. వాటికి ఛార్జీలు వసూలు చేస్తుంది. ఆ రకంగా అవి, ఉత్పాదక శ్రమలే అవుతాయి.

కానీ, ఆ రకం పనులే గాక, బ్యాంకు, వడ్డీ వ్యాపారాలు మస్తుగా చేస్తుంది. ముందు, పెట్టుబడిదారులనించీ అప్పులు తీసుకుంటుంది, తక్కువ వడ్డీతో. తర్వాత, ఆ డబ్బునే అప్పులు అవసరమైన పెట్టుబడిదారులకు ఇస్తుంది, ఎక్కువ వడ్డీతో.

ఎక్కువ వడ్డీ లోనించి, తక్కువ వడ్డీని చెల్లించేస్తూ ఉంటే, మిగిలేది బ్యాంకుకి ఆదాయం. బ్యాంకు బతుకులో, ఇటూ అటూ, ఇచ్చేదీ తీసుకునేదీ అన్నీ వడ్డీలే. ఆ వడ్డీల మొత్తం రాసి అంతా, దేశంలో ఉన్న ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ రాసిలో భాగమే! ఈ వ్యాపారం కూడా చిన్న స్థాయిలో, బానిస యజమానుల కాలం లోనే ప్రారంభమైంది.

మనం, మొదటి నించీ 8 చొక్కాల ఉదాహరణని పెట్టుకున్నాం. అది ఒక చిన్న సరుకు. అందులో, ఆ సరుకుని తయారు చేసిన శ్రామికుల అదనపు విలువ కొంత ఉంటుంది కదా? అది, ఎంత మంది దోపిడీదారులకు అందుతుందంటే:

(1) భూస్వామికి కౌలుగా,
(2) పెట్టుబడి మీద వడ్డీగా,
(3) పెట్టుబడి మీద, ఉత్పాదక లాభంగా,
(4) ఆ సరుకుని అమ్మించే వర్తక పెట్టుబడిదారుడికి 'వర్తక కమిషన్'గా.

ఇప్పటికి ఈ 4 అంశాలూ, 'అదనపు విలువ'లో భాగాలే. ఇంకా అదనపు విలువ లోనించి తీసే అంశాలున్నాయి. వాటిని తర్వాత. ఈ విషయాలన్నీ తెలిస్తేనే, మానవ సంబంధాలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది.

"అమ్మో, ఇవి అసలు మానవుల సంబంధాలా? జంతువుల సంబంధాలే గానీ."

"జంతువులేమన్నా వడ్డీ వ్యాపారాలు చేస్తాయా? ఇవి, పూర్తిగా ఈ నాటి వరకూ, వేల సంవత్సరాల నించీ సాగుతోన్న మానవ సంబంధాలే!"

"అంతే మరి, అంతే. మేం కూడా నెల నెలా వడ్డీలు చెల్లిస్తూనే ఉన్నాం. తెలివి లేని మానవులం!" ★

# 37. పోలీసులూ, సైనికులూ, ఏ రకం శ్రామికులు?

**79. అనుత్పాదక శ్రామికులంటే ఇళ్ళల్లో పనులు చేసే వాళ్ళేనా, వేరే వాళ్ళు కూడా ఉంటారా?**

**జ:** యజమానులతో సంబంధాలు ఉండి, వాళ్ళు చేసే శ్రమలో, ఉత్పత్తులో, అమ్మకాలకు వెళ్ళకపోతే, అలాంటి వాళ్ళందరూ అనుత్పాదక శ్రామికులే కదా? పోలీసులూ, సైనికులూ, అలాంటి వాళ్ళే కదా?

"అమ్మో, వాళ్ళూ శ్రామికులేనా?"

"వాళ్ళూ శ్రమలు చేస్తారు కాబట్టి వాళ్ళూ శ్రామికులే. కాకపోతే, యజమానులకు రక్షకులుగా పని చేసే శ్రామికులు వాళ్ళు. శ్రామిక ప్రజలకు వ్యతిరేకులైన శ్రామికులు వాళ్ళు. కాస్త జీతాలు పెంచమని అడిగే శ్రామికుల్ని తుపాకులతో పేల్చేసి చంపెయ్యగలరు వాళ్ళు."

"అంత తప్పుడు పని ఎందుకు చేస్తారు వాళ్ళు? తెలీదా వాళ్ళకి?"

"ఏ పని మంచిదో, ఏ పని చెడ్డదో, ఏది ఎలాంటిదో, ఏ శ్రామికులకు మాత్రం

తెలుసు? ప్రొఫెసర్లకి తెలుసా? పోలీసు ఉద్యోగాల్నీ, సైనికుల ఉద్యోగాల్నీ, గొప్ప దేశభక్తి ఉద్యోగాలుగా అందరూ అనుకోరూ? మనం చిన్నప్పట్నించీ అలాగే విన లేదూ? పోలీసులూ అంతే. బతుకుదెరువుల కోసం ఏ పనిలోకైనా వెళ్తారు కదా?''

''అయితే మాత్రం? అంత తప్పుడు పనిలోకా? అలాంటి పని కన్నా గడ్డి కోసుకుని బతకాలి.''

''ఎవరి పొలాల్లో కోస్తారు గడ్డి?''

''అడవుల్లోకి పోయి కోసుకోవాలి. లేకపోతే, తుపాకులు పేల్చి తోటి శ్రామికుల్ని చంపుతారా?''

''తుపాకులు పేల్చడం తప్పయితే, తుపాకులు తయారు చెయ్యడం తప్పు కాదా? ఉత్పాదక శ్రామికులు చేసే పనులన్నీ ఏమిటి? అందరూ ఇడ్లీలే తయారు చేస్తున్నారనుకుంటున్నారా? ఎంతెంత మారణాయుధాలు తయారు చేస్తున్నారు! ధాన్యం పంట కన్నా వేల రెట్లుగా బాంబులు తయారవుతున్నాయి. యజమానులు ఏ పని చెయ్యమంటే ఆ పని చేస్తున్నారు. మిమ్మల్ని ఇడ్లీలు చెయ్యమన్నారు. ఇంకోళ్ళని బాంబులు చెయ్యమన్నారు. పోలీసుల్ని తుపాకులతో తిరిగి శ్రామికుల్ని అణిచి ఉంచమన్నారు. యజమానులు చెప్పినట్టు చెయ్యక ఏం చేస్తారు? దోపిడీ దారుల సమాజం చూపిస్తోన్న ఉద్యోగాలు కదా అవి!''

''నోరు తెరిచి మాట్లాట్టానికేముంది? ఈ ప్రపంచం భయంకరంగా ఉన్న ట్టుంది.''

''ఇంకా సందేహమా! 'ఉన్నట్టుంది' ఏమిటి? 'ఉంది' అనండి! నిజంగానే భయంకరమైన ప్రపంచంలో ఉన్నాం. దాన్ని మార్చుకుంటామో లేదో, అది మన జ్ఞానం!''

''పోలీసులకి యజమానులు ఎవరు?''

''ప్రభుత్వమే.''

''వాళ్ళకి జీతాలు ఎక్కణ్ణించి వస్తాయి?''

''ప్రభుత్వం నించే. దాని ఆదాయం, పన్నులు కదా? ఆ పన్నుల్లో నించే. పన్నులు ప్రభుత్వానికి ఎలా వస్తాయి? పెట్టుబడిదారులూ, భూస్వాములూ, పన్నులు కడు తారు కదా? వాళ్ళు వాటిని ఎక్కణ్ణించి తెచ్చి కడతారు? ఉత్పాదక శ్రామికుల అదనపు విలువల్లో నించే. అవే, పోలీసులకీ, సైనికులకీ, జీతాలు!''

''పన్నులు కూడా అదనపు విలువేనా? అసలు, ప్రభుత్వానికి పోలీసులూ, సైనికులూ, ఎందుకు?''

'' 'ప్రభుత్వం' అంటే ఏమిటో మొదట చెప్పుకున్నది మరిచేపోయారా? ప్రభుత్వం అంటే, మొత్తం దేశంలో ఉన్న జనాభా నంతటినీ రక్షిస్తూ, పరిపాలిస్తూ ఉంటుందని అనుకుంటాం కదా? అది కాదు. బానిస యజమానుల కాలంలో, బానిసల్ని ఎదురు తిరగకుండా అణిచి ఉంచడానికే ప్రభుత్వం పుట్టింది. దాన్ని 'రాజ్యాంగ యంత్రం' అనాలి. దాన్ని బానిస యజమానులందరూ పెట్టుకున్నారు.

అందులో అసలు భాగం పోలీసులే. వాళ్ళు బానిసల్ని అణచడానికి. సైనికులైతే యజమానులు చెప్పే ఇతర ప్రాంతాల్ని ఆక్రమించడానికి. ప్రభుత్వం అనేది, బానిసల క్షేమం కోసం కాదు, యజమానుల కోసం శ్రమలు సాగేలా బానిసల్ని అణిచి ఉంచడానికి. భూస్వాముల కాలంలో కూడా కౌళ్ళు సరిగా వసూళ్ళయ్యేలాగ పోలీసులు చూడాలి. కౌలు రైతులు, ఆ భూముల్ని ఆక్రమించకుండా వాళ్ళకి శిక్షలు వేస్తూ, వాళ్ళని అణిచి ఉంచాలి. ఆ కాలాల్లో రాజులూ చక్రవర్తులూ ఆ దోపిడీ యజమానుల ప్రతినిధులు! ఆ నాడు అంతా వాళ్ళ పెత్తనాలే. అక్కడ చట్టాలేవీ ఉండవు. కౌళ్ళు చెల్లించని రైతుల్ని బజారుల్లో పెట్టి ఉరులు తీయించేస్తారు; శిరచ్ఛేదాలు చేయించేస్తారు. ఇప్పుడు పెట్టుబడిదారుల పరిపాలనలు మొదలయ్యాక రాజుల పెత్తనాలు ఇంకో రకంగా మారాయి. ప్రజల ఓట్ల పద్ధతితో 'ప్రజాస్వామ్యం' అని, ఇదేదో ప్రజల పరిపాలన అయినట్టు దొంగ పేరు వచ్చింది. ఈ పరిపాలన కూడా శ్రామికుల్ని అణిచి ఉంచడానికే. శ్రామికులు ఎదురు తిరిగి తమ పరిపాలన మొదలు పెట్టారంటే, ఇక యజమానులు దోపిడీలు చెయ్యడం సాగదు కదా? అందుకే శ్రామికుల్ని ఎప్పుడూ అణిచి ఉంచాలి. అంటే, బానిస కాలంలో రాజుల పరిపాలనకీ, ఈ నాడు ప్రజాస్వామ్యం పేరుతో ఈ మంత్రుల పరిపాలనకీ, ఏమిటి తేడా? సారాంశం ఏమీ మారలేదు. రూపం కొంచెం మారింది, అంతే. ఇప్పటికీ ఇంగ్లాండులో, సింహాసనం మీద రాజరికం ఉంది. ఆ దేశంలో శ్రామికులకి సిగ్గే లేదు. అసలు వాళ్ళకి, 'రాజ్యాంగం' అంటే ఏమిటో, 'రాజు' అంటే ఏమిటో, ఈ నాటికీ తెలీదు. 'రాజు' అనే మాట చెవినబడితే పులకించిపోతారు. మన దగ్గిర కథలూ, సినిమాలూ, అన్నీ రాజుల మీదే. వాళ్ళ వీరత్వాల మీదే. ఆ వీరత్వాలన్నీ ఇంకో రాజుని నరికేసి వాడి భూమిని లాక్కోడానికి! ఆ యుద్ధాల్లో ప్రజల్ని నాశనం చెయ్యడానికి! రాజులు చేసే యుద్ధాలే, ఇవ్వాళ పెట్టుబడిదారుల ప్రభుత్వాలు కూడా చేస్తున్నాయి. వీళ్ళ రక్షకులు, పోలీసులూ, సైనికులూ!"

"పోలీసులేవో శాంతి భద్రతల్ని కాపాడతారంటారే! మా హోటల్లోకి అప్పుడప్పుడూ పోలీసు ఇన్‌స్పెక్టర్లూ వాళ్ళూ వచ్చి బాగా తినేసి పోతూంటారు."

"మీ దగ్గిర ఉన్న శ్రామికులందరూ చిన్న సమ్మె చెయ్యండి, అప్పుడేం జరుగుతుందో చూడొచ్చు! మీ వాడు ఆ పోలీసుల్ని పిలవగానే వాళ్ళు పరిగెత్తుకొచ్చి మీ మీద తుపాకులు పేలుస్తారు. అంటే పోలీసులు కాపాడేది యజమానుల శాంతి భద్రతల్ని. అసలు శాంతి భద్రతల్ని పాడుచేస్తున్నదెవరు, పోలీసులు కాపాడ్డానికి! ఆ పాడు చేసేది యజమానులే. వాళ్ళ దోపిడీయే, వాళ్ళ పోటీలే, వాళ్ళ కలహాలే, వాళ్ళ యుద్ధాలే, సమాజానికి శాంతి లేకుండా చేస్తాయి. కోట్ల కోట్ల శ్రామిక ప్రజలకి కడుపులు నిండనంత పేదతనం చుట్టుకుంటోంటే శాంతి భద్రతలు ఎక్కణ్ణించి వస్తాయి? ఆకలితో, దుఃఖంతో, శాంతి ఎక్కడ నిలబడుతుంది?"

" 'రాజులు' అన్నారు ఇందాక. నా తప్పు ఒకటి చెప్పాలి ఇప్పుడు. రాజులంటే దొంగ ముండా కొడుకులని నాకు ఇప్పటి దాకా తెలీదు. ఆ మధ్య, ఒక రాజు

గురించి, మన తెలుగు వాళ్ళ రాజు అని తెగ మాట్లాడుకున్నారు మా హోటల్లో. వాడికి ఎనిమిది మంది పెళ్ళాలంట! ఉంపుడు కత్తెలంట! మేడలంట, మిద్దెలంట! గుర్రాలంట, ఏనుగులంట! వాడికి అవన్నీ ఎలా వచ్చాయన్న తెలివే లేదు మాకు అప్పుడు. ఏమో, రాజులకి అంత ఆస్తి ఉంటుంది కదా అనుకున్నాను. ఆ రాజు గురించి, మా వాళ్ళల్లో బోలెడు కుమ్ములాటలు, 'అతను మా కులం వాడంటే మా కులం వాడ'ని. అప్పుడు నాకేం తెలుసు? ఇప్పుడైతే అందును, 'ఎవరి కులం వాడైతే మాత్రం ఎవరికేం చేశాడ్రా, అన్ని కులాల్నీ దోచుకున్నాడు గానీ?' అందును. అప్పుడప్పుడూ ఆ పిచ్చి ముచ్చట్లు మళ్ళీ రేగుతాయిగా? ఈసారి తప్పకుండా అంటాను. ఆ రాజు పటాలు తెచ్చి హోటల్లో గదుల నిండా అంటించారు. అప్పుడు నేను కూడా ఒక పటం పట్టుకు పోయి మా ఇంట్లో గోడకి అంటించాను. పెద్ద కత్తి ఎత్తి ఏనుగంత గుర్రం మీద తిరుగుతున్నాడు. 'ఈయనకి ఎనిమిది మంది పెళ్ళాలట!' అని చెప్తే మా ఆవిడ కెవ్వుమని అరిచింది. పటం తీసెయ్యమంది. కానీ కృష్ణుడికి పదహారు వేల మంది గోపికలు అంటే కోపం రాదు. 'ఆయన దేవుడు కదా?' అంటుంది. ఈ రాత్రి ఇంటికి వెళ్ళగానే ముందు ఆ రాజు పటం పీకి పారేస్తాను. ఇన్నాళ్ళూ బుద్ధిలేని పని చేసినట్టే ఉంది."

" 'చేసినట్టే' ఏమిటి? చేశారు. ఏ రాజు అయినా పెద్ద దోపిడీదారుడు. క్రూరుడు. మీ ఇంట్లో గోడలకి దేవుళ్ళ పటాలు కూడా ఉన్నాయా?"

"ఎందుకు లేవు? మా ఆవిడ రోజూ పూజలు చేస్తుంది."

"ఏం కోరుకుంటుంది? జీతం పెరగాలనా?"

"ఏమో, నేనడగను. ఏం, ఆ పటాలు కూడా పీకెయ్యాలా?"

"ఆ పని మీ ఆవిడ చేసుకోవాలి. మీరు చేస్తే తప్పు. అదంతా తర్వాత. మనం ఇప్పుడు అనుత్పాదక శ్రామికుల గురించి మాట్లాడుకుంటున్నాం కదా?"

"అవును, ఇంకా ఉన్నారా వాళ్ళు?"

"ఎందుకు లేరు? ఇంకా ఉన్నారు."

"చెప్పండి, అదీ తెలుస్తుంది." ★

# 38. ప్రభుత్వ ధర్మాసుపత్రులూ, ధర్మ పాఠశాలలూ!

**80. అనుత్పాదక శ్రామికులు ఇంకా ఎక్కడెక్కడ ఉంటారు?**

**జ:** ప్రభుత్వం, కొన్ని స్కూళ్ళనీ, కొన్ని ఆస్పత్రుల్నీ, ఉచితంగా నడుపుతుందనుకుందాం. అంటే, ఆ విద్యార్థుల నించీ, ఆ రోగుల నించీ, డబ్బు తీసుకోదు. కానీ, అక్కడ అవసరమయ్యే శ్రమ సాధనాల కోసమూ, శ్రామికుల జీతాల కోసమూ, కొంత డబ్బు ఖర్చవుతుంది కదా? ఆ డబ్బుని ప్రభుత్వమే తన ఆదాయంలో నించి, అంటే తన పన్నులలో నించి పెడుతుంది. కానీ, ఆ డబ్బు వెనక్కి రాదు. ఆ స్కూళ్ళల్లో విద్యార్థుల నించీ, ఆ ఆస్పత్రుల్లో రోగుల నించీ, డబ్బు తీసుకుంటే, మొదట

ఖర్చయ్యేదంతా వెనక్కి రావచ్చు. అది పెరగవచ్చు కూడా. కానీ అలా జరగదు కాబట్టి, ఆ ఉచితంగా నడిపే సంస్థల వల్ల ప్రభుత్వ ఆదాయమే ఖర్చవుతూ ఉంటుంది. ఆ సంస్థల్లో పని చేసే వాళ్ళ శ్రమలు, యజమానికి (ప్రభుత్వానికి), డబ్బుని పెంచవు. ఖర్చయిన డబ్బుని (ఖర్చయిన సాధనాల్ని) వెనక్కి తీసుకురావు. డబ్బు ఖర్చుని తగ్గించడం చేస్తాయి. ఆ రకంగా, ఆ శ్రామికులందరూ అనుత్పాదక శ్రామికుల కోవలోనే వస్తారు, పెద్ద టీచర్లు అయినా, డాక్టర్లు అయినా అనుత్పాదక శ్రామికులే.

"చిన్నప్పుడు మా ఊళ్ళో ఒక ధర్మాసుపత్రి ఉండేది. ఇప్పుడు ఆ పేర్లే లేవు. ధర్మాసుపత్రులూ, ధర్మ పాఠశాలలూ నడిపే ప్రభుత్వం మంచిదేగా? దాన్ని, శ్రామికుల్ని అణిచే ప్రభుత్వం అన్నారెందుకు?"

"అణిచే పనే లేకపోతే దానికి పోలీసులెందుకు? దానికి ఆయుధాలెందుకు? ఇతర దేశాల్ని అణిచే పని లేకపోతే యుద్ధాలెందుకు? సైనికులెందుకు? స్వంత దేశంలో శ్రామికుల్ని అణచడానికే పోలీసులు. బైటి దేశాల్ని అణచడానికే సైనికులు. ఒక స్కూలులో, ఒక ఆస్పత్రినో, ఉచితంగా నడిపే ధర్మకార్యం కూడా చెయ్యకపోతే, ఆ ప్రభుత్వం శ్రామికుల్ని ఎలా నమ్మిస్తుంది? వాళ్ళ ఓట్లు ఎలా సంపాదిస్తుంది? ఇన్ని విషయాలు వింటూ కూడా మీరు ధర్మాసుపత్రుల్నీ, ధర్మ పాఠశాలల్నీ తల్చుకుని, యజమానుల ప్రభుత్వాన్ని కూడా 'మంచిదేగా' అంటున్నారా!"

"అవును, బుట్టలో పడ్డాను. పిల్ల గిల్లి జోల పాడినట్టు చేస్తుందన్నమాట ప్రభుత్వం!"

"పిల్ల గిల్లితే, గిల్లిన దానికేం లాభం, పిల్లకేం నష్టం? అసలు సంగతి అంత చిన్నది కాదు. పెట్టుబడిదారుల ప్రభుత్వం ఎలాంటిదో తెలియాలంటే, దాని చట్టాలు ఎలా ఉన్నాయో చూడాలి. అవేం చెపుతున్నాయి? భూములన్నీ భూస్వాముల ఆస్తులే. ఫ్యాక్టరీలన్నీ పెట్టుబడిదారుల ఆస్తులే. భూముల వాళ్ళు, వాటి ద్వారా కౌళ్ళని సంపాదించుకోవచ్చు. పెట్టుబడుల వాళ్ళు వాటి ద్వారా వడ్డీలూ లాభాలూ సంపాదించుకోవచ్చు. ఉత్పత్తి సాధనాలు లేని వాళ్ళు, అవి ఉన్న వాళ్ళ దగ్గిరికి పోయి పనులు అడుక్కోవాలి, బతకాలి. యజమానులు, ఎంత మంది శ్రామికుల్ని పెట్టుకోవాలో అంత మందినే పెట్టుకుంటారు. అందరికీ ఉద్యోగాలు ఇవ్వవలసిన బాధ్యత వాళ్ళది కాదు. అణిగి మణిగి వినయ విధేయతలతో పని చేసే వాళ్ళకే ఉద్యోగాలు నిలబడతాయి. - ఈ రకంగా చెపుతాయి ఆ చట్టాలు. అంటే, బానిస యజమానుల కాలం నించీ ఈ నాటి దాకా, ప్రభుత్వం చేస్తోన్న పరిపాలన, యజమానులందర్నీ శ్రమ దోపిడీతో బతికేలాగ చెయ్యడమే. దాని చట్టాలు చెప్పేదంతా అదే. అలాగాక, ఆ చట్టాలు, "భూమి, ఎవరి సొత్తూ కాదు; ప్రతీ మనిషీ శ్రమ చెయ్యవలసిందే. మానవుల్లో యజమానీ శ్రామిక భేదాలు ఉండకూడదు" అని చెపుతాయా? అలా చెప్పవు. పైగా, ఆ సంబంధాలన్నీ అలాగే ఉండాలని చెపుతాయి. ఎన్నికల్లో నెగ్గి వెళ్ళే నాయకులు, 'ఇప్పుడు ఏ చట్టాలు ఉన్నాయో ఆ చట్టాల ప్రకారమే నడుస్తాము. వాటినే నిలబెడతాము' అని ప్రమాణాలు చేసి మరీ చెపుతారు. అంటే, పరిపాలన

చేసే వాళ్ళందరూ ఆ చట్టాల్ని నిలబెట్టి ఉంచే వాళ్ళే."

"అలాంటి వాళ్ళని మన ప్రజలు ఎందుకు ఎంచుకుంటున్నారు? ఎందుకు ఎంచుకోవాలి?"

"అయితే మీరందరూ ఎన్నికల్లో ఎప్పుడూ ఓట్లు వేయ్యలేదా?"

"ఎందుకు వెయ్యలేదూ? ఉత్సాహంగా వెళ్ళి వేశాం. ఇదంతా మాకేం తెలుసు?"

"తెలిస్తే వేసే వారు కాదా?"

"ఎందుకు వేస్తాం? దోచుకోమని చెప్పే చట్టాల్ని నిలబెట్టే వాళ్ళని ఎందుకు ఎంచుకోవాలి?"

"మరి ఎవర్ని ఎంచుకుంటారు?"

"ఏమో, అది తెలీదుగానీ, ... అసలు ఆ చట్టాలు అలాగే ఉంటే, ఆ ప్రభుత్వం ఎందుకు? అందులో ఎవర్నీ ఎంచుకోకూడదు. ఇంతకీ ఇంకోసారి చెప్పండి, మరిచి పోయాను. ప్రభుత్వం నడవాలంటే, దానికి ఆదాయం, పెట్టుబడిదారులు కట్టే పన్నులేనా? అవి శ్రామికుల అదనపు విలువలో భాగం అన్నారు. ప్రభుత్వం నడవడం, శ్రామికులకు కూడా అవసరమే కదా? ఆ ఖర్చుల్ని శ్రామికులూ, యజ మానులూ అందరూ భరించవలసిందే కదా?"

"మళ్ళీ వెనక నడకేనా మీకు? శ్రమ దోపిడీ చట్టాల్నీ, సంబంధాల్నీ నిలబెట్టే పరిపాలన, యజమానులకు అవసరం గానీ, శ్రామికులకేం అవసరం? ఆ ఖర్చుల్ని శ్రామికులు తమ శ్రమలో నించి ఎందుకు భరించాలి? శ్రామికులు, తమని దోపిడీ చేసే పరిపాలన కోసం శ్రమని ఇవ్వక్కరలేదు. దోపిడీ సమాజాల్లో అది శ్రామికుల బాధ్యత కాదు, శ్రామికుల అవసరం కాదు. అసలు, పెట్టుబడిదారులు కట్టే పన్ను లన్నీ శ్రామికుల అదనపు విలువే కదా? దాన్ని శ్రామికులు ఆపడం లేదు కాబట్టే అది జరుగుతోంది. మీ ప్రశ్న ఒక రకంగా చాలా మంచిది. ఎలాగంటే, శ్రామికులకు కూడా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవలిసిన బాధ్యత ఎప్పుడు ఉంటుందంటే, ఆ ప్రభుత్వం, దోపిడీ పద్ధతుల్ని తీసివేసే ప్రభుత్వం అయినప్పుడు! అలాంటి ప్రభుత్వం నడవడానికి అవసరమయ్యే ఖర్చులన్నిటినీ ఆ సమాజంలో జనం భరించాలి."

"అలాంటి ప్రభుత్వం అసలు ఉంటుందా?"

"మనం ఏర్పాటు చేసుకుంటే ఉంటుంది. మనం ఈ యజమానుల ప్రభు త్వానికే ఓట్లు వేసుకుంటూ, వీళ్ళనే ఎంచుకుంటూ కూర్చుంటే, ఈ ప్రభుత్వమే ఉంటుంది గానీ, ఆ ప్రభుత్వం ఎలా ఉంటుంది?"

"లేదు, లేదు, మేం ఇక ఈ ఎన్నికల్లో ఓట్లు వెయ్యం! చేసిన తప్పు దిద్దుకో వలిసిందే."

"అదే చాలదు. ఇప్పుడు కూడా నూటికి 40 మంది జనం ఓట్లు వెయ్యడం లేదు. అయినా పడ్డ ఓట్లే చాలు. ఆ ఓట్లలోనే మెజారిటీ ఏ పార్టీకి వస్తే ఆ పార్టీయే ప్రభుత్వంలోకి వస్తుంది."

"మరైతే ఎలాగ? ఇంకేం చెయ్యాలి?"

"ఈ దోపిడీ ప్రభుత్వాన్ని ఎలా తీసెయ్యాలో, మన ప్రభుత్వాన్ని ఎలా పెట్టుకోవాలో, అది నేర్చుకోవాలి. అసలు మనకి ఇప్పుడు ఈ సమాజం గురించి అప్పుడే ఏం తెలిసింది? మనం ఇప్పుడు, శ్రామికుల అదనపు విలువ ఎన్ని పేర్లతో పోతూ ఉంటుందో చూస్తున్నాం అంతే. కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ లాగ, పన్నులు కూడా దోపిడీదారుల రక్షణ కోసమే అని చూస్తున్నాం. అంటే, శ్రామికుల శ్రమలో ఒక భాగమే శ్రామికుల్ని అణిచే పోలీసుల చేతిలో లాఠీ అవుతోందన్నమాట!"

"అబ్బా! ఏది విన్నా సరికొత్త రహస్యం లాగే ఉంది. ఏది వినాలన్నా గుండెలు అదురుతున్నాయి."

"ఈ విషయాలన్నీ మార్క్సు ఎప్పుడో బైటపెట్టాడు. వాటిని కొత్తగా వినే వాళ్ళకి ఏ నిజం అయినా, కొత్త రహస్యమే. ఈ రహస్యాలూ, ఈ సంబంధాలూ అర్థమైతేనే మనం 'వర్గాల్ని' అర్థం చేసుకోగలుగుతాం."

" 'వర్గాలు' అనే మాటలు అప్పుడప్పుడూ విన్నాం." ★

## 39. యజమానీ శ్రామిక వర్గాలు, శత్రు వర్గాలు!

**81. 'వర్గాలు' అనే మాట అప్పుడెప్పుడో మేము ఒక మీటింగులో విన్నాం. అప్పుడేదో తెలిసింది. అంతా మర్చిపోయాం. మా పనుల్లో ఈ మాటలే ఉండవు. మా వాడు ఎప్పుడూ డిమాండ్, డిమాండ్ అంటాడు. 'వర్గాలు' అనడు. వర్గాలు ఏమిటి" అసలు?**

**జ:** మీ వాడు ఎందుకు అనాలి 'వర్గాల' మాట? మీకు విజ్ఞానం, మీ యజమాని నించి అందాలా? మీరే వాడికి నేర్పాలి. మొదటి నించీ మనం మాట్లాడుకుంటున్నది, 'వర్గాల' గురించే. వర్గాల్ని తెలుసుకోవాలంటే, 4 వాక్యాలు చాలు. శ్రామికుల నించి అదనపు శ్రమని లాక్కునే వాళ్ళంతా, ఒక 'వర్గం.' అది, శ్రమ దోపిడీ చేసే వర్గం. అది, యజమానుల వర్గం. అదనపు శ్రమని పోగొట్టుకునేది, ఇంకో వర్గం. ఇది, శ్రమ దోపిడీకి గురి అయ్యే వర్గం. ఇది, యజమానుల పెత్తనం కింద బతికే శ్రామిక వర్గం.

శ్రామిక వర్గం, యజమానుల వర్గాన్ని, శత్రువుగా చూడాలి. అలా చూడాలని తెలుసుకుంటే, అది శ్రామిక వర్గ చైతన్యం. ఆ భావాలు ప్రారంభం అవడం అంటే, అది కొత్త చైతన్యంలో మొదటి అడుగు. అది, దోపిడీ నించి బైట పడడానికి చేసే ఆత్మ రక్షణ కోసం ప్రయత్నం.

యజమాని వర్గం కూడా శ్రామిక వర్గాన్ని శత్రువుగానే చూస్తుంది. అది దాని నీచత్వం. తను అన్యాయంగా ప్రవర్తిస్తున్నానని దానికి తెలుసు. అయినా ఆ ప్రవర్తనకే 'న్యాయం' అని చెప్పుకుంటుంది. శ్రామిక వర్గాన్ని అణిచి ఉంచడానికే చూస్తూ ఉంటుంది. బానిసల్ని, యజమానులు ఏం చేశారు? ఆ నాటి నించీ ఆ అణిచివేత

సాగుతూనే ఉంది. యజమాని వర్గం, ఏ నాటికైనా తన తప్పు తెలుసుకుంటుందనీ, మారిపోతుందనీ, శ్రామికుల్ని కన్నబిడ్డల్లా చూస్తుందనీ, యజమాని వర్గంతో సామ రస్యమే గానీ పోరాటం అన్యాయమనీ - అలా శ్రామికులు నమ్ముతూ ఉంటే, అదంతా పెద్ద భ్రమ. అది, తమకే ద్రోహం! అది బుద్ధీ జ్ఞానం లేని దృష్టి!

ఈ యజమానీ శ్రామిక వర్గాల్ని, వేరు వేరు తరగతులుగా చూడకూడదు. పాఠ శాలల్లో విద్యార్థులు, వేరు వేరు తరగతుల్లో ఉంటారు. చిన్న వాళ్ళు ఒకటో తరగతిలో ఉంటే, కొంచెం పెద్ద వాళ్ళు రెండో తరగతిలో ఉంటారు. ఆ తరగతులు, ఒక దానికి ఒకటి శత్రువులు కావు. అవి సహజ అవసరాలు. చిన్న తరగతిలో పిల్లలు, పెద్ద తరగతిలోకి మారుతారు. ఆ తరగతుల తేడాలు ప్రతి తరానికీ సహజ అవసరమే. కానీ, యజమానీ శ్రామిక వర్గాలు, అటువంటి సహజ అవసరాలు కావు; అటువంటి తరగతులు కావు. ఇవి, శత్రు వర్గ సంబంధాలు. ఈ శత్రుత్వాలు ఎలా పోవచ్చో ఊహించండి!

"చాలా తేలికే. యజమానులు ఎలా తయారయ్యారు అసలు? అస్తులన్నీ ఆక్రమించారు. మా వాడు కూడా అక్కడ హాల్లో సోఫాల్లో జేరగిలబడి కూర్చుని ఫోనుల్లో మాట్లాడుతూ, చేత్తో పట్టుకున్న దానితో టీవీ బొమ్మల్ని మార్చి మార్చి చూస్తూ, మధ్య మధ్యలో మమ్మల్ని కేకలేసి పిల్చి కాఫీలు తెప్పించుకు తాగుతూ, అక్కడే అలా దొల్లకపోతే, లేచి వంట గదుల్లోకి వచ్చి మా లాగే పనులు చెయ్య రాదూ? మా సెక్షన్ హెడ్డుగాడు, మావేపొచ్చి పెద్ద తెపాళాలూ మూకుళ్ళూ తోమ లేడా? మా లాగే వాళ్ళూ పనులు చేస్తే, మమ్మల్ని దోచడానికి వాళ్ళకి ఏం అవసరం? అప్పుడు వర్గాలూ గిర్గాలూ ఎక్కడుంటాయి?"

"ఎంత బాగా చెప్పారు! మార్క్సు గ్రహించిన ఆర్థిక శాస్త్రం అంతా మీకూ అర్థమై పోయింది. అందులో అక్కడక్కడా కొన్ని విషయాలు తెలియకపోతే తెలియకపోవచ్చు గానీ, అసలు పరిష్కారం తెలిసి పోయింది. అయితే, ఒకటి చెప్పండి! మీ వాడు, ఆ సోఫాలోంచి లేచి వంట గదుల్లోకి ఎలా వస్తాడు? చేత్తో గరిటె ఎప్పుడు పట్టు కుంటాడు?"

"అమ్మో! వాడు వస్తాడా? వాడెందుకు వస్తాడు?"

"మీరందరూ, అన్ని సెక్షన్లలోనూ డజన్ల కొద్దీ ఉన్నారు కదా? మీరందరూ వెళ్ళి, మీ వాడి ముందు నిలబడి, 'నువ్వూ లేచి వంట గదుల్లోకి రా! పప్పులు రుబ్బుదువు గానీ' అనలేరా?"

"అమ్మో! మా వాళ్ళా? ఒక్కడైనా ముందుకొస్తాడా?"

"మీరు నిలబడతారా లీడర్‌గా అందరికీ ముందు?"

"అమ్మో! నే నసలే పారిపోతానేమో, ఇక్కడ కబుర్లు చెపుతున్నాను గానీ."

"లేదు. సమయం వస్తే ఎవ్వరూ భయపడరు. ఒక్కళ్ళే చెయ్యాలన్నా, ఒక్కచోటే జరగాలన్నా, అది సాధ్యం కాని పనే. శ్రామికులు అన్ని చోట్లా కదలాలి. కదలాలంటే కదలాలని ముందు తెలియాలి. ఉత్పత్తి సాధనాల మీద హక్కులు యజమానులకు

లేకుండా చెయ్యాలి. వాళ్ళ ఆదాయాలు ఆగిపోతే, ఒళ్ళు వంచి శ్రమలు చెయ్యడం వాళ్ళకి తప్పనిసరి అవుతుంది."

"బాగుంది గానీ, మన వర్గం కదిలితే, వాళ్ళ వర్గం మాత్రం కదలదా?"

"వాళ్ళ వర్గం ఇవ్వాళ కదిలేదేమిటి? అది, ఎప్పటి నించో తెలివిలో ఉంది. అందుకే వాళ్ళ ప్రభుత్వాలూ, వాళ్ళ చట్టాలూ, ఏ నాటి నించో స్థిరపడి ఉన్నాయి. ఆ స్థిరత్వాల్ని, శ్రామిక వర్గం కదిలించాలి. అదే మరి 'వర్గ పోరాటం.' యజమానుల సంఖ్య కన్నా శ్రామికుల సంఖ్య వందల రెట్లు ఎక్కువ కదా? తుపాకులు చేసే వాళ్ళూ, తుపాకులు పట్టే వాళ్ళూ, అందరూ శ్రామికులే కదా? శ్రామికులు, యజమాని పక్షానికి చేరకపోతే, ఆ వర్గాన్ని ఓడించడం ఏం కష్టం?"

"ఎంత బాగున్నాయి ఈ మాటలు! వినడానికి ఎంత ముచ్చటగా ఉన్నాయి! ఇదంతా నిజంగా చెయ్యగలమా? చేసినా, చెయ్యకపోయినా, పోనీ మాటలైనా విందాం, ఇంకా చెప్పండి! ఎన్నయినా చెప్పండి!" ★

## 40. ఎంత నింద వేశారు నా మీద!

**82. బానిసల కాలంలో, యజమానుల చేతుల్లో డబ్బు అనేది అసలు ఉండదని అనుకోలేం. అక్కడ కొంచెం డబ్బు ఉంటే, అది ఎలా వచ్చినట్టు?**

**జ:** బానిసల కాలం అంటే, అది, ప్రారంభమైన కాలం నించీ నిన్న మొన్నటి దాకా నడిచింది. మరీ ప్రారంభ కాలంలో, డబ్బు లేకపోవచ్చు కూడా. సరే, కొంచెం డబ్బు ఉన్న కాలాన్నే తీసుకుందాం. డబ్బు ఎలా వచ్చినట్టా? అదీ తెలీదా? ఉత్పత్తుల్ని అమ్మితే వస్తుంది. ఆ ఉత్పత్తుల్ని చేసేది యజమానులైతే కాదు గదా? బానిసలే చేస్తారు. అది బానిసల శ్రమ వల్ల వచ్చేదే. ఏ సమాజంలో డబ్బు అయినా, అక్కడ శ్రమలు చేసే వాళ్ళ వల్ల వచ్చేదే కదా?

**83. ఉత్పాదక - అనుత్పాదక తేడాలు వెనకటి కాలం నించీ ఉన్నట్టేనా?**

**జ:** డబ్బుని పెంచేదీ, డబ్బుని ఖర్చు చేసేదీ - అనే అర్థాలతో చూస్తే, శ్రమల్లో ఆ తేడాలు పెట్టుబడిదారీ విధానం దాకా కనపడవు. కానీ, ఆ లెక్కలు తెలియక పోయినా, ఏ సమాజంలో అయినా, ఉత్పత్తిని పెంచే శ్రమలూ, ఉత్పత్తిని వాడుకునే శ్రమలూ - అనే తేడాలు ఎక్కడైనా ఉంటాయి. బానిసలు, వ్యవసాయం పనులు చేస్తే, ఉత్పత్తి సాధనాల ఖర్చు కన్నా అనేక వందల రెట్ల కొత్త ఉత్పత్తి తయారవుతుంది. ఆ కొత్త ఉత్పత్తిని, శ్రమల లెక్కలతో చూడగలిగితే, అందులో 'అదనపు శ్రమ' ఉంటుంది. లేదా, ఉత్పత్తుల లెక్కలో చూడగలిగితే, 'అదనపు ఉత్పత్తి' ఉంటుంది. కానీ అది, డబ్బుని పెంచినట్టుగా కనపడదు. ఆ బానిసలే, యజమాని ఇంటి పనులు చేస్తే, అక్కడ ఉత్పత్తుల వాడకాలే జరుగుతాయి. అక్కడ జరిగే వంటల్ని గానీ, ఇతర పనుల్ని గానీ, లెక్కలు కట్టగలిగితే, అక్కడ కూడా అదనపు

శ్రమలు దొరుకుతాయి. కానీ, ఆ శ్రమలు కూడా వాడకం అయిపోయేవే. అంటే, వ్యవసాయంలో ఉత్పత్తిని పెంచే శ్రమని ఉత్పాదక శ్రమ - అనీ, ఇంటి పనుల్లో ఉత్పత్తుల్ని వాడకం చేసే శ్రమని అనుత్పాదక శ్రమ - అనీ, అర్థాలు తీసుకుంటే, ఆ తేడాలు ఏ సమాజంలో అయినా ఉంటాయి. కానీ, పెట్టుబడిదారీ విధానంలో జరిగేది ఏమిటంటే, ప్రతీ చోటా, ప్రతీ విషయం, డబ్బు లెక్కల ద్వారా, ఖచ్చితమైన కొలతలతో కనపడతాయి. పెట్టుబడిదారుడి డబ్బుని పెంచేది, ఉత్పాదక శ్రమ. వాడి డబ్బుని ఖర్చు చేసేది, అనుత్పాదక శ్రమ. ఈ తేడాలు పెట్టుబడిదారుడికి కావలసినవే. శ్రామికులకు సంబంధించినవి కావు. కానీ, శ్రామికులకు కూడా ఈ తేడాల సంగతి స్పష్టంగా తెలిసి ఉండాలి. లేకపోతే, సమాజంలో సంబంధాలు ఎలా ఉన్నాయో అర్థం కావు.

"ఏది విన్నా కొత్త సంగతే. ఎప్పుడూ వినలేదు ఇవి. వినగానే తెలిసిపోయినట్టే ఉంటుంది. కాస్సేపటికే అంతా గందరగోళంగా అవుతుంది."

"మనకు తెలిసింది, ఇంకొళ్ళకి తెలిసే లాగ చెప్పగలిగితేనే మనకు తెలిసిందని అర్థం. ఒక్కసారి వినగానే అయిపోదు. మళ్ళీ మళ్ళీ చెప్పుకోవాలి. అలా చెప్పుకుంటేనే స్పష్టం అవుతుంది. మళ్ళీ మొదటి నించీ చెప్పుకుందామా? బార్టరు మారకాల దగ్గిరికి వెళ్దామా?"

"అయ్యయ్యో, అంత మొదటి నించీ వొద్దుగానీ..........."

"పోనీ, మీ అనుమానాలేమిటో మళ్ళీ చెప్పండి."

"ఏం లేదు గానీ, చిన్న అనుమానం. శ్రమ దోపిడీ అనేది, ఏ నాడో ప్రారంభమై పోయింది కదా? నిన్న మొన్న మార్క్సు గ్రహించే దాకా ఎవరూ గ్రహించలేదంటే, ఏంటోగా ఉంది, అంతే. చిన్న అనుమానం."

"చిన్నదా ఇది? ఏ నాటి నించో మిమ్మల్నందర్నీ పట్టుకున్న పెద్ద అనుమానం ఇది. అయితే, మార్క్సు కన్నా ముందే, శ్రమ దోపిడీ సంగతి ఎవరైనా చెప్పారా? అది చెప్పండి!"

"అమ్మో, మాకేం తెలుసు? ఎవరో చెప్పారని కాదు. ఎవరూ ఎందుకు చెప్పలేదా అని ఆశ్చర్యం!"

"ఏ సైన్సు విషయాన్ని అయినా మొదట ఎవరో ఒకరు కనిపెడతారు కదా? ఈ సంగతి మొదట మార్క్సు కనిపెట్టాడు. మార్క్సు కాక ఇంకెవరో కనిపెట్టి ఉంటే, ఆయన పేరే చెప్పుకునే వాళ్ళం. అందులో ఆశ్చర్యం ఏముంది? అసలు 'జీతం' పద్ధతి ప్రారంభమైందే, పెట్టుబడిదారీ విధానంలో. ఇక శ్రమ దోపిడీ సంగతిని అర్థం చేసుకోవాలంటే, 'జీతం' పద్ధతి, అది కూడా డబ్బుతో జీతం ఇచ్చే పద్ధతి ప్రారంభమైన తర్వాతే సాధ్యం అవ్వాలి గానీ, అంతకు ముందే సాధ్యం అవదు; సాధ్యం అయ్యే పరిస్థితులు ముందు ఏర్పడి ఉండాలి. అలా ఉంటే, 'భౌతిక పరిస్థితి' ఉన్నట్టు. ఇక ఆ తర్వాత, ఆ విషయం మీద ఎవరు కృషి చేస్తారో, ఎవరికి అంత తెలివీ పట్టుదలా ఉన్నాయో, వాళ్ళ వల్ల ఆ పని జరుగుతుంది."

"రికార్డో అనే ఆయన, 'సరుకుకి విలువ, దాని కోసం పట్టిన శ్రమ వల్లే' అని గ్రహించాడని చెప్పారు కదా? అంత తెలిసిన వాడికి, ఆ తర్వాత సంగతి కూడా తెలిసిపోవాలి కదా? ఆ విలువ లోనించి, పాత శ్రమ విలువని తీసేస్తే, మిగిలేది కొత్త శ్రమ విలువే' అవుతుంది కదా? నా బోటి వాడికే తెలిసిపోతోంటే, .............."

"మన బోటి వాళ్ళకి ఎలా తెలిసింది? మార్క్సు చెప్పి ఉంచాడు కాబట్టి తెలిసింది. లేకపోతే, మనకి అంత తేలిగ్గా పాత శ్రమా, కొత్త శ్రమా అని తెలుస్తాయా?"

"మార్క్సుకి అయితే తేలిగ్గానే తెలిసింది కదా? అదే సంగతి రికార్డోకి ఎందుకు తెలీలేదు - అంటున్నాను నేను."

"రికార్డో గురించి నేను చదివిన దాన్ని బట్టి, ఆయన ఆదాయం వడ్డీలే. గవర్న మెంటు బాండ్లు కొనడం, అమ్మడం, ఆ వ్యాపారం ఏదో చేసేవాడు. ఆ రకంగా వచ్చే ఆదాయాలు శ్రమ దోపిడీ అవుతాయని అప్పటికి ఆయనకి తెలీదు. తెలిస్తే అదంతా మానేసే వాడని నిర్ణయించలేం. ఇప్పుడు తెలిసిన వాళ్ళు మానేస్తున్నారా? కానీ, 'సరుకుకి విలువ శ్రమ వల్లే ఏర్పడుతుంది' అని తెలిశాక కూడా పాత అభిప్రాయాలనే సమర్థించాడు. అంటే, పెట్టుబడికి లాభం వచ్చి తీరాలని! 'లాభం రాకపోతే, పెట్టు బడి ఎవరు పెడతారు?' అని అప్పటి దాకా అందరూ నమ్ముతూ ఉన్న తప్పునే మళ్ళీ చెప్తే, దాన్నే సైన్సుగా చెప్తే, దాన్ని ఏమనాలి? అప్పటికి అదే గొప్ప తర్కంలాగ అందరికీ కనపడింది."

"సరిగ్గా నేను ఇప్పటికీ అదే అనుకుంటాను. 'లాభం రాకపోతే ఎవరైనా పెట్టుబడి ఎందుకు పెడతారు?' అనుకుంటాను. ఇప్పటికీ అదే అనుమానం నాకు."

"మీ అనుమానం 'లాభం' మీద కాదు, మార్క్సు మీద! మార్క్సు చెప్పే దాంట్లో ఏదో తప్పు ఉండి ఉంటుందని!"

"ఎంత నింద వేశారు నా మీద!" ★

## 41. పెట్టుబడి ఒకరు పెట్టాలా?

**84.** **నా కోపం, మార్క్సు మీదా? అస్సలు కాదండీ! నమ్మండి నన్ను! నా కోపం, అంతా 'లాభం' మీదే! నేను శ్రమ చేసి బతుకుతున్నవాణ్ణి. నా శ్రమ విలువ లోనించి చాలా భాగం యజమానికి పోవడం నాకు నచ్చుతుందా? నల్లపూసంత భాగం అయినా నాకు అందకుండా పోవడం నాకు నచ్చుతుందా? నచ్చదు. కానీ, నా సందేహం తీరకే ఇన్ని సార్లు అడుగుతున్నాను. అంతే.**

**జ:** ఏమిటి, మీ తీరని సందేహం?

"అడగడం నాకు తెలియడం లేదు. శ్రమ చేసే వాళ్ళకి, వాళ్ళ శ్రమ విలువ అంతా వాళ్ళకే అందాలంటారు. అవును, అలాగే జరగాలి. వాళ్ళది వాళ్ళకే రావాలి. పని స్థలంలో కొచ్చి పని చేసుకుని, వాళ్ళ శ్రమ విలువ వాళ్ళు తీసుకుని ఇంటికి పోవాలి. అలాగే, పెట్టుబడిదారుడు కూడా పని స్థలంలో కొచ్చి, తను కూడా ఒక పని

చేసి, తన శ్రమ భాగం తను తీసుకుని వెళ్ళిపోవాలి. అలా జరిగితే అందరికీ బాగానే ఉంటుంది గానీ, పెట్టుబడిదారుడి నెత్తి మీద ఉత్పత్తి సాధనాల్ని తెచ్చి పెట్టవలసిన బాధ్యత ఉంటుంది కదా? శ్రామికులకేం బాధ్యత ఉంటుంది? పని చేసి పోతాం. ఎంత హాయి అది! ఉత్పత్తి సాధనాల్ని పెట్టాల్సిన బాధ్యత లేదు. సరుకు అమ్ముడు పోయిందా లేదా చూసుకోవాల్సిన బాధ్యత లేదు. ఆ బాధ్యతలు పెట్టుబడిదారుడికి ఉన్నాయంటే, అవి అతనికి తలనొప్పులా కాదా? శ్రామికులకు లేని బాధ్యతలు పెట్టుబడిదారుడికి ఉన్నాయా లేవా? ఉత్పత్తి సాధనాల్ని ఒక సారి పెడితే అవి వెనక్కి వస్తాయి నిజమే. వస్తే రావచ్చు. అసలు ముందు వాటిని పెట్టే బెడద అతనికి ఎందుకు ఉండాలి? శ్రామికులైతే ఏ బెడదా లేకుండా పని స్థలంలో కొస్తారు. యజమాని అలా వస్తాడా? అతని మీద పెద్ద బాధ్యత ఉందా లేదా? యజమానికీ, శ్రామికుడికీ, ఆ తేడా ఉందా లేదా? ఉత్పత్తి సాధనాలు పెట్టకపోతే ఉత్పత్తులు తయారవుతాయా? బాధ్యతలు మోసేవాడూ, మొయ్యని వాడూ ఒకటే అవుతారా? ఆ రకంగా అతను వాదిస్తే, మనకేం జవాబు ఉంటుంది? అదే నా భయం ఎప్పుడూ."

"బాగా ఆలోచించారు,. మీరు ఆలోచించడం నిజమే గానీ, మీ కన్నా వంద రెట్లు బాగా ఆలోచించి మార్క్సు చెప్పిన జవాబు పూర్తిగా మర్చిపోయారు. లేకపోతే, అది మీకు గుర్తు ఉన్నా, అది మీకు పట్టలేదు. దాన్ని అర్థం చేసుకోవడం మీకు చేత కాలేదు. **'పెట్టుబడి అసలు ఒకరు పెట్టాలా?'** అని మార్క్సు అన్నాడు కదా? ఉత్పత్తి సాధనాల్ని పెట్టడం పెద్ద బాధ్యత అనీ, బెడద అనీ, మీ అభిప్రాయం అయితే, పెట్టుబడిదారుడు కూడా ఆ బాధ్యత పెట్టుకోవద్దు. ఆ బాధ్యతంతా అతన్ని పెట్టుకోమని మనం అనడం లేదు. పెట్టుకోవద్దనే అంటున్నాం. అతన్ని కూడా పని స్థలంలోకి ఖాళీ చేతులతో వచ్చి, పని చేసి వెళ్ళమంటున్నాం. భూమి, శ్రామికులదీ కాదు, భూస్వామిదీ కాదు. దాన్ని ఇచ్చే బాధ్యత ఎవరిదీ కాదు. అది సమిష్టి బాధ్యత. దాని మీద అందరూ పని చేస్తే అది పండుతుంది. అలాగే, పెట్టుబడి పెట్టే బాధ్యత కూడా పెట్టుబడిదారుడికి వద్దు. శ్రామిక తరాల వాళ్ళందరూ తయారుచేసి ఉంచిన ఉత్పత్తి సాధనాలు సిద్ధంగా ఉన్నాయి. అందరూ పని చేస్తే, కొత్త ఉత్పత్తి సాధనాలు అందరి వల్లా తయారవుతూ ఉంటాయి. ఇప్పుడు ఉన్న ఉత్పత్తి సాధనాలన్నీ శ్రామికుల అదనపు శ్రమ ద్వారా వచ్చినవే కదా? పెట్టుబడిదారుడు, వాటిని లాక్కుని పని స్థలంలో పెడితే, అది గొప్ప బాధ్యతా? ఆ బాధ్యత అతనికి వద్దు. సరుకుల్ని అమ్మే బాధ్యత అసలే వద్దు. అమ్మకాల పద్ధతే వద్దని కదా మార్క్సు చెప్పేది? పెట్టుబడిదారుల్నీ, భూస్వాముల్నీ, ఏ బాధ్యతలూ లేకుండా సుఖంగా ఉండమనండి! 'పెట్టుబడి ఒకరు పెట్టాలా?' అని మార్క్సు చెప్పింది, మీకు పట్టలేదంటే, మీ గ్రహింపు, రికార్డో గ్రహింపు దగ్గిర ఆగిపోయి ఉంది. పాత ఆర్థిక వేత్తలందరూ, 'పెట్టుబడికి లాభం రావలసిందే' అని, లాభం వేపు ఉన్నారు కదా?

ఆ పాత వాళ్ళందరి కన్నా ఎక్కువ విషయాలు కనిపెట్టిన రికార్డో కూడా 'లాభం వేపే' మొగ్గాడు. 'లాభం మీద ఆశతో' అని కాదు. ఆయన తర్కం ఎలా సాగిందంటే:

'పెట్టుబడికి లాభం రావడం సమాజంలో జరుగుతోంది కదా? ఎందుకు జరగుతోంది? సరైంది కాబట్టే జరుగుతోంది. లేకపోతే జరుగుతుందా? జరుగుతోంది కాబట్టి అది సరైందే' అనుకున్నాడు. అతని అవగాహన అలా సాగింది.

'జరుగుతున్నది సరైందే, సహజమైందే' అనే సూత్రం, ప్రకృతి విషయాలకే పూర్తిగా వర్తిస్తుంది. ఆ సూత్రాల ప్రకారం మనం నడవాల్సిందే. సమాజంలో విషయాలకైతే, ప్రతి చోటా అది పనికి రాదు. కొన్ని విషయాల్లో, 'జరుగుతున్నది సరైందే' కావచ్చు; అన్ని విషయాలకీ అలా ఉండదు. దోపిడీ సమాజాల్లో, తప్పులు జరగడాలే ఎక్కువ చోట్ల ఉంటాయి. కాబట్టి, సమాజంలో విషయాల్ని అర్థం చేసుకోవాలంటే, జరుగుతున్నది సరైందో కాదో ముందు పరిశీలించాలి. సరైందాన్ని నిలబెట్టుకోవాలి; సరి కాని దాన్ని మార్చుకోవాలి."

"సరైందో కాదో ఎలా తెలుస్తుంది?"

"తర్కంతో. ప్రశ్నలతో. ఆ ప్రశ్నలన్నీ రికార్డో కూడా వేసుకోవచ్చు. పెట్టుబడికి లాభం రావడం జరుగుతోంది కాబట్టి, దాన్ని చూసి, 'సరైంది కాబట్టే అలా జరుగుతోంది; పెట్టుబడి పెట్టకపోతే ఉద్యోగాలూ ఉండవు, ఉత్పత్తులూ ఉండవు. కాబట్టి పెట్టుబడికి లాభం రావలసిందే, అది జరగాలి కాబట్టి జరుగుతోంది' అని తేలిస్తే, అందులో కొత్తగా అర్థం చేసుకున్నది ఏముంది? పాత దాన్నే తిరిగి చెప్పడం అది. పాత దాన్ని పరిశీలించాడు గానీ, 'అది సరైందే' అని తేల్చాడు. ఆ రకంగా రికార్డో తర్కం, సమాజంలో జరుగుతున్నదాన్నే అనుసరిస్తూ వెళ్ళింది."

"మరి, మార్క్సు తర్కం ఎలా సాగింది?"

**అదే చూడాలి. మార్క్సు తర్కం ఎలా సాగిందో చూడండి:**

'అసలు పెట్టుబడి అంటే ఏమిటి? ఉత్పత్తి సాధనాలే కదా? అవి ఖర్చయిపోతే, వాటి విలువ వెనక్కి వచ్చి, ఆ విలువతో ఆ ఉత్పత్తి సాధనాలు మళ్ళీ తయారవుతాయి. అవి ఎన్ని సార్లు ఖర్చయినా మళ్ళీ మళ్ళీ వచ్చేస్తూ ఉంటాయి. వాటికి లాభం ఎందుకు రావాలి? అసలు, 'లాభం' అంటే ఏమిటి? - కొంత డబ్బు. 'డబ్బు' ఎక్కడి నించి వస్తుంది? సరుకు విలువే, డబ్బు. సరుకుని అమ్మేసి, సరుకు వెళ్ళిపోయి, డబ్బు వస్తుంది. ఆ డబ్బులో కొంత భాగమే లాభం. ఆ లాభం, ఉత్పత్తి సాధనాల కోసం కాదు, లాభాన్ని పెట్టుబడిదారుడే వాడతాడు. లాభం, సరుకుని తయారు చేసిన శ్రమలో నించే వస్తుంది. ఆ శ్రమలో, పాతా - కొత్త తేడాలు ఉన్నాయి. లాభం, ఏ శ్రమలో నించి వస్తుంది? - పాత శ్రమ లోనించి కాదు. ఉత్పత్తి సాధనాల భాగంలో నించి ఎవరూ ఏదీ వాడలేరు. దాన్ని వాడేస్తే పునరుత్పత్తే ఉండదు. మరి, లాభాన్ని ఏ శ్రమ లోనించి తియ్యాలి? కొత్త శ్రమలో నించే తియ్యాలి తప్ప, ఇంకో మార్గం లేదు. మరి, కొత్త శ్రమ లోనించి కొంత భాగాన్ని లాభంగా (అదనపు విలువగా) తీసేస్తే, శ్రామికులకు వెళ్ళవలసిన భాగం తగ్గిపోదూ? శ్రామికుల శ్రమ, యజమానికి ఎందుకు వెళ్ళాలి? ఏ మనిషి బతకాలన్నా స్వంత శ్రమతోనే బతకాలి. ఇంకొకరి శ్రమని లాక్కుని బతికితే అది, శ్రమని దోచడం అవదూ? పెట్టుబడిపెడితే, దాన్ని

వెనక్కి తీసుకో! 'లాభం' పేరుతో జరిగేది ఏమిటి? ఇంకొకరి శ్రమలో భాగాన్ని తీసుకునే హక్కు ఎలా ఉంటుంది? భూమి, సంగతి చూస్తే, అది ఎవరి శ్రమా కాదు. ఉత్పత్తి సాధనాలన్నీ శ్రామిక తరాల శ్రమ. అవన్నీ యజమానుల ఆస్తులు ఎలా అవుతాయి?' - ఇలా సాగింది మార్క్సు తర్కం. రికార్డో తర్కం కూడా ఇలాగే సాగవచ్చు. కానీ ఆయన, 'సమాజంలో ఏది జరుగుతోందో అదే సరైంది. సరైంది కాబట్టే జరుగుతోంది. సరైంది కాకపోతే, అది ఎందుకు జరుగుతుంది?' అనే పద్ధతిలో పోయాడు.

మార్క్సు అలా చెయ్యలేదు. సమాజంలో కనపడుతున్నది సరైందా కాదా అని పరిశీలించాడు. ఎలా ఉన్నదాన్ని అలాగే నమ్మాలనుకోలేదు. చివరికి **మార్క్సు గ్రహించింది ఏమిటంటే:** సరుకు తయారీకి, కౌలూ - వడ్డీ - లాభాలతో సంబంధం ఉండదు. శ్రామికుల శ్రమ విలువ లోనించి జీతాల భాగం వరకే వాళ్ళకి అంది, ఆపైన ఉన్న భాగం యజమానికి పోతోంది. శ్రమ చెయ్యకుండా బతికే మార్గం ఇది. ఈ శ్రమ దోపిడీ వల్లనే మానవులు, యజమానీ శ్రామికులుగా అవుతున్నారు. ఇలాంటి సంబంధాల వల్లనే కలిమి - లేములు ఏర్పడుతున్నాయి. యజమానులు, స్వంత శ్రమ లేకుండా దోపిడీ ద్వారా జీవిస్తున్నారు. ఈ దోపిడీ, బానిస యజమానుల కాలం నించీ ప్రారంభమై ఉంది. ఇదంతా శ్రామిక వర్గం గ్రహించాలి. ఏ నాటి నించో సాగుతోన్న ఈ దోపిడీ సంబంధాల్ని, దోపిడీ లేని సంబంధాలుగా మార్చుకోవాలి.' - ఇదీ మార్క్సు చెప్పింది. శ్రమ దోపిడీ అనేది అర్థమైతే, ఆ దుర్మార్గం సాగడం నిజమైతే, దాన్నించి బైటపడాలనడం మీద సందేహాలేమిటి? లాభం, ఎంత నీచమైన ఆదాయమో అర్థం చేసుకోకపోతే, ఇలాంటి అజ్ఞానం వెనక్కి తిరిగి ఎక్కడికి చేరుతుందంటే, 'బానిసత్వం మంచిదే, అది ఉండాల్సిందే' అనే దాకా పోయే స్తితి వస్తుంది."

"లేదు, లేదు, దాన్ని ఎలా ఒప్పుకుంటాం? దాన్ని ఒప్పుకుంటే మనల్నే బానిసల్ని చేస్తారు. దాన్ని రానిస్తామా?"

"బానిసత్వం ఎంత నీచమో, వేతన బానిసత్వం కూడా అంత నీచమే. ఒక మనిషి మీద ఇంకో మనిషి యజమానిగా ఉన్నాడంటే, శ్రామికులకు అసలు విషయం తెలియక అలా జరుగుతోంది. జీతాలు తీసుకునే బానిసత్వం ఫర్వాలేదనుకుంటున్నారా?"

"మార్క్సు ఏం చెప్పాడో అదే మీరు మాకు చెపుతున్నారు. అందులో ఒక్క మాటని కూడా మేం కాదనడం లేదు. ఇదంతా నా భయమే. బాధ ఉంది, కోపం ఉంది. అయినా, భయం కూడా ఉంది. శ్రమ దోపిడీ నించి బైట పడాలంటారు. ఎలాగ? మా వాడికి లాభం రాకపోతే, మొత్తం హోటలే మూసేస్తాడు కదా? మా పనులన్నీ పోతాయి. ఏ యజమాని దగ్గిరికి పోయినా ఇంతే కదా - అనిపిస్తోంది. అంతే, ఇదంతా, నా పిరికితనం."

"పిరికితనం కాదు, మతి లేనితనం. మీ యజమానితో సంబంధం పోవాలనేది, ఇవ్వాళే జరగాలంటున్నారా ఎవరైనా? అసలు సమాజం నడవాలంటే, పెట్టుబడి

పెట్టే వాళ్ళు అక్కరలేదనే సంగతి మొదట అర్థం చేసుకోవాలి. భూమి మన కాళ్ళ కిందే ఉంది. ఉత్పత్తి సాధనాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. అన్నీ శ్రామిక వర్గం చేసి ఉంచినవే. శ్రమలు చేసే వాళ్ళంతా సిద్ధంగా ఉన్నారు. లక్షల మంది పనులు పోయి, బికారులైపోయి, పనుల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. భూమిని దున్నడానికి భూస్వామి అనుమతి కావాలా? అసలు భూస్వామి కూడా ఒక నాగలో, ట్రాక్టరో పట్టుకుని, శ్రామికులతో కలిసి, భూమిని దున్నే పనిలోకి, లేదా ఇంకేదో పనిలోకి దిగాలి. పెట్టుబడిదారుడు కూడా శ్రామికులతో పాటే పనుల్లోకి డ్యూటీల ప్రకారం రావాలి. పెట్టుబడి ఎవరో పెట్టేది ఏమిటి? అందరూ పనులు చేస్తే, ఇంకా యజమానీ శ్రామిక సంబంధాలు ఎలా ఉంటాయి?"

"వినడానికి ఎంత తియ్యగా ఉన్నాయి ఈ మాటలు!"

"వినడానికా? వినడానికేనా? ఇదంతా ఇవ్వాళే జరగాలని ఎవ్వరూ చెప్పడం లేదుగానీ, ఇవ్వాళే చేస్తే తప్పేమిటి? రేపటి దాకా ఆలస్యం ఎందుకు? ఇంకా ఎన్ని వేల సంవత్సరాలు జరగాలి ఇదంతా? మార్క్సు ఉన్నప్పుడే జరగవలసింది ఇదంతా. ఆయన ఇచ్చిన జ్ఞానానికి కృతజ్ఞతగా, ఆయనకి ఆ మార్పుని చూపించవలసింది. శ్రామిక వర్గానికి అంత ఆత్మ గౌరవం తెలిస్తే, అంత చైతన్యం అర్థమైతే, దోపిడీదారుల ఆస్తి హక్కుల్నీ, వాళ్ళ ఆదాయాల్నీ రద్దు చేసే పని, ఇవ్వాళే చెయ్యవచ్చు! ఆలస్యం ఎందుకు? అసలు నిజం ఏమిటో తెలియక ముందు ఎవ్వరైనా పాత భావాలతోనే ఉంటారు. నిజం తెలిశాక నిజాన్ని బట్టే నడవాలి. దోపిడీ మీద బతికే వాళ్ళకి నిజం తెలిసినా దాన్ని ఒప్పుకోరు. నిజాన్నే నిజం కాదంటారు. దాని కోసం వాళ్ళ వాదం వాళ్ళు తయారు చేసుకుంటారు. మొత్తానికి మార్క్సు కృషి వల్లా, ఆయన గ్రహింపు వల్లా కదా అసలు నిజం బైటపడింది? ★

# 42. 'కార్మిక వర్గం' అంటే, ఏ యే బృందాలు?

**85.** **దేశంలో, మొత్తం జనంలో, 'కార్మిక వర్గం' అంటే, ఎవరెవర్ని కలపాలి? స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా శ్రమలు చేసే వాళ్ళే. రైతులు కూడా శ్రమలు చేసే వాళ్ళే. వాళ్ళందరూ కలిసే కదా శ్రామిక వర్గం? లేదా, కార్మిక వర్గం?**

**జ:** వాళ్ళందరూ శ్రమలు చేసే వాళ్ళే గానీ, 'శ్రామిక వర్గం' అంటే, యజమానీ శ్రామిక సంబంధాల్లో ఉండే వేతన శ్రామికులే. వాళ్ళు ఏ రంగంలో పని చేసే వాళ్ళయినా, వాళ్ళల్లో, శారీరక శ్రమలూ - మేధాశ్రమలూ, ఉత్పాదక శ్రమలూ - అనుత్పాదక శ్రమలూ, వ్యవసాయక శ్రమలూ - పారిశ్రామిక శ్రమలూ - ఇలా, ఎలాంటి తేడాలు ఉన్నా, వేతన కార్మికులందరూ కలిసినదే, కార్మిక వర్గం.

"ఎందుకూ? శ్రమలు చేసే వాళ్ళందర్నీ కలిపి 'కార్మిక వర్గం' అని ఎందుకు అనకూడదు?"

"ఎందుకు అనకూడదో తెలీడం లేదా? చేతి వృత్తులు చేసే స్వతంత్ర ఉత్పత్తిదారుల రకం ఏమిటో, రైతుల రకం ఏమిటో, వేతన కార్మికుల రకం ఏమిటో, ఆ తేడాలు తెలీడం లేదా? వేరు వేరు రకాల వాళ్ళని కలిపేస్తే, అందరూ ఒకే రకం అవుతారా? మనం కలిపేసినా, వాళ్ళు కలవరు. శ్రమలు చెయ్యడంలో గానీ, శ్రమ సంబంధాల్లో గానీ, మనం ఏ స్థితిలో ఉంటామో, ఆ స్థితిని బట్టే మన చైతన్యం ఉంటుంది. అంటే మన భావాలు ఉంటాయి. యజమాని పెత్తనం లేని స్వతంత్ర ఉత్పత్తిదారులూ, ఆ పెత్తనం కింద శ్రమని పోగొట్టుకుంటూ పని చేసే వేతన శ్రామికులూ, ఒకే స్థితిలో ఉంటారా? వాళ్ళ స్థితులు వేరు వేరు కదా? స్వతంత్ర ఉత్పత్తిదారులకు చిన్న చిన్న ఆస్తులు ఉంటాయి. వాళ్ళ అదనపు విలువలు ఎటూ పోవు కాబట్టి, ఇల్లూ వాకిలీ, కాసిన్ని ఉత్పత్తి సాధనాలూ, కాస్త డబ్బూ, అలా చేరతాయి. అయినా వాళ్ళు ధనికులై పోతూ ఉంటారని కాదు. వాళ్ళ శ్రమ లోనించి వాళ్ళ పోషణ ఖర్చు పోగా, మిగిలేది తక్కువ గానే ఉంటుంది. అయినా ఏదో చిన్న ఆస్తి ఏర్పడుతుంది. అలాగే, రైతులకు కూడా చిన్న సొంత పొలాలో, కౌలు పొలాలో, ఉంటాయి. స్వంత భూమి అయితే, అది పెరగాలనుకుంటారు. కౌలు భూమి అయితే, అది తమ స్వంతంగా మారాలనుకుంటారు.

స్వయంగా పని చేసే ఏ మనిషి అయినా, రోజూ బతికేది, ఆస్తి వల్ల కాదు, రోజూ చేసుకునే శ్రమ వల్లే. శ్రమ చేసుకోకపోతే, ఆస్తి వల్ల ఏ ఉత్పత్తీ రాదు. భూమి గానీ, ఉత్పత్తి సాధనాలు గానీ, అందుబాటులో ఉంటే, అవి తమ స్వంత ఆస్తి కాక పోయినా, స్వయంగా శ్రమ చేసుకునే మనుషులు సుఖంగా బతకడానికి ఏ అభ్యంతరమూ ఉండదు.

కానీ, స్వతంత్ర ఉత్పత్తిదారులకూ, రైతులకూ, 'స్వంత ఆస్తి దృష్టి' గట్టిగా ఉంటుంది. అది వాళ్ళ శ్రమలతో కూడిన ఆస్తే అయినా, 'ఆస్తి దృష్టి ఉండడం' అనేది, మనుషుల్ని సమిష్టిగా కలవనివ్వదు. అదే వేతన శ్రామికుల సంగతి అయితే, వాళ్ళు కాస్త జీతాలు పెరగాలనో, పని కాలం తగ్గాలనో, సెలవలు కావాలనో, అలా అనుకుంటారు గానీ, వాళ్ళు పని చేసే ఫ్యాక్టరీల్లో ఆస్తి అంతా తన స్వంతమే అయి పోవాలని ప్రతి కార్మికుడూ అనుకోడు. తను కూడా పెట్టుబడిదారుడి లాగా ఎదిగి పోవాలనీ, బిజినెస్‌లు చేసి లాభాలు సంపాదించాలనీ, ఏ కార్మికుడూ అనుకోడని కాదు. మేధాశ్రమల వాళ్ళల్లోనే ఆ ఆశలు కొన్ని ఉంటాయి. కానీ, సాధారణ కార్మికులందరూ అలా ఉండరు. సాధారణ కార్మికుల వెనకాల కూడా చిన్న చిన్న ఆస్తులు ఉంటే, వాళ్ళకి కూడా స్వంత ఆస్తి దృష్టి లేని కార్మిక చైతన్యం తొందరగా రాదు. ఇక, కాస్తో కూస్తో ఆస్తులు ఉండి, యజమానుల పెత్తనాలు లేకుండా స్వతంత్రంగా శ్రమలు చేసుకునే వాళ్ళూ, యజమానుల కింద ఉండే కార్మికులూ, ఒకే రకం ఎలా అవుతారు? వాళ్ళ సమస్యలు ఒకే రకంగా ఎలా ఉంటాయి? కానీ, శ్రమలు చేసే వాళ్ళల్లో ఎన్ని తేడాలు ఉన్నా, వాళ్ళు దోపిడీలతో బతికే వాళ్ళు కారు కాబట్టి, వాళ్ళకి కాస్త మానవుల మధ్య ఉండే శ్రమ సంబంధాల సంగతి తెలిస్తే,

స్వంత ఆస్తి ఆశ గొప్పదేమీ కాదని తెలిస్తే, ఎవ్వరైనా తప్పకుండా మారతారు. కానీ, ఈ దశలో మనం అర్థం చేసుకోవలిసింది ఏమిటంటే, అందరూ శ్రమలు చేసే వాళ్ళే అయినా, వాళ్ళ స్తితులు తేడాగా ఉంటాయి కాబట్టి, వాళ్ళు ఒకే వర్గం అవరు. అందర్నీ ఒకే రకంగా చూస్తే, ఎవరి సమస్యనీ అర్థం చేసుకోలేం. సమస్యల పరిష్కారాలూ అర్థం చేసుకోలేం. కాకపోతే, ఒకరితో ఒకరు సహకారంగా ఉండే విభాగాలు అవి. వాళ్ళు స్నేహితులే గానీ, శతృవులు కారు. అయినా వాళ్ళని ఒకే వర్గంగా అనుకోకూడదు. కానీ పెట్టుబడిదారుల విధానంలో, క్రమంగా స్వతంత్ర ఉత్పత్తిదారులూ, రైతులూ అందరూ, పెట్టుబడిదారీ సరుకులతో పోటీలు పడలేక వాళ్ళ స్తితులన్నీ మారి, వేతన శ్రామికులు గానే మారి, అందరూ ఒకే వర్గం అయిపోతారు. కానీ ఇప్పట్లో మాత్రం అందరూ ఒకే వర్గం కారు.''

''చాలా బాగుంది. ఇప్పుడు తెలిసింది. వేరు వేరు వాళ్ళు ఒకే రకం ఎలా అవుతారు? అయితే, పెట్టుబడిదారీ విధానం వల్ల, స్వతంత్రంగా బతికే వాళ్ళు కూడా, వాళ్ళ స్తితులు మారిపోయి, వేతన శ్రామికులై పోవడం మంచిదేనంటారా? వాళ్ళకి ఆస్తి దృష్టి పోతుందంటే, అది మంచిదే అనిపిస్తోంది నాకు. అంతేనా?''

''స్వంత ఆస్తి దృష్టి పోయేలాంటి మార్పు జరిగితే, అది నిజంగా మంచిదే. కానీ, ఒకప్పుడు చిన్న ఆస్తిపరులుగా ఉండి, తర్వాత కాలంలో జీతాల మీద బతికే వాళ్ళుగా మారితే, వాళ్ళకి ఆస్తి దృష్టి పోవడం దానికదే జరగదు. శ్రమ సంబంధాల గురించీ, శ్రమ దోపిడీ గురించీ, అలా ఎన్నో తెలుసుకుంటేనే అది పోతుంది. నిజానికి మనుషులు, ఎవరి ఆస్తితో వాళ్ళు విడి విడి పద్ధతిలో బతకడం కంటే, అందరూ శ్రమలు చేస్తూ, అందరూ వాటిని వాడుకుంటూ, సమిష్టి సంబంధాలతో బతకడమే అందరికీ రక్షణ. అందరికీ మంచిది. చిన్న చిన్న భూములతో రైతులు విడి విడిగా బతికితే, ఒకళ్ళ పొలం పండుతుంది, ఒకళ్ళ పొలం ఎండుతుంది. పొలం పండని వాళ్ళకి బికారితనం తప్పదు. అదే, పది మంది రైతులు, భూముల్ని కలుపుకుని, క్రమశిక్షణతో డ్యూటీల ప్రకారం పనులు చేసుకుంటూ బతికితే, ఏ పొలం పండక పోయినా, ఎవరికీ సమస్య ఉండదు. కష్టం అయినా, సుఖం అయినా, అందరిదీ ఒకటే అవుతుంది.''

''ఈ మాటలన్నీ ఎంత బాగున్నాయో! రైతులు ఇప్పుడు కూడా అలా ఎందుకు చేసుకోకూడదు? పది మందీ కలిసి నిర్ణయించుకుంటే, కలిసి ఆలోచించుకుంటే, ఆ సంతోషం వేరు. కష్టం వచ్చినా, అందరికీ వస్తుంది. పది మందితో చావు, పెళ్ళితో సమానం - అంటారు.'' ★

# 43. ప్రపంచంలో ఉన్న డబ్బు రాసి ఎవరెవరిది?

**86.** **ఒక విషయం చాలా వింతగా ఉంది. శ్రామికులు తయారు చేసిన ఉత్పత్తుల్ని అమ్మితేనే వాటికి డబ్బు వస్తుంది. ఆ శ్రామికుల శ్రమ, డబ్బుగా కనపడుతుంది.**

**అది నిజమే. దాన్ని కాదనటం ఎలాగ? తయారు చేసిన వస్తువుల్ని అమ్మకపోతే, అందులో ఏదీ డబ్బుగా మారదు. అదీ నిజమే. దాన్నీ కాదనలేం. మరి, ఈ రకంగా చూస్తే, అనుత్పాదక శ్రామికుల శ్రమ, డబ్బుగా కనపడదు. ఇంట్లో పనులు చేసే ఆడవాళ్ళ శ్రమలూ, డబ్బుగా కనపడవు. యజమానుల్లాంటి వాళ్ళు అసలు పనులే చెయ్యరు కాబట్టి వాళ్ళ వల్ల డబ్బు వచ్చేదేం ఉంటుంది? ఏమీ ఉండదు. అయితే, లోకంలో ఉన్న డబ్బు అనేది, ఉత్పాదక శ్రామికుల వల్ల వచ్చేదే అవుతుంది కదా? డబ్బు, అక్కడి నించి కాకపోతే ఇంకెలా వస్తుంది? డబ్బు ఎవ్వరి నించీ కనపడడం లేదే! ఇది నిజమేనా?**

**జ:** ఎంత సరిగా అర్థం చేసుకున్నారు! ఒక్కోసారి తెలివి తక్కువగా ఆలోచిస్తున్నారు గానీ, ఒక్కోసారి నమ్మలేనంత తెలివి చూపిస్తున్నారు! మీరు అర్థం చేసుకున్నది చాలా వరకు సరైనదే గానీ, చిన్న పొరపాటు ఉంది. స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా సరుకుల్ని తయారు చేసి అమ్ముతారు కదా? ఆ డబ్బు కూడా ఉండదూ? సమాజంలో ఉన్న డబ్బులో కొంత భాగం, అది చిన్నదో పెద్దదో, ఆ భాగం, ఆ ఉత్పత్తిదారుల శ్రమల వల్ల వచ్చేదే అవుతుంది కదా? అది గుర్తు రాలేదా?

"అయ్యో, అవును, అవును. అది మర్చిపోయా. కౌలు రైతులు కూడా కొన్ని సరుకుల్ని అమ్ముకుంటారుగా? అవీ డబ్బుగా మారతాయి. ఆ డబ్బు కూడా కలుస్తుంది. అంతేగా?"

"అంతే, నేను కూడా ఏదైనా మర్చిపోయానేమో అని గాభరాగా ఉంది. తయారైన ఉత్పత్తిని అమ్మితేనే డబ్బు వస్తుంది. మీ మాటలే మళ్ళీ చెప్పుకోవాలి. డబ్బు, ఎవరి శ్రమలకి సంబంధించిందిగా ఉంటుందో, ఉండదో, ఒక వరసలో చూద్దామా?

(1) ఇళ్ళల్లో, స్వంత మనుషులు చేసే పనులు, డబ్బుగా మారవు. ఇళ్ళల్లో గానీ, బైట గానీ ఉండే డబ్బు, ఇంటి వాళ్ళు చేసుకునే ఇంటి పనుల వల్ల వచ్చేది కాదు.

(2) ఇళ్ళల్లో, బైటి పని మనుషులు వచ్చి చేసే శ్రమలు, డబ్బుగా మారవు. వాళ్ళ జీతాల డబ్బు గానీ, బైటి డబ్బు గానీ, వాళ్ళ శ్రమలది కాదు.

(3) భూస్వాములూ, పెద్ద పెట్టుబడిదారులూ చేసే శ్రమలేవీ ఉండవు కాబట్టి, వాళ్ళ ద్వారా డబ్బు రావడానికి ఏమీ ఉండదు. వాళ్ళ చేతుల్లో జీతాలు ఉంటే, ఆ డబ్బు వాళ్ళ శ్రమలది కాదు. డబ్బు రావడంలో, వీళ్ళ పాత్ర ఏమీ ఉండదు.

(4) ప్రభుత్వం ఉచితంగా నడిపే సంస్థల్లో పని చేసే అనుత్పాదక శ్రామికుల శ్రమలు, డబ్బుగా మారవు కాబట్టి, వాళ్ళ చేతుల్లో జీతాల డబ్బు వాళ్ళ శ్రమలది కాదు.

(5) పోలీసులూ, సైనికులూ, శ్రమలు చేసినా, అవి డబ్బుగా మారవు. వాళ్ళ జీతాల డబ్బు, వాళ్ళ శ్రమలది కాదు.

(6) ప్రభుత్వంలో, మంత్రులూ, ప్రెసిడెంట్లూ వంటి వాళ్ళ వల్ల ఏ రకం శ్రమలూ జరగవు. వాళ్ళ మీటింగులూ, ఫైళ్ళ మీద సంతకాలు పెట్ట డాలూ, పార్లమెంట్లలో వాగుళ్ళూ, అలాంటివి శ్రమల కిందికి రావు. రాజు గారు, సింహాసనం మీద కూర్చుంటే, అది శ్రమ అవదు. శ్రమే లేని వాళ్ళ నించీ డబ్బు తయారయ్యేదేమీ ఉండదు. జీతాల పేరుతో వీళ్ళకి అందే కోట్ల కోట్ల డబ్బు, వీళ్ళ ద్వారా ఏర్పడేది కాదు.

ఇక, 'డబ్బు' అనేది, ఎవరి శ్రమల వల్ల వచ్చేదో చూడాలి.

(1) ఉత్పాదక శ్రామికుల శ్రమలే అమ్మకం లోకి వెళ్ళి, డబ్బుగా మారతాయి. ఆ డబ్బు లోనించి వాళ్ళ జీతాల భాగం, వాళ్ళ చేతుల్లోకి వెళ్తుంది. అదనపు విలువ భాగం, యజమానుల చేతుల్లోకి వెళ్ళి, అక్కణ్ణించి అది అనేక రకాలుగా పంపకాలవుతుంది. అంటే, ఉత్పాదక శ్రామికుల చేతుల్లో తిరిగే డబ్బు అయినా, యజమానులందరి చేతుల్లో ఉండే డబ్బు అయినా, అనుత్పాదక శ్రామికుల చేతుల్లో జీతాల డబ్బు అయినా, అదంతా, ఉత్పాదక శ్రామికుల శ్రమల వల్ల వచ్చేదే!

(2) స్వతంత్ర ఉత్పత్తిదారుల వల్ల వచ్చే డబ్బు కొంతా.

(3) కౌలు రైతుల వల్ల వచ్చే డబ్బు కొంతా.

(4) చిన్న పెట్టుబడిదారులు కూడా కొన్ని ఉత్పాదక శ్రమలు చేస్తారు కాబట్టి, ఆ డబ్బు కూడా కొంత. ఈ పెట్టుబడిదారుల దగ్గిర పని చేసే శ్రామికులు, శ్రామిక వర్గంలో భాగమే. ఈ శ్రామికుల్లో కూడా ఉత్పాదక - అనుత్పాదక తేడాలు ఉంటాయి.

ఈ రకంగా, సమాజం మొత్తంలో కనపడే డబ్బు నాలుగు మార్గాల్లో వస్తున్నది అయినా, అందులో అధిక భాగం, ఉత్పాదక కార్మికుల జీతాలూ, వారి అదనపు విలువా కలిసినదే. ఆ అదనపు విలువే, అనేక పేర్లతో సమాజం నిండా విస్తరించి ఉంటుంది! 'డబ్బు'ని మనం ఎక్కడ చూసినా, నిస్సందేహంగా, 'ఇది, ఉత్పాదక శ్రామికుల శ్రమ' అనుకోవచ్చు." మన చేతుల్లో డబ్బుని కూడా 'ఇది ఎలా వచ్చింది?' అని పరిశీలించుకోవాలి.

"ఎంత ఆశ్చర్యం ఇది! అయితే, ఆ అదనపు విలువ ఎంత ఉంటుందో ఎలా లెక్కకట్టగలం? దేశంలో ఉన్న మొత్తం డబ్బునంతా పోగేసి చూడాలా?" ★

# 44. పెట్టుబడిదారుల శ్రమ శక్తులకు జీతాలు! చూస్తారా?

**87. పెట్టుబడిదారులు తీసుకునే జీతాలు ఎలా ఉంటాయో ఇక్కడ ఒక వార్త చూస్తారా? ఒక విషయం గుర్తుంచుకోండి, ఈ జీతాలు కాకుండానే వాళ్ళకి వడ్డీలూ లాభాలూ**

**కోట్ల కోట్ల స్థాయిలో అందుతాయి. ఈ జీతాలూ - వడ్డీలూ - లాభాలూ కూడా కాకుండానే, బిజినెస్ మీటింగుల్లో హాజరైతే, కార్లో వచ్చి దిగి, సోఫాలో చేరబడిన కష్టానికి లక్షల అలవెన్సులు! ఆ అలవెన్సులు కూడా కాకుండానే, ఇంటి పని మనుషుల జీతాలూ - ఫోన్లూ - కార్ల పెట్రోళ్ళూ - విమాన ప్రయాణాలూ - ఇంకా మనకు తెలీనివి ఎన్నిటికో అయ్యే ఖర్చులన్నీ ఉచితం! ఆ ఖర్చులన్నీ కంపెనీయే పెడుతుంది. అయితే, మరి జీతాల్నీ, లాభాల్నీ, ఏం చేసుకుంటాడు పెట్టుబడి దారుడు? ఏం, దాచుకుంటాడు బ్యాంకుల్లో! దాచుకుంటే వడ్డీలు రావూ? వడ్డీని పెట్టుబడికి చేరిస్తే, పెట్టుబడి పెరగదూ? సరే, చదవండి! ఇందులో సంవత్సరం జీతాలు కపపడతాయి. దాన్ని బట్టి నెలకి ఎంత వస్తుందో చూడండి! జీతాలు టాప్‌గా వచ్చే వాళ్ళు 10 మంది ఈ వార్తలో కనపడతారు.**



## వేతనంలో నవీన్ జిందాల్ టాప్!

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన కంపెనీలకు సారథ్యం వహిస్తున్న టాప్ ఎగ్జిక్యూటివ్‌లు అందుకుంటున్న పారితోషికాల జాబితాలో నవీన్ జిందాల్ అగ్రస్థానంలో నిలిచారు. ఈయన గత ఆర్థిక సంవత్సరంలో (2011-12) అందుకున్న జీతం 73.42 కోట్ల రూపాయలు. ప్రస్తుతం నవీన్ జిందాల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అధికంగా జీతం అందుకుంటున్న వారి జాబితాలో వరుసగా రెండో ఏడాది కూడా ఈయనే అగ్రస్థానంలో నిలవడం విశేషం. జిందాల్ తరువాతి స్థానంలో సన్ టీవీ నెట్ వర్క్‌కు చెందిన కళానిధీ, కావేరి మారన్ (చెరి 57.01 కోట్ల రూపాయలు) ఉన్నారు. హీరో మోటోకార్ప్ అధినేత పవన్ ముంజాల్ 34.47 కోట్ల రూపాయలూ, బ్రిజ్‌మోహల్ లాల్ ముంజాల్ 34.44 కోట్ల రూపాయలూ, పారితోషికాల్ని అందుకుంటూ, అత్యధికంగా వేతనాలు అందుకుంటున్న ఐదుగురు అగ్రస్థాయి ఎగ్జిక్యూటివ్‌ల జాబితాలో నిలిచారు. అధికంగా వేతనాలు అందుకుంటున్న పది మంది ఎగ్జిక్యూటివ్‌ల మొత్తం పారితోషికం 387 కోట్ల రూపాయలుగా ఉంది.

➪ ఇది ఏడాదిలో 12 శాతానికి పైగా (43 కోట్ల రూపాయలు) పెరిగింది. పది మందిలో కళానిధి, కావేరి మారన్‌ల వేతనాలు మాత్రమే తగ్గాయి. టాప్ టెన్ ఎగ్జిక్యూటివ్‌లలో మద్రాస్ సిమెంట్స్‌కు చెందిన పిఆర్ఆర్ రాజా (29.34 కోట్ల రూపాయలు), మారుతి సుజుకీ చీఫ్ షింజో నకనిషి (28.14 కోట్ల రూపాయలు), బిజిఆర్ ఎనర్జీకి చెందిన బిజి రఘుపతి (25.98 కోట్ల రూపాయలు), టాటా మోటార్స్ మాజీ చీఫ్ కార్ల్ పీటర్ ఫోస్టర్ (23.97 కోట్ల రూపాయలు), దివీస్ లాబ్స్ సిఎండి మురళి కె దివి (23.15 కోట్ల రూపాయలు) ఉన్నారు. ఒకప్పుడు దేశంలో అధికంగా వేతనం అందుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ, టాప్ టెన్ ఎగ్జిక్యూటివ్‌ల జాబితాలో లేరు. 15 కోట్ల రూపాయల పారితోషికంతో ఈయన 15వ స్థానంలో ఉన్నారు. భారతి ఎయిర్‌టెల్ చీఫ్ సునీల్ మిట్టల్ (21.3 కోట్ల రూపాయలు), అమర రాజా బ్యాటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ జయ్‌దేవ్ గల్లా జీతం (17.23 కోట్ల రూపాయలు), ముకేష్ జీతం కన్నా అధికంగా ఉండటం విశేషం. (ఆంధ్రజ్యోతి, 24-9-2012)

సంవత్సరం జీతం 74 కోట్లు అయితే, నెలకి ఎంత? 6 కోట్లకి పైన! నెలకి జీతం 6 కోట్లండీ! ఈ పనివాడి కూలి, నెలకి 6 కోట్లు! రోజుకి జీతం ఎంత? - దీనికి కౌళ్ళూ - వడ్డీ లాభాల్ని కూడా కలిపితే? ఇదంతా ఈ పెట్టుబడిదారుడు చేసే శ్రమకా? - కాదు. కార్మికుల అజ్ఞానానికి బ్రహ్మాండమైన సాక్ష్యం ఇది! ఒక్కొక్కరి జీతాలు చూడండి! నెలకే కోట్లు కోట్లు! కిందటి ఏడాది కన్నా ఈ ఏడాది ఇంకా పెరగడం! కిందటి ఏడాది పేదతనంతో బాధపడిపోయి, ఎవర్ని అడిగి, ఈ జీతాలు పెంచుకున్నారో! నెలకి 6 కోట్ల జీతంతో, ఒక మానవుడు తిరుగుతున్నాడంటే, ఇదంతా, మానవ హక్కుల వాళ్ళకీ, సంస్కరణల సంఘాల వాళ్ళకీ, అవినీతి మీద కేకలు వేసే వాళ్ళకీ, సురాజ్యాలు తెచ్చే వాళ్ళకీ, - వీళ్ళందరికీ ఎంత ముచ్చటగా, ఎంత న్యాయంగా, ఎంత గౌరవంగా, కనపడుతుందో కదా? "పెట్టుబడిదారులు అంతంత జీతాలు తీసు కుంటే గానీ, వారి శ్రమ శక్తులకు గిట్టదు" అంటారు.

ఈ వార్త రాసిన జర్నలిస్టు, చాలా ఓపిగ్గా రాశాడు వార్తని. 'దివి మురళీ' అనే మనిషి తెలుగు ఉన్నతుడు కావచ్చు. అందుకే, మన తెలుగు వాడి పేరే మొదట పెట్టారు. ఈ జర్నలిస్టు, తన జీతం ఎంతో చెప్పవలసింది. అక్కడ నైట్ డ్యూటీలో, పత్రికని ప్రింటు చేసే, అర్ధ రాత్రుళ్ళు పత్రికల్ని రవాణా చేసే శ్రామికుల జీతాలు ఎలా ఉన్నాయో చెప్పవలసింది. మన కమ్యూనిస్టు పార్టీల వారు, పత్రికలు బాగానే నడుపుతారు గానీ, పెట్టుబడిదారుల జీతాల వేపూ. లాభాల వేపూ ఎప్పుడూ చూడరు. అక్కడికే పోయి, వాళ్ళనే యాచించి విరాళాలు పోగేసుకోవాలి కదా? అందుకే పెట్టుబడిదారుల జీతాల జోలికీ, లాభాల జోలికీ, పోరు.

అప్పుడే అయిపోలేదు. ఇంకో ముచ్చటైన వార్త ఉంది. అది, ఒక కంపెనీ 'లాభాన్ని' చూపిస్తుంది. అది కూడా చూడండి! చదవండి!


మళ్లీ 100 కోట్ల డాలర్లు

ఈ వార్తలో, లాభం సంగతి కనపడుతోంది. మొట్టమొదట్లోనే, కొంచెం పెద్ద అక్షరాలతో ఉన్న లైన్లు చూడండి! "ద్వితీయ త్రైమాసికంలో" అని ఉంది. అంటే, 3 నెలలకు ఒక సారి లెక్క చూస్తారు. మొదటి 3 నెలల లాభం లెక్క గతంలో అయింది. ఇది, 2వ 3 నెలల లాభం లెక్క. ఈ లాభం ఎంతో చూశారా? "లాభం 5,376 కోట్లు" అని ఉంది చూడండి! 3 నెలల లాభం ఇది. సంవత్సరం లాభం ఎంత ఉంటుందో చూడాలి కదా? దాన్ని 4తో గుణిస్తే, అది 4×5376 = 21,504 కోట్లు! అంటే, సంవత్సరానికి, ఆ కంపెనీకి అన్ని కోట్లు లాభం! ఇంకా వడ్డీలూ, కౌళ్ళూ, ఇందులో లేవు. కంపెనీకి వచ్చే లాభం లెక్క మాత్రమే అది! పెట్టుబడి దారులు చేసే శ్రమ ఫలితాలు ఇవి! కార్మిక మేధావులు ఏమైపోయారు? ఇవన్నీ చూస్తున్నారా? అసలు వాళ్ళు ఉన్నారా, పోయారా? ★

## 45. కులాల్నీ, వర్గాల్నీ సమానం చెయ్యకండి!

**88.** **చిన్న చిన్న రైతులు, పది కుటుంబాల వాళ్ళు తమ పొలాల్ని కలిపేసుకుని, అవి దూర దూరంగా ఉన్నా సరే, ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్ళి, అందరూ కలిసి వ్యవ సాయం ఎందుకు చేసుకోకూడదు? ఆడా మగా కలిసి పనులు చేసుకోవాలి. పంటలు వచ్చాక, ఎవరి పనిని బట్టి వాళ్ళకి ఆదాయం వస్తుంది. ఆ వివరాలన్నీ చక్కగా రాసుకోవాలి. మా అబ్బాయి అయితే బాగా రాస్తాడు. ఒక పొలం పండి, ఇంకో పొలం ఎండినా ఫర్వాలేదు. ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఎంత బాగుంటుంది అలాగైతే!**

**జ:** స్వంత భూములు ఉన్న రైతులు ఉన్నారా మరి? వాళ్ళ భూములు కౌలు భూములైతే?

"అవును, అదో గొడవ ఉంది. పోనీ, చిన్న చిన్న సొంత చేలు ఉన్న వాళ్ళే కలిసి చేసుకోవచ్చు."

"అయితే మీరు మీ ఉద్యోగం వదిలేసి, గ్రామాల్లోకి వెళ్ళండి! అక్కడ ఎవరికి ఎంతెంత భూములు ఉన్నాయో పరిశీలించి, పుస్తకంలో రాయండి. రైతులతో మాట్లాడి, వ్యవసాయం పనులు కలిసి చేసుకోమని చెప్పరాదూ? మీ నలుగురూ వెళ్ళండి రైతుల దగ్గిరికి."

"అమ్మో! మా మాట వింటారా వాళ్ళు? 'చాల్లెండి, మీ దారిన మీరు పొండి' అనరూ?"

"అన్నా సరే, అక్కడే, ఆ పొలాల్లోనే మీరూ పనులు చేస్తూ, వాళ్ళతో మాట్లాడుతూ ఉండండి. మీరు కీర్తి కోసం రాలేదనీ, నిజంగానే వారి మీద ప్రేమతో వచ్చారనీ, వాళ్ళకి నమ్మకం కలిగితే, మీరు చెప్పినట్టే వాళ్ళు ఆలోచిస్తారు. వెళ్తారా మరి? రేపే వెళ్తారా? ఆలస్యం ఎందుకు? మంచి పనికి ఆలస్యం ఉండకూడదు."

"అమ్మో, మాకు అప్పు ఉంది. అది తీర్చాలి ముందు."

"అప్పు ఎగ్గొట్టరాదూ? అది తీర్చాల్సిందేనా?"

"ఇదంతా తెలీనప్పుడు తీసుకున్నాము అది. తీరుస్తానని చెప్పాను. నిజాయితీగా ఉండాలన్నారు. నిజాయితీ తప్పమంటారా?"

"సరే, అప్పు తీర్చేశాక వెళ్తారా?"

"మా అబ్బాయి చదువు? అది పూర్తయి వాడొక పనిలో పడిపోతే అప్పుడు నేను ఎటన్నా పోవచ్చు. మర్చిపోయానండీ. నేనూ, మా ఆవిడా, కార్మిక వర్గమే అవుతాం గానీ, మా అబ్బాయి ఏ వర్గం అవుతాడు? అడగాలని మర్చిపోతున్నా."

"మీరే ఆలోచించండి. మీకే తెలుస్తుంది."

"తెలిసినట్టే ఉంది గానీ, తప్పేమో అని. మా కులమే మా పిల్లల కులం కదా? అలాగే, మా వర్గమే మా పిల్లల వర్గం అవదూ?"

"రెండూ నిజమే గానీ, రెంటినీ సమానం చెయ్యకండి! కులాల విషయంలో జరిగినట్టే, వర్గాల విషయంలో జరగదు. ఇప్పుడు కులాలు మారవు గానీ, వర్గాలు మారిపోవచ్చు. పిల్లల పోషణ ఏ డబ్బుతో జరుగుతుందో పిల్లలు ఆ వర్గమే అవుతారు. ఒక పేద ఇంటి పిల్లవాణ్ణి, ఒక పెట్టుబడిదారుడు తన పిల్లవాడిగా పెంచుకుంటే, ఆ పిల్లవాడు పెట్టుబడిదారీ వర్గమే అవుతాడు. పిల్లలు పెరిగే దాకా వాళ్ళ వర్గం, వాళ్ళ పోషణ ఎలా జరిగిందో దాన్ని బట్టి. పెద్దయ్యాక వాళ్ళు శ్రమ చేస్తారో, చెయ్యరో, అప్పుడు దాన్ని బట్టి. పిల్లల సంగతే కాదు. ఒక శ్రామికుడే చిన్న వడ్డీ వర్తకం ప్రారంభించి క్రమంగా పదేళ్ళలో కాస్త పెద్ద పెట్టుబడిదారుడు కావచ్చు. అంటే, అతని కులం మారదు గానీ, వర్గం మారిపోవచ్చు. రెండూ పోవాలి. పోవాలంటే, అవే పోవు. వాటిని మనం తీసెయ్యాలి. ఎలా తీసెయ్యాలో నేర్చుకోవాలి. ఇప్పుడు ఉన్న పెట్టుబడిదారులందరూ కులాల్ని నిలబెట్టుకుంటూ ఉన్న వాళ్ళే."

"మొన్న ఒక సంగతి అయ్యింది మా దగ్గిర. 'కుల వృత్తులు పోతున్నాయి, కుల వృత్తులు పోతున్నాయి' అన్నాడు ఒకతను. దాని మీదే కాస్సేపు మాట్లాడుకున్నాం. 'కుల వృత్తులు పోగానే ఫ్యాక్టరీల్లో పనులు దొరికితే కులవృత్తులు పోతేనే చాలా మంచిది' అన్నాను. 'ఎవరి వృత్తులు వాళ్ళు చేసుకుంటూ కూర్చుంటే, కులాలు ఎప్పటికైనా పోతాయా?' అన్నాను. 'అది నిజమే గానీ ఇప్పుడు ఫ్యాక్టరీ వాళ్ళు పిల్చి ఉద్యోగాలు ఇస్తున్నారా? పాత బతుకుదెరువులు పోతే ఎలాగ?' అన్నారు వాళ్ళు. 'ఏమో, కులాలు పోవాలంటారు, కుల వృత్తులు పోకూడదంటారు. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే, ఎలాగర్రా?' అన్నాను. వాళ్ళకీ తెలీదు, నాకూ తెలీదు. ఏదో అలా మాట్లాడుకున్నాం కాస్సేపు."

"మీరు బాగా మారిపోతున్నారు. ఆశ్చర్యంగా ఉంది నాకు!"

"అన్నట్టు, మార్క్సు చెప్పాడంటారా, మన కులాల గోల గురించి? ఆయనకేం తెలుస్తుందిలెండి, ఈ దేశపు మనిషి కాడు గదా?"

"అయ్యో, మార్క్సు చాలా దేశాల సమస్యల్ని ప్రస్తావించాడు. 'కులాల' గురించి ప్రత్యేకంగా ఒక పుస్తకం రాయలేదు గానీ, తన రచనల్లోనే అక్కడక్కడా చెప్పాడు."

"నిజంగానా? ఏం చెప్పాడు? ఏం చెప్పాడు?"

"ప్రారంభంలో ఏర్పడిన మొరటు శ్రమ విభజనే ఈ దేశంలో కులాల పద్ధతిలో గట్టి పడ్డట్టుగా చెప్పాడు. అసలు, 'అదనపు విలువ' గురించీ, 'అసమాన శ్రమ విభజన' గురించీ, 'దోపిడీ శ్రమ సంబంధాల' గురించీ తెలిస్తే, ఇతర సమస్యలన్నిటినీ మనం అర్థం చేసుకోగలం. పరిష్కారాలూ పట్టుకోగలం. మానవజాతి పుట్టుకొచ్చిన ఆదిమ కాలాల్లోనే కులాలు ఉండవు కదా? అలాగే, ఆస్తులూ, యజమానితనాలూ, ఆడవాళ్ళ మీద మగాళ్ళ పెత్తనాలూ, ఇలాంటివేవీ ఉండవు కదా? అవన్నీ, క్రమ క్రమంగా, దోపిడీ సంబంధాల్లోనే ఏర్పడి ఉంటాయి. కులాలు ఎలా పోవాలో మనం అర్థం చేసుకోవచ్చు. అడుగు కులాల్లో నూటికి 99 మంది శారీరక శ్రమలోనే కదా? ఈ శ్రమ విభజన మారకపోతే, ఈ పరిస్తితులన్నీ ఎప్పట్లాగే ఉండిపోవూ?"

"ఏమో, తెలీడం లేదు గానీ, మనుషులు బట్టలు కట్టుకోకుండా తిరిగే కాలం లోనే కులాలు ఎలా ఉంటాయి లెండి. బట్టలు ఉతికేది ఒక కులం. క్షవరాలు చేసేది ఒక కులం. ఇలా ఉన్నాయంటే, చేసే పనుల్ని బట్టే అవన్నీ ఏర్పడ్డట్టే అనుకో వచ్చు. అయితే, ఈ రక రకాల పనులు అన్ని దేశాల్లోనూ ఉంటాయి. కులాలు ఇక్కడే ఎలా పుట్టుకొచ్చాయో మరి! అదే కదా మనకు కావలసింది?"

"ఇంకా మాట్లాడుకోవాలి మనం."

"ఇన్ని మాట్లాడుకోవాలంటే జీవితాలు చాలతాయా? అన్నట్టు మా యజమాని కొడుకు డాక్టరు పని చేస్తాడు. అదేదో పెద్దాసుపత్రిలో. జీతం మీదే చేస్తాడు. అది తెలుసు నాకు. అతను ఉత్పాదకుడో, అనుత్పాదకుడో తెలీదు గానీ, అతను శ్రామి కుడే అవ్వాలిగా? పెట్టుబడిదారుడి కొడుకు, శ్రామికుడెలా అవుతాడు?"

"అతను, యజమాని కింద పని చేస్తూ ఉంటే, శ్రామికుడే అవుతాడు. మేధాశ్రమ చేసే శ్రామికుడు. కుటుంబ సంబంధాల్ని బట్టి చూస్తే, పెట్టుబడిదారీ వర్గం వాడే. అసలు మేధాశ్రమల వాళ్ళందరూ దాదాపు యజమానుల ఆలోచనా విధానం తోనే ఉంటారు. నిజాయితీగా చెప్పుకోవాలంటే, వాళ్ళే కాదు, శారీరక శ్రమల వాళ్ళు మాత్రం? 'వడ్డీ లాభాలు తప్పు' అని ఆలోచించే వాళ్ళు, నిరుపేద శ్రామికుల్లో మాత్రం ఉంటారా? శ్రామికుల భావాల గురించి మార్క్సు ఏమంటాడో తెలుసా? **'పాలించే వర్గ భావాలే ప్రజల భావాలు'** అంటాడు. అందులో, చదువులు ఉన్న వాళ్ళా, లేని వాళ్ళా అనే తేడాయే లేదు."

"ఏదైనా తెలిస్తే, చదువులున్న వాళ్ళకే తెలియాలి. లేని వాళ్ళకెలా తెలుస్తుంది? వాళ్ళూ వీళ్ళూ ఒకటే అయితే, మరి చదువులెందుకు? చదువులున్న వాళ్ళు మంచి మంచి పుస్తకాలు చదువుకుని ఏది మంచో ఏది చెడ్డో తెలుసుకోవాలి కదా?"

"తెలుసుకుంటారు. తెలుసుకోరని కాదు. మీకు చదువు వచ్చు. టెన్త్ వరకూ చదివారు. కథలూ, నవలలూ వంటివన్నీ చదువుకోవాలి. అటువంటి సాహిత్యం తెలియకపోతే, మనుషులు దేనికీ స్పందించలేని వాళ్ళుగా, మొరటుగా అయిపోతారు. బానిసలు ఎలాంటి జీవితాలు గడిపారో చెప్పే కథలు ఉన్నాయి. 'స్పార్టకస్' అనీ, 'టామ్ మామ ఇల్లు' అనీ, మంచి పుస్తకాలు ఉన్నాయి. పట్టుకుంటే వదలలేరు. ఇలాంటి పుస్తకాలు ఇప్పటి దాకా మీకు అలవాటు లేకపోయినా, ఇప్పుడు మొదలు పెట్టండి! ఇవ్వాళే మొదలు పెట్టండి! ఒక పని చెయ్యాలంటే, అది చెయ్యకుండా నిద్రపోకూడదు. అంత ఆతృత ఉండాలి. ఒక పుస్తకం ఇవ్వనా?"

"ఎందుకు? అది బజార్లో దొరకదా? కొనేసుకుంటే, నేను చదివాక, మా అబ్బాయి చదువుతాడు. హోటెల్లో మా వాళ్ళందరికీ చూపిస్తాను."

"అవును, వాళ్ళందరూ చదివేలాగ చూడండి. ఒకప్పుడు బానిసలు ఎలా బతికారో తెలుస్తుంది. చాలా ఆధారాలతో రాసిన పుస్తకాలు అవి. మీ అబ్బాయి చదువుకుంటున్నాడా? ఎంత వయసువాడు?"

"పదహారేళ్ళుంటాయి. ఏదో చదువుతున్నాడు కాలేజీలో. అందుకే అప్పయింది మాకు."

"సినిమాలవీ బాగా చూస్తాడా? సిగరెట్లవీ కాలుస్తాడా?"

"అబ్బే, సిగరెట్లు అస్సలు లేదండీ. సినిమాలకి అప్పుడప్పుడూ పోతాడు. సిగరెట్లు కాల్చే వాళ్ళంటే ఒప్పుకోడు. పుస్తకాలవీ చదువుతాడు. ఎప్పుడో చదివాడంట. చుట్టలవీ కాలిస్తే, కాల్చిన వాళ్ళే కాక, ఆ చుట్టూ వాళ్ళు కూడా చస్తారంటాడు. ఆ మధ్య ఒక సారి మా ఇంటికి ఒక చుట్టపాయన వస్తే భలే గొడవైంది. ఆ మనిషి వచ్చి కూర్చోగానే బీడీ తీసి అంటించేసుకున్నాడు. మా వాడు తెల్లబోయాడు. నేను కంగారు పడ్డాను. మా వాడు గట్టిగా చెప్పేశాడు, 'బైటికి వెళ్ళి అక్కడే నించుని అది అయ్యాకే రండి' అన్నాడు. వీడు బాగా చదువుకుంటాడనీ, బుద్ధిగా ఉంటాడనీ, మా వాళ్ళందరికీ

తెలుసు. వీడు అలా అనగానే పాపం ఇంటికొచ్చి కూర్చున్న పెద్ద మనిషి బైటికెళ్ళి పోయి అరగంటకి గానీ లోపలికి రాలేదు. నేనే వెళ్ళి ఆ చుట్టం దగ్గిర నిలబడ్డాను.''

''అంత గట్టివాడా మీ అబ్బాయి?''

''వాడి మాటలకి నాకే కంగారై పోతుంది చాలా సార్లు. టీచరు ఉద్యోగం చేస్తానంటాడు. చదువు చెప్పడం ఇష్టం అంట! ఎప్పుడన్నా సెలవుల్లో ఇరుగు పొరుగు పిల్లల్ని కూర్చోబెట్టి చదువు చెపుతాడు. వాళ్ళతో చదివిస్తాడు, రాయిస్తాడు. ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే కనపడతాడు. ఒక సారి అన్నాడు, 'టీచరు ఉద్యోగం రాకపోతే, ఆటో నడుపుకుంటాను' అన్నాడు. మరి ఏం చేస్తాడో వాడి ఇష్టం. బాగానే ఆలోచించుకుంటాడు.''

''ఏ పని అయినా చేసుకోవాలి, చేసుకోవచ్చు. కానీ అది 'వ్యాపారంగా' చెయ్యకూడదు. తను ఆటో నడుపుకుంటూనే, ఇంకో ఆటో కొని, దాన్ని అద్దెకి ఇస్తే, దాని వల్ల కూడా అదనపు విలువని లాగడం ఉంటుంది.''

''అమ్మో, అలాగైతే అలా చెయ్యనివ్వను. ఇంటికి పోయాక నాకు గుర్తున్నంత వరకూ ఈ సంగతులన్నీ మా ఆవిడికీ, మా వాడికీ చెపుతూనే ఉంటాను. వాడు అలా దోపిడీలు చేస్తాడనుకోను. చేస్తే, నా దగ్గిరికే రావొద్దంటాను. తన కష్టంతో తను బతకాలి గానీ, దోపిడీ కూడా చేసి బతకాలా? ఛీ! అలా చెయ్యడు. చేస్తే వాడితో సంబంధమే ఉండదు నాకు. అప్పుడే వదిలేస్తాను.''

''ఎంత మంచి హృదయం మీది! చాలా మంచి మనిషి మీరు! చాలా మంచి కార్మికుడు! చాలా మంచి తండ్రి! పిల్లవాణ్ణి దారి తప్పనివ్వకండి!''

''నన్ను అంత మంచివాణ్ణి అనకండి! నాకేం తెలుసు అసలు? ఈ మధ్య మీరు చెప్పేవి వింటూ ఉంటే, నేనేమీ చెయ్యకుండా బతికేస్తున్నానని అనిపిస్తోంది. ఒక్క మాట! గుర్తొచ్చింది. మొన్న ఆదివారం రాత్రి ఇంటికి వెళ్ళేటప్పటికి, మా గదిలో మంచం కింద, పచ్చగా మిల మిల లాడుతూ ఒక ఇత్తడి బింది కనపడింది...''

''మంచం కిందా? బిందెలు అక్కడ పెడతారా?''

''అబ్బే! ఎప్పుడూ అక్కడ ఉంటే నాకు ఆశ్చర్యం ఎందుకు? ఇదేంటని మా ఆవిణ్ణి అడిగాను. ఆవిడ సిగ్గుపడిపోతూ ఒక గొప్ప పని చేసినట్టు చెప్పింది. ఆ బిందిని తాకట్టు పట్టింది. ఆ పక్క ఉన్న పాక వాళ్ళు, డబ్బుకోసం ఈమె దగ్గిరికి ఆ బింది తెచ్చారు చీకట్నే. అప్పుడు నాకు తెలీదు. మా ఆవిడ డబ్బు ఇచ్చేసి ఆ బిందిని తీసుకుని ఆ తర్వాత అలా మంచం కింద పెట్టింది. దాన్ని నేను చూడగానే, అడిగితే అంతా చెప్పింది. నాకు కోపం వచ్చింది. 'ఇదేం పని' అని బాగా కసిరాను. 'వాళ్ళకి అవసరం అయితే డబ్బు ఇస్తే ఇయ్యి, దాని మీద వడ్డీ కావాలా? మనం వడ్డీలు కట్టడానికి ఎంత బాధ పడుతున్నాం? వాళ్ళు బాధ పడరా?' అని బాగా అని, ఆ బిందిని బైటికి లాగి వాళ్ళకి ఇచ్చేసి రమ్మన్నాను. నవ్వింది, సిగ్గు పడింది. 'రేపు ఇచ్చేస్తాలే' అంది. 'అలా కాదు, అది ఇక్కడ ఉంటే నాకు నిద్ర పట్టదు' అని దాన్ని చేత్తో పట్టుకున్నాను. తనూ నా వెంట నడిచింది. 'ఇంకెప్పుడూ

చెయ్యన్లే' అంది. బిందిని చూపిస్తే, పాక వాళ్ళు తెల్లబోయారు. 'మీ వస్తువు మీరు వాడుకోండి. డబ్బు దొరికినప్పుడు మాది మాకు ఇచ్చెయ్యండి' అనేసి రాబోతోంటే వాళ్ళు గబ గబా ఒక మూతలో చిన్న రొట్టి ముక్క పెట్టారు. దాన్ని చేత్తో తీసుకుని, 'మా అబ్బాయికి ఇస్తాలే' అని చెప్పి వచ్చేశాం. వచ్చేస్తోంటే మా ఆవిడ, 'అవును, నేను తప్పు చేశాను. మా యజమానురాలు బంగారం నగలు తాకట్టు పడుతుంది. అదే చేశాను, పిచ్చిదాన్ని' అంది. అప్పుడు నేను, 'మార్క్సు ఏమన్నాడో తెలుసా? పాలించే వర్గ భావాలే ప్రజల భావాలు - అన్నాడు' అని, ఆయన పుస్తకం నేనే చదివినట్టు చెప్పేశాను. ఇది వరకు మేం ఎప్పుడూ అంత మంచి మాటలు మాట్లాడుకోలేదు. ఇప్పుడైతే అప్పుడప్పుడూ ఈ మాటలే వస్తున్నాయి. మా ఆవిడికి చదువు కొంచెం వచ్చు గానీ, బాగా చదవలేదు. మా అబ్బాయికి ఒక సారి గట్టిగా చెపుతాను, అమ్మకి బాగా చెప్పమని."

"అందుకే అన్నాను మిమ్మల్ని, మంచి కార్మికుడని. మంచి తండ్రే కాదు, మంచి భర్త కూడా మీరు. మంచి భర్తే మంచి తండ్రి అవుతాడు."

"అవన్నీ సరేగానీ, మార్క్సుకి మంచి శిష్యులం అవ్వాలని ఉంది మాకు!" ★

## 46. మంచి పనిముట్లు వస్తే, శ్రామికుల కొంప మునగాలా!

**89.** **బానిస సమాజం అన్నిటి కన్నా క్రూరమైందని వేరే చెప్పుకోనక్కర లేదు. ఒక మనిషి, ఇంకో మనిషి ఆస్తా! అది తమ హక్కులాగ యజమానులు మాట్లాడతారా! ఆ యజమానుల్ని నరకొద్దా? సరే, ఆ దరిద్రం వదిలింది. కౌలు రైతుల బతుకు కష్టమే గానీ, అందులో కొన్ని మెరుగులున్నాయి. ఆ చేలోనే పాక వేసుకోవచ్చు. గేదెని పెంచుకుని కాస్త పాలు తాగొచ్చు. కోళ్ళని పెంచుకుని గుడ్లు తినొచ్చు. కూర గాయలు పండించుకోవచ్చు. 'కౌలు' చెల్లించే పీడలోనే కొన్ని సంతోషాలుంటాయి. మరి, పెట్టుబడిదారీ విధానాన్ని అంతకన్నా మెరుగేలే అనుకోవాలా? ఉద్యోగాలు ఊడకుండా ఉంటే, ఇది దాని కన్నా మంచిదేగా? కొన్ని గంటలు పని చేసేసి ఇంటికి రావచ్చు. నెలకోసారి ఖచ్చితంగా జీతం అందుతుంది. మధ్యలో సెలవులుం టాయి. పని చేసి బైటపడితే చాలు, కౌళ్ళు చెల్లించాలనే బెడద ఉండదు. పాత కాలం కన్నా ఇది బాగానే ఉందనుకోవాలి. కానీ, మొన్న మా బంధువుల్లో ఇద్దరికి పనులు పోయాయి. ఈ మాట రోజూ ఎవళ్ళో ఒకళ్ళు అంటూనే ఉన్నారు. అసలు ఇప్పుడు తొందరగా పని దొరకదు. దొరికినా అది నిలబడదు. సంక్షోభాలంటారు. పెద్ద యుద్ధాలంటారు. రేపొద్దున మనం తెచ్చుకునే మంచి సమాజం అయితే, పనులు తొందరగా దొరుకుతాయా? ఆ పనులు ఇక పోకుండా ఉంటాయా? అది చెప్పండి కొంచెం.**

**జ:** అవును, ఈ సంగతులన్నీ చెప్పుకోవాలి. దోపిడీ సమాజంలో జరిగేవే, మనం

నిర్మించుకునే మంచి సమాజంలో కూడా జరిగితే, ఇక అది ఎందుకు? మనం, దోపిడీని సాగనివ్వని సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుంటూ, సమస్యల్ని ఎలా పరిష్కరించుకోగలమో అలా చేసుకోవాలి. మంచి సమాజంలో అందరికీ పనులు దొరుకుతాయా - అన్నారు. అసలు మన సిద్ధాంతం ఏమిటి? ప్రతి మనిషీ పని చేసి తీరాలి. పని చెయ్యకుండా బతకాలంటే, అది ఇతరుల శ్రమ మీద బతకడమే అవుతుంది కదా? కాబట్టి, పని చెయ్యకుండా తిరగాలంటే కుదరదు. పని ఇవ్వమని, అంటే ఉద్యోగం ఇవ్వమని, సమాజాన్ని అడిగే హక్కు ప్రతి మనిషికీ ఉంటుంది; ప్రతి మనిషికీ పని చూపించవలసిన బాధ్యత సమాజానికి ఉంటుంది. పనులు చెయ్యడం కూడా ఎప్పుడో పాతికేళ్ళు వచ్చాక కాదు. చిన్నతనంలో, చదువుకుంటూ ఉన్న కాలంలోనే, తొమ్మిది పదేళ్ళ వయసు నించే, రోజుకి, 1, 2 గంటలు, రక రకాల చేతి పనులేవో మొదలు పెట్టాలి. శ్రమల గురించీ, శ్రమ సంబంధాల గురించీ, పిల్లలకి పాఠాలు ఉంటాయి. చదువులు పూర్తి అయ్యాక వాళ్ళు పూర్తి ఉద్యోగులు అవుతారు. వృద్ధాప్యాల వరకూ వాళ్ళు ఆరోగ్యంగా చెయ్యగలిగినంత కాలం, ఆ ఉద్యోగాలు అలా సాగుతూనే ఉంటాయి.

''అదే, అదే పెద్ద సందేహం. పెట్టుబడిదారీ సమాజంలో ఉద్యోగాలు ఎందుకు పోతున్నాయి? కొత్త సమాజంలో ఎందుకు నిలబడతాయి? అదే కావాలి.''

''ఈ సమాజంలో నిరుద్యోగాలూ, సంక్షోభాలూ, ఎందుకు ఉంటాయో చెప్పుకోలేదా మనం? అయ్యో, ఒక వరసా వాయీ లేకుండా చెప్పుకుంటున్నట్టున్నాం.''

''ఎప్పుడో కొంచెం చెప్పినట్టున్నారు. మళ్ళీ మళ్ళీ చెప్పుకోకపోతే అదేం గుర్తు?''

''పోనీ ఇప్పుడు చెప్పుకుందాం. పెట్టుబడిదారీ విధానం కూడా దోపిడీ విధానమే గానీ, దీనికీ, పాత వాటికీ, పెద్ద తేడా ఉంది. దీని కొత్త లక్షణం సరుకుల్ని అమ్ముకోవడంలో పోటీ! వెనకటి యజమానులు కూడా అదనపు ఉత్పత్తులతోటీ, అదనపు శ్రమలతోటీ బతికిన వాళ్ళే అయినా, అప్పుడు సరుకుల ఉత్పత్తులూ, వాటి అమ్మకాలూ లేవు కాబట్టి, అప్పుడు ఇప్పటి రకం పోటీలు లేవు. ఇప్పుడు పోటీలు ఎందుకు? ఎక్కువెక్కువ లాభాల కోసం! 'లాభం' అన్నప్పుడల్లా 'అదనపు విలువ' అన్న అర్ధమే తీసుకోవాలి. ఉదాహరణలు చిన్న సంఖ్యలతో పెట్టుకుంటే, చెప్పుకునే విషయం తేలిగ్గా అర్ధమవుతుంది. సమాజంలో రోజూ 100 సబ్బులు మాత్రమే అమ్ముడవుతాయనుకుందాం. సమాజంలో జనానికి నిజంగా అవసరం అయితే వెయ్యి సబ్బులతో ఉండొచ్చు. కొనగలిగే వాళ్ళు వంద మందే. సబ్బులు కొనలేని వాళ్ళు ఏ మట్టితోనో, మశానంతోనో, తోమేసుకుంటారు. పెట్టుబడిదారులు తయారు చేయించే కల్తీ మోసపు సబ్బుల కన్నా ఆ మట్టే మంచిది లెండి. అటు తిరిగామంటే దారి తప్పిపోతాం. సరుకుల సంగతే చెప్పుకోవాలి. అమ్ముడు పోయేవి మాత్రం 100 సబ్బులే. ఆ 100 సబ్బుల్ని తయారు చేయించే పెట్టుబడిదారులు, నలుగురు - అనుకుందాం. ఒక్కొక్కరూ పాతికో, ఇరవయ్యో, కాస్త ఇటూ అటూగా, అమ్ముతూ

ఉంటారు. అయితే, వాళ్ళల్లో ప్రతీ వాడికీ ఎలా ఉంటుందంటే, తన సరుకే చాలా ఎక్కువగా అమ్ముడు పోవాలని. ఎక్కువగా అంటే 100 సబ్బుల్ని దాటి కాదు. ఆ 100లోనే, 80 వరకో, 90 వరకో తనే అమ్మగలిగితే, తను అంత సరుకు తయారు చేయించి అమ్మేస్తూ ఉంటే, ఎంత లాభం! ప్రతీ సరుకు ధరలోనూ లాభం ఉంటుంది. ఎక్కువ సరుకుని అమ్మితే, ఎక్కువ లాభం! అంటే, ఎక్కువ లాభం రావాలంటే, ఇతర్ల కన్నా ఎక్కువ సరుకుని అమ్మాలి. అలా అమ్మాలంటే, ఇతర్ల సరుకుల ధరల కన్నా తన సరుకు ధర కొంచెం తగ్గాలి. ధర తగ్గాలంటే, తక్కువ కాలంలో ఎక్కువ సరుకు తయారయ్యే లాగ, ఆ మార్పులేవో చెయ్యాలి. (దీని అర్థం, సరుకుకి పట్టే శ్రమ కాలం తగ్గడమే. శ్రమ కాలం తగ్గితేనే ధర తగ్గుతుంది. ఈ శ్రమ కాలం సంగతి పెట్టుబడిదారుడు గ్రహించి చెయ్యడు. ఖర్చుల దాకా చూస్తాడు.)

1 రోజులో, 1 శ్రామికుడి ద్వారా 10 సబ్బులు తయారవుతూ ఉండగా, ఆ కాలం లోనే 20 సబ్బులు తయారయ్యేలాగ మార్పులు జరగాలి. పెట్టుబడిదారుడు, ఇంజనీర్ల ద్వారా (మేధా శ్రమల పని వాళ్ళ ద్వారా) పనిముట్లని మెరుగు చేయిస్తాడు. వాటి స్పీడు పెంచడమో, ఏదో, ఆ మార్పులు జరుగుతాయి. శ్రామికులు కొత్త సాంకేతికతకు తగిన ట్రైనింగ్‌లు నేర్చుకుంటారు. 10 సరుకులు తయారయ్యే కాలంలోనే 20 సరుకులు తయారవుతాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ సరుకు తయారవుతుంది కాబట్టి, దాని ధరని సరుకు వాడు కొంచెం తగ్గించగలుగుతాడు. లేదా, ధరని తగ్గించకపోయినా, ఖర్చు తగ్గాక సరుకుని, పాత ధరకే అమ్మితే, అది మరీ లాభం! ఉత్పత్తి శక్తిని పెంచి, సరుకు తయారీ ఖర్చుని తగ్గించే పని, ప్రతీ పెట్టుబడిదారుడూ చెయ్యలేడు. మొదట్లో పెద్ద పెట్టుబడిదారులు ఒకరో ఇద్దరో చేస్తారు. అలా కొంత కాలం జరిగేప్పటికి, ఆ కొత్త పని ముట్లని అందరూ ప్రారంభిస్తారు. మళ్ళీ వ్యవహారం మొదటికొస్తుంది. అప్పుడు, ఎక్కువ లాభం రావాలంటే, ఎక్కువ సరుకుని అమ్మాలంటే, ఉత్పత్తి శక్తుల్ని మళ్ళీ పెంచాలి. ఈ పోటీల ప్రయత్నాలు పెట్టుబడిదారుల మధ్య నిత్యం యుద్ధ స్థాయిలో జరుగుతూ ఉంటాయి.

**యజమానుల పోటీల వల్ల శ్రామికుల పరిస్తితి ఎలా మారుతుందంటే:** ఒకప్పుడు చేతులతో తిప్పే చిన్న చిన్న మరల మీద, 10 మంది శ్రామికులు పని చేస్తే తయారయ్యే సరుకు, కాస్త పెద్ద యంత్రం దగ్గిర నలుగురు శ్రామికుల ద్వారా తయారయ్యే విధంగా పరిస్తితి మారుతుంది. కొత్త యంత్రం వచ్చిందంటే, ఆ యంత్రమే పని చేస్తుందని అర్థం కాదు. అది, మెరుగైన పని ముట్టు, అంతే. పని చేసేది, ఆ నలుగురు మనుషులే. 10 మంది చేసే పని, నలుగురు చేసేదిగా మారితే, అప్పుడు పెట్టుబడిదారుడు ఏం చేస్తాడు? ఆ నలుగురినే పనిలో ఉంచి, మిగతా ఆరుగురిని పనిలోంచి తీసేస్తాడు. ఆరుగురిని పనిలో నించి తీసి వెయ్యడం వల్ల, వాళ్ళకి ఇచ్చే జీతాల ఖర్చు తగ్గుతుంది అనుకుంటాడు. కానీ, వాళ్ళ వల్ల వచ్చే అదనపు విలువ తగ్గిపోతుంది. లాభం ఎంత పెరుగుతుందంటే, అదనపు విలువలో తగ్గుదల కనపడ

నంతగా! అదంతా వాడికి అర్థం కాదు. చిన్న మరలకు బదులు పెద్ద యంత్రం రావడం వల్ల, కొత్త సరుకుకి, పనిముట్టు ద్వారా చేరే ఖర్చు కొంత పెరుగుతుంది. అయినా, జీతాల ద్వారా చేరే ఖర్చు చాలా తగ్గుతుంది కాబట్టి, సరుకు కోసం అయ్యే మొత్తం ఖర్చు కొంత తగ్గుతుంది. ఆ రకంగా సరుకు ధరని, అవసరమైతే కొంత తగ్గించడం సాధ్యమవుతుంది. అయితే, ఉత్పత్తి శక్తి పెరిగినా, పని దినం పొడవులో మార్పేమీ జరగదు. 10 మంది శ్రామికులు పని చేసినప్పుడు పని దినం 10 గంటలు అయితే, ఉత్పత్తి శక్తి ఎంత పెరిగినా ఆ పని దినం అలాగే ఉంటుంది. పనిలో ఉన్న వాళ్ళు, ఆ 10 గంటల చొప్పునే పని చేస్తారు. ఉత్పత్తి శక్తి ఎంత పెరిగినా, పని చేసే వాళ్ళకి పని కాలం తగ్గదు. కానీ బోలెడు మందికి పనులు పోతాయి. అంటే, ఉత్పత్తి శక్తులు పెరగడం వల్ల, పని వాళ్ళకి నష్టమే జరుగుతుంది గానీ ఏ మేలూ జరగదు. పెట్టుబడిదారుడికే, ఎక్కువ సరుకు తయారై, జీతాల లెక్క తగ్గి, (ఆ జీతాల్ని చెల్లించే బాధ తనదే అనుకుంటాడు కాబట్టి, ఆ లెక్క తగ్గి) ఆ ఎక్కువ సరుకు ద్వారా ఎక్కువ లాభం మిగులుతుంది.

ఈ పోటీల ప్రయత్నాలు పెట్టుబడిదారుల మధ్య నిత్యం జరుగుతూనే ఉంటాయి. నిత్యం కొత్త ఎత్తుగడలు తయారవుతూనే ఉంటాయి. ఈ సరుకుల్ని అమ్మే వ్యాపారాలు గానీ, ఈ పోటీలు గానీ, వెనకటి కాలాల్లో లేవు. అందుకే ఇది పెట్టుబడిదారీ విధానానికి ఉండే కొత్త లక్షణం. ఇది, ఉత్పత్తి శక్తుల్ని పెంచడం కోసం, పనిముట్లని భారీ యంత్రాల స్థాయికి పెంచి వేస్తూ ఉంటుంది. దీని లక్ష్యం, ఎక్కువ లాభం సంపాదించడం! ఈ పద్ధతిలో, ఇలా చేసే విడి విడి పెట్టుబడిదారులకే లాభం పెరగడం జరుగుతుంది. కానీ, మొత్తం పెట్టుబడిదారులందర్నీ కలిపి ఒకే పెట్టుబడిదారుడి గానూ, మొత్తం సరుకు రాసులన్నిటినీ కలిపి ఒకే సరుకు గానూ చూస్తే, అక్కడ ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల, సరుకుకి పట్టే శ్రమ కాలం తగ్గి, దాని వల్ల వచ్చే అదనపు విలువ తగ్గిపోవడమే జరుగుతుంది. కానీ, ఉత్పత్తి శక్తిని పెంచిన ఒక విడి పెట్టుబడిదారుడు, తన సరుకు తయారీకి కొంత ఖర్చు తగ్గినా, దాని ధరని ఎంత తగ్గించాలో అంత తగ్గించడు. అలా అమ్మడం వల్ల వచ్చే ఎక్కువ లాభంలో కొంత భాగం, ఆ సరుకు కోసం ఖర్చయిన శ్రమ ద్వారా వచ్చేది కాదనీ, ఇతర శాఖల సరుకులకు పోవలసిన లాభం, ఇటు వస్తోందనీ, అర్థం. ఇదంతా మనకు ఇక్కడ అర్థం కాకపోయినా ఫర్వాలేదు. 'కాపిటల్'లో బాగా చదువుకోవచ్చు. ఇక్కడ మనకు అర్థం కావలసింది ఏమిటంటే: ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తి శక్తులూ అన్నీ, యజమానుల ఆధీనంలో ఉన్నప్పుడు, ఆ శక్తులు ఎంత పెరిగినా, వాటి వల్ల, ఆ యజమానులకే లాభం గానీ, శ్రామికులకు ఉపయోగం ఉండదు. అంటే, ఇక్కడ అసలు విషయం, ఉత్పత్తి శక్తి పెరగడం తప్పు కాదు. అది దోపిడీదారుడి ఆధీనంలో ఉండడమే తప్పు! అది, యజమానీ శ్రామిక సంబంధంలో ఉండడం తప్పు! పెట్టుబడిదారీ విధానంలో నిరుద్యోగం ఏర్పడే కారణం ఇదీ!" ★

# 47. ఏ సందేహం వచ్చినా 'కాపిటల్'ని అడగాలి!

**90.** సంక్షోభాలంటారు. **అవి ఏవిటసలు? అవి ఎలా వస్తూ, పోతూ ఉంటాయి?**

**జ:** సంక్షోభం అంటే ఏం లేదు, పెట్టుబడిదారుల సరుకుల అమ్మకాలు ఆగి పోవడం! అవి, గుట్టల్లాగ పెరిగిపోతూ ఉంటాయి. శ్రామికుల్లో చాలా మందికి పనులు పోతాయి. కొంత మందికి ఫుల్ టైమ్ పనులు పోయి, అవి పార్ట్‌టైమ్ పనులుగా మారతాయి. పనులు పూర్తిగా పోయిన వాళ్ళకి జీతాలే రావు. పనులు కొంత తగ్గిపోతే, జీతాలూ తగ్గుతాయి. అప్పుడేం జరుగుతుంది? వాళ్ళ తిండిని వాళ్ళు కొనుక్కోలేరు! ఇళ్ళ అద్దెలు కట్టలేరు. పిల్లల్ని స్కూళ్ళకి పంపలేరు. జబ్బుల్లో వైద్యాలు చేయించుకోలేరు. ఏ ఒక్క సరుకూ కొనలేరు. వాళ్ళు ఎలా బతుకుతారనేది సరే. పెట్టుబడిదారుల సరుకుల రాసులు స్టోరుల్లో గుట్టలు గుట్టలుగా నిండిపోయి, అమ్మకాలు ఆగిపోయి ఉంటే, అదే కొత్త సరుకుల తయారీ ఎందుకు? శ్రామికుల పోషణ ఉత్పత్తులూ కదలవు, వాటి ఉత్పత్తి సాధనాలూ కదలవు; ఆ ఉత్పత్తి సాధనాల తయారీకి వాడే ఉత్పత్తి సాధనాలూ కదలవు. అది ఒక గొలుసు. ఏ శాఖలో అమ్మకాలు ఆగినా, అక్కడి నించి ఆ ముప్పు అన్ని శాఖల్నీ చుట్టుకుంటుంది. అప్పటి దాకా పనుల్లో ఉన్న వాళ్ళ పనులు కూడా పోయి, నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతూ ఉంటే, ఆకలితో, జబ్బులతో, నేరాలూ, హత్యలూ, ఆత్మహత్యలూ! సరుకుల ఫ్యాక్టరీ లన్నీ మూతలు పడిపోతాయి. పనులన్నీ ఆగిపోతాయి. అదంతా కలిసి సంక్షోభం! సరుకుల్ని పిచ్చిగా, అతిగా తయారు చేయించడాలూ, వాటిని అమ్మలేకపోవడాలూ, అదే కారణం, సంక్షోభాలకి! నిరుద్యోగాలూ, సంక్షోభాలూ, సరుకుల్ని అమ్మలేకే! సంక్షోభాల వల్ల పెట్టుబడిదారులకు కొన్నేళ్ళ పాటు లాభాలు రావు గానీ, అంత కన్నా వాళ్ళకి సమస్య ఉండదు. పాత లాభాలే బోలెడు ఉంటాయి కాబట్టి, వాటితో వాళ్ళు సుఖంగానే ఉంటారు. అసలు సమస్యలన్నీ శ్రామిక జనాలకే. అమ్మకం లేని సరుకులు స్టోరుల్లో మురిగిపోతూ ఉంటే, అదే సరుకులతో అవసరాలు ఉన్న జనం కోట్ల మంది! వాళ్ళకి, ఆ సరుకులు అందవు. వెనకటి సంక్షోభ కాలాల్లో, పెట్టుబడి దారులు, పాలని సముద్రాల్లో పోయించెయ్యడం, టమాటా తోటల్ని ట్రాక్టర్లతో తొక్కించెయ్యడం, కొన్ని పంటల మీద కిరసనాయిలు జిమ్మించెయ్యడం - అలాంటి నీచ కార్యాలు బోలెడు జరిగాయి. అదే కాలాల్లో పెట్టుబడిదార్లు ఫ్యాక్టరీలు మూసేసి, ఆ విశ్రాంతులతో మరింత విలాసాలతో కాలక్షేపాలు చేస్తూ ఉంటే, ఇక కొన్నేళ్ళకి సరుకుల ఉత్పత్తి మళ్ళీ నెమ్మదిగా ప్రారంభమవుతుంది. ఇదంతా 'కాపిటల్'లో ఎన్నో వివరాలతో చదువుకోవచ్చు.

"ఆ వివరాలన్నీ తెలిస్తే ఏం భరించగలం? ఏడుపు తన్నుకొస్తుంది."

"ఏడుపు కాదు, ఆగ్రహం తన్నుకు రావాలి."

"అది ఎలాగా ఉంది, మనసు నిండా. ఆగ్రహాన్ని తీర్చుకునే మార్గం లేనప్పుడు ఇక మిగిలేది ఏడుపే. ఎంత దుర్మార్గంగా ఉంది ఇదంతా! మంచి పనిముట్లని

తయారు చేసుకుంటే, శ్రమ పడే కాలం తగ్గి సుఖం దొరకాలి గానీ, దాని వల్ల నిరుద్యోగాలా! ఎలాగ ఈ సమస్యకి దారి? మరి, మనం ఏర్పర్చుకునే కొత్త సమాజంలో మాత్రం పెద్ద యంత్రాలు ఉండవా? ఉత్పత్తి శక్తులు పెరగవా? అక్కడైనా, నలుగురు పని చేస్తే సరిపోయే చోట పది మంది ఎందుకు ఉంటారు? మన దగ్గరైనా ఈ నిరుద్యోగాలు తప్పవా? అంతేనా?''

''కొంచెం ఆలోచించండి, ఆలోచిస్తే తెలీదా? మీకే తెలుస్తుంది. అవసరమైతే ఉత్పత్తి శక్తుల్ని పెంచుకోవలిసిందే, కానీ అవి యజమానుల చేతుల్లో ఉండకూడదు - అని చెప్పుకున్నామా లేదా? ఆలోచించండి!''

''తొందరగా వినాలి. తర్వాత ఆలోచిస్తాం గానీ, ముందు మీరే చెప్పండి! తొందరగా వినాలి. ''అవి మన చేతుల్లో ఉంటే మనం మాత్రం ఏం చేస్తాం? ఇద్దరితో అయ్యే పని కోసం, పది మందిమి చేస్తామా?''

''అదే ఉదాహరణని మన దగ్గిర కూడా తీసుకుందాం. చిన్న యంత్రాల మీద పని దినం 10 గంటలు. పని వాళ్ళు 10 మంది. కొత్త యంత్రం దగ్గిర నలుగురు చాలు. వాళ్ళతో, అంత సరుకూ తయారవుతుంది. అయినా 10 మందిలో ఎవ్వరికీ పని పోదు. ఒక బ్యాచ్ వాళ్ళు వచ్చి మూడున్నర గంటలు చేసి వెళ్ళిపోతారు. 10 గంటల దాకా చెయ్యరు. రెండో బ్యాచ్ వాళ్ళు వచ్చి అలాగే చేసి వెళ్తారు. మూడో బ్యాచ్ వాళ్ళూ అలాగే. లేదా, అందరూ ఒకే సమయంలో పనిలో ఉంటారు. మూడున్నర గంటలే. అందరికీ పని కాలం తగ్గుతుంది. కొత్త యంత్రాల వల్ల ఉపయోగం అందరికీ ఉంటుంది.''

''అబ్బ! ఎంత బాగుందో! మాకు ఇలా తోచలేదేం?''

''ఎందుకు తోచదూ? ఆలోచించారా అసలు? కంగారు ఎక్కువ. పెట్టుబడిదారీ విధానం అయితే, వాళ్ళ లక్ష్యం లాభమే కాబట్టి, ఉత్పత్తి శక్తుల్ని పెంచి, పని వాళ్ళని తగ్గించేస్తూ ఉంటారు. శ్రామికుల లక్ష్యం అది కాదు. దోపిడీ కాదు. దోపిడీని తీసివేసే పద్ధతులే మన లక్ష్యం. అందరూ పనిలో ఉండడమే మన లక్ష్యం!''

''మరి, ఒక్క మాట! పని చేసే వాళ్ళకి పని కాలం తగ్గితే, వాళ్ళ పోషణకి సరిపోయే ఉత్పత్తులు వస్తాయా?''

''అయితే, ఇప్పటికీ మీకు 'అ ఆ'లే అర్థం కాలేదు. ఇప్పుడు జరుగుతోన్న 10 గంటల పనిదినం అంతా కావాలా పనివాడి పోషణ కోసం? అందులో 9 గంటలు, యజమానికి పోయేదే అని గుర్తు లేదా? శ్రామికులకు అందేది, ఒక్క గంట శ్రమే కదా? అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి శక్తులు పెరుగుతూ ఉంటే, తక్కువ పని కాలంలోనే గతం కన్నా ఎక్కువ ఉత్పత్తి తయారవుతూ ఉంటుంది. రేపు పని కాలం తగ్గినా పోషణకి కొరత ఎలా ఉంటుంది? అలాగైతే ఉత్పత్తి శక్తులు పెరగడం ఎందుకు? అయినా రేపు పని కాలం 2 గంటలే అని కాదు. ఇది ఉదాహరణ. పని దినం ఎంత తగ్గాలో, అక్కడ ఉన్న పరిస్థితుల్ని బట్టీ, ఆ అవసరాల్ని బట్టీ ఉంటుంది కదా?''

"అవును, అంతే. పనులు గ్యారంటీగా నిలబడితే అది చాలు. అది నిశ్చింత. ఎంత పని అయినా చేసుకోవచ్చు. అయితే మరి అక్కడ సంక్షోభాలు ఉండవా? సరుకు అంతా అమ్ముడు పోతుందా?"

"మీకు సందేహాలు బాగా పుట్టుకొస్తాయి. జవాబులు పట్టుకునే ప్రయత్నం లేదు."

"మీరు చెప్పేస్తారు కదా అని!"

"చెప్పేది నేను కాదు. 'కాపిటల్'ని అడగండి! మీరు కూడా ఇతర శ్రామికులకు చెప్పాలి కదా?"

"చెపుతూనే ఉన్నాం. ఇప్పుడు బాగా చెపుతున్నాం. సంక్షోభాలు మన దగ్గిర ఉండవా? అది చెప్పండి!"

"దేశంలో ఉన్న జనం అందరూ ఉద్యోగాలు చేసుకుంటూ, కావలసిన ఉత్పత్తు లన్నిటినీ కొనుక్కుంటూ ఉంటే, ఆ ఉత్పత్తులు ఎందుకు అమ్ముడుపోవు? పెట్టుబడి దారీ విధానంలో అయితే, ఒకే రకం సరుకుని ఉత్పత్తి చేయించే వాళ్ళు, ఉదా హరణకి సబ్బుల వాళ్ళు, విడి విడిగా, ప్రైవేటుగా, ఎవరి వ్యాపారం వాళ్ళు చేసు కుంటారు. వాళ్ళ మధ్య ప్రతీదీ రహస్యం. వాళ్ళ మధ్య దేనికీ ప్లాను ఉండదు. ఎంతసేపూ వాళ్ళ దృష్టి, ఎక్కువ సరుకుని అమ్మేసి, ఎక్కువ లాభం రాబట్టాలనేదే. అందుకే వాళ్ళ సరుకు, గుట్టలు గుట్టలుగా పేరుకుపోతుంది. అదంతా ప్రైవేటు వ్యాపారాల వ్యవహారం. అలాగాక, ప్రైవేటు పెట్టుబడిదారులు లేకుండా, సమిష్టి ఆస్తీ, సమిష్టి శ్రమ సంబంధాలూ, దోపిడీ వ్యతిరేక పద్ధతులూ ఉన్న చోట, ప్రతీ అడుగులోనూ ప్లాను ఉంటుంది. సమాజానికి ఏ ఉత్పత్తి ఎంత అవసరమో లెక్కలు ఉంటాయి. అలాంటి విధానంలో, స్టోరుల్లో సరుకు గుట్టలు మురిగిపోయే పరిస్థితి ఎలా ఉంటుంది?"

"అబ్బ! ఏవిటో నమ్మశక్యం కానట్టుగా ఉంది. కానీ ఇందులో నమ్మకపోవడానికి ఏముంది?" ★

# 48. మేధాశ్రమల వారు కట్టే పన్నులు, ఎందులో భాగం?

**91. దేశంలో, ఒక సంవత్సరంలో ఉత్పత్తి అయ్యే 'మొత్తం అదనపు విలువ'ని లెక్క కట్టాలంటే, అది ఎన్ని పేర్లతో చీలుతుందో వాటన్నిటినీ కలిపెయ్యడమే కదా? అంతేనా? పన్నుల్ని కూడా కలపాల్సిందేనా?**

**జ:** ఎంత బాగా అర్థం చేసుకుంటున్నారు! మరి, కార్మికుల్లో పెద్ద జీతాల వాళ్ళు కూడా ఇళ్ళ పన్నులూ, ఆదాయం పన్నులూ అవీ కడతారు. డాక్టర్లూ, లెక్చెరర్లూ, సైంటిస్టులూ, ఇంకా అలాంటి జీతాల వాళ్ళు కట్టే పన్నుల్ని కూడా అందులోకి కలుపు తారా?

"అవి, జీతాల్లోంచి కట్టేవి కదా? వాటిని అదనపు విలువల్లో ఎలా కలుపుతాం?"

"అవును, అలా కలపక్కర లేదు. మేధా శ్రామికులకు పెద్ద జీతాలు ఉన్నా, వాళ్ళూ శ్రామిక వర్గం వాళ్ళే. ఈ వర్గంలో ఎవరూ కూడా దోపిడీ ప్రభుత్వం ఖర్చుల్ని భరించనక్కరలేదు. కాబట్టి, పెద్ద జీతాల వాళ్ళు కట్టే పన్నుల్ని కూడా వారి అదనపు విలువలో భాగంగానే అనుకోవచ్చు. కానీ, ఇంకో రకంగా చూస్తే, పెద్ద ఉద్యోగుల జీతాలు, శారీరక శ్రమల వాళ్ళకి ఆగ్రహం కలిగించేలా ఉంటాయి. ఆ పెద్ద జీతాల వాళ్ళు పన్నులు కట్టవలసిందే - అనిపిస్తుంది. రోడ్ల మీద వాళ్ళ కార్లూ అవీ బాగానే నడుస్తూ, రోడ్లని అరగ్గొడుతూ ఉంటాయి. వాళ్ళు పన్నులు కడితే కడతారు. అయినా ఇప్పుడు ఈ గందరగోళం వద్దు. పెద్ద జీతాల్లో నించి కట్టే పన్నుల్ని అదనపు విలువలోకి చేర్చక్కరలేదు."

"అవును, వాటి మాట వదిలేద్దాం. డాక్టర్‌కి పెద్ద జీతం ఉంటే, 'పోనీలే, ఆయన అదనపు విలువ అయనకే అందడం వల్ల అంత జీతం ఉంది' అనుకుందాం."

"అయ్యో, అది తప్పు! మేధాశ్రమల వాళ్ళ నించి కూడా యజమానికి అదనపు శ్రమ వెళ్ళాలి."

"అవును, మరిచే పోయాను. నా మొహం! నాకేం తెలుస్తోంది? మార్క్సు రాసిం దంతా చెప్పండి, వినాలని తొందరగా ఉంది. నన్ను ఎలాగా తొందర వాణ్ణి అన్నారు మీరు. ఒక దేశంలో శ్రామికులు లక్షలూ కోట్లూ ఉంటారు కదా? వాళ్ళందరి నించీ యజమానులు లాగే అదనపు విలువ అసలు ఎంత ఉంటుంది? అది ఎలా తెలుస్తుంది?"

"అంతా మీకు తెలుసు. పెట్టుబడిదార్లు చెప్పే లెక్కలు చూస్తే చాలదూ? వాళ్ళు ఆ లెక్కలన్నీ గర్వంగానే చూపిస్తారు. 'మాకు ఇన్ని కోట్లు లాభం వచ్చింది' అంటారు. 'వడ్డీల కోసం ఇన్ని లక్షలు కట్టాం' అంటారు. 'పన్నులు ఇంత చెల్లించాం' అంటారు. ఎగ్గొట్టిన పన్నుల లెక్కలు చెప్పరనుకోండి. అసలు, 'మా లాభం ఇన్ని కోట్లు' అని ఎందుకు చెప్పేస్తారంటే, లాభం ఎలా వచ్చిందో వాళ్ళకి తెలుసు గానీ, కార్మికులకు తెలీదు అని వాళ్ళ ధైర్యం! అందుకే అలా, 'మా లాభం ఇంత పెద్దది' అని గర్వంగా చెప్పేసుకుంటారు. వాళ్ళ లాభాలూ వడ్డీలూ కౌళ్ళూ - అవన్నీ చాలా న్యాయమైన హక్కుల వల్ల వచ్చే ఆదాయాలు అని వాళ్ళ అభిప్రాయం. ఆ జాబితాలన్నీ మన ముందు పెట్టుకుంటే, ఒక సంవత్సర కాలంలో ఎంత అదనపు విలువని లాగేశారో చాలా తేలికగా లెక్క కట్టవచ్చు. అన్నిటినీ కూడడమే. మూడో తరగతి పిల్లలు కూడా ఆ కూడిక తేలిగ్గా చెయ్యగలరు."

"మా అబ్బాయి దగ్గిర ప్రైవేటు చదివే పిల్లలైనా కూడేస్తారేమో! అలా కూడిద్దాం గానీ, పెట్టుబడిదారులు అసలు నిజం లెక్కలు చెపుతారా? మా యజమాని దగ్గిరికి ఆడిటరో ఎవరో వొస్తూ ఉంటాడు. ఆయనా శ్రామికుడేనా? అతనికి మా వాడు ముందు పది టిఫిన్లు పెట్టించి, తర్వాత తన గదిలోకి తీసుకుపోయి, తలుపు లేసు కుని ఏదేదో రాయిస్తాడు. కాఫీలవీ ఇవ్వడానికి వెళ్తాం కదా, అక్కడేదో గూడుపుఠాణీ

జరుగుతోందని మాకు అనిపిస్తుంది గానీ, అదేవిటో ఇదివరకు తెలిసేది కాదు. అది ఇదే. అన్నీ దొంగ లెక్కలు రాయిస్తాడన్నమాట! ఖర్చులు ఎక్కువ పెట్టానంటాడు, లాభం తక్కువ వచ్చిందంటాడు. అలా రాయిస్తాడేమో! ఆ కాయితాలు చూస్తే మనకేం నిజం తెలుస్తుంది?"

"ఏం ఫర్వాలేదు. మనం అసలు, అదనపు విలువని ఎలా లెక్కకట్టాలో ఆ పద్ధతి తెలుసుకుంటే చాలు. కొన్ని లెక్కలు ఆ జాబితాలో ఉండవు కూడా. ఒక పెట్టుబడిదారుడు, ప్రభుత్వానికి తన సరుకులు అమ్మడానికి, ఏ మిలటరీ యూనిఫారాలో - పోలీసు లాఠీలో - తుపాకులో - ఇవో అవో, అమ్మాలనో, బ్రిడ్జీలు కట్టాలనో, ప్రభుత్వం నించి కాంట్రాక్టులు సంపాదించడానికి, ఒక మంత్రికి నాలుగు లక్షల డబ్బు లంచం ఇస్తాడనుకుందాం. ఆ లంచం కూడా అదనపు విలువలోదే. కానీ, 'లంచం ఇంత ఇచ్చాను' అని జాబితాలో చూపిస్తాడా? - చూపించడు. కానీ ఆ కాంట్రాక్టులు సంపాదించడానికి లంచాల పద్ధతి, ఎప్పుడూ నడుస్తూనే ఉంటుంది. కానీ ఆ లెక్కలు మనకి దొరకవు. అయినా ఫర్వాలేదు. 'అదనపు విలువ' లోకి ఏయే అంశాల్ని చేర్చాలో తెలిస్తే చాలు."

"సరే, అలాగే సరిపెట్టుకుందాం. అయితే, ఏ యే వాటిని కూడాలి?"

"మీ కందరికీ బాగా తెలుసు. మీరే చెప్పండి. అయితే, అదనపు విలువలోకి భూమి కౌళ్ళని చేర్చడంలో ఒక చిన్న తేడా ఉంటుంది. కౌలు రైతుల నించి పోయే భూమి కౌళ్ళు, ఆ రైతుల అదనపు విలువే అయినా, అది వేతన శ్రామికుల అదనపు విలువలో భాగం కాదు కదా? వేతన శ్రామికుల అదనపు విలువని చూడాలంటే, పెట్టుబడిదార్లు చూపించే జాబితాల్లో, 'కౌళ్ళ కోసం ఇంత కట్టాం' అంటారే, లేదా వాళ్ళే ఉంచుకుంటారే, దాన్నే తీసుకోవాలి. పెట్టుబడిదారులు కౌళ్ళు చెల్లించడం - అన్నప్పుడు, వాళ్ళల్లో, సబ్బులూ బట్టలూ లాంటి పరిశ్రమల కోసం భూమి ఉంటుందే, ఆ భూమి కోసం కౌలు. లేదా, పెట్టుబడిదారుడే వ్యవసాయం చేయిస్తే, ఆ భూమి పేరుతో తీసే కౌలు. ఈ పెట్టుబడిదార్లు చెప్పే కౌళ్ళు, వేతన శ్రామికుల అదనపు విలువలోవే. స్వయంగా శ్రమలు చేసే కౌలు రైతు చెల్లించే కౌలు అతని శ్రమే. పెట్టుబడిదారీ కౌలు రైతు చెల్లించే కౌళ్ళు, వేతన శ్రామికులవే. కౌళ్ళలో ఈ తేడాలు ఉన్నాయి."

"ఏం ఫర్వాలేదండీ. ఒక దేశంలో తయారయ్యే మొత్తం అదనపు విలువని చూడాలనుకుంటాం కదా? పెట్టుబడిదారులు చూపించే కౌళ్ళనీ తీసుకోవాలి, కౌలు రైతులు కట్టే కౌళ్ళనీ, వడ్డీల్నీ, అన్నిటినీ తీసుకోవాలి. యజమానులందర్నీ ఒక వర్గం అనుకుంటే, కౌలు రైతుల్నీ, జీతాల శ్రామికుల్నీ కలిపేసి ఒక వర్గం అనుకుందాం లెండి. అదనపు విలువ మొత్తాన్ని చూడ్డానికే కదా?"

"ఎంత చక్కగా తెలిసి పోతోంది! ఆశ్చర్యంగా ఉంది! 'జీతాల వాళ్ళ'ని అంటే, అందులోకి అనుత్పాదక జీతాల వాళ్ళని కలపకూడదు సుమా! వాళ్ళ అదనపు శ్రమ

కూడా ఉన్నా, అది అదనపు విలువ లెక్కలోకి రాదు కదా? 'మొత్తం కార్మిక వర్గం ఏదీ' అన్నప్పుడైతే, ఉత్పాదక వాళ్ళనీ, అనుత్పాదక వాళ్ళనీ కూడా కలపాలి.''

''అవును, అది తెలిసిందే. ఇప్పుడు అదనపు విలువ రాసినే చూడాలి తొందరగా.''

''ఇంకో మాట! **'జీతాలు'** అనే దాన్ని గురించి చాలా జాగ్రత్త ఉండాలి. పెట్టుబడిదారుడి జాబితాలో జీతాల భాగం ఎలా ఉంటుందంటే, కార్మికులకు ఇచ్చే జీతాల్నీ, పెట్టుబడిదారుడు తీసుకునే వేల రెట్ల జీతాల్నీ కూడా కలిపేసి, ఆ మొత్తాన్ని 'జీతాల నిధి' అంటాడు. ఆ 'జీతాల నిధి'లో అబద్ధపు జీతాలూ, అనుత్పాదక జీతాలూ, బోలెడు ఉంటాయి. పెట్టుబడిదారుడు చూపించే 'జీతాల నిధి'ని చూసి, 'అదంతా జీతాల భాగమే కదా' అనుకోకూడదు. ఆ భాగంలో నించి పెట్టుబడిదారుడి జీతాల్ని బైటికి లాగి, దాన్ని అదనపు విలువ లెక్కలో కలపాలి. ఇంకో సంగతి. సరుకుల్ని తయారు చేసే పని స్తలంలోనే, వాచ్‌మేన్లూ, మేనేజర్లూ వంటి వాళ్ళు ఉంటారు. వాళ్ళు కూడా ఏదో ఒక శ్రమ చేసే వాళ్ళే అయినా, వాళ్ళు అనుత్పాదక శ్రామికులు అవుతారు. వాళ్ళ జీతాలు గానీ, వాళ్ళ పనులు జరిగే సాధనాల ఖర్చులు గానీ, ఆ ఖర్చులన్నీ అదనపు విలువలోకి చేరవలసిందే. అంతే కాదు, ఇంకా కొన్ని విషయాలు ఉంటాయి. పెట్టుబడిదారుడి దగ్గిరికి సరుకు బేరాల కోసం మాట్లాడు కోడానికి ఇంకో పెట్టుబడిదారుడి మనిషి ఎవడో వస్తాడనుకుందాం. వాడికి వీడు కాఫీయో, కూల్‌డ్రింకో ఇప్పిస్తాడనుకుందాం. ఆ ఖర్చు, సరుకు తయారీ కోసం జరిగేది కాదు కాబట్టి, దాన్ని అదనపు విలువలోకి చేర్చవలసిందే. ఇలాంటి ఖర్చులు చాలా ఉంటాయి. ఇవన్నీ పెట్టుబడిదారుడు అదనపు విలువలో నించే పెట్టగలడు.''

''ఇది చాలా బాగుంది. ఆ బేరాల కోసం వచ్చిన వాడికి మంచి నీళ్ళిచ్చినా సరే, ఆ పైసా ఖర్చుని అదనపు విలువలోకి చేర్చవలసిందే. లేకపోతే ఆ పైస ఎక్కణ్ణించి వస్తుంది? అంతేకాదు, వాళ్ళు వచ్చి కూర్చున్నప్పుడు కుర్చీల అరుగుదల ఖర్చులు కూడా అవుతాయి. ఆ కూర్చున్న వాళ్ళు, టన్నుల బరువు పొట్టలున్న వాళ్ళయితే కుర్చీల అరుగుదల ఖర్చులు బాగా పెరుగుతాయి. నెలకో కుర్చీని మార్చాల్సి రావచ్చు. బరువులు లేని అల్పులు అక్కడికి రారు అసలు. మరి పెట్టుబడిదారుడి ఇంటికి ఎవడన్నా చుట్టం వస్తే? అప్పుడు కూడా కుర్చీ అరుగుతుందిగా?''

''అదీ అదనపు విలువలోకే. పెట్టుబడిదారుడు తీసుకునే 'ఉత్పాదక లాభాన్ని' అదనపు విలువలోకి చేర్చవలసిందేగా? పెట్టుబడిదారుడి ఇంటి ఖర్చులన్నీ ఆ లాభంలో నించే వెళ్తాయి. ఇంటి పని మనుషుల జీతాలూ, ఇంట్లో షోకులూ, ఉంపుడు కత్తెలకు నగలూ, అన్నీ ఆ లాభంలో నించే. ఆ లాభాన్ని చూస్తే చాలు. ఆ ఖర్చుల్ని విడి విడిగా చూడాలన్నా అవి పెట్టుబడిదారుడి జాబితాలో దొరకవు.''

''పెట్టుబడిదారులందరికీ ఉంపుడుకత్తెలు ఉంటారంటారా?''

''ఉన్న వాళ్ళ సంగతే అది. కొందరికైనా అలా ఉండకపోతే, హై క్లాస్ వ్యభిచారాలు ఎందుకు ఉన్నాయి? వాళ్ళకే కాదు, శ్రామికుల సంగతీ అలాంటిదే. వీళ్ళది, లో క్లాస్ వ్యభిచారాల వ్యవహారం.''

"అవును. అది లేదని ఎలా అంటాం? కార్మికుల్ని, 'యుగ యుగాల మకిలితో ఉన్న కార్మిక వర్గం' అని మార్క్సు అన్నాడని మీరు చెప్పారు కదా? అన్ని రకాల మకిళ్ళూ అందరికీ పట్టి ఉన్నట్టు లెక్కే."

"ఇప్పుడు చెప్పండి. మీకు తెలుసు. ఏయే అంశాలు కలిస్తే, 'మొత్తం అదనపు విలువ రాసి' అవుతుంది?"

"ఇది కొట్టిన పిండే. కౌళ్ళ పేరుతో వెళ్ళేవీ, వడ్డీల పేరుతో వెళ్ళేవీ, 'జీతాల నిధి'లో పెట్టుబడిదారుల జీతాలూ - అనుత్పాదక జీతాలూ, వర్తక కమిషన్లూ, పన్నులూ, ఉత్పాదక లాభాలూ - ఇవన్నీ కలిపేస్తే...."

"వర్తక లాభాన్ని కలపరా?"

"వర్తక కమిషన్లని కలిపాంగా? అందులోదేగా వర్తక లాభం?"

"అంతేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా?"

"అయ్యో, మర్చిపోయాం. లంచాలూ?" ★

# 49. దేశంలో, 'అదనపు శ్రమ రాసి' ఏది?

**92. 'అదనపు విలువ రాసి'లోకి లంచాల్ని కూడా చేర్చి తీరాలి. కానీ, వాటి లెక్కలు దొరకవు కదా? ఎలాగ వాటిని లెక్క కట్టడం? 'ఇన్ని కోట్లు' అని ఏదో ఒక ఉజ్జాయింపుగా కలపాల్సిందేనా?**

**జ:** ఇప్పటికైతే అంతే మరి. కానీ, లంచాలకు కూడా 'నూటికి ఇంత' అనే లెక్క ఏదో ఉంటుంది. ప్రతీ చోటా సప్లై - డిమాండ్ల జబ్బేగా? వాటిని బట్టి, ఆ లెక్క పెరగడమో, తరగడమో, జరుగుతుంది. లంచాల శాతం ఎలా నడుస్తోందో తర్వాత తెలుసుకుందాం గానీ, ప్రస్తుతానికి 'నూటికి పది' అనుకుందాం. మొదట, దొరికిన లెక్కలన్నీ కలపాలి. ఆ మొత్తంలో, నూటికి పదిని లంచాలుగా నిర్ణయించి, దాన్ని కూడా ఆ రాసిలోకి కలిపితే.....

"నూటికి పది కాదు. ఇరవై చొప్పున ఉండాలి. ప్రభుత్వంలో అవినీతి కుంభ కోణాలు చూడండి. ఎన్ని లక్షల కోట్లు ఉంటున్నాయో! లంచాలుగా పోయేది చాలా ఉంటుంది. ఇంకా ఉంటుంది. నూటికి ఇరవై చొప్పున ఉండాలి."

"సరే, అలాగే చేద్దాం. 'లంచం' మాట ఎత్తగానే నాకు ఇంకో సంగతి గుర్తొచ్చింది. ఈ పెట్టుబడిదారులు దేవుడి గుళ్ళల్లో ఇచ్చే లంచాల మాట ఏమిటి? తిరపతి గుళ్ళో మొన్న కోటి రూపాయల కట్ట వేశాడు ఎవడో! నిన్న ఎక్కడో గుళ్ళో 3 కిలోల బంగారం ముద్ద ఇచ్చాడు ఒకడు. బంగారం హారాలు, కిరీటాలు, అమ్మవారికి వడ్డాణాలు, ఎన్నెన్నో ఇస్తూ ఉంటారు. అది అదనపు విలువ కాకపోతే, ఏ పెట్టుబడిదారుడైనా అంతంత డబ్బు ఎలా ఖర్చు పెడతాడు? తనకి లాభం బాగా వస్తే, అందులో నించి దేవుడికి కాస్త పడేస్తాడు."

"అవును, పెట్టుబడిదారులందరూ దేవుళ్ళకి ఇచ్చేవి, అదనపు విలువలో భాగాలే అవుతాయి. అసలు, దేవుడు డబ్బేం చేసుకుంటాడని ఆలోచించరేం? పని వాళ్ళకి జీతాలు పెంచమంటే చెవిన పెట్టరు. దేవుళ్ళకి కిరీటాలా! పోనీ ఇస్తే, అక్కడ బుర్రలు గొరిగించుకుని ఆ జుట్టు పడేస్తే చాలు."

"దేవుడు, జుట్టేం చేసుకుంటాడు?"

"అవును, బాగా అన్నారు. నిజమే. ఏం గోలలు ఇవన్నీ!"

"జనం మూఢ నమ్మకాల్లో పడి ఉంటే, దోపిడీదారుల వేపు చూడరు కదా? దేవుళ్ళ గుళ్ళ వెంట తిరుగుతూ కూర్చుంటారని! వాళ్ళకి తెలివి అబ్బకుండా ఉండాలని!"

"అయితే తొందరగా తెలివి నేర్చుకోవాలి. మా అబ్బాయి ఎక్కడ నేర్చుకున్నాడో గానీ, పుస్తకాలవీ చదువుతాడు కదా రోజూ, వాళ్ళమ్మతో బాగా వాదిస్తున్నాడు. వాడి మాటలంటే, ఆవిడికి గురే. మీకు చెప్పడం మర్చిపోయాను. నిన్న ఇంటికి వెళ్ళగానే తెల్లబోయాను. గోడల మీద దేవుళ్ళ పటాలు లేవు. 'ఏమయ్యాయి?' అంటే, 'ఎందుకూ, దండగా' అంది."

"చాలా మంచి వార్త చెప్పారు. మీ అబ్బాయికి, అనుకున్న ఉద్యోగం దొరక్కపోతే, గుళ్ళ వేపు బైల్దేరడు కదా? అప్పటికి అతను ఇంకా గట్టిపడాలి."

"నేనే కొంచెం పిరికివాణ్ణి గానీ, వాడు దేనికన్నా భయపడతాడని నాకు ఎప్పుడూ అనిపించదండీ. అయ్యో, ఇదేంటి, మనం దారి తప్పాం. అదనపు విలువలోకి పన్నుల్ని కూడా కలిపామా?"

"కలిపాం. అప్పుడు కలపకపోతే, ఇప్పుడు కలుపుదాం. మనకు బాగా తెలియడానికి ఒక సంగతి చెప్పుకోవాలి. ప్రభుత్వంలో, ఒక మంత్రినో, గవర్నర్‌నో, ప్రెసిడెంట్‌నో తీసుకుంటే, వాళ్ళ కోసం అయ్యే ఖర్చులు, మనకు గుండెలు పేలిపోయేలాగ ఉంటాయి. వాళ్ళకి భారీ జీతాలు ఇచ్చి, పైగా అన్ని ఖర్చులూ కూడా ఇస్తారు. మహా భవనాలూ, పని మనుషులూ, ఫోన్లూ, కార్లూ, ఇప్పుడైతే కంప్యూటర్లూ, వాళ్ళ విమాన ప్రయాణాలూ, విదేశీ యాత్రలూ, వాళ్ళ చుట్టూ రోజూ రాత్రింబవళ్ళూ పోలీసుల కాపలాలూ, వాళ్ళకే గాక వాళ్ళ కుటుంబంలో అందరికీ కూడా ఆ రక్షణలూ, వాళ్ళు విందులూ వినోదాలూ చేసుకునే ఖర్చులూ - ఇన్ని! మనకు తెలిసినవి మాత్రమే ఇవి! ఆ మంత్రో, ఆ గవర్నరో చేసే శ్రమ కోసమా ఇన్ని మొత్తాలు!"

"అసలు వాళ్ళు చేసే శ్రమ లేమిటి? జీతాలు భారీగా ఇచ్చాక, ఇవన్నీ ఎందుకు? మరి, జీతాలతో ఏం చేస్తారు?"

"అప్పుడే అయిందా? ఎంపీలకైతే, వాళ్ళ నియోజక వర్గాల్లో ప్రజల్ని ఉద్ధరించమని కుప్పల తెప్పల డబ్బు మూటలు కూడా ఇస్తారు. ఎంపీ కోసం ఇంత ఖర్చు ఎక్కడి నించి? పన్నుల్లో నించే. 'పన్నులు' ఎక్కణ్ణించి? 'ప్రభుత్వం నడవాలంటే పన్నులు అవసరం కదా' అనుకుంటాం. అవన్నీ అత్యవసరమైన ఖర్చులు అయినట్టు! ఆ ఖర్చులు ప్రభుత్వం నడవడానికి కాదు, అసలు నడవాల్సింది దోపిడీ వర్గ ఆనం

దాలు! మనకి తెలిసినవి ఇవీ, ఇక తెలియనివి ఎన్ని ఉన్నాయో! ఇంత దోపిడీ జరుగుతోందని తెలిసి కూడా మనం దాన్ని తీసివెయ్యకుండా ఉన్నామంటే, ఎంత బుద్ధి లేకుండా ఉన్నామో అనిపిస్తుంది నాకు."

"వినలేము. ఇలాంటి పరిపాలనలో నోళ్ళు మూసుకుని బతుకుతున్నాం. ఇవన్నీ తెలీకుండా ఉంటేనే మంచిదేమో! తెలిసి కూడా ఏమీ చెయ్యకుండా బతకాలంటే సిగ్గుతో చావాలి!"

"బానిసలు ఒకప్పుడు ఇలాగే బాధపడి ఉంటారు. ఇప్పుడు ఆ బాధ వేతన బానిసల వంతు. కానీ బాధపడడం తెలియడం కూడా ఆత్మగౌరవం అవుతుంది."

"బాధ కాదు. మాకు చాలా కోపంగా ఉంది."

"అయితే అది మరీ మంచిది. ఏమీ చెయ్యలేకపోవడం ఎందుకు? సిగ్గుతో చావడం ఎందుకు? తప్పకుండా ఆ కోపం, విముక్తి వేపు దారి తీస్తుంది. ఇప్పుడు మనం అసలు సంగతులు మాట్లాడుకోవాలి. మొత్తం సమాజానికి అవసరమయ్యే శ్రమలన్నిటినీ చూడాలంటే, ఏ యే అంశాలు కలపాలి? చెప్పగలరా?"

"అయ్యో! ఎందుకు చెప్పలేం? ఇన్నాళ్ళూ విన్నది ఏమిటి? సమాజం నిండా జరిగే శ్రమలన్నిటినీ కలిపెయ్యాలి. (1) ఉత్పాదక శ్రమలూ, (2) అనుత్పాదక శ్రమలూ, (3) స్వతంత్ర శ్రమలూ, (4) కుటుంబ శ్రమలూ. ఇవన్నీ కలిస్తేనే, రోజూ సమాజానికి అవసరమయ్యే మొత్తం శ్రమ! అంతేగా?"

"అద్భుతంగా చెప్పారు. ఆ మొత్తం శ్రమలో, యజమాని వర్గం పాత్ర ఏమిటి?"

"ఏమీ ఉండదు. లేదా, ఏదో కాస్త! ఆ కుటుంబాల్లో, అక్కడక్కడా ఆడవాళ్ళు కాస్త చేసుకుంటారు, అంతే. వాళ్ళకి మా ఆవిడ లాంటి పని మనుషులు మస్తుగా ఉంటారు."

"సరే, మొత్తం సమాజంలో, 'అదనపు శ్రమ రాసి' ఎంత ఉంటుందో చూడాలంటే, ఎవరెవర్ని కలపాలి?"

"ఇదీ తేలికే. (1) ఉత్పాదక శ్రామికుల అదనపు శ్రమనీ, (2) అనుత్పాదక శ్రామికుల అదనపు శ్రమనీ. ఈ రెండూ కలుస్తాయి, అంతే. స్వతంత్ర శ్రమలూ, కుటుంబ శ్రమలూ, అలాంటివి ఇందులోకి రావు. వాళ్ళ శ్రమలు వాళ్ళకే ఉంటాయి."

"ఏ ప్రశ్నల పత్రం ఇచ్చినా మీరు చక చకా రాసేసేలా ఉన్నారు. సరే, ఇంకో ప్రశ్న. సమాజంలో, 'మొత్తం అదనపు విలువ'ని చూడాలంటే, ఎవరెవర్ని కలపాలి? దీన్ని ఇప్పుడు మళ్ళీ చెప్పండి!"

"(1) ఉత్పాదక శ్రామికుల అదనపు విలువనీ, (2) కౌలు రైతుల అదనపు విలువనీ - అంతే."

"ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ రాసిని చూడాలంటే? ఏ యే అంశాల్ని కలపాలో ఇప్పుడు వరసగా చెప్పండి!"

"ఓ! తేలిగ్గా చెప్పేస్తాం.

(1) పెట్టుబడిదారులు కట్టే భూమి కౌళ్ళు. కడతారో, వాళ్ళే మింగుతారో!

(2) వాళ్ళ జాబితాలో ఉండే వడ్డీలు,

(3) వర్తక కమిషన్లు,

(4) పన్నులు,

(5) ఉత్పాదక లాభాలు,

(6) పెట్టుబడిదారుల జీతాలు,

(7) పనిస్తలాల్లో ఉండే అనుత్పాదక ఖర్చులు,

(8) పెట్టుబడిదారుడు ఇచ్చే లంచాలు,

(9) పెట్టుబడిదారులు, ఆఫీసు గదుల్లో, ఎవరెవరికో ఇప్పించే కాఫీ - టీల ఖర్చులూ, మంచి నీళ్ళ ఖర్చులూ, వాళ్ళు వచ్చి కూర్చున్నప్పుడు కుర్చీల అరుగుదల ఖర్చులూ.

(10) మనకు తెలియనివి ఎన్నో ఉంటాయి. అలాంటివి, ఈ చివరి నెంబర్లోకి వస్తాయి.

ఈ 10 అంశాల్నీ కలిపితే, మా బోటి సిగ్గుమాలిన వేతన బానిసలు, యజమానులకు అప్పజెప్పే అదనపు విలువ రాసి, అంటే అదనపు డబ్బు రాసి, అవుతుంది."

"మీరు 'కాపిటల్' చదివితే, ఇలాంటి పరీక్షలో మీ కందరికీ నూటికి నూరు మార్కులూ వస్తాయి."

"చదువుతాం. తప్పకుండా చదువుతాం. ముందు ఈ పాఠాలన్నీ అవనివ్వండి!"★

## 50. సైకిల్‌ని వదిలేసే కార్మిక నాయకులు!

**93.** "ఆస్తులన్నీ శ్రమ ఫలితాలు" అన్నారు మీరు చాలా సార్లు. ఆ మాటలు ఎప్పుడూ గుర్తే. కానీ ఆ ఆస్తులన్నీ ఎవరి దగ్గిరికి పోయాయి? ఏ నాటి నించో ఇంత దుర్మార్గం జరుగుతోందా! అబద్ధాలనే నిజాలని నమ్ముతూ బతికారా పాత వాళ్ళందరూ! ఈ నిజం తెలుసుకుని ఇప్పుడు ఎవరు మాత్రం ఏం చేస్తారు? మళ్ళీ యజమానుల ముందుకు పోవలసిందే, తలలొంచుకుని పనులు చెయ్యవలసిందే! అంతేగా? నిజం అదేగా?

**జ:** నిజం ఏమిటో తెలిశాక కూడా యజమానే రక్షకుడి లాగ కనపడుతున్నాడా! మనం ఈ సంగతులన్నీ ఎందుకు నేర్చుకుంటున్నాం? ఇదంతా జ్ఞానం కోసం

జ్ఞానమా! 'మాకూ తెలుసు' అని చెప్పుకోడానికా? ఇదంతా పండిత చర్చలా? పండితులైతే, కూర్చుని, వాదించుకుని లేచిపోతారు. చివరికి చెయ్యడానికి ఏమీ ఉండదు. మన సంగతి అది కాదు. మనం ఏ దుస్థితిలో ఉన్నామో అర్థం చేసుకుంటున్నాం. దుస్థితిని తెలుసుకున్నాక కూడా దాన్ని తప్పించుకోలేమా? శ్రమలు చేసే మనుషులు బతకడానికి యజమానులు ఉండాలా? వాళ్ళు శ్రామికులకు పనులు ఎలా చూపిస్తున్నారు? ఉత్పత్తి సాధనాలన్నీ ఆక్రమించి ఉన్నారు కాబట్టి. అవన్నీ వాళ్ళ శ్రమలతో వాళ్ళకి వచ్చాయా? భూమిని భూస్వాములు తయారు చేశారా? ఉత్పత్తి సాధనాలన్నీ వాళ్ళు అక్రమంగా ఆక్రమించి కూర్చున్నారు. అవి వాళ్ళ ఆధీనంలో వుండడమే వాళ్ళ శక్తి. ఆ శక్తి, ఆ ఉత్పత్తి సాధనాలన్నీ, ఆ పాత శ్రమ అంతా, వాళ్ళ దగ్గిర వున్నందుకే. దాని వల్లే వాళ్ళు పరిపాలకులు అయ్యారు. పాలించేది అసలు మనుషులు కాదు, ఉత్పత్తి సాధనాల ఆస్తే. పాలించేదంతా పెట్టుబడే. యజమానులు గానీ, బానిసలు గానీ, వేతన శ్రామికులు గానీ, అప్పుడు వున్న శ్రమ సంబంధాలకు మానవ రూపాలు. ఆ సంబంధాల్ని విడిగా చూడలేం. ఒక బానిసని చూస్తే, అప్పుడు, సమాజంలో వున్న శ్రమ సంబంధం కనపడుతుంది. అలాగే, ఒక కౌలు రైతుని చూస్తే. అలాగే వేతన శ్రామికుల్ని చూస్తే. యజమానుల్ని చూస్తే. అవన్నీ రక రకాల శ్రమ సంబంధాలు.

అది ఎప్పుడు ఎలా జరిగిందో ఇప్పుడు అనవసరం. మనకు కనపడుతున్నది ఇదే. ఉత్పత్తి సాధనాలన్నిటినీ వాళ్ళ బంధాల నించి లాగి వెయ్యాలి గానీ, వేల సంవత్సరాల నించీ జరుగుతున్నట్టే, వాటిని వాళ్ళ దగ్గిరే ఉంచి, శ్రమలు చేసే వాళ్ళంతా వాళ్ళ దగ్గిరికే పోయి పనులు ఇవ్వమని యాచిస్తూ ఉండాలా? శ్రమలు చెయ్యని వాళ్ళ దగ్గిర ఎన్ని సాధనాలు ఉన్నా, వాళ్ళకి తిండి కావాలంటే, పనులు చేసే వాళ్ళని పిలవకపోతే వాళ్ళకి గడుస్తుందా? శ్రామి కుల్ని పిలవకపోతే, యజమానులు, మంచి నీళ్ళు కూడా అందక ఒక్క రోజులో చచ్చి తీరుతారు. వాళ్ళ అవసరం కోసమే వాళ్ళు శ్రామికులకు పనులు ఇస్తారు. అంతేగానీ, శ్రామికులపై దయదలచి ఇస్తారా? యజమానులు పనులు చూపిస్తారనీ, శ్రామికుల్ని పోషిస్తారనీ, ఎంతెంత పిచ్చి మాటలు! శ్రామికుల్ని పోషించేది యజమానులు కాదు, అలా అనుకోవడం తల్లకిందుల వ్యవహారం. యజమానుల్ని పోషించేదే శ్రామికులు. మార్క్స్ ఏమన్నాడో తెలుసా? **'ప్రపంచం తల్లకిందులుగా ఉంది, దాన్ని తిన్నగా తిప్పాలి'** అన్నాడు. ఎవరు తిప్పాలి? శ్రామిక వర్గమే ఆ మార్పు చేసుకోవాలి. పెట్టు బడులు పెట్టడానికి ఏ పెట్టుబడిదారుడూ అక్కరలేదు. అసలు అవి, పెట్టుబడులు కావు, ఉత్పత్తి సాధనాలే. అవి అన్నీ శ్రామికులు చేసి ఉంచినవే. అన్నీ సిద్ధంగానే ఉన్నాయి. భూములన్నీ సాగుకు సిద్ధంగానే ఉన్నాయి. పనిముట్లని చేతుల్లోకి తీసుకునే వాళ్ళం మనమే. దోపిడీదారుల ఆధీనంలో ఉన్న ఉత్పత్తి సాధ నాల్ని మన ఆధీనంలోకి తీసుకుంటే చాలు, పనులు మనకి ఇంకెవరో ఇవ్వక్కరలేదు. ఇన్నాళ్ళూ పనులు ఇచ్చే అధికారాలు చెలాయించిన యజమానులు కూడా ఇప్పుడు నడుములు వొంచి పనులు చెయ్యడం మొదలుపెట్టాలి. భూస్వామి కూడా భూమి లోకి దిగుతాడు. పెట్టుబడిదారుడు

కూడా యంత్రాల ముందు నిలబడతాడు. వాళ్ళూ బస్సులు నడుపుతారు, రైళ్ళు నడుపుతారు. అందరూ ఉత్పత్తిదారులవుతారు. ఇక యజమాను లెవరూ, శ్రామికులెవరూ? శ్రమ దోపిడీ ఎక్కడ?

"మీ మాటలన్నీ అడ్డు పడకుండా వినాలని మేం మౌనంగా ఉండి పోయాం. అలా జరిగితే ఎంత గొప్ప సంగతి! మా యజమాని మాతో పాటు వంటల గదుల్లోకి వస్తాడా! పొయ్యిల ముందు నిలబడి గరిటె చేతిలోకి తీసుకుంటాడా! మా మేనేజరు మాతోపాటు గిన్నెలు తోముతాడా! మా సెక్షన్ హెడ్డు మాతోపాటు గదులు ఊడు స్తాడా! ఏం, ఎందుకు చెయ్యరు? మేం చెయ్యడం లేదా? మేం, వాళ్ళలాంటి మను షులం కామా? వాళ్ళు ఆకాశం నించి ఊడిపడ్డారా? అందరం కలిసి శ్రమలు చేస్తామా! ఎంత బాగుంది ఇది! ఇది జరగకపోయినా సరే! ఈ కల ఎంత బాగుంది!"

" 'జరగకపోయినా' అని ఎందుకు అంటున్నారు? జరిగేలాగ చేసుకోవడం ఇష్టం లేకపోతేనే అది జరగదు. మీ నలుగురూ కూడా క్రమంగా చిన్న పెట్టుబడితో చిన్న హోటల్ ప్రారంభించి, మొదట చిన్న బూర్జువాలుగా, తర్వాత పెద్ద బూర్జువాలుగా, ఎదగాలనే కలలు కూడా కనొచ్చు. అప్పుడు మీరే శ్రామికుల్ని పిలవాలి. మీరు పనులు మానేసి సోఫాల్లో కూర్చుంటారు. కానీ మీ శ్రామికులే మిమ్మల్ని మళ్ళీ పనుల్లోకి దింపుతారని గ్రహించుకోండి! ఆ పీడ కలలు కూడా కనండి!"

"లేదు, లేదు. మీరు మా క్షేమానికే మమ్మల్ని హెచ్చరిస్తున్నారు. మేము నలు గురం ఎన్నో సంవత్సరాల నించీ ఎక్కడో అక్కడ పనులు చేస్తూనే బతుకుతున్నాం. ఈ ముగ్గురూ నా కన్నా తెగింపు మనుషులే. నేనే అందరి కన్నా నిరుత్సాహం మనిషిని. అయినా యజమానుల మీద నాకు ఉన్నంత కోపం ఇంకెవరికీ ఉండదనుకుంటాను. నా కోపం బక్క కోపం. దానితో ఏం జరగాలో నాకు తెలీదు."

"మీరు 'కాపిటల్' చదివితే ఈ గందరగోళం పోతుంది. కర్తవ్యం తెలుస్తుంది. సమస్య అర్థమైతే పరిష్కారం అర్థమౌతుంది."

"అదీ తెలుసు. మా కలని నిజం చేసుకోవాలి. కానీ, ఇప్పుడేం చెయ్యగలం?"

"మీ పని స్థలంలో మీ శ్రామికుల సంఘం ఉందా?"

"అమ్మో! సంఘం మాటా! నేను ఈ పనిలోకి రాక ముందు సంఘం ఉండేదని మా వాళ్ళన్నారు. ఒక కార్మికుడు, గట్టివాడు, అప్పుడు ఆ పని చేశాడట. అతన్ని మా వాడు తీసేశాడు. తర్వాత అది అలా మూలబడిపోయింది."

"ఇప్పుడు మీకేమీ సమస్యలు లేవా?"

"అయ్యో! ఉన్నవన్నీ అవే. మా జీతాలు ఐదేళ్ళ కిందటివి. సరుకుల ధరలైతే, ఆర్నెల్లకోసారి పెంచుతూ ఉంటాడు. ఈ మధ్యే రెండు నెలల నించీ గిన్నెలు తోమే వాళ్ళు తగ్గారు. కొత్త వాళ్ళని పెట్టడు. పాత వాళ్ళల్లో ఇద్దరు మిగిలితే, వాళ్ళకే జీతం పిడికెడు పెంచి, ఇక సరిపెట్టాడు. ఒక్కో సారి ఇడ్లీ ప్లేట్లు అందక, వాటిని గబ గబా నేనే తోముకుంటాను. గిన్నెల వాళ్ళ మీద కంప్లయింట్ చేస్తే వాళ్ళని కూడా తీసేస్తాడు, ఎందుకు లెమ్మని వాళ్ళు తోమక పోయినా నేను హెడ్డుకి చెప్పను."

"మీ శ్రామిక సామరస్యం బాగానే ఉంది. మరి సంఘం మాట ఏమిటి? పాత సంఘాన్ని కాస్త పునరుద్ధరిస్తే, మీ సమస్యలన్నిటినీ యజమాని ముందు పెట్టొచ్చు కదా?"

"దానికి సంఘం కావాలా? మా సమస్యలు వాడికి తెలీదా?"

" 'సంఘం' అంటే కార్మికుల సమిష్టితనం. కార్మికుల ఐకమత్యం. సంఘం లేకపోతే, కార్మికులు విడి విడిగా ఎవరి సమస్యలతో వాళ్ళు యాతన పడుతూ ఉంటారు. సంఘం ద్వారా సమిష్టిగా డిమాండ్ చేస్తే, యజమాని ఆ డిమాండ్లయినా నెరవేరుస్తాడు. కార్మికుల పోరాటంలో, మొదటి అడుగు, సంఘం పెట్టుకోవడమే."

"అవును, మరి ఈ మధ్య ఈ సంగతులన్నీ మళ్ళీ మళ్ళీ మాట్లాడుకుంటున్నాం. సంఘం మాట కూడా వీళ్ళు గట్టిగానే అంటున్నారు. నేనే ఇంకా నేర్చుకున్నాక చూద్దాం అంటున్నాను. మాకేం తెలుసు అసలు?"

"తెలుసుకోవలిసింది చాలా ఉంది. కానీ, సంఘం పెట్టుకోడానికి ఇంకా తెలియాల్సింది ఏమీ లేదు. సంఘంతో, సమ్మెలతో, పోరాటాలు ప్రారంభమైతే, అది ఎక్కడి దాకా వెళ్ళగలదంటే, దోపిడీ రాజ్యాంగ యంత్రాన్ని కూలగొట్టే దాకా వెళ్తుంది. యజమానుల ఆధీనంలో ఉన్న భూముల్నీ, ఫ్యాక్టరీల్నీ, యంత్రాల్నీ, సమస్తాన్నీ స్వాధీనం చేసుకునే దాకా వెళ్తుంది. అది తప్పు కాదు, అన్యాయం కాదు. శ్రామిక వర్గం, దోపిడీ నించి బైటపడే మార్గం అది. తనని తను రక్షించుకునే మార్గం అది! మీ దగ్గిర లేకపోయినా, ఇతర హోటళ్ళలోనూ, ఇతర కంపెనీల్లోనూ, సంఘాలు ఉన్నాయో లేదో చూశారా?"

"ఎక్కడున్నాయి? ఎక్కడా లేవు. అక్కడక్కడా ఉన్నాయి గానీ, అవన్నీ మేనేజిమెంటుకి తొత్తులే. అన్నట్టు ఒక కంపెనీలో పని వాళ్ళ సంఘం లీడరు మాకు కొంచెం తెలిసిన వాడే. వాడు ఒకప్పుడు మా లాగే పని చేసేవాడు. సైకిల్ మీద తిరిగేవాడు. ఇప్పుడు కారులో తప్ప కనపడడు. మమ్మల్ని చూసినా పలకరించడు."

"ఇంకా నయం. అలాంటి వాడు పలకరిస్తే మీకే అవమానం. ఎప్పుడన్నా కారు ఆపి మిమ్మల్ని ఎక్కమంటే ఎక్కుతారా?"

"వాడు మమ్మల్ని ఎక్కమంటాడా? మా మొహాలు చూస్తాడా?"

"మీరే అతని మొహం చూడకూడదు. ఒక వేళ అతను మిమ్మల్ని ఎక్కమంటే ఏం చేస్తారని నేను అడిగాను. అడిగిన ప్రశ్నని బట్టే జవాబు ఉండాలి. మమ్మల్ని ఎక్కమంటాడా - అనడం కాదు."

"అబ్బే, వాడితో వెళ్ళేది ఉండదు."

"ఒక కార్మికుడు అలా తయారయ్యాడంటే, వాడు యజమాని అయిపోవడంతో సమానం. క్రమంగా అతనే ఒక వ్యాపారం పెడతాడు. 'మీకు కూడా అలా ఎదగాలని' ఎప్పుడైనా అనిపిస్తుందా?"

"లేదు, ఇది వరకూ లేదు, ఇప్పుడైతే అసలే లేదు."

"ఇది వరకైతే కొంచెం ఉందా?"

"ఏమో, అది తెలీని కాలం."

"ఏ కార్మికుడైనా పెట్టుబడిదారుడిగా మారితే, అతనికి లాభం ఎలా వస్తుంది? పెట్టుబడి కన్నా 'అదనం' ఎలా వస్తుంది? - ఈ విషయాలన్నీ గుర్తున్నాయి కదా?"

"అయ్యో! ఎంత చెప్పారు! మర్చిపోతే కదా, గుర్తు రావడానికి? మా వాడికి 'అదనం' ఎక్కణ్ణించి వస్తుంది? మా కష్టంలో నించే వస్తుంది. యజమానులూ, పని వాళ్ళూ ఉన్నారంటే, ఎక్కడైనా ఇదే జరుగుతుంది."

"అంతా బాగా అర్థమైంది మీకు. 'పెట్టుబడి మీద అదనం ఎలా వస్తుంది?' అనే విషయం, మొత్తం మానవ సంబంధాలకే మూలం - తెలుసా? ఆ 'అదనం' రావడం, అది డబ్బుగా కనపడకపోయినా, బానిస యజమానుల కాలం నించీ ఉంది. మొత్తం ఆర్థిక శాస్త్రం, తత్వశాస్త్రం, సమాజంలో న్యాయం, ధర్మం, అన్నీ, ఆ అదనం కోసమే, దాన్నిలాగే సాంప్రదాయాలతోనే, ఏర్పడ్డాయి, తెలుసా? ఉత్పత్తి సాధనాల ఖర్చు మీద అదనం కూడా రావడమే సరైన శాస్త్రం - అని యజమానుల ఆర్థిక శాస్త్రం చెపుతుంది. దాని న్యాయాలూ ధర్మాలూ, దాని సాంప్రదాయాలూ సంస్కృతులూ అన్నీ, ఆ అదనం లాగడం మీద ఆధారపడి ఏర్పడ్డవే. యజమాని మానవుడు, బానిస మానవుడి గుండెల్లో కత్తితో పొడిచినా అది న్యాయమే. యజ మాని, శ్రామికులు మోసే పల్లకీలో ఊరేగినా, అది సత్సంప్రదాయమే. ఈ నాటి యజమాని సిగరెట్ కాలుస్తూ పరుపుల కుర్చీలో సేదదీరుతూ ఉంటే, పనివాడు ఆ యజమాని పాదాలు నొక్కుతూ నిమురుతూ ఉంటే, అది న్యాయమే. ఈ నాటికీ కౌళ్ళు న్యాయమే, వడ్డీలు న్యాయమే, లాభాలు న్యాయమే, మొత్తం దోపిడీ అంతా న్యాయమే. ఒక మనిషి పని చెయ్యని వాడూ, ఇంకో మనిషి వందమంది కోసం పని చేసేవాడూ - అదీ న్యాయమే. ఈ నాటికీ ఈ న్యాయాలూ ధర్మాలూ స్థిరంగా సాగు తున్నాయి. ఇది, శ్రామికుల అదనం శ్రమ కోసం యజమానులు సాగిస్తోన్న ప్రపంచం! దీనితో శ్రామికులు కూడా ఏకీభవిస్తూ ఉంటే, ఈ ప్రపంచం ఇలాగే భూగోళం నశించే దాకా సాగుతుంది."

"దీనికి వృత్తి సంఘాలేనా పరిష్కారం? అంత కన్నా తొందరగా చేసే మార్గం లేదా?"

"అంత కన్నా తొందరగా చెయ్యగలిగితే, అదీ సంఘమే. ఒక పని స్థలంలో పని వాళ్ళందరూ కలిసి, లేదా పది మందే కలిసి, ఒక నిర్ణయానికి వచ్చారంటే, ఆ నిర్ణ యమే ఒక సంఘం! దానికి ఏ పేరూ లేకపోయినా, అది సమిష్టితనం! కానీ 'సంఘం' అన్నప్పుడు, దానికి కొన్ని నిబంధనలు ఉంటాయి. క్రమశిక్షణ ఉంటుంది. బాధ్యతలు ఉంటాయి. సంఘంలో ఉండే మనుషులకు ఉండే బలం, విడి విడి మనుషులకు ఉండదు. సంఘాలు లేనే లేవని కాదు. కానీ, యజమానులే నడిపే శ్రామిక సంఘాల వల్ల ఏం ప్రయోజనం? సైకిల్ని వదిలేసి కార్లలోకీ, విమానాల్లోకీ మారే శ్రామిక నాయకుల వల్ల ఏం ప్రయోజనం? ఆ రెండు రకాలూ పనికి రావు."

"తెలుసు. ఆ రెండు రకాల్నీ మేం అసహ్యించుకుంటాం." ★

# 51. శ్రామికులకు సంస్కరణల దృష్టి, శ్రామిక వర్గ స్పృహతో కలిసి వుండాలి!

**94.** మా ఆవిడ భలే మారిపోతోందండీ! ఆశ్చర్యంగా వుంది నాకే. మొన్న ఏం జరిగిందో తెలుసాండీ? పుట్టలో పాలు పోసే పండగ వచ్చింది కదా? ఈవిడికి ప్రతీ సారీ అది తెగ ముచ్చట. నువ్వుల వుండలూ చలిమిడీ తయారుచేస్తుంది. ఆ వుండలు పుట్టల్లో పడేసి, అక్కడక్కడా పాలు పోస్తుంది. అదంతా నాకు తెలుసుగానీ పట్టించుకునే వాణ్ణి కాదు. 'ఏమో, నాగ దేవత కదా?' అనుకునే వాణ్ణి. అదీ గాక, 'ఆడ వాళ్ళ సరదాల్లే, వాళ్ళకి కావలసినట్టు వాళ్ళు చేసుకుం టారు' అనుకునే వాళ్ళం. కానీ మీరిచ్చిన పుస్తకాలు చదువుతున్నాను కదా? అవి ఇంటికి తీసికెళ్ళగానే మా పిల్లాడు ఎగబడి వాటిని లాక్కుంటాడు. వాడు పూర్తి చేస్తేనే నన్ను ముట్టుకో నిస్తాడు. ఎంత తొందరగా నేర్చుకున్నా డండీ! ఇక వాళ్ళ అమ్మ మీద పట్టించాడు. బోధనలు మొదలుపెట్టాడు. ఆ మధ్య గోడలకి అంటించిన దేవుళ్ళ కాయితాలు తనే తీసేసింది కదా? ఆ తర్వాతే పుట్టలో పాల గోల వచ్చింది. పడీ పడీ పిండి దంచి చలిమిడి చేసింది. నువ్వులూ కొబ్బరి ముక్కలూ ఎర్రగా వేయించి ఎంత కమ్మగా చేసిందో! ఆ ముద్దలన్నీ పుట్టల్లో పడెయ్యడానికి! మా పిల్లాడు ఎప్పటి నించో వాదాలు చేస్తూనే వున్నాడు. 'పాలు తీసుకుపోయి పుట్టల్లో పొయ్యడం కాదు, నీ పొట్టలో పోసుకో' అని మొదలుపెట్టాడు. వాడు ఇంకో తమాషా చేశాడు. అర ఠావు సైజు కాయితాలు తీసుకుని, 'పాలు పోసేది, పుట్టల్లో కాదు, పొట్టల్లో!' అని తాటి కాయలంతంత అక్షరాలతో రాసి, ఒక రాత్రి మా సందులో అందరి కొంపలకీ తిరిగి, గోడలకీ, తలుపులకీ, అంటించేశాడు. ఆ కొంపల్లో చాలా మందికి చదువులు రావు. తెల్లారాక తర్వాతెప్పుడో చదివించుకున్నారు. ఈ పిల్లాడంటే, వాళ్ళందరికీ ముద్దే లెండి. వాళ్ళ పిల్లలకి చదువు చెపుతాడు కదా? వాళ్ళు ఆ కాయితాల మీద రాసింది చదివించుకుని, తెల్లబోయారు, కంగారు పడ్డారు, నవ్వుకున్నారు. ఒక రోజు ఏం జరిగిందంటే, మా పక్కింట్లోనే ఒకళ్ళ దొడ్లోకి అదేదో పాము వచ్చింది. పట్ట పగలే. అప్పుడు ఆ ఇంటి మొగాయన లేడు. ఆవిడ గోల గోల పెట్టి కేకలేస్తే, నలుగురు ఆడ వాళ్ళు అక్కడికి చేరి, నాలుగు కర్రలతో తలో దెబ్బా వేసి పాపం దాన్ని చంపేసి అవతల పారేశారు. దాన్ని చూసిన వాళ్ళు దాన్ని నాగుపామే అన్నారు. ఆ సందు దొరికింది మా వాడికి. వాళ్ళందరితో వాదనలు మొదలుపెట్టాడు, 'నాగ దేవత మీ వాకిట్లోకి వస్తే ఎందుకు చంపేశారు? పాములు మన ఇళ్ళల్లోకి జొరబడితే చంపేస్తాం. పూజించం. ఇక్కడైతే, చంపేస్తారా, అక్కడికెళ్ళి పాలు పోస్తారా?' అని. రోజూ ఆ గల్లీ అంతా ఇంటింట్లోనూ వాదాలే. అందరూ

నవ్వారు. 'మీకు పండగ చేసుకోవాలని సరదాగా వుంటే, ఆ పాలూ, ఉండలూ, ఇరుగు పొరుగు పిల్లలకి పెట్టండి! పిల్లలు అవన్నీ తింటూ గంతు లేస్తూ వుంటే, మీకు సంతోషంగా వుండదా' అని పది రోజులు వాదించాడు. కొందరు నిజంగానే ఒప్పుకున్నారు. కొందరైతే, 'మాకు మొక్కులున్నాయి, మొక్కులు ఎగ్గొడతామా? ఈ ఏడాదికి ఇంతే, వచ్చే ఏడాది చూద్దాం' అన్నారు. మా ఆవిడైతే, ఆ చలిమిడి ముద్దలన్నీ పాకల్లో పిల్లలకి పంచేసింది. ఆ పండగ రోజు పాలతో బియ్యం పాయసం వండి ఆ పాకల్లో పిల్లలకే పెట్టింది. అక్కడ కుండలు చేసే వాళ్ళు, ఈమెకి చిన్న కొత్త పిడత ఇచ్చారు. అది పట్టుకుని మురుస్తూ ఇంటికొచ్చింది. 'పండగంటే నిజంగా ఇదే. ఒకళ్ళ కొకళ్ళు ఇచ్చు కోవాలి, పెట్టుకోవాలి. పరమాన్నం పిల్లలు తింటే బాగుంది గానీ, పాలన్నీ మట్టిలో పోస్తే ఏం బాగుంటుంది? ఇన్నాళ్ళూ ఏదో చేశాన్లే' అని తెగ మాట్లాడింది. ఆ పిడత తోటే మంచి నీళ్ళు తాగుతోంది. సరిగ్గా ఆ రోజే ఒక చుట్టపాయన వచ్చి, ఒక కార్డు ఇచ్చి తప్పకుండా రమ్మని మా ఇద్దర్నీ పిల్చాడు. అదేదో సత్యనారాయణ వ్రతమో ఏదో. నేను కంగారు పడు తున్నాను, ఏం చెప్పాలా అని. మా ఆవిడ టకీమని చెప్పేసిందండీ. 'ఇలాం టివి మా కొద్దు. ఎందుకా పూజలకి దండగ? ఎవరికన్నా సాయం చెయ్యండి' అంది. అతను తెల్లబోయి వెళ్ళిపోయాడు. ఎలా చెప్పాలో తోచక నేనింకా మొహమాటంగా వుంటే ఆవిడ అలా చెప్పేసింది! తర్వాత నాతో, 'నువ్వెళ్తే నేనొప్పుకోను. ఇన్నాళ్ళూ ఏదో చేశాం, ఇంకానా?' అంది. 'ఛ! నేనెందు కెళ్తాను?' అన్నాను నేను బడాయిగా. అంత జరిగిందండీ వారం రోజుల క్రితం. మా ఆవిడ ఇలా మారిందంటే, ఇంక ఇలాగే వుంటుందంటారా?

**జ :** మీరు మాత్రం ఇలాగే వుంటారని మీరైనా చెప్పగలరా? ఇంకా అలాంటివే మాట్లాడుకుంటూ వుండాలి. ఎంత మంచి విషయం మీదైనా మనుషులు ఒంటరిగా నిలబడలేరు. మంచి పద్ధతులు స్నేహంగా కలిసి పాటిస్తూ వుండాలి. మీరు చెప్పినవన్నీ ఎంత మంచి సంగతులో! అందులో ఎన్నో విషయాలున్నా యండీ. ఏదన్నా మంచి తర్కంతో చెప్తే కొందరు వెంటనే వింటారు, మారతారు. మారడం సాధ్యం కాని ఇబ్బందులు వుంటాయి కొందరికి. మొక్కులు మొక్కుకున్న వాళ్ళకి అవన్నీ సమస్యలు. ఆ బాధలు దేవుళ్ళ వల్ల తీరిపోతాయి అనుకుంటారు. అవి ఆ పద్ధతిలో తీరకపోయినా, వాళ్ళకి నేర్పే వాళ్ళు లేకపోతే, వాళ్ళు అలాగే వుండిపోతారు. మీ ఇంట్లో పరిస్థితులు తేడాగా వున్నాయి కాబట్టి మీ ఆవిడ మారింది. ఎన్ని సంగతులు తెలిసినా మీరు మొహమాటం మనిషి. మీ లాగే పెద్ద సైంటిస్టులు కూడా అన్నిటికీ లొంగి బతుకుతూ వుంటారు. చేతులకి వ్రతాల దారాలో, కాశీ దారాలో కట్టుకుని తిరిగే సైంటిస్టుల్ని చూశారా ఎప్పుడైనా? అది పెళ్ళాల నమ్మకం అంటారు. పెళ్ళాల నమ్మకాలు వీళ్ళ మీద వుంటాయి. వీళ్ళ

నమ్మకాలు పెళ్ళాల మీద వుండవు. వాళ్ళకి సైన్సు, వీధిలో సంగతి. ఇంట్లో అయితే, అన్నీ పాత నమ్మకాలే. మీ ఆవిడికి చదువు లేకపోయినా ఎంత వివేకంగా వుంది! ఆవిడికి చదువు చెప్పమని మీ అబ్బాయికి గట్టిగా చెప్పండి!

"చెపుతున్నాడు. అప్పుడప్పుడూ డిక్టేషన్ రాయమంటే రాస్తోంది. నాకిప్పుడు ఏమనిపిస్తోందంటే, సంఘ సేవలు అంటారు, ఇలాగే పిల్లలకి చదువులు చెప్పడం, దేవుడి మొక్కుల నమ్మకాలు వద్దని చెప్పడం, అదీ చెయ్యాలి కదా అనిపిస్తోంది. మా పని దగ్గిర పూర్వం లాగ కాదు, కాస్త మాట్లాడుకుంటున్నాం. 'పర్యావరణం' అంటారు, 'ప్రపంచీకరణం' అంటారు. అవేమిటో ఎవరికీ తెలీవు. అయినా ఏదేదో నోటికొచ్చినట్టు అంటారు. అదేదో కాస్త తెలుసుకోవాలి ముందు."

"పర్యావరణం అంటే, భూమి చుట్టూ వున్న వాతావరణమే. మనం జీవిస్తూ వున్న వాతావరణమే. భూమి లోపల బోలెడు బొగ్గూ, ఖనిజాలూ, లోహాలూ, అలాంటివేవేవో వుంటే వున్నాయి. అవన్నీ తవ్వేసి బైటికి లాగితే, అక్కడ అగాధాలు ఏర్పడవూ? ఒక్కో చోట భూమి లోపల బొగ్గు మన పాదాలకి కాస్త దగ్గరగా వుంటే, పై నించి మట్టిని తవ్వేసి, దాన్ని ఆ పక్కనే గుట్టల్లాగ పోసేసి, బొగ్గుని తీసి అమ్ము కుంటారు పెట్టుబడిదారులు. ఆ తవ్విన చోట్ల చదరపు మైళ్ళ కొద్దీ అగాధాలు అయిపోతాయి. ఆ మట్టి నంతా పోసిన చోట కూడా వందల వేల చదరపు గజాల భూమి మీద మట్టి పర్వతాలు లేస్తాయి. అంటే, బొగ్గుని తవ్విన చోట్లా, ఆ మట్టిని పోసిన చోట్లా, వందల కిలో మీటర్ల భూమి శాశ్వితంగా పనికి రాకుండా పోయినట్టే కదా? అక్కడ వ్యవసాయాలూ కుదరవు, ఇళ్ళు కట్టడాలూ కుదరవు, తోటలూ వుండవు, స్కూళ్ళూ వుండవు, ఆస్పత్రులూ వుండవు, ఏ పని స్థలాలూ వుండవు! మొత్తంగా ఆ భూమి, ఏ అవసరానికీ పనికి రాకుండా నాశనమై పోయినట్టే!"

"అయ్యో, ఆ తవ్విన మట్టినే, మళ్ళీ ఆ తవ్విన గోతుల్లో పోసెయ్యొచ్చు కదా? ఎందుకు పొయ్యరు?"

"అలా చెయ్యొచ్చు. చేస్తే, ఆ పెట్టుబడిదారుడికి లక్షల్లో, కోట్లో డబ్బు ఖర్చవు తుంది. కాబట్టి అలా చెయ్యడు. అలా చెయ్యాలని ప్రభుత్వం నిబంధన పెట్టదు."

"అదేం ప్రభుత్వం? ప్రభుత్వం ఎందుకలా చేస్తుంది?"

"బానిస యజమానుల కాలం నించీ ఈ ప్రభుత్వం ఎవరి ప్రభుత్వం? దోపిడీ మీద బతికే వర్గం పెట్టుకున్న ప్రభుత్వమే కదా? దాని చట్టాలన్నీ దోపిడీకి అను కూలం. పదవుల్లో వున్న పరిపాలకులందరూ దోపిడీదారులే. ఆ గనుల కాంట్రాక్టు లన్నీ వాళ్ళవే. వాళ్ళు, ఆ వర్గం లాభం సంపాదించడానికే అనుకూలంగా వుంటారు గానీ, 'ఆ బొగ్గు గోతులన్నీ పూడ్చండి' అని నిబంధన ఎందుకు పెడతారు?"

"అయ్యో, అలాగైతే, ఆ భూములన్నీ పనికి రాకుండా అయిపోవడం లేదూ?"

"అయిపోతే వాళ్ళకేం బాధ? వాళ్ళు ఆ చుట్టుపట్ల వుండరు కదా? అక్కడ గాలి నిండా దుమ్మూ ధూళీ నిండిపోతాయి. నీళ్ళ వాగులూ చెరువులూ, చెట్లూ పుట్టలూ

అన్నీ, దుమ్ముతో కప్పడి పోతాయి. పర్యావరణం పాడవడానికి ఇదో చిన్న ఉదాహరణ. ఇలాగే, భూమి నిండా అనేక దుష్టత్వాలు జరిగిపోతోంటే, కొందరు తత్వ శాస్త్రాల వాళ్ళు ఏమంటారో తెలుసా? 'మానవులు స్వార్ధ పరులు, అలాగే చేస్తారు' అంటారు."

"అయ్యో, ఇక్కడ 'స్వార్ధం' ఎవరిది? ఆ బొగ్గుని తవ్వించిన పెట్టుబడి దారుడిదా, తవ్విన వాళ్ళదా?"

"ఇక్కడే కాదు, ఏ తప్పుడు పనిని తీసుకున్నా, ఆ తప్పు, లాభాల కోసం అలా చేయించే వాళ్ళదా, బతుకుదెరువు కోసం యజమానులు చెప్పినట్టు చేసేవాళ్ళదా? 'మానవులు, మానవులు' అని పాట! ఆ మానవుల్లో తేడాలు వున్నాయి - అనే మాటే ఎరగనట్టు దాటవేస్తారు."

"మానవులందరూ ఒకటి ఎలా అవుతారు? నేనూ, నా యజమానీ, ఒకటేనా? ఇద్దరం మనుషులమే. అయితే, వాడు నా యజమానీ, నేను వాడి బానిసనీ. యజమాని ఎలా చెప్తే అలా చేస్తాను. నా నిర్ణయం ఏముంది అక్కడ?"

"అంటే, మనం మాట్లాడేది శ్రామిక దృష్టితో. వాళ్ళు మాట్లాడేది యజమాని దృష్టితో. ఆ వర్గాల సంగతి అలా వుంచండి. అందరూ మానవులుగా వుండండి అంటారు."

"ఏడిసినట్టే వుంది. ఇదా మానవ హక్కుల వాళ్ళు చెప్పేది? పర్యావరణం ఎవరి వల్ల నాశనం అవుతోందో వాళ్ళకి తెలీదా? ఈ మాటల వాళ్ళు ఒకరిద్దరు వున్నారు మా దగ్గిర. వాళ్ళ సంఘంలో నన్ను చేరమని ఎప్పట్నించో అడుగుతున్నారు. నాకూ ఏదో ఒక పని మొదలుపెట్టాలని ఎప్పటి నించో అనిపిస్తోంది. హేతు వాదం ఉద్యమాలంటే నాకు చాలా ఇష్టంగా వుంది ఇప్పుడు. మానవ హక్కుల ఉద్యమాలంటే అది చాలా అవసరమే గానీ, మా ఇంట్లో వాళ్ళం ముగ్గురం కూడా చేరిపోవచ్చు గానీ, మానవులంటే యజమానులే అన్నట్టు, వాళ్ళకి కావలసినట్టు మాట్లాడితే ఎలాగ? మానవుల్లో ఎన్ని తేడాలున్నాయో అది తెలియొద్దూ వాళ్ళకి?"

"అదే మరి అసలు ఆలోచించవలసింది. కాస్త మంచి ఉద్యమాలైతే అన్నిట్లోనూ పని చెయ్యవచ్చు. ఒక ఉద్యోగం చేసుకుంటూ అలాగే బతికెయ్యడం కంటే, జనాలకు మేలు చేసే ఏ పనిలో తిరిగినా మంచిదే. కానీ ప్రతీ చోటా శ్రామిక వర్గ జ్ఞానంతో వుండాలి. 'హేతు వాదం' అన్నారు. ప్రకృతికేనా హేతు వాదం? సమాజానికి లేదా హేతు వాదం? మనుషుల్లో, యజమానులూ - సేవకులూ ఎందుకు వున్నారు? కలిమీ - లేమీ ఎందుకు వున్నాయి? వాటికి హేతు వాదం అక్కర లేదా? 'మానవ హక్కులు' అన్నారు. సమాజానికి వున్న పునాదిలోనే శ్రామిక వర్గానికి హక్కులు లేవు. పాత కాలాల్లోనూ, ఇప్పుడూ కూడా యుద్ధాలు వున్నాయి. యుద్ధాల్లో సైనికులందరూ ఎవరు? అందరూ నిరు పేదలు. యజమానుల ఆస్తుల కీచులాటల కోసం, సైనికులు చచ్చిపోవాలా? అక్కడ సైనికులకు వున్న మానవ హక్కులు ఏమిటి? 'భూమి మీద భూస్వాములకు హక్కులు ఎలా వచ్చాయి' అని

అడుగుతారా మానవ హక్కుల వాళ్ళు? 'కొందరు మానవులు యజమానులుగా ఎందుకు వుండాలి?' అని అడుగుతారా వాళ్ళు? పునాదిలో హక్కులు ఎంత అక్రమంగా వున్నాయో అది చూడరు. వాటిని ముట్టుకోరు. అవి అలాగే వుండాలంటారు. కానీ, మానవుల్ని ఉద్ధరిస్తున్నట్టూ, మానవులందరి పరిస్థితులూ ఒకటే అయినట్టూ, మానవ హక్కుల వాళ్ళు, మానవతా వాదులం అని చెప్పుకుంటారు."

"అలా కాదు, వాళ్ళని కొన్ని ప్రశ్నలు అడిగితే? మానవుల్లో యజమానులూ - సేవకులూ అని వుండకూడదు కాబట్టి, వాళ్ళ సంఘం కాయితాల్లో ఆ నిబంధన పెట్టుకోవాలి అని అడిగితే?"

"అడిగి చూడండి. దానికి వాళ్ళు ఒప్పుకుంటే, ఆ నాస్తిక సంఘాలూ, ఆ మానవ హక్కుల సంఘాలూ, శ్రామిక వర్గ సంఘాలైపోతాయి. దానికి వాళ్ళు ఒప్పుకోరు."

"ఆఁ, ఒప్పుకోరా? ఎందుకూ? ఎందుకు ఒప్పుకోరూ? అసలు జరగవలసిన మార్పు అదే కదా?"

"ఆ మార్పు గురించి వాళ్ళు పట్టించుకోరు. వాళ్ళకి వర్గ భేదాల దృష్టి వుండదు. వాళ్ళ పరిమితులు ఎలా వుంటాయో చెప్పుకుంటున్నాం, అంతే. వాళ్ళు చేసే పనులు అవసరం లేదని కాదు. వాళ్ళు, ఆ పనులు చేస్తూనే, 'శ్రమ దోపిడీ' అనే అసలు దుర్మార్గాన్ని గ్రహించవద్దూ? మనుషుల్లో మతాలన్నీ మూఢత్వాల్ని నిలబెట్టేది, మనుష్యులకు జ్ఞానం రాకుండా చెయ్యడానికే కదా? ఎవరు ఏ మంచి ఉద్యమం చేసినా, శ్రమ దోపిడీ అనే నీచత్వాన్ని అర్థం చేసుకుని, ఆ సంగతి కూడా ప్రజలకు చెపుతూ వుండాలి. నాస్తికత్వం వాళ్ళయితే, శ్రమ దోపిడీ మాట ఎత్తరు. 'ఇది పెట్టుబడిదార్ల దోపిడీ సమాజం' అనరు. దేవుడు గుళ్ళు లేకపోతే చాలంటారు. మానవ హక్కుల వాళ్ళయితే, చిట్టి పొట్టి సంస్కరణలు జరిగితే చాలంటారు. వాళ్ళని మించిన తత్వాల వాళ్ళయితే, 'మనిషిలో స్వార్థం పోదు, అది సహజం' అంటారు. చివరికి, అందరూ కలిసి, ఈ సమాజాన్ని ఇలాగే నిలబెట్టాలంటారు."

"ఏడిసినట్టే వుంది! ఇంకేం చెయ్యాలి మా లాంటి వాళ్ళం? ఎక్కడో అక్కడ ఒక మంచి పని చెయ్యాలని వుంది, ఎలాగ?"

"మీరు శ్రామికులు - అని మీకు తెలుసా? అలాంటప్పుడు, శ్రామికులకు, దోపిడీని వ్యతిరేకించే దృష్టే ప్రధానంగా వుండాలా అక్కరలేదా?"

"అయ్యో, అది వుంది. అది పూర్తిగా వుంది. అందుకే ఏదైనా సంస్కరణ పని చెయ్యాలని తొందర."

"సంస్కరణలు అవసరమే. అది మొదలు పెట్ట వద్దని కాదు. అసలు మన దృష్టి ప్రధానంగా శ్రామిక వర్గ స్పృహతో వుండాలి. ఆ దృష్టితో, ఏ మంచి పని అయినా చెయ్యాలి. వర్గాలకు సంబంధించి చదవండి. అది నేర్చుకోండి. దాన్ని ఇతర శ్రామికులకు నేర్పండి. ఆ పనితో పాటు, ఎన్ని సంస్కరణలైనా చెయ్యండి!"

"అవును, అయితే కాపిటల్ మొదలు పెట్టాలన్నమాట ఇవ్వాళే!" ★

# 52. ప్రపంచీకరణ భాగోతం!

**95.** ప్రశ్నలు అడిగితే చెపుతూనే వున్నారు మీరు. అయినా ప్రశ్నలు ఆగడం లేదు, ఇంకా ఇంకా పుట్టుకొస్తూనే వున్నాయి. నిన్న లేని ప్రశ్నలెన్నో ఇవ్వాళ తలెత్తు తున్నాయి. 'కాపిటల్' చదివితే ఈ గందరగోళం వుండదంటారు మీరు. నిన్న ఆ పుస్తకాలు లైబ్రరీల్లో సంపాదించారు మా వాళ్ళు. అయినా మాకు చదివే అలవాటు తక్కువ. వినే అలవాటే ఎక్కువ. మా పిల్లవాడితో ఏర్పాటు చేసుకున్నాం లెండి, వాడు పట్టుకున్నాడంటే మమ్మల్ని వదలడు. రేపు ఆదివారం నించీ అదే కార్యక్రమం మాకు.

**జ :** ఎంత మంచి మాట చెప్పారు. అలా మొదలుపెట్టండి! ఏవో ప్రశ్నలు అన్నారు. ఏమిటవి? ప్రశ్నలు రాకుండా అప్పుడే ఎలా పోతాయి? అసలు మనకి తెలిసింది ఎంత? తెలుసుకోవాల్సిందే ఎంతో వుంటుంది. ఏవిటి మీ ప్రశ్నలు? ఒకటి చెప్పండి!

"అది కాదండీ, బానిస యజమానుల సమాజం పోయి, భూస్వాముల సమాజం వచ్చింది. అలాగే, భూస్వాముల సమాజం పోయి పెట్టుబడిదారుల సమాజం వచ్చింది. అలాగే, ఈ పెట్టుబడిదారుల సమాజం కూడా పోయి, శ్రమ దోపిడీ లేని సమాజం వచ్చెయ్యదా? కొంత కాలానికి అదే వచ్చేస్తుందనిపిస్తోంది నాకు. అది అలాగే జరుగుతుందనుకోవచ్చా?"

"అంటే, పౌర్ణమి తర్వాత అమావాస్యా, అమావాస్య తర్వాత పౌర్ణమీ, వస్తూ వున్నట్టా?"

"అబ్బే, అలా కాదు గానీ, ఏం, అలా జరగదా?"

"అవి ప్రకృతిలో మార్పులు. పగలూ రాత్రీ, రాత్రీ పగలూ. మళ్ళీ మళ్ళీ జరిగినవే జరుగుతూ వుంటాయి. వాటిల్లో మార్పులు వున్నా, మళ్ళీ అవే వస్తాయి. కానీ, సమాజంలో మార్పులకు ప్రతీ విషయంలోనూ ప్రకృతితో పోలిక వుండదు. ప్రకృతిలో లాగే సమాజంలో కూడా జరిగిందే జరగడం అయితే, జరిగిపోయిన బానిస సమాజం మళ్ళీ రాదూ?"

"అమ్మో, అలా జరుగుతుందా? అవును, ప్రకృతిలో లాగే జరిగాలంటే, అలా జరగాల్సిందే. మళ్ళీ బానిస సమాజమా? ఛీ! అది వద్దు! అలాంటిది మళ్ళీ వద్దు. నాకు నిజంగా తెలుస్తూనే వుంటుంది. అయినా ఇలాంటి పిచ్చి అనుమానాలు పుడుతూనే వుంటాయి."

"మీరు ఇందాక అడిగిన ప్రశ్నలో నిజంగానే తప్పులు వున్నాయి. బానిసల సమాజం, దానికై అదే మారిందా? బానిసలు పోరాటాలు చేస్తే మారింది. పోరాటాలు జరగకుండా మారలేదు. అందుకే మిమ్మల్ని 'స్పార్టకస్' నవల చదవమన్నాను. ఆ తర్వాత, భూస్వాముల సమాజం, పెట్టుబడిదారుల సమాజంగా

మారిందన్నారు. అది ఇంకో తప్పు. భూస్వాముల సమాజంలో, పెట్టుబడిదారీ సరుకుల అమ్మకాల విధానం బైల్దేరుతూ వున్నప్పుడు, ఈ భూస్వాములకీ, పెట్టుబడిదారులకీ పోట్లాటలైతే జరిగాయి గానీ, అవి దోపిడీ వర్గంలోనే వేరు వేరు సెక్షన్ల మధ్య, 'రాజకీయాధికారం' కోసం జరిగిన పోట్లాటలే. క్రమంగా అవి తగ్గి పోయి, ఆ సెక్షన్లు ఏకం పాకం అయిపోయాయి. భూస్వాములే పెట్టుబడిదారులు కూడా అయ్యారు; పెట్టుబడిదారులు భూముల ఆస్తులు కలిగిన భూస్వాములు కూడా అయ్యారు. అంటే, భూస్వాముల సమాజం పోయి పెట్టుబడిదారీ సమాజం రావడం కాదు. ఆ రెండూ కలిసే వున్నాయి. కలిసే అదనపు విలువని పంచుకుని తింటూ వున్నాయి."

"అవును, అదనపు విలువలో నించి కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ అన్నీ, కలిసి వెళ్తాయిగా? అంటే, పెట్టుబడిదారుల సమాజం, భూస్వాములతో కలిసి వున్న సమాజమే. అదనపు విలువలో నించి భూమి కౌలు కూడా పోతోందంటే, దాన్ని తినే భూస్వాములు వున్నారని అర్థమే. పెట్టుబడిదారుడే ఆ భూస్వామి కావచ్చు; అవును, అర్థమైంది. అయితే ఇదంతా ఎలా పోవాలి? ఎలా మార్చగలం దీన్ని?"

"అంటే, 'దానికై అదే మారుతుంది' అనే అభిప్రాయం పోయినట్టేనా మీకు?"

"అయ్యో, దానికై అది ఎలా మారుతుంది? అలా మారదా అని ఆశపడ్డాం, అంతే. మనం ఇలాగే వుంటే, అది అలాగే వుంటుంది. శ్రామికులం, యజమానుల కోసం చాకిరీలు చేసి చేసి ముసలాళ్ళయిపోతాం. వాళ్ళూ అయిపోతారు గానీ, వాళ్ళ ఆస్తులికి వాళ్ళ పిల్లలు వారసులవుతారు. మా దరిద్రాలకి మా పిల్లలు వారసులవుతారు, అంతే. అది అలా సాగుతూనే వుంటుంది. దాన్ని మార్చకపోతే అది కదులుతుందా?"

"చాలా బాగా అర్థం చేసుకుంటూనే వెనకడుగులు వేస్తూ వుంటారు మీరు. పెట్టుబడిదారీ విధానానికి వున్న ప్రత్యేక గుణాన్ని మనం మొదట బాగా అర్థం చేసుకోవాలి. ఈ విధానానికి నిత్యం విస్తరించే గుణం వుంటుంది. ఎందుకంటే, దీనికి, అదనపు విలువ ఏటా కూడిపోయి, పెరిగిపోతూ వుంటుంది. దాన్ని మళ్ళీ కొత్త పెట్టుబడిగా ఎక్కడో అక్కడ పెట్టవలసి వస్తుంది. అలా పెట్టకపోతే, దానికి కౌలు రాదు, వడ్డీ రాదు, లాభం రాదు. పెరిగిపోతూ వున్న అదనపు విలువని కూడా సరుకుల్ని తయారుచేసే క్రమంలో పెడితేనే, దాని ద్వారా కొత్త అదనపు విలువ వస్తేనే, దాన్ని దోపిడీదార్లు పంచుకోవడం సాధ్యమవుతుంది. మూలుగుతూ వున్న అదనపు విలువతో కొత్త పెట్టుబడి పెట్టకపోతే, పాత పెట్టుబడి వల్ల వచ్చే దానితోనే సరిపెట్టుకోవాలి కదా? పెరిగే పెట్టుబడిని ఎక్కడో అక్కడ పెట్టేస్తూ, సరుకుల్ని తయారుచేయిస్తూ, వాటిని అమ్మిస్తూ - అలా జరుగుతూనే వుండాలి. ఒక పెట్టుబడిదారుడు, కొంత డబ్బుని బ్యాంకులో పెడితే, ఆ డబ్బుని ఇంకో పెట్టుబడిదారుడు తీసుకుని సరుకు తయారీలో పెట్టకపోతే, బ్యాంకు వాడికి వడ్డీ

ఎలా వస్తుంది? బ్యాంకు నించి అప్పు తీసుకున్న పెట్టుబడిదారుడు, దానితో అదనపు విలువని సంపాదిస్తేనే, వాడు బ్యాంకుకి వడ్డీ కడతాడు. ఆ వడ్డీ లోంచి బ్యాంకు వాడు, బ్యాంకుకి అప్పు ఇచ్చిన మొదటి పెట్టుబడిదారుడికి వడ్డీ చెల్లిస్తాడు. దోపిడీ నిత్యం, రాత్రింబవళ్ళూ జరుగుతూ వుండాలంటే, కొత్త కొత్త రకాల సరుకుల ఉత్పత్తులు తయారవుతూనే వుండాలి. ఇది పెట్టుబడిదారీ విధానానికి వున్న ప్రత్యేక లక్షణం. ఈ విధానం ప్రారంభమైన కొత్తల్లో అయితే, పెట్టుబడి చిన్నదిగా వుంటుంది కాబట్టి, దాన్ని ఎక్కడ పెట్టడానికైనా సమస్య వుండదు. కానీ క్రమంగా, పాత పెట్టుబడికి కొత్త అదనపు విలువ కూడా కలిసిపోతూ, పెట్టుబడి కొండలంతంతగా పెరిగిపోతూ వుంటుంది. ఏ పెద్ద పెట్టుబడిదారుడి చరిత్ర అయినా చూడండి, వాడు ప్రారంభంలో ఎలా వుండేవాడో, తర్వాత ఎలా పెరిగిపోతూ వచ్చాడో తెలుస్తుంది. ఏ శ్రామికుడి విషయంలో అయినా, అతని ఆస్తి పెరిగిపోతూ వుండడం కనపడుతుందా? అతని చరిత్ర అంతా చూస్తే, చివరికి అన్నీ అప్పులూ, ఉద్యోగం ఊడడం, జబ్బులూ - ఇవే కనపడతాయి. కానీ, పెట్టుబడిదార్ల వేపు చూస్తే, పెరిగిపోతోన్న పెట్టుబడినంతా బిజినెస్‌లో పెట్టడానికి ఒక దేశం చాలదు. తక్కువ ఉత్పత్తి సాధనాల్ని పెట్టి, తక్కువ అదనాన్ని సంపాదించడం అయితే, వెనకటి సమాజాల్లోనూ వుంది. అంత చిట్టి పొట్టి వ్యాపారాలు ఇక్కడ పనికిరావు. ప్రతీ పెట్టుబడిదారుడికీ, అదనాన్ని పెంచెయ్యాలనే కొత్త దృష్టి ప్రారంభమవుతుంది. దాని వల్ల, వేరు వేరు కంపెనీల వాళ్ళు, కొంచెం పోటీల్ని తగ్గించుకుని, కంపెనీల్ని కలిపేసుకుని, ట్రస్టులూ - కార్పొరేషన్లూ లాంటి పద్ధతులతో, సరుకుల గుట్టలు పెంచేసి, వాటిని అమ్మడానికి విదేశాల మీదకి ఎగబడడం మొదలవుతుంది. అప్పుడు పోటీలు, దేశాల మధ్య ప్రారంభమవుతాయి. ఇతర దేశాల్లో వుండే కంపెనీల్ని నాశనం చెయ్యడానికీ, అక్కడి వనరుల్ని లాగడానికీ, ఆ దేశాలతో యుద్ధాలు! సైనికులకి దేశ భక్తి పాటలతో, యజమానుల ఆస్తుల పెంపు కోసం త్యాగాలు చేస్తూ ప్రాణాలు వదిలెయ్యమనీ, కాళ్ళూ చేతులూ కళ్ళూ చెవులూ ధ్వంసం చేసుకోమనీ, అది దేశ భక్తి అనీ, బోధనలు సాగుతాయి. ఈ బోధనలు, వెనకటి రాజుల కాలాల నించీ కూడా వున్నవే. అది ఇక్కడ ఇంకా పెరుగుతుంది. ఆ కుళ్ళు దేశ భక్తి గీతాలూ, బోధనలూ రాయడానికీ; సైనికుల్ని చావుల్లోకి లాగే కుళ్ళు గీతాలు పాడడానికీ; పాడేసి సన్మానాలూ అవార్డులూ పోగేసుకోడానికీ; కవులూ గాయకులూ పిచ్చి కుక్కల్లా తిరుగుతూంటారు.

దోపిడీ విధానం పెట్టుబడిదారీ విధానంలోకి మారిన తర్వాతా, శ్రమ దోపిడీ రహస్యం బైట పడిన తర్వాతా, వేతన శ్రామిక వర్గం అనే నూతన శక్తి పుట్టుకొచ్చిన తర్వాతా, ఇక పెట్టుబడికి మరణ శయ్యే అని మనం సంబరపడతాం. కానీ శ్రామిక వర్గం, తను నేర్చుకోవలసిందేమిటో తెలుసుకోవడం మీద శ్రద్ధ పెట్టకపోవడం వల్ల, దాని సంబరమే మరణ శయ్యలు ఎక్కి దిగుతూ వుంది. శ్రామిక వర్గం, తన

విముక్తిని తను తెలుసుకోకుండా వున్నంత కాలం, పెట్టుబడిదారీ విధానానికి ఏమిటి కష్టం? మహా అయితే దానికి అప్పుడప్పుడూ వచ్చే కష్టం, దాని సరుకు అమ్మకాలు ఆగిపోయే, తగ్గిపోయే సంక్షోభాలే. అప్పుడు మాత్రం దానికి ఏమిటి కష్టం? రెండేళ్ళ పాటు కంపెనీలు మూసేసి, పాత లాభాల్ని జేబుల నిండా కూరుకుని, దేశాల వెంటబడి కాలక్షేపంగా తిరగడాలతో, సంబరాలతో, గడిపేసి, అప్పటికి వెనక్కి వచ్చి కంపెనీలు తెరుస్తారు. అప్పటికి చావకుండా మిగిలిన శ్రామికులెవరైనా వుంటే, వాళ్ళే పరిగెత్తుకుంటూ కంపెనీల గేట్ల దగ్గిరికి వస్తారు. ఇక అప్పటి నించీ మళ్ళీ కొత్త ఉత్పత్తి క్రమాలు! - ఈ విధానం, వందల సంవత్సరాలుగా సాగుతూనే వుంది. అది అలా సాగుతూనే వుంటుంది కూడా! దానికై దానికి ముగింపు ఎప్పటికీ వుండదు. దాన్ని ఎక్కడో అక్కడ ఆపకపోతే, దానికై అది ఆగేదేమీ వుండదు. దానికి అడ్డం పడి ఆపాలి, అంతే. జరగాల్సింది అదీ."

"మీ మాటలకి అడ్డొస్తున్నాను. 'దాన్ని ఎక్కడో అక్కడ ఆపకపోతే' అన్నారు. ఇది నాకు చాలా బాగుంది. మొత్తం అంతా అర్థమైపోయినట్టుగా వుంది. 'క్రమంగా అన్నీ మారతాయిలే, పాత సమాజాలు వుండిపోయాయా, రాజులు వుండిపోయారా?' అనుకుంటున్నాను నేను అప్పుడప్పుడూ. ఏ తప్పు అయినా, అదే ఎలా మారుతుంది? ఎదురు తిరిగే వాళ్ళు లేకపోతే, దోపిడీతో బతికే వాళ్ళు దాన్ని ఎందుకు వదులుకుంటారు? - ఎప్పటికీ వదులుకోరు. వాళ్ళని ఆపాలన్నమాట! ఆపకపోతే వాళ్ళు ఆగుతారా? ఆగరు. ఈ మాట నాకు చాలా బాగుంది. తెలివి వచ్చినట్టుగా వుంది. కార్యక్రమం తెలిసింది."

"కాపిటల్ చదివేటప్పుడు నాకు కూడా మొదట ఈ విషయం అర్థమయ్యేది కాదు. 'పెట్టుబడిదారీ విధానం ఎలా ఆగుతుంది? వాళ్ళు ఎందుకు ఆగుతారు? సంక్షోభాలు వస్తే మాత్రం వాళ్ళకేం నష్టం? డజన్ల సంక్షోభాలు వచ్చి పోతున్నాయి గానీ, వాళ్ళేమన్నా చలించారా? వాళ్ళు ఎలా ఆగుతారు?' అని ఒకటే ప్రశ్నగా వుండేది. కొన్ని చోట్ల మనం సరిగా అర్థం చేసుకోలేకపోతాం. లేకపోతే, చదివే వాళ్ళకి చక్కగా అర్థమయ్యే విధంగా కూడా కొన్ని చోట్ల వుండదు. మొత్తానికి ఎలాగో అర్థమైంది, దోపిడీ వర్గాన్ని శ్రామిక వర్గమే ఆపాలని! ఆపకపోతే, దోపిడీ అలాగే సాగుతూ వుంటుందని."

"అవును, ఎన్ని కోట్ల సంవత్సరాలైనా అదే వుంటుంది ఆపకపోతే. అందుకే 'ఆపాలి' అనే మాటతో నాకు బలం వచ్చింది."

"ఆపే పని ఎవరు చెయ్యాలి?"

"ఇంకెవరు? శ్రామిక వర్గం చెయ్యాలి."

"ఈ మధ్య వినపడుతోన్న 'ప్రపంచీకరణ' అనే మాట ఎప్పుడన్నా విన్నారా?"

"మీరు నమ్ముతారో లేదో, ఇదే మాట అడగాలని ఎన్ని సార్లు అనుకుంటు న్నానో! ఆ మాట గుర్తు రాక, నా నోటికి రాక, ఎప్పటికప్పుడే వూరుకుంటున్నాను.

ఏమిటది? మొన్న టీవీని కాస్సేపు చూస్తే, ఆ మాటే వినపడింది చాలా సార్లు. అది మంచిదో చెడ్డదో అర్థం కాలేదు. ప్రశ్నలు అన్నానే, అది ఇది కూడా."

"పెట్టుబడిదారీ విధానం ఇప్పుడు, 'ప్రపంచీకరణ' రూపంలో వుంది. ప్రపంచాన్నంతా దోచుకుంటున్నది చాలక, ఇంకా ఇంకా దోచుకోవాలనే ఎత్తుగడ అది! 'ప్రపంచం అంతా ఒకే ఊరు లాగ, ఒకే గ్రామం లాగ, అయిపోయింది' అంటున్నారు. పెట్టుబడిదారీ బిజినెస్‌కి ఎక్కడా అడ్డాలూ నిబంధనలూ, వుండకూడదంటున్నారు. సెల్‌ఫోన్లతో, ఇక్కడి నించి అమెరికాలో వాళ్ళతో మాట్లాడగలరు. ఈ ధృవం మీద నించి, ఆ ధృవం మీదకి మాట్లాడగలరు. ప్రకృతిలో అలాంటి సైన్సు వుంది. దాన్ని సైంటిస్టులూ, ఇంజనీర్లూ, కనిపెట్టారు. ఆ యంత్రా లన్నీ శ్రామికులు తయారుచేశారు. ఆ శ్రమల్లో ఏ ఒక్క భాగాన్ని అయినా పెట్టుబడి దారులో, భూస్వాములో, చేశారా? గతంలో, రైళ్ళని కనిపెట్టినట్టే, విమానాల్ని కనిపెట్టినట్టే, టెలిగ్రాఫుల్ని కనిపెట్టినట్టే, ఇప్పుడు సెల్‌ఫోనుల్ని కనిపెట్టారు! ఉత్పత్తి శక్తుల్లో ఇది ఒక పెరుగుదల! అంత కన్నా ఏం మార్పు వుంది ఇందులో? సెల్‌ఫోన్లతో దూరాల నించి మాట్లాడుకుంటే అది దోపిడీని తీసేస్తుందా? సరే, ప్రపంచం అంతా ఒకే ఊరు అయిపోయిందనుకుందాం! అయితే, ఆ ఊళ్ళో వర్గాలు పోయాయా? ఒకే ఊరుగా మారిపోయిన ప్రపంచంలో, శ్రమ దోపిడీ సంబంధాలు పోయాయా? దోపిడీ సంబంధాలు చెక్కు చెదరకుండా అలాగే వున్నప్పుడు, ఇక్కడి వాళ్ళు అక్కడికి మాట్లాడగలిగితే ఏమిటి దాని వల్ల ప్రపంచానికి జరిగే గొప్ప? సెల్‌ఫోన్లు వచ్చాయంటే, పెట్టుబడిదారులకు కొత్త బిజినెస్ శాఖలు తెరుచుకున్నాయని అర్థం. అంత కన్నా శ్రామికులకు మేలు ఏం జరిగింది? ఇదీ ప్రపంచీకరణ భాగోతం!"

"ఆ టీవీలో ఇలా చెప్పారా? 'ప్రపంచీకరణం' అని ఆ మాటే వంద సార్లు వాగారు. దాని వల్ల మాకేం మార్పు జరిగింది? రోజూ మా హోటల్ దగ్గిరికి బిచ్చగాళ్ళు వస్తారు. మురిగినవన్నీ పట్టుకుపోతారు. వాళ్ళకేమన్నా మార్పు జరిగిందా? ప్రపంచం అంతా ఒక వూరైపోతే, ఆ వూళ్ళో యజమానులు లేరా, పనివాళ్ళు లేరా? బిచ్చగాళ్ళు లేరా? ఈ ప్రపంచీకరణంలో పడుపు కత్తెలు లేరా? ఈ చచ్చు పుచ్చేనా ప్రపంచీకరణం అంటే? ఇంకా అదేదో గొప్పది అనుకున్నాను. ఇది అర్థమైంది గానీ, మర్చిపోకుండా అడగాలనుకున్నాను ఇంకో మాట. అదే, అది... ఆఁ, 'షేర్లు' అంటారు. అదేంటి? అదీ ప్రపంచీకణంయేనా కొంపదీసి?"

"అవును, బాగా పోల్చారు. అదీ ఇలాంటి తుక్కే. 'షేర్లు' అంటే తెలీదా? షేర్లని తర్వాత చూద్దాం గానీ, ఈ దేశంలో, పెట్టుబడిదారులు, ఎంతెంత సిరి సంపదలతో కల కల్లాడిపోతున్నారో ఒక సారి చూస్తారా?"

## ఐదోసారీ అంబానీయే




**ఫోర్బ్స్ భారత సంపన్నుల జాబితాలో**
**ముకేష్‌దే అగ్రస్థానం,**
**ఈయన సంపద 2,100 కోట్ల డాలర్లు**
**బిలియనీర్ హోదాను కోల్పోయిన విజయ్ మాల్యా**

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత సంపన్నుడైన భారతీయుడిగా రియలన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ స్థానం చెక్కు చెదరలేదు. ఫోర్బ్స్ పత్రిక రూపొందించిన భారతీయ కుబేరుల జాబితాలో మొదటి స్థానం మళ్ళీ ఈయననే వరించింది. ముకేష్ చేతిలో ఉన్న సంపద 2,100 కోట్ల డాలర్లు (సుమారు 1,12,350 కోట్ల రూపాయలు)గా ఉంది. ఏడాది కాలంలో 160 కోట్ల డాలర్ల సంపద కరిగిపోయినప్పటికీ తొలి స్థానం మాత్రం చేజార లేదు. ఈ జాబితాలో ద్వితీయ స్థానంలో ఉక్కు దిగ్గజం లక్ష్మీనివాస్ మిట్టల్ నిలిచారు. ఈ సంపద 1,600 కోట్ల డాలర్లు. ఏడాదిలో తగ్గిన సంపద 300 కోట్ల డాలర్లు. 100 మంది సంపన్న భారతీయులతో కూడిన వార్షిక జాబితాను ఫోర్బ్స్ మేగజైన్ గురువారం నాడు విడుదల చేసింది. ఈ జాబితాలో మూడో స్థానంలో విప్రో చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ (1,220 కోట్ల డాలర్లు), నాలుగో స్థానంలో టాటా గ్రూప్‌నకు చెందిన ఎస్.పల్లోంజి మిస్త్రీ (980 కోట్ల డాలర్లు), ఐదో స్థానంలో సన్‌ఫార్మా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దిలిప్ సింఘ్వి (920 కోట్ల డాలర్లు) నిలిచారు. ఆరో స్థానంలో గోద్రెజ్ చైర్మన్ ఆది గోద్రెజ్ (900 కోట్ల డాలర్లు), ఏడో స్థానంలో జిందాల్ స్టీల్ సారధి సావిత్రి జిందాల్ (820 కోట్ల డాలర్లు), ఎనిమిదో స్థానంలో శశి, రవి రుయా (810 కోట్ల డాలర్లు), తొమ్మిదో స్థానంలో హిందుజా సోదరులు (800 కోట్ల డాలర్లు), పదో స్థానంలో కుమార్ మంగళం బిర్లా (780 కోట్ల డాలర్లు) ఉన్నారు.

ముకేష్ అంబానీ తమ్ముడు అనిల్ అంబానీకి సంపన్నుల జాబితాలో పదకొండవ స్థానం దక్కింది. ఈ నికర సంపద 600 కోట్ల డాలర్లుగా ఉంది.

100 మంది భారత సంపన్నుల మొత్తం సంపద ఏడాది కాలంలో 3.7 శాతం (900 కోట్ల డాలర్లు) పెరిగి 25,000 కోట్ల డాలర్లకు (సుమారు 13,37,500 కోట్ల రూపాయలు) చేరుకుంది.

బిలియనీర్ల సంఖ్య 57 నుంచి 61కి పెరిగింది. మొదటిసారిగా సన్ ఫార్మా గ్రూప్‌నకు చెందిన సంఘ్వి ఐదుగురు అగ్ర స్థాయి సంపన్నుల జాబితాలో చేరారు.

ఫార్మా కంపెనీ వోక్‌హార్డ్‌కు చెందిన హబిల్ ఖొరాకి వాలాకు బిలియనీర్ల జాబితాలో మళ్ళీ చోటు లభించింది. ఈ సంపద 180 కోట్ల డాలర్లుగా ఉంది.

40 ఏళ్ళ రంజన్ పాల్ మనిపాల్ గ్రూప్‌ను విద్యారంగంలో గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగేలా కృషి చేశారు. కొత్తగా ఫోర్బ్స్ జాబితాలో స్థానం (63వ) స్థానం దక్కించుకున్న పాయ్ సంపద 97.5 కోట్ల డార్లుగా ఉంది.

(ఆంధ్రజ్యోతి, 21-10-2012)

---

ఈ వివరాలన్నీ, ఈ దోపిడీదారుల సంపదల్ని చూసి ముచ్చట పడడానికి కాదు. వీళ్ళకి ఈ ఆస్తులు ఎలా వచ్చాయో గ్రహించండి! ఈ వేల కోట్లన్నిటినీ, "శ్రామిక వర్గ అదనపు విలువ రాసి"లోకే చేర్చండి! ఈ కోట్లన్నీ శ్రామికుల శ్రమ విలువలో నించి వచ్చేవే అని అర్థం చేసుకోండి! ★

# 53. షేర్ల భాగోతం తెలుసా?

**96.** 'షేర్లు' అంటే ఏవిటండీ? పొద్దున్నే మా వాడు, పేపర్లు వచ్చి పడగానే, హెడ్డుని పిల్చి, 'షేర్లు చూడు, అది చూడు, ఇది చూడు' అంటాడు. మా హెడ్డు కూడా, 'షేర్లు కొన్నాను, అమ్మాను' అంటాడు. ఆ మాటలేంటో ఎన్ని సార్లు విన్నా మాకు అర్థం కావు.

**జ :** 'షేరు' అంటే తెలీదా? ఒక భాగం. ఒక వాటా. ఎందులో? 'పెట్టుబడి' లో.

ఒక సబ్బుల పరిశ్రమో, చెప్పుల పరిశ్రమో పెట్టాలంటే, వెయ్యి పెట్టుబడి కావాలనుకుందాం. దాన్ని ఒక్కడే పెడితే, దాని వల్ల వచ్చే లాభం ఒక్కడికే వస్తుంది. ఆ పెట్టుబడినే నలుగురు కలిసి పెడితే, ఆ లాభం, 4 వాటాలవుతుంది. ఆ లాభాన్ని నలుగురు పంచుకుంటారు.

"ఓస్, అందులో ఏముంది? పెట్టుబడి 4 వాటాలైతే, లాభం కూడా 4 వాటాలవుతుంది. అంతే కదా? మరి, మా వాళ్ళు 'కొన్నాం, అమ్మాం' అంటారేంటి?"

" 'అంతే' కాదు; పెట్టుబడిదారీ విధానంలో, ఏదీ 'అంతే' తో ఆగదు. 'అంతే' తో ఆగవలసిన దాన్ని కూడా, ప్రతీ దాన్నీ కూడా, బిజినెస్‌గా మార్చడానికి చూస్తారు వాళ్ళు. మీ దగ్గిర 10 రూపాయలు వుంటే, దాన్ని కూడా పెట్టుబడిగా పెట్టవచ్చు; దానికి వచ్చే లాభం మీరు సంపాదించవచ్చు."

"నేనా? ఛీ! నాకు లాభం ఎందుకు? నా అదనపు విలువ బైటికి పోకుండా వుంటే చాలు! నాది నాకు అందితే చాలు. శ్రామికుడు పెట్టుబడి పెడతాడా?"

" 'షేర్ల' గురించి అడిగారుగా? అంతా తెలిసిపోయిందా? ఇక అక్కర్లేదా?"

"అయ్యో, చెప్పండి! నాకేం తెలిసింది?"

"పెట్టుబడిదార్ల కొత్త ఎత్తుగడ ఏవిటంటే, శ్రామికులకు కూడా పెట్టుబడి పెట్టి లాభం సంపాదించే దృష్టి కలిగించాలని కొత్త పద్ధతులు మొదలుపెట్టారు వాళ్ళు. పెట్టుబడి పెట్టడానికి వేలూ, లక్షలూ, అక్కర్లేదు. 10 రూపాయలు వుంటే చాలు. అది ఒక షేరు. ఒక వాటా. 100 రూపాయలు వుంటే, 10 వాటాల కోసం పెట్టవచ్చు. రోడ్లు వూడ్చే శ్రామికుడి దగ్గిర 100 రూపాయలు వుంటే, దాన్ని 10 వాటాల కోసం ఒక కంపెనీకి పంపాడంటే, అతను కూడా ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టిన వాటాదారుడు అయిపోయినట్టే! అంటే, పెట్టుబడిదారుడు అయిపోయినట్టే! ఆ కంపెనీని ప్రారంభించిన అసలు పెట్టుబడిదారుడు అయితే, మొత్తం పెట్టుబడిలో నూటికి 90 భాగాల్ని తన చేతిలోనే వుంచుకుంటాడు. బైటి వాళ్ళకి ఇస్తే, 10 శాతం కన్నా ఎక్కువ ఇవ్వడు."

"ఎంత ఇస్తే మాత్రం ఎవడికి కావాలి? శ్రామికులు కూడా పెట్టుబడులు పెడతారా?"

"మేధా శ్రమల వాళ్ళు చాలా మంది ఆ వాటాల పిచ్చిలో పెట్టుబడులు

పెడతారు. వాళ్ళకి కూడా 'పెట్టుబడి' అంటే ఏమిటో, 'లాభం' అంటే ఏమిటో, ఏమీ తెలీదు. తమ అదనపు విలువని పోగొట్టుకుంటున్నామనీ, ఇతరుల అదనపు విలువని లాక్కుంటున్నామనీ, ఏమీ తెలీదు. శ్రామికులకు కూడా, వీలైతే వడ్డీలూ, లాభాలూ, సంపాదించాలని ఆశ వుంటుంది. 'పాలించే వర్గ భావాలే, ప్రజల భావాలు' అన్నాడు కదా మార్క్సు? చిన్న సంగతి చెప్పనా? వేరే ఇళ్ళల్లో అంట్లు తోమే ఒక శ్రామికురాలు, తన రేషన్ కార్డు మీద, కిలో రూపాయి బియ్యం తెచ్చుకుని, రేషన్‌కార్డులు లేని వాళ్ళకి కిలో 10 రూపాయలకి అమ్ముతుంది! శ్రామికులు కూడా ఎంత దుష్టత్వానికైనా తయారైపోతారు. యజమానులు చేసినట్టే, వాళ్ళూ చేస్తారు. అందుకే శ్రామికులు కాపిటల్ చదివి, తమ శ్రమ పోగొట్టుకోవడం ఎంత అజ్ఞానమో, ఇతరుల శ్రమని లాగడం ఎంత నీచత్వమో, తెలుసుకోవాలి. వాళ్ళు చదవలేరు కాబట్టి, వాళ్ళకి ఇతరులు నేర్పాలి.

కంపెనీ పెట్టిన వాడు, పెట్టుబడిలో ఎక్కువ భాగం తనే పెట్టి, ఆ కంపెనీకి తనూ, తన పెళ్ళామూ, తన కూతుళ్ళూ, కొడుకులూ, డైరెక్టర్లయిపోతారు! వాళ్ళకి భారీ భారీ జీతాలు! అలవెన్సులు! పెట్టుబడి మీద, వాళ్ళ వాటాల ప్రకారం వడ్డీలూ, లాభాలూ! ఆ వాటాల్లో కూడా బోలెడు తేడాలు వుంటాయి."

"అబ్బా! వినాలంటే కష్టంగా వుందండీ నాకు. పోనీ లెండి, వాళ్ళ పాపం వాళ్ళదే. ఇంకేదైనా చెప్పుకుందాం. గుర్తొచ్చింది. మా హోటేలు వాడే కాదు, వాడి పెళ్ళాం కూడా డైరెక్టరే అంటారు. ఆ మనిషి ఎప్పుడన్నా వస్తే, 'డైరెక్టరుగారొస్తున్నారు, మేడమ్‌గారొస్తున్నారు' అని తిరుగుతాడు మా హెడ్డు. వాళ్ళ కా గొప్పలు ఎలా వచ్చాయో తెలీనప్పుడు కూడా నాకు వాళ్ళంటే చాలా చీదరగా, కోపంగా వుండేదండీ."

" 'వాళ్ళ పాపం వాళ్ళదే' అన్నారేమిటి? అవేం మాటలు? ఆ పాపానికి దేవుడే శిక్షిస్తాడనే నమ్మకం కాదూ అది? అలాంటి మాటలు మనం మార్చుకోవాలి. 'పాపం, పుణ్యం' అని కాదు. మంచీ - చెడ్డా, తప్పూ - ఒప్పూ, న్యాయం - అన్యాయం, అలా మాట్లాడుకోవాలి."

"అవును, నేను నోరు జారి, పాత అలవాటుతో అలాంటి మాట ఏదో మొన్న ఒకటి అంటే, మా పిల్లాడే బాగా కోప్పడ్డాడు. ఇక అనను. వాళ్ళు ఎంత పాపం చేసినా, వాళ్ళని శిక్షించే దేవుడెవడైనా వున్నాడా? మనమే బుద్ధి చెప్పాలి వాళ్ళకి. అయిపోయిందాండీ షేర్ల గోల?"

"భలే వారే! ఇంకా మొదలే అవలేదు."

"అమ్మో! ఇంకా వుందా? కోపం వస్తోంది నాకు వాటి మీద."

"అన్యాయం మీద కోపం వస్తే, అది చాలా న్యాయం. సహనంగా వినండి! శ్రామికులకు పెట్టుబడి మీద కోపం లేకుండా చెయ్యాలనేదే పెట్టుబడిదారుల ఎత్తుగడ. ఇప్పుడు జీతాలు ఇచ్చేటప్పుడు, మొత్తం అంతా డబ్బుగా ఇవ్వకుండా

కొన్ని షేర్లు ఇచ్చే పద్ధతి మొదలుపెట్టారు. ఆ షేర్ల వల్ల లాభాలు వస్తాయని శ్రామికులు సంతోషపడాలన్నమాట! మీరు ఇందాక అన్నారే, 'షేర్లు అమ్మాను, కొన్నాను' అన్నది ఏమిటంటే, ఒక పరిశ్రమలో 100 పెట్టుబడి పెట్టిన వాడు, దాన్ని ఆ పరిశ్రమలో నించి తీసెయ్యాలనుకుంటే, ఆ వాటాల్ని ఇంకెవరికైనా ఇచ్చేసి తన డబ్బు తను తీసేసుకోవచ్చు. ఏ ఆస్తిని అయినా అమ్మేయ్యవచ్చు కదా? అలాగే పెట్టుబడి ఆస్తిని అమ్మెయ్యడమే అది. ఆ కంపెనీ నించి బైట పడాలంటే, ఆ వాటాల్ని అమ్మెయ్యాలని చూస్తాడు. అయితే, 100 విలువ గల వాటాల్ని ఇంకో మనిషికి ఇచ్చేస్తే, ఆ మనిషి నించీ 100 డబ్బునే తీసుకోవాలి కదా? అలా కాదు. 200 లో, 300 లో, ఇమ్మంటాడు. ఆ కంపెనీలోకి చేరాలనే మోజు వున్న వాడు, ఆ వాటాల కోసం, అంత ఎక్కువ డబ్బు అయినా ఇవ్వడానికి సిద్ధపడతాడు."

"100 విలువే గల దాన్ని 300 తో కొంటే, కొన్న వాడికి కంపెనీ నించి వచ్చే లాభం, 100 మీద వస్తుందా, 300 మీద వస్తుందా?"

"బైట జరిగిన బేరంతో కంపెనీ కేం సంబంధం? ఆ వాటాల వల్ల కంపెనీలో వున్న పెట్టుబడి అయితే, 100 మాత్రమే. ఆ వాటాల హక్కులు బైట ఎవరి చేతుల్లోకి మారినా, వాటి ధర ఎలా మారినా, లోపల వున్న 100 పెట్టుబడి తరగదూ, పెర గదూ. కంపెనీ నించి ఆ వాటాలకు వచ్చే లాభం, 100 మీద మాత్రమే వస్తుంది."

"మరి, బైట వాడు 100 దాన్ని 300 తో ఎందుకు కొంటాడు?"

"పెట్టుబడిదారీ వ్యసనాల్లో ఇదొక ఆట! పేకాటా, గుర్రప్పందాలూ, కోడి పందాలూ, అలాంటివన్నీ ఎలాంటివో ఇదీ అంతే. 100 దాన్ని 300 తో కొన్న వాడు, దాన్ని తర్వాత 500 కి అమ్మగల ననుకుంటాడు. అలా అమ్ముతాడు కూడా!"

"ఆఁ... అమ్ముతాడు కూడానా! ఎలా అమ్మగలడు?"

"ఒక మూర్ఖుడు వున్న సమాజంలో, ఇంకో మూర్ఖుడు వుండడా? వీడు మొదట, 100 దాన్ని 300 తో ఎలా కొన్నాడు? అలాగే, ఇంకొకడు, 300 దాన్ని 500 తో ఏవిటి, 800 తో కూడా కొంటాడు. అసలు ఈ షేర్ల కథ, కంపెనీలో నించి వచ్చే లాభాల కోసం కాదు, ఆ షేర్లనే అమ్మేస్తే వచ్చే లాభాల కోసం."

"ఇదేవన్నా నమ్మేలాగ వుందా?"

"లేదు కదా? అయినా నమ్మండి! నమ్మక తప్పదు. ఇది దోపిడీ ప్రపంచం! ఇక్కడ ఇలాంటివే జరుగుతాయి. నమ్మాలి."

"100 ఆస్తిని అమ్మితే, అంతే వస్తుంది గానీ లాభం వస్తుందా? మీ మాటకి అడ్డొస్తున్నాను, ఇన్నాళ్ళూ మీరు చెప్పిందంతా నాకూ బాగుంది. అందులో ఏమీ సరిపోనిది కనపడలేదు. కానీ, ఈ షేర్లు అమ్మడం, కొనడం, ఎందుకు చేస్తారో, మీరు చెప్పేదాని మీద నమ్మకం కలగడంలేదు. 100 దాన్ని 300 తో కొనేవాడు ఎందుకు కొంటాడని నా కనిపిస్తోందంటే, ఆ వాటా వల్ల కంపెనీలో నించి వచ్చే లాభం, 300 మీద వచ్చేటంత ఎక్కువ వుండొచ్చు. ఆ కంపెనీ ఇచ్చే లాభం ఇంకా

ఇంకా పెరుగుతుందనే ఆశతో, ఆ కంపెనీలోకి చేరాలని, అలా ఎక్కువతో కొంటాడేమో. అలా కాకపోతే, ఆ 100 పెట్టుబడిని 300 తో కొంటాడా? సరే, 100 ని 300 తో కొన్న వాడు, దాన్ని ఎలాగో చచ్చీ చెడీ, 500 కి అమ్ముతాడనుకుందాం. 500 కి కొన్న వాడు, దాన్ని ఏం చేస్తాడు? దాన్ని 700 కి అమ్మగలడా? అలా, ఎక్కడికి వెళ్తుంది ఆ ధర? ఆ చివరి వాడు ఇంకా అమ్మగలడా దాన్ని? వాడు ఏమైపోతాడు? పిచ్చెక్కదూ వాడికి?"

"మీ ప్రశ్నలంటే నాకు చాలా ఇష్టం. మీరు కొన్ని సార్లు చాలా బాగా ఆలోచిస్తారు. ఎప్పుడన్నా మందలించినా, స్నేహంగా తీసుకుంటారు. వినే వాళ్ళు తెలివిగా వుంటే, పోనీ శ్రద్ధగా వుంటే, చెప్పే వాళ్ళకి సంతోషంగా వుంటుంది. 'షేర్ల' వ్యాపారం మీద మీ ప్రశ్నలన్నీ నాకూ వచ్చాయి మొదట్లో. ఆ వ్యసనం అలా జరుగుతుందంటే, ఇప్పటికీ నమ్మలేనట్టుగా వుంటుంది నాకు. 100 దాన్ని 900 తో కొన్న వాడే చివరి వాడు అనుకుందాం. వాడికి అప్పుడు పిచ్చెక్కడం కాదు, అసలు మొదట్లో పిచ్చి వుంటేనే షేర్ల మీద పెడతాడు. 100 దాన్ని 900 తో కొన్నవాడు ఇక దాన్ని ఇంకా ఎక్కువకి అమ్మలేక పోయాడనుకుందాం. అప్పుడేం జరుగుతుంది? వాడు దాన్ని కొంత తక్కువకి అమ్మేసి, కొంచెం డబ్బయినా వెనక్కి రాబట్టాలని చూస్తాడు. దాన్ని 500 కైనా అమ్మేద్దామనుకుంటాడు. అది సాధ్యం కాకపోతే, 200 కైనా! అదీ సాధ్యం కాకపోతే, ఆ 100 దాన్నే తన దగ్గిర పెట్టుకుని వూరు కుంటాడు. ఆ 100 కి కంపెనీ ఇచ్చే లాభాన్ని తీసుకుంటూ వుంటాడు. కానీ అక్కడ ఇంకో తమాషా వుంటుంది. ఆ వాటాల కంపెనీ దివాళా తీసిందనో, దాని లాభాలు తగ్గిపోయాయనో, అక్కడి కార్మికులు సమ్మె చేస్తున్నారనో, అలాంటి వార్తలు వస్తే, ఆ 100 వాటా, 20 కి కూడా అమ్ముడవదు. 10 కి కూడా అమ్ముడవదు. ఇవన్నీ కాపిటల్‌లో చదవండి! మార్క్సు ఒరిజినల్‌లోనూ ఈ షేర్ల వివరాలు వున్నాయి. 'కాపిటల్ పరిచయం' లోనూ షేర్ల కథ వివరంగా వుంది. ఒక్క 10 పెట్టుబడి వాటా కథని తీసుకుంటే, అది 30 రెట్ల ధర వరకూ పెరిగి పెరిగి, మళ్ళీ వెనక్కి దిగజారుతూ, కంపెనీ వాళ్ళ దొంగ ప్రచారాలతో మళ్ళీ పైకి ఎక్కుతూ, అలా తిరిగి తిరిగి ఎక్కడో అక్కడ మూలబడి ఆగిపోతుంది. నష్టం అంతా చివరి వాడిది అవుతుంది. వాడి నష్టమే, మొదటి వాళ్ళకి లాభం అవుతుంది. అదొక జూదం!"

"లాటరీల్లాంటి, పేకాటల్లాంటి జూదాల సంగతి తేలిగ్గానే అర్థమౌతుంది. అక్కడ డబ్బు వస్తుందని ఆశ. ఇక్కడ 100 దాన్ని 300 కి కొని, దాన్ని ఇంకా ఎక్కువకి అమ్మగలననీ, లాభం వస్తుందనీ, ఎవరైనా నమ్ముతారా? అంత బుద్ధి మాలిన వాళ్ళు ప్రపంచంలో వుంటారా?"

"అసలు షేర్ల ధరలు అలా పిచ్చిగా పెరగడంలో పెద్ద పెద్ద మోసాలు జరుగుతాయి. ఆ కంపెనీ వాళ్ళూ, షేర్ల వ్యాపారాల వాళ్ళూ, ఆ మోసాలు చేస్తారు. 10 రూపాయల షేర్లని, ఎవరెవరో ఎగబడి ఎక్కువ ధరలతో కొనేస్తున్నట్టు బైటి

జనానికి అనిపించేలాగ, ఆ మోసగాళ్ళే ఆ షేర్లని మారు పేర్లతో అలా కొంటారు. ఒక కంపెనీలో షేర్లకి ధరలు పెరిగిపోతున్నాయంటే, ఆ కంపెనీకి పెద్ద పేరు వస్తుంది కదా? అప్పుడు అందరూ ఆ షేర్లని ఎక్కువ ధరలతో కొనేస్తే, ఆ బ్రోకర్‌కి బాగా లాభం వస్తుంది కదా? వాళ్ళే మొదట మోసంగా కొన్ని షేర్లని ఎక్కువ ధరలతో, అంటే 10 షేరుని 100 తో కొనేసి, నాటకం అలా మొదలు పెడతారు. ఆ నాటకాల సంగతి తెలియని బైటి వాళ్ళు, ఆ షేరు ధరని ఇంకా ఎక్కువకి అమ్ముకోవచ్చని, దాన్ని 150 కి కొంటారు. ఆ రకంగా ఆ ధర పైకి ఎక్కి ఎక్కి ఆ తర్వాత మూల పడుతుంది. ఇదే కాదు, ఇంకా బోలెడు రకాల మోసాలు జరుగుతాయి. దీని మీద మీకో పేపరు వార్త చూపిస్తాను తర్వాత. అది చించి దాచాను, చూపిస్తాను తర్వాత."

"అమ్మో, ఏది వినాలన్నా భయంగా వుంది."

"మీరు షేర్లు కొనరుగా? మీకెందుకు భయం?"

"కొనే తెలివి మాలిన వాళ్ళు వున్నారు కదా? పోనీ ఒక మాట చెప్పండి. మొదట 100 వాటా గల వాడు, దాన్ని 300 కి అమ్మి, లాభంగా 200 సంపాదిస్తే, ఆ లాభం ఎక్కడి నించి వచ్చినట్టు? అది ఎక్కడి అదనపు విలువ?"

"ఆ 100 వాటాని, ఒక పెట్టుబడిదారుడు 300 తో కొంటే, ఏ డబ్బుతో కొంటాడు? వాడికి అప్పటికే జేబులో వున్న డబ్బుతో కొంటాడు. ఆ డబ్బు ఎక్కడిది? అప్పటికే వడ్డీల వల్లో, ఉత్పాదక లాభాల వల్లో, వర్తక లాభాల వల్లో, కౌళ్ళ వల్లో, ఏదో రకంగా వచ్చి వున్న డబ్బు అది. దానితోనే కొంటాడు. 100 వాటా మొదట వున్న వాడు ఒక పెట్టుబడిదారుడైతే, ఆ వాటాని 300 తో కొన్న వాడు ఇంకో పెట్టుబడి దారుడు. రెండో వాడి జేబులో డబ్బు, మొదటి వాడి జేబులోకి మారుతుంది. ఆ వాటాని 300 తో కొన్న వాడు దాన్ని అంత కన్నా ఎక్కువకి అమ్మలేక, 250 కే అమ్మితే, వాడికి 50 నష్టం కదా? ఆ 50, ఎక్కడికి పోయింది? అది అప్పుడే తేలదు. ఆ వాటాని 250 తో కొన్న వాడు, దాన్ని 100 కే అమ్మితే, వాడికి 150 నష్టం. ఆ ఇద్దరికీ జరిగిన నష్టాలు రెండూ కలిసి, 50 + 150 = 200. ఈ 200 ఎక్కడికి పోయింది? మొట్ట మొదట, ఆ 100 ని 300 కి అమ్మిన వాడికి, 200 లాభం వచ్చిందే, వాడికి అందింది అది."

"అంటే, ఈ షేర్ల జూదంలో సంపాదించే లాభాల్ని కూడా మనం 'అదనపు విలువ రాసి' లోకి కలపాలంటారా?"

"అలా అక్కర్లేదు. పెట్టుబడిదార్లకి వచ్చే వడ్డీల్నీ, లాభాల్నీ, అన్నిటినీ, అంతకు ముందే కలిపాం కదా? ఆ డబ్బే పెట్టుబడిదార్ల జేబుల్లో వుంటుంది. ఆ డబ్బుతోనే షేర్లని కొంటారు. కాబట్టి మళ్ళీ ఈ షేర్ల లాభాల్ని కలపక్కరలేదు. షేర్ల అమ్మకాల్లో లాభాలూ నష్టాలూ పెట్టుబడిదార్ల మధ్యే పంపకాలవుతూ వుంటాయి. షేర్లని మేధా శ్రమల శ్రామికులు కూడా కొనడాలూ అమ్మడాలూ చేస్తారు. వాళ్ళకి కొన్ని సార్లు లాభాలు వస్తే, కొన్ని సార్లు మొత్తం అంతా తుడుచుకుపోతుంది."

"అబ్బా, వినడానికే అసహ్యంగా వుందండీ. ఇంతింత వ్యసనాలా ప్రపంచంలో? అసలు ఆ షేర్ల మార్కెట్లని తగలబెట్టెయ్యాలి. ఆ పని నన్ను చెయ్యమంటే, సంతోషంగా చేస్తాను."

"ఎవరో చెప్పాలా చెయ్యమని? ఇవ్వాళే ఇప్పుడే చెయ్యండి!"

"అసలా మార్కెట్లు ఎక్కడుంటాయో నాకేం తెలుసు? ఇడ్లీల కోసం స్టవ్వులు అంటించడం తప్ప, మార్కెట్లని అంటించడం నాకు చేతనవుతుందా?"

"ఆ మార్కెట్లని అంటించే పని, శ్రామికుల పరిపాలనలో ఎలాగా జరుగుతుంది. అప్పుడు మీరే చేద్దురుగాని ఆ పని. ముందు కాపిటల్ చదివే పని పెట్టుకుంటే, షేర్ల భాగోతం ఇంకా బాగా తెలుస్తుంది."

"అప్పటి దాకా వూరుకుంటే, శ్రామికులు కూడా ఈ షేర్ల వ్యసనంలో పడి పిచ్చెక్కిపోతారు కదా?"

"పిచ్చెక్కించే మార్గాలు ఇంకా వందలు వందలు వున్నాయి. ఒక్కొక్క దాన్నీ విడి విడిగా వదిలించలేం. అన్నిటినీ తీసివేసే మార్గం ఏమిటో అది పట్టుకోవాలి."

"అయితే అదేంటో చెప్పండి, రేపే చేసేస్తాం."

"మళ్ళీ మొదటికొచ్చారా? అదేవిటో చెప్పాలా మళ్ళీ? పని స్తలాల్లో సంఘాలు పెట్టుకోవాలనీ, శ్రమ దోపిడీ ఎలా జరుగుతోందో, దాన్నించి ఎలా బైట పడాలో తెలుసుకోవాలనీ, చెప్పుకోలేదూ? పని స్తలాల్లోనే కాదు, మన నివాసాల్లో కూడా రక రకాల సంఘాలు వుండాలి. అందులో ఆడా, మగా, పిల్లా జెల్లా, అందరూ సభ్యులుగా వుండాలి. అక్కడ రెగ్యులర్‌గా అధ్యయన తరగతులు వుండాలి. మన సమస్యలేమిటో మనం అక్కడ కూడా చర్చించుకోవాలి. మద్యపానాలు ఆగిపోవాలి. పేకాటలు ఆగిపోవాలి. ఇలాంటివి ఎన్నెన్నో విషయాల మీద సంఘాల్లో చర్చలు జరగాలి. దాని వల్ల ఆ నివాసాల వాళ్ళందరికీ ఆలోచించడం తెలుస్తుంది. అక్కడ ఐకమత్యం, ఒక క్రమశిక్షణా, అలాంటివన్నీ అలవాటవుతాయి."

"అక్కడ డబ్బున్న వాళ్ళు వుంటే, వాళ్ళని ఆ సంఘాల్లో చేరనివ్వకూడదు."

"అవి, పని స్తలాలు కావు. అవి, నివాస స్తలాలు కాబట్టి, అక్కడి సమస్యల్ని అందరూ ఆలోచించాలి. మా ఇళ్ళ దగ్గిర ఒక సంఘం అయితే పెట్టారు. అది పెట్టీ పెట్టగానే గుడి కట్టాలని మొదలుపెట్టారు. 'అది మన సంస్కృతి' అన్నారు. కానీ, కొందరం దానికి వ్యతిరేకంగా వాదించాం. 'ఇక్కడ వేరు వేరు మతాల వాళ్ళు వున్నారు. ఏ మతం గుడి కడతారు? అన్ని మతాలకీ, అన్ని గుళ్ళూ కట్టాల్సిందే కదా? వాటి కోసం అంత స్తలం ఖర్చు పెడితే, ఇక చెట్లు ఎక్కడ పెరుగుతాయి? అక్కడక్కడా చెట్లు పెంచుకుందాం. పార్కు వుంటే, కాస్సేపు అక్కడ కూర్చోడానికి బాగుంటుంది' అని వాదిస్తే, ఇక్కడ వేరే మతాల వాళ్ళు వున్నారు కాబట్టి, ఏ గుడీ వద్దని అందరూ అన్నారు. నివాస స్తలాల సంఘాల్లో అన్ని ఇళ్ళ వాళ్ళూ వుండాలి."

"సరే, అలాగే. అలాంటి చోట్ల అందరూ కలిస్తేనే మంచిది. అది సరే, ఇందాక

ఒకటి గుర్తొచ్చింది. 'సంస్కృతి, సంస్కృతి' అంటారు. అదేంటి? మొన్న పేపర్లో, అవేవో ఫొటోలు చూశాను. ఆడ వాళ్ళు ఎంత పిచ్చిగా రంగులద్దుకుని వున్నారో! నెత్తి నించి పాదం దాకా ఏంటేటో దండలు, పూసలు, గవ్వలు, కంటెలు, బట్టలు సరిగా లేవు. అడవుల్లో మనుషుల్లా వున్నారు. పిల్లలకి గుడ్డలే లేవు. దున్నపోతు ముందు కత్తులు పట్టుకుని ఎగురుతున్నారు. చిన్న పిల్లల ముందు ఆ దున్నని నరుకుతారు గావును. అదేదో పండగంట. వాళ్ళ సంస్కృతి అలా సాగాలంట! ఆ పేపర్లో అదే రాశారు. వాళ్ళకి చదువూ సంధ్యా లేక, బతుకు దెరువుల్లేక, అంత అడవి జనం లాగ బతుకుతోంటే, ఆ బతుకే ఎప్పుడూ సాగాలా?"

"అసలు సంస్కృతి అంటే రోజూ బతికే అలవాట్లే. అడవుల్లో జనం, అక్కడి అలవాట్లతో బతుకుతారు. బైటి జనం, బైటి అలవాట్లతో బతుకుతారు. ఆ అలవాట్లన్నీ ఆటవిక కాలాల నించీ వచ్చినవి కొన్నీ, తర్వాత నడిచిన భూస్వామ్య సమాజాల నించీ, పెట్టుబడిదారీ సమాజాల నించీ బైల్దేరినవి కొన్నీ. అసలు శ్రామికుల సంస్కృతి అనేది, బీదరికం వల్ల సాగేదే గానీ, ఎప్పుడూ సాగవలసిన మంచి అలవాట్లు శ్రామికుల్లో కూడా ఎక్కడా వుండవు. పాత సంస్కృతిలో ఏ అలవాటు మంచిదో, ఏ అలవాటు చెడ్డదో, చూసుకోవాలి గానీ, చెత్త అలవాట్లన్నీ నిలబడిపోయి వుండాలా? శ్రమ దోపిడీ సంబంధాలు మారితే, చెత్త అలవాట్లు ఎప్పుడూ నిలబడవు. అప్పుడు సైన్సు ప్రకారమే ఆలోచనలూ, ప్రవర్తనలూ, అలవాట్లూ, ప్రారంభమౌతాయి కదా? సంస్కృతిలో మంచీ చెడ్డా రెండూ వుంటాయి. గతం నించీ వచ్చిన వాటిని చూస్తే, చెడ్డే ఎక్కువ. చెడ్డనే నిలబెట్టుకుంటామా, సంస్కృతి పేరుతో?"

" 'సంఘం' అంటే, నాకో ఆలోచన వచ్చిందండీ మొన్నటి నించీ. మా అబ్బాయితో చెపుతాను, మా గల్లీలో పిల్లల సంఘం పెట్టమని. వాడి శిష్యులు చాలా మంది వున్నారు. ఓ ఇరవై మంది ఒక సంఘం పెట్టుకుని, కొన్ని పుస్తకాలు చదివి మాట్లాడుకోవాలి. చెత్త సినిమాలవీ మానెయ్యాలి. సిగరెట్లు కాల్చకూడదు. వీధుల్లో క్రికెట్ ఆటలు మానెయ్యాలి. ఇళ్ళల్లో పనులు చెయ్యాలి. వీధులు శుభ్రంగా వుంచుకోవాలి."

"అవును, చాలా మంచి ఆలోచన మీది. కాపిటల్‌ని చదివి వినిపిస్తూ, విషయాలన్నీ వివరించాలి పిల్లలకి. ఏమీ కష్టం కాదు, చాలా తేలిక... ఇదుగో, షేర్ల వార్త ఒకటి ఇప్పుడు చూపిస్తాను. చూడండి! ఒక కంపెనీ వాడు ఏం చేశాడంటే, మా షేర్ల ధరలు తప్పకుండా పెరుగుతాయి; ఇప్పుడు తక్కువ ధరలతో కొని పెట్టుకోండి; తర్వాత పెద్ద ధరలతో అమ్ముకోవచ్చు - అని ఏవో రహస్యాలు బైట పెట్టాడట! వాడికి జైలు! దొరికిన వాడే దొంగ! దొరకని దొంగలు బైట బైట బోలెడు మంది! వార్త చూడండి!


రజత్ గుప్తాకు రెండేళ్ల జైలు

## రజత్ గుప్తాకు రెండేళ్ల జైలు

**50 లక్షల డాలర్ల జరిమానా**
**ఇన్‌సైడర్ ట్రేడి కేసులో తీర్పు**

న్యూయార్క్ : గోల్డ్‌మాన్ శాచ్‌తో సహా పలు అంతర్జాతీయ సంస్థల్లో కీలక పదవులు నిర్వహించిన, భారత సంతతికి చెందిన, వాల్‌స్ట్రీట్ దిగ్గజం రజత్ గుప్తాకు ఇన్‌సైడర్ ట్రేడింగ్ వ్యవహారంలో, మన్‌హటన్ కోర్టు రెండు సంవత్సరాల కారాగారవాసంతో పాటు 50 లక్షల డాలర్ల జరిమానా విధించింది. శిక్షా కాలం ముగిసిన తర్వాత కూడా గుప్తా మరో ఏడాది పాటు కోర్టు పర్యవేక్షణలోనే ఉండాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఏడాది పాటు జరిగిన సుదీర్ఘ విచారణకు తెర దించుతూ న్యాయమూర్తి జెడ్ రాకోఫ్, గురువారం తీర్పు ప్రకటించారు. తనకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని వెలుపలికి చేరవేయడం ద్వారా, పని చేస్తున్న సంస్థకు వెన్నుపోటు పొడిచారంటూ అభియోగాలు ఎదుర్కొంటున్న గుప్తాకు, ఊహించిన దాని కన్నా తక్కువ శిక్షే పడిందంటున్నారు. వాస్తవానికి ఇలాంటి కేసుల్లో నిందితులకు 25 సంవత్సరాల వరకు శిక్ష పడవచ్చు. ప్రభుత్వ ప్రాసిక్యూటర్లు కూడా గుప్తాకు కనీసం ఎనిమిది సంవత్సరాల కారాగారవాస శిక్ష విధించాలని కోర్టులో వాదించారు.

ఇదే కేసులో ఇప్పటికే జైలులో ఉన్న శ్రీలంకకు చెందిన రాజారత్నం 11 సంవత్సరాల కారాగారవాసం అనుభవిస్తున్నారు. ఆయనకు పడిన జరిమానా కూడా 9.28 కోట్ల డాలర్లు. రజత్ గుప్తాకు వ్యతిరేకంగా కోర్టులో ప్రధానంగా వాదం వినిపించిన ఫెడరల్ ప్రాసిక్యూటర్ ప్రీత్ భరారా కూడా భారత సంతతికి చెందిన న్యాయవాదే కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా అందరిలోనూ అత్యంత ఆసక్తి రేకెత్తించిన ఈ కేసులో న్యాయమూర్తి జెడ్ రాకోఫ్ 15 పుటలు గల సుదీర్ఘ తీర్పును పూర్తిగా చదవడానికి రెండున్నర గంటల సమయం పట్టింది. వచ్చే ఏడాది జనవరి ఎనిమిదో తేదీన నిర్దేశిత జైలులో లొంగిపోవాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకోవాలనుకుంటున్నందువల్ల ఆ విచారణ ముగిసే వరకు తనను బెయిలుపై విడుదల చేయాలన్న రజత్ గుప్తా అభ్యర్థనను కూడా ఆయన తిరస్కరించారు. అయితే గుప్తాను న్యూయార్క్‌లోని ఆటిస్‌విల్లీలో గల మీడియం సెక్యూరిటీ ప్రిజన్‌లో ఉండేందుకు అనుమతించాలంటూ ఆయన తరపు న్యాయవాది చేసుకున్న అభ్యర్థనను న్యాయమూర్తి అంగీకరించారు. కాని తుది నిర్ణయం జైళ్ళ శాఖ ఫెడరల్ బ్యూరోదేనని ఆయన తేల్చి చెప్పారు.

**మంచివాడే, కానీ:**

విచారణ సమయంలో పలు సందర్భాల్లో గుప్తా ధార్మిక కార్యకలాపాలను పలు మార్లు కొనియాడిన న్యాయమూర్తి తన తీర్పులో గుప్తాపై కొన్ని వ్యాఖ్యలు కూడా చేశారు. గుప్తా సహజంగా మంచివాడేనని, కాని చాలా మంది మంచివారు చెడు పనులు కూడా చేశారనడానికి చరిత్రలో ఎన్నో దృష్టాంతాలున్నాయని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. గోల్డ్‌మాన్ శాచ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ గురు రాజారత్నంకు చేరవేయడం తాను పని చేస్తున్న కంపెనీని నమ్మించి వెన్నుపోటు పొడవడమేనని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ఇది తీవ్ర నమ్మకద్రోహమని ఆయన అన్నారు.

గుప్తా చేసిన ఎన్నో ధార్మిక కార్యకలాపాలు అత్యంత ప్రశంసనీయమైనవే అయినా, ఆయన పాల్పడిన నేరం స్వభావం అందుకు పూర్తిగా భిన్నమైన కోణంలో నుంచి చూడదగిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. న్యాయశాఖ కన్నుల్లో నుంచి చూస్తే, గుప్తా చర్య తీవ్ర విశ్వాస ఘాతుకం కోవలోకి వస్తుందని ఆయన అన్నారు.

**భార్య, కూతుళ్ల పరస్పర ఓదార్పు:**

న్యాయమూర్తి తీర్పు ప్రకటిస్తున్న సమయంలో ముదురు నీలం రంగు సూట్‌లో కోర్టులో ఉన్న గుప్తా కన్నీళ్ళ పర్యంతం అయ్యారు. ఆయన భార్య, నలుగురు కుమార్తెలు, సన్నిహిత మిత్రులు కూడా కోర్టు హాలులోనే ఉన్నారు. ప్రేక్షకుల గ్యాలరీలో ఉన్న గుప్తా భార్య, కుమార్తెలు, పలు సందర్భాల్లో కన్నీళ్ళు తుడుచుకుంటూ ఒకరిని ఒకరు ఓదార్చుకోవడం కనిపించింది. కోర్టు ముగిసిన తర్వాత మాత్రం గుప్తా చిరునవ్వుతో తన న్యాయవాదుల బృందం సభ్యులతో కరచాలనం చేశారు. (ఆంధ్రజ్యోతి, 26-10-12)

---

గుప్తాకి, ఆ చిరునవ్వు ఎందుకంటే, 12 ఏళ్ళ శిక్ష తప్పి, రెండేళ్ళతో సరిపోయిందని! ★

# 54. శ్రామిక వర్గానికి, దోపిడీ వర్గంతో, పోరాటమా, సామరస్యమా?

**97.** అసలు మారకాల గురించి వినడం ప్రారంభించినప్పటి నించీ పట్టుకున్న ప్రశ్న ఇది నాకు. మారకాలూ, మారకం విలువా, అసహజం - అన్నారు. అవి లేకుండానే మనుషుల సంబంధాలు వుండొచ్చు - అన్నారు. ఎన్నాళ్ళు చెప్పుకున్నా, ఈ జవాబు దొరకడం లేదు. అమ్మకాల పద్ధతే పోతే డబ్బు ఎందుకు? డబ్బు చలామణీ కూడా పోయినట్టే. ఆ కాలం ఎప్పుడు? ఏం జరగాలి, అది రావాలంటే?

**జ:** దీనికి మొదట చిన్న జవాబు చెప్పుకోవాలంటే, మనుషులందరూ శ్రమలు చేసే పరిస్తితులు దాదాపుగా సమానం అవ్వాలి. ఉపయోగపు విలువ దృష్టి తోనూ, మారకం విలువ దృష్టితోనూ కూడా సమాన పరిస్తితులు ఏర్పడాలి. అసలు మొట్ట మొదటి సమస్య ఏమిటి? యజమాని వర్గం, స్వంత శ్రమ లేకుండా, శ్రామిక వర్గాన్ని దోపిడీ చేస్తూ బతుకుతోంది కదా? అది పోవాలంటే, యజమాని వర్గం కూడా తప్పని సరిగా శ్రమ చేసే మార్పు ప్రారంభం కావాలి. అది జరగాలంటే, రాజ్యాధి కారం శ్రామిక వర్గం చేతుల్లోకి మారాలి. అప్పుడు దోపిడీ చట్టాలన్నీ మారతాయి. కౌళ్ళనీ - వడ్డీ లాభాల్నీ సంపాదించే దోపిడీ హక్కులు పోతాయి.

"అంత పెద్ద మార్పా! ఎలా జరుగుతుంది? రాజ్యాధికారమే శ్రామిక వర్గానికి మారుతుందా? ఎలా జరగాలి అది?"

" 'ఎలా జరగాలి?' అనే ప్రశ్న కాదు. అసలు, 'జరగాలా వద్దా?' అనేది మొదట తేల్చుకోవాలి."

"అయ్యో, 'జరగాలా వద్దా?' ఏమిటి? జరిగి తీరాలి! జరక్కపోతే, భూస్వాముల ఆధీనం నించీ భూములు ఎలా బైట పడతాయి? అది తప్పకుండా జరగాలి. కానీ, 'ఎలా చెయ్యగలం?' అదే జంకు నాకు."

" 'దోపిడీ నించి బైట పడాలి' అనే సంగతే శ్రామిక జనాభాకి అర్థమైతే, రాజ్యాధికారం సంపాదించడం ఎంత సేపు? కానీ, మొదట్లోనే ఒక ఆటంకం వుంది. కమ్యూనిస్టులమని చెప్పుకునే వాళ్ళల్లోనే ఒక రకం వాళ్ళ వాదం ఏమిటంటే, 'వర్గ పోరాటం అక్కర లేదు. వర్గ సామరస్యంతో నెమ్మదిగా అంతా మార్చుకోవచ్చు' అంటారు. ఈ వాదం, మార్క్సు కాలంలోనే ప్రారంభమై ఈ నాటికీ ఇంకా సాగుతూనే వుంది. అంటే, మనం మొదట, 'దోపిడీ వర్గంతో పోరాటమా, సామరస్యమా' అనే ప్రశ్న మీద దేన్నో ఒక దాన్ని తేల్చుకోవాలి. 'సామరస్యం' అయితే, ఏ పోరాటాలూ అక్కరలేదు. ఇప్పుడు వున్న చట్టాలే, ఈ

రాజ్యాంగమే, అన్నీ ఇలాగే వుంటాయి. ఎన్నికల్లో శ్రామికులు కూడా నిలబడి, ఈ అసెంబ్లీల్లోకీ, ఈ పార్లమెంటుల్లోకీ వెళ్ళి, అక్కడ కాసిన్ని వాదనలు చేసి, జీతాలు కొంచెం పెంచి, శ్రామికుల పరిస్థితిని కాస్త కాస్త మెరుగు చేస్తారు. ఈ రకంగా, కొంత కాలానికి 'సోషలిజం' ఏర్పడిపోతుంది అంటారు. 'సామరస్యంతో అలా చేసుకోవాలి గానీ, పోరాటాలెందుకు? వాటితో అవసరం వుండదు' అంటారు. ఈ నాటికీ ఆ వాదం అలాగే వుంది."

"సరే, సామరస్యమే చేద్దాం. అయితే, యజమానులు ఆస్తుల్ని వదిలేస్తారా? వాళ్ళు కూడా శ్రమలు చేస్తారా? కౌళ్ళూ - వడ్డీ లాభాలూ, పోతాయా?"

"అవన్నీ మాట్లాడరు ఆ వాదం వాళ్ళు. ఆ మాటలు ఎత్తరు."

"వాళ్ళు మాట్లాడకపోయినా, ఆ మాటలు మనం ఎత్తుతాంగా? ఏం జవాబులు చెపుతారు వాళ్ళు?"

"అడిగినా చెప్పరు. అందరికీ కావలసింది సోషలిజం కదా? నెమ్మదిగా అదే వస్తుంది - అంటారు."

"సోషలిజం అంటే?"

"యజమానీ శ్రామిక సంబంధాలు లేకుండా, శ్రమ దోపిడీ లేకుండా, సమాన సంబంధాలు ఏర్పడే విధానం. అది సమ సమాజం. మనుషులందరికీ సమానమైన హక్కులూ, సమానమైన బాధ్యతలూ వుండాలి. ఇవి, మార్క్సు వివరించే సోషలిజం లక్షణాలు. ఇది మార్క్సియన్ సోషలిజం. కానీ, ఈ 'సోషలిజం' అనే మాటని దోపిడీదారులు కూడా వాడతారు. 'నెహ్రూ సోషలిజం' వుంది. 'లోహియా సోషలిజం' వుంది. సోషలిజానికి దోపిడీ వర్గంలో అనేక సెక్షన్ల వాళ్ళు చెప్పే అర్థాలు వున్నాయి. వాళ్ళకి ఎలా కావాలో అలాంటి అర్థాలు చెపుతారు. వాళ్ళల్లో ఎవ్వరూ కూడా 'శ్రమ దోపిడీని తీసివెయ్యాలి' అనే మాట ఎత్తరు. 'యజమానీ శ్రామిక సంబంధాలు, సమాన సంబంధాలుగా మారిపోవాలి' అనరు. అన్నీ ఎప్పట్లాగే వుంటాయి. వాళ్ళ ఆస్తులూ, వాళ్ళ ఆదాయాలూ, వాళ్ళ కంపెనీలూ, ఆఖరికి వాళ్ళ యుద్ధాలూ, అన్నీ మామూలే! అందుకే మనం ఒక విషయంలో జాగ్రత్తగా వుండాలి. ఎవరైనా 'సోషలిజం' అన్నారంటే, మనం నమ్మెయ్యకూడదు. 'దాని లక్షణాలేమిటి?' అని అడగాలి. ఇప్పుడు మనం, మన 'మార్క్సియన్ సోషలిజం' గురించే మాట్లాడుకుందాం. రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత శ్రామిక వర్గం, ఆస్తి సంబంధాల్నీ, శ్రమ సంబంధాల్నీ, మార్చే పని మొదలుపెడుతుంది. చివరికి అది సమానమైన హక్కులూ - సమానమైన బాధ్యతలూ ఏర్పడే దాకా సాగుతుంది. ఆ మార్పులన్నీ స్థిరపడి సాగుతూ వుంటే, అది 'కమ్యూనిజం' అవుతుంది. అది, మారుతూ వున్న దశ కాదు; మార్పులు పూర్తి అయిన దశ!"

"అప్పుడు పోతుందా అమ్మకాల విధానం?"

"ఆ లోపలే కొన్ని కొన్ని మార్పులు జరుగుతూ, కొన్ని విషయాల్లో అమ్మకాల పద్ధతి పోతూ వుంటుంది. ఉదాహరణకి, పాఠశాలలూ, ఆస్పత్రులూ, ఉచితంగా పనిచేస్తే, ఆ విషయాల్లో అమ్మకాల పద్ధతి పోయినట్టే కదా? అలాగే, రవాణాలో అంతా ఉచితంగా వెళ్ళే పద్ధతి ప్రారంభం కావచ్చు. అలాగే, క్షవరాలు చేయించుకునే పద్ధతి ఉచితం కావచ్చు. సమాజం ఏర్పర్చిన ఇళ్ళకి అద్దెలు లేకుండా ఉచితంగా వుండే పద్ధతి ప్రారంభం కావచ్చు, ఒక్కొక్కటీ క్రమ క్రమంగా. మనం ఇప్పుడు దోపిడీ సమాజంలోనే వున్నాం కాబట్టి, ఇక్కడ తేల్చుకోవలిసింది, దోపిడీ వర్గంతో పోరాటమా, సామరస్యమా? ఇది ముందు నిర్ణయించుకుంటే, దాన్ని బట్టి మన భావాలూ, మన కార్యక్రమాలూ, వుంటాయి."

"ఛీ! దోపిడీ వర్గంతో సామరస్యమా? ఇప్పుడు తేల్చుకునేదేమిటి? మార్క్సు ఏ నాడో తేల్చి చెప్పాడు. సామరస్యంగా వుంటే, దోపిడీదారుడు లాభం తినడం మానేస్తాడా? 'ఇన్నాళ్ళూ తప్పు చేశాను, ఆస్తి హక్కులు వదిలేస్తాను, నేనూ పని చేసి బతుకుతాను' అంటాడా? ఎందుకొచ్చిన వాదాలు ఇవి? దగాకోరు వాదాలు. మార్క్సు కాలంలోనే ఈ దగాకోరు వాదాలు వున్నాయన్నారు. దానికి మార్క్సు ఏమన్నాడు?"

"ఏమంటాడు? మీరన్నట్టే అన్నాడు. 'ఛీ! సామరస్యమా!' అన్నాడు. శ్రామిక వర్గం, దోపిడీ వర్గాన్ని శతృవుగా చూడాలన్నాడు. దోపిడీ వర్గంతో సామరస్యం అంటే, దానికి పూర్వం కన్నా బంటుగా మారడమే అన్నాడు."

"గొప్పగా అన్నాడు. శ్రామిక వర్గానికి సిగ్గు వచ్చేలాగ అన్నాడు. సామరస్యం మాట ఎత్తకండి! మనం చెయ్యవలసింది వర్గ పోరాటమే. మా యజమానిని పనిలోకి దింపకుండా నేను చచ్చిపోకూడదు అనుకుంటున్నాను. వాడి కోసం వాడు పని చేసుకోడు గానీ, వాడి కోసం మేం అందరం పనులు చెయ్యాలా? అది మేం ఒప్పుకుంటామా? కానీ, నా జంకు ఏమిటంటే, రాజ్యాధికారాన్ని మనం సాధించగలమా? అదే నాకు పెద్ద అనుమానం."

"దేశంలో వున్న మొత్తం జనాభాలో శ్రామికులే అత్యధిక సంఖ్య. దోపిడీ జనం, సంఖ్యలో తక్కువ. శ్రామిక జనానికి 'శ్రమ దోపిడీకి గురి అవుతున్నాము' అని అర్థమైతే, దోపిడీ వర్గం ఎలా నిలబడుతుంది? వాళ్ళ దగ్గిర ఎన్ని ఆయుధాలు వున్నా, ఆయుధాలు చేసేదీ శ్రామికులే, ఆయుధాల్ని నడిపేదీ శ్రామికులే. వాళ్ళకే అసలు నిజం తెలిస్తే, ఉద్యమకారులు వాళ్ళల్లో కూడా పనిచేస్తే, దాని ఫలితం ఏమీ వుండదా? వెనకటి కాలాల్లో బానిసలు పోరాడలేదా? కౌలు రైతులు పోరాడలేదా? వేతన శ్రామికులు మాత్రం పోరాడడం లేదా? ఈ పోరాటాలూ సాగుతూనే వున్నాయి. రష్యా విప్లవంలో శ్రామిక వర్గ నాయకుడు లెనిన్ ఏమన్నాడంటే, 'రాజ్యాధికారం తీసుకోవడం పెద్ద సమస్య కాదు; ఆ తర్వాత, జరగవలసిన మార్పులే అసలైన సమస్య' అన్నాడు. అది చదివినప్పుడు నాకు

'ఇదేవిటి, ఇలా చెపుతున్నాడు? రాజ్యాధికారం వచ్చేస్తే శ్రామికులే అన్నీ మార్చేసుకుంటారు కదా? అందులో సమస్యేం వుంటుంది?' అనిపించేది. కానీ, విప్లవాలు ప్రారంభమైన దేశాల్లోనే, మంచి మార్పులు స్థిరపడకుండా పోవడం చూశాం. అంటే, రాజ్యాధికారం తీసుకోవడంతోనే పని అయిపోయినట్టు కాదు - అని అర్థమైంది."

"ఇంకేం జరగాలి? రాజ్యాధికారం తీసుకున్న తర్వాత, భూముల్ని పంచెయ్యడమో, సమిష్టిగా వుంచడమో, ఏదో చేసేస్తారు. భూస్వాముల్నీ, పెట్టుబడిదారుల్నీ కూడా పనులు చెయ్యాలంటారు. ఆడా మగా అంతా పనులు చేస్తారు. అందులో ఏం కష్టం వుంది? విప్లవాలు ఎందుకు నిలబడడం లేదు?"

"ఆ మార్పులు గట్టిగా జరగాలంటే, అసలు శక్తి, చట్టాల వల్ల రాదు. ఇద్దరు ముగ్గురు నాయకుల వల్ల కూడా రాదు. కోట్ల మంది శ్రామిక జనానికి, మార్పులు ఎందుకు జరగాలో, ఎలా జరగాలో, అర్థం కావాలి. శ్రామిక వర్గంలోనే, ఉన్నత మేధా శ్రమల వాళ్ళు వుంటారు. వాళ్ళకి కొంచెం మంచి జీతాలే, మంచి పరిస్థితులే, వుంటాయి. వాళ్ళు, వర్గ పోరాటం వేపు గాక, వర్గ సామరస్యం వేపు మొగ్గుతూ వుంటారు. శ్రామిక వర్గంలోనే శారీరక శ్రమల సెక్షన్లన్నిటికీ అనేక సమస్యలు వున్నా, వాళ్ళూ యజమాని వర్గాన్ని గౌరవంగా చూసే భావాలతో వుంటారు. ఎన్నికల్లో ఎగబడి దోపిడీదార్లకే ఓట్లు వేస్తూ వుంటారు. ఇలా వున్న జనం, అసలు నిజాలు తెలుసుకోవాలంటే, ఆ బాధ్యత అంతా కమ్యూనిస్టు పార్టీలదీ, మార్క్సు సిద్ధాంతాన్ని అర్థం చేసుకున్న వ్యక్తులదీ, కదా? జనాలకి వాళ్ళు బోధించాలి కదా? ఇప్పుడు వున్న వేతన శ్రామికులకి, 'వెనకటి కాలంలో బానిస విధానం వుండేది; ఈ నాడు మనమూ బానిసలమే, వేతన బానిసలం' అని ఎందరికి తెలుసు? హఠాత్తుగా నిరుద్యోగం బారిన పడిన ఇంజనీర్లు, నిరాశతో ఆత్మహత్యలు చేసేసుకుంటారు గానీ, 'ఈ నిరుద్యోగం, పెట్టుబడిదారీ విధానం వల్ల ఏర్పడుతోంది' అని తెలుసుకుంటారా?"

"తెలుసుకున్నా ఏం చెయ్యగలరు? ఎలా బతుకుతారు?"

"తెలుసుకుంటే ఆ ధైర్యం వేరు. అప్పుడు పెట్టుబడిదారీ విధానం మీదా, యజమాని వర్గం మీదా, ఆగ్రహం వుంటుంది. తను ఒంటరిగా లేననీ, శ్రామిక వర్గంలో మనిషిననీ, అర్థమవుతుంది. ఒక ఉద్యోగం పోయినా అది అవమానం కాదనీ, ఏదో చిన్న పని చేసుకుని బతకాలనీ, ఒక ధైర్యం వస్తుంది. అలాగే జరిగి తీరుతుందని కాదు. జ్ఞానం తెలియక పోవడానికీ, తెలియడానికీ, తేడా వుండదూ?"

"అయ్యో! తేడాయే లేకపోతే, అసలు జ్ఞానం ఎందుకు? సిద్ధాంతాలెందుకు? అదంతా ఒప్పుకోవలిసిందే." ★

# 55. సమాజం ఇచ్చే ఉచితాలన్నీ జనాభా శ్రమలే!

**98.** అసలు అమ్మకాల విధానం ఎప్పుడు పోతుందని అడిగాను మిమ్మల్ని. అది క్రమ క్రమంగా పోతుందని చెప్పారు గానీ, అది నాకు ఇంకా కావాలి.

**జ :** ఒకరు చెప్పేదేముంది? మీరూ ఆలోచించండి! మీ ప్రశ్నల వల్ల నేను కూడా ఆలోచిస్తూ నేర్చుకుంటున్నాను. అమ్మకాల విధానం ఎప్పుడు పోతుందా? దీన్ని కొన్ని దశలుగా పెట్టుకుందాం.

(1) మొదట, యజమాని వర్గం వాళ్ళంతా కూడా శ్రమలు చేసేవాళ్ళుగా అవ్వాలి. అది ప్రారంభం కావాలి.

(2) వెనకటి నించీ వున్న శ్రమ విభజనలన్నీ అసమానత్వాల తోటీ, అన్యాయాల తోటీ వున్నాయి కాబట్టి, అవి మారడం మొదలవ్వాలి.

(3) పని స్థలాల్లో, శ్రమ సంబంధాల్లో, యజమానీ శ్రామిక సంబంధాలు, సమానత్వం వేపు మారుతూ వుండాలి.

(4) ఏ మార్పుల్లో అయినా, వాటి రూపాలు మారడం కాదు, వాటి స్వభావాలు మారుతూ వుండాలి.

ఈ విషయాలన్నీ, తార్కిక పద్ధతిలో, ఉపయోగపు విలువ పద్ధతిలో, మారకం విలువ పద్ధతిలో, న్యాయం - ధర్మం పద్ధతిలో, సమానత్వం పద్ధతిలో, జనాభాకి అర్థమవ్వాలి. సిద్ధాంత జ్ఞానం లేకపోతే, కనీసం అది మెజారిటీ జనానికి లేకపోతే, ఏ మార్పూ స్థిరంగా నిలబడదు. చట్టాల్లో ఒక మంచి మార్పు జరిగిన చోట కూడా, యజమాని వర్గం ముసుగులో వుంటుంది. అది మళ్ళీ తన పాత సమాజాన్నే తీసుకు రావాలని దాని ప్రయత్నాలు అది చేస్తూ వుంటుంది. ఒక వేపున, దాని కుట్రలూ, ఇంకో వేపున శ్రామిక వర్గంలో ఇంకా తెలివి రాని అజ్ఞానమూ - ఈ రెండూ ఒక దాని పక్క ఒకటి వుంటే, ఏమవుతుంది? మంచి మార్పులు ఎలా ఏర్పడతాయి?

"అంటే, శ్రామిక జనాభాకి ఎంతో తెలియాలన్నమాట! ఎంతో అక్కరలేదు. మాకు తెలిసినంతన్నా చాలు. శ్రమ దోపిడీ సంగతి తెలియకపోతే, అసలు పేదరికానికి కారణం ఎలా తెలుస్తుంది? దోపిడీ వర్గంతో పోరాటం ఎలా తెలుస్తుంది? అవును, నిజమే. మార్పులు చెయ్యవలసింది ఎవరో, వాళ్ళే అజ్ఞానంగా వుంటే, ఇక మారేది ఎవరు? మార్చేది ఎవరు? మీరు ఇంత కాలం నించీ చెప్పినవన్నీ మాకు తెలియకపోతే, మేం ఎలా వుంటాం? 'పోరాటాలెందుకు పాడు, సామరస్యంగా వుంటేనే మంచిది' అనుకోమా? 'కాస్త జీతాలు పెరిగితే చాలు' అనుకోమా? 'అంతంత పెట్టుబడులు పెట్టే వాళ్ళకి లాభాలు రావొద్దా?' అనుకోమా? ఇన్నాళ్ళూ అలాగే అనుకోలేదా? నాకైనా, మా ఆవిడికైనా, ఆ దేవుళ్ళ పిచ్చి వదిలేదా? మేం ఇప్పటి దాకా పుస్తకాలు చదివామా, పెట్టామా? తెలిసిన వాళ్ళు

చెప్తేనే కదా, తెలియని వాళ్ళకి తెలిసేది? నిజమే, జనాలకు బోధించాలి. అదంతా అర్థమైంది గానీ, బోధించినా, మనుషులు మారినా, 'మారకాల అవసరం' ఎలా పోతుంది? అదే నాకు ఎప్పుడూ ఆశ్చర్యం! అప్పుడైనా అన్ని పనులూ ఎవరికి వాళ్ళే చేసుకోరు కదా? అప్పుడు మారకాలో, డబ్బు అమ్మకాలో, కావద్దా?"

"అమ్మకాల పద్ధతి పోవద్దనీ, అది ఉండాలనీ, గట్టిగా పట్టిందా మీకు?"

"అయ్యయ్యో! అది కాదు. అది సాధ్యమా, ఎలా సాధ్యం - అని తెలుసుకోవాలని, అంతే."

" 'శ్రమ విభజన మారాలి' అని మనం ఇంత వరకూ చెప్పుకున్నామా లేదా?"

"మొదట్లో ఒక సారి అన్నారు. వివరంగా చెప్పుకోలేదు."

"వివరంగా ఇక్కడ కూడా చెప్పుకోలేము. దీన్ని మీరు 'కాపిటల్'లో చదవాల్సిందే. మంచి సమాజం ఏర్పడిపోయిందే అనుకోండి. అక్కడ శ్రమ దోపిడీ లేదే అనుకోండి. అయినా అక్కడ పాత శ్రమ విభజనలే వుంటే, ఆ సంబంధాలు ఎలా వుంటాయి? ఒక మనిషి, ఎప్పుడూ ఒక శారీరక శ్రమే చేస్తాడు. దానికి చదువూ సంధ్యా అక్కరలేదు. అతని శ్రమ విలువ అతనికి వస్తుంది గానీ, మేధా శ్రమల వాళ్ళతో పోలిస్తే అది తక్కువే. ఇంకో మనిషి, ఒక మేధా శ్రమ చేస్తాడు. చదువూ సంధ్యా వుంటాయి. అతని ఆదాయం కొంత ఎక్కువే. అప్పుడు ఆ మనుషులిద్దరూ సమాన పరిస్థితుల్లో వున్న వాళ్ళేనా? వాళ్ళ హక్కులూ బాధ్యతలూ సమానంగా వున్నట్టేనా? ఒక మనిషిని ఎప్పుడూ రోడ్లు ఊడుస్తూ బతకమనాలా? ఈ సమస్య, ఆడ వాళ్ళకీ, మగ వాళ్ళకీ మధ్య కూడా వుంది. ఒకళ్ళకి ఇంటి పనీ, ఒకళ్ళకి బైటి పనీ! వాళ్ళు సమానులు అవుతారా?

అంతే కాదు, ఈ భారత దేశం సంగతి చూస్తే, ఇక్కడ 'కుల భేదాల' సమస్య ఒకటి వుంది కదా? వాటిల్లో చిన్న కులాలూ, పెద్ద కులాలూ అనే తేడాలు బోలెడు వున్నాయి. వాటిల్లో, చిన్న కులాల్లో ఎక్కువ మంది చేసే పనులన్నీ శారీరక శ్రమలే. అందులో రోడ్లు వూడ్చే, పాయిఖానాలు కడిగే, చచ్చిపోయిన జంతువుల్ని పాతిపెట్టే రకం అట్టడుగు శారీరక శ్రమలు కూడా వుంటాయి. పెద్ద కులాల్లో కూడా శారీరక శ్రమలు చేసే జనాభా వున్నా, వాళ్ళకి అంత మురికి శ్రమలు వుండవు. మరి, ఈ శ్రమ విభజనలన్నీ ఇలాగే సాగితే, మానవ సంబంధాల్లో సమానత్వానికి మార్గం ఎక్కడ వుంటుంది? ఎప్పుడూ వంటలే చేసే మనిషికి చదువుతో ఏం అవసరం? వంటల పుస్తకాలు చదవడానికా? రోడ్లు వూడ్చే మనిషికి వంటల పుస్తకాల చదువు కూడా అక్కరలేదు కదా? శ్రమలు చేసే పద్ధతులు ఇలా వుంటే, ఆ మనుషులు ఉపయోగపు విలువ దృష్టితోనూ సమానులు అవరు; మారకం విలువ దృష్టితోనూ సమానులు అవరు. అక్కడ శ్రమ దోపిడీ లేకపోయినా, ఎవరి శ్రమ విలువ వాళ్ళకే

అందినా, మనుషుల పరిస్తితులు సమానత్వంతో వుండవు. దోపిడీ సమాజాల్లో, ఒక మనిషి జీవితాంతం ఒకే శ్రమ చేసే పద్ధతి వుంది. అదే పద్ధతి మంచి సమాజంలో కూడా వుంటే, అక్కడ దోపిడీ లక్షణాలు వున్నట్టే అర్థం కదా? అందుకే, పాత శ్రమ విభజనలు, సమానత్వం ఏర్పడడానికి వీలయ్యే విధంగా మారాలి. సమాజానికి శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ ఎప్పుడూ అవసరమే. ఎప్పుడూ కావాలి. పాయిఖానా దొడ్లనీ, రోడ్లనీ, శుభ్రం చేసుకోవడం ఎప్పుడూ కావాలి. ఆ శ్రమల్ని వదిలెయ్యడం ఎప్పటికీ సాధ్యం కాదు. అలాంటప్పుడు ప్రతీ మనిషీ డ్యూటీల ప్రకారం, కొన్ని శారీరక శ్రమలూ, కొన్ని మేధా శ్రమలూ చేసే విధంగా శ్రమ విభజన పెట్టుకుంటే, అప్పుడు అందరికీ చదువులతో అవసరం వుంటుంది. అందరూ చదువుకున్న వాళ్ళూ, మేధావులూ, అవుతారు. ప్రతీ మేధావీ ప్రతీ కళాకారుడూ, శారీరక శ్రమలు కూడా చెయ్యవలసిందే. మీరు ఇప్పుడు ఇడ్లీలూ, ఉప్మాలూ వండగలిగే మనిషి. ఆ శ్రమే కాదు, నెలలో కొన్ని సార్లు ఏ లారీలో నడపాలి. లేదా, కొన్ని చోట్ల రోడ్లు ఊడ్చే డ్యూటీలు చెయ్యాలి. అవే గాక, ఒక టీచరుగా పిల్లలకు పాఠాలు చెప్పాలి. ఇవన్నీ ఒకే రోజున చెయ్యరు. అందరికీ డ్యూటీలు ఏర్పర్చుకోవాలి. శ్రమ విభజనలు అలా మారితే, అప్పుడు, ఏ ఇద్దరి 'శ్రమ విలువ' అయినా ఒకటే అవుతుంది. ఒకటే అయ్యేలాంటి నిర్మాణం వుండాలి. అందరూ చేసే శ్రమలు ఒకే విలువతో, ఒకే న్యాయంతో వుంటే, అప్పుడు మారకాలెందుకు? డబ్బుతో అమ్మడాలూ, కొనడాలూ, ఎందుకు? అందరూ డ్యూటీల ప్రకారం శ్రమలు (ఉద్యోగాలు) చేస్తూ, అవసరమైన ఉత్పత్తుల్ని ఉచితంగానే వాడుకోవచ్చు. బియ్యం ఉచితంగా ఇళ్ళకి పంపిణీ అయితే, కడుపులకు పట్టనంత అన్నం తినేస్తూ వుంటారా? మందులు ఉచితంగా వస్తే, అన్ని మందుల్నీ మింగేస్తూ వుంటారా? దుప్పట్లు ఉచితంగా వస్తే, పదేసి దుప్పట్లు కప్పేసుకుంటారా? ఈ నాడు, ఈ సమాజంలో వున్న మనుషులు ఎంతెంత అజ్ఞానాలతో వున్నారో, ఆ నాడు కూడా అలాగే వుంటారా? అలాగే వుంటే, అసలు ఆ సమాజం ప్రారంభమవుతుందా? అప్పటికి ఏర్పడే భావాలూ, సాంప్రదాయాలూ, ఆచరణలూ, ఉన్నతంగా ఏర్పడే విధంగా, విద్యలూ, కళలూ, పని చేస్తాయి కదా? ఇవ్వాళ వున్న దొంగ నీతుల్నీ, కపటత్వాల్నీ, వదిలించే పరిస్తితులు మొదట ఏర్పడతాయి. శ్రమ దోపిడీల్నీ, యజమాని తనాల్నీ, అసమానత్వాల్నీ, మార్చుకుంటే, ఇంకా దగాలతో, మోసాలతో, అవసరం ఏమిటి? మొదట, ఎలాంటి పునాదిని ఏర్పర్చుకోవాలో దాన్ని ఏర్పర్చుకున్న తర్వాతే, మంచి సంబంధాల్ని ఆశిస్తాం."

"సమాజమే అందరికీ, అన్నిటినీ ఏర్పరుస్తుంది - అనుకోవాలా? అంతే కదా?"

"అది పెద్ద తప్పు! సమాజం అంటే ఎవరు? మనుషులే. మనుషులు తయారు చెయ్యకపోతే ఉత్పత్తులు వస్తాయా? 'పిల్లలకు చదువులు ఉచితం' అంటే అర్థం,

ఆ పుస్తకాలూ, పెన్నులూ, ఆ స్కూళ్ళ బిల్డింగులూ, అవన్నీ ఎవరి శ్రమలు? పిల్లల తల్లి దండ్రుల శ్రమలే. ఆ శ్రమలే జరగకపోతే, అవి ఎక్కడి నించి అందుతాయి? తల్లిదండ్రులే జీతాలు తీసుకుని, ఆ జీతాల్లో నించి స్కూళ్ళకి ఫీజులు కట్టడం ఎలాంటిదో, స్కూళ్ళకి ఏ చెల్లింపులూ లేకుండా చదువులు సాగడం కూడా అలాంటిదే. రెండు రకాల పరిస్థితుల్లోనూ, ఆ చదువుల శ్రమల ఖర్చులన్నీ తల్లిదండ్రులవే. అందులో ఇతర పెద్ద వాళ్ళ శ్రమలు కూడా కలిసి వుండవచ్చు. 'సమాజం ఇస్తుంది' అంటే, అక్కడ వుండే మనుషులతో సంబంధం లేకుండా ఆ ఉచితాలు ఎక్కడి నించో వస్తాయని కాదు."

"ఇలా వినడం ఎంత బాగుంది! ఎన్ని వేల సంవత్సరాలకి అదంతా? మన కాలంలో చూడగలమా?"

"చూడాలని శ్రామిక వర్గం ఎంత ఆతృతతో వుంటే, అంత త్వరగా చూడగలం. వేల సంవత్సరాలు ఎందుకు? ప్రకృతిలో మార్పుల్ని త్వరగానో, ఆలస్యంగానో జరిగేలా మార్చలేం గానీ, సమాజంలో మార్పులు అయితే, మనకి కావలసిన మార్పుని మనం సాధించగలం. అది మన చేతుల్లో పని. ఇప్పుడు సిద్ధాంతం సిద్ధంగా వుంది. దోపిడీని తీసివెయ్యాలనేదే ఆ సిద్ధాంతం. మొదట సిద్ధాంతం తెలిసి వుండాలి. దాన్ని సాధించాలనే దృష్టి వుండాలి. కోట్ల మంది జనం దాన్నే ఆశిస్తే అదేం కష్టం? కష్టమా? అసాధ్యమా? సూర్యుణ్ణి ఆపడం అసాధ్యం గానీ, భూస్వామిని ఆపడం అసాధ్యమా?" ★

# 56. మనుషులు, స్పందన శక్తులన్నీ సర్వ నాశనమై ఉన్నారు!

**99.** మనుషులందరూ సమానంగా శ్రమలు చేసుకుంటూ బతకడం గురించి నాకు ఎన్నెన్నో అనుమానాలు వున్నా, నాకు నేనే నా అనుమానాలకు వ్యతిరేకంగా, అంతా జరుగుతుందని తమాషాగా ఊహిస్తున్నాను. మనం మంచి సమాజాన్ని ఏర్పరచుకుంటాం. అక్కడ, ఇళ్ళకి అద్దెలు వుండవు. ఆహార పదార్థాలన్నీ, కుటుంబంలో వున్న సంఖ్యని బట్టీ, అవసరాల్నీ బట్టీ, పంపిణీ అవుతాయి. చదువులూ, రవాణాలూ, వైద్యాలూ, అన్నీ ఉచితం. ఇంకా అమ్మడాలూ కొనడాలూ, ఎందుకు? ఇదంతా సిద్ధాంత పరంగా, తార్కికంగా, సాధ్యమా కాదా అని మొదట చూడాలి. సిద్ధాంతంగా సాధ్యమయ్యే దాన్ని ఆచరణలో కూడా సాధ్యం చేసుకోవచ్చు. సమానత్వం లేని శ్రమ సంబంధాలు సమానత్వంగా మారితే, డబ్బు కొలతలు ఎందుకు?

**జ :** ఎంత బాగా ఊహించారు! శ్రమ విభజన అలా మారడం మీకు ఇష్టమేనా? మీ

డ్యూటీలు మీరు సంతోషంగా చేస్తారా?

"నన్ను నమ్మండి! ప్రపంచం మంచిగా మారడానికి ఏం చెయ్యవలసి వున్నా చేస్తాను. నా డ్యూటీల రోజుల్లో రోడ్లు ఊడుస్తాను, పాయిఖానాలు కడుగుతాను. నేను రోడ్ల మీద నడవడం లేదా? నేను పాయిఖానాలు వాడడం లేదా? నా లాంటి వాళ్ళ సంగతి కాదు. మేం పట్టుదలగా చేస్తాం. కానీ, ఒక డాక్టరు, తను పని చేసే ఆస్పత్రిలో డ్యూటీల ప్రకారం గదులు వూడుస్తాడా? దొడ్లు కడుగుతాడా? అదే సందేహం నాకు. అది జరగకపోతే, శ్రమ విభజన ఎలా మారుతుంది?"

"కడగకపోతే, ఆ దొడ్లని ఉపయోగించకుండా బతకమనాలి. యజమానులు శ్రమలు చెయ్యడానికి ఎంత మొరాయిస్తారో, మేధా శ్రమల వాళ్ళు శారీరక శ్రమలు చెయ్యడానికి అంత మొరాయిస్తారు. మగ వాళ్ళు ఇంటి పనులు చెయ్యడానికి అంత మొరాయిస్తారు. ఈ శ్రమ విభజనల మార్పులే ఎక్కువ కష్టం. భూస్వాముల ఆధీనం నించి భూముల్ని తీసెయ్యడం కష్టం కాదు. ఆ పని వెంటనే చెయ్యవచ్చు. పెట్టుబడిదారీ కంపెనీల్ని స్వాధీనం చేసుకోవడం కూడా కష్టం కాదు. అదీ చెయ్యవచ్చు. శ్రమ విభజనలు మార్చడమే అసలైన కష్టం. పాత భావాలూ, పాత సాంప్రదాయాలూ, పాత సంస్కృతులూ, అన్నీ మార్చుకోవాలి."

"శ్రమ విభజన మార్పే పెద్ద కష్టం అయితే, పోనీ దాన్ని అలా వదిలేసి మిగతా మార్పులు చేసుకోవడంతో సరిపెడితే ఎక్కువ మంది సహకరిస్తారనిపిస్తోంది. బాగా చదువుకోగలిగిన వాళ్ళు మేధా శ్రమలు చేస్తారు. అంత శ్రద్ధ లేని వాళ్ళు రోడ్లు వూడుస్తారు. వాళ్ళ శ్రమ విలువ వాళ్ళకి అందితే ఫర్వాలేదు కదా? ఇది నా కోసం కాదు. నేను ఏ శ్రమ చెయ్యడానికైనా సిద్ధమే. యజమాని తనాలు పోవడంతో సరిపెట్టుకోలేమా - అని."

"అలాగైతే మన దగ్గిర, కుల భేదాలే పోవు. ఎవరికి ఇష్టమైన శ్రమలు వాళ్ళు ఎంచుకోవచ్చు - అనుకుంటే, శారీరక శ్రమలు ఎందుకు చేస్తారు? మురికి శ్రమలు చేసే వాళ్ళ జీవన పరిస్థితులు ఎలా మారతాయి? అవి, అలాగే వుండిపోతాయి. అమెరికాలో, నల్ల రంగూ, తెల్ల రంగూ మనుషుల మధ్య పెద్ద అగాధం వుంది. నల్ల రంగు వాళ్ళందరూ శారీరక శ్రమల్లోనే వున్నారు. వాళ్ళ శ్రమ పరిస్తితులు ఎలా మారాలి?"

"అవును, అది నిజమే. అందరూ కొన్ని శారీరక శ్రమలు కూడా చెయ్యాలనే నిబంధనలు లేకపోతే, రోడ్లు ఊడ్చే పనులు ఎవరు ఎంచుకుంటారు? ఆ నిబంధన ఉండాల్సిందే. అసలు, శ్రమ విభజనలు మార్చుకోవడం గురించి మార్క్సు ఏం చెప్పాడు? అది వినాలని వుంది. 'కాపిటల్' లో దొరుకుతుందా?"

"ఎందుకు దొరకదు? కానీ, అవి చాలా క్లుప్తంగా, వుంటాయి. వాటిని మనం

వివరంగా చర్చించి అర్థం చేసుకోవాలి. కార్మిక వర్గం గురించి 'యుగ యుగాల మకిలితో వున్న కార్మిక వర్గం' అన్నది, చాలా క్లుప్తంగానే అన్నాడు. ఆ విషయంలో అంతకన్నా చెప్పలేదు. ఆ యుగ యుగాల మకిలి ఏమిటో మనం అర్థం చేసుకోవాలి..........''

"మీ మాటలకి అడ్డొస్తున్నాను. మీరా మాటలు ఇంతకు ముందు చెప్తే, నేను చాలా భయపడ్డాను. నేను యుగ యుగాల మకిలి ఆలోచనల్తో వున్నానా అనిపించింది. అదే ఎప్పుడూ గుర్తు వుంది నాకు. ఒక్క మాటే. ఒక సారి జరిగింది. మాకు బాగా తెలిసిన వాళ్ళ ఇంట్లో సంగతి. వాళ్ళ కూతురు ప్రసవించింది. ఆడ పిల్ల. మూడో నెల. ఆ అమ్మాయి భర్త అప్పుడు వచ్చాడు చూడ్డానికి. వాళ్ళది తాటాకుల పాకే. ఆ అమ్మాయి పిల్లకి పాలిచ్చుకుంటూ నులక మంచం మీద కూర్చుని వుంది. అతను అక్కడికి వచ్చాడు. అతను ఉత్పాదక కార్మికుడండీ. మంచి పని వాడు. భార్య దగ్గిరికి వచ్చి ఎదరగా నిలబడి ఎగాదిగా చూసి, వెంటనే వెనక్కి తిరిగి బైటికి వెళ్ళిపోయాడు. 'ఎందుకో వెళ్ళాడు, వస్తాడులే' అనుకుంది ఆ అమ్మాయి. అతను ఇక తిరిగి రాలేదు. కోపంగా వెళ్ళిపోయాడు. కోపం ఎందుకటా? ఇతను వెళ్ళగానే ఆ భార్య మంచం మీద నించి చటుక్కున లేవలేదట! లేస్తుందని చూశాడట గానీ లేవలేదట! వెంటనే గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు. తర్వాత ఇంకో మూడు నెల్లకి రాయబారాలవీ జరిగాయి లెండి. ఎలాగో తీసికెళ్ళాడు. అక్కడ మళ్ళీ తగువులు! అత్తగారు కొట్టింది కోడల్ని. ఇద్దరూ ఆడ వాళ్ళే. అయినా పెత్తనాలు! 'యుగ యుగాల మకిలితో వున్న కార్మిక వర్గం' అని మార్క్సు అన్నాడని మీరు చెప్పినప్పుడు నాకు ఆ నులక మంచం మీద కూర్చుని పిల్లకి పాలిచ్చుకునే ఆ చిట్టి తల్లే గుర్తొచ్చింది. ఎంత పనివాడైతే ఏంటి? వాడి బుర్రలో మకిలి అలా వుంది. మీరేదో చక్కగా చెప్తోంటే నేను అడ్డం వచ్చాను. అదే చెప్పండి తొందరగా. ఇక అడ్డం రాను.''

"మీరు చెప్పింది చాలా మంచి సాక్ష్యం. అది అడ్డం రావడం కాదు. అది, ఒక శ్రామికుడి మీద గట్టి విమర్శ. పెత్తనాల ఆడ వాళ్ళ మీద కూడా విమర్శ. ఏది గుర్తొస్తే అది మాట్లాడుకుందాం. నేనూ ఒక సంగతి చెప్పనా? ఒకావిడ వుంది. ఇప్పుడు అరవయ్యేళ్ళు దాటాయి. చిన్నతనంలో వాళ్ళ ఇంట్లో కొంచెం చదువులు వున్నాయి. వాళ్ళ నాయనమ్మ కూడా భక్తి పుస్తకాలు చదివేదట. ఆ కవిత్వాలు పాడేదట. ఈవిడికి అలా చదువూ సంధ్యా అబ్బాయి. పుస్తకాలు దొరికితే చాలు, నిద్రాహారాలు లేకుండా చదువుతుంది. చదవకపోతే నిద్ర రాదు. చిన్న చిన్న కవిత్వాలు కూడా రాస్తుంది. ఎంత ఉత్తమంగానో వుంటాయి అవి. అన్నీ అలా కాదు. ఒక సారి నాకు ఒక చిన్న కవిత్వం రాసి పంపింది. వచన కవిత్వాలంటే నాకు చిరాకు. వాటిల్లో వచనమే గానీ, కవిత్వం వుండదు. నేను చెప్పే ఆవిడ అలా కాదు.

చిన్న కవిత్వాలు చక్కని లయతో రాస్తుంది.

"పూలు పరచిన బాటనైనా
ఒంటిగా పయనించలేము
రమ్య సుందర హర్మ్యమైనా
ఒంటిగా జీవించలేము
మధురమైనది స్నేహము
మరపు రానిది స్నేహము"

ఇంత ఉత్తమమైన భావాలు ఇంకా చాలా రాసింది.

"విశాల విశ్వం నా ఉద్యానం
అఖిల జగతి నా ఆవాసం
అన్ని ప్రాణులా నా శ్వాస
అనంత కాలం నా ధ్యాస
సకల సృష్టి నా సంతోషం
నిత్య వసంతం నా స్వంతం"

నేను చదివిన కవిత్వాల్లో ఏ కవీ నాకు ఇంత ఉత్తమంగా కనపడలేదు.

కానీ ఈవిడికి సమాజం గురించి ఏ మాత్రమూ తెలీదు. రాజుల్నీ, పరిపాలకుల్నీ, చాలా కీర్తించింది. ఈవిడికి పెళ్ళయిన తర్వాత, పుస్తకాలు చదివే స్వేచ్ఛ పూర్తిగా పోయింది. ఆడ మనిషి చేతిలో పుస్తకం కనపడితే, అది భక్తి పుస్తకం అయినా సరే, భర్తకి నచ్చదు. దానికి ఈవిడ అణువంత కూడా బాధపడలేదు. భర్తకి నచ్చని పని చెయ్యకూడదు, అంతే. ఆయన ఇంట్లో లేనప్పుడే పుస్తకాలు బైటికి తీసి చదివేది. ఆయన వస్తున్నాడని తెలిస్తే వాటిని దాచేసేది. చదివినప్పుడూ అంతే, రాసినప్పుడూ అంతే. ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం - అనే భావాలు ఆమె మనసులోకి ఎన్నడూ జొరబడలేదు. ఆమె భర్త ఇప్పుడు లేడు. ఆమెతో ఒక సారి నేను, "మీ భర్త గారితో మీ కాలం సంతోషంగానే గడిచిందా?" అని అడిగితే, "ఒక రాణీ పొందిన సంతోషం కన్నా ఎక్కువ సంతోషంగా బతికాను" అంది. "ఒక్కో సారి బాధపడేదాన్ని, దిగులు పడేదాన్ని" అని మాట వరసకి కూడా చెప్పలేదు. పూర్తిగా లొంగి పోయిన బానిస, యజమానితో కూడా నిశ్చింతగా బతకగలదు. 'యుగ యుగాల మకిలి' గురించి చెప్పుకుంటున్నాం. మనుషులందరూ, ఆడా - మగా, ఎలా తయారై వున్నారంటే, కళల వల్లా, కవిత్వాల వల్లా, గతాలు అందించిన సూక్తుల వల్లా, వాళ్ళ స్పందన శక్తులన్నీ సర్వ నాశనమైపోయి వున్నారు. నాకు గుర్తొచ్చిన సంగతి ఇది. అందుకే చెప్పాను. మనుషులందరూ రక రకాల అజ్ఞానాలతో వున్నారు. ఇందాక మీరు శ్రమ విభజన మార్పు గురించి మార్క్స్ ఏమన్నాడని అడిగారు. అసలు వెనకటి కాలపు ఆర్థిక వేత్తలు కూడా కొందరు, 'ఒక మనిషి ఎప్పుడూ ఒకే శ్రమకి కట్టుబడి

వుండిపోయే పద్ధతి' ని చాలా తప్పు పట్టారు. అది, ఆదాయాల దృష్టితో కాదు. మేధా శ్రమల వాళ్ళకి ఎక్కువ ఆదాయాలు వచ్చినా, వాళ్ళకి కూడా ఒకే శ్రమ పద్ధతి నరకమే - అన్నారు. అది మరణ శిక్షతో సమానం - అన్నారు. జీవితమంతా ఒకే రకం శ్రమ చేస్తూ వుండే బాధని వాళ్ళు న్యాయంగానే చెప్పారు. కానీ, దాన్ని ఎలా మార్చాలో చెప్పలేదు. వాళ్ళకి ఆ తర్కం అందలేదు. మార్క్సు చెప్పింది ఏమిటంటే, ఒక మనిషి వేరు వేరు రకాల పనులు చెయ్యాలని.★

---

★ " 'శ్రమ విభజన' వునికిలోకి వచ్చిన వెంటనే, ప్రతీ మనిషికీ ఒక ప్రత్యేకమైన ( పర్టిక్యులర్ ), కేవలం ఒక దానికే పరిమితమైన ( ఎక్స్‌క్లూజివ్ ) కార్య రంగం ( స్ఫియర్ ఆఫ్ యాక్టివిటీ ) ఏర్పడుతుంది. అది ఆ వ్యక్తి మీద బలవంతాన రుద్ద బడుతుంది. దాని నించి ఆ వ్యక్తి తప్పించుకోలేడు. అతనొక వేటగాడు, లేదా మత్స్యకారుడు, లేదా గొర్రెలకాపరి, లేదా ఒక విమర్శకుడు. తన జీవనాధారం కోల్పోకుండా వుండాలంటే, అతను అలా ( ఒకే శ్రమ చేసేవాడిగా ) వుండి తీరాలి. కానీ, కమ్యూనిస్టు సమాజంలో అయితే - ఎక్కడైతే ఏ వ్యక్తికీ ఒకే ఒక ప్రత్యేకమైన, పరిమితమైన, కార్య రంగం అంటూ వుండదో; కానీ, ప్రతీ వ్యక్తీ తనకిష్టమైన శాఖలో సాధించగలడో ( ఎకంప్లిషెస్ ), ఎక్కడైతే సమాజం సాధారణ వుత్పత్తి కార్యాల్ని ఒక పద్ధతిలో నియంత్రిస్తుందో - అలాంటి సమాజం, నేను ఇవ్వాళ ఒక పనీ, రేపు ఇంకో పనీ, చేయడాన్ని సాధ్యం చేస్తుంది. ఉదయం వేటాడడాన్నీ, మధ్యాన్నం చేపలు పట్టడాన్నీ, సాయంత్రం పశువుల్ని మేపడాన్నీ, రాత్రి భోజనం అయిన తర్వాత విమర్శల పనినీ, నాకు ఏది తోస్తే అది చేయడాన్ని సాధ్యం చేస్తుంది - ఎన్నడూ ఒక వేటగాడిగా మాత్రమేనో, మత్స్యకారుడిగా మాత్రమేనో, గొర్రెలకాపరిగా మాత్రమేనో, విమర్శకుడిగా మాత్రమేనో, వుండకుండానే!"

[ ది జర్మన్ ఐడియాలజీ. రచన: మార్క్సు & ఏంగెల్స్. రచనా కాలం: 1845 - 6. మాస్కో ప్రతి, 1976. పేజీ - 53. 'సామాజిక శ్రమ విభజనా, దాని పర్యవసానాలూ' అన్న శీర్షిక కింద ]

దీని అర్థం, ఒక మనిషి ఒకే ఒక్క శ్రమకే పరిమితమై వుండడం గాక, వేరు వేరు శ్రమలు చెయ్యాలి - అని. అలా చెప్పడంలో, 'కొన్ని శారీరక శ్రమలూ - కొన్ని మేధా శ్రమలూ' అనే తేడాతో చెప్పడం ఎక్కువ స్పష్టంగా లేదు. అంతేగాక, "నాకు ఏది తోస్తే అది చేయడాన్ని" అనే దాన్ని గురించి సరిగా చర్చించుకోవాలి. ఏది తోస్తే అది చేయాలంటే, 'ఒక బృందంగా, ఒకే విలువతో వున్న కొన్ని శ్రమలలో నించి' దేన్నో ఒక దాన్ని ఎంచుకోవచ్చు. కానీ అప్పుడు కూడా కొన్ని రకాల శ్రమల్ని ఎవరూ ఎంచుకోకపోయే సమస్య వుంటుంది. కాబట్టి, అలాంటి శ్రమల్ని అయితే, అందరూ డ్యూటీల ప్రకారం చేసి తీరాలి. వాటి విషయంలో ఎంచుకోవడాలు కుదరదు. ఈ శ్రమ విభజనల సంగతుల గురించి ఇప్పటి నించే మనం చదువుతూ, చర్చించుకుంటూ వుండాలి. ★

దాన్ని ఆచరణలోకి ఎలా తీసుకురావాలో అదంతా మనం మన చర్చల ద్వారా, క్రమంగా మన అనుభవాల ద్వారా, ఏర్పర్చుకోవాలి. ఇది, 'కాపిటల్ పరిచయం' లో కొన్ని వివరాలతో వుంది. సమాజంలో జరిగే మొత్తం శ్రమలు, విలువల స్థాయిలో, 4 గ్రూపులుగా వున్నాయనుకుందాం. శారీరక శ్రమలు 2 గ్రూపులూ, మేధా శ్రమలు 2 గ్రూపులూ. ఒక గ్రూపులో వున్న శ్రమలన్నిటికీ విలువలు ఒకే రకంగా వుంటాయి. ఒక మనిషి ఆ 4 గ్రూపుల్లో నించీ ఒక్కొక్క శ్రమ చొప్పున, ఆ 4 రకాల శ్రమలూ చెయ్యాలి. అందరూ అలాగే చేస్తే, అందరి శ్రమ విలువలూ ఒకే రకంగా వుంటాయి. అందరి శ్రమలూ ఒకే రకంగా వుంటే, ఇక మారకాలు ఎందుకు? విలువ లెక్కలు ఎందుకు? అందరూ పనులు చేస్తారు, ఉత్పత్తుల్ని వాడుకుంటారు. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరగాలంటే, పోలీసులూ లాఠీలూ అక్కరలేదు. మొదట అందరూ మంచి శ్రమ సంబంధాల్ని చర్చల ద్వారా, వాదాల ద్వారా, అర్థం చేసుకోవాలి. వాటిని ఎలా నిర్వహించాలో, ఆ డ్యూటీలు ఎలా వుండాలో, ఆ విషయాలు తయారు చేసుకోవాలి. క్రమంగా మార్గం దొరుకుతుంది. ఒక వేళ, కాపిటల్ పరిచయంలో చెప్పింది బాగా లేదనిపిస్తే, ఇంకో రకంగా అయినా పాత శ్రమ విభజనని మార్చుకుని, సమాన సంబంధాలు ఏర్పడే మార్గం పట్టుకోవాలి. అంతే కదా?"

"ఆ విలువ లెక్కలు అర్థం కాలేదు గానీ, అందరూ ఒకే రకంగా పని చెయ్యాలి, చెయ్యగలరు అనేది అర్థమైంది. చాలా బాగుంది. అలాంటి ఉత్తమ సమాజాన్ని తప్పకుండా ఏర్పర్చగలమని ఇప్పుడు నమ్మకం కలుగుతోంది. నాకు మొన్న 'డబ్బుని తీసెయ్యడం' అని ఆలోచిస్తోంటే, నిజంగా అది చాలా మంచిదనిపించింది. డబ్బు పద్ధతే లేకపోతే, మోసాలు చెయ్యడానికి ఇంకేం మార్గం వుంటుంది? బియ్యాన్ని దాచేసుకుంటారా? పంచదార దాచేసుకుంటారా? దేన్ని దాచుకున్నా దాన్ని అమ్మి, డబ్బు సంపాదించే మార్గం వుండదు కదా? దాచుకున్న వాటితో ఏం చేస్తారు? ఏ వెన్నో, నెయ్యో, దాచుకుని తింటారనుకుందాం. ఎక్కువగా తింటే, నాలుగు రోజులకే మంచాలెక్కుతారు. అయినా, ఆ నాటి జనాలకి, ఆరోగ్యాలు ఎలా వుంచుకోవాలో బాగా తెలుస్తుంది. ఇంకెలా చేస్తారు మోసాలు? పనులైతే అందరూ చేస్తారు. డ్యూటీల ప్రకారమే. ఇళ్ళూ బట్టలూ తిళ్ళూ చదువులూ మందులూ వినోదాలూ విశ్రాంతులూ అన్నీ ఒక పద్ధతిగా దొరుకుతూనే వుంటాయి. ఇక ఇబ్బంది ఏముంటుంది? ఒక ఇంట్లో వాళ్ళం ఎవళ్ళకి వాళ్ళం దాచుకుంటున్నామా? డబ్బు లేకపోతే, అంత మంచి పునాది ఏర్పడితే, మనుషుల ఆలోచనలు దానికి తగ్గట్టు ఇష్టంగా మారతాయి. అదే సుఖం అనీ, సమానత్వం అనీ, అర్థం కాదా? ఇప్పుడంటే అది కల లాగా వుంది గానీ, కలేం కాదు, అది చాలా తేలిక. డబ్బే లేకపోతే, ఎవరెలా దాచుకుంటారు? అంతే కదండీ? నా మాటలు బాగున్నాయంటారా?"

"అయ్యో, ఎందుకు బాగోలేదు? మార్క్సు చెప్పింది అదే కదా? అదంతా ఇంకా వివరంగా రాసేటంత టైము లేదు ఆయనకి. కనీసం ఇంకో పదేళ్ళు బతికి వుంటే, ఇంకా ఎన్ని విషయాలు వివరంగా రాసేవాడో! అయినా మనమే ఆలోచించు కుందాం. ఆయన విశ్రాంతిగా గడిపితే, ఇంకా కొంత కాలం వుండేవాడు. పనితో విపరీతంగా అలిసిపోయాడు మనిషి, మన కోసం."

"అవును, అవును, మొన్న ఈ మాటలే వచ్చాయి మా ఇంట్లో. మా ఆవిడికి పిన తండ్రి కొడుకు లెండి, ఎప్పుడన్నా వస్తూ వుంటాడు. ఒకప్పుడు మా లాగే వుండేవాడు. రెండేళ్ళ కిందట సారా పేకెట్లు అమ్మే దుకాణం పెట్టాడు. ఆ సంగతి మాకు అసలు తెలీదు. అప్పటి దాకా చక్కగా టీచరు ఉద్యోగం చేసేవాడు. అది మానుకుని ఈ సారా సీసాల అమ్మకాలు మొదలుపెట్టాడు. దాని మీద బాగా సంపాదిస్తున్నాడని మా వాళ్ళు చెప్పుకుంటారు. మొన్న వచ్చినప్పుడు, 'ఇదేం పని? పిల్లలకి చదువు చెప్పే పని పాడు చేసుకున్నావు?' అన్నాను. 'నేను ఒకరి కింద పని చెయ్యలేను; నేనే పది మందికి పని చూపిస్తాను' అన్నాడు. నాకు ఎంత చీదర పుట్టిందంటే, నేనేదో అనబోతోంటే, మా కుర్రాడే చప్పున, 'నువ్వు ఎవరి కిందా పని చెయ్యవు గానీ, నీ కింద పది మంది పని చెయ్యాలా?' అనేశాడు. అతను మొదట తెల్లబోయాడు గానీ, తర్వాత దబాయించాడు. 'ఎప్పుడూ పెద్ద కులాల వాళ్ళే పెట్టుబడిదారులవ్వాలా? చిన్న కులాలు అవ్వక్కర్లేదా?' అన్నాడు. అప్పటికి నా కోపం పెరిగింది. 'ఇదుగో చూడూ. పెద్ద కులాల్లో అయినా, చిన్న కులాల్లో అయినా, ఒకడు, పెట్టుబడిదారుడవ్వాలంటే, వంద మంది జనం బికార్లు అవుతారు. అది చూడవా? అసలు ఈ వ్యాపారాల గోలలే వద్దని మనం మాట్లాడుకోవాలి. ఎవరైనా బతుకుదెరువు కోసం ఏదైనా చేసుకుంటే, 'ఈ పరిస్తితుల్ని బట్టి ఇది తప్పడం లేదు' అనుకోవాలి. చదువుల్లేవు, ఉద్యోగాల్లేవు, ఏదో వ్యాపారం చేసుకుంటున్నాం - అనుకోవాలి. పెట్టుబడిదార్లంగా తయారై పోతున్నాంలే అని మురిసిపోవడం కాదు, దానికి సిగ్గుతో చావాలి' అంటూ ఏవేవో గబ గబా అన్నాను. 'అమ్మో, వీళ్ళతో లాభం లేదు' అనుకున్నట్టున్నాడు. నోరెత్తలేదు. కాస్సేపు కూర్చుని పోయాడు."

"ఇంత మారారా మీరు! కాపిటల్‌ని మీరింకా పూర్తే చెయ్యలేదు. ఏదో నేను చెప్పిన నాలుగు మాటలే విన్నారు. ఎంత గ్రహించారు! మీ వల్ల నేను చాలా నేర్చుకున్నానండీ. అంటే, మనం కలిసి చర్చించుకుంటే, ఎన్నో తెలుసుకో గలుగుతాం అన్నమాట! ఇప్పుడు నాకు చాలా నమ్మకంగా వుంది. కాపిటల్‌లో ఏం వుందో తెలిస్తే, శ్రామికులు చాలా నేర్చుకుంటారని!"

"అంతే కాదు, నేర్పుతారని - అని కూడా అనండి!" ★

# 57. మార్క్సుని చదవడానికి శ్రద్ధ పట్టని కమ్యూనిస్టులు!

**100.** దోపిడీ వుండని మంచి సమాజం గురించి మార్క్సు రాశాడని, ఎన్నో విషయాలు చెప్పారు, చెపుతున్నారు. ఆయన రాసి చాలా కాలం అయింది. ఎక్కడెక్కడో ఏదో జరిగిందని కూడా విన్నాం. మా ఊళ్ళో ఒకాయన నా చిన్నప్పుడు రష్యా రష్యా అనేవాడు. అదేవిటో మాకు పట్టేది కాదు. ఇప్పుడు రష్యా లేదు, చైనా లేదు. అమెరికా పేరు వింటే మోజు పడే వాళ్ళం. ఇప్పుడు అది వదిలింది లెండి. ఈ మధ్య ఒకాయన ఏదో జులా, జులా అంటాడు. చివీ యో, చవీ యో అంటాడు. బాబాయో క్యూబాయో అంటాడు. అసలు మార్క్సు చెప్పింది ఎక్కడైనా ఏదైనా వుందంటారా? వచ్చాయంటారు, పోయాయంటారు. ఇదివరకైతే ఈ ధ్యాసే వుండేది కాదు. ఇప్పుడు రోజూ ఇదే ధ్యాస! ఏదైనా ఒక్క దేశం పేరు చెప్పండి! నాకు ఒకటే దిగాలుగా వుంటుంది. మార్క్సు కనపడతాడా ఎక్కడైనా?

**జ:** మార్క్సుని తల్చుకుంటూ ధైర్యంగా వుండాలి, దిగాలు ఎందుకు? మార్క్సు కోట్ల మంది ఆలోచనల్లో లేడూ? మీ నలుగురి ఆలోచనల్లో లేడూ? మీ హృదయాల్లో లేడూ? మా హృదయాల్లో లేడూ? ఆయన చెయ్యాల్సింది చేసి, చెప్పాల్సింది చెప్పి, వెళ్ళాడు. అలాగే, మనం కూడా చెయ్యాల్సింది చేసి వెళ్ళాలి. చెయ్యకుండా వెళ్ళకూడదు. శ్రామికులు అనే వాళ్ళు, కాపిటల్ చదవకుండా, అందులో విషయాలు తెలియకుండా, చచ్చిపోకూడదు. మనం చెయ్యాల్సింది మనం చేస్తే, తర్వాత తరం వాళ్ళు తర్వాత అందుకుంటారు. మార్క్సుని మనం అందుకోలేదూ? అలాగే మనల్ని ఇంకొకరు అందుకుంటారు. మనం ఏమీ చెయ్యకుండా కూర్చుంటే, కొన్నాళ్ళపాటు తిని బతికి మట్టిలోకి పోతాం, అంతే.

మార్క్సు రాసిన పుస్తకాలన్నిటిలోనూ సారాంశం ఏమిటి? "తత్వవేత్తలు ప్రపంచాన్ని, అంటే సమాజాన్ని, రక రకాలుగా వివరించారు. కానీ, అసలు సమస్య దాన్ని మార్చడం!" అన్నాడు. మార్చడం ఎవరు? ఎవర్ని? దోపిడీ చేస్తోన్న వాళ్ళనేనా? అంతే కాదు, దోపిడీని పట్టించుకోకుండా దానికి తలలు వంచేసి బతుకుతున్నవాళ్ళే మొదట మారాలి. శ్రామిక వర్గానికి వున్న సుగుణం, శ్రమ చెయ్యడం మాత్రమే. వాళ్ళ శ్రమతోనే వాళ్ళు బతకడం, అంతే. శ్రామిక వర్గం నిండా కూడా మిగిలినదంతా యుగ యుగాల మకిలే. శ్రమలు చేస్తారు కాబట్టి వాళ్ళంతా బంగారు కొండలు కారు; నీతి చంద్రులూ, చంద్రికలూ, కారు. వాళ్ళని వాళ్ళు మార్చుకోవలిసిన విషయాలు అనంతంగా వున్నాయి.

శ్రామిక వర్గంలో, చదువు సంధ్యలు లేని శారీరక శ్రమల సెక్షన్లకైనా, పెద్ద పెద్ద మాస్టర్ డిగ్రీలూ డాక్టరేట్లూ వున్న మేధా శ్రమల సెక్షన్లకైనా, మార్క్సు చెప్పిన జ్ఞానం తెలుసా? ఏ వర్గం కోసం రాశాడు మార్క్సు? కాలక్షేపానికి రాశాడా? తన

విద్వత్తుని ప్రదర్శించడం కోసం రాశాడా? కీర్తి పిచ్చితో రాశాడా? సంఘాలు పెట్టగానే, కమ్యూనిస్టు పార్టీలు పెట్టగానే, ఆ సభ్యులందరూ దోపిడీ సమాజాల మకిళ్ళని వదిలించుకున్న వాళ్ళేనా? వ్యభిచారాలతో సంబరాలు చేసుకునే కవుల్నీ రచయితల్నీ పట్టుకొచ్చి సంఘాలకు నాయకుల్ని చేసుకుంటారు. ఇద్దరేసి, ముగ్గురేసి పెళ్ళాల ఫ్యూడల్ వాళ్ళని తీసుకొచ్చి వాళ్ళతో ఉపన్యాసాలిప్పించు కుంటారు. ఈ గొప్ప సంఘాల వాళ్ళు, అలాంటి వాళ్ళ ఉపన్యాసాలతో ప్రజలకేం నేర్పుతారు? మార్క్సిజం పనికిరాదని ప్రచారాలు చేస్తూ, విదేశీ పెట్టుబడిదార్లు అందించే డబ్బు మూటల్ని అందుకుంటూ, దోపిడీకి రక్షకులుగా తిరిగే నీచులతోనే ఉద్యమకారుల రచనల్ని అనువాదాలు చేయించుకుంటారు. ఆ నీచుల్నే సంఘా ల్లోకి లాక్కుంటారు. ఇదీ అదీ అని లేదు. ఏ అడుగులోనూ వర్గ దృష్టీ, వర్గ నీతీ, కనపడవు. ఇప్పుడు జరుగుతోన్న విప్లవాలేమిటంటే, కవులకూ, రచయితలకూ, వర్ధంతులూ, జయంతులూ! మొన్నటి దాకా మహా కవుల షష్ఠిపూర్తులతో శ్రామిక ప్రజలకు విప్లవ భావాలు తెగ బోధించారు. ఇప్పుడు, ఇక ఇవీ! కమ్యూనిస్టు పార్టీలకు ఆర్భాటంగా ఆఫీసు బిల్డింగులూ, టీవీ ఛానళ్ళూ, కావాలి. వాటి కోసం డబ్బు కావాలి కాబట్టి, షేర్ల సమీకరణలు! ఆ షేర్లు ప్రజలు కొనాలి. రేపటి నించీ లాభాలు పంచుతారు. షేర్ల వ్యాపారాలు ముచ్చటగా నడుస్తాయి. ఇలాంటి పార్టీలు భూమి మీద నిలబడగలుగుతున్నాయంటే, శ్రామిక జనం, ఎన్ని రకాల మకిళ్ళతో రాజీలు పడగలుగుతున్నారో, తేలిగ్గా అర్ధం చేసుకోవచ్చు.

"అదా! మొన్న నన్ను కూడా మా వాడొకడు అడిగాడు, షేర్లు కొనమని. 'ఛీ, షేర్లేంటి?' అన్నాను. 'కాదు, ఇవి మన వాళ్ళవే, మన వాళ్ళవే' అన్నాడు. అతను ఒక పార్టీలో తిరుగుతూంటాడు లెండి. అతను కొన్ని షేర్లు అమ్మి తీరాలట! నాకు అసహ్యంతో ఇప్పటికీ ఒళ్ళు జలదరిస్తోంది. మార్క్సుకి ఎంత అవమానం ఇదంతా!"

"అలా అనకండి! మార్క్సుకేం అవమానం? ఆయన, 'మంచి' చెప్పాడు. దాన్ని మనం వినకపోతే, వినని వాళ్ళదే నేరం. వినని వాళ్ళకే అవమానం!"

"అవును, అంతే. వింటే బాగుపడతాం, వినకపోతే పోతాం. ఏదైనా ఒక పార్టీ, 'నేను ప్రజల పార్టీని' అని గొప్ప పేరుతో మొదలైనా, అది దోపిడీదార్ల పార్టీగా మారితే, దానికి నాశనం వుంటుంది లెండి. అది కాదు, మార్క్సు పద్ధతిలో కొత్త ప్రపంచం ఎక్కడైనా సాగిందా అని."

"మార్క్సు వున్న కాలంలోనే ఫ్రాన్సులో, 'పారిస్ కమ్యూన్' రాలేదూ? అది పూర్తిగా మార్క్సు పద్ధతిలో సాగినది కాకపోయినా మార్క్సు ప్రభావం దాని మీద చాలా వుంది. దాన్ని మార్క్సు చాలా సమర్ధించాడు. అయితే అది, కార్మిక వీరుల సాహసాలతో, త్యాగాలతో, రెండు నెల్లకే అంతరించింది. పోరాటానికి ఎక్కువ మంది ఇచ్చే బలం లేకపోతే ఏమవుతుంది? ఏదైనా అలాగే అవుతుంది. తర్వాత, రష్యాలో, చైనాలో కూడా, వర్గ పోరాటాల ద్వారానే కొత్త సమాజాలు పుట్టుకొచ్చాయి కదా? పుట్టడం తేలికే. పుట్టాక ఎదగడానికే శ్రామిక వర్గ జ్ఞానం కావాలి. అదే

సమస్య. సంవత్సరాల తరబడీ సాగిన పోరాటాలు కూడా నిలబడలేదంటే, అది అక్కడ వున్న కమ్యూనిస్టు పార్టీల తప్పు. ఆ నాయకుల తప్పు. జనాలకి ఏం నేర్పాలో అది నేర్పకపోతే, మార్పులు ఏం జరగాలో, ఎలా జరగాలో, వాళ్ళకి అర్థం కాదు. 'ప్రపంచ యుద్ధాల్లో జయించేశాం' అంటారు. యుద్ధంలో జయించడం వేరూ, దోపిడీని తీసివేసే జ్ఞానం వేరూ. 'యుద్ధం' అనేది, రెండేళ్ళు సాగినా, నాలుగేళ్ళు సాగినా, 'మన దేశం మీద శతృవులు పడ్డారు; వాళ్ళని తరిమెయ్యాలి' అనే కర్తవ్యం స్పష్టంగా కనపడుతూ వుంటుంది. దాని కోసం సాహసాలూ, త్యాగాలూ అన్నీ జరుగుతాయి. అక్కడ గెలవడమో, ఓడడమో జరిగిపోతుంది. వర్గ పోరాటం అంటే, ప్రతీ చోటా యుద్ధం కాదు. ఉత్పాదక శ్రామికులు, యజమానులకు డబ్బు కుప్పలు కూర్చిపెడుతూ వుంటే, యజమానుల ఇళ్ళలో వంట పనులు చేసే అనుత్పాదక శ్రామికులు సమ్మెలు చేస్తే, దాని వల్ల యజమానులకేం వేడి తగులు తుంది? ఉత్పాదక శ్రామికుల్లో కూడా ఏ సబ్బుల కంపెనీల శ్రామికులో, బీడీల కంపెనీల శ్రామికులో, సమ్మెలు ఆర్నెల్లు చేస్తే మాత్రం, వాళ్ళకి జీతాలు పోవడం తప్ప, యజమానులకేం కొంపలు మునుగుతాయి? ఏ వర్గ పోరాటానికైనా ఒక క్రమం వుంటుంది. పోరాటాలు, 'మౌలిక శాఖల్లో' సాగుతోంటే, అన్ని శాఖల శ్రామి కులూ సహకరించాలి. శ్రామిక జనాభాకి ఎన్నెన్ని విషయాలో తెలియాలి! వాళ్ళు ఎంతో విప్లవ భావాలతో, ఎంతో నిబద్ధతలతో, ప్రవర్తించాలి! శ్రమ దోపిడీ దుర్మార్గం మీద ఆగ్రహం లేకపోతే, సేవక తనాల్ని అసహ్యించుకునే ఆత్మ గౌరవం లేకపోతే, యజమానుల ఆస్తుల రక్షణ కోసం సైనికులుగా చావడం మీద తిరస్కారం లేక పోతే, ఏ వర్గ పోరాటం అయినా ఎంత కాలం సాగుతుంది? కోట్ల సంఖ్యలో వున్న శ్రామిక ప్రజలు, వేల సంఖ్యలో వున్న దోపిడీదార్లకు సేవలు చెయ్యడంతోనే, దోపిడీ దార్లు కల్పించే సమస్యలతోనే, యుద్ధాలతోనే, రాజీలు పడిపోతున్నారు. మోసకారి నాయకుల్నీ, మోసకారి పార్టీల్నీ, నోళ్ళెత్తకుండా అనుసరిస్తున్నారు. ఉత్తమమైన సిద్ధాంతం దొరికిన తర్వాత కూడా సమస్యలు తీరడానికి ఇంత కాలం పట్టాలా?"

"అదే ఆశ్చర్యం! ఎన్నెన్నో సంవత్సరాలు కృషి చేస్తేనో ఒక మంచి మార్పు జరుగుతుంది. అది మళ్ళీ వెనక్కి తిరిగితే, దానికి అర్థం ఏమిటి? మళ్ళీ ప్రయత్నించినా మళ్ళీ వెనక్కి తిరుగుతుంది అనుకోవాలా? అలా ఎలా అనుకుంటాం? ఏవేవో తప్పులు చేశామనీ, వాటిని దిద్దుకోవాలనీ, అనుకోవాలి. అంతే కదా? మాకు ఎన్నెన్నో అనుమానాలు తీరాయి. మొన్న ఆదివారం పొద్దున్న నించీ సాయంత్రం దాకా 'కాపిటల్' పెట్టుకుని కూర్చున్నాం. ఒక్కొక్కళ్ళూ కాస్సేపు కాస్సేపు చదివాం. రాత్రి అవుతోన్నా మాకు లేవబుద్ధి వెయ్యలేదు. మొట్ట మొదట 'సరుకులూ - డబ్బూ' చాప్టర్లు చదివితే, అంతా కొట్టిన పిండి లాగ వుంది మాకు. ఆ పుస్తకం ముట్టుకోడానికి ఎంత భయపడిపోయామో మొదట! ఇప్పుడు పుస్తకం ముయ్యాలంటే మనసు ఒప్పలేదు. వస్తువూ, మారకం, విలువా, చివరికి డబ్బు ఎలా పుట్టుకొచ్చిందో, చెప్పాడు. ఏ సరుకుకైనా అమ్మినప్పుడు కొంత డబ్బు

వచ్చిందంటే, అది దాని విలువే - అన్నది మొదట చెప్పి, ఇక అప్పుడు పెట్టుబడిదారుణ్ణీ, పని వాళ్ళనీ, తీసుకొచ్చాడు రంగంలోకి. అంత దాకా చదివి అక్కడ పెట్టాం. చివరి దాకా వెళ్తే తెలుస్తుంది గానీ, ఇప్పుడైతే ఇంకొక్క అనుమానం పుట్టింది. మంచి సమాజం అయితే, అమ్మకాలే అక్కరలేదు, డబ్బు లెక్కలే అక్కరలేదు అన్నారు కదా? మారకం విలువని అసహజమైనది అనడం మొదటి చాప్టర్‌లోనే కనపడింది. అయితే మరి, ఎంత మంచి సమాజం అయినా, ఉత్పత్తి సాధనాల కోసం ఇంత విలువా, జీతాల కోసం ఇంత విలువా, చివరికి ఉత్పత్తికి ఇంత ధరా - అని లెక్కా పత్రం వుండకపోతే, ప్లానింగు ఎలా వుంటుంది? ప్లానింగు లేకపోతేనే కదా సంక్షోభాలు? డబ్బు లెక్కలు లేకుండా ప్లానింగు కుదురుతుందా? అసలు అప్పుడు 'జీతం' అనే పేరు వుంటుందా? - ఇలాంటివే రెండో మూడో అనుమానాలు ఇప్పుడు?"

"ఎంత ఆసక్తి మీకు! మీ ప్రశ్నలు వింటే ఎప్పుడూ ఆశ్చర్యం, సంతోషం రెండూనూ. అప్పుడు 'జీతం' అనే పేరుని తీసెయ్యాలనీ, జెండా మీద జీతాల పద్ధతే రద్దు అనే విప్లవకర నినాదాన్ని చిత్రించుకోవాలనీ మార్క్సు అన్నాడు. డబ్బు లెక్కలు లేకపోతే ప్లానింగు ఎలా అన్నారు కదా? మారకం విలువ లెక్కల్ని వదిలేసి, అంటే డబ్బు లెక్కల్ని వదిలేసి, ఉపయోగపు విలువ లెక్కలతో ప్లానింగులు చెయ్యలేమా? 10 చొక్కాలు తయారవ్వాలనుకోండీ. 'ఇంత పెట్టుబడి' కావాలని పెట్టుబడి దారుడు అంటాడు. ఆ లెక్కలు మాత్రం ఎలా చేస్తాడు? బట్ట ఎంత కావాలి? దారం ఎంత? గుండీలు ఎన్ని? మిషన్లు ఎన్ని? పనిచేసే వాళ్ళు ఎందరు? కొత్త శ్రమ ఎన్ని గంటలు కావాలి? - ఇలాగే లెక్కలు పెట్టి, ఆ డబ్బునంతా కలుపుతాడు. మనం అయితే, ఆ డబ్బు లెక్కల్ని వదిలేసి, ఉపయోగపు విలువ లెక్కలే చేస్తాం. 100 ఎకరాల భూమిని దున్నాలంటే, ఏ యే పనిముట్లు కావాలి? ఎందరు మనుషులు కావాలి? ఎంత కాలం కావాలి? - ఇలా లెక్కలు కట్టలేమా? సమాజంలో విడి విడి పెట్టుబడిదారులు లేనప్పుడు, అంతా సమిష్టి ప్లానులే అయినప్పుడు, మొత్తం సమాజానికి ఏది ఎంత అవసరమో ప్లాను చేసుకోవడం అసాధ్యమా? అప్పటి అవసరాల్ని బట్టి అది చేతనవుతుంది. అయినా, కొత్త సమాజం అక్కడ సిద్ధంగా లేదు. మనమే నిర్మించుకోవాలి. ఏ ప్లాను అయినా మొదట కొన్ని రంగాల్లోనే, కొన్ని ప్రాంతాల్లోనే, ప్రారంభించాలి. దాని వల్ల అనుభవాలు వస్తాయి. ఏవైనా తప్పులు జరిగితే అవేమిటో తెలుస్తాయి. క్రమంగా అనుభవాలు పెరుగుతాయి."

"అవును, ఇప్పుడనిపిస్తోంది. ఉపయోగపు విలువ లెక్కలతో ప్లానులే నిజంగా సరైనవి. మధ్యలో డబ్బు అడ్డం ఎందుకు? రాత్రయితే నాకు నిద్రే పట్టలేదు. మార్క్సుతో మాట్లాడితే బాగుండును అనిపించింది."

"అదే ధ్యాసతో వుంటే కల వస్తుంది. కలలో మాట్లాడండి. కాపిటల్ పూర్తి చెయ్యండి!"

"అయ్యో! ఇక అది మీరు చెప్పొద్దు!" ★

# 58. దోపిడీ వ్యతిరేక సమాజం తయారై సిద్ధంగా లేదు, దాన్ని శ్రామిక వర్గమే నిర్మించాలి!

**101.** 'కాపిటల్' లో ఇంకో రెండు చాప్టర్లు పూర్తి చేశాం. ఎంత చక్కటి వరసలో రాశాడండీ! మొదట, వస్తువుని తయారుచేసే మొత్తం శ్రమ కాలమే దాని విలువ - అని చెప్పాడు. అంటే, ఒక వస్తువుకి బదులుగా వచ్చే డబ్బు, దాని మొత్తం శ్రమదే. అలాంటప్పుడు, ఉత్పత్తి సాధనాల భాగాన్ని తీసేస్తే, మిగిలిన శ్రమ, ఆ వస్తువుని తయారుచేసిన వాళ్ళదే అవుతుంది కదా? ఇక అందులో, వడ్డీ లాభాలకి చోటు ఎక్కడుంది? భలే వరసలో చెప్పుకొచ్చాడు. ఎక్కడైనా మాకు అర్థం కాకపోతే, మా కుర్రాడు బాగా చెపుతున్నాడు. మా ఆవిడ కూడా కూర్చుంటోంది మా దగ్గిర. ఆదివారాల్లో పనికి రానని చెప్పేసింది. పని పోయినా సరే, వెళ్ళనంది. ఈవిడ పని, వాళ్ళకి బాగా ఇష్టం. పన్లోంచి తీసెయ్యరు. శనివారం నాడే అన్నీ వండేసి, ఫ్రిజ్జుల్లో కుక్కేసి వస్తుంది. ఆవిడకి చదువు బాగా రాకపోయినా, చదివేది వింటోంటే అర్థమైపోతోంది. ఆరుగురం కూర్చుని చదువుకుంటున్నాం.

**జ :** మార్క్సు చక్కని వరసలో చెప్పాడు అంటున్నారు కదా? ఒకాయనైతే, 'భూమి కౌలు' చాప్టర్‌ని తెచ్చి మొట్ట మొదట్లో పెట్టి, అదే మొదట చదవాలి అన్నాడు. ఈ ఊళ్ళో ఒకాయన దాన్నే అనువాదం చేసి తెలుగులో పెట్టాడు. అంటే, మార్క్సు చెప్పిన వరస సరిగా లేదని వీళ్ళ అర్థం. 'చరిత్రలో భూమి కౌలే మొదట వచ్చింది కదా? కాబట్టి దాన్నే మొదట చదవాల' ని వీళ్ళ వాదం.

"ఎవడండీ అలా చెప్పిందీ? భూమి కౌలు మొదట వచ్చిందా? అసలు 'మారకం' మొదట వచ్చింది. ఆ తర్వాత డబ్బు పద్ధతీ, విలువ లెక్కలూ, ధరా, వచ్చాయి. మొదట్లో బానిసత్వం వచ్చిందంటే, అదనపు ఉత్పత్తిని దోచడం వచ్చేసిందిగా? భూమి కౌలు అనేది, భూస్వాముల దగ్గిర, తర్వాత గానీ రాలేదు. మొదట, డబ్బు సంగతి చెప్పి, బానిస యజమానులు లాగే అదనపు వుత్పత్తి సంగతి చెప్పాకే, భూస్వాముల వల్ల పుట్టిన భూమి కౌలు మాట ఎత్తాలి. అసలు, సరుకు వల్ల అదనపు విలువ వస్తుందని మొదట తెలిస్తేనే, అది ఎన్ని భాగాలుగా పంపకాలవుతుందో తర్వాత తెలుస్తుంది. మార్క్సు అంత మంచి వరసలో రాస్తే, అది అర్థం చేసుకోకుండా, ముందు 'కౌలు' ని చదవాలని చెప్పాడా? ఎవడా మేధావి? అదనపు విలువ సంగతి తెలియకుండా, దోపిడీ తెలీకుండా, మొదట్లోనే కౌలుని చెప్తే, 'అవును, భూమికి, కౌలు రావొద్దా' అంటాం. మొదట దోపిడీ సంగతి తెలిస్తేనే, కౌళ్ళూ, వడ్డీ లాభాలూ, ఎక్కణ్ణించి వస్తాయో తెలుస్తాయి. ఎవడా మనిషి, కౌలుని

మొదట చదవాలని చెప్పిన వాడు? దాని కన్నా ముందు 'అదనపు వుత్పత్తి' వచ్చిందని తెలీదా ఆ పెద్ద మనిషికి?''

''అమ్మో, ఎంత కోపం వచ్చిందో మీకు! మీరు చక్కగా చదువుతున్నారు కాబట్టి, మార్క్సు ఎంత తార్కికమైన వరసలో రాశాడో అర్థం చేసుకుంటున్నారు. ప్రారంభం ఎలా వుందో మీకు తెలుసు కాబట్టి ఇలా మాట్లాడారు. మన కమ్యూనిస్టు పార్టీల్లో గానీ, బైట విప్లవాలు వల్లించే వాళ్ళల్లో గానీ, కాపిటల్ చదివిన వాళ్ళూ, ఒక్క ముక్క సవ్యంగా నేర్చుకున్నవాళ్ళూ, పిడికెడు మంది కూడా లేరు. ఒకాయనైతే, ఆయన డాక్టరు, పార్టీలో వాడే, 'బానిసల కాలంలో కూడా దోపిడీ వుందా? మార్క్సు అలా చెప్పాడా?' అని వాదించాడు నాతో. ఆయనే ఆ మధ్య కాలంలో, కమ్యూనిస్టులందరూ చిరంజీవితో కలవాలని తెగ బోధనలు చేశాడు. ఇప్పుడు, జగన్‌తో కలవాలని చేస్తున్నాడు. ఇంకో ఆయనైతే, ఆయన మరీ పెద్ద పార్టీ వాడు, పెద్ద విప్లవకారుడి కిందా మేధావి కిందా లెక్క, ఆయన ఇప్పుడు లేడు లెండి. ఆయన ఒక సారి నాకు రాశాడు, 'డబ్బుతో, అమ్మకాలతో, అవసరం వుండదని మార్క్సు రాశాడా? సరుకు ఉత్పత్తి వద్దన్నాడా? ఇది నేనెక్కడా వినలేదు' అని రాశాడు. 'ఇది, చదివితే తెలిసే వ్యవహారం గానీ, వింటే తెలిసే వ్యవహారం కాదు లెండి' అని నేను జవాబు రాశాను. ఈ మేధావులందరికీ మార్క్సు రచనలు అక్కర లేదు. వాళ్ళ మాటలే వాళ్ళకి కావాలి.''

''అంతంత చదువులున్న వాళ్ళు కూడా ఇలా వున్నారా! ఇంకేం తెస్తాం కొత్త సమాజాన్ని?''

''అవును, ఏ దేశంలో చూసినా, కమ్యూనిస్టు పార్టీల ధోరణులు, చీదరో, నిరాశో కలిగించే లాగే వున్నాయి. కానీ, అసలు మనం మొదట అర్థం చేసుకోవలసింది, కొత్త సమాజం ఎక్కడా సిద్ధంగా లేదనీ, దాన్ని శ్రామిక వర్గం కొత్తగా నిర్మించుకోవాలనీ. ఇప్పటి వరకూ మనం తరతరాలుగా శ్రమ దోపిడీ సమాజాలనే చూశాం, చూస్తున్నాం. కొత్త సమాజాన్ని నిర్మించుకోవడం అంటే, భూస్వాముల ఆధీనంలో ఉన్న భూముల్ని సమిష్టి ఆధీనంలోకి తీసుకుని, లేదా ఆ భూమిని రైతులకు పంచి - ఆ రకంగా, ఒకటో రెండో మార్పులు మాత్రం చేసి, మిగతావన్నీ పాత పద్ధతులే ఉంచితే, ఆ రకంగా దోపిడీకి అనుకూలంగా పుట్టుకొచ్చిన పద్ధతులే ఉంచితే, ఆ కొత్త సమాజం మళ్ళీ పాత కుళ్ళు సమాజమే అవుతుంది. మొదట్లో మనకు, అంటే శ్రామిక వర్గానికి, ఇన్నాళ్ళూ సాగిన శ్రమ దోపిడీ దుర్మార్గం సంగతి తెలియాలి. ఇప్పుడు ఉన్న వేతన శ్రామికులికి, అసలు శ్రమ దోపిడీ అనేది బానిసల్ని దోచడం నించీ ప్రారంభమైందనీ, అది కౌలు రైతుల్ని దోచడంగా మారి, ఇప్పుడు వేతన శ్రామికుల్ని కూడా దోచడంగా కూడా సాగుతోందనీ, ఈ విషయాలన్నీ తెలియాలి. అసలు 'జీతం' అంటే, 'అదనపు విలువ' అంటే, కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ అంటే, ఇవన్నీ తెలియాలి. వారం

రోజుల్లో ఇదంతా చక్కగా నేర్పవచ్చు; నేర్చుకోవచ్చు. ఇదంతా తెలిసి ఉంటేనే, రేపు మనం కొత్త సమాజాన్ని ఎలా నిర్మించుకోవాలో, దోపిడీ ఆదాయాల్ని ఎలా తీసెయ్యాలో, తెలుస్తుంది. రేపు జరగవలసిన మార్పుల సంగతి ఇప్పుడే అర్థం కావాలి. ఇప్పటి నించీ వాటి మీద, సంఘాల్లోనూ, ఇళ్ళల్లోనూ, చర్చించుకుంటూ ఉండాలి. మార్క్సు అన్నాడు ఒక చోట, శ్రమ చేసే మనిషి, ఆ పని ప్రారంభించక ముందే, దాని క్రమాన్నంతా మనసులో ఊహించుకుంటాడు - అని. రేపు నిర్మించబోయే కొత్త సమాజం గురించి ఇప్పటి నించీ మనకి, రాజీలు లేని, లొంగుబాట్లు లేని, వర్గ సామరస్యాలు లేని, విప్లవ కార్యక్రమాల గురించి స్పష్టత వుండాలి. రేపు, భూస్వాముల నించి భూముల్ని తీసేసి, వాళ్ళకి నష్ట పరిహారాలు ఇస్తే, అది శ్రమ దోపిడీని తీసివెయ్యడం అవుతుందా? ఆ నష్ట పరిహారం డబ్బుని, వాళ్ళు, బ్యాంకుల్లో పెట్టుకుని వాటి మీద వడ్డీలు సంపాదిస్తూ, ఆ వడ్డీలతో, వాళ్ళు స్వంత శ్రమలు లేకుండా బతుకుతోంటే, అది శ్రమ దోపిడీని తీసివెయ్యడం అవుతుందా? కౌళ్ళు తింటే ఏమిటీ, వడ్డీలు తింటే ఏమిటీ? అదంతా, కొత్త అదనపు విలువని లాగడం కాదూ? పెట్టుబడిదారుల్ని, ఆ ఫ్యాక్టరీల్లోనే మేనేజర్లుగా మార్చి, వాళ్ళు అలాగే పెత్తనాలు చేస్తూ ఉంటే, అది యజమానీ శ్రామిక సంబంధాల్ని తీసివెయ్యడం అవుతుందా? కొందరు మనుషులు ఎప్పుడూ రోడ్లు ఊడ్చే శ్రమలూ; కొందరు మనుషులు, టీచర్లుగా - డాక్టర్లుగా చేసే శ్రమలూ జరుగుతూ ఉంటే, అది దోపిడీ సమాజాల 'శ్రమ విభజన'ని మార్చడం అవుతుందా? రేపు కూడా, 'వడ్డీలూ - లాభాలూ' అని మాట్లాడుతూ ఉంటే, అది దోపిడీ భాషని తిరస్కరించడం అవుతుందా? మనం గాభరా పడి పోయేదేమీ లేదు. ఇప్పటి నించే మనం ఈ విషయాలన్నీ నేర్చుకుంటూ, చర్చించుకుంటూ ఉండాలి. భూస్వాముల ఆస్తులు తీసెయ్యాలి. పెట్టుబడిదారుల ఆస్తులు తీసెయ్యాలి. అలా జరగాలంటే, రేపు మన చట్టాలు, ఇప్పటి చట్టాల కన్నా వ్యతిరేకంగా ఉండాలి. చట్టాలు ఉండడమే కాదు, అవన్నీ ఆచరణలోకి రావాలి. అసలు దోపిడీ ఆదాయాలతో బతికే వర్గమే లేకపోతే, ఈ నిరుద్యోగాలూ, ఈ సంక్షోభాలూ, ఈ కలిమి లేములూ, ఈ యుద్ధాలూ, ఇవి ఏవీ ఉండవు. సమస్య ఎందుకు ఉందో దాన్ని బట్టే పరిష్కారం కదా? సమస్యలు దోపిడీ వల్ల ఉంటే, ఆ దోపిడీని తీసేస్తే అదే పరిష్కారం కదా?''

''వినడానికి ఎంత ఆనందంగా ఉందంటే, ఇలా రాత్రింబవళ్ళూ వింటూనే ఉండాలని ఉంది. ఇదంతా సాధ్యమా, మార్చగలమా అనే దడ పుట్టుకొస్తూనే ఉంది. అసలు అంత మంచి సిద్ధాంతం దొరికాక, ఇంత కాలం ఎందుకు పడుతోంది? ఇప్పటికి మాత్రం ఎక్కడ ఆశ వుంది? ఇది ఒకరితోనో, ఇద్దరితోనో, అయ్యే మార్పు కాదు. కోట్ల మంది జనం ఏం చేస్తున్నారు? కొంత కాలానికి భూమే అంతమైపోతుందనీ, విచ్చిపోతుందనీ, సూర్యుళ్ళో కలిసిపోతుందనీ, అంటారు.

అప్పటి దాకా ఏమీ జరగదా? అప్పుడు జరగడం మాత్రం ఎందుకు?"

"దోపిడీ సంబంధాలూ, వాటి వల్ల పుట్టుకొస్తోన్న దుష్టత్వాలూ, ఏ కొంచెం అర్థమైన వాళ్ళకైనా, నిత్యం ఇంత బాధా కలుగుతూ వుంటుంది. బాధ కలగడం, మంచి స్పందనే. కానీ, అది ఒక్కటే పరిష్కారం కాదు. మొదట కాపిటల్‌ని పూర్తి చేసి, తర్వాత ఎక్కడెక్కడ కొత్త సమాజాలు ప్రారంభమై అంతరించాయో ఆ సంగతులు కొంచెం తెలుసుకుంటే, అపజయాలకు కారణాలేమిటో తెలిస్తే తెలుస్తాయి. రష్యాలో లెనిన్ ఇంకా కొన్నేళ్ళ పాటు జీవించి వుంటే, పదవిలో ఆయన లేకపోయినా, పార్టీలో సాధారణ సభ్యుడిగానే వున్నా, రష్యా కమ్యూనిస్టు పార్టీ అంత బూర్జువా రకంగా మారిపోయి వుండేది కాదని నాకనిపిస్తుంది. సమాజంలో అన్ని దరిద్రాలూ ఎప్పటిలా సాగుతూ వుండగానే స్టాలిన్ అయితే, 'మన దగ్గిర వర్గాలే లేవు, మనది వర్గ రహిత సమాజం అయిపోయింది' అన్నాడు! దానికి, మన కమ్యూనిస్టులెవరూ తెల్లపోలేదు, విస్తుపోలేదు, చీదర పడలేదు. నోళ్ళెత్తకుండా వూరుకున్నారు. ఏ నాయకుడైనా పెద్ద పదవిలో వుంటే, ఆ మనిషి ఎలా మాట్లాడేసినా నోరెత్తకపోవడం, రాజుల నాటి నించీ వుండే, అదే మన కమ్యూనిస్టుల పద్ధతి! చైనాలో మాత్రం? అత్యద్భుతమైన సాహసాలతో లాంగ్ మార్చ్ చేసి సాధించిన విప్లవాన్ని కుప్ప చేసి పారేశారు. అక్కడి రక్షణ మంత్రి లిన్‌పియావో, 'మనం సోషలిజంలో వున్నాం, మనకి మార్క్సు రాసినవి ఇంకా ఎందుకు? కాపిటల్ ఎందుకు? దాన్నించి నేర్చుకునేదేముంది? మనకి అన్నీ తెలుసు' అన్నాడు. వాళ్ళకి ఆ పుస్తకం చదివే అవకాశం లేకపోతే, అదే చెప్పుకోవాలి. ఆ అనువాద ప్రయత్నాలేవో చేసుకుని, అసలు ఆ పుస్తకంలో ఏం వుందో, ఏం నేర్చుకోవాలో, చూడాలి. ఆ దృష్టే లేదు ఆ కమ్యూనిస్టులికి. వాళ్ళ దగ్గిర అసలు జ్ఞానమే లేదు. మార్క్సిజాన్ని పూర్తిగా వదిలేసి, నాయకుడి వ్యక్తి పూజ మొదలుపెట్టారు! తెల్లారితే ఎవరు ఏ పని చెయ్యాలన్నా, మావో విగ్రహాన్ని ప్రార్థించి, అనుమతి అడగాల్సిందే! కుర్చీ ఎక్కితే విప్లవం అడుగంటి పోతుందని మావో కూడా రుజువు చేశాడు. లిన్‌పియావోని తన వారసుడిగా ప్రకటించాడు! కమ్యూనిస్టు పార్టీలో వారసత్వాలేమిటి? నీ తర్వాత ఎవరు కుర్చీ ఎక్కాలో నువ్వు నిర్ణయించడం ఏమిటి? అంత నిరంకుశమైన ప్రకటన జరిగినా, మన విప్లవకారులు నోళ్ళెత్తలేదు. ఆ భజనే ఇక్కడ కూడా చేశారు. ఎంత నాయకుడి నించైనా మంచి తీసుకోవాలి, చెడ్డని తిరస్కరించాలి. మంచికీ చెడ్డకీ తేడాయే లేకపోతే, విప్లవాలెందుకు? నూతన సమాజాలెందుకు? ఈ కుళ్ళు చేష్టలూ, దోపిడీలూ, అక్కడికి మొయ్యడానికా? మావో ఎవరినైతే తన వారసుడిగా ప్రకటించాడో, ఆ వారసుడికి, ప్రాణ భయంతో ఒక అర్ధ రాత్రి, ఇంధనం కూడా లేని విమానం ఎక్కి దేశం నించి పారిపోతూ దుర్మరణం చెందే అవమానకరమైన ఘటన జరిగింది. రక్షణ మంత్రి హఠాత్తుగా పోతే, ఆ సంగతి దేశంలో ప్రజలకి తెలియడానికి

ఏడాది కాలం దాటింది! ఏమిటీ నూతన సమాజం? సోషలిజం సాగిపోతూ వున్న సమాజం! అసలు వీళ్ళకి మార్క్సిజం ఛాయలు తెలీవు. పాత పరిపాలకులతో ఇబ్బందులు పడుతూ వుంటారు కాబట్టి, ఆ రాజ్యాధికారంలో నించి బైట పడే దాకా సాహసాలు బాగానే చేస్తారు. అధికారం అందిన తర్వాత, 'ఇక గమ్యానికి చేరిపోయాం' అనుకుంటారు. ఇక కొత్త సింహాసనాలూ, కొత్త సన్మానాలూ, ప్రారంభించుకుంటారు. అన్నీ మళ్ళీ రాజుల ముచ్చట్లే! ఎక్కణ్ణించి వస్తుంది నూతన సమాజం? నాలుగు తప్పటడుగులతో బయల్దేరిన ఆ సమాజం, అక్కడే చతికిలబడుతుంది. అంతే కాదు, అది అక్కడే చతికిలబడి కూడా వుండదు. అది ఆ విప్లవ నాయకుల ఆశీర్వాదాలతోనే వెనక్కి తిరిగి పరుగు లంకించుకుంటుంది. రష్యా చైనాల చరిత్రలు మనకి మళ్ళీ మళ్ళీ ఈ దృశ్యాలనే చూపించాయి. మనం ఇంత పరిశీలనతో, ఇంత విమర్శతో, ఎందుకు వుండాలి? రేపు మన జాగ్రత్తలతో మనం వుండాలి. చరిత్రలో దొరికే అనుభవాల్ని మనం పోగు చేసుకోవాలి. అదీ మన కర్తవ్యం. మనం మార్క్సు జ్ఞానంతో నడవాలి.''

''ఇప్పుడు నాకు ఎలా అనిపిస్తోందంటే, ఎవరు ఎన్ని తప్పులైనా, ఎలాంటి తప్పులైనా, చెయ్యనివ్వండి. అన్ని చోట్లా అవే జరుగుతాయని అనుకోను. మనం మార్క్సు మార్గాన్ని వదిలిపెట్టకుండా వుంటే, మన వల్ల అలాంటి నేరాలు జరగవు. మార్క్సుని వదిలేసిన వాళ్ళే దారి తప్పిపోతారు. ఈ దోపిడీ సమాజాన్ని మార్చడం సాధ్యమైతే, అది మన వల్ల తప్పకుండా జరగాలి.''

'' 'మార్చడం సాధ్యమా?' అని ఆలోచించడం మంచిదే. కానీ, మారడం ఇష్టమేనా? అది ముందు నిర్ణయించుకోవాలి మనం.''

''అయ్యయ్యో! అందులో సందేహం ఏమిటి? నా ప్రాణాలు ఇచ్చేస్తే ఈ ప్రపంచం మారుతుందంటే నా ప్రాణాలు నవ్వుతూ ఇచ్చేస్తాను.''

''పోరాటాలు జయించాలంటే, ప్రాణాలు ఇచ్చెయ్యడం అవసరమే. కానీ, ప్రాణాలు ఇచ్చెయ్యడంతో పోరాటాలు జయించవు. సిద్ధాంత జ్ఞానం కన్నా, సిద్ధాంతం ప్రకారం నడవాలనే పట్టుదల కన్నా, ప్రాణాలు ఇచ్చెయ్యడం గొప్ప సంగతి కాదు. మన దృష్టి ఎప్పుడూ సిద్ధాంతం మీదే!''

''అది ఇన్ని సార్లు చెప్పాలా మీరు?''

''చెప్పాలి. ఈ 2 వార్తలూ చూడండి! రష్యా చైనాలు, నిజంగా విప్లవకరమైన ప్రారంభాలు చేసిన నూతన సమాజాలు, ఎలా తయారై వున్నాయో చూస్తే, మార్క్సు మార్గాన్ని మళ్ళీ ఎందుకు చేసుకోవాలో తెలుస్తుంది. ఈ రకం వార్తల్ని చూసి బొట బొటా కన్నీళ్ళు కార్చడం కాదు, ఆగ్రహంతో కళ్ళు, నిప్పుల్ని కురవాలి! చూడండి వార్తల్ని!''


1530 కోట్ల హోటల్!

**1530 కోట్ల హోటల్!!**

రష్యా విప్లవ నేత లెనిన్ నడయాడిన హోటల్ ఇది.. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో రష్యాలో ఉన్న విదేశీ పాత్రికేయులందరికీ నీడనిచ్చిన గూడు. మాస్కో నగరంలో.. 1901 లో ప్రారంభమైన ఈ హోటల్ పేరు మెట్రో పోల్. రష్యా చరిత్రలో ఎన్నో కీలక ఘట్టాలకు సజీవసాక్షిగా నిలిచిన ఈ హోటల్.. గురువారం జరిగిన వేలంలో రూ.1530 కోట్ల భారీ మొత్తానికి అమ్ముడైంది. రష్యాకే చెందిన ప్రముఖ చైన్ హోటళ్ళ నిర్వాహకుడు అజిముట్ ఇంత భారీ మొత్తం చెల్లించి దీన్ని సొంతం చేసుకున్నారని సమాచారం.

( ఆంధ్రజ్యోతి, 31-8-12 )


---

రష్యాలో, 1917 అక్టోబరులో ప్రారంభమైన భూముల జాతీయం వంటి మార్పుల్ని సోషలిస్టు విప్లవ ప్రారంభంగా చెప్పుకుంటాం. కొంత కాలం దాకా అద్భుతమైన మార్పులు కనపడ్డాయి. కానీ ఒక నాటికి అక్కడ ఎర్రజెండాయే మాయమైంది! వేల కోట్ల ఆదాయాల దోపిడీదారులు అక్కడ విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నారు! ఎందుకీ వెనక నడక? కార్మిక విప్లవ పార్టీ, కార్మిక విప్లవకారులూ, ఏమైపోయారు! తర్వాత, చైనా సంపద కూడా చూడండి!

## చైనా వెన్... ఆస్తుల డెన్

**రూ. 14.460 కోట్లు పోగేసుకున్న ప్రధాని కుటుంబ సభ్యులు**

**న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంచలన కథనం**


చైనా వెన్..
ఆస్తుల డెన్
• రూ. 14,460 కోట్లు పోగేసుకున్న ప్రధాని కుటుంబ సభ్యులు
• న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంచలన కథనం

బీజింగ్: మన దేశంలోనే కాదు.. చైనాలోనూ నాయకుల అవినీతి హెచ్చుమీరుతోంది. చైనా ప్రధాని వెన్ జియబావో కుటుంబం ఏకంగా రూ.14,460 కోట్ల మేర ఆస్తులను పోగేసుకుందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఆరోపించింది. జియబావో భార్య, కొడుకు, కూతురు, తమ్ముడు, బావమరిది.. వీళ్ళంతా ఆయన నాయకత్వంలో అపారంగా డబ్బు సంపాదించుకున్నారని ఆ పత్రిక తన కథనంలో వెల్లడించింది. ఆయన భార్య సహా పలువురు భారీ స్థాయిలో ఒప్పందాలు చేసుకుని, కనీసం రూ.14,460 కోట్ల ఆస్తులు పోగేసుకున్నారని పేర్కొంది. చాలా సందర్భాల్లో బంధువుల పేర్లను భాగస్వాముల, ఇతరుల పేర్ల వెనక దాచిపెట్టారని వివరించింది. రాజకీయాలతో సంబంధం ఉన్నవారికి ప్రభుత్వం, వ్యాపారాల్లో ఎలా లాభాలు వస్తాయో చెప్పడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ అక్కర్లేదని, చైనాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థక వ్యవస్థ వల్ల వాళ్ళు అపార లబ్ధి పొందారని వెల్లడించింది. వెన్ భార్య జాంగ్ బిలి ప్రభుత్వ వజ్రాల కంపెనీల బాధ్యతలు చూస్తారని, తన బంధువులకు సాయం చేసి కొన్ని వందల కోట్ల డాలర్ల పెట్టుబడులను బీమా, టెక్నాలజీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో పెట్టించారని తెలిపింది. అయితే.. చైనా పరువు ప్రతిష్ఠలను మంటగలిపేందుకు ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని విదేశాంగ మంత్రి ప్రతినిధి హాంగ్ లీ అన్నారు. ప్రధానిపై కథనాలు రాయడంతో న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెబ్ సైట్లను చైనాలో బ్లాక్ చేశారు. కాగా.. త్వరలో అధ్యక్ష పదవి చేపడతారని భావించిన ఉపాధ్యక్షుడు జిన్‌పింగ్ కుటుంబం కూడా భారీగా ఆస్తులు కూడగట్టుకున్నట్లు విదేశీ మీడియా ఇప్పటికే ఆరోపించింది. అయితే, కథనాల ప్రభావం వెన్‌పై ఎంతగా ఉంటుందనేది తెలియలేదు.

(ఆంధ్రజ్యోతి, 27-10-12) ★

# 59. కలలు కనకండి!
# నిజాలు చూడండి!

**102.** రెండు రోజుల్నించీ నాకు నిద్రపడితే ఒట్టు! అన్నేసి సంవత్సరాల పాటు, అన్నన్ని బాధలు పడి, లక్షల మంది జనం త్యాగాలు చేసి తెచ్చిన మార్పులు మళ్ళీ వెనక్కి తిరిగిపోతే, మరి ఇప్పుడు మనం అంత కన్నా గొప్పగా చెయ్యగలమా? నన్ను అనుమానించకండి! నేను శ్రామిక వర్గ పోరాటం వాడినే, వర్గాల సామరస్యం వాడిని కాను. నా వల్ల ఏ పని జరగాలన్నా చెప్పి చూడండి, చేస్తానో లేదో తెలుస్తుంది. కానీ, చేసి ఏం ప్రయోజనం? అదే ప్రశ్న పట్టుకుంది నన్ను. రష్యాలో కన్నా, చైనాలో కన్నా, తెలివిగా చేస్తామా మనం? మళ్ళీ ఓడిపోడానికేనా మన పోరాటాలు? ప్రయోజనం లేని పోరాటాలు ఎందుకు? ఇదే అనిపిస్తోంది ఇప్పుడైతే.

**జ:** మీరు, 'ఓటమి' బాధ వల్ల ఇలా అనుకుంటున్నారు గానీ, నిజంగా 'ఇక పోరాటం వద్దు, దోపిడీదారులకు సేవలు చేసుకుంటూ బతికేద్దాం, చాలు' అని, మన పార్టీలన్నీ నిర్ణయిస్తే, దాన్ని మీరు భరించరు. అదే నిజమైన అవమానంగా, దానికి మరింత బాధ పడతారు. ఓడిపోతున్నాం, నిజమే. ఎందుకు ఓడిపోతున్నామో, ఏం తప్పులు చేస్తున్నామో, సరిగా అర్థం చేసుకుంటే, తప్పులు దిద్దుకుంటే, అప్పుడు కూడా ఓడిపోతామా? అలాగే జరిగితే, ఆ కొత్త తప్పులేమిటో మళ్ళీ పరిశీలించుకుంటాం. వెనకటి కాలంలో బానిసలు ఎన్ని సార్లు ఓడిపోయారో అన్ని సార్లూ ఎదురు తిరిగారు! వాళ్ళు పోరాడకపోతే, ఈ నాటికీ ఆ సంబంధాలు అలాగే వుండి, మనం అందరం బానిసలుగా వుండేవాళ్ళం. ఆ నాటి బానిసలు, వాళ్ళ కోసమే వాళ్ళు చేసుకున్నా, అది మన కందరికీ విముక్తి అయింది. ఒక సారి ఓడినా, పది సార్లు ఓడినా, ఓటమికే లొంగి ఆగిపోతామా? మన దగ్గిర న్యాయం లేకపోతే, అప్పుడు ఓటమినే న్యాయంగా అంగీకరించాలి. ఆ పని చెయ్యవలసింది దోపిడీ వర్గం. దాని దగ్గిర న్యాయం లేదు కాబట్టి.

మన పాత నాయకులు చాలా తప్పులు చేసిన మాట నిజమే. దోపిడీ వర్గానికి మార్గాలన్నీ సుగమం చేసి, విప్లవ ప్రారంభాల్ని సర్వ నాశనం చేసి పెట్టారు. నాయకుల తప్పులేమిటో గ్రహిస్తే, మనం సరిగా ఎలా ప్రవర్తించాలో నేర్చు కుంటాం. తెలియని విషయాల్లో తప్పులు జరిగితే అది వేరు; ఎంతో స్పష్టంగా తెలిసే విషయాల్లో కూడా తప్పులు జరగడమా! వంద సార్లు ఓడిపోయినా, న్యాయం జయిస్తుంది! న్యాయం స్థిరపడుతుంది! అలా అనిపించదా మీకు?

"అయ్యో, రోజూ అనిపించేదే అది. న్యాయం జయించాలి. న్యాయం కాకపోతే, అన్యాయం జయించాలా? మా యజమానే, వాడి కుటుంబమే, వాడి పెళ్ళామే,

వాడి పిల్లలే, వాళ్ళే గొప్ప మానవులా? శ్రామికులం అందరం, పనికిమాలిన వాళ్ళమా? అసలు, 'పనికిరాని' వాళ్ళు వాళ్ళే కదా? అయినా, న్యాయం జయించడం లేదే అన్నదే నా బాధ! మీరంటున్నారు, 'ఇప్పుడు ఓడిపోయి వున్నాం, ఎప్పుడూ ఇలాగే వుంటామా' అంటున్నారు. నిజమే, ఎప్పుడూ ఇలాగే వుండం. బానిసత్వం వుందా ఇప్పుడు? ఎన్నెన్ని బాధలు పెట్టారు వాళ్ళని! అయినా ఇప్పుడు అదంతా గతం అయిపోలేదా? అలాగే, ఇదీ 'గతం' అవక తప్పదు, నిజమే. కానీ, నేనో మాట చెప్పనా? నిన్న మా కుర్రాడు ఏదేదో అడిగాడు. ఒక్కటీ చెప్పలేక పోయాను. ఆ ఆలోచనలన్నీ వాడికే కాదు, నాకూ వున్నాయి. పోరాటం ఇంకా ఎన్నేళ్ళు? మనం ఒక పార్టీ పెడతాం అనుకోండీ. మనం అంటే, మనమే కాదు, పోనీ మనమే పెడతాం పార్టీ. ఆ పార్టీ ద్వారా ప్రజలకి ఏం చెపుతామంటే, 'అందరూ మాకే ఓట్లు వేసి మమ్మల్ని ఎన్నుకోండి. మేం ప్రభుత్వంలోకి వెళ్ళి, ఈ ప్రపంచాన్నే మార్చేస్తాం. ఈ దోపిడీ చట్టాలన్నీ మార్చేస్తాం. ఈ రాజ్యాంగ యంత్రాన్ని కూల దోస్తాం. భూస్వాముల్నీ, పెట్టుబడిదారుల్నీ, అలాంటి దోపిడీ దండు నంతటినీ శ్రమలు చేసే వాళ్ళుగా మారుస్తాం. వాళ్ళ ఆస్తులు తీసిపారేస్తే, ఉద్యోగాలు చెయ్యక ఛస్తారా? ఇంకేంటి సమస్య? కార్మిక వర్గ నియంతృత్వంతో, ఈ వర్గాల సంబంధాలు ఎగరగొడతాం' అని, ఈ రకంగా మన పార్టీ లక్ష్యాన్ని ప్రజలకి చెప్తే, వాళ్ళు మనల్ని ఎన్నుకుంటే, మనం ప్రభుత్వంలోకి వెళ్ళి, ఆ మంచి మార్పులన్నీ చెయ్యలేమా? రేపు 2014 ఎన్నికల్లోనే చెయ్యలేమా? మా కుర్రాడు ఇలాగే అడిగాడు గానీ, నిజానికి నా ఆలోచనా అదే. నేనేమన్నా తప్పుగా మాట్లాడుతున్నానంటారా?"

"తప్పు కాదు. కానీ పరమ తెలివి తక్కువ. బ్రహ్మాండమైన తెలివి తక్కువ ఆశ. ఎందుకో చెప్పమంటారా? మనం అలాంటి పార్టీ పెట్టి, ప్రజల్లో ఎంత ప్రచారం అయినా చేసుకోవచ్చు. అది మన ఇష్టం. ఈ నాడు దోపిడీ వర్గం, కాస్త సహిస్తోంది దాన్ని. వీధుల్లో మాట్లాడనిస్తోంది. రాయనిస్తోంది. కానీ, ఇవన్నీ పార్టీలో పెడితే, ఇప్పుడు వున్న రాజ్యాంగ యంత్రంలో 'ఎన్నికల కమిషన్' అనేది ఒకటి వుంది. అది, మన పార్టీకి అనుమతి ఇవ్వదు. ఈ రాజ్యాంగ యంత్రానికి కట్టుబడి, దాని ప్రకారమే నడుస్తామని చెపితేనే మన పార్టీకి రిజిస్ట్రేషన్ దొరుకుతుంది. కానీ మనం, దోపిడీ రాజ్యాంగాన్ని వ్యతిరేకించే మాటలు చెప్తే, మన పార్టీకి, పార్టీగా ఎన్నికల్లో నిలబడే అవకాశమే వుండదు. ఇక ప్రజలు ఓట్లు ఎలా ఇస్తారు?"

"అయ్యో, అలాగా? అయితే మన పార్టీ ఎలా పని చెయ్యాలి? పోనీ, ఇండిపెండెంటుగా నిలబడడం అంటారే, మన వాళ్ళు కొందరు అలా నిలబడి, మనం ఏం చేస్తామో, జనాలకి చెపితే?"

"ఇండిపెండెంట్లుగా నిలబడే వాళ్ళు మెజారిటీ ఎలా అవుతారు? మెజారిటీ లేకుండా మార్పులు ఎలా చేస్తారు? ఒక వేళ, అలా నిలబడ్డా, వాళ్ళు ఎన్నికల్లో నెగ్గినా, 'ప్రమాణ స్వీకారాల' తతంగం ఒకటి వుంటుంది కదా? అప్పుడు, 'నేను ఈ

రాజ్యాంగం ప్రకారమే, ఈ చట్టాల ప్రకారమే నడుస్తాను' అని ప్రమాణం చెయ్యాలి. అలా ప్రమాణం చేసిన మనిషి, ఈ రాజ్యాంగ యంత్రాన్ని ఎలా మారుస్తాడు? చట్టాల్ని ఎలా మారుస్తాడు?"

"అదొకటా? అవును, ఇండిపెండెంట్ వాళ్ళు ఎంత మంది వున్నా వాళ్ళకి మెజారిటీ వుండదు. అవును, ఆ పద్ధతి కాదు. మన పార్టీయే ఏం చెయ్యాలంటే, ముందు రిజిస్ట్రేషన్ అయ్యే దాకా అది అవడానికి కావలసిన మాటలే రాస్తాం. ఎన్నికల ప్రచారంలో అయితే ప్రజలకి కాస్త చాటు మాటుగా, మనం అసలు చెప్పదల్చుకున్నవన్నీ చెపుతాం. నెగ్గిపోతామనే అనుకుందాం. ఇలా అలా కాదు, మెజారిటీ మనదే. ప్రమాణాలు చేసేటప్పుడా? సరే, అలాగే, 'ఈ రాజ్యాంగాన్నే పాటిస్తాం' అని చెప్పేద్దాం. పోలీసుల దగ్గిర అబద్ధాలే చెపుతాం గానీ నిజాలు చెపుతామా? ఇక్కడా అలాగే. ఆ ప్రమాణాలూ గ్రిమాణాల మీద మనకేం విలువ? అక్కడి దాకా చేరాక మన అసలు కార్యక్రమం బైటికి తీస్తాం. చట్టాలు మార్చేస్తాం. యజమానులు దోపిడీలతో సంపాదించి పెట్టుకున్న ఆస్తులన్నీ సమాజపరం చేస్తాం. వాళ్ళు కూడా డ్యూటీల ప్రకారం పనులు చెయ్యాలంటాం. వాళ్ళు మనల్ని నిరుద్యోగుల్ని చేసినా, మనం వాళ్ళని ఉద్యోగుల్ని చేస్తాం. మనం చెయ్యాలనుకున్నవన్నీ చేస్తాం. ఒక పార్టీ పెట్టి, మెజారిటీ సంపాదిస్తే, చాలా తేలిగ్గా అయ్యే పని కాదా ఇది? కాకపోతే, జనం ఓట్లు వెయ్యాలి మన పార్టీకి. మనకి మెజారిటీ వస్తే మాత్రం మార్పులన్నీ చేసెయ్యలేమూ? ఏమిటి ఇందులో తెలివితక్కువ తనం?"

"అయితే పెట్టండి ఒక పార్టీ. నేనూ మీ పార్టీ మనిషినే."

" 'మీ పార్టీ' అనకండి, 'మన పార్టీ' అనండి!"

"సరే, మన పార్టీయే. ఇది ప్రభుత్వంలోకి కూడా జొరబడుతుందనే అనుకుందాం. మెజారిటీ మనదే అనుకుందాం. 'ఈ రాజ్యాంగం ప్రకారమే నడుస్తాం' అని చేసిన ప్రమాణాల్ని ఎగరగొట్టి భూముల్నీ ఫ్యాక్టరీల్నీ సోషలైజ్ చెయ్యాలనీ, రాజ్యాంగాన్ని మార్చాలనీ - ఆ ప్రయత్నాలు మొదలుపెడితే, అప్పుడు పోలీసూ సైన్యమూ ఎవరివాళ్ళు? వాళ్ళల్లోనే బోలెడు మంది పెట్టుబడిదారులు వుంటారు. వాళ్ళందరూ దోపిడీ రాజ్యాంగం ప్రకారం నడిచే అధికారులు. వాళ్ళు బైల్దేరుతారు మన పార్టీ మీదకి. అంటే, మన మీదకి! అప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున కదలాలి. 'కదలడం' అంటే, వూరికే వీధుల్లోకి షికారుగా రావడం కాదు; పోలీసునీ, సైన్యాన్నీ ఎదుర్కునే ఆయుధాల శక్తితో రావాలి. అలా జరిగితే అది సాయుధ పోరాటం అవదూ? అది, చట్టబద్ధ పోరాటంగానే వుంటుందా? మనకి పోరాటాలు ఇష్టంలేక, పోనీ అంత కాలం ఆగలేక, ఒక పార్టీ ద్వారా విప్లవకరమైన మార్పులు చెయ్యాలని ప్రయత్నిస్తే, ఆ పార్టీ, ప్రభుత్వంలోకి జొరబడడం ఒక సమస్య. అది, అబద్ధాలతో జొరబడినా, తర్వాత సైన్యాన్ని ఎదుర్కునే పరిస్తితి వచ్చినప్పుడు, మనకి

ప్రజల సైన్యం వుండాలా, అక్కరలేదా? ప్రజలే సైన్యంగా వుండొద్దూ? శ్రామిక ప్రజలు అంత శక్తితో ఎదురుతిరిగే ప్రయత్నాలే లేకపోతే, మనం చెయ్యాలనుకునే మార్పులు ఎలా చేస్తాం?''

''ప్రజలు ఎందుకు కదలరు? తప్పకుండా కదులుతారు. ఎదురు తిరుగుతారు.''

''కదలడానికి వాళ్ళకేం నేర్పాం మనం? ఎక్కడైనా కార్మిక సంఘాలు పని చేస్తున్నాయా?''

''మళ్ళీ సంఘాల దగ్గిరికి తీసుకొచ్చారా మమ్మల్ని?''

''అవును, ప్రారంభం సంఘాలతోటే జరగాలి కదా? అక్కడ రోజువారీ సమస్యల మీద పని చేస్తూనే, శ్రమ దోపిడీ జరుగుతోందని అందరూ తెలుసుకునే లాగ బోధించాలి కదా? విప్లవ పార్టీ కూడా తప్పని సరిగా వుండాలి. మనం చేసే పని సవ్యంగా చేస్తూ వుంటే, అది సత్ఫలితాల్ని ఇవ్వదా? పోరాటాలు లేకుండా మార్పులు జరుగుతాయని కలలు కనవచ్చా మనం? దోపిడీ వర్గం, న్యాయంగా తన తప్పు తను తెలుసుకుంటే, దోపిడీ హక్కుల్ని అదే వదిలేస్తే, అసలు పోరాటాలు ఎందుకు? కానీ అది దోపిడీని వదిలేస్తుందా? అది ఎప్పటికీ మారదు. అది న్యాయంగా మారితే, అందరూ కలిసి శాంతిగా సమాజాన్ని నడుపుకోవచ్చు. అప్పుడు ఇంకా సైన్యాలు ఎందుకు? మొదట వాటిని రద్దు చేసేసి, సైనికులందరికీ వేరే ఉద్యోగాలు ఏర్పరచాలి. 'మన పార్టీ, మన పార్టీ' అన్నారు. అదే వుంటే, దానికి ఎంత మెజారిటీ వచ్చినా, అది ఈ రాజ్యాంగానికే లోబడి వుండాలి. కౌళ్ళూ - వడ్డీలూ లాభాలూ! ఆ హక్కులన్నీ యజమానులకు వదిలిపెట్టడం ఇష్టమేనా మీకు?''

''ఛీ! ఈనగాచి నక్కలపాలు చేసినట్టా?''

''పాపం నక్కలు తింటే ఎంత పోతుంది? పొలం అంతా తినేస్తాయా? దోపిడీదార్ల దోపిడీని అర్థం చేసుకోవాలంటే, నక్కల పోలిక సరిపోతుందా? ఇంతకీ 'కాపిటల్'లో ఎందాక వచ్చారు మీరంతా?''

''సగం అయింది. సగం వుంది.''

''అందుకే మీరూ సగంలో వున్నారు. పార్టీ ద్వారా అయినా 'పోరాటం' తప్పదని తెలుస్తుందేమో చదివి చూడండి! పోరాటం లేకుండా, మెజారిటీ ఓట్లతో అసెంబ్లీలోకి జొరబడి, సోషలిజం సాధిద్దామనుకుంటున్నారా?''

'' 'సోషలిజం' సంగతి మన కనవసరం. శ్రామిక వర్గం శ్రమ దోపిడీ నించి బైట పడాలి.''

''నిజమే. మనకి కావలసింది అదే. కానీ, అదే సోషలిజం అవుతుంది.''

''అదా? అయితే సరే, మార్క్సు చెప్పే సోషలిజమే కావాలి. వీళ్ళూ వాళ్ళూ చెప్పేది కాదు!''

★

# 60. మళ్ళీ ఒక సారి
## ప్రశ్నలూ - జవాబులూ

**1.** 'ప్రకృతి' అంటే? 'సమాజం' అంటే?

**జ :** మనుషులు తయారుచెయ్యకుండా వున్నదే ప్రకృతి. మనుషులు పుట్టడం కన్నా లక్షల సంవత్సరాలకు పూర్వం నించే వున్న ప్రపంచమే ప్రకృతి. 'సమాజం అంటే, మనుషులు తిండిని తయారుచేసుకోవడంతో ఏర్పడిన, కొనసాగుతూ వున్న సంబంధాలే.

**2.** 'సహజ పదార్థం' అంటే?

**జ :** మనుషుల పనులతో సంబంధం లేకుండా సహజంగా వున్న పదార్థం. భూమి అంతా సహజ పదార్థం. అడవులూ, కొండలూ, గాలీ, నదులూ, సముద్రాలూ, సూర్యుడూ, చంద్రుడూ - వంటివి అన్నీ.

**3.** 'వస్తువు' అంటే?

**జ :** ఏదో ఒక సహజ పదార్థం మీద, మనుషులు ఏదో ఒక శ్రమ చేస్తే తయారయ్యేది. భూమిలో సహజంగా తయారై వున్న దుంపల్ని, మనుషులు తవ్వి తీసుకుంటే, బైటికి వచ్చిన దుంపలు, శ్రమ వల్ల తయారైన వస్తువే. లేదా, శ్రమ వల్ల తయారైన పదార్థం.

**4.** 'మారకం' అంటే?

**జ :** ఒక రకం వస్తువు ఇచ్చి, ఇంకో రకం వస్తువుని తీసుకుంటే, ఈ వస్తువు అటూ - ఆ వస్తువు ఇటూ మారితే, అది 'మారకం'.

**5.** 'మారకం' ఎందుకు?

**జ :** ఒక మనిషి, తను జీవించడానికి అవసరమైన వస్తువులన్నీ తనే తయారు చేసుకోలేడు కాబట్టి, ఆ రకంగా మారకాలు అవసరం.

**6.** మారకాలు, దేని ఆధారంతో జరుగుతాయి?

**జ :** 'మారకం విలువ' అనే విలువ ఆధారంతో. ఆ విలువ, ఆ వస్తువుని తయారు చెయ్యడానికి అవసరమయ్యే 'మొత్తం శ్రమ కాలాన్ని' బట్టి వుంటుంది.

**7.** అన్ని వస్తువులకూ శ్రమ కాలం ఒకే రకంగా అవసరమవుతుందా?

**జ :** అలా వుండదు. వస్తువుల రకాల్ని బట్టి వాటి తయారీకి అవసరమయ్యే శ్రమ కాలాలు తేడాగా వుంటాయి. శ్రమ కాలాలు సమానమైతేనే, అంటే మారకం విలువలు సమానం అయితే, మారకాలు జరుగుతాయి.

**8.** వస్తువుల మారకాలు, వస్తువుల సంబంధాలేనా?

**జ :** పైకి కనపడేవి, వస్తువుల మారక సంబంధాలే. కానీ అవి, ఆ మనుషుల శ్రమల సంబంధాలు.

**9.** వస్తువుల్లో, అవి ఒకే బరువు గలవి అయినా, వాటి విలువలు తేడాగా వుండడం చూస్తాం. ఒక కిలో ధాన్యానికీ, ఒక కిలో బంగారానికీ, విలువల్లో చాలా తేడా వుంటుంది. ఎందుకు?

**జ :** విలువ అనేది, శ్రమ కాలం కదా? అది ఎక్కువగా జరిగితే ఎక్కువ విలువా, తక్కువగా జరిగితే తక్కువ విలువా. కిలో ధాన్యం పండడానికి అవసర మయ్యే శ్రమ కాలం కన్నా, కిలో బంగారం తయారవడానికి అవసరమయ్యే శ్రమ కాలం వేల రెట్లు ఎక్కువగా వుంటుంది. విలువని ఎప్పుడూ శ్రమ కాలాన్ని బట్టే చూడాలి.

**10.** జంతువులూ, మనుషులూ కూడా ప్రకృతిలో భాగాలే. తేడా లేమిటి?

**జ :** జంతువులు శ్రమలు చెయ్యవు. మనుషులు శ్రమలు చేస్తారు. అదే తేడా. జంతువుల మధ్య రక్త సంబంధాలు మాత్రమే వుంటాయి. మనుషుల మధ్య, రక్త సంబంధాలూ, శ్రమ సంబంధాలూ కూడా వుంటాయి.

**11.** 'మానవ సంబంధాలు' అంటే?

**జ :** శ్రమ సంబంధాలే. మానవ సంబంధాలు అంటే రక్త సంబంధాలే - అన కూడదు. అవి, జంతువులకీ వుంటాయి. జంతువులకీ మనుషులకీ తేడాగా వున్నది, శ్రమ విషయమే.

**12.** జంతువులు, మనుషుల్ని మోస్తాయి. బళ్ళు లాగుతాయి. పొలాలు దున్ను తాయి. అవన్నీ శ్రమలు చెయ్యడం కాదా?

**జ :** కాదు. మనుషులు, జంతువుల్ని, తమ శ్రమల్లో పనిముట్లుగా ఉపయో గించుకుంటారు. అలా జరిగినప్పుడు, జంతువులు పనిముట్లే. 'శ్రమ' అనేది, మనుషులు చేసేదే గానీ, జంతువులు చేసేది కాదు.

**13.** పనిముట్టుని తయారుచేసిన శ్రమ కూడా కొత్త వస్తువుకి చేరుతుంది కదా? ఆ పనిముట్టుగా జంతువే వుంటే; ఆ పనిముట్టు నించి చేరే శ్రమ, జంతువుల నించి చేరే శ్రమ అవదా?

**జ :** 'పనిముట్టు నించి చేరే శ్రమ' అంటే, 'పనిముట్టు చేసే శ్రమ' అని కాదు. పనిముట్టుగా వుండేది, ఒక వస్తువు అయినా, ఒక జంతువు అయినా, వాటిని శ్రమ సాధనాలుగా తయారుచేసేది మనుషులే. ఆ పనిముట్టు, కొత్త వస్తువు కోసం ఖర్చయినప్పుడు, అలా ఖర్చయ్యే శ్రమ, మనుషులు చేసినదే. అది, పనిముట్టు చేసే శ్రమ కాదు. అది, పనిముట్టుని తయారుచేసిన పాత శ్రమ.

**14.** బండి లాగినప్పుడూ, పొలం దున్నినప్పుడూ, జంతువు శరీరం కష్టపడుతుంది. మరి దాని మాట ఏమిటి?

**జ :** జంతువులు సజీవమైన పనిముట్లు. నిర్జీవమైన పనిముట్ల మీద తీసుకొనే జాగ్రత్తలు ఒక రకం; జంతువుల వంటి వాటి మీద తీసుకోవలిసిన జాగ్రత్తలు

ఇంకో రకం. మగ్గాన్ని వానలో పడేస్తామా? దాన్ని ఎలా వుంచాలో అలా వుంచుతాం. అలాగే, జంతువుల గురించి కూడా జాగ్రత్తలు వుంటాయి. వాటికి కడుపు నిండా తిండి పెట్టాలి. వాటి నివాస ప్రదేశాలు పరిశుభ్రంగా వుంచాలి. ఎప్పుడూ వాటి ఆరోగ్యాన్ని చూస్తూ వుండాలి. వాటి బాధల్ని అర్థం చేసుకుంటూ వుండాలి. అవి ప్రాణంతో వున్న పనిముట్లు కాబట్టి, వాటిని ఎలా చూడాలో అలా చూడాలి. అంతేగానీ, జంతువులు శ్రమ చేస్తాయి - అని అర్థం చేసుకోకూడదు. శ్రమ అనేది, మనుషులదే; పనిముట్లది కాదు. మనుషులు శ్రమలు చేసేటప్పుడు, జంతువుల్ని ఉపయోగిస్తే, ఆ విషయం గురించి మార్క్సు ఏం చెపుతున్నాడో చూడండి: ★

---

★ "శ్రమని, మనం, 'మానవ శ్రమ' గానే భావిస్తాం. ఒక సాలీడు చేసే పని, నేత గాడు చేసే పని లాగే కన్పిస్తుంది. తేనెటీగ తన తేనె తుట్టెని, వాస్తు శిల్పి సైతం సిగ్గుపడేలా నిర్మించుకుంటుంది. అయితే వాస్తు శిల్పి, వాస్తవంగా తను, కట్టడాన్ని నిర్మించడానికి ముందే దాన్ని ఊహలో నిర్మిస్తాడు. ప్రతి శ్రమ ప్రక్రియ చివరా కలిగే ఫలితం, ప్రారంభంలోనే కార్మికుని ఊహలో ఉంటుంది. అతను, పని చేసే పదార్థాన్ని మార్చడం మాత్రమే గాక, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాడు."

[ పక్షులూ, జంతువులూ, తమ కోసం ఎలాంటి నిర్మాణాలు చేసుకున్నా, ఎలాంటి చర్యలు చేసుకున్నా, అవి, 'శ్రమలు' అనే అర్థంలోకి రావు - అని చెపుతున్నాడు మార్క్సు. 'శ్రమ' ని, మానవ శ్రమగానే భావిస్తాం - అని మార్క్సు అన్నది చూడండి. 'శ్రమ' అనే అర్థం మనుషులు చేసేదానికే. మానవులు చేసే కొన్ని రకాల చర్యలే, శ్రమలు. ]

"శ్రమలో యే కొద్దిపాటి అభివృద్ధి జరిగినా, వెంటనే దానికి, ప్రత్యేకంగా తయారు చేసిన పరికరాలు అవసరమవుతాయి. అందువల్ల అత్యంత ప్రాచీనమైన గుహల్లో మనకి రాతి పరికరాలూ, ఆయుధాలూ, కన్పిస్తాయి. మానవ చరిత్రలోని అత్యంత ప్రథమ దశలో, పెంపుడు జంతువులు కన్పిస్తాయి. ప్రత్యేకంగా తయారు చేసిన రాళ్ళూ, కొయ్యా, యెముకలూ, గుల్లలూతో పాటు ప్రత్యేక లక్ష్యంతో పెంచబడి, మార్పుకి గురైన జంతువులు కూడా శ్రమ పరికరాలుగా వ్యవహరిస్తాయి."

---

( పేజీ 162, 164, మార్క్సు పెట్టుబడి. మొదటి సంపుటం. విశాలాంధ్ర, 1996. )

మనుషులు శ్రమలు చేసేటప్పుడు జంతువుల్ని ఉపయోగిస్తే, వాటిని మార్క్సు, "శ్రమ పరికరాలు" గా చెపుతున్నాడు. ఆ శ్రమ పరికరాలు ఎలా తయారవుతాయంటే, "ప్రత్యేక లక్ష్యంతో పెంచబడి, మార్పుకి గురైన జంతువులు" అన్నాడు. మనుషులు పొలాలు దున్నే పనిలో జంతువు ఎలా ఉపయోగపడాలో, మనుషులు బండి తోలే పనిలో జంతువు ఎలా ఉపయోగపడాలో, ఆ రకంగా, మనుషులు చెయ్యవలసిన శ్రమల్ని బట్టి, జంతువుల్ని మనుషులు తయారుచేస్తారు. జంతువులు, ఆ రకం కదలికలతో నడుస్తాయి. - 'కాపిటల్' లో, పేరా పేరాకీ, జ్ఞానవంతమైన, చారిత్రకమైన, శ్రమ సిద్ధాంతమైన విషయాలు అనేకం తెలుస్తాయి. ★

**15.** యుద్ధాలు ఎందుకు జరుగుతాయి? అవి అవసరమా?

**జ :** దోపిడీదారులకే అవి అవసరం. దోపిడీ ఆస్తుల్ని నిలుపుకోవడానికీ, పెంచుకోవడానికీ.

**16.** యుద్ధాల్ని పూర్తిగా తీసివెయ్యగలమా?

**జ :** దోపిడీ సంబంధాల్నీ, దోపిడీ ఆదాయాల్ని తీసివేస్తే, యుద్ధాల్ని ఎందుకు తీసివెయ్యలేము? అప్పుడు యుద్ధాలతో ఎవరికి అవసరం వుంటుంది?

**17.** పెట్టుబడిదారీ విధానం పోటీలతో, యుద్ధాలతో, చెడ్డదిగానే కనపడుతోంది. అయితే, వెనకటి కాలాలే మంచివా?

**జ :** వెనకటి కాలాల్లో శ్రమ దోపిడీ లేదా?అక్కడ రాజుల యుద్ధాలు లేవా? పైగా అక్కడ బానిసత్వాలు కూడా! అవే కావాలా మళ్ళీ? మానవ సంబంధాలు తప్ప కుండా మంచి వేపే నడుస్తున్నాయి. కానీ, ఇప్పటి దాకా దోపిడీ స్వభావంలో మార్పు లేదు. ఆ మార్పే జరగాలి.

**18.** ఏ ఉత్పత్తి తయారీకైనా, ఏ శ్రమ తయారీకైనా, అయ్యే ఖర్చులు ఏవి?

**జ :** (1) ఉత్పత్తి సాధనాల ఖర్చూ, (2) ఆ కొత్త ఉత్పత్తిని తయారుచేసే మనుషుల కొత్త శ్రమ ఖర్చూ - ఈ రెండే.

**19.** శ్రమల్లో ప్రధానమైన తేడాలు ఏమిటి?

**జ :** శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ.

**20.** శారీరక శ్రమలకూ, మేధా శ్రమలకూ, వాటి విలువల్లో తేడాలు వుంటాయా? ఉంటే ఎందుకు?

**జ :** విలువల్లో తేడాలు వుంటాయి. కారణం, వాటి తయారీలలో అయ్యే ఎక్కువ తక్కువ ఖర్చుల్ని బట్టీ, కాలాల్ని బట్టీ.

**21.** 'డబ్బు' అంటే? అది ఏం వస్తువు?

**జ :** సమాజంలో వున్న సమస్త వస్తువులతోటీ మారే హక్కు గల వస్తువే డబ్బు. అది బంగారం. అది, ఏ ఉపయోగపు విలువా లేకుండా, మారకం విలు వతో మాత్రమే వుండి, ఇతర వస్తువుల విలువల్ని కొలవగలిగే వస్తువు.

**22.** 'కాయితం డబ్బు' అంటే?

**జ :** నిజం డబ్బు అయిన బంగారానికి బదులుగా చలామణీలో తిరిగే ప్రతినిధి, కాయితం డబ్బు.

**23.** ఒక కుండని ఇచ్చి, 2 రూపాయలు తీసుకుంటే, ఆ కుండకీ, ఆ డబ్బుకీ, ఏమిటి సంబంధం?

**జ :** అది, 'విలువ సంబంధం'. 2 రూపాయల్లో ఎంత విలువ వుందో, అంత విలువ ఆ కుండకి వుందని, ఆ డబ్బు చెపుతోంది.

**24.** కుండకి 2 రూపాయల విలువ వుందని డబ్బు చెప్పినప్పుడు, 2 రూపాయ లకి కుండతో సమానమైన విలువ వుందని కుండ చెప్పగలదా?

**జ:** చెప్పగలదు. డబ్బు విలువని కొలవాలంటే, డబ్బుని డబ్బుతోనే కొలవడం కుదరదు. అలా కొలిస్తే డబ్బు విలువ కనపడదు. కాబట్టి, డబ్బు విలువని డబ్బు కాని వస్తువులే చెపుతాయి. ఒకప్పుడు, 2 రూపాయలకి, 1 కుండ వచ్చే దనుకుందాం. ఆ తర్వాత, కుండ విలువ ఏమీ మారకపోయినా, 2 రూపాయ లకి, ఆ కుండ రావడం లేదనుకుందాం. అంటే, డబ్బు విలువ తగ్గిందని అర్థం. ఆ రకంగా, డబ్బు కాని వస్తువులే డబ్బు విలువని చెపుతాయి.

**25.** 'విలువ' అంటే? 'ధర' అంటే?

**జ:** 'విలువ' అంటే, శ్రమ కాలం అని చూశాం కదా? ఆ శ్రమ కాలాన్ని డబ్బు లెక్కతో కొలిస్తే, అది 'ధర'.

**26.** 'మారకం' అంటే, అమ్మడమా, కొనడమా?

**జ:** మారకంలో, రెండూ కలిసి జరుగుతాయి. కుండకీ, చెప్పుల జతకీ, మారకం జరిగితే, రెండు వేపుల వాళ్ళూ, తమ వస్తువుని అమ్మడమూ, ఇంకో వస్తువుని కొనడమూ, ఆ 2 పనులూ కలిసే ఒకే సమయంలో చేస్తారు.

**27.** డబ్బు విధానం వల్ల ఏదైనా మార్పు వుందా?

**జ:** డబ్బు 1 మారకాన్నే, 2 మారకాలుగా విడదీస్తుంది. కుండని ఇచ్చి డబ్బు తీసుకుంటే, అది కుండని అమ్మడం. డబ్బు ఇచ్చి కుండని తీసుకుంటే, అది కుండని కొనడం.

**28.** డబ్బు విధానం, అవసరమైనదేనా? లేకపోతే, పాత కాలపు మారకాల పద్ధతే మంచిదా?

**జ:** డబ్బు విధానం, మారకాల్ని చాలా తేలిక చేస్తుంది. ఆ అవసరాల కోసం అది మంచిదే.

**29.** డబ్బు విధానం వల్ల ఏవైనా నష్టాలు వున్నాయా?

**జ:** నష్టాలు, 'డబ్బు విధానం' వల్ల కాదు. శ్రమ సంబంధాలు ఎలా వుండాలో అలాగే వుంటే, డబ్బు విధానం వల్ల ఏమీ నష్టం వుండదు. శ్రమ సంబంధాల్లోకి 'అన్యాయం' అనే తప్పు ప్రవేశిస్తే, అది, డబ్బు విధానాన్ని కూడా పాడు చేస్తుంది. తప్పు, డబ్బు విధానానిది కాకపోయినా, డబ్బు ద్వారా కొలతలు కొల వడం సహజమైన పద్ధతి కాదు. దాని ద్వారా అస్పష్టతలు చాలా వుంటాయి.

**30.** శ్రమ సంబంధాల్లో అన్యాయం ఎలా ప్రవేశిస్తుంది? శ్రమ సంబంధాలు, మారకాల వల్లనే ఏర్పడతాయి. ఆ మారకాలు, సమాన విలువల మధ్యనే జరుగుతాయి. ఇక అన్యాయం ఎలా, ఎక్కడ ప్రవేశిస్తుంది?

**జ:** అసలు మారకాల పద్ధతే మారిపోయి, కొందరు మనుషులు శ్రమలు

చెయ్యడమే మానివేసి, ఇతరుల శ్రమని లాక్కుని బతికే శ్రమ దోపిడీ పద్ధతి ప్రారంభమైతే, అదీ అన్యాయం. అన్యాయం అలాగే ప్రవేశించింది.

**31.** శ్రమ దోపిడీ, ఎప్పుడు ఎలా ప్రారంభమైంది?

**జ :** వేల సంవత్సరాల కిందటే కొందరు మనుషులు బానిసలుగా, కొందరు మనుషులు యజమానులుగా, అయ్యారు. యజమానులు శ్రమలు చెయ్యరు. యజమానులకు కూడా కావలసిన మొత్తం శ్రమలు బానిసలే చేస్తారు. శ్రమ దోపిడీ అలా ప్రారంభమైంది.

**32.** యజమానీ బానిస సంబంధమూ,
యజమానీ శ్రామిక సంబంధమూ, రెండూ ఒకటేనా?

**జ :** మొదటి రకంలో, బానిసలు, యజమాని ఆస్తి. రెండో రకంలో, శ్రామికులు, యజమాని ఆస్తి కాదు. ఆ రెంటికీ ఆ తేడా వుంది. కానీ, శ్రమ దోపిడీ విషయంలో రెండూ ఒకటే.

**33.** యజమాని, శ్రామికుల్ని దోపిడీ ఎలా చేస్తాడు? వాళ్ళ జేబుల్లో నించీ, సంచుల్లో నించీ, డబ్బు లాక్కుంటాడా?

**జ :** అలా కాదు. యజమాని, శ్రామికులు చేసే ఉత్పత్తుల ద్వారానే, వారి శ్రమల ద్వారానే బతుకుతాడు. అదే, వాళ్ళ శ్రమని లాక్కోవడం.

**34.** యజమానులకు, దోపిడీ చేసే అవకాశాలు ఎలా వుంటాయి? దానికి శ్రామికులు ఎలా ఒప్పుకుంటారు?

**జ :** వేల సంవత్సరాల కిందటే, భూమి నంతా కొందరే తమ ఆస్తిగా ఆక్రమించి వున్నారు. తమని సమర్థించే, తమ ప్రభుత్వాన్ని పెట్టుకున్నారు. పోలీసులే వాళ్ళ అండ. అవే వాళ్ళ అవకాశాలు.

**35.** యజమాని, శ్రామికుడికి ఇచ్చే జీతం 5. అది, శ్రామికుడి 'శ్రమకి వున్న విలువ'. అంతేనా?

**జ :** కాదు. జీతమే శ్రమ విలువ అయితే, ఆ శ్రమ ద్వారా యజమానికి అందేదేమీ వుండదు. జీతం కన్నా శ్రమ విలువ ఎక్కువగా వుంటుంది.

**36.** సరుకు ధరని యజమానులు నిర్ణయించే పద్ధతి ఏమిటి?

**జ :** ఖర్చులూ + అదనమూ.

**37.** స్వతంత్ర ఉత్పత్తిదారులు, తమ సరుకుల ధరల్ని నిర్ణయించే పద్ధతి ఏమిటి?

**జ :** వ్యాపారుల పద్ధతే. ఖర్చులూ + అదనమూ. ఆ అదనం వాళ్ళకే అందుతుంది.

**38.** యజమానులు, శ్రామికుల శ్రమని లాక్కోవడం ఏ పద్ధతిలో జరుగుతుంది?

**జ :** యజమానులు, భూమి కౌళ్ళు, వడ్డీ లాభాలూ - అనే తప్పుడు ఆదాయాలు సంపాదించే పద్ధతిలో.

**39.** ఒక సరుకు విలువ 10. అది, ఏ యే భాగాల నించి చేరినది?

**జ:** (1) ఉత్పత్తి సాధనాల నించీ. (2) కొత్త శ్రమ నించీ.

**40.** యజమానీ శ్రామిక సంబంధం, అమ్మే - కొనే సంబంధమేనా?

**జ:** అస్సలు కాదు. అమ్మే - కొనే సంబంధంలో, ఒకరి శ్రమ ఒకరికి మారాలి. ఇద్దరు స్వతంత్ర ఉత్పత్తిదారుల మధ్య మారకం జరిగినప్పుడే అది అమ్మే - కొనే సంబంధం అవుతుంది. లేదా, సమానమైన విలువల మధ్య మారకాలు జరిగినప్పుడే. యజమానీ శ్రామిక సంబంధంలో, యజమాని నించి శ్రామికుడికి వచ్చే వస్తువు గానీ, శ్రమ గానీ, ఏదీ వుండదు.

**41.** యజమాని, శ్రామికుడికి జీతం డబ్బు ఇస్తాడు. ఆ డబ్బు, యజమాని శ్రమ కాదా?

**జ:** కాదు. అది, శ్రామికుడి శ్రమే. శ్రామికుడి శ్రమ విలువలో నించి చిన్న ముక్కే శ్రామికుడికి జీతంగా అందుతుంది. యజమానీ శ్రామికుల మధ్య జరిగేది, శ్రామికుడి అదనపు శ్రమని యజమాని దోపిడీ చేసే సంబంధం. అది అమ్మే - కొనే సంబంధం కాదు.

**42.** చిన్న స్థాయి యజమానులు కొంత స్వంత శ్రమ చేస్తారు. వాళ్ళు, శ్రామికులకు తమ శ్రమలో నించే జీతాలు ఇస్తే, అది అమ్మే - కొనే సంబంధం కాదా?

**జ:** అప్పుడు, జీతం ఇవ్వడం వరకే అది అమ్మే - కొనే సంబంధం. యజమాని, జీతం ఇచ్చి, ఆ విలువని వెనక్కి తీసుకుంటాడు. అది, అంత వరకే జరిగి ఆగదు. ఆ జీతం విలువని వెనక్కి తీసుకోవడంతో పాటు, శ్రామికుడి నించి అదనపు శ్రమని కూడా తీసుకుంటాడు. ఈ ఉదాహరణలో, యజమాని ఇచ్చేది తక్కువా, తీసుకునేది ఎక్కువా. కాబట్టి, యజమానీ శ్రామిక సంబంధంలో ఎక్కడైనా శ్రమ దోపిడీ వున్నట్టే. అది అమ్మే - కొనే మనుషుల సమాన సంబంధం అయితే, వాళ్ళు యజమానీ శ్రామికులు ఎలా అవుతారు?

**43.** యజమానీ శ్రామిక సంబంధంలో, ఒక సరుకు వల్ల, యజమానికి అందేది ఏ భాగంలో నించి?

**జ:** 'ఉత్పత్తి సాధనాల' భాగంలో నించి ఎవరికీ అందేది ఏమీ వుండదు. ఎవరికి అందినా, 2 వ భాగంలో నించే అందాలి. అంటే, కొత్త శ్రమ భాగంలో నించి.

**44.** యజమానీ శ్రామిక సంబంధంలో, సరుకు విలువ ఎన్ని భాగాలుగా, ఏ పేర్లతో వుంటుంది?

**జ:** 3 భాగాలుగా వుంటుంది.

(1) ఉత్పత్తి సాధనాల భాగం. (2) శ్రామికులకు అందే కనీస పోషణ భాగం. (3) యజమానికి అందే, 'అదనం' భాగం. ఈ అదనం, అదనపు శ్రమగా, లేదా అదనపు ఉత్పత్తిగా, లేదా అదనపు డబ్బుగా - ఇలా ఏ రకంగా అయినా వుంటుంది.

**45.** ఉత్పత్తి తయారీ కోసం జరిగే 2 రకాల ఖర్చుల మీదా, కొంత అదనాన్ని కలిపితే, అది నేరమా?

**జ :** ఆ కలిపిన అదనం కూడా ఆ శ్రమ చేసిన మనుషులకే అందితే అది నేరం కాదు. ఆ అదనం, యజమానికి పోతే, అది శ్రమ దోపిడీ అనే నేరం. లేదా, ఇద్దరు స్వతంత్ర ఉత్పత్తిదారుల మధ్య మారకం జరిగేటప్పుడు ఒక వ్యక్తి, ఎదటి వ్యక్తి నించి మోసం ద్వారా అసలు విలువ కన్నా అదనాన్ని లాగితే, అది మారకంలో జరిగే నేరం. లేదా, వర్తకుడు, సరుకుని అమ్మేటప్పుడు, అసలు ధర కన్నా ఎక్కువని తీసుకుంటే, అది కూడా మారకంలో జరిగే నేరం.

**45.** 'వేతన నిధి' అంటే?

**జ :** ఒక దేశంలో, వేతన శ్రామికులందరికీ అందే వేతనాల మొత్తానికి యజమానులు పెట్టిన పేరు అది. దానికి నిజం పేరు అయితే, 'శ్రమ శక్తి విలువ'. అది, ఆ శ్రామికుల 'శ్రమ విలువ' కాదు.

**47.** 'శ్రమ విలువ' కీ, 'శ్రమ శక్తి విలువ' కీ సంబంధం ఏమిటి?

**జ :** 'శ్రమ విలువ' కన్నా, 'శ్రమ శక్తి విలువ' తక్కువగా వుండవచ్చు. లేదా, ఆ రెండూ సమానంగా కూడా వుండవచ్చు. యజమానీ శ్రామిక సంబంధంలో, అవి సమానంగా వుండవు. దోపిడీ లేని చోట అవి సమానంగా వుంటాయి.

**48.** వేతన నిధికి, అదనపు విలువ చేరితే?

**జ :** అది, శ్రామికుల శ్రమ విలువ.

**49.** స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమ విలువ, 2 భాగాలుగా చీలుతుందా?

**జ :** వాళ్ళు కూడా వడ్డీలు చెల్లించవలసి వస్తే, వారి శ్రమ విలువలో నించి కొంత భాగం 'అదనం' అవుతుంది. అప్పుడు ఆ శ్రమ విలువ 2 భాగాలు అయినట్టే.

**50.** 'వర్గాలు' అంటే?

**జ :** శ్రమ దోపిడీ వల్ల, మనుషుల్లో ఏర్పడిన శత్రు బృందాలే వర్గాలు. దోపిడీ చేసే వాళ్ళంతా ఒకే వర్గం. దోపిడీకి గురి అయ్యే వాళ్ళంతా ఇంకో వర్గం. శ్రామికుల వర్గానికి, యజమానుల వర్గం, శత్రువు.

**51.** ఆ శత్రుత్వం ఎలా పోవాలి?

**జ :** అది ఎలా ఏర్పడిందో అర్థమైతే, అది ఎలా పోవాలో అర్థం అవదా? శ్రామికుల లాగే, యజమానులందరూ కూడా శ్రమలు చేస్తే, దోపిడీ ఆదాయాల పద్ధతి లేకపోతే, యజమానీ శ్రామిక సంబంధాలు లేకపోతే, ఇంకా శత్రుత్వాలు ఎలా వుంటాయి?

**52.** యజమాని శ్రమే చెయ్యడు. శ్రామికుడే శ్రమ చేస్తాడు. శ్రమ చెయ్యని వాడికీ, శ్రమ చేసే వాడికీ ఏర్పడే సంబంధం, 'శ్రమ సంబంధం' అవుతుందా? ఆ

సంబంధాన్ని, శ్రమ సంబంధం అనవచ్చా?

**జ:** అనవచ్చు. ఇద్దరి శ్రమలకూ మారకాలు జరిగితే, అది ఒక పద్ధతి. యజమాని దగ్గిరే ఉత్పత్తి సాధనాలు వుండి, ఆ కారణంగా వాడు యజమాని అయ్యి, శ్రామికుడి శ్రమ, యజమానికి పోతూ వుంటే, అదీ శ్రమ సంబంధమే. శ్రమని దోచడానికి ఏర్పడే సంబంధం.

**53.** 'భూస్వామ్య సమాజం' అంటే?

**జ:** సమాజంలో తయారయ్యే మొత్తం ఉత్పత్తులు, (1) భూమి ద్వారా పండే పంటలూ, (2) చేతి వృత్తుల వస్తువులూ. ఇవి మాత్రమే వుంటాయి. యంత్రాల ప్రవేశం ఏదీ వుండదు.

**54.** 'పెట్టుబడి' అంటే?

**జ:** ఉత్పత్తి సాధనాలే. శ్రామికులకు అవి లేకే పెట్టుబడిదారుణ్ణి పని ఇమ్మని అడుగుతారు. యజమాని దగ్గిర అవి వుండడం వల్లే వాడు యజమాని అవుతాడు.

**55.** 'పెట్టుబడిదారీ విధానం' అంటే?

**జ:** పెట్టుబడి, లాభాన్ని సంపాదించే విధానం.

**56.** లాభం అంటే, అదనపు విలువేనా?

**జ:** కాదు. అదనపు విలువలో లాభం ఒక్కటే వుండదు. ఇంకా కొన్ని వుంటాయి. కానీ, లాభం అనేది, అదనపు విలువ అంతటినీ క్లుప్తంగా చెప్పే పేరు.

**57.** శ్రామిక వర్గం నించీ కొంత శ్రమని యజమానులు లాగే విధానం, వెనకటి కాలం నించీ కూడా వుంది కదా? ఆ లక్షణాన్ని పెట్టుబడిదారీ విధానంలోనే వున్న ప్రత్యేక లక్షణంగా ఎందుకు అనాలి?

**జ:** శ్రమ దోపిడీ, బానిస యజమానుల కాలం నించీ కూడా వుంది. అదే క్రమంగా పెట్టుబడిదారీ విధానం దాకా వచ్చింది. మనం ఇప్పుడు పెట్టుబడిదారీ విధానంలో వున్నాం కాబట్టి, 'ఇది మంచి సమాజం కాదు' అని అర్థం చేసుకోవడానికి, దీనికి శ్రమ దోపిడీ లక్షణం వున్నట్టు చెప్పుకుంటాం. ఈ విధానంలోనే శ్రమ దోపిడీ, స్పష్టంగా విలువ లెక్కల్లో కనపడుతుంది. వెనకటి సమాజాల్లో లేని కొన్ని ప్రత్యేక లక్షణాలు కూడా దీనికి వున్నాయి.

**58.** 'వాడకందారులు' అంటే?

**జ:** ఉత్పత్తుల్నీ, శ్రమల్నీ, వాడే వాళ్ళు. ఆ వాడడం, 'ఉత్పత్తి సాధనాలు' గా వాడినాగానీ, 'పోషణ వస్తువులు' గా వాడినాగానీ.

**59.** వర్తకులు వాడకందారులేనా?

**జ:** కాదు. వర్తకులు, వస్తువుల్ని కొనేది, మళ్ళీ అమ్మడానికే. వాడడానికి కాదు. అందుకే వాళ్ళు వాడకందారులు కారు. వాళ్ళు కూడా వస్తువుల్ని వాడినప్పుడు వాడకందారులే.

**60.** పెట్టుబడిదారీ విధానంలో హాని ఏమిటి?

**జ:** అసలు హాని, శ్రమ దోపిడీయే. ఇది, సరుకుల ఉత్పత్తి విధానం కాబట్టి, ఇక్కడ పోటీలు, ప్రత్యేక నీచ లక్షణం. సరుకుల అమ్మకాల కోసం, ఇది ప్రపంచ దేశాల్ని ఆక్రమించడం కోసం, నిరంతరం యుద్ధాలు పుట్టిస్తూ వుంటుంది. ఆ యుద్ధాల్లో, ఆయుధాల్ని అమ్ముకుంటూ వుంటుంది. దీని నీచ లక్షణాలు ఇంకా ఎన్నో వున్నాయి.

**61.** ఎగుమతులూ, దిగుమతులూ, అంటే?

**జ:** ఇవి దేశాల మధ్య జరిగే సరుకుల అమ్మకాలు. ఈ దేశం, తన సరుకుల్ని ఇంకో దేశానికి అమ్మితే, అది, ఈ దేశం నించి ఎగుమతీ, ఆ దేశానికి దిగుమతీ. అలాగే, ఆ దేశం నించి ఈ దేశానికీ.

**62.** 'మారకం రేటు' అంటే?

**జ:** వేరు వేరు దేశాల డబ్బు సంబంధం. ఏ దేశపు డబ్బు విలువ అయినా, బంగారం విలువని బట్టి ఏర్పడుతుంది. 1 రూపాయి వెనక ఎంత బంగారం? 1 డాలర్ వెనక ఎంత బంగారం? ఒక వేళ, రూపాయి వెనక వున్న బంగారం కన్నా, డాలరు వెనక వున్న బంగారం రెట్టింపు బరువు గలది అయితే, అప్పుడు, 1 డాలరు = 2 రూపాయలు అవుతుంది. అదే, ఆ వేరు వేరు డబ్బుల మారకం రేటు. సరుకుల అమ్మకాలు జరిగేటప్పుడు, ఒకరి డబ్బు ఒకరికి రావాలి కదా? లెక్కలు చూసుకుంటారు. ఇంకా ఇవ్వదగ్గ శేషం వుంటే, దాన్ని తీర్చడానికి మళ్ళీ సరుకులు ఇవ్వాలి. కానీ, ఏ దేశం అయితే, ఇంకా బాకీ పడి వుందో, దాని డబ్బు విలువ కొంత తగ్గుతుంది. అంటే, అక్కడ సప్లై - డిమాండ్ల బేరాలు అవి. ఒక సారి నిర్ణయమైన మారకం రేటు, మారకూడదు. కానీ, పెట్టుబడిదారీ వ్యాపారాల్లో అన్నీ తప్పుడు దారులే.

**63.** ఒక వస్తువు తయారీకి పట్టే మొత్తం శ్రమ కాలం, గత కాలాల్లో కన్నా, పెట్టుబడిదారీ విధానంలో తగ్గుతుందా, పెరుగుతుందా? కారణం?

**జ:** తగ్గుతుంది. కారణం, పోటీల వల్ల, ఉత్పత్తి శక్తులు పెరిగి, వస్తువుకి పట్టే శ్రమ కాలం తగ్గుతుంది.

**64.** ఉత్పత్తి శక్తులు పెరగడం మంచిదా, చెడ్డదా?

**జ:** ఒక శ్రమ చెయ్యడంలో ఉత్పత్తి శక్తి పెరిగితే, వస్తువుల్ని తయారు చెయ్యడంలో శ్రమ తగ్గుతుంది. శ్రమ చెయ్యడం తేలిక అవుతుంది. శ్రమని తగ్గించడానికి అది మంచిదే. కొన్ని ఉత్పత్తి శక్తుల పెరుగుదల, మానవ దేహాల్లో ఆరోగ్య లక్షణాల్ని సర్వ నాశనం చేస్తుంది.

**65.** భూస్వామి లేకపోతే భూమిని ఎవరు ఇస్తారు? పంటలు ఎలా పండుతాయి?

**జ:** పంటలు పండడానికి, భూమీ, పని చేసే మనుషులూ, ఈ రెండే అవసరం గానీ, భూస్వామితో అవసరం లేదు.

**66.** పెట్టుబడిదారీ విధానం దాకా శ్రమ దోపిడీని కనిపెట్టడం ఎందుకు జరగలేదు?

**జ:** అప్పటి దాకా జీతం పద్ధతే లేదు కాబట్టి.

**67.** పెట్టుబడిదారీ సమాజంలో, ప్రధాన వర్గాలు ఏవి?

**జ:** (1) జీతాల శ్రామికుల వర్గమూ, (2) పెట్టుబడిదారులూ - భూస్వాములూ కూడా కలిసి వున్న యజమానుల వర్గమూ.

**68.** పెట్టుబడిదారులు లేకపోతే, పెట్టుబడిని ఎవరు పెడతారు? ఉత్పత్తులు ఎలా వస్తాయి?

**జ:** ఉత్పత్తులు రావడానికి, (1) ఉత్పత్తి సాధనాలూ, (2) మనుషులు పనులు చేసుకోవడాలూ, చాలు! పెట్టుబడి అంటే ఉత్పత్తి సాధనాలే. అవి యజమానులవి కావు. అవి శ్రామికులవే. వాటిని విడి విడి వ్యక్తులు పెట్టనక్కరలేదు. మనుషులందరూ కలిసి డ్యూటీల ప్రకారం పనులు చేసుకుంటే, అన్ని రకాల ఉత్పత్తులూ తయారవుతాయి. అందరికీ ఉద్యోగాలు వుంటాయి.

**69.** భూమికౌలూ - వడ్డీ లాభాలూ, ఏ సందర్భంలోనూ అవసరం లేదా?

**జ:** అస్సలు అవసరం లేదు. ఏ ఉత్పత్తి తయారీకి గానీ, ఏ శ్రమ చేతనవడానికి గానీ, వాటితో సంబంధం వుండదు. అవి లేకుండానే అన్ని పనులూ జరుగుతాయి. అవి, దోపిడీ మార్గాలు మాత్రమే.

**70.** ఉత్పాదక - అనుత్పాదక శ్రమల తేడాలు ఏమిటి?

**జ:** ఉత్పాదక శ్రమ, యజమాని డబ్బుని పెంచుతుంది. అనుత్పాదక శ్రమ, యజమాని డబ్బు ఖర్చుని తగ్గిస్తుంది. ఈ నిర్వచనం పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేకం. దీన్ని ఇంకో రకంగా చెప్పుకుంటే, ఉత్పత్తిని పునరుత్పత్తి చేసే శ్రమ, ఉత్పాదక శ్రమ. ఉత్పత్తిని ఖర్చు చేసే శ్రమ, అనుత్పాదక శ్రమ. ఇది, పెట్టుబడిదారీ విధానానికి కాదు, శ్రమ దోపిడీ లేని సమాజానికి వర్తిస్తుంది.

**71.** మంచి సమాజంలో, ఉత్పాదక శ్రమ మంచిదీ, అనుత్పాదక శ్రమ చెడ్డదీ అనుకోవాలా?

**జ:** కాదు. రెండూ అత్యవసరమైన శ్రమలే. వస్తువుని తయారు చేసుకోవడమూ అవసరమే; దాన్ని వాడుకోవడమూ అవసరమే. వాడుకోవడానికే తయారు చేసుకోవడం. తయారు చేసుకున్నప్పుడు, కొత్త ఉత్పత్తి వస్తుంది. దాన్ని వాడుకున్నప్పుడు, అది ఖర్చయిపోతుంది.

**72.** పెట్టుబడిదారీ విధానంలో నిరుద్యోగం ఎందుకు ప్రారంభమవుతుంది?

**జ:** ఈ విధానంలో, ఎక్కువ లాభం కోసం పోటీలతో ఉత్పత్తి శక్తుల్ని పెంచివేస్తూ వుంటారు. దాని వల్ల, 10 మంది శ్రామికులు చేసే పనిని, అదే కాలంలో 10 కన్నా తక్కువ మంది చెయ్యగలిగే విధంగా మార్పులు జరుగుతాయి. అప్పుడు యజమాని, కొందర్ని తీసివేస్తాడు. ప్రతీ చోటా, ప్రతీ సారీ, ఇదే జరుగుతూ వుంటుంది.

**73.** శ్రమ దోపిడీ లేని మంచి సమాజాన్ని ఊహిస్తే, అక్కడ ఉత్పత్తి శక్తులు పెరగవా? అక్కడైనా, తక్కువ మందితో జరిగే పనిలో ఎక్కువ మంది వుంటారా? అక్కడైనా ఉద్యోగాలు తగ్గి నిరుద్యోగం ఏర్పడదా?

**జ:** మంచి సమాజంలో నిరుద్యోగాలు వుంటే, దాన్ని 'మంచి సమాజం' అనడం ఎందుకు? మనిషికి పని చేసే అవకాశమే లేకపోతే ఆ మనిషి ఎలా బతకాలి? ఒక చోట పని లేకపోయినా, ఇంకో చోట పని ఏర్పడవద్దా? 10 మంది చేసే పనిని, 6 గురే చేసే విధంగా ఉత్పత్తి శక్తి పెరిగితే, 4 గురికి ఉద్యోగాలు పోవలసిందేనా? అందరికీ పని కాలం తగ్గిపోతే, అందరూ పనిలో వుండరా?

**74.** 'సినిమాలు' కూడా సరుకులేనా?

**జ:** ఎందుకు కాదు? అమ్మకం కోసం తయారయ్యేది, ఏ వస్తువు అయినా, ఏ శ్రమ అయినా, ఏ కళ అయినా, సరుకే.

**75.** 'రాజ్యాంగ యంత్రం' అంటే? 'పరిపాలన' అంటే?

**జ:** సమాజంలో యజమానీ శ్రామిక వర్గాలు వున్నప్పుడే, ఏదో ఒక వర్గ ప్రయోజనాల కోసం, ఆ వర్గ రాజ్యాంగ యంత్రం వుంటుంది. యజమాని వర్గం అయితే దోపిడీ చెయ్యడానికీ, శ్రామిక వర్గం అయితే దోపిడీ నించి బైట పడడానికీ. వర్గాలే లేకుండా, అందరూ శ్రమలు చేసే వారుగా సమాన సంబంధాలతో వుంటే, రాజ్యాంగం అక్కరలేదు. అప్పుడు శ్రమ సంబంధాల్ని నిర్వహించుకునే కార్యక్రమమే అవసరమవుతుంది. అది 'పరిపాలన' అవదు. 'పరిపాలన' అంటే, ప్రజలు వేరూ, ప్రజల్ని పరిపాలించే పాలకులు వేరూ, అవుతారు. ఒక మంచి కుటుంబంలో, పరిపాలన వుంటుందా? నిర్వహణే వుంటుంది. శ్రామిక వర్గ పరిపాలనలో, పరిపాలన కింద వున్న జనంలో ఒక నాటి యజమాని వర్గం కూడా వుంటుంది. వర్గాన్ని తీసివెయ్యడానికే అక్కడి పరిపాలన.

**76.** పిల్లలకు శ్రమ దోపిడీని వ్యతిరేకించే భావాలు నేర్పడం ఎలాగ?

**జ:** పాఠశాలల్లో, శ్రమ దోపిడీకీ, వర్గాలకూ సంబంధించిన పాఠాలు, తేలిగ్గా అర్థమయ్యేలా వుండాలి. పిల్లల సంఘాలు వుండాలి.

**77.** బానిస, భూస్వామ్య సమాజాలలో నిరుద్యోగం ఎందుకు లేదు?

**జ:** బానిసకి, యజమాని వుంటాడు. యజమాని దగ్గిర పనిచేసి తీరాలి. కౌలు రైతు, పొలంలో పనిచేసి తీరాలి. ఆ సమాజాల్లో కూడా వృద్ధులైపోయి గానీ, జబ్బులతో గానీ, శ్రమలు చెయ్యలేని వాళ్ళు బిచ్చగాళ్ళయిపోయేవారు.

**78.** 'ఆస్తి' అంటే? 'స్వంత ఆస్తి' అంటే?

**జ:** ఆస్తి అంటే, ఉత్పత్తి సాధనాలే. స్వంత శ్రమతో ఉత్పత్తి సాధనాలు ఏర్పడితే, అది స్వంత ఆస్తి. భూమిని స్వంత శ్రమతో వాడుకోవచ్చు. కానీ అది స్వంత ఆస్తి అవదు.

**79.** కలిమీ - లేమీ ఏమిటి?

**జ:** యజమానీ శ్రామిక సంబంధంలోనే ఇవి వుంటాయి. శ్రామికుల శ్రమ, యజమానికి పోవడం వల్ల అది శ్రామికులకు లేమి (పేదరికం). అది, యజమానికి కలిమి (సిరి సంపదలు). అందరూ స్వంత శ్రమలు చేసే వాళ్ళయితే, అక్కడ పేదరికం గానీ, సిరి సంపదలు గానీ, రెండూ ఏర్పడవు. కలిమీ - లేమీ, వుంటే కలిసే వుంటాయి; పోతే, కలిసే పోతాయి.

**80.** సమాజంలో వున్న డబ్బు ఎవరిది?

**జ:** డబ్బు అనేది, శ్రమ. ఆ శ్రమ ఎవరు చేశారో వాళ్ళదే డబ్బు. శ్రమ చెయ్యని వాళ్ళది కాదు.

**81.** ఒక పెట్టుబడిదారుడికి జీతం నెలకి 6 కోట్లు అయితే, అది 'శ్రమ శక్తి' విలువే కదా? మరి, అతని 'అదనపు విలువ' కూడా అతనికే అందితే, అప్పుడు అతని 'శ్రమ విలువ' ఎన్ని కోట్లు వుండవచ్చు?

**జ:** నిజం శ్రమల లెక్కలైతే వాటిని ఎలాగైనా కనిపెట్టవచ్చు. అబద్దాల్ని లెక్క పెట్టాలంటే, అది ఆ దోపిడీదారుడి ఇష్టం. నెల జీతం 6 కోట్లు అయితే, అది శ్రమ శక్తి విలువే కదా పాపం? దానికి అతని అదనపు విలువ కూడా కలవాలంటే, 6 ని వెయ్యితో గుణించాలి. అలా చేస్తే, అది 6 వేల కోట్లు! అతని నిజం కష్టం, అంత అన్నమాట! నోరు మూసుకుని వినే వాళ్ళు వుంటే, చెప్పే వాళ్ళకి సిగ్గు వుండదు, భయం వుండదు.

**82.** 'సంస్కరణలు' అంటే? 'విప్లవం' అంటే?

**జ:** ఏ సమస్యకైనా మూల కారణం ఒకటి వుంటుంది. ఆ అసలు కారణాన్ని తీసి వేస్తేనే ఆ సమస్య పోతుంది. అలా చేస్తే అది విప్లవం. ఆ కారణాన్ని అలాగే వుంచి, చిన్న చిన్న సర్దుళ్ళు చేస్తే, అవి సంస్కరణలు. వాటి వల్ల ఉపయోగమే వుండదని కాదు. ఆ సంస్కరణలు కూడా సమస్యని తీసివేసే దృష్టితో, ఆ మార్గంలో జరగాలి.

**83.** ఒక సమస్యలో అసలు కారణాన్ని తీసివేస్తే, ఆ కారణమే మళ్ళీ ఏర్పడదా?

**జ:** ఏర్పడనిస్తే ఏర్పడుతుంది. ఏర్పడనివ్వకపోతే ఏర్పడదు.

**84.** అన్ని మతాల్లోనూ దేవుడు వుంటాడు. దేవుడు ఏ వర్గం అవుతాడు?

**జ:** 'వర్గం' అనేది, మనుషులకు సంబంధించిందే. దేవుడు మానిషేనా? మనిషి లాగే వుంటాడు కాబట్టి, మనిషే అనుకుందాం. శ్రమ చేస్తాడా లేదా అనేదాన్ని బట్టే కదా వర్గ విభజన? దేవుడు శ్రమలు చేస్తాడా లేదా? రాముణ్ణీ, కృష్ణుణ్ణీ తీసుకుంటే, వాళ్ళు రాజులే. రాజులు శ్రమలు చేస్తారా? మనుషుల్లో దోపిడీ వర్గానికి ఒక రకం దేవుళ్ళూ, శ్రామిక వర్గానికి ఇంకో రకం దేవుళ్ళూ వుంటారు. శ్రామిక దేవుళ్ళు పోలేరమ్మా, గంగానమ్మా లాంటి పేర్లతో వుంటారు. వాళ్ళు కూడా శ్రమలు చేసే వాళ్ళుగా వుండరు కదా? కాబట్టి, దేవుళ్ళకు వర్గాలు వర్తించవు. వర్గాలు నిజమే గానీ, దేవుళ్ళు నిజం కాదు గదా?

**85.** క్లుప్తంగా చెప్పుకుంటే, 'మంచి సమాజం' ఎలా వుండాలి?

**జ:** దోపిడీ సమాజంలో వున్న దోపిడీ సంబంధాలూ, దోపిడీ లక్షణాలూ, ఏవీ లేని విధంగా.

**86.** మంచి సమాజం ఏర్పడితే, అది అలాగే సాగుతుందా?

**జ:** సాగకపోతే, తప్పులు బయల్దేరుతూ వుంటే, అప్పుడు జరగాల్సిన మార్పు, మళ్ళీ మంచి సమాజం కోసమే. అది పాడైందంటే, మళ్ళీ బాగుపడాల్సిందే. మంచి సమాజం అంటే, దాన్ని అలాగే స్థిర పరిచే లక్షణాలు ఏర్పడతాయి క్రమంగా. సమాజానికి ఆరోగ్యం ఏర్పడడం అది. ఎప్పుడైనా అనారోగ్యం కలిగితే, మళ్ళీ ఆరోగ్యం రావలసిందే కదా?

**87.** 'కాపిటల్' రచనలో, ఎంగెల్స్ చెయ్యి ఏమైనా వుందా?

**జ:** సిద్ధాంత విషయాల్ని ఇద్దరూ కలిసి చర్చించుకునేవారు. 'అదనపు విలువ' విషయం మీద ఇద్దరిదీ ఒకే అభిప్రాయం. 'కాపిటల్' రచన అంతా మార్క్సుదే. కానీ, ఆయన పోయిన తర్వాత, చివరి భాగాల్ని ఎంగెల్సే అచ్చుకి సిద్ధం చేశాడు. అక్కడక్కడా సర్దుళ్ళూ, ఫుట్ నోట్లూ అవీ చెయ్యడానికి చాలా పని జరిగింది.

**88.** 'మంచితనం' అంటే ఏమిటి?

**జ:** దీనికి న్యాయమైన అర్థం ఒకటి వుంటుంది; సమాజంలో వున్న శ్రమ సంబంధాల స్వభావాన్ని బట్టీ, దాని చట్టాల్ని బట్టీ ఏర్పడే అర్థం ఒకటి వుంటుంది. ఒక మనిషి ఇంకో మనిషి మీద పెత్తందారుగా వుండకుండా, రెండో మనిషికి హాని చెయ్యకుండా వుండడం, న్యాయమైన మంచితనం. కానీ, బానిస సమాజంలో, ఒక మనిషి ఇంకో మనిషిని కొన్నా, అమ్మినా, చంపినా, అది అక్కడి న్యాయమే, అక్కడి మంచితనమే. సింహాసనం మీద రాజూ మంచివాడే; ఉరి తీసే తలారీ మంచివాడే! ఈ నిర్వచనాలు అక్కడి సంబంధాల్ని బట్టే.

**89.** మార్క్సిజాన్ని ఒక తత్వ శాస్త్రంగా చూస్తే, అది ఏం చెపుతుంది?

**జ:** సమానత్వ మానవ సంబంధాల్ని. 'ఉపయోగపు విలువ' దృష్టిని! సహజత్వ దృష్టిని! హేతుబద్ధ దృష్టిని!


**90.** 'కాపిటల్' చదివితే, ఇతర పుస్తకాలతో అవసరం వుండదా?

**జ:** 'కాపిటల్' ద్వారా సమాజంలో, నిన్నా, నేడూ వున్న, రేపు వుండవలసిన, శ్రమ సంబంధాల సంగతులు తెలుస్తాయి. ప్రకృతి సైన్సులు ఇందులో ఎలా తెలుస్తాయి? అసలు 'పుస్తకాలు చదివే' అలవాటు లేకపోతే ఏ కొత్త పుస్తకం చదవడం అయినా ఇబ్బంది అవుతుంది. ఏ పుస్తకం దొరికినా ఒకసారి చదవాలి.

★

# మార్క్స 'కాపిటల్' పరిచయం

## 1వ సంపుటం




### 1. సరుకులూ - డబ్బూ

**1.** సరుకుకి గల 2 లక్షణాలు, **2.** ' సరుకు'ని తయారుచేసే 'శ్రమ' కు గల 2 లక్షణాలు,
**3.** ' విలువ'కి రూపం,
**4.** ' విలువ రూపం అభివృద్ధి', **5.** డబ్బు రూపం,
**6.** సరుకుల మాయ!
**7.** సరుకుల చలామణీ


### 2. పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం

**1.** లాభం, **2.** 'శ్రమ శక్తి' విలువ, **3.** శ్రమ క్రమం - ఉత్పత్తి క్రమం, **4.** స్థిర పెట్టుబడీ - అస్థిర పెట్టుబడీ, **5.** ఫిక్సెడ్ పెట్టుబడీ - చలామణీ పెట్టుబడి, **6.** అదనపు విలువ రేటు (దోపిడీ స్థాయి) **7.** 'ఉత్పత్తి సాధనాల విలువ' బదిలీ , **8.** ఉత్పత్తి సాధనాలు ఎవరివి? **9.** సరుకు 'విలువ' భాగాల్ని సరుకు ' పరిమాణం' భాగాలుగా చూడడం, **10.** పని దినం.

### 3. పెట్టుబడిదారీ పునరుత్పత్తి క్రమం

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ, దాని రూపాలూ

మాన్యుఫాక్చర్ ఉత్పత్తి, యంత్రాలూ, భారీ పరిశ్రమా,
పెట్టుబడికి శ్రమ లోబడడం, ఉత్పాదక శ్రమా - అనుత్పాదక శ్రమా
పెట్టుబడి విస్తరణ, ఇంత వరకూ చదివిన దాని సారాంశం ★




# మార్క్స 'కాపిటల్' పరిచయం

## 2వ సంపుటం

### 1. పెట్టుబడిదారీ చలామణీ క్రమం

1. చలామణీ ఖర్చులు
పెట్టుబడిదారీ ధర
'జీతాల' గురించి
చలామణీ క్రమం
వేరు వేరు దేశాల
డబ్బులు
'జనరల్ లాభం రేటు'
తగ్గుతూ పోయే ధోరణి

### 2. పెట్టుబడిదారీ పంపిణీ సంబంధాలు

**1.** వర్తక పెట్టుబడి, **2.**వడ్డీ పెట్టుబడి, **3.** వాటాలు (షేర్లు), **4.**'సహజ' ఆర్థిక విధానమూ, 'డబ్బు' ఆర్థిక విధానమూ, 'అప్పు' ఆర్థిక విధానమూ
**5.** భూమి కౌలు, **6.** సామ్రాజ్యవాదం, **7.** సంక్షోభాలు, **8.** వర్గాలు
**9.** కార్మికులకు మార్క్స ప్రశ్నలు


### 3. వర్గ రహిత సమాజం దిశగా

**1.** యుగ యుగాల మకిలతో వున్న కార్మిక వర్గం, **2.** నూతన సమాజంలో రద్దులు,
**3.** నూతన సమాజపు ధర, **4.** మార్క్సిజం 'ఆర్థిక శాస్త్రమే కాదు 'తత్వ' శాస్త్రం కూడా!

### 4. కొన్ని విషయాలు

**1.** మార్క్సిజం మీద కొన్ని విమర్శలు, **2.** రష్యా, చైనాల మాటేమిటి?
**3.**మార్క్సిజం అంటే చాలదా? **4.**కార్మిక జనాభా 'కాపిటల్'ని ఎలా నేర్చుకోవాలి?
**5.** 'కాపిటల్' చదవడం గురించి **6.** మార్క్స 'కాపిటల్' లో చాప్టర్లు
**7.** మార్క్స పూర్వపు ఆర్థిక శాస్త్రం **8.** ఊహా చిత్రం
**9.** మీరు మార్క్సిస్టు అయ్యారా?


★




# పిల్లల కోసం ఆర్థిక శాస్త్రం

[ మార్క్స్ 'కాపిటల్' ని ఆధారం
చేసుకుని రాసిన పాఠాలు ]

ఈ పాఠాలు 95.
ప్రతీ పాఠంలోనూ
బొమ్మలూ;
పాఠం చివర,
ప్రశ్నలూ - జవాబులూ.




## చైనాలో ఏం జరుగుతోంది?

ఫ్రెంచి మూలం: బెతల్ హామ్


ఈ పుస్తకంలో,

రష్యా సంగతులు కూడా

కొన్ని తెలుస్తాయి.

# చైనాలో సాంస్కృతిక విప్లవమూ పరిశ్రమల నిర్వహణా

ఫ్రెంచి మూలం:
బెతల్ హామ్




ఇందులో విషయాలు :

1. సాధారణ అల్లిక దుస్తుల ఫ్యాక్టరీ
2. పరిశ్రమల్లో ప్లానింగ్
3. 'శ్రమ విభజన' లో మార్పులు
4. ఉత్పత్తి సంబంధాలను విప్లవకరంగా మార్చడం
5. అనుబంధం
6. మరి కొంత సమాచారం ( అనువాదకులు సేకరించినది )

ప్రతులకు :
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ - 500 002 (ఫోన్ నెం : 0866 - 431181)